# ఆయన ఘనతకొరకు నా సర్వస్వం



“ఆయన ఘనతకొరకు నా సర్వస్వం” మన విధేయతను, మరీ ముఖ్యంగా మన చిత్తాన్ని ఆయనకు లోబర్చడాన్ని వ్యక్తపర్చే సర్వోత్కృష్ట కృతి అని ఆస్వాల్డ్ ఛేంబర్స్ అభిప్రాయం. ఆయన సర్వోత్కృష్ట ప్రేమకు ఆయన సిలువ ప్రత్యక్ష వ్యక్తీకరణ.

ఆధ్యాత్మిక జ్ఞానం మరియు పరిణతి పుష్కలంగా ఉన్న వ్యక్తి ఆస్వాల్డ్ ఛేంబర్స్. బోధకుడిగా ఆస్వాల్డ్ విశ్వఖ్యాతి గడించడంతో బాటు ఆస్వాల్డ్ రచనలు కూడా ప్రపంచ వ్యాప్తంగా కోటానుకోట్ల క్రైస్తవులకు స్ఫూర్తినిచ్చాయి, ఇస్తూనే ఉన్నాయి. ఆస్వాల్డ్ 1917లో దేవుని పిలుపు నందుకున్నప్పటికీ, తన రచనలద్వారా అదే ఔచిత్యంతో అదె స్పష్టతతో తన పాఠకులతో నేటికీ మాట్లాడుతూనే ఉన్నాడు.





# ఆయన ఘనతకొరకు నా సర్వస్వం

ఆస్వాల్డ్ ఛేంబర్స్

అనువాదం: డోరతీ జయరావ్

Translation by: Dorothy Jayarao

My Utmost For His Highest ( Regd.)
Copyright by Oswald Chambers Publications Association Ltd.
Original Edition Copyright 1935 by Dodd, Mead and Company, Inc.
renewed By Oswald Chambers Publications Association Ltd.

Published by Indian Evangelical Mission, Bangalore
by special arrangement with
**Discovery House Publishers,**
3000 Kraft Avenue SE,
Grand Rapids, Michigan 49512 USA.

All rights reserved

Printed in India

Unless otherwise indicated Scripture quotations are from
Holy Bible printed by Bible Society of India

International Standard Book Number:
978-81-909506-4-0

Printed at Matha Prints, Bangalore
Tel. 080 41310081, 09886809060
email: mathaprints@gmail.com

**My Utmost For His Highest**
**Acknowledgements**

Oswald Chambers Publications Association Ltd., London

Discovery House Publishers, Grand Rapids, Michigan

Indian Evangelical Mission, Bangalore

Logos Ministries, Delhi

Dorothy Jayarao (Translator)

John Ten Ten



# సంపాదకుని కలం నుండి

ప్రియమైన స్నేహితులారా,

''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' ఒక సర్వోత్కృష్టమైన గ్రంథం. ఈ గ్రంథరాజాన్ని తెలుగు భాషలో ప్రచురించి మీకందించడం ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్‌కు సంతోషదాయకంగా ఉంది. ఈ గ్రంథం ఇప్పటికే హిందీ, ఖాసీ, మలయాళం, తమిళం మరియు కన్నడ భాషల్లో ప్రచురించ బడింది. త్వరలో తక్కిన భారతీయ భాషల్లో కూడా ప్రచురణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రశస్త నిధిలాంటి ఈ గ్రంథం ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్‌వారి ధర్మప్రచారానికి మరియు వారి లక్ష్యాలకు తగిన జోడీ అనడంలో ఏ అతిశయోక్తి లేదు.

''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' మన దేశంలోని వివిధ భాషల్లో అందించడానికి అనువాదం ప్రచురణ మరియు పంపిణీ రంగాల్లో ఇతోధికమైన సేవల నందిస్తున్నందుకు జాన్ టెన్ టెన్ (సైనా, మరియు యోహాన్ జాన్ కున్నెన్‌కెరిల్)కు మా ఆత్మీయ అభినందనలు. మన దేశంలోని ప్రధాన భాషల్లో ''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' అందుబాటులో ఉండాలనే ప్రేరణతో వీరు ఏ ప్రతిఫలాన్ని ఆశిం చకుండా ఈ కార్యనిర్వహణలో పాల్గొనడం ప్రశంసనీయం!

''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' పంపిణీ ద్వారా వచ్చిన విరాళాలు ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్ విధినిర్వహణలో ఉపయోగించబడతాయి. ''నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవది, నీవు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననునది రెండవ ఆజ్ఞ. వీటికంటె ముఖ్యమైన ఆజ్ఞ మరేదియు లేదని'' పలికిన మన త్రియేక దేవునిగురించి సర్వప్రజలకూ తెలియజేయడంకొరకు  ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్ అంకితభావంతో కృషిచేస్తోంది.

ప్రారంభ సంవత్సరమైన 1965నుండి ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్ ఆయన కృప ద్వారా ఆయన మహిమ ఘనతల కొరకు అన్ని విషయాల్లోనూ నింపాదిగా ముందుకు నడుస్తోంది. మరిన్ని వివరాలకు పాఠకులు www.iemoutreach.org వెబ్‌సైట్‌ను వీక్షించ మనవి. ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్ నిమిత్తం ప్రార్థించమని, పరిచర్యలో పాల్గొనమని మా విన్నపం. ''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' మీకు ఆశీర్వాదం కాగలదని మా నమ్మకం.

ఆయన సేవలో భవదీయుడు

**రెవ. జాన్ వెస్లీ**
జనరల్ సెక్రటరీ, ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్
38, ల్యాంగ్‌ఫోర్డ్ రోడ్, బెంగళూరు – 560 025
www.iemoutreach.org
<http://www.iemoutreach.org> iemhq@vsnl.com

# పీఠిక

ఆస్వాల్డ్ ఛేంబర్స్ మనకందించిన ''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' ఆంగ్ల కృతికి ఈ అనువాదాన్ని మీ ముందుంచడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఫ్రెంచ్, గ్రీక్ మరియు హెబ్రీ వంటి ప్రముఖ భాషల్లోకి అనువదించబడిన ఈ గ్రంథం ఈ సంవత్సరం తెలుగు భాషలోకి మరియు ఖాసీ భాషలోకి అనువదించబడింది. ఈ గ్రంథం ఇప్పటికే హిందీ, కన్నడం, తమిళం మరియు మలయాళం భాషల్లో లభ్యమవుతోంది. మన దేశంలోని మిగిలిన భాషల్లో కూడా ఈ గ్రంథాన్నందించాలని మా అభిలాష.

ప్రతి రోజూ క్రమం తప్పకుండా నిర్ణీత లక్ష్యంతో పరిశుద్ధ గ్రంథాన్ని అధ్యయనం చేయడం మన మౌలిక అవసరత. ఉత్తమ గ్రంథమైన ''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' బైబిల్ అధ్యయనానికి ఆసరాగా నిలుస్తూ పాఠకుల్ని ప్రభువైన యేసు క్రీస్తుతో ప్రగాఢమైన మరియు ఫలభరితమైన అన్యోన్య సంబంధంలోకి నడిపిస్తుందనడంలో సందేహం లేదు.

నైనా మరియు యోహాన్ జాన్ కున్నెల్‌కెరిల్ గార్లకు నా ప్రశంసాభినందనలు. యోహాన్ టెన్ టెన్‌గా ప్రసిద్ధి చెందిన వీరు ప్రేమపూర్వకంగా ఈ కార్యభారాన్ని మోయడానికి ముందుకు వచ్చినందుకు ధన్యవాదాలు. గత రెండు దశాబ్దాలుగా నాకు రాగిణికి వీరు సుపరిచితులు. ఈ అనువాద ప్రతి పాఠకుల్ని ఫలభరితం చేస్తుందనీ, ఈ సుమధుర ఫలాలు చిరకాలం చెక్కుచెదరకుండా ఉంటాయని మా ప్రార్థనాపూర్వకమైన ఆకాంక్ష.

ఆయనలో

**రాజ్‌కుమార్ రామచంద్రన్**

ఎక్జిక్యూటివ్ డైరెక్టర్, లోగోస్ మినిస్ట్రీస్, న్యూ ఢిల్లీ

www.logos-ministries.com

# పరిచయం

ప్రియ పాఠకా,

మన దేశంలోని పలు భాషల్లో ''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' అనువాదంలోను ప్రచురణలోను పంపిణీలోను పాల్గొనడం మాకు లభించిన ఆధిక్యత; మరియు ఆశీర్వాదం కూడా. రాబోయే సంవత్సరాల్లో తక్కిన భారతీయ భాషల్లో కూడా ''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం''ను అందించాలని మా ఆశ. ఈ కార్యనిర్వహణలో మాకు సహకరించిన ''ది ఆస్వాల్డ్ ఛేంబర్స్ పబ్లికేషన్స్ లిమిటెడ్'' ''ది డిస్కవరీ హౌస్ పబ్లిషర్స్'' లకు మా ధన్యవాదాలు. ''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' ప్రచురణకర్త ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్‌కు మా ధన్యవాదాలు. మా ప్రియతమ అనువాదకురాలు శ్రీమతి డోరతీ జయరావ్‌కు మా ధన్యవాదాలు. రెవ. జెఫ్ బెన్నెట్, రెవ. జాన్ వెస్లీ, మరియు సహోద్యోగులకు మా ప్రత్యేక ధన్యవాదాలు.

పన్నెండు సంవత్సరాలు కార్పొరేట్ రంగంలోను, కొద్ది కాలం కోపరేటివ్ డెయిరీ రంగంలోను ఉన్న ఉద్యోగానుభవంతో, ఆ తర్వాత పదహారు సంవత్సరాలు మతపరంగా (బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా) అలహాబాద్, ఉత్తర ప్రదేశ్‌లలో సేవానుభవంతో ఆయన కృప ద్వారా మాకున్న కొద్దిపాటి సామర్థ్యంతో మా స్వంత నినాదం ''యోహాన్ టెన్ టెన్'' పేరు మీద ఈ కార్యభారాన్ని మోయడానికి ముందుకు వచ్చామని ధైర్యం కూడగట్టుకొని చెబుతున్నాం.

తండ్రి కుమార పరిశుద్ధాత్మయైన మన త్రియేక దేవునితో అన్యోన్యత కలిగి ఉన్నవారందరికీ సమృద్ధ జీవం లభిస్తుందని ఆయన వాక్యంనుండి మరియు మా వ్యక్తిగత అనుభవంనుండి మాకు అవగతమైన సత్యం! ఆస్వాల్డ్ ఛేంబర్స్ కృతి అయిన ''ఆయన ఘనతకొరకు నా సర్వస్వం'' మాకు ఆశీర్వాదంగా ఉంది; ఇది మీకు కూడా ఆశీర్వాదంగా ఉంటుందని మా అపార నమ్మకం.

**సైనా, మరియు యోహాన్ జాన్ కున్నెల్‌కెరిల్**

''యోహాన్ టెన్ టెన్''

''హిల్ క్రెస్ట్'', మరియతురుత్తు,

కొట్టాయం – 686 027, కేరళ, ఇండియా

yohankjohn@gmail.com

Other Oswald Chambers books
from Discovery House Publishers:
*Biblical Ethics*

*Biblical Psychology*
*Christian Disciplines*
*Complete Works of Oswald Chambers*
*Conformed to His Image and The Servant As His Lord*
*Faith: A Holy Walk*
*If You Will Ask*
*The Love of God*
*Our Brilliant Heritage*
*Our Ultimate Refuge (formerly Baffled to Fight Better)*
*Prayer: A Holy Occupation*
*So Send I You*
*Studies in the Sermon on the Mount*

*My Utmost for His Highest Daily Devotional Journal:*
A Journal Companion to the Golden Book of Oswald Chambers

*Oswald Chambers-Abandoned to God:*
The Life Story of the Author of My Utmost for His Highest
(by David McCasland)

***For details:*** http://www.dhp.org
yohankjohn@gmail.com

**My Utmost For His Highest is also available in**
- Hindi, Tamil, Kannada, Malayalam (all Paperback)

- in Updated English Version
(leather bound, large print, study edition, and more)

- and in special adaptations (English) for Children, Young Adults

***For further details write to***
generalsecretary@iemoutreach.org
yohankjohn@gmail.com

జనవరి 1

## సూటిగా విషయానికి వద్దాం

"నేను ఏ విషయములోను సిగ్గుపడక యెప్పటివలెనే యిప్పుడును పూర్ణ ధైర్యముతో బోధించుటవలన నా బ్రదుకు మూలముగానైనను సరే, చావు మూలముగానైనను సరే, క్రీస్తు నా శరీరమందు ఘనపరచబడునని నేను మిగుల అపేక్షించుచు నిరీక్షించుచున్న ప్రకారముగా ... " (ఫిలిప్పీ 1:19,20)

**ఆయన ఘనతకొరకు నా సర్వస్వం:** "నేను ఏ విషయములోను సిగ్గుపడక ... " - మన జీవితంలోని ఏ యే రంగాల్లో తనకు లోబడాలని యేసు చెప్పాడో ఆ యా రంగాల్లో మనమాయనకు లోబడకపోయినట్లయితే మనం సిగ్గుపడాలి. పౌలు ఈ ఉద్దేశంతోనే "ఆయన ఘనతకొరకు నా సర్వస్వం" అని, "ఆయన మహిమకొరకు నా శాయశక్తులన్నీ" అని తిరుగులేని నిర్ణయం తీసుకున్నట్టు కన్పిస్తోంది. పౌలు తీసుకున్న ఈ నిర్ణయం మనశ్శక్తికి సంబంధించిన నిర్ణయం; తర్కానికి హేతుబద్ధమైన వివరణకు తావివ్వని నిర్ణయం; ఎటువంటి ఉపసంహారణలకు చోటులేని నిరపేక్ష నిర్ణయం. మనం ఈ నిర్ణయం తీసుకోడానికి మనకు అడ్డుగా ఉన్నవాటి గురించి అనవసరంగా ఆలోచిస్తూ తక్కిన విషయాల గురించి ఆలోచిస్తున్నామనే సాకు చూపిస్తున్నాం. మనం యేసు పిలుపుపట్ల విధేయత చూపడంలో తక్కిన విషయాలకు ఏ మూల్యం చెల్లించవలసివస్తుందో తీవ్రంగా ఆలోచిస్తూ మన విధేయత ఎటువంటిదో దేవునికి తెలియదని ఆయనతోనే చెబ్తాం. సూటిగా విషయానికి వద్దాం. ఆయనకు తెలియదు. అన్ని ఆలోచనల్ని ప్రక్కనబెట్టి ఒకే ఒక విషయంగురించి దేవుని యెదుట నిన్ను నీవు పరీక్షించుకో. ఆ ఒకే ఒక విషయం: "ఆయన ఘనతకొరకు నా సర్వస్వం." నేనైతే ఆయనకొరకే, సంపూర్ణంగా ఆయనకొరకే అంకితం కావాలని నిర్ణయించుకున్నాను.

**ఆయన పరిశుద్ధతకొరకు అడ్డుల్ని అధిగమించిన నా నిర్ణయం:** "బ్రతుకైనా చావైనా ఒకటే!" (ఫిలిప్పీ 1:21 చూడండి). దేవుడు కోరుకున్న విధంగా చేయడానికి తననేదీ అడ్డు కోలేదని పౌలు దృఢంగా నిర్ణయించుకున్నాడు. అయితే దేవుడు మనల్ని మృదువుగా స్పృశిస్తున్నప్పుడు మనలో స్పందన ఉండదు కాబట్టి మనం దేవుని చిత్తాన్ననుసరించాలని నిర్ణయించుకోడానికి ముందు మనలో ఒక సంఘర్షణ చోటుచేసుకోవాలి. దేవుడు తనకొరకు మన సర్వస్వాన్నివ్వమని మనల్ని నిలదీస్తున్నప్పుడు మనలో మధనం మొదలౌతుంది. ఆయన కావాలనే మనకు క్లిష్టపరిస్థితిని రప్పిస్తాడు. ఈ క్లిష్టపరిస్థితిలోనే ఆయనకు అనుకూలంగానో ప్రతికూలంగానో మనం నిర్ణయం తీసుకోవాలి. మనం నిర్ణయం తీసుకొనే ఆ క్షణమే మన జీవితాన్ని మలుపు త్రిప్పే కీలకసమయం.

నీ జీవితంలోని ఏ కోణంనుంచైనా నీకు సంఘర్షణ ఎదురైనప్పుడు ఎటువంటి ఉపసంహారణలకు తావివ్వకుండా నీ మనస్సును సంపూర్ణంగా యేసుకు లోబర్చు.



జనవరి 2

## ఎక్కడి వెళ్లాలో తెలుసుకోకుండా మీరు బయలుదేరతారా?

"ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలువెళ్లెను" (హెబ్రీ 11:8)

ఇలా నీవు ఎక్కడికైనా వెళ్లావా? వెళ్లినట్లయితే ఎవరైనా నిన్ను నీవేం చేస్తున్నావని ప్రశ్నించినప్పుడు నీ దగ్గర హేతుబద్ధమైన జవాబు ఉండదేమో! క్రైస్తవ పరిచర్యలో "నీవేం చేయాలనుకుంటున్నావు?" అనే ప్రశ్నకు జవాబు చెప్పడం చాలా కష్టం. నీవేం చేయాలనుకుంటున్నావో నిజంగానే నీకు తెలియదు. నీకు తెలిసిన ఒకే ఒక సంగతి దేవుడు ఏం చేయాలనుకుంటున్నాడో ఆయనకు తెలుసనే సంగతి మాత్రమే. దేవునిపట్ల నీ మనోవైఖరిని నిరంతరం పరీక్షించుకో. దేవునిమీద సంపూర్ణ విశ్వాసంతో నీ జీవితానికి సంబంధించిన ప్రతి రంగంలోను "బయలుదేరి" వెళ్లడానికి నీవు సిద్ధమేనా? ఈ వైఖరే నిన్ను సదా ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. ఎందుకంటే దేవుడు నీ జీవితంలో ఏం చేయబోతున్నాడో నీకు తెలియదు గనక. ప్రతి రోజూ ఉదయాన్నే నీవు నిద్ర మేల్కొన్నప్పుడు నీవు బయలుదేరి వెళ్లడానికి ఒక క్రొత్త అవకాశం నీకు స్వాగతం పలుకుతుంది. దేవునిమీద సంపూర్ణ విశ్వాసంతో బయలుదేరి వెళ్లు. నీ జీవితం గురించి, చివరికి నీ దేహం గురించి కూడా ఆలోచించకు (లూకా 12:22). నీవు "బయలుదేరి" వెళ్లడానికి ముందు ఏ సంగతులు నీకు విచారం కలిగించాయో వాటి గురించి విచారపడకు.

దేవుడు ఏం చేయబోతున్నాడో ఆయణ్ణి అడుగుతున్నావా? ఆయన నీకు చెప్పడు. ఆయన ఏం చేయబోతున్నాడో నీకు చెప్పడు గానీ ఆయనెవరో ఆయనెటువంటివాడో నీకు వెల్లడి చేస్తాడు. అద్భుతకార్యాలు చేసే దేవుణ్ణి నీవు నమ్ముతున్నావా? నమ్మి, ఆయన కార్యాల గురించి లేశమైనా విస్మయం చెందకుండా సంపూర్ణ సమర్పణతో "బయలుదేరు"తున్నావా?

నీవు దేవునిచెంతకు వచ్చినప్పుడు ఆయనెటువంటివాడో నీవు కచ్చితంగా తెలుసుకోగలవని నమ్ము. ఇప్పుడు ఆలోచించు; దిగులుపడడం అనవసరం కదా! నీవు విచారపడడం అవమానకరం కదా! దేవునిమీద ఆధారపడుతూ "బయలుదేరి" వెళ్లడానికి నీవు సదా సంసిద్ధత చూపాలి. ఇది నీ జీవితవైఖరి కావాలి. అప్పుడు నీ జీవితం పవిత్రతను, వర్ణించ శక్యంకాని ఆధ్యాత్మిక సౌందర్యాన్ని సంతరించుకొని యేసుకు సంతోషాన్ని సంతృప్తిని ఇస్తుంది. నీ అభిప్రాయాల్ని స్వంత నమ్మకాల్ని అనుభవాల్ని అధిగమిస్తూ "బయలుదేరి వెళ్లడం" అలవర్చుకో. నీవు అడ్డుల్ని అధిగమించి "బయలుదేరి" వెళ్లినప్పుడు నీకు దేవునికి మధ్య ఏ అడ్డులూ ఆటంకాలూ లేని పరిపూర్ణ విశ్వాసం నీదవుతుంది.

జనవరి 3

## మేఘాలు మరియు అంధకారం

“మేఘాంధకారములు ఆయన చుట్టునుండును.” (కీర్తనలు 97:2)

దేవుని ఆత్మద్వారా తిరిగిపుట్టని వ్యక్తికి యేసు ఒక సామాన్యబోధకుడిలాగా కనిపిస్తాడు; ఆయన బోధలు సాదాసీదాగా కనిపిస్తాయి; యేసు బోధల్లోని పారమార్థిక సత్యాలు ఆ వ్యక్తికి గ్రాహ్యంకావు. అయితే ఆ వ్యక్తి పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందినప్పుడు ఒక మహాద్భుత దృశ్యం అతని మనోనేత్రాల యెదుట ఆవిష్కృతమౌతుంది. ఆ దృశ్యం: “మేఘాంధకారములు ఆయన చుట్టునుండును.” మనం యేసు క్రీస్తు బోధలకు చేరువైనప్పుడు మనమీ సత్యాన్ని గుర్తించగలం. అయితే దేవునిఆత్మ వెలుగు మనలో ప్రకాశిస్తున్నప్పుడు మాత్రమే మనం యేసు బోధల్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోడం సాధ్యమౌతుంది. మనం కపటభక్తిని విడిచిపెట్టి మతాచారాల ముసుగు తొలగించుకొని మనఃపూర్వకంగా దేవుణ్ణి సమీపించేంతవరకు మనం నిజంగా ఆయన సన్నిధిలో ఉన్నామా అనేది ప్రశ్నార్థకమే! యేసు క్రీస్తు అంటే ఎవరో తెలియనివారు దేవునిపట్ల చులకనభావనంతో అమర్యాదకరంగా ప్రవర్తిస్తుంటారు. అయితే యేసు క్రీస్తు మనకొరకు చేసిన మహాద్భుతకార్యమేమిటో, ఆ కార్యం ద్వారా మనకు సిద్ధించిన విమోచన ఎటువంటిదో, ఆ విమోచన ద్వారా మనం పొందిన హర్షాతిశయమెటువంటిదో తెలుసుకున్నప్పుడు మన హృదయాల్లో ఒక అద్భుత సత్యం ఆవిష్కృతమౌతుంది. ఆ సత్యం: యేసు మహోన్నతుడు; ఆయన గాంభీర్యత మానవజ్ఞానానికి అందనిది. దుర్భేద్యమైన మేఘం ఆయణ్ణి ఆవరించి వుంది.

“నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునైయున్నవి ... ” (యోహాను 6:63) అని యేసు చెప్పాడు. పరిశుద్ధ గ్రంథంలో ఆయన మాట్లాడిన మాటలు ఒకప్పుడు మనకు అర్థంకానివే; ఒకప్పుడు అవి మనం చొరబడలేని దట్టమైన మేఘమే. అయితే ఆయన మనతో మళ్లీ మాట్లాడినప్పుడు ఆ మాటల్లో మనకు ఆత్మ మరియు జీవం కనిపిస్తాయి. దేవుడు మనతో మాట్లాడే విధానమిదే. దర్శనాలద్వారా కలలద్వారా కాదు గానీ ఆయన మాటల ద్వారానే మనతో మాట్లాడతాడు. మనం మాటలద్వారానే దేవుణ్ణి సమీపించగలం; కేవలం మాటల ద్వారానే.

జనవరి 4

## నేనిప్పుడు నీ వెంట రాలేనా?

"అందుకు పేతురు -ప్రభువా, నేనెందుకు ఇప్పుడు నీ వెంట రాలేను?" (యోహాను13:37)

నీవేం చేయాలని కోరుకుంటున్నావో దాన్ని నీవు చేయలేని సందర్భాలుంటాయి. ఇలా యెందుకు జరుగుతుందో ఎంత ఆలోచించినా నీకు అర్థం కాదు. దేవునినుండి నీకు ప్రతిస్పందన రానప్పుడు, వేచిచూడడం దేవుని ఉద్దేశమైనప్పుడు నీవు వేచిచూడు. అంతేగానీ నీ పనుల్లో నిమగ్నం కావద్దు. నీవు వేచిచూస్తున్న సమయంలో నీకు క్రొత్త అనుభవాలెదురౌతాయి. పాపంనుండి వేరుకావడమంటే ఏమిటో, పరిశుద్ధపర్చబడడమంటే ఏమిటో నీకు అర్థమౌతుంది. దేవునికొరకు పరిశుద్ధపర్చబడి ప్రత్యేకించబడడమంటే ఏమిటో నీకు తెలుస్తుంది. లేదా సేవ అంటే ఏమిటో నీకు అర్థమౌతుంది. దేవుడు నిన్ను నడిపించడానికి ముందే నీవు పరుగులు తీయకు. నీలో లేశమాత్రమైనా సందేహం వున్నప్పుడు ఒక విషయం గ్రహించు; ఆయన నిన్ను నడిపించడంలేదు. సందేహం కలిగినప్పుడు నీవు చేయవలసినది ఒక్కటే: వేచి చూడడం.

మొదట్లో నీకు దేవుని చిత్తమేదో నీవు స్పష్టంగా గ్రాహ్యం కావచ్చు. ఉదాహరణకు, గతస్నేహితులకు దూరంగా ఉండడం, ఇదివరకటి వ్యాపార సంబంధాల్ని రద్దు చేసుకోడం, ఇంకా మరేదైనా చేయడం దేవుని చిత్తమని నీకనిపించవచ్చు. అయితే అన్ని వేళల్లోనూ ఈ అనుభూతిని ప్రేరణగా తీసుకొని త్వరపడకు. నీవు త్వరపడినట్లయితే ఇబ్బందుల్లో పడతావేమో! ఈ ఇబ్బందులు నిన్ను చాలా కాలం వెంటాడవచ్చు. కాబట్టి దేవుని సమయం కొరకు వేచిచూడు. ఆయన తన సమయాన్ని నీకు వెల్లడి చేస్తాడు. అప్పుడు నీకు ఎటువంటి నిరాశ నిరుత్సాహం ఎదురవ్వవు. దేవుని చిత్తప్రకారమైన ఏర్పాటుకొరకు నీవు చూస్తున్నట్లయితే, దేవుడు నిన్ను నడిపించేవరకు వేచిచూడు.

పేతురు దేవుని సమయంకొరకు వేచిచూడలేదు. పేతురు తనకొక పరీక్ష రాబోతోందని ముందుగానే ఊహించాడు. పరీక్ష రానే వచ్చింది; అయితే పేతురు ఊహించని సమయంలో అతనికి పరీక్ష యెదురయ్యింది. పేతురు "నీకొరకు నా ప్రాణము పెట్టుదునని" యేసుతో చెప్పాడు. పేతురు హృదయపూర్వకంగానే చెప్పినప్పటికీ జ్ఞానశూన్యతతో చెప్పాడు. అయితే యేసు పేతురుతో " ... ఆయనను ఎరుగనని నీవు ముమ్మారు చెప్పకముందు కోడికూయదని" (యోహాను 13:38) జవాబిచ్చాడు. కారణం, పేతురుకు తనగురించి తెలియదుగానీ యేసుకు పేతురుగురించి లోతుగా తెలుసు. పేతురుకు తన బలాబలాలగురించి మొదట్లో తెలియలేదు. మనలో స్వాభావికంగా ఉండే భయభక్తులతో మనం యేసువైపు చూడగలమేమోగానీ, ఆయన ప్రభావమహిమల్ని వీక్షించగలమేమోగానీ మన స్వాభావిక భయభక్తులు మనల్ని ఆయనకు శిష్యుల్ని చేయలేవు. మన స్వాభావికభక్తి యేసును ఉపేక్షిస్తుంది; ఆయణ్ణి నిజంగా వెంబడించడానికి కేవలం ఇది మాత్రమే సరిపోదు.



జనవరి 5

## యేసును వెంబడించడానికి శక్తితో కూడిన జీవితం

"యేసు -నేను వెళ్లుచున్న చోటికి నీవిప్పుడు రాలేవు గాని, తరువాత వచ్చెదవని అతనితో చెప్పెను." (యోహాను 13:36)

"ఇట్లు చెప్పి -నన్ను వెంబడించుమని అతనితో అనెను" (యోహాను 21:19). మూడు సంవత్సరాలముందు యేసు పేతురుతో "నా వెంబడి రండి ... " (మత్తయి 4:19-20) అని చెప్పాడు. పేతురు సంశయించకుండా యేసువెంట వెళ్లాడు. యేసుప్రభావంపట్ల పేతురు ఆకర్షితుడయ్యాడు; పరిశుద్ధాత్మ సహాయం అవసరం లేకుండానే పేతురు ప్రభువు వెంట వెళ్లాడు. తర్వాత, పేతురు యేసు ఎవరో తనకు తెలియదని చెప్పాడు. చెప్పిన తర్వాత పేతురు హృదయం భగ్నమయ్యింది. అప్పుడు పేతురుకు దేవునిఆత్మ అవసరమయ్యింది. యేసు పేతురుతో "నన్ను వెంబడించుమని" చెప్పాడు. (యోహాను 21:19) అప్పుడు పేతురు యెదుట ప్రభువైన యేసు క్రీస్తు తప్ప ఎవరూ లేరు. యేసు మొదటిసారి పేతురుతో "నా వెంబడి రండి ... " (మత్తయి 4:19-20) అని చెప్పినప్పుడు అక్షరాలా అది ఆయన వెంట వెళ్లడం. అయితే యేసు ఇప్పుడు పేతురు అంతరంగంలో త్యాగాన్ని మరియు సమ్మతితో కూడిన సమర్పణను కోరుకుంటున్నాడు. (యోహాను 21:18 చూడండి).

ఈ రెండు పిలుపుల మధ్య కాలంలో పేతురు యేసును తృణీకరించాడు. ఊరకే తృణీకరించడం కాదు, ఒట్టుపెట్టుకొని తనను తాను శపించుకొని మరీ తృణీకరించాడు (మత్తయి 26:69-75 వచనాలు చూడండి). అయితే తర్వాత పేతురులో స్వావలంబన మరియు స్వచిత్తం చరమదశకు చేరుకున్నాయి. పేతురు తనను తాను సమర్థించుకోడానికి ఇక అతనికేమీ మిగల్లేదు. నిరాధారమైన పరిస్థితుల్లో పేతురు పునరుత్థానుడైన యేసు తనకేం చెబ్తే అది చేయడానికి సిద్ధమయ్యాడు. యేసు " ...వారిమీద ఊది -పరిశుద్ధాత్మను పొందుడి" (యోహాను 20:22) అని చెప్పాడు. నీలో ఏ మార్పులు వచ్చినప్పటికీ వాటిమీద ఆధారపడకు. ప్రభువైన యేసు క్రీస్తు మీద మరియు ఆయన అనుగ్రహించే పరిశుద్ధాత్మమీద మాత్రమే ఆధారపడు.

మనం చేసే వాగ్దానాల్నీ మన ప్రతిపాదనల్నీ మన కార్యశూరత్వాన్నీ చివరకు మనమే వదిలిపెడ్తాం. కారణం, వీటిని నెరవేర్చే శక్తి మనకు లేదు. మన మనస్సు మన శరీరం నిరాధారమైనవని మనం గుర్తించిన పిమ్మట, మనం పరిశుద్ధాత్మను పొందగలం. "పరిశుద్ధాత్మను పొందుడి" (యోహాను 20:22 మనం పరిశుద్ధాత్మకు స్వాధీనమవ్వాలి. ఇదే శిష్యుడి ముఖ్య అవసరం. ఇప్పుడిక నీ జీవితాన్ని నడిపించేది నీవు కాదు; ప్రభువైన యేసు క్రీస్తు మాత్రమే.

జనవరి 6

**ఆరాధన**

"అక్కడనుండి అతడు బయలుదేరి బేతేలుకు తూర్పుననున్న కొండకు చేరి పడమటనున్న బేతేలునకును తూర్పుననున్న హాయికిని మధ్యను గుడారము వేసి అక్కడ యెహోవాకు బలిపీఠమును కట్టి యెహోవా నామమున ప్రార్థన చేసెను." (ఆదికాండము 12:8)

దేవుడు నీకిచ్చినవాటిలోంచి శ్రేష్ఠమైనవాటిని ఆయనకు అర్పించడమే ఆరాధన. నీకున్న శ్రేష్ఠమైనవాటితో నీవేం చేస్తున్నావో జాగ్రత్తగా గమనించు. నీవు దేవునినుండి ఆశీర్వాదాన్ని పొందిన ప్రతి సారీ, దాన్ని తిరిగి ప్రేమకానుకగా ఆయనకు అర్పించు. దేవుని సన్నిధిలో ధ్యానించు. దేవుడు నీకిచ్చిన ఆశీర్వాదాన్ని తిరిగి ఆయనకు అర్పించు. ఇదే నీ ఆరాధన. ఇశ్రాయేలీయులు సమకూర్చుకొని మిగుల్చుకున్న మన్నా కంపుగొట్టినట్టుగా దేవుడు నీకిచ్చిన ఆధ్యాత్మిక ఆశీర్వాదాన్ని నీ దగ్గర మిగుల్చుకున్నట్లయితే అది కంపుగొడుతుంది (నిర్గమ 16:20 చూడండి). దేవుడు నీకిచ్చిన ఆధ్యాత్మిక ఆశీర్వాదం కేవలం నీకు మాత్రమే స్వంతం కాదు. నీవు తిరిగి ఆ ఆశీర్వాదాన్ని దేవునికి అర్పించినట్లయితే అది అనేకులకు ఆశీర్వాదమౌతుంది.

బేతేలు దేవునితో సహవాసానికి సాదృశ్యం. హాయి లోకానికి సాదృశ్యం. అబ్రాహాము ఈ రెండింటి మధ్యలో తన "గుడారము" వేశాడు. మన ఆంతరంగిక జీవితంలో మనకు దేవునితో ఉన్న సహవాసం మరియు ఆయనతో వున్న అన్యోన్యతలే మనం దేవునికి చేసే బహిరంగ పరిచర్యకు చిరకాలమన్నన తెస్తాయి. దేవుణ్ణి ఆరాధించడానికి నీకు చాలినంత సమయముంది. క్రమశిక్షణలేని ఆరాధన సరైనది కాదు. ఏవో కొన్ని రోజులు దేవుణ్ణి ఏకాంతంగా ఆరాధించడంకొరకు కేటాయించడం నిన్ను కపటభక్తికి నడిపిస్తుంది. ఇది నీవు ప్రతి రోజూ దేవుణ్ణి ఏకాంతంగా ఆరాధించవలసిన అవసరతను ప్రక్కదారి పట్టిస్తుంది. మన చుట్టూ మనల్ని కల్లోలపర్చే రణగొణధ్వనులు ఎన్నో వున్నప్పటికీ మనం ప్రతి రోజూ కొంత సమయం దేవునితో గడపాలి. ఆధ్యాత్మిక జీవితంలో ఆరాధన, వేచిచూడడం, మరియు పరిచర్య అనే మూడు మెట్లున్నాయని కొందరు చెబ్తారు. అయితే మనలో కొంతమంది ఆరాధననుండి వేచిచూడడానికి, వేచిచూడడంనుండి పరిచర్యకు కప్పల్లాగా గెంతుతుంటారు. దేవుని ఉద్దేశం ఇది కాదు. ఆరాధన, వేచిచూడడం, పరిచర్య - ఈ మూడూ ఏకకాలంలో ఉండాలి. మన ప్రభువైన యేసు జీవితంలో ఈ మూడూ ఏకకాలంలో ఉన్నాయి. ఆయన జీవితంలో ఈ మూడింటి మధ్య పరిపూర్ణమైన సామరస్యం ఉంది. ఈ నియమాన్ని మనం కూడా అలవర్చుకోవాలి. అయితే ఇది ఒక రోజులో హఠాత్తుగా సంభవించేది కాదు.

జనవరి 7

## యేసుతో సాన్నిహిత్యం

"యేసు -ఫిలిప్పూ, నేనింత కాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? ... " (యోహాను 14:9)

ఇవి మందలింపు మాటలు కావు; ఈ మాటల్లో ఆశ్చర్యం కూడా లేదు. యేసు ఫిలిప్పును తనకు దగ్గరగా రమ్మని ఉత్తేజపరుస్తున్నాడు. అయితే వాస్తవానికి మనం సాన్నిహిత్యం పంచుకొనే చివరి వ్యక్తి యేసు! పెంతెకొస్తుకు ముందు కూడా శిష్యులకు యేసు గురించి తెలుసు; ఆయన తమకు దయ్యాల్ని వెళ్లగొట్టే శక్తినిచ్చాడని శిష్యులకు తెలుసు (లూకా 10:18 - 20 చూడండి). శిష్యులకు యేసుతో సాన్నిహిత్యం వుంది; అయితే ఆ సాన్నిహిత్యం ఇంకా అధికం కావాలి. "ఇక మిమ్మును ... స్నేహితులని పిలుచుచున్నాను" (యోహాను 15:15) అని యేసు తన శిష్యులతో చెప్పాడు. నిజమైన స్నేహం భూమ్మీద చాలా అరుదుగా కనిపిస్తుంది. మనస్సులు కలిసిన స్నేహమే నిజమైన స్నేహం; హృదయాలు ఏకమైన స్నేహమే నిజమైన స్నేహం; ఆత్మలు మిళితమైన స్నేహమే నిజమైన స్నేహం. యేసు క్రీస్తుతో సన్నిహితమైన సంబంధం కలిగి ఉండడం కొరకే మన జీవితం ఉద్దేశించబడింది. ఆయనతో స్నేహం మన జీవితానుభవం కావాలి. మనం ఆయననుండి ఆశీర్వాదాలు పొందుతున్నాం; ఆయన వాక్యాన్ని స్వీకరిస్తున్నాం. అయితే ఆయన మనకు నిజంగా తెలుసా?

"నేను వెళ్లిపోవుటవలన మీకు ప్రయోజనకరము ... " (యోహాను 16:7) అని యేసు శిష్యులతో చెప్పాడు. యేసు వెళ్లిపోవడం మూలంగా వారికి ఆయనతో ఉన్న సాన్నిహిత్యం ఇంకా బలపడుతుంది. మనందరం యేసుతో సాన్నిహిత్యం కలిగి ఉండాలని ఆయన కోరు కుంటున్నాడు. ఇది ఆయనకు సంతోషాన్నిస్తుంది. మనం యేసు క్రీస్తుతో సాన్నిహిత్యం కలిగి ఉన్నప్పుడు ఫలవంతమైన జీవితాన్ని కలిగి ఉంటామని పరిశుద్ధ లేఖనాల్లో చూస్తాం. వాస్తవానికి, సాన్నిహిత్యానికి దృశ్యమాన ఫలితమే ఫలించడం (యోహాను 15:1-4 చూడండి).

మనకు యేసుతో సాన్నిహిత్యం వున్నప్పుడు మనం ఒంటరివారం కాదు. ఆయన జ్ఞానం మనకు కొదువ కాదు, ఆయన కనికరం మనకు తక్కువ కాదు. అప్పుడు మనం నిరంత రాయంగా మన హృదయాల్ని ఆయన యెదుట కుమ్మరించగలం. అప్పుడు మనలో భావావేశాలకు తావుండదు; మనమీద మనమే జాలిపడే సందర్భాలుండవు. యేసుతో నిజమైన సాన్నిహిత్యం వున్న క్రైస్తవుడు ఎప్పుడూ తన పట్ల శ్రద్ధ చూపించుకోడు. యేసుకు నిజమైన స్నేహితుడుగా ఉన్న క్రైస్తవుని జీవితవాంఛ తన జీవితాన్ని యేసుకు స్వాధీనపర్చడమే. మన జీవితంలోని అన్ని రంగాలను మనం యేసుకు అప్పగించినప్పుడు ఈ ఫలితం సిద్ధిస్తుంది. యేసుతో సాన్నిహిత్యం వున్నవారికి ఆధ్యాత్మిక దృఢత్వాన్ని అంతరంగ ప్రశాంతతను ఆయన అనుగ్రహిస్తాడు. ఈ రెండూ సాన్నిహిత్యం వలన ఒనగూడే సుమధుర ఫలాలు.



జనవరి 8

## నా యాగం సజీవమైనదేనా?

“అబ్రాహాము అక్కడ బలిపీఠమును కట్టి ... తన కుమారుడగు ఇస్సాకును బంధించి ఆ పీఠముపైనున్న కట్టెలమీద ఉంచెను.” (ఆదికాండము 22:9)

ఈ సంఘటనను కొంతమంది అపార్థం చేసుకుంటారు. దేవుడు బలియాగాన్ని కోరు కుంటాడా అని వీరి అపోహ. దేవుడు కోరుకున్న బలియాగం మరణంకాదు గానీ మనల్ని మనం సజీవయాగంగా సమర్పించుకోడమే. మనల్ని మనం సజీవయాగంగా అర్పించుకున్నప్పుడు యేసు మనలో ఏం కోరుకున్నాడో మనం దాన్ని చేయగలం. “ప్రభువా, నీతోకూడ ... మరణమునకును వెళ్లుటకు సిద్ధముగా ఉన్నానని” (లూకా 22:23) పేతురు యేసుతో చెప్పాడు. అంటే, “నా జీవితాన్ని దేవునికొరకు అర్పించడానికి యేసు మరణంతో సహానుభవం కలిగి ఉండడానికి సిద్ధపడుతున్నాను” అని అర్థం.

దేవుడు మనల్ని అన్నీ త్యాగం చేయమంటున్నాడని మనం ఆలోచిస్తుంటాం! దేవుడు అబ్రాహాము మనస్సులోనుండి ఈ అపోహను తొలగించాడు. దేవుడు మన జీవితాల్లో కూడా ఈ అపోహను తొలగిస్తున్నాడు. దేవుడు మనలో త్యాగాన్ని కోరుకొనేది అన్నిటికంటె అమూల్యమైన నిత్యజీవంకొరకే. దేవుడు అనుగ్రహించే ప్రశస్తమైన నిత్యజీవంకొరకు మనం లోకంలో విలువలేనివాటినన్నిటినీ త్యాగం చేయాలి. యేసులో జీవంతో పోల్చినప్పుడు లోకంలో ఏదీ ఎన్నదగినది కాదు. మన బలిదానం మనల్ని కట్టిపడేసిన సంకెళ్లను తెగగొట్టడం వంటిది; మనల్ని బంధించి ఉంచిన త్రాళ్లను తెంపడంవంటిది. మనం యేసు మరణంతో సహానుభవం గలవారమైనప్పుడు మనల్ని బంధించిన సంకెళ్లు మరియు త్రాళ్లు వాటికవే విడిపోతాయి. అప్పుడు మనం మనల్ని సజీవయాగంగా దేవునికి సమర్పించుకొని ఆయనతో అన్యోన్యసహవాసం కలిగి ఉంటాం.

దేవునికి నీ ప్రాణం అక్కర్లేదు. ఆయనకు నీవు “పరిశుద్ధమును ... అనుకూలమునైన సజీవయాగముగా” (రోమా 12:1) కావాలి. నీకు పరిశుద్ధత అనుగ్రహించేవాడు యేసు మాత్రమే. దేవుడు నీనుండి కోరుకొనే బలియాగం నీలోని పవిత్రతే.

జనవరి 9

## ప్రార్థనాపూర్వకమైన అంతరంగ శోధన

"మీ ఆత్మయు, జీవమును శరీరమును ... నిందారహితముగాను, సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక." (1 థెస్స 5:23)

"మీ ఆత్మయు ... సంపూర్ణముగాను" - పరిశుద్ధాత్మ మన అంతరంగంలోని అగాధస్థలాల్లో మహత్వపూర్ణమైన మరియు సంపూర్ణమైన కార్యాన్ని జరిగిస్తాడు. మన అంతరంగం మనకే దుర్గ్రాహ్యం. కీర్తన 139 చదవండి. కీర్తనరచయిత భావాన్ని సరళమైన మాటల్లో చూద్దామా!

యెహోవా, నీవే దేవుడవు!
ప్రభాతంలో నిశీథంలో
నీవున్నావు!
పర్వత శిఖరాల్లో
సాగర తరంగాల్లో
నీవున్నావు!
నిను తప్పించుక నేను
గగనాని కెగరలేను.
జలధి అగాధాల్లోకి
ఈదలేను!
అందవు నీ తలపులు
నా మస్తిష్కానికి.
నేను వీక్షించలేని
స్వప్నాలెన్నెన్నో!
నాలోని లోతుల్ని
నే గాంచలేను.
నా దేవా! నీవే నన్ను
పరిశోధించు.

మన ఊహకందని విధంగా దేవుడు మన ఆలోచలచుట్టూ మనచుట్టూ రక్షణ కవచాన్నేర్పరచి కాపాడతాడని నమ్ముతున్నావా? "ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7) అని బైబిలు సెలవిస్తోంది. మితిమీరిన పాపాలతో మొద్దుబారిన వ్యక్తి ఏది పాపమో తనకు తెలియదంటాడు. కేవలం తెలిసి చేసిన పాపాలకేనా శుద్ధీకరణ? కాదు! "మనమును వెలుగులో నడిచినయెడల" (యోహాను 1:7) మన హృదయాంతరాళాల్లో ఉన్న ప్రతి పాపం శుద్ధీకరించబడుతుంది. యేసు క్రీస్తును ఆదరించి బలాన్నిచ్చిన ఆత్మ నేడు మన అంతఃకరణాన్నికూడా ఆదరించి బలాన్నిస్తాడు. పరిశుద్ధాత్మ మనకనుగ్రహించిన మహాద్భుతమైన శుద్ధీకరణ మన శరీరాత్మలను యేసు రాకడవరకు నిర్మలమైన నీతి న్యాయాల్లో పరిరక్షించుగాక! మనమిక దేవుని దృష్టిలో నిందాస్పదులం కాదు.

దేవుని మహోన్నత సత్యాల్ని ధ్యానించడానికి మన మనస్సుల్ని సమాయత్తం చేద్దాం!

జనవరి 10

## తెరవబడిన కళ్లు

"పాపక్షమాపణను ... పొందునట్లు వారి కన్నులు తెరచుటకై నేను నిన్ను వారి యొద్దకు పంపెదనని చెప్పెను." (అ.కా. 26:16-18)

"పాపక్షమాపణను ... పొందునట్లు" - దేవుని కృపాబాహుళ్యతవలన జరిగిన మొట్టమొదటి కార్యమిదే. ఎవరైనా తన వ్యక్తిగత క్రైస్తవ జీవితంలో విఫలుడైనట్లయితే అందుకు కారణం అతనేమీ "పొందక" పోవడమే. ఒక వ్యక్తి రక్షించబడ్డాడనడానికి రుజువు అతను యేసు క్రీస్తునుండి ఏమైనా పొందడమే. దేవుని పరిచారకులమైన మనం ఆయనకొరకు చేయవలసిన పని మనచుట్టూ ఉన్నవారి మనోనేత్రాల్ని వెలిగించడమే. మనమితరుల కళ్లను తెరిచినప్పుడు వారు చీకటినుండి వెలుగులోనికి వస్తారు. అయితే ఇది మాత్రమే రక్షణ కాదు. ఇది కేవలం అంతఃకరణంలో మార్పు మాత్రమే; ఒక మనిషిలో ఆధ్యాత్మిక చైతన్యానికి ఆరంభం మాత్రమే. క్రైస్తవుల్లో అనేకులు ఇలాగే ఉన్నారనడం నా ఉద్దేశం కాదుగానీ ఒక విషయాన్ని ఒప్పుకోక తప్పదు. వారి మనోనేత్రాలు తెరచుకున్నాయి; అయితే వారేమీ "పొంద"లేదు. అంతఃకరణంలో మార్పు వచ్చినంత మాత్రాన అది పునరుజ్జీవనం కాదు. మన బోధల్లో నేడు ఈ వాస్తవాన్ని మనం నిర్లక్ష్యం చేస్తున్నాం. ఒక వ్యక్తి తిరిగిపుట్టినప్పుడు అది తన స్వంత ఆలోచనల ప్రకారం తన స్వంత నిర్ణయం ప్రకారం జరిగినదికాదని ఆ వ్యక్తికి తెలుసు. సర్వశక్తిమంతుడైన దేవునినుండి తాను దాన్ని "పొందానని" ఆ వ్యక్తికి తెలుసు. మనుషులు తమకు తాము ఎన్నో ప్రమాణాలు ఎన్నో వాగ్దానాలు చేసుకోవచ్చు; వాటిని నెరవేర్చాలని నిర్ణయించుకోవచ్చు. అయితే రక్షణ అంటే ఇంత మాత్రమే కాదు. రక్షణ అంటే యేసు క్రీస్తుద్వారా దేవునినుండి "పొంద"గలిగిన స్థితి; అంటే మన పాపాలకు క్షమాపణ పొందడమని పరిశుద్ధపర్చబడడమని అర్థం.

మన జీవితంలో తర్వాత జరిగే రెండవ కార్యం "పరిశుద్ధపరచబడినవారిలో స్వాస్థ్యమును" పొందడం. ఒక వ్యక్తి తనకొరకు కాక యేసు క్రీస్తుకొరకు జీవించడం దేవుని పరిచర్యలో తనను తాను అంకితం చేసుకోడం పవిత్రీకరణలో భాగం. రక్షణ అనే స్వాస్థ్యాన్ని పొందిన వ్యక్తి "పొందే" మరో స్వాస్థ్యం పరిచర్య.

జనవరి 11

## నా దైవభక్తి ఇతరులచేత కూడా మూల్యం చెల్లిస్తుందా?

"వారాయనను తీసికొనిపోవుచుండగా ... సీమోనను ఒకని పట్టుకొని, యేసువెంట సిలువను మోయుటకు అతనిమీద దానిని పెట్టిరి." (లూకా 23:26)

మనం దేవునికి విధేయత చూపుతున్నట్లయితే ఒక విషయాన్ని తీవ్రంగా పరిశీలించవలసి ఉన్నాం. విధేయతలో భాగంగా మనం ప్రభువును ప్రేమించడం మనకు ఆనందదాయకమే. ప్రభువును ప్రేమించినందుకు మనం పోగొట్టుకొనేదేదీ లేదు. అయితే దేవుణ్ణి ప్రేమించనివారుకూడా మన విధేయతవలన మూల్యం చెల్లిస్తారు. మనం దేవునికి విధేయత చూపడమంటే వారి ఆలోచనలు ప్రణాళికలు అన్నీ భగ్నమయ్యాయని అర్థం కదా! మన విధేయతనుబట్టి వాళ్లల్లో కలిగే నిరాశే మూల్యం! "ఇదేనా భక్తి!" "ఇదేనా క్రైస్తత్వం! " అని మనల్ని వాళ్లు హేళన చేస్తారు. ఈ అనుభవాలు మనకెదురవకుండా మనం అరికట్టవచ్చుగానీ విధేయతకొరకు మనం కూడా ఎంతో కొంత మూల్యం చెల్లించక తప్పదు గదా!

మన విధేయత ఇతరుల్ని నిరాశపర్చినప్పుడు మానవసహజమైన గర్వం మనలో స్థావరమేర్పరుచుకుంటుంది. అప్పుడు మనం "ఎవరిదగ్గరనుండి నాకేమీ అక్కర్లేదు" అని మాట్లాడతాం. మనకు ఇతరులనుండి ఎంతో కొంత కావాలి. లేకపోతే మనం దేవునిపట్ల అవిధేయత చూపినట్లవుతుంది. ప్రభువుకు ఇతరులకు మధ్య ఉన్న మైత్రీబంధమే (లూకా 8:1-3 వచనాలు చూడండి) మనకు ఇతరులకు మధ్య ఉండాలి; ప్రభువుకు భిన్నంగా జీవించే హక్కు మనకుందా?

అన్నీ మనమే భరించవలసిరావడం మూలంగా ఆధ్యాత్మిక జీవితంలో పురోగతికి అవరోధమేర్పడుతుంది. వాస్తవానికి అన్నీ మనం భరించలేం కూడా. దేవుని సార్వత్రిక సంకల్పంకొరకు మనం పనిచేస్తున్నాం కాబట్టి మన విధేయత ఇతరులమీద కూడా ప్రభావం చూపుతుంది. మనం ప్రభువుపట్ల విధేయత చూపిస్తూ మన స్వాభిమానాన్ని స్వావలంబనను వదులుకొనేందుకు సిద్ధపడదామా? లేక, ఇందుకు భిన్నంగా "ఇతరుల్ని నేను కష్టపెట్టను" అని దురహంకారంతో మాట్లాడదామా? మనం దేవునిపట్ల అవిధేయత చూపాలనుకుంటే మానవసహజమైన ఆభిజాత్యంతో మాట్లాడవచ్చు. ఇది మనకెదురైన సందర్భానికి వెంటనే పరిష్కారాన్ని చూపుతుందేమోగానీ మన ప్రభువును దుఃఖపెట్టడం నిజం. అయితే మనం దేవునికి విధేయత చూపుతున్నప్పుడు మనతోబాటు మూలం చెల్లించినవారందరిపట్ల ఆయన శ్రద్ధచూపిస్తాడు. మనం చేయవలసిన పని దేవునికి విధేయత చూపడం; పర్యవసానాలన్నీ ఆయనకు అప్పగించడం.

నీ విధేయతవలన ఎదురయ్యే పర్యవసానాలకు పరిష్కారమార్గాల్ని దేవునికి నిర్దేశించకు. అవేమిటో ఆయనకు తెలుసు!

జనవరి 12

## నీవెప్పుడైనా దేవునితో ఒంటరిగా గడిపావా? (1)

"ఒంటరిగా ఉన్నప్పుడు తన శిష్యులకు అన్నిటిని విశదపర్చెను." (మార్కు 4:34)

**ప్రభువుతో మన ఏకాంతసమయం:** యేసు ప్రభువు అన్ని సందర్భాల్లోను మనల్ని ప్రక్కకు పిలిచి అన్నీ మనకు వివరించడు. మనం అర్థం చేసుకోగలిగినప్పుడు మాత్రమే ఆయన మనకు వివరిస్తాడు. ఇతరుల జీవితాలు మనకు దృష్టాంతాలుగా ఉన్నప్పటికీ మనం మన ఆత్మల్ని పరీక్షించుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడు. అయితే ఇది నిదానంగా సాగే ప్రక్రియ. ఎంత నిదానమైనదంటే ఒకరు దేవుని ఉద్దేశాలకనుగుణంగా మారడానికి జీవితకాలం పట్టవచ్చు. మన అంతరంగంలోని లోతుపాతుల్ని వెల్లడిచేయడానికి మనం దేవుణ్ణి అనుమతించినప్పుడు మాత్రమే మనమాయన కుపయోగపడతాం. మనగురించి మనకే తెలియని అజ్ఞానం మనలో ఉందంటే ఆశ్చర్యంగా ఉందా? మనలో ఉన్న అసూయ అలసత్వం అహంభావం మనకు కనబడవు; కనబడినప్పటికీ మనలో ఉన్నాయని మనం ఒప్పుకోం. అయితే మన లోలోతుల్లో దాగి ఉన్నవాటినన్నిటినీ యేసు మనకు బాహాటపరుస్తాడు. తర్వాతనే ఆయన తన కృపద్వారా మనలో కార్యం జరిగిస్తాడు. హృదయం లోలోపలికి తొంగిచూచే ధైర్యం మనలో ఎందరికుంది?

మనగురించి మనం అర్థం చేసుకోగలమనే అభిప్రాయం మనలో ఉండకూడదు. ఇది మనలోని అహంభావాన్ని సూచిస్తుంది. మనగురించి అంతా తెలిసినది దేవునికి మాత్రమే. మన అధ్యాత్మిక జీవితానికి అహం ఒక గొప్ప అవరోధం. దేవుని దృష్టిలో మనమెటువంటివారమో గుర్తించగలిగినప్పుడు "నేను యోగ్యుణ్ణి కాను" అని ఏకరువు పెట్టలేం. ఎందుకంటే మన అయోగ్యతలు వివరించలేనంత అధికమైనవి. మనలో అయోగ్యతలున్నాయని దేవునికి కూడా తెలుసు గదా! అయినప్పటికీ ఆయన మనకు బోధించే సమయంకొరకు చూస్తాడు. మనలో గర్వం మరియు ఆత్మవంచన ఉన్నంత కాలం దేవుడు మనకు యేదీ వివరించడు. అయితే ఒకానొక సమయం వస్తుంది. మన అహం దెబ్బతిన్నప్పుడు మన హృదయం భంగపడుతుంది; లేదా నిరాశానిస్పృహలు మనల్ని చుట్టుముడతాయి. మనం ఒంటరివారమౌతాం. ఈ ఒంటరితనమే మనల్ని దేవునిచెంతకు నడిపిస్తుంది. అప్పుడాయన మనకంతవరకూ తెలియని విషయాలనెన్నో బోధిస్తాడు. దేవునితో గడిపే ఈ ఏకాంతసమయంలో ఆయన మనకన్నీ విశదీకరిస్తాడు.

జనవరి 13

## నీవెప్పుడైనా దేవునితో ఒంటరిగా గడిపావా? (2)

“ఆయన ఒంటరిగా ఉన్నప్పుడు పంద్రెండుమంది శిష్యులతో కూడ ఆయనచుట్టు ఉండినవారు ఆ ఉపమానమునుగూర్చి ఆయన నడిగిరి.” (మార్కు 4:10)

**మనతో ఆయన ఏకాంతం:** శ్రమలు భగ్నహృదయం శోధనలు నిరాశానిస్పృహలు అనారోగ్యం చెల్లాచెదురైన ఆశలు స్నేహభంగంవంటి ఒంటరి సమయాల్లో మనమున్నప్పుడు మన ఒంటరితనం దేవునికుపయోగపడుతుంది. ఆయన మనల్ని ఎదుర్కొంటాడు. అప్పుడు మనం నిరుత్తరులం. మనమాయణ్ణి ఒక ప్రశ్న కూడా అడగలేం. అప్పుడాయన మనకు బోధిస్తాడు. యేసు క్రీస్తు తన పన్నెండుమంది శిష్యులకెలా తర్ఫీదు ఇచ్చాడో గమనించు. యేసు బోధలకు కలవరపడింది ఆయన శిష్యులే; బయటవున్న జనసమూహం కాదు. యేసు శిష్యులు తరచూ ఆయణ్ణి ప్రశ్నించేవారు. ఆయన కూడా తరచూ వారికి వివరించేవాడు. అయితే వారు పరిశుద్ధాత్మ పొందేవరకు ఆయన బోధించిన సంగతుల్ని అర్థం చేసుకోలేకపోయారు.

దేవునితో నీ ప్రయాణంలో ఆయన ఒక విషయాన్ని నీకు స్పష్టం చేస్తాడు. ఆయనకు నీ ఆత్మ ముఖ్యం. ఇతరుల జీవితాల్లోని కష్టాలు కన్నీళ్లు నిన్ను కలవరపెడుతుండవచ్చు. ఇతరుల లోతుపాతులు మనకు తెలుసని మనం ఆలోచిస్తుంటాం. అయితే దేవుడు మన లోతుపాతుల్ని మనకు వెల్లడిచేస్తాడు. మనలో మొండితనం అజ్ఞానం లోతుగా పాతుకొని ఉన్నాయి. పరిశుద్ధాత్మ మనకు వెల్లడిచేసినప్పుడు మాత్రమే ఇవి మనకు కనబడతాయి. అయితే మనం యేసుతో ఏకాంతంగా ఉన్నప్పుడు మాత్రమే ఆయన ఇవన్నీ మనకు బోధించగలడు. మనమిప్పుడు ఆయనతో ఏకాంతంగా ఉన్నామా? లేక, మనం మన స్వంత అభిప్రాయాలపట్ల శ్రద్ధగలిగి ఉన్నామా? మన శరీరంపట్ల అమితాసక్తిని చూపిస్తున్నామా? మన తెలివితేటలు యేసుకు అక్కర్లేదు. అన్నిటినీ విడిచి మనం ఒంటరిగా ఆయనతో గడిపేంతవరకు ఆయన మనకు ఏదీ బోధించడు.

జనవరి 14

## దేవుని పిలుపు

“అప్పుడు -నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని. అంతట నేను -చిత్తగించుము నేనున్నాను నన్ను పంపుమనగా” (యెషయా 6:8)

దేవుడు సూటిగా యెషయాను పిలవలేదు. దేవుడు చెబుతున్న మాటల్ని యెషయా విన్నాడు - “మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని.” దేవుని పిలుపు ఏ కొందరికో కాదు. దేవుడు అందరిని పిలుస్తున్నాడు. నేను దేవుని పిలుపును వింటున్నానా వినడంలేదా అనేది నా చెవుల పరిస్థితిమీద ఆధారపడి వుంటుంది. నేనేం వింటున్నానో అది నా ఆధ్యాత్మిక వైఖరిమీద ఆధారపడి ఉంటుంది. “పిలువబడినవారు అనేకులు, ఏర్పరచబడిన వారు కొందరే ...” (మత్తయి 22:14). అంటే కొందరు మాత్రమే దేవుని పిలుపును అంగీకరిస్తారు. వీరు దేవుని పిలుపును వింటారు; యేసు క్రీస్తుద్వారా దేవునితో అన్యోన్యత కలిగి ఉంటారు. వీరి ఆధ్యాత్మిక స్థితి దేవుణ్ణి సంతోషపరుస్తుంది. “నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా” వీరు వింటారు. ఒక విషయం గమనించు. దేవుడు ప్రత్యేకించి ఏ ఒక్కరినో పిలిచి “నువ్విప్పుడు వెళ్లు” అని చెప్పడు. దేవుడు యెషయాను వెళ్లమని బలవంతపెట్టలేదు. దేవుని సన్నిధిలో ఉన్న యెషయా ఆయన పిలుస్తుండగా విన్నాడు. యెషయా మనఃపూర్వకంగా “చిత్తగించుము నేనున్నాను నన్ను పంపు”మని జవాబిచ్చాడు.

దేవుడు నిన్ను బలవంతపెట్టి పంపిస్తాడని లేదా బ్రతిమలాడతాడనే ఆలోచనను నీ మనస్సులోనుండి తొలగించు. మన ప్రభువు శిష్యుల్ని పిలిచినప్పుడు ఆయన వారిని బలవంతపెట్టలేదు; అయితే వారాయణ్ణి ఎదిరించలేకపోయారు. మనఃపూర్వకంగా తనను వెంబడించేవారినే ఆయన “నా వెంబడి రండి” (మత్తయి 4:19-20) అని పిలిచాడు. మనల్ని దేవుని సన్నిధికి నడిపించడానికి మన జీవితంలోకి మనం పరిశుద్ధాత్మను అనుమతించినట్లయితే “ఎవడు పోవును” అని యెషయా విన్న ప్రభువు స్వరాన్ని మనం కూడా వినగలం. యెషయాలాగానే మనం కూడా మనఃపూర్వకంగా “చిత్తగించుము నేనున్నాను నన్ను పంపు”మని చెప్పగలం.

జనవరి 15

## నీ ప్రాచీన స్వభావం మరణించిందా?

“క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి.” (రోమా 6:4)

ప్రాచీన స్వభావాన్ని పాతిపెట్టకుండా ఎవరూ సంపూర్ణంగా పరిశుద్ధత పొందలేరు. ప్రాచీన స్వభావం మరణించడమనే కీలకమైన అనుభవం (మార్పు) మనలో లేనట్లయితే పరిశుద్ధత ఒక స్వప్నంలాంటిది మాత్రమే. మన ప్రాచీన స్వభావం మరణించాలి; మనం యేసు క్రీస్తులో నూతనజీవంతో తిరిగి లేవాలి. క్రీస్తులో పునరుత్థాన జీవితం మనకున్నప్పుడు ఓటమి మన దరిదాపుల్లోకి రాదు. దేవునితో ఐక్యత కలిగి ఉన్నప్పుడు మన లక్ష్యం ఒకటే: ఆయన కొరకు సాక్షిగా ఉండడం.

మరణాన్నెవరూ స్వాగతించరు. నీవు ప్రాచీన స్వభావపు చివరిరోజుల్లో ఉన్నావా? నీ ప్రాచీనస్వభావం మరణించాలని నీవు మనస్సులో కోరుకుంటున్నావు గానీ మరణించిన అనుభవాన్ని నిజంగా పొందావా? నీ ప్రయత్నాలన్నీ ఆపి క్రీస్తుతో సహానుభవాన్ని పొందు. నీ స్వంత ప్రయత్నాలు ఫలించవుగానీ ప్రాచీనస్వభావాన్ని పాతిపెట్టడానికి మరణాన్ని ఆహ్వానించు. మరణమంటే “క్రీస్తు యేసులోనికి ... ఆయన మరణములోనికి బాప్తిస్మము” (రోమా 6:3) అని తెలుసు కదా!

నీ ప్రాచీనస్వభావం నిజంగా మరణించిందా? లేక, నిన్ను నీవు మోసగించు కుంటున్నావా? ప్రాచీన స్వభావంతో నీవు జీవించిన చివరి రోజు ఏది? ఆ రోజును నమ్రతతో కృతజ్ఞతాభావంతో జ్ఞాపకం చేసుకోగలవా? “అవును, ఆ రోజు నాకు గుర్తుంది. ఆ రోజు నేను దేవునితో ఒప్పందం చేసుకున్నాను” అని నిజాయితీతో చెప్పగలవా?

“మీరు పరిశుద్ధులగుటయే ... దేవుని చిత్తము” (1 థెస్స 4:3). ఇది నీ పట్ల దేవుని చిత్తమని నీవు ఒప్పుకున్నట్లయితే నీ సహజస్పందన పరిశుద్ధతవైపు నడవడమే. నీ ప్రాచీన స్వభావాన్ని పాతిపెట్టడానికి సిద్ధమేనా? నేడే నీ ప్రాచీన స్వభావానికి చివరి రోజని ఒప్పుకుంటావా? నిర్ణయం నీదే!

జనవరి 16

## దేవుని స్వభావం, మరియు ఆయన స్వరం

"అప్పుడు -నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని ..." (యెషయా 6:8)

దేవుని పిలుపుగురించి మాట్లాడుకుంటున్నప్పుడు మనమొక విషయాన్ని తరచూ మర్చిపోతుంటాం. అదేమిటంటే, పిలుస్తున్నవాని స్వభావం. ప్రతి రోజూ మనల్ని అనేక విషయాలు పిలుస్తుంటాయి. కొన్ని పిలుపులకు మనం జవాబిస్తుంటాం; మరి కొన్ని పిలుపుల్ని అసలు వినవే వినం. పిలుపు మనల్ని పిలుస్తున్నవాని స్వభావాన్ని వ్యక్తం చేస్తుంది. మనల్ని పిలిచినవాని స్వభావం మనలో ఉంటేనే మనం ఆ పిలుపును గుర్తించగలం. దేవుని పిలుపు ఆయన స్వభావాన్ని వక్త్యం చేస్తుంది; మన స్వభావాన్ని కాదు! దేవుని పిలుపు ప్రకంపనలు మన జీవితమనే వస్త్రంలో అల్లికపోగుల్లాగా ఉన్నాయి. అయితే మనం వాటిని గుర్తించగలగాలి. దేవుని స్వరం మనకు సూటిగా వినబడుతున్నప్పుడు ఇంకొకరి అభిప్రాయాన్ని తెలుసుకోడం అనవసరమేమో! పిలుపు మనకు దేవునికి మాత్రమే సంబంధించినది కాబట్టి ఇంకొకరి ప్రమేయం అక్కర్లేదేమో! దేవుని పిలుపు నా స్వభావాన్ని ప్రతిబింబించదు; నా వ్యక్తిగత అభిలాషలతోను ఆశలతోను నా నైజంతోను పని లేదు. నేను నా స్వంత గుణగణాలగురించి నా విశిష్టలక్షణాలగురించి ఆలోచిస్తూ నా అర్హతల్ని అంచనా వేసుకుంటున్నంత కాలం దేవుని పిలుపును వినలేను. అయితే దేవుడు నన్ను తనతో సరైన సంబంధంలోనికి నడిపించినప్పుడు యెషయా కెదురైన సందర్భమే నాకూ యెదురవుతుంది. దేవుని స్వరంతో యెషయా తన స్వరాన్ని కలిపాడు కాబట్టి దేవుని స్వరం యెషయా ఆత్మకు సూటిగా వినబడింది. మనలో అనేకులకు మన స్వరాలే వినబడతాయి తప్ప దేవుని స్వరం వినబడదు; దేవుడు సెలవిస్తున్న మాటలు వినబడవు. మనం దేవుని స్వరాన్ని వినాలంటే మనం వుండవలసిన స్థలంలో ఉండాలి. మనకు దేవుని స్వరం వినబడాలంటే మార్పు అనివార్యం!

జనవరి 17

## స్వాభావిక జీవితపు స్వరం

“తన కృపచేత నన్ను పిలిచిన దేవుడు ... ఆయనను నాయందు బయలుపరప అనుగ్రహించినప్పుడు ... ” (గలతీ 1:15,16)

దేవుని పిలుపు మనం ఫలానా విధంగా ఆయణ్ణి సేవించాలని మనల్నెన్నడూ నిర్దేశించదు. దేవుని స్వభావంతో నాకు ఉన్న సాన్నిహిత్యం నేనాయన పిలుపును అర్థం చేసుకొనేలా చేస్తుంది; నేనాయనకొరకు ఏం చేయగలనో నేను గుర్తించేలా సహాయం చేస్తుంది. దేవుని పిలుపు ఆయన స్వభావాన్ని వ్యక్తం చేస్తుందని నిన్నటి ధ్యానంలో తెలుసుకున్నాం గదా! అదే విధంగా ఆయన పిలుపు నేనాయనకు చేయబోయే పరిచర్యను మరియు నా స్వభావాన్ని కూడా వ్యక్తం చేస్తుంది. అపొస్తలుడైన పౌలు ఎందుకు పిలవబడ్డాడో చూద్దాం: “నన్ను ప్రత్యేకపరచి, తన కృపచేత నన్ను పిలిచిన దేవుడు నేను అన్యజనులలో తన కుమారుని ప్రకటింపవలెనని ఆయనను నాయందు బయలుపరప ననుగ్రహించినప్పుడు ... ” (గలతీ 1:15,16). మనం కూడా ఇందుకే పిలవబడ్డాం!

భక్తివిశ్వాసాలతో నిండిన జీవితంనుండి పొంగిపొరలే వెల్లువే సేవ. వాస్తవానికి సేవ చేయడానికి ఏ పిలుపూ అక్కర్లేదు. దేవుని స్వభావంతో నాకు ఉన్న అన్యోన్యతకు సహజమైన స్పందన సేవ; ఆయన స్వభావంతో నా తాదాత్మ్యతను వ్యక్తపర్చేదే సేవ. అటువంటి సేవ స్వాభావికంగానే నా జీవితంలో అంతర్భాగమవుతుంది. అప్పుడు దేవుని పిలుపును నేను స్పష్టంగా అర్థం చేసుకొనేలా, ఆయనపట్ల సంపూర్ణప్రేమతో నేనాయణ్ణి నా శాయశక్తులా సేవించేలా ఆయన నన్ను తనతో ప్రగాఢమైన అన్యోన్యతలోనికి నడిపిస్తాడు. దేవుని పిలుపు విన్న వ్యక్తి తిరిగి ఆయనకు అర్పించే ప్రేమకానుక సేవ; ఇది మనఃపూర్వకమైన బహిరంగ సమర్పణ. కాబట్టి నాలో దేవుని స్వభావం రూపొందుతున్నప్పుడు నేనాయన పిలుపు వింటున్నప్పుడు ఆయన దివ్యస్వరం నాలో ప్రతిధ్వనిస్తుంది. ఆయన స్వరం నా స్వరం మిళతమై ఏకస్వరమౌతాయి. దేవుని కుమారుడు తనను తాను నాలో వెల్లడి చేసుకుంటాడు; అప్పుడు ఆయనపట్ల భక్తిపారవశ్యంతో నిండిన సేవ నా అనుదిన జీవితమార్గమవుతుంది.

జనవరి 18

## ఆయన నీ ప్రభువేనా?

"అందుకు తోమా ఆయనతో -నా ప్రభువా, నా దేవా అనెను." (యోహాను 20:28)

యేసు సమరయ స్త్రీని "నాకు దాహమునకిమ్మని" (యోహాను 4:7) అడిగాడు. మనం యేసు దాహాన్ని తీర్చవలసి ఉండగా, యేసు క్రీస్తు మన దాహాన్ని తీర్చాలని మనం కోరు కుంటున్నాం! ఆయన మనల్ని సంతృప్తిపర్చడంకాదు గానీ మన జీవితాల్నే మనమాయనకు అర్పించి ఆయణ్ణి సంతృప్తిపర్చాలి. "మీరు ... నాకు సాక్షులైయుందురని" (అ.కా. 1:8) ప్రభువు చెప్పాడు. అంటే ప్రభువైన యేసుపట్ల నిష్కళంకమైన నిరాటంకమైన భక్తి జీవితం మన కుండాలని అర్థం; మరియు రాజీపడని జీవితం మనకుండాలని అర్థం; అప్పుడే ఆయన మనల్ని ఎక్కడికైనా పంపినప్పుడు మన జీవితం ఆయనకు సంతృప్తినిస్తుంది.

యేసు క్రీస్తుపట్ల నీ విధేయతకు పోటీగా నిలిచేవాటిపట్ల జాగ్రత్తగా ఉండు. నీ విధేయతకు నీ యథార్థతకు తీవ్రమైన పోటీ నీ సేవే. ఎందుకంటే మన జీవితాల్ని ఆయనకు సంపూర్ణంగా సమర్పించడం కష్టం గానీ; సేవ చేయడం కష్టం కాదు. దేవుడు మనల్ని పిలిచిన లక్ష్యం ఆయణ్ణి సంతృప్తిపర్చడమే తప్ప ఆయనకొరకు ఏదో ఒకటి చేయడం కాదు. మనం దేవునికొరకు యుద్ధాలు చేయాలని ఆయన మనల్ని పంపడంలేదు గానీ ఆయన యుద్ధాల్లో వాడబడడానికి మాత్రమే పంపుతున్నాడు. యేసు క్రీస్తుపట్ల భక్తికంటె సేవపట్ల భక్తి మనలో ఎక్కువగా ఉందా?

జనవరి 19

## దర్శనం మరియు గాఢాంధకారం

"ప్రొద్దుగ్రుంక బోయినప్పుడు అబ్రామునకు గాఢనిద్రపట్టెను. భయంకరమైన కటికచీకటి అతని కమ్మగా" (ఆదికాండము 15:12)

దేవుడు మనకు దర్శనాన్ననుగ్రహించినప్పుడు ఆ అనుభవం "తన చేతి నీడలో నన్ను దాచియున్నాడు" (యెషయా 49:2) అన్నట్టుగా ఉంటుంది. పరిశుద్ధుడు చేయవలసిన పని నిశ్శబ్దంగా వినడం మాత్రమే. అత్యధిక వెలుగును చూచినప్పుడు మన కళ్లకు చీకటి కమ్ముతుంది. అదే మనం వినవలసిన సమయం! ఆదికాండము పదిహేనో అధ్యాయంలో అబ్రాహాముకు దర్శనమనుగ్రహించబడింది. గాఢాంధకారం మధ్యలో దేవుడతనితో మాట్లాడాడు. ఆ తర్వాత పదమూడు సంవత్సరాల కాలం అబ్రాహాము జీవితంలో అతను వేచిచూడవలసిన నిశ్శబ్ద కాలం. అది అబ్రాహాము నైతికశిక్షణ అలవర్చుకోవలసిన కాలం. అయితే వేచిచూడవలసిన కాలంలో అబ్రాహాము లోకజ్ఞానంమీద ఆధారపడ్డాడు. దేవుడు అతనిపట్ల అసమ్మతి చూపలేదు గానీ అబ్రాహాము తాను వేచిచూడవలసిన కాలంలో స్వావలంబన కోల్పోయాడు. దేవుని సమయంకొరకు నీవు ఓపికతో వేచిచూచినట్లయితే ఆయన తప్పక తన దర్శనాన్ని నీ జీవితంలో వాస్తవం చేస్తాడు. దేవుని వాక్కు నెరవేరడానికి నీ స్వంతప్రయత్నం చేయకు. నీవు సంతోషంగా ఉన్నావని, ధైర్యంగా ఉన్నావని నటించకు. దేవుణ్ణి ఆశ్రయించు (యెషయా 50:10,11 చూడండి).

నేను శరీరాన్ని నమ్ముకున్నానా? లేదా, విశ్వాసపు పరిధిదాటి బయటికి వెళ్లానా? లేదా, ఇతరుల మాటలు వింటున్నానా? నా నమ్మకం దేవునిలోనా? లేదా, ఆయన ఆశీర్వాదాల్లోనా? లేదా, దేవుణ్ణి కాక నేను మరెవరినైనా ఆశ్రయించానా? "నేను సర్వశక్తిగల దేవుడను ... " (ఆది 17:1). మన జీవితంలో దేవుని వాక్కు వాస్తవమైనప్పుడు మనుషుల మాటలు ఉనికి కోల్పోతాయి. ఇతరులు చెప్పే మాటలు ఇతరులు చేసే పనులు ఇక మనకెన్నడూ బాధ కలిగించవు.

జనవరి 20

## నీలో నూతనత్వం వుందా?

“అందుకు యేసు అతనితో -ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను.” (యోహాను 3:3)

కొన్నిసార్లు మనలో నూతనత్వం ఉవ్విళ్లూరుతుంది; ప్రార్థనా కూటానికి వెళ్లాలని ఆతృతపడతాం. అయితే ఆ నూతనత్వం దైనందిన కార్యక్రమాలన్నిటిలోను ఉందా?

ఆత్మద్వారా క్రొత్తగా జన్మించడం నిశ్చయంగా దేవుని కార్యమే. గాలి ఎక్కడనుండి వస్తుందో మనకు తెలియనప్పటికీ దాని శక్తి మనకు తెలుసు. క్రొత్తగా జన్మించిన అనుభవం కూడా ఇటువంటిదే. పరలోకసంబంధమైన క్రొత్త జీవితం నిత్యమైనది, నిత్యనూతనమైనది. ఇది ఎల్లవేళలా మన ఆలోచనల్లో మాటల్లో క్రియల్లో నూతనత్వాన్ని నింపుతుంది. ఇది నూతన పరిమళంతో నిండిన నిరాటంకమైన పరలోక జీవం. మన ఆధ్యాత్మిక జీవితం చప్పబడడం మనకు దేవునితో అన్యోన్యత లేదనడానికి నిదర్శనం. “నేను ఈ పని ఇప్పుడే చేయాలి; లేకపోతే తర్వాత చేయలేను” అని మనలో మనం ఆలోచిస్తుంటాం. ఆధ్యాత్మికంగా చప్పబడ్డామనడానికి ఇదే మొదటి గుర్తు. ఈ క్షణంలో మనలో నూతనత్వం ఉందా? లేక చప్ప బడ్డామా? నూతనత్వం మన విధేయతకు ఫలితం కాదు. పరిశుద్ధాత్మ మనల్ని అనుదినం నూతనపరుస్తుంటాడు. విధేయత నిన్ను“వెలుగులో” నడిపించేలా (1 యోహాను 1:7) చూసుకో.

దేవునితో నీ సంబంధాన్ని జాగ్రత్తగా కాచుకో. యేసుకు మనకు మధ్య ఏదీ అడ్డు రాకూడదు. “మనము ఏకమై యున్నలాగున, వారును ఏకమై యుండవలెనని ... ” (యోహాను 17:22) అని యేసు మనకొరకు ప్రార్థించాడు. నీ జీవితం యావత్తూ యేసు క్రీస్తు చేతుల్లో పెట్టు. ఆయన దగ్గర ఏదీ దాచకు. ఆయన దగ్గర నటించకు. నీ ఆధారం నీ ఆశ్రయం దేవుడు కాక మరి దేనిమీదైనా ఉన్నాయా? నూతనత్వంకొరకు బలంకొరకు నీవు దేవునిమీద కాక ఇతరత్రా ఆధారపడినట్లయితే ఆయన శక్తి నీలోనుండి ఎప్పుడు తొలగిపోతుందో కూడా నీకు తెలియదు.

ఆత్మద్వారా తిరిగి పుట్టడం మనం ఊహించేదానికంటె గొప్పది. ఇది మనకు నూతన దర్శనాన్నిచ్చి మనల్ని నిత్యనూతనంగా ఉంచుతుంది. తిరిగిపుట్టిన మనలో పరలోకజీవం ఎప్పటికీ సమృద్ధిగా ఉంటుంది.

జనవరి 21

## దేవుడు జ్ఞాపకం తెచ్చుకుంటున్నవాటిని గుర్తుకు తెచ్చుకో

"నీ యౌవనకాలములో నీవు చూపిన అనురాగమును ... నేను జ్ఞాపకము చేసికొనుచున్నాను." (యిర్మీయా 2:2)

నేను దేవునిపట్ల చూపవలసిన విధంగా వినయం చూపిస్తున్నానా? లేక, దేవుడు నా పట్ల జాలిచూపాలని యెదురుచూస్తున్నానా? నా జీవితంలో సమస్తమూ దేవుని హృదయాన్ని సంతోషపెడుతోందా? లేదా, అన్నీ నేననుకున్న విధంగా జరగడంలేదని నిరంతరం ఫిర్యాదులు చేస్తున్నానా? దేవుని కృపాశీర్వాదాల్ని మర్చిపోయిన వ్యక్తికి సంతోషం వుండదు. మనం కూడా యేసు క్రీస్తుకు అవసరమైనవాటిని ఇవ్వగలమనడం ఆశ్చర్యంగా ఉంది కదూ! "నాకు దాహమునకిమ్మని" (యోహాను 4:7) యేసు అడిగాడు. గత వారంలో నేనెన్నిసార్లు దేవునిపట్ల వినయం చూపాను? నా జీవితం ఆయణ్ణి ప్రతిబింబించేదిగా ఉందా? ఒక్కసారి జ్ఞాపకం చేసుకో.

దేవుడు తన ప్రజలతో "నీ వైవాహికప్రేమను నేను జ్ఞాపకము చేసికొనుచున్నాను" (యిర్మీయా 2:2) అని చెబుతున్నాడు. అంటే, దేవుని ప్రజలకు మొదట్లో దేవునిపట్ల ఉన్న ప్రేమ ఇప్పుడు లేదని అర్థం. దేవుడు వారి మొదటి ప్రేమను జ్ఞాపకం చేసుకుంటున్నాడు. నాలో మొదట్లో దేవునిపట్ల పొంగి పొరలిన ప్రేమ ఇప్పుడు కూడా నాలో ఉందా? ఆయనపట్ల నా భక్తిభావాన్ని చూపడంలో అనుచితంగా ప్రవర్తించానా? నేను కేవలం దేవుని గురించే ఆలోచించానని ఆయనకు తెలుసా? నేనిప్పుడు కూడా అలాగే ఉన్నానా? లేక, దేవుణ్ణి ప్రేమించే విషయంలో మానవజ్ఞానాన్ననుసరిస్తున్నానా? ఆయన నన్నెక్కడికి నడిపించినప్పటికీ అది నాకు అంతగా పట్టనంతగా నేనాయణ్ణి ప్రేమిస్తున్నానా? లేదా, నేను దేవునికి చేసే సేవకు నాకెంత గొప్పతనం పలుకుబడి వస్తున్నాయని లెక్కలు వేస్తున్నానా?

దేవుడు నా గురించి జ్ఞాపకం చేసుకోడం నాకు గుర్తు వచ్చినప్పుడు నాకొక విషయం బోధపడుతుంది. ఇదివరలో నాకు దేవునిపట్ల ఉన్న ప్రేమ ఇప్పుడు లేదు. ఇది నాకు గుర్తుకొచ్చినప్పుడు నాలో దైవచిత్తానుసారమైన దుఃఖం పొంగి పొరలుతుంది. నా జీవితంలో అవమానం దైన్యం చోటుచేసుకున్నాయని గుర్తించగలుగుతాను. "దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును ... " (2 కొరింథీ 7:10).

జనవరి 22

## నేను దేవునివైపు చూస్తున్నానా?

"నా వైపు చూచి రక్షణ పొందుడి" (యెషయా 45:22)

దేవుడు తన ఆశీర్వాదాలతో మన దగ్గరకు వచ్చి మనల్ని రక్షించాలని యెదురు చూస్తున్నామా? అయితే దేవుడు "నా వైపు చూచి రక్షణ పొందుడి" అని చెబుతున్నాడు. మనకొక ఆధ్యాత్మిక ప్రమాదం పొంచి ఉంది. మనకు దేవునిమీద ఏకాగ్రత ఉందా? లేక, ఆయన ఆశీర్వాదాలు మన ఏకాగ్రతకు భంగం కలిగిస్తున్నాయా? కష్టాలు మనల్ని దేవునివైపు మళ్లించే మాట వాస్తవం. ఆయన మనకిచ్చే ఆశీర్వాదాలు  కొన్నిసార్లు దేవునిపట్ల మన శ్రద్ధాసక్తుల్ని ప్రక్కదారి పట్టిస్తాయి. కొండమీద ప్రసంగ సారాంశం మన శరీరాత్మలు యేసు క్రీస్తు వైపు చూడగలిగేలా అన్యవిషయాలపట్ల విముఖత చూపడమే.

మనలో అనేకుల మనస్సుల్లో క్రైస్తవుడెలా ఉండాలో ఒక ఊహాచిత్రం వుంటుంది. ఎదుటివారి విషయంలో ఈ ఊహాచిత్రంవైపు చూస్తూ  మన ఏకాగ్రతకు భంగం కలిగించు కుంటున్నాం. "నా వైపు చూచి రక్షణ పొందుడి" అని దేవుడు సెలవిస్తున్నాడు. ఆయన మనతో "ఏదో ఒక రోజు మీరు రక్షణ పొందుతారు" అని చెప్పడంలేదు. మనం దేవునిమీద దృష్టిపెట్టినప్పుడు మన దృష్టి దేనిమీద నిలిచి ఉందో గ్రహించగలుగుతాం.  మనలో అన్యమనస్కతలెక్కువై మన దృష్టి దేవునిమీదనుండి తొలగిపోయింది. "నా వైపు చూచి రక్షణ పొందుడి" అని దేవుడు మనతో చెబుతుంటే మనం ఆయనపట్ల చిటపటలాడుతూ విసుగు చూపిస్తున్నాం. మనం తదేకదృష్టితో దేవునివైపు చూచినప్పుడు రేపటిగురించి మనలో ఉన్న వెతలు దిగుళ్లు అన్నీ అంతర్ధానమౌతాయి.

కాబట్టి మేలుకొని దేవునివైపు చూడు. ఆయనలో నిరీక్షణ కలిగి ఉండు. నీకు ఎన్ని ఒత్తిళ్లు ఎదురవుతున్నప్పటికీ వాటిని ప్రక్కకునెట్టి ఆయనవైపు చూడు. దేవునివైపు నీవు చూచిన తత్క్షణంలోనే రక్షణ నీదవుతుంది!

జనవరి 23

## ప్రత్యక్షత ద్వారా రూపాంతరీకరణ

“మనమందరమును ముసుకులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు ... ఆ పోలికగానే మార్చబడుచున్నాము.” (2 కొరింథీ 3:18)

దేవుని సన్నిధిలో ఎటువంటి దాపరికం లేకుండా నిలబడడం క్రైస్తవునికున్న ప్రత్యేకత. ఏ ప్రచ్ఛన్నతలూ లేకుండా దేవుని సన్నిధిలో నిలబడే క్రైస్తవుని జీవితం ఇతరులకు అద్దంలాగా వుంటుంది. దేవుని ఆత్మ మనల్ని పూర్ణుల్ని చేస్తున్నప్పుడు మనం రూపాంతరం చెందుతాం. మనం దేవునివైపు చూచినప్పుడు మనమితరులకు దేవుని స్వభావాన్ని ప్రతిబింబించే అద్దం లాగా ఉంటాం. ఆ అద్దం మసిబారకుండా జాగ్రత్తపడు. నీలో ఉన్న దేవుని స్వభావానికి విఘాతం వాటిల్లకుండా జాగ్రత్తగా ఉండు.

నీ దృష్టి సదా దేవునిమీదనే నిలిచి ఉండడం క్రైస్తవ జీవితంలో అతిముఖ్యమైన నియమం. మన దైనందిన కార్యక్రమాల్లో మనం తలమునకలుగా ఉంటాం. ఇవే మన దృష్టిని దేవునిమీదనుండి ప్రక్కకు మళ్లిస్తాయి. ఇవి ఎన్ని ఉన్నప్పటికీ మనం దేవునివైపు చూడడం మటుకు మానకూడదు. ఇతరులు నిన్నెంత విమర్శించినప్పటికీ నీ ఆధ్యాత్మిక జీవితంమీద చీకటినీడలు పడకుండా జాగ్రత్తపడు. “మీ జీవము క్రీస్తుతోకూడ దేవునియందు దాచబడియున్నది” (కొలొస్స 3:2-3). నీ హడావుడి జీవితం దేవునితో నీ అన్యోన్యతకు భంగం కలిగించకుండా జాగ్రత్తపడు. తీరికలేని పనుల్లో నిమగ్నమై దేవునిలో నిలిచి ఉండడం కొన్ని సార్లు కష్టమే. అయితే మన ఆధ్యాత్మిక జీవితాన్ని మనమే కాపాడుకోవాలి. క్రైస్తవ జీవితంలో అత్యంత కష్టతరమైనది “మనమందరమును ముసుకులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింప” జేయడమని గుర్తు పెట్టుకో.

జనవరి 24

## దేవుని జయప్రదమైన ఉద్దేశం

"నేను నీకు కనబడబోవు సంగతిని గూర్చియు ... " (అ.కా. 26:16-18)

దమస్కు మార్గంలో పౌలుకు కలిగిన దర్శనం క్షణభంగురమైన భావోద్వేగం కాదు. పౌలు దర్శనం చాలా స్పష్టంగా ఉంది; పౌలు ఏం చేయాలో దర్శనంలో ప్రస్ఫుటంగా ఉంది. "ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక" (అ.కా. 26:19) అని పౌలు చెప్పాడు. "నీవు నా వశంలో ఉన్నావు. నీకు స్వంత ఉద్దేశాలు స్వంత ప్రయోజనాలు ఉండకూడదు. నా ఉద్దేశాలే నీ ఉద్దేశాలు" అని యేసు పౌలుతో చెబుతున్నట్టుగా ఉంది కదూ! "మీరు నన్ను ఏర్పరుచుకొనలేదు ... నేను మిమ్ములను ఏర్పరుచుకొని నియమించితిని" (యోహాను 15:16) అని యేసు చెబుతున్నాడు.

మనం తిరిగి పుట్టినప్పుడు మనమేం కావాలని యేసు కోరుకుంటున్నాడో ఆ దర్శనాన్ని కలిగి ఉంటాం. "దర్శనమునకు నేను అవిధేయుడను కాక" - అని చెప్పిన పౌలు జీవితానుభవం మన జీవితానుభవం కావాలి. దేవుడు లోకాన్ని విమోచించాడని మన మనస్సుల్లో అంగీకరిస్తే సరిపోదు; నా జీవితంలో యేసు కార్యాన్ని పరిశుద్ధాత్మ వాస్తవం చేస్తాడని నాకు తెలిస్తే సరిపోదు. నాకు యేసుతో వ్యక్తిగత అన్యోన్యత ఉండాలి. పౌలు సందేశం కేవలం ఇతరులకు ప్రకటించడానికి మాత్రమే కాదు. పౌలుకు యేసుతో సుస్పష్టమైన వ్యక్తిగత అన్యోన్యత ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే పౌలు యేసు స్వాధీనంలో ఉన్నాడు. "నిన్ను పరిచారకునిగాను సాక్షిగాను నియమించుటకై ... " (అ.కా. 26:16-18) - ఇది పౌలు విషయంలో అనివార్యమైనది. వ్యక్తిగతమైన అన్యోన్యత లేకుండా ఏదీ సాధ్యం కాదు. పౌలుకు యేసు ప్రధానం; హేతువు కాదు. పౌలు పూర్తిగా యేసు క్రీస్తు ఆధీనంలో ఉన్నాడు. ఇక లోకంలో పౌలుకు యేదీ ముఖ్యం కాదు. పౌలు యేసుకొరకు తప్ప మరి దేనికొరకూ జీవించలేదు. "నేను యేసు క్రీస్తును అనగా, సిలువ వేయబడిన యేసు క్రీస్తును తప్ప, మరి దేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" (1 కొరింథీ 2:2).

జనవరి 25

## దేవునికి చోటివ్వు

“తన కృపచేత నన్ను పిలిచిన ...” (గలతీ 1:15)

దేవుని సేవకులమైన మనం మన జీవితంలోని అన్ని విషయాల్లో దేవునికి చోటివ్వాలి. ఇది జరుగుతుందేమో అది జరుగుతుందేమో అని మనం ముందుగానే ఊహించి చెబ్తుంటాం; లేదా భవిష్యతుగురించి ప్రణాళిలు వేస్తుంటాం. అయితే ఆయన ఉద్దేశాలకు ఆయన చిత్తానికి చోటివ్వడం మాత్రం మర్చిపోతుంటాం. మనమూహించని విధంగా దేవుడు మన సమావేశాలమధ్యలోకి లేదా మన బోధ మధ్యలోకి వస్తే ఎలా ఉంటుంది? దేవుడు ఇలా వస్తాడు లేదా అలా వస్తాడు అని ఎదురుచూడవద్దు గానీ దేవుడు వస్తాడని యెదురుచూడండి. ఆయనకు చోటివ్వడమంటే ఆయన వస్తాడని యెదురు చూడడం. మనమూహించని క్షణంలో దేవుడు మన జీవితంలోకి ప్రవేశిస్తాడు. ఎలాగంటే “తన కృపచేత నన్ను పిలిచిన ...” అని పౌలు చెప్పినట్టుగా.

దేవునితో నిరంతరం అన్యోన్యత కలిగి ఉండు. ఆయన అద్భుతశక్తి ఏదో ఒక సమయంలో నీ జీవితంలోకి ప్రవేశిస్తుంది. నిరంతరం దేవునికొరకు యెదురుచూస్తూ ఉండు. దేవుడు తన చిత్తానుసారం నీ జీవితంలోకి ప్రవేశించే అవకాశాన్నివ్వు.



జనవరి 26

## మళ్లీ చూడు, మరియు నిన్ను నీవు ప్రత్యేకించుకో

"అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించినయెడల ... మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా." (మత్తయి 6:30)

యేసు మాటల్లోని నిష్కాపట్యం మనకు అర్థం కాదు; ఎందుకంటే మనలో నిష్కాపట్యం లేదు. యేసు మాటల్ని అర్థం చేసుకోవాలంటే మనమేం చేయాలి? ఆయన ఆత్మను కలిగి ఉన్నప్పుడు, ఆయన మీద ఆధారపడినప్పుడు, ఆయనకు విధేయత చూపినప్పుడు ఆయన మాటల్ని అర్థం చేసుకోగలం. అప్పుడాయన సత్యం మన జీవితంలో వాస్తవం కావడం చూస్తాం. అప్పుడు మన జీవితంలో ఎటువంటి కృత్రిమత్వం ఎటువంటి కాపట్యం వుండవు. యేసు ఏం చెప్పాడో చూడండి: "అడవిగడ్డిని దేవుడీలాగు అలంకరించినయెడల ... మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా." మనమాయనతో అన్యోన్యత కలిగి ఉంటే దీన్ని చూడగలం. యేసు క్రీస్తు కంటె మనకే ఎక్కువ తెలుసనే భావజాలంతో మనమాయనపట్ల తిరస్కారధోరణి చూపుతున్నాం కాబట్టి మనకు ఆయనతో అన్యోన్యత ఉండడంలేదు. మన జీవితంలో "ఐహిక "విచారాలకు (మత్తయి 13:22) చోటిచ్చి "మరి నిశ్చయముగా" మనం యేసును మర్చిపోతున్నాం.

"ఆకాశ పక్షులను చూడుడి" (మత్తయి 6:26). ఆకాశ పక్షులు దేవుడు తమలో ఉంచిన స్వాభావిక ప్రవృత్తితో జీవిస్తాయి. ఇదే అవి దేవునిపట్ల చూపే విధేయత. దేవుడు వాటి అవసరాలన్నిటినీ తీరుస్తున్నాడు. దేవుడు మనతో ఇదే చెబుతున్నాడు. మనలో ఉన్న ఆయన ఆత్మద్వారా మనమాయనతో అన్యోన్యత కలిగి ఉన్నప్పుడు ఆయన మన అవసరతలన్నిటినీ తీరుస్తాడు.

"అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి" (మత్తయి 6:28). దేవుడు వాటిని ఎక్కడ నాటాడో అక్కడే అవి పుష్పిస్తాయి. దేవుడు మనల్ని నాటిన చోట మనం ఫలించడానికి తిరస్కరిస్తున్నాం. కాబట్టి మనలో వేర్లు లోతుగా ఉండడంలేదు. మనమాయనకు విధేయత చూపినట్లయితే యేసు మన అవసరతలన్నీ తీరుస్తానని చెబుతున్నాడు. యేసు క్రీస్తు మనతో అబద్ధం చెబుతున్నాడా? ఆయన వాగ్దానంచేసినవన్నీ మనం "మరి నిశ్చయముగా" పొందుతున్నామా? పొందలేకపోతున్నట్లయితే మనలో విధేయత లేదని అర్థం; అన్య మనస్కతలు మనల్ని కల్లోలపర్చి మనల్ని కలవరపరుస్తున్నాయని అర్థం. దేవుడు మనకిచ్చిన సేవమీద మన దృష్టిని కేంద్రీకరించడానికి బదులు అర్థంలేని ప్రశ్నలడుగుతూ మనమెంత సమయాన్ని వ్యర్థం చేస్తున్నాం? మనల్ని మనం ప్రత్యేకపర్చుకోడమంటే దేవుడు మనకప్పగించిన పనికి తప్ప అన్నిటికీ మనల్ని మనం దూరపర్చుకోవడమని అర్థం. ఇది ఒక నాటి అనుభవం కాదు; ఇది నిరంతర ప్రక్రియ; మన జీవితకాలపు ప్రక్రియ. ప్రతిరోజూ నన్ను నేను దేవునికొరకు ప్రత్యేకించుకుంటున్నానా?

జనవరి 27

## మళ్లీ చూడు, ఆలోచించు

"మీ ప్రాణమును గూర్చి యైనను ... చింతింపకుడి" (మత్తయి 6:25)

**ఈ హెచ్చరిక మాటిమాటికీ మనకవసరం:** "ఐహిక విచారమును ధనమోహమును ఆ వాక్యమును అణచివేయును గనుక వాడు నిష్ఫలుడగును" (మత్తయి 13:22). పొంచివున్న ఈ దాడినుండి మనం తప్పించుకోడం కష్టతరమైనదే. అన్నవస్త్రాలగురించి ఆలోచించక పోయి నప్పటికీ ఇతరత్రా ఆలోచనలు మనల్ని ఊపిరి తీసుకోనివ్వవు. డబ్బుగురించి ఆలోచనలు బంధుమిత్రులగురించి ఆలోచనలు మన మనస్సుల్లో అగ్రస్థానాన్ని ఆక్రమించుకుంటాయి. పరిశుద్ధాత్మ మన ఆలోచనలకు కావలి ఉండకపోయినట్లయితే మనం ఈ దాడినుండి తప్పించుకోడం కష్టమే.

"మీ ప్రాణమునుగూర్చి యైనను ... మీ దేహమును గూర్చి యైనను చింతింపకుడి" (మత్తయి 6:25). అయితే "నేనెలా బ్రతకాలో ఆలోచించకపోవడం మూర్ఖత్వం! నా అన్నవస్త్రాల గురించి నేను ఆలోచించకపోతే ఎలా?" అని మనలో ఉన్న లోకజ్ఞానం కేకలుపెడుతుంటుంది. మనం ఆలోచించకూడదని యేసు చెబుతున్నాడు. యేసుకు మన అవసరతలు తెలియవని కాదు గానీ మన జీవితావసరతలు మనకంటె యేసుకే యెక్కువగా తెలుసు కాబట్టి ఇవి ప్రధానం కాదని యేసు భావం. యేసుతో మన అన్యోన్యత, ఆయనతో మన వ్యక్తిగత సాన్నిహిత్యం జీవితంలో మన ప్రాధాన్యత కావాలి.

"ఏనాటి కీడు ఆనాటికి చాలును" (మత్తయి 6:34). నేడు జీవితంలో నిన్నెక్కువగా భయపెట్టేది యేది? "వచ్చే నెల నేనేం చేయాలి? వచ్చే వేసవిలో నా ప్రణాళికలేమిటి?" - ఇవేనా నీ జీవితంలోకి తొంగిచూచే దయ్యాలు? వీటి విషయం చింతించకూడదని యేసు చెబుతున్నాడు. మళ్లీ చూడు; ఆలోచించు. నీ మనస్సును "పరలోకపు తండ్రి" మీద కేంద్రీకరించు (మత్తయి 6:30).

జనవరి 28

## యేసు నెవరు ఆ విధంగా హింసించగలరు?

“సౌలా సౌలా, నన్నెందుకు హింసించుచున్నావు?” (అ.కా. 26:14)

దేవునికొరకు జీవించడంలో నీ స్వంత మార్గాన్నెంచుకుంటున్నావా? “పరిశుద్ధాత్మలోను అగ్నితోను” (మత్తయి 3:11) బాప్తిస్మం పొందినప్పుడు మాత్రమే ఈ ఉచ్చునుండి మనం తప్పించుకోగలం. మన మొండితనం మరియు స్వచిత్తం యేసు క్రీస్తును హింసిస్తాయి. మన మూర్ఖత్వం పరిశుద్ధాత్మను దుఃఖపెడుతుంది. మన స్వంత ఆశల్ని నెరవేర్చే మన మొండితనం మన స్వచిత్తం యేసును బాధపెడ్తాయి. మనం యేసు చిత్తాన్ని కాక మన స్వంత ఆలోచనల్ని నెరవేర్చాలనుకున్న ప్రతిసారీ మనం ఆయణ్ణి హింసిస్తున్నామన్నమాట! మనమింతకాలం యేసును హింసిస్తున్నామని మనం తెలుసుకున్నప్పుడు అది మనల్ని నలగగొట్టే అనుభవమౌతుంది.

నేను మీతో పరిశుద్ధతగురించి, ప్రత్యేకించబడడంగురించి మాట్లాడుతూ సాతాను ఆత్మను ప్రదర్శిస్తున్నానా? నాలో ఉన్న చెడుతలంపులే యేసు క్రీస్తును హింసిస్తాయి. యేసు ఆత్మ ఎల్లప్పుడూ ఒకే ఒక విషయంగురించి ఆలోచిస్తుంది. అది: తండ్రితో పరిపూర్ణమైన సాన్నిహిత్యం. దేవుని వాక్యం నా అంతరంగాన్ని లోతుగా పరిశోధిస్తోందా? లేక, నా జీవితానికి నా బోధకు వైరుధ్యం కనిపిస్తోందా? “నేను సాత్వీకుడను దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి యెత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును” (మత్తయి 11:29) అంటూ ప్రభువైన యేసు మనల్ని ఆహ్వానిస్తున్నాడు. నాలో ఉన్న భక్తి నా స్వచిత్తంమీద ఆధారపడినది కాక దేవునితో పరిపూర్ణమైన అన్యోన్యతమీద ఆధార పడినదై ఉండాలి. ఇతరులు నా వలన ప్రయోజనం పొందినా, లేక నా చుట్టూ తిరిగినా, లేక నన్ను అసలు పట్టించుకోకపోయినా నేను యేసుకు లోబడడమే నా జీవిత పరమావధి కావాలి. అప్పుడు మాత్రమే నేను యేసును హింసించేవాడనుగా ఉండను.

జనవరి 29

## ఎవరైనా అంత అజ్ఞానంతో ఉండగలరా?

"ప్రభువా, నీవు ఎవడవని అడుగగా ... " (అ.కా. 26:15)

"యెహోవా బహు బలముగా నాతో చెప్పియున్నాడు ... " (యెషయా 8:11). దేవుడు మనతో మాట్లాడినప్పుడు మనం తప్పించుకోలేం. ఆయన అధికారంతో మాట్లాడతాడు. ఆయన మాటలు మన జ్ఞానానికందనివి. దేవుని స్వరాన్ని సూటిగా విన్నావా? వినినట్లయితే నిన్ను దేవుడు బలవంతపెడుతున్నాడని నీవు అర్థం చేసుకోగలవు. దేవుడు బలవంతపెట్టడంలో ఆయనకు నీపట్ల ఉన్న ప్రేమ కూడా కనిపిస్తోంది. నీవు సరిగ్గా అర్థం చేసుకోగల భాషలోనే దేవుడు నీతో మాట్లాడతాడు. ఆయన స్వరాన్ని నీ చెవులతో వినవు గానీ, నీకెదురైన సందర్భాలు ఆయన స్వరాన్ని నీకు బోధపరుస్తాయి.

మన స్వంత నమ్మకాలను దేవుడు అంగీకరించడు. అవి ఆయనయెదుట పటాపంచలవ్వాలి. "నేను చేయవలసినదిదే" అని మనం చెబ్తాం. అయితే దేవుని స్వరం మన అజ్ఞానాన్ని బహిర్గతం చేస్తుంది. మనమాయణ్ణి సేవించే విధానంలోనే మన అజ్ఞానం బహిర్గతమవుతుంది. మనం దేవుని ఆత్మలేకుండా ఆయనసేవ చేస్తున్నప్పుడు మన సేవ ఆయణ్ణి బాధిస్తుంది. దేవుని ఉద్దేశాలను దేవుని చిత్తానుసారం మనం నెరవేర్చనప్పుడు మన మాటల్లో ఇతరులు వైరుధ్యాన్ని కనిపెట్టకపోయినప్పటికీ మనం దేవునికి వ్యతిరేకంగా ఉన్నామని మనకు తెలుసు. లూకా 9:54-55 వచనం చూడండి. ప్రభువును వెంబడించేవారి ఆత్మ ఎలా ఉంటుందో 1 కొరింథీ పదమూడవ అధ్యాయంలో కనిపిస్తుంది.

నా స్వంత తలంపులతో నా స్వంత ప్రణాళికలతో దేవుణ్ణి సేవిస్తూ నేను దేవుణ్ణి హింసిస్తున్నానా? నేను నా కర్తవ్యాన్ని నెరవేర్చినప్పటికీ నా కర్తవ్యనిర్వహణలో భాగంగా నేనాయణ్ణి హింసిస్తున్నానంటే నేను నెరవేర్చవలసిన కర్తవ్యం అది కాదన్నమాట! నా మార్గం దేవుని చిత్తానుసారమైనది కానప్పుడు నాలో సాత్విక హృదయం ఉండదు; నాలో స్వయంసంతృప్తిని సాధించే హృదయమే ఉంటుంది. మనం "నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము" (కీర్తనలు 40:8) అని చెప్పేవారిగా ఉన్నామా? లేక, దేవునికిష్టంలేని సేవ చేస్తున్నామా?

జనవరి 30

## డోలాయమానంలో మన విధేయత

"సమూయేలు ... భయపడి తనకు కలిగిన దర్శన సంగతి ఏలీతో చెప్పకపోయెను." (1 సమూయేలు 3:15)

దేవుడు మనతో ఆకర్షణీయంగా మాట్లాడడు. అందుకే ఆయన మాటల్ని మనం కొన్ని సార్లు అపార్థం చేసుకుంటాం కూడా. అప్పుడు మనం "ఇది దేవుని స్వరమేనా?" అని ఆశ్చర్యపడడం సహజమే. దేవుడు తనతో "బహు బలముగా" మాట్లాడాడని యెషయా చెప్పాడు (యెషయా 8:11). అంటే, యెషయా కెదురైన సందర్భాలు అంత బలవంతపెట్టేవిగా ఉన్నాయని అర్థం. దేవుని బలమైన హస్తంకాక, మరి ఏదీ మనల్ని అంత బలంగా తాకలేదు. మన పనిలో దేవుని హస్తాన్ని చూస్తున్నామా? లేక, జరుగుతున్న సంఘటనలను యాదృచ్ఛికంగా జరుగుతున్న సంఘటనలుగా భావిస్తున్నామా?

"ఆజ్ఞ" ఇమ్మని (1 సమూయేలు 3:9) అడగడం అలవర్చుకో. అప్పుడు నీ జీవితం అద్భుత ప్రేమకథగా మారుతుంది. నిన్ను బలవంతపెట్టే సందర్భాల్లో నీవున్నప్పుడు "యెహోవా ... ఆజ్ఞనిమ్మని" ప్రార్థించు. దేవుని స్వరాన్ని వినడానికి ప్రయత్నించు. మందలింపు, లేక గద్దింపు మనల్ని క్రమశిక్షణలో పెట్టడమే కాదు, మందలింపు లేక గద్దింపు మనం దేవుని స్వరాన్ని వినేలాగా కూడా చేస్తుంది. దేవుడు నీతో చివరిసారిగా మాట్లాడిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకో. ఆయన నీతో ఏం మాట్లాడాడో నీకు గుర్తుందా? అది లూకా 11:13 వచనమా? లేక, 1 థెస్స 5:23 వచనమా? మనం దేవుని స్వరాన్ని వినడం మొదలుపెట్టినప్పుడు మన చెవులు సునిశితమైన మరియు మెల్లనైన స్వరాన్ని కూడా వినగలుగుతాయి. తండ్రియైన దేవుని స్వరాన్ని యేసు సర్వదా విన్నట్టుగానే మనం కూడా దేవుని స్వరాన్ని వినగలుగుతాం.

దేవుడు నాకు తెలియజేసినవాటిని నేను కూడా "ఏలీ"కి చెప్పాలా? నా "ఏలీ" ఎవరు? నేనెవరికి చెప్పాలి? ఇటువంటి సందర్భంలోనే మన విధేయత డోలాయమానస్థితిలో పడుతుంది. సమూయేలు తనకు కలిగిన దర్శనాన్ని ఏలీకి చెప్పడానికి భయపడినట్టుగా మనం కూడా ఎవరికైనా చెప్పడానికి భయపడుతున్నామా? ఏలీకి చెప్పమని దేవుడు సమూయేలుతో చెప్పలేదు. అయితే ఏలీకి చెప్పాలో చెప్పకూడదో సమూయేలు నిర్ణయించుకోవాలి. దేవుని సందేశం ఏలీని బాధపెట్టినట్టే, నీ సందేశం కూడా ఇతరుల్ని బాధపెట్టవచ్చు. అయితే ఇతరుల్ని నొప్పించకూడదని తలంచడం నీ ఆత్మకు దేవునికి మధ్య ఆటంకంగా ఉండగలదు. ఇతరులు తమ కుడిచేతిని పోగొట్టుకోడం లేదా తమ కుడికంటిని పోగొట్టుకోడం నీ మీదనే ఆధారపడి ఉంది (మత్తయి 5:29,30 వచనాలు చూడండి).

దేవుడు నీతో మాట్లాడిన మాటల విషయంలో నీవే నిర్ణయించుకోవాలి; ఇతరుల సలహాలు అడగవద్దు. ఒక వేళ నీవు సలహా అడిగినట్లయితే నీవు సాతాను పక్షానికి వెళ్తున్నావేమో ఆలోచించుకో. " ... మనుష్యమాత్రులతో నేను సంప్రతింపలేదు" (గలతీ 1:16) - ఇది పౌలు స్వంత అనుభవం.

జనవరి 31

## నీ పిలుపేమిటో నీకు తెలుసా?

“దేవుని సువార్త నిమిత్తము ప్రత్యేకింపబడిన ... ” (రోమా 1:2-7)

మనం దేవుని సువార్త ప్రకటించడానికే పిలవబడ్డాం. మన వ్యక్తిగత పరిశుద్ధతను మనకు మాత్రమే పరిమితం చేసుకోక మనం సువార్తద్వారా అందరి జీవితాల్ని పరిశుద్ధతకు నడిపించేవారిగా ఉండాలి. దేవుని సువార్త అందరి జీవితాల్లో వాస్తవం కావాలి. మన పిలుపు ప్రధానంగా ఇందుకొరకే. మనం గుర్తించవలసిన వాస్తవం “విమోచన.” నేడు ప్రతి క్రైస్తవ పనివాని ముఖ్య అవసరత ఇదే. దేవుని పనివారిగా మనం విమోచన మాత్రమే వాస్తవమనే సత్యాన్ని అంగీకరించాలి. వ్యక్తిగత పరిశుద్ధత విమోచనవలన ఒనగూడుతుంది తప్ప విమోచనకు కారణం కాదు. మనం మన మంచితనాన్ని నమ్ముకున్నట్లయితే మన విశ్వాసానికి పరీక్ష వచ్చినప్పుడు ఓడిపోయేవారిగా ఉంటాం.

పౌలు తనను తానే ప్రత్యేకించుకున్నాడని చెప్పడం లేదు గానీ “నన్ను ప్రత్యేకపరచి తన కృపచేత నన్ను పిలిచిన దేవుడు ...” (గలతీ 1:15) అని చెబుతున్నాడు. పౌలు తన స్వంత బలాబలాలపట్ల అంత ఆసక్తి చూపలేదు గానీ దేవుని కృపమీదే ఆసక్తి చూపాడు. మన దృష్టి మన వ్యక్తిగత పవిత్రత మీద కేంద్రీకరించినప్పుడు మనం “విమోచన” వాస్తవాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోలేం. క్రైస్తవ పనివారు దేవునిగురించి ఎక్కువగా తెలుసుకోడానికి బదులు తమ వ్యక్తిగత పరిశుద్ధతమీద ఆధారపడుతున్నారు కాబట్టి విఫలమౌతున్నారు. విమోచన మనం స్వంతంగా సంపాదించుకొనేది కాదు; దేవుని కృపద్వారానే మనం విమోచన పొందాం. మన స్వంత ప్రయత్నాలతో విమోచనను పొందగలమనే ఆలోచన మనలో ఉన్నట్లయితే అది దేవుని సువార్త మనల్ని తాకలేదనే వాస్తవాన్ని వెల్లడిచేస్తుంది. నేను నా స్వంత ప్రవర్తనను ప్రయత్నాల్ని నమ్ముకున్నప్పుడు దేవుడు నన్ను విమోచించడు. పౌలు తన గురించి ఆలోచించలేదు. పౌలు తనను తాను పూర్తిగా ఉపేక్షించుకొని దేవునికి సంపూర్తిగా లోబడ్డాడు. కాబట్టి దేవుడతణ్ణి తన సువార్త ప్రకటించడంకొరకు ప్రత్యేకించుకొన్నాడు (రోమా 9:3 చూడండి).

ఫిబ్రవరి 1

## దేవుని పిలుపు

“బాప్తిస్మమిచ్చుటకు క్రీస్తు నన్ను పంపలేదు గాని ... సువార్త ప్రకటించుటకే ఆయన నన్ను పంపెను.” (1 కొరింథీ 1:17)

దేవుడు తనను సువార్త ప్రకటించడంకొరకే పిలిచాడని పౌలు స్పష్టంగా వ్యక్తం చేస్తున్నాడు. అయితే, పౌలు దృష్టిలో “సువార్త” అంటే ప్రభువైన యేసు క్రీస్తు మన కనుగ్రహించిన విమోచన అని జ్ఞాపకం పెట్టుకోవాలి. మన బోధ పరిశుద్ధతకు నడిపించే విధంగా ఉండాలి. వ్యక్తిగత అనుభవాల్ని కేవలం దృష్టాంతాలుగానే పౌలు పరిగణిస్తున్నాడు తప్ప, వాటినే లక్ష్యంగా పేర్కొనడంలేదు. యేసు క్రీస్తును ప్రకటించడం మాత్రమే మనకప్పగించబడిన విధి (యోహాను 12:32); రక్షణనివ్వడం, లేదా పరిశుద్ధపర్చడం మన పరిధిలోనిది కాదు. నన్ను విమోచించి పరిశుద్ధపరచడానికి యేసు క్రీస్తు శ్రమననుభవించాడని చెప్పడంకంటె, యావత్ప్రపంచాన్ని విమోచించి పరిశుద్ధపర్చడానికి, మరియు దేవుని సింహాసనం యెదుట పరిపూర్ణమైన పవిత్రలోకాన్ని పునఃస్థాపించడానికి ఆయన శ్రమ ననుభవించాడని చెప్పడం సమంజసమేమో! విమోచనవిషయంలో యథార్థపూర్వకమైన మన అనుభవం విమోచన ఎంత బలీయమైనదో స్పష్టీకరిస్తోంది. అయితే, మన వ్యక్తిగత అనుభవం విమోచన ప్రక్రియద్వారా ఒనగూడిన ఉపోత్పత్తి తప్ప, అంతిమలక్ష్యం కాదు. దేవుడు మానవస్వభావం కలిగి ఉన్నట్లయితే రక్షణగురించి పరిశుద్ధపర్చబడడంగురించి మనం ఎడతెగకుండా చేస్తున్న విజ్ఞాపనలు ఆయనకు ఎంత విసుగును ఎంత అలసటను కలిగిస్తాయో గదా! ఉదయంనుండి రాత్రివరకు ఇది కావాలి లేదా అది కావాలి అని అడిగే మన విన్నపాలు లేదా దీనినుండి తప్పించు లేదా దానినుండి తప్పించు అని అడిగే మన మనవులు ఆయనకు ఎంత భారాన్ని కలిగిస్తాయో! దేవుని సువార్తకున్న ఆధారనియమం వాస్తవంగా ఏమై ఉన్నదో దాన్ని తెలుసుకున్న అనుభూతి మన స్వంతమైనప్పుడు అత్యల్పమైన మన స్వంత విషయాలగురించి ఇక ఆయనకు విసుగు తెప్పించం.

పౌలు జీవితంలో అతనికున్న ఏకైక భారం దేవుని సువార్తను ప్రకటించడమే. ఈ ఏకైక భారం నిమిత్తం గుండె పగిలేంత దుఃఖాన్ని ఘోరహింసను పౌలు స్వాగతించాడు. దేవుని సువార్తపట్ల అతనికున్న భక్తిప్రపత్తులను అణుమాత్రమైనా ఇవేమీ కదిలించలేకపోయాయి.

ఫి[బవరి 2

## పిలుపు యొక్క బలీయమైన శక్తి

"అయ్యో, నేను సువార్తను [ప్రకటింపకపోయినయెడల నాకు [శమ." (1 కొరింథీ 9:16)

జా[గత్త! దేవుని పిలుపును వినడంపట్ల తిరస్కారం చూపిస్తున్నావేమో! రక్షణపొందినవారందరికీ పిలుపు ఉంది. ఆ పిలుపు తమ రక్షణగురించి వారిచ్చే సాక్ష్యమే. పౌలు ఈ వచనంలో సువార్త [ప్రకటించాలనే బలీయమైన పిలుపు తనలో ఎంత తీ[వమైన ఆవేదన కలిగించిందో [ప్రస్తావిస్తున్నాడు. సువార్త [ప్రకటించాలనే పిలుపుగురించి పౌలు చెప్పిన అంశాన్ని రక్షణపొందడంకొరకు దేవునివద్దకు పిలవబడడంతో అనువర్తించకూడదు. రక్షణ పొందడంకంటె సులువైనది మరేదీ లేదు. ఎందుకంటే ఇది దేవునికి మా[తమే సాధ్యమైన సర్వోత్కృష్టమైన కార్యం - "నా వైపు చూచి రక్షణ పొందుడి" (యెషయా 45:22). రక్షణ పొందడానికున్న షరతులు వేరు, శిష్యత్వానికున్న షరతులు వేరు. మనం [క్రీస్తు సిలువద్వారా రక్షణపొందాలని అధిక్షేపించబడ్డాం; అయితే శిష్యత్వం ఐచ్ఛికమైనది "ఎవడైనను నా యొద్దకు వచ్చి ..... " (లూకా 14:25-26).

మనం యేసు [క్రీస్తు సేవకులుగా ఉండడంగురించి పౌలు మాట్లాడాడు. మనం సేవకులం కాబట్టి మనమేం చేయాలో మనమెక్కడికి వెళ్లాలో మన అనుమతితో పని లేదు. (దేవుడు తన [ప్రీత్యానుసారం మనల్ని విరువబడిన రొట్టెలాగా మరియు పోయబడిన [దాక్షారసంలాగా వాడుకుంటాడు.) "సువార్త నిమిత్తము [ప్రత్యేకింపబడిన" (రోమా 2:7) అంటే దేవుని పిలుపును వినగలగడమని అర్థం. ఎవరైనా ఆ పిలుపును వినడం [ప్రారంభించినప్పుడు ఆ వ్యక్తిలో తీ[వమైన ఆవేదన కలుగుతుంది. [క్రీస్తు నామాన్నిబట్టి ఈ ఆవేదన అర్థ మైనదే. ఈ ఆవేదన ఫలితంగా ఊహకందని విధంగా [ప్రతి కోరిక, జీవితంలోని [ప్రతి అపేక్ష, [ప్రతి దృక్పథం సమూలంగా నిర్మూలించబడతాయి. ఇక మిగిలేది ఒక్కటే - "సువార్త నిమిత్తము [ప్రత్యేకింప"బడడం మా[తమే. సువార్త [ప్రకటించడానికి పిలుపునందుకున్న వ్యక్తి [ప్రతికూల దిశలో వెళ్లడానికి [ప్రయత్నించినప్పుడు ఆ వ్యక్తి హృదయంలో తీ[వమైన వ్యాకులత కలుగుతుంది. దేవుని పిలుపు నిన్ను ఆయత్తపర్చేలోపు [ప్రతిస్పర్థ కలిగించే పిలుపుల విషయంలో జా[గత్త వహించడం ముఖ్యం.

ఫిబ్రవరి 3

## "లోకానికి మురికిగా" మారడం

"లోకమునకు మురికిగాను ... ఎంచబడియున్నాము." (1 కొరింథీ 4:13)

ఈ మాటలు అతిశయోక్తులు కావు. సువార్త పరిచారకులమని చెప్పుకొనే మన విషయంలో ఈ మాటలు నిజం కాకపోడానికున్న ఏకైక కారణం మనమే. పౌలు ఈ మాటల్లోని సత్యాన్ని మర్చిపోయాడని లేక అపార్థం చేసుకున్నాడని కాదు గాని మనల్ని మనం "లోకానికి మురికిగా" ఎంచుకొనే విషయంలో మన స్వంత కోరికలపట్ల ఆతురత చూపించడం అత్యంత జాగరూకత వహించడం మాత్రమే. "క్రీస్తు పడిన పాట్లలో కొదువైనవాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (కొలొస్స 1:24) అని పౌలు వ్రాసిన మాటలు పాపవిమోచన పొంది పరిశుద్ధపర్చడం వలన ఎదురైన ప్రతిఫలం కాదు గాని, సువార్తకొరకు ప్రత్యేకింపబడి అంకితమయ్యారని తెలిపే (రోమా 1:1) రుజువు మాత్రమే.

"ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమను గూర్చి మీకేదో యొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి" (1 పేతురు 4:12). మనం మన కెదురయ్యే సంఘటనల్ని అసాధారణమైనవిగా పరిగణిస్తున్నట్లయితే అందుకు కారణం మనలో ఉన్న భయం మరియు పిరికితనం మాత్రమే. మన స్వంత ప్రయోజనాలపట్ల అపేక్షలపట్ల మనమెంతగా దృష్టిపెడుతున్నామంటే మనం కష్టాలకు దూరంగా ఉండి "నేను లోబడను నేను తలవంచను నేను వంగను" అని చెబుతుంటాం. లోబడనక్కర్లేదు వంగనక్కర్లేదు దేవుడు నిన్ను సువార్తనిమిత్తం ప్రత్యేకించినప్పుడు ఒప్పుకోడం లేదా నిరాకరించడం నీ ఇష్టానికి వదిలివేయబడిన కార్యమే. అయితే దేవుని సువార్తకు వాస్తవరూపాన్నిచ్చేందుకు చిత్రహింసల్ని మరణాన్ని అనుభవించడానికి సంసిద్ధతచూపే వ్యక్తి మాత్రమే యేసు క్రీస్తుకు నిజమైన సేవకుడు. నైతికవర్తన కలిగిన వ్యక్తికి ధిక్కారం అవినీతి అవిధేయత మోసం ఎదురైనప్పుడు అతను ఆ దుష్క్రియలపట్ల జుగుప్సతో వాటికి దూరంగా జరిగి నిరాశాపూరితుడై వాటిని జరిగించినవారిపట్ల శోకతప్తహృదయుడౌతాడు. అయితే దేవుని విమోచనలో ఉన్న అద్భుత సత్యమేమిటంటే నీచక్రియలు చేసిన అధముడు సైతం ఆయన అపారప్రేమను పూర్తిగా వ్యయపర్చలేడు. అంటే ఆయన కృపాప్రేమలు ఎన్నటికీ తరగనివని అర్థం. దేవుడు తననొక విలక్షణమైన అపురూపవ్యక్తిగా రూపుదిద్దడానికి ప్రత్యేకించాడని పౌలు చెప్పడంలేదు గాని "తన కుమారుని ప్రకటింపవలెనని ... ఆయనను నాయందు బయలుపరప" (గలతీ 1:15,16) నిశ్చయించాడని మాత్రమే చెబుతున్నాడు.

ఫిబ్రవరి 4

## ఆయన శక్తికున్న శ్లాఘనీయ మాహాత్మ్యం

"క్రీస్తు ప్రేమ మమ్మును బలవంతము చేయుచున్నది" (2 కొరింథీ 5:14)

"క్రీస్తు ప్రేమ" తనను జయించిందని, తనను పూర్తిగా స్వాధీనపర్చుకుందని పౌలు చెబుతున్నాడు. అంటే తాను క్రీస్తు ప్రేమకు అధీనుడనయ్యాడని పౌలు భావన. దేవుని ప్రేమ ఎంత బలీయమైనదో మనలో కొద్దిమందికి మాత్రమే నిజంగా తెలుసు. సాధారణంగా మనల్ని మన స్వంత అనుభవాలే నియంత్రిస్తుంటాయి. పట్టువదలలేనంతగా పౌలును స్వాధీనపర్చుకున్నది దేవుని ప్రేమే; దేవుని ప్రేమకు తప్ప ఇక దేనికీ అటువంటి బలీయమైన శక్తి లేదు. "క్రీస్తు ప్రేమ మమ్మును బలవంతము చేయుచున్నది" - ఎవరైనా ఇలా చెప్పినప్పుడు ఈ మాటలు అవి నిస్సందేహంగా యథార్థమైనవే.

మనం దేవుని ఆత్మద్వారా తిరిగిపుట్టిన మొదట్లో మన సాక్ష్యంలో పరిణతి వుండదు. "పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు ... " (అ.కా 1:8) అనే వచనం ప్రకారం మనం శక్తిపొందిన పిమ్మట మన సాక్ష్యం కూడా శక్తిమంతమౌతుంది. "నాకు సాక్షులైయుందురని ... " అని చెప్పిన యేసు మాటల్లోని అర్థాన్ని గ్రహించినప్పుడు మాత్రమే మన సాక్ష్యం ప్రాథమికస్థాయిని దాటి పరిణతి దిశగా వెళ్తుంది. అప్పుడే మనం మనకు పురస్కారం ఎదురైనా లేక తిరస్కారం ఎదురైనా హింస ఎదురైనా లేక బహుమానం ఎదురైనా అది క్రీస్తుకే జరుగుతున్నట్టుగా మనం దాన్ని అంగీకరించగలం. యేసు క్రీస్తు ప్రేమ అధీనంలో ఉన్నవారు తప్ప వేరెవరూ ఆయనకొరకు ఈ విధంగా మాట్లాడలేరు. వాస్తవానికి మనకు కావలసినది ఆయన ప్రేమ అధీనత మాత్రమే. అయితే క్రైస్తవపనివారిగా మనం దీనికి చిట్టచివరి స్థానాన్నివ్వడం విస్మయం కలిగించే విషయం. క్రీస్తు ప్రేమ తనను బలవంతపెడ్తున్నదన్న పౌలు కొందరికి వెర్రివాడిగా, మరికొందరికి జ్ఞానిగా కనిపించాడు. అయితే పౌలు ఇదేమీ పట్టించుకోలేదు. అతను జీవించినది "క్రీస్తు ప్రేమ"ను ప్రజలందరికీ ప్రకటించడం కొరకే, రానున్న దైవతీర్పుగురించి ప్రజల హృదయాల్లో ధార్మికభావం కలిగించడం కొరకే. ఇదే పౌలు జీవితలక్ష్యం. నీ జీవితాన్ని ఫలప్రదం చేసేది "క్రీస్తు ప్రేమ"కు సంపూర్ణంగా అధీనత చూపడం మాత్రమే. ఫలప్రదమైన నీ జీవితంలో దేవుని పవిత్రత, ఆయన శక్తి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అప్పుడిక నీ స్వంత విషయాలకు నీవిక ప్రాముఖ్యత నివ్వవు.

ఫిబ్రవరి 5

## పానార్పణగా పోయబడడానికి నీవు సిద్ధమేనా? (1)

"మీ విశ్వాసయాగములోను దాని సంబంధమైన సేవలోను నేను పానార్పణముగా పోయబడినను, నేనానందించి మీ యందరితోకూడ సంతోషింతును." (ఫిలిప్పీ 2:17)

సహవిశ్వాసుల కొరకు, అంటే వారి పరిచర్య నిమిత్తం విశ్వాసం నిమిత్తం నిన్ను నీవు అర్పించుకోడానికి సిద్ధమేనా? లేదా, "ఇప్పుడైతే నేను సిద్ధంగా లేను. తననెలా సేవించాలో దేవుడు నాకు చెప్పాలని నేను కోరుకోడం లేదు. నేనెక్కడ నన్ను నేను సమర్పించుకోవాలో అది నా ఇష్టం. అందరూ నన్ను చూచి 'మంచి పని చేశావు' అని నన్ను ప్రశంసించాలని కోరుకుంటాను" అని చెబ్తారా?

పరిచర్యలో నీవొక ప్రముఖవ్యక్తిగా పేరు తెచ్చుకున్నట్లయితే అది వేరే సంగతి. అయితే ఇందుకు భిన్నంగా, కాళ్లు తుడుచుకోడానికి గుమ్మం ముందు వేసే పీచుబట్టలాగా ఉండాలని దేవుడు కోరుకుంటున్నట్లయితే అది మరో సంగతి. "దీనస్థితిలో ఉండ నెరుగుదును ... " (ఫిలిప్పీ 4:12) అని నీవు చెప్పడం దేవుని ఉద్దేశమేమో! దీనత్వంతో నిన్ను నీవు సమర్పించుకోడానికి నీవు సిద్ధమేనా? సముద్రంలో నీటిబొట్టులాగా ఎటువంటి గుర్తింపులేని నిమ్నస్థితిని కోరుకోడానికి నీవు సిద్ధమేనా? ఇతరులు నిన్ను సేవించాలని కోరుకోకుండా, నీవే ఇతరుల్ని సేవించడానికి నీవు సిద్ధమేనా? నీ ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా నిన్ను నీవు సంపూర్ణంగా అర్పించుకోడానికి నీవు సిద్ధమేనా? సేవలో ఉన్న పరిశుద్ధులమని చెప్పుకొనే కొందరు ఇతరుల్ని సేవించలేరు; ఎందుకంటే అటువంటి సేవ తమ స్థాయికి తమ హోదాకు తగదని వారి భావన.



ఫిబ్రవరి 6

## పానార్పణగా పోయబడడానికి నీవు సిద్ధమేనా? (2)

"నేనిప్పుడే పానార్పణముగ పోయబడుచున్నాను ... " (2 తిమోతి 4:6)

పానార్పణగా పోయబడడానికి నీవు సిద్ధమేనా? ఇది నీ మనశ్శక్తికి, నీ మనోసంకల్పానికి సంబంధించిన నిర్ణయమే తప్ప నీ భావోద్వేగాలకు సంబంధించినది కాదు. దేవునికొరకు నిన్ను నీవు అర్పించుకోడానికి నీవు సిద్ధమేనని ఆయనతో చెప్పు. దేవుడు నిన్ను ఏ స్థితిలో ఉంచినప్పటికీ నీవు తీసుకున్న నిర్ణయం తర్వాత వచ్చే పరిణామాల్ని స్వాగతించు; వ్యధ చెందకు, బాధ పడకు. నీవెవరికీ చెప్పుకోలేని, ఏ ఒక్కరూ నీకు సహాయపడలేని సంక్లిష్టమైన పరిస్థితిలో దేవుడు నిన్ను ఉంచవచ్చు. బయటనుంచి చూసేవారికి నీ జీవితం బాగానే ఉన్నట్టు కనిపిస్తుంది; అయితే నీ మనోసంకల్పంలో మార్పు చోటు చేసుకోడం నీవు మాత్రమే గమనించగలవు. ఈ మార్పు నీలో వచ్చినప్పుడు, అది నీ బాహ్యజీవితంమీద ఎప్పుడు ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుందో నీ ఆలోచనకు అందదు. నీ మనస్సును నీవు దేవునియెదుట స్థిరపర్చుకోలేనప్పుడు నీ మీద నీవు జాలిపడడం తప్ప నీవేమీ చేయలేవు.

"ఉత్సవ బలిపశువును త్రాళ్లతో బలిపీఠపు కొమ్ములకు కట్టుడి" (కీర్తనలు 118:27). బలిపీఠంమీద కట్టబడడానికి, అగ్నిచేత దహించబడడానికి నీవు సిద్ధపడాలి; బలిపీఠం దేనికి సంకేతమో దాన్ని అనుభవించడానికి, అంటే పరిశుద్ధపర్చబడడానికి ప్రతిష్ఠించబడడానికి దహించబడడానికి నీవు సిద్ధంగా ఉండాలి. దేవునికి వ్యతిరేకంగా నీలో ఉన్న వాంఛల్ని రాగద్వేషాల్ని సమూలంగా పరిహరించుకోడానికి నీవు సిద్ధపడాలి. ఇది నీవలన కాదు గానీ దేవుడు మాత్రమే చేయగలడు. నీవు చేయవలసిన పని ఉత్సవ బలిపశువులాగా బలిపీఠంమీద నిలబడడం. అయితే, బలిపీఠంమీద నిన్ను దహించే అగ్నిని చూచి నీ మీద నీవే జాలిపడకు. అగ్ని నిన్ను దహించి పరిశుద్ధపర్చిన తర్వాత ఇక ఏదీ నిన్ను బాధపెట్టదు, ఇక ఏదీ నిన్ను క్రుంగజేయదు. ఇక ఎంత పెద్ద సమస్య ఎదురైనప్పటికీ ఏదీ నిన్ను కదల్చదు. నీ ముందు ఎటువంటి అగ్నిపరీక్ష ఉందో నీకు తెలియదు.

పానార్పణగా పోయబడడానికి నీవు సిద్ధమేనని దేవునితో చెప్పు. అప్పుడు దేవుడు నీపట్ల ఏం చేయాలని నీవు కోరుకున్నావో దాన్ని ఆయన తప్పక నీపట్ల నెరవేరుస్తాడు.

ఫిబ్రవరి 7

## అధ్యాత్మిక క్రుంగుదల

"ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించి యుంటిమి; ఇదిగాక యీ సంగతులు జరిగి నేటికి మూడు దినములాయెను." (లూకా 24:21)

శిష్యులు చెప్పిన సంగతులు నిజమే. అయితే ఆ నిజాల ఆధారంగా వారు తీసుకున్న తుదినిర్ణయం మాత్రం సరైనది కాదు. సూచనామాత్రంగానైనా ఆధ్యాత్మిక క్రుంగుదలను లేదా ఆధ్యాత్మిక ఖేదాన్ని వెల్లడిచేయడం ముమ్మాటికీ తప్పే. నాలో నేను క్రుంగి ఉన్నట్లయితే, నన్ను నేను నిందించుకోవాలి తప్ప దేవుణ్ణిగానీ లేక మరెవరినైనా గానీ నిందించడం సరికాదు. క్రుంగుదలకు రెండు కారణాలున్నాయి: నేను ఇంద్రియవాంఛను తృప్తిపర్చుకొనైనా ఉండాలి, లేదా ఇంద్రియవాంఛను తృప్తిపర్చుకోలేకనైనా ఉండాలి. ఏ విషయంలోనైనా పర్యవసానం ఖేదమే. ఇంద్రియవాంఛ అంటే 'ఎలాగైనా సరే ఒకసారైనా అనుభవించాలి' అనే కోరిక. ఆధ్యాత్మికవాంఛ జవాబిచ్చే దేవుణ్ణి కోరుకోదు గానీ, దేవునివద్దనుండి జవాబు రావాలని కోరుకుంటుంది. దేవుడు ఏం చేయాలని నేను ఎదురుచూస్తున్నాను? ఆయనేం చేయాలని నేను కోరుకుంటున్నాను? నేను కోరుకున్న విధంగా జరగక ఇది మూడవ రోజు. కాబట్టి నేను ఆధ్యాత్మికంగా క్రుంగిపోయి దేవుణ్ణి నిందించడం సమర్థనీయమేనా? దేవుడు మన ప్రార్థనకు జవాబివ్వాలని మనం పట్టుబట్టిన ప్రతి సారీ మనం దారితప్పి నడుస్తున్నట్టు లెక్క. ప్రార్థన దేవునికొరకు గానీ జవాబుకొరకు కాదు. భౌతికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు కృశించిపోవడం అసాధ్యం కదా. ఎందుకంటే కృశించిపోవడం అనారోగ్యానికి సూచన. ఆధ్యాత్మిక విషయాల్లో కూడా అంతే. ఆధ్యాత్మిక క్రుంగుదల సరైనది కాదు. ఇందుకు మనల్ని మనమే నిందించుకోవాలి.

పరలోకంనుండి వచ్చే దర్శనాలద్వారా, మరియు భూమి దద్దరిల్లిపోయే సంఘటనల ద్వారా దేవుని శక్తి వెల్లడవ్వాలని ఎదురుచూస్తుంటాం. మన ఆధ్యాత్మిక క్రుంగుదల ఇందుకు నిదర్శనం. అయితే మనం గుర్తించని విషయం ఒకటుంది. దేవుడు మన దైనందిన జీవితంలోని అన్ని సంఘటనల్లోను మన చుట్టూ ఉన్నవారి ద్వారా తన కార్యాలు జరిగిస్తూనే ఉన్నాడు. అయితే మనమాయనకు విధేయులమై ఆయన మనకప్పగించిన కార్యాన్ని చేసినప్పుడు మాత్రమే మనమాయణ్ణి చూడగలం. మన అనుదిన జీవితంలోని నిత్యకృత్యాల్లో కూడా మనం యేసుక్రీస్తును చూడగలమని గుర్తించినప్పుడు మాత్రమే దేవుని అద్భుత ప్రత్యక్షతలను ప్రతి రోజూ చూడగలం.

ఫిబ్రవరి 8

## పరిశుద్ధత మూల్యం

"సమాధానకర్తయగు దేవుడే మిమ్మును సంపూర్ణముగా పరిశుద్ధపరచునుగాక ... "
(1 థెస్స 5:23)

మనల్ని ప్రతిష్ఠించుకోమని మనం దేవుణ్ణి ప్రార్థించినప్పుడు, ఆ మాటలకున్న అర్థాన్ని తెలుసుకోడానికి మనమెప్పుడైనా ప్రయత్నించామా? "ప్రతిష్ఠించబడడం" అనే పదాన్ని మనం చాలా తేలికగా తీసుకుంటున్నాం. ప్రతిష్ఠకు మూల్యం చెల్లించడానికి మనం సిద్ధమేనా? ఇహలోకంలో మన ప్రాధాన్యతలన్నిటినీ హద్దుమీరకుండా చూడడం, మరియు దేవునికి ప్రాధాన్యతనివ్వడమే మనం చెల్లించే మూల్యం. ప్రతిష్ఠించబడడమంటే దేవుని తలంపులమీద ఆయన దృక్పథంమీద మన దృష్టిని కేంద్రీకరించడమని అర్థం. మన యావత్‌శక్తిని అంటే మన దేహాన్ని మన మనస్సును మన ఆత్మను దేవుని ఉద్దేశాలకొరకే ప్రత్యేకించడమని అర్థం. దేవుడు ఏ ఉద్దేశంతో మనల్ని ప్రత్యేకపర్చి ప్రతిష్ఠించాడో ఆ ఉద్దేశాన్ని ఆయన మనద్వారా జరిగించడానికి ఆయనకొరకు మనం సిద్ధమేనా? ఆయన మనద్వారా తన ఉద్దేశాన్ని జరిగించిన తర్వాత, మనమాయనకొరకు మాత్రమే మనల్ని మనం అంకితం చేసుకోడానికి మనం సిద్ధమేనా? "వారికొరకై నన్ను ప్రతిష్ఠ చేసికొనుచున్నాను" (యోహాను 17:19) అని యేసు చెప్పిన విధంగా నిన్ను నీవు అంకితం చేసుకోడానికి సిద్ధమేనా? మనలో కొందరు దేవునికొరకు అంకితంచేసుకోడమనే అనుభవంలోకి ప్రవేశించలేకపోడానికి కారణం ప్రతిష్ఠించబడడంగురించి దేవుని దృక్పథాన్ని సరిగా అర్థం చేసుకోకపోడం మాత్రమే. ప్రతిష్ఠించబడడమంటే యేసుకు ఎటువంటి స్వభావం వుందో మనం అటువంటి స్వభావంతో యేసుతో ఏకమై ఉండడం. మూల్యం చెల్లించడానికి మనం నిజంగా సిద్ధంగా ఉన్నామా? దేవునికి సంబంధించని ప్రతిదాన్నీ బేషరతుగా వదులుకోడానికి సిద్ధమేనా?

ఈ వచనంలో కనిపించే పౌలు ప్రార్థనతో సంపూర్ణంగా ఏకీభవించడానికి మనం సిద్ధంగా ఉన్నామా? "ప్రభువా, నీ కృపచేత రక్షించబడిన పాపిని. నీ తలంపుల ప్రకారం నన్ను పరిశుద్ధపర్చుము" అని ప్రార్థించడానికి సిద్ధంగా ఉన్నామా? యేసు తన తండ్రితో ఏకమై ఉన్నట్టుగా మనమాయనతో ఏకమై ఉండాలని యేసు మనకొరకు ప్రార్థించాడు (యోహాను 17:21-23). ఒక వ్యక్తి జీవితంలో పరిశుద్ధాత్మకు అవిచ్ఛిన్న నిదర్శనం ఆ వ్యక్తి యేసు క్రీస్తుతో సారూప్యత కలిగి ఉండడం, మరియు ఆయనతో సారూప్యంలేని వాటన్నిటికీ దూరంగా ఉండడం మాత్రమే. మనలో పరిశుద్ధాత్మ పరిచర్య జరగడానికి మనల్ని మనం ప్రతిష్ఠించుకోడానికి ఇప్పుడు సిద్ధంగా ఉన్నామా?

ఫిబ్రవరి 9

## నీవు ఆధ్యాత్మికంగా అలసట చెందావా?

"నిత్యుడగు దేవుడు ... సొమ్మసిల్లడు అలయడు" (యెషయా 40:28)

మన శరీరంలోని సత్తువ పూర్తిగా వాడబడినప్పుడు శరీరానికి అలసట కలుగుతుంది. ఆధ్యాత్మిక అలసటకు కారణం పాపం కాదు. మీదుమిక్కిలి సేవ మాత్రమే ఆధ్యాత్మిక అలసటకు కారణం. నీవు అలసట చెందడం లేదా చెందకపోవడమనేది నీ సత్తువకు ఆధారమైన మూలస్థానంమీద నిలిచి ఉంది. "నా గొఱ్ఱెలను మేపుము" (యోహాను 21:18) అని యేసు పేతురుతో చెప్పాడు. అయితే యేసు పేతురుకు గొర్రెలమేతను ఇవ్వలేదు. నీవు ఒక రొట్టెగా విరవబడడమంటే లేదా నీవు ద్రాక్షారసంగా పోయబడడమంటే ఇతరులకు నీవు ఆధ్యాత్మిక ఆహారంగా ఉండాలని అర్థం; ఇతరులు తమకు తాముగా దేవునినుండి ఆధ్యాత్మిక ఆహారాన్ని పొందేవరకు నీవు వారికి ఆధ్యాత్మిక పోషణ నివ్వాలని అర్థం. ఆధ్యాత్మికపోషణ కొరకు నీమీద ఆధారపడినవారు నీ సత్తువనంతా వాడుకుంటారు కాబట్టి నీకు అలసట కలుగుతుంది. అయితే నీకు కావలసిన ఆధ్యాత్మిక సత్తువను ఎప్పటికప్పుడు భర్తీ చేసుకోవడం మర్చిపోవద్దు. ఎందుకంటే నీవు సత్తువ కోల్పోయినప్పుడు నీకు అలసట కలుగుతుంది. ఇతరులు తమకు తాముగా యేసు క్రీస్తునుండి జీవాన్ని పొందేవరకు వారు నీనుండి ఆయన జీవాన్ని పొందుతారు. వారు తమకు తాముగా దేవునినుండి ఆధ్యాత్మిక పోషణ పొందేవరకు అక్షరాలా నీవే వారికి సత్తువనిచ్చే ఆధారమన్నమాట. దేవుని ప్రజలమైన మనకు, అంటే గొర్రెలు మరియు గొర్రెపిల్లలమైన మనకు ఆయనే మంచి కాపరి.

నీవు చేస్తున్న సేవలో నీవెప్పుడైనా ఆధ్యాత్మిక అలసటకు గురయ్యావా? నీవు అలసటకు గురైనట్లయితే నీ ఆశల్ని నీ ఉద్వేగాల్ని పునరుజ్జీవంపజేసి అవి పునఃప్రకాశించేలా చేసుకో. నీవు ఎందుకు సేవ చేయాలనుకుంటున్నావో ఆత్మపరిశీలన చేసుకో. నీ స్వంతబుద్ధిని నీ సేవకు మూలాధారంగా చేసుకున్నావా? లేక యేసు క్రీస్తు విమోచన నీ సేవకు మూలాధారమా? నీలో ఉన్న ప్రేమకు మరియు ఉద్వేగానికి మూలాధారమేది? నీవు ఏ మూలాధారాన్నుంచి శక్తిని పొందుతున్నావు? "ప్రభువా, నేను అలసిపోయాను" అని ప్రాధేయపడడం తప్ప ఫిర్యాదు చేసే హక్కు నీకు లేదు. నీవు ఆధ్యాత్మికంగా పూర్తిగా వాడబడేలాగా దేవుడు నిన్ను రక్షించి తనకొరకు ప్రతిష్ఠించుకున్నాడు. నీవు దేవునికొరకు పూర్తిగా వాడబడాలి; ఎంత పూర్తిగానంటే నీవు ఆధ్యాత్మికంగా అలసిపోయేంత. అయితే ఒక విషయం జ్ఞప్తికి తెచ్చుకో: ఆయన నీకు శక్తినిచ్చే మూలాధారం. "మా ఊటలన్నియు నీయందే యున్నవని వారందురు" (కీర్తనలు 87:7).

ఫిబ్రవరి 10

## దేవుణ్ణి చూడలేని అంధుడవా?

"మీ కన్నులు పైకెత్తి చూడుడి వీటిని ఎవడు సృజించెను?" (యెషయా 40:26)

యెషయా కాలంనాటి ప్రజలు విగ్రహాలవైపు చూశారు కాబట్టి వారు తమ మనోనేత్రాలతో దేవుణ్ణి చూడలేకపోయారు. అయితే వారు తమ కళ్లు పైకి ఎత్తి ఆకాశంవైపు చూడాలని యెషయా చెప్పాడు. అంటే వారు తమ ఆలోచనాశక్తి నుపయోగించి ఏది సత్యమైనదో చూడాలని యెషయా భావన. మనం దేవుని పిల్లలమైనట్లయితే ఆయన సృజించిన ప్రకృతి మంచిదని మరియు స్వచ్ఛమైనదని తెలుసుకుంటాం. మూసుకుపోయన మన మనోనేత్రాల్ని మనం తెరచి చూడగలిగినప్పుడు మాత్రమే వీచే గాలిలో, ఉషోదయంలో, సూర్యాస్తమయంలో, నీలిమేఘాల్లో, వికసించే ప్రతి కుసుమంలో, నేలకు రాలే ప్రతి ఆకులో దేవుడు మనకు సమీపంగా ఉన్నట్టు చూడగలం.

ఆధ్యాత్మిక దృష్టికి అసలు పరీక్ష మన మనస్సును మన ఆలోచనల్ని నియంత్రించుకోడంలో ఉంది. నీ మనస్సును విగ్రహంమీద నిలుపుతున్నావా? ఆ విగ్రహం నీవేనా? లేదా, నీవు చేస్తున్న ఉద్యోగమా? లేదా, ఆ విగ్రహం సేవకుడు ఇలా ఉండాలని నీ మనస్సులో సేవకునికి నీవు చేసుకున్న రూపకల్పనా? లేక రక్షణగురించి ప్రతిష్ఠించబడడం గురించి విగ్రహసమానమైన అనుభవాలు నీకున్నాయా? ఇవన్నీ నీలో ఉన్నట్లయితే అంధత్వంతో ఉన్న నీ మనోనేత్రాలతో దేవుణ్ణి చూడలేకపోతున్నావని అర్థం. అంటే సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కొనే శక్తి నీలో లోపించి నీవు చీకటిలో వెతుక్కుంటూ ఉంటావని అర్థం. నీలో ఆధ్యాత్మిక అంధత్వం ఉన్నట్లయితే నీ స్వంత అనుభవాలవైపు చూడక, దేవునివైపు మాత్రమే చూడు. నీకు కావలసినది దేవుడు మాత్రమే. నీ ఆలోచనలకు అంధత్వం కలిగించే నీ స్వంత తెలివితేటలనుండి, నీవు రూపకల్పన చేసుకున్న విగ్రహాలనుండి దూరంగా జరుగు. నీవు మేలుకొని, యెషయా తన ప్రజలతో పలికిన పరిహాసపు పలుకులను స్వీకరించి, యుక్తాయుక్త వివేచనతో నీ దృష్టిని నీ మనస్సును నీ ఆలోచనల్ని దేవునివైపు మళ్లించు.

మనం స్పష్టమైన మానసికదృష్టిని ప్రత్యక్షీకరించుకోలేకపోవడం మన ప్రార్థన నిష్ఫలం కావడానికి కొక కారణం. వివేచనతో దేవునియెదుట మనల్ని మనం ప్రత్యక్ష పర్చుకోవాలని కనీసం ఊహించనైనా ఊహించం. దేవునియెదుట విజ్ఞాపనలో నిన్ను నీవు విరిగిన రొట్టెగా పోయబడిన ద్రాక్షారసంగా మలచుకో. అప్పుడు దేవుడు నీ అంధత్వాన్ని తొలగించి నీ మనోనేత్రాలకు దృష్టినిస్తాడు. దేవుడిచ్చిన దృష్టితో నీవు మునుపెన్నడూ లేనట్టుగా నీ సంబంధబాంధవ్యాల్ని పటిష్టపర్చుకోగలవు.



ఫిబ్రవరి 11

## నీ మనస్సు దేవునిమీద నిమగ్నమై వుందా?

"ఎవనిమనస్సు నీమీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతిగలవానిగా కాపాడుదువు." (యెషయా 26:3)

నీ మనస్సు దేవునిమీద నిమగ్నమై ఉందా? లేక, ఆధ్యాత్మిక ఆకలితో అలమటిస్తున్నావా? మానసిక దారిద్ర్యానికి కారణం నిర్లక్ష్యం. సేవకుని జీవితంలో ఆధ్యాత్మిక అలసటకు, ఆధ్యాత్మిక బలహీనతకు ఇదొక ముఖ్యకారణం. నిన్ను నీవు దేవునియెదుట ప్రత్యక్షపర్చుకోడానికి నీ మనస్సును సిద్ధపర్చుకోనట్లయితే నీవిప్పుడే నిన్ను నీవు దేవునియెదుట ప్రత్యక్షపర్చుకో. దేవుడు నీ దగ్గరకు రావాలని ఎదురుచూడడానికి హేతువు లేదు. నీ ఆలోచనల్ని నీ నేత్రాల్ని విగ్రహాలనుండి మళ్లించి దేవునివైపు చూచి నీ రక్షణ కొనసాగించు (యెషయా 45:22 చూడండి).

దేవుడు నీలో ఉంచిన అత్యంత ఘనమైన ఈవి నీ మనస్సే కాబట్టి నీ మనస్సును పూర్తిగా ఆయనమీద కేంద్రీకరించు. "ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి ... " (2 కొరింథీ 10:5) అని పౌలు చెప్పినట్లుగా నీ ఆలోచనల్ని క్రీస్తుకు లోపర్చు. నీ మనస్సు దేవునిమీద పూర్తిగా నిమగ్నమై ఉన్నప్పుడు శోధన సమయంలో నీ విశ్వాసమే నీకు బలాన్నిస్తుంది; ఇందుకు కారణం నీ విశ్వాసం మరియు దేవుని ఆత్మ ఏకమై ఉండడమే. నీ ఆలోచనలు తలంపులు దేవుణ్ణి ఘనపర్చేవిగా ఉన్నప్పుడు ఆయన కృత్యాలగురించి ఆలోచన చేస్తావు. ఉదయకాలపు ఉషోదయం, సాయంకాలపు సూర్యాస్తమయం, ప్రకాశించే చంద్రుడు, మిలమిల మెరిసే నక్షత్రాలు, క్రమం ప్రకారం వచ్చే రుతువులు, సృష్టిలో ప్రతిదీ దేవుణ్ణి ఘనపర్చేవే. నీ మనస్సులోని ఆలోచనలు దేవునినుండి కలుగుతున్నాయని అప్పుడు నీవు గుర్తించగలవు. ఇక నీ ఆలోచనలెన్నడూ క్షణభంగురమైన ప్రేరణలకు గురి కాక, దేవుని సేవమీద కేంద్రీకృతమౌతాయి.

"మా పితరులవలెనే మేము పాపము చేసితిమి ... నీ కృపాబాహుళ్యమును జ్ఞాపకమునకు తెచ్చుకొనక యుండిరి." (కీర్తన 106:6,7) నీ మనస్సును తట్టి లేపు; వెంటనే మేలుకో. "దేవుడు నాతో ఇప్పుడు మాట్లాడడం లేదు కదా" అనే సాకు చెప్పవద్దు. ఆయన మాట్లాడాలి; మాట్లాడతాడు. అయితే ముందుగా నీవెవరివో జ్ఞాపకం చేసుకో; నీవెవరిని సేవిస్తున్నావో జ్ఞాపకం చేసుకో. నీకు నీవే స్ఫూర్తి తెచ్చుకో. అప్పుడు దేవునిగురించి నీవు పది రెట్లు ఎక్కువగా ఉద్వేగం చెందగలవు. ఇక నీ మనస్సెన్నడూ ఆధ్యాత్మికంగా అలమటించదు. నూతన చైతన్యంతో, పెల్లుబికే ఉత్సాహంతో నీ నిరీక్షణ వర్ణించనలవికాని తేజస్సుతో ప్రకాశిస్తుంది.

ఫిబ్రవరి 12

## నీవు దేవుని మాటల్ని వింటున్నావా?

"నీవు మాతో మాటలాడుము మేము విందుము; దేవుడు మాతో మాటలాడినయెడల మేము చనిపోవుదుము" (నిర్గమ 20:19)

మనం దేవునిపట్ల అవిధేయత చూపేటప్పుడు ముందువెనకలు ఆలోచించి అవిధేయత చూపం; మనమాయన మాటల్ని వినక అవిధేయత చూపుతాం. దేవుడు మనకు ఆజ్ఞలనిచ్చాడు; అయితే మనం వాటిని ఖాతరు చేయడంలేదు. ఇందుకు ఉద్దేశపూర్వకమైన అవిధేయత కారణం కాదు గానీ మనం దేవుణ్ణి యథార్థహృదయంతో ఆయణ్ణి ప్రేమించకపోడం, ఆయనపట్ల భయభక్తులు లేకపోడం మాత్రమే కారణం. "మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15) అని ప్రభువైన యేసు చెప్పాడు. మనం నిరంతరం దేవునిపట్ల అవిధేయత చూపుతున్నామని మనం గుర్తించినప్పుడు ఆయనపట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించి నందుకు సిగ్గుపడతాము.

"నీవు మాతో మాటలాడుము ... దేవుడు మాతో మాటలాడినయెడల ... " - మనంతట మనం దేవుని మాటలు వినడానికి బదులు ఆయన సేవకులద్వారా ఆయన మాటలు వినడానికి మాత్రమే ఇష్టపడినప్పుడు ఆయనపట్ల నిరాదరణ చూపుతున్నట్లే గదా! ఇతరుల సాక్ష్యాల్ని వినడానికి ఆసక్తి చూపిస్తుంటాం గానీ దేవుడే మనతో మాట్లాడాలని ఆసక్తి చూపించం. దేవుడు మనతో మాట్లాడతాడంటే ఎందుకంత భయం? ఎందుకంటే దేవుడు మనతో మాట్లాడినప్పుడు ఆయన చెప్పిన పని చేయాలి లేదా నేను చేయలేనని ఆయనతో చెప్పాలి కాబట్టి. దేవుని సేవకుల్లో ఎవరో ఒకరు మనతో మాట్లాడినట్లయితే వారి మాటలపట్ల మనకిష్టమైతే విధేయత చూపుతాం, ఇష్టం లేకపోతే విధేయత చూపం. ఎందుకంటే వీరి విషయంలో విధేయత ఆజ్ఞాపూర్వకమైనది కాదని, విధేయత ఐచ్ఛికమని మనం భావించడమే కారణం. "మంచిది, మీరు మీ స్వంత ఆలోచనల్ని చెబుతున్నారు. బహుశా మీరు చెబుతున్నది దేవుని సత్యమే కావచ్చు" అని జవాబిస్తాం.

దేవుడు నన్ను ప్రేమిస్తూ సదా నన్ను తన బిడ్డగా చూస్తుంటే నేనాయణ్ణి నిర్లక్ష్యం చేస్తూ ఆయణ్ణి అవమానపరుస్తున్నానా? చివరికి నేను దేవుని మాటల్ని వినినప్పుడు అంతవరకు నేను ఆయనకు చేసిన అవమానం తిరిగి నాదవుతుంది. అప్పుడు నేను "ప్రభువా, నేనెందుకింత మొద్దుబారి ఉన్నాను? ఎందుకింత మూర్ఖత్వంతో ఉన్నాను?" అని స్పందించడం తప్ప ఏం చేయగలను? మనం దేవుని మాటల్ని వినినప్పుడు మనలో వచ్చే పరిణామమిదే. దేవుని మాటల్ని వినకపోయినందుకు సిగ్గుతో అవమానాన్ని పొందిన మనం, ఒకసారి దేవుని మాటల్ని వినడం ప్రారంభించిన తర్వాత మనలో ఉన్న సిగ్గు అవమానభారం తొలగిపోతాయి; అప్పుడు మనం దేవునిలో నిజమైన ఆనందాన్ని స్వంతం చేసుకుంటాం.

ఫిబ్రవరి 13

## వినడంపట్ల భక్తిశ్రద్ధలు

“సమూయేలు -నీ దాసుడు ఆలకించుచున్నాడు ఆజ్ఞ యిమ్మనెను.”
(1 సమూయేలు 3:10)

దేవుడు నాతో మాట్లాడినప్పుడు ఒకసారి నేను ఏకాగ్రతతో స్థిరబుద్ధితో వినినంత మాత్రంచేత ఆయన నాతో మాట్లాడిన ప్రతి సారీ ఆయన చెప్పినవన్నీ అదే ఏకాగ్రతతో అదే స్థిరబుద్ధితో వినగలుగుతున్నానని కాదు! మొద్దుబారిన నా హృదయంతో, మూర్ఖతనిండిన నా మనస్సుతో నేను దేవునిపట్ల ప్రేమరాహిత్యాన్ని నిర్లక్ష్యాన్ని చూపుతున్నానేమో! నేను నా స్నేహితులను ప్రేమిస్తున్నట్లయితే నాదగ్గరనుండి వారేం కోరుకుంటున్నారో నాలో కలిగే ప్రేరణద్వారా అర్థం చేసుకోగలను. “నేను మీ కాజ్ఞాపించువాటిని చేసినయెడల, మీరు నా స్నేహితులై యుందురు” (యోహాను 15:14) అని యేసు చెప్పాడు. ఈ వారంలో నేను నా ప్రభువు ఆజ్ఞల్లో దేనిపట్లనైనా అవిధేయత చూపించానా? అది ప్రభువిచ్చిన ఆజ్ఞ అని నాకు తెలిసినట్లయితే నేను అనాలోచితంగా అవిధేయత చూపకపోదును. అయితే మనలో అనేకులు దేవుని మాటల్ని వినడానికే ఇష్టపడరు. ఇది మనకు నమ్మశక్యం కాకపోయినప్పటికీ మనం దేవునిపట్ల తిరస్కారం చూపుతున్నామనేది వాస్తవం.

యేసు క్రీస్తుతో అన్యోన్యత నా ఆధ్యాత్మిక జీవితానికి లక్ష్య మైనట్లయితే నేను దేవుని మాటల్ని వినడానికి సదా సిద్ధంగా ఉంటాను; దేవుడెప్పుడూ నా మాటల్ని వింటాడని గ్రహిస్తాను (యోహాను 11:41 చూడండి). నేను యేసు క్రీస్తుతో ఏకమై ఉన్నట్లయితే దేవుని మాటలు వినడంపట్ల నేనెల్లప్పుడూ భక్తిశ్రద్ధలు చూపిస్తాను. దేవుని సేవకుడెవరైనా నాకు దేవుని సందేశాన్నందిస్తాడు; లేదా ఒక పుష్పంలోనో లేదా ఒక వృక్షంలోనో నేను దేవుని సందేశాన్ని చూడగలను. దేవుని సందేశాన్ని వినకుండా నన్ను ఆటంకపర్చేది అన్యవిషయాలపట్ల నాలో ఉన్న వ్యామోహమే. దేవుని మాటల్ని వినకూడదని నేను తలంచడం కాదు గానీ నా జీవితంలో ఏవి యోగ్య మైనవో వాటిపట్ల నేను శ్రద్ధాసక్తులు చూపించకపోవడమే కారణం. దేవుడు నాతో ఏం చెప్పాలనుకుంటున్నాడో వాటిగురించి ఆయన నాతో మాట్లాడాలని నేను ఆలోచన చేస్తుండవచ్చు; అయితే ఆయన మాటల్ని వినాలని కోరుకోడం లేదు. “నీ దాసుడు వింటున్నాడు, ఆజ్ఞ ఇవ్వు” అనే భావనే ఎల్లప్పుడూ దేవునిబిడ్డ మనోవైఖరి కావాలి. నేను దేవుని మాటల్ని వినడంపట్ల ఇటువంటి భక్తిశ్రద్ధల్ని అలవర్చుకొని పెంపొందించుకోకపోతే దేవుని స్వరాన్ని అప్పుడప్పుడు మాత్రమే వినగలను. మిగిలిన సందర్భాల్లో నా మనస్సు అప్రధానమైనవాటిపై లగ్న మై అవే నా సర్వస్వమని భావిస్తూ నేను దేవుని స్వరాన్ని వినలేని బధిరుడనౌతాను. ఇది దేవునిబిడ్డకు తగిన జీవితం కాదు. దేవుని స్వరాన్ని నేడు విన్నావా?

ఫిబ్రవరి 14

## వినడంలో క్రమశిక్షణ

"చీకటిలో నేను మీతో చెప్పునది మీరు వెలుగులో చెప్పుడి; చెవిలో మీకు చెప్పబడినది మేడలమీద ప్రకటించుడి." (మత్తయి 10:27)

మనం దేవుని మాటల్ని వినడానికి ఆ మాటలకు విధేయత చూపడానికి ఆయన మనల్ని కొన్ని సార్లు చీకటి అనుభవాలద్వారా నడిపించవచ్చు. "చీకటిలో నేను మీతో చెప్పునది మీరు వెలుగులో చెప్పుడి ... " - దేవుడు నిన్ను చీకటి అనుభవంలో నడిపిస్తున్నప్పుడు ఆయన మాటల్ని శ్రద్ధగా విను; మౌనంగా ఉండు. మనం దేవుని మాటల్ని వినేవరకు ఆయన మనల్ని తన చేతినీడలో దాస్తాడు - "తన చేతి నీడలో నన్ను దాచియున్నాడు" (యెషయా 49:2). పక్షులు వేకువజామునే కిలకిలారావాలు ఆలపిస్తాయి. నీవిప్పుడున్న పరిస్థితులు చీకటిగా ఉన్నాయా? దేవునితో నీ జీవితం మసకబారి ఉందా? అయినట్లయితే శాంతం వహించు. నీవు చీకటిలో ఉండి మాట్లాడడం సరికాదు. చీకటి సమయం వినే సమయం. ఈ అనుభవాల గురించి నీవితరులతో చెప్పవద్దు. నీకు ఈ పరిస్థితులెందుకు వచ్చాయో కారణాలు తెలుసుకొనేందుకు ఏ పుస్తకాలూ చదవనక్కర్లేదు. నీవు కేవలం దేవుని మాటలు విని ఆయనకు విధేయత చూపితే సరిపోతుంది. నీవితరులతో మాట్లాడుతున్నట్లయితే దేవుని మాటల్ని వినలేవు. నీవు చీకటిలో ఒంటరిగా ఉన్న సమయంలో నీవు దేవుని మాటల్ని వినడానికి సిద్ధపడినట్లయితే నీవొక ప్రశస్తమైన సందేశాన్ని వినగలవు. అది నీకు, ఇతరులకు కూడా మేలు కలిగిస్తుంది.

చీకటి తర్వాత వెలుగు వచ్చినట్టుగా మన జీవితంలో కూడా ప్రతి చీకటి సమయం తర్వాత సంతోషం మరియు దైన్యం మిళితమైన అనుభవం నీ స్వంతమౌతుంది. కేవలం సంతోషమే మన అనుభవమైనట్లయితే మనం నిజంగా దేవుని మాటల్ని విన్నామా అనే సందేహం కలుగుతుంది. దేవుని మాటలు వినినందువల్ల మనకు సంతోషం కలుగుతుంది; అయితే ఆయన మాటలు వినడానికి చాలా కాలం పట్టినందుకు మనలో దైన్యం చోటుచేసుకుంటుంది. "దేవుడు నాతో చెబుతున్న మాటలు వినడంలో నేనెంత మందబుద్ధిని ప్రదర్శించాను" అనే ఆశ్చర్యార్థకభావం అప్పుడు మనలో కలగక తప్పదు. అయినా దేవుడు మనతో రోజుల తరబడి, వారాల తరబడి మనతో మాట్లాడుతూనే ఉంటాడు. అయితే మనం దేవుని మాటల్ని వినడానికి మనం సిద్ధపడినప్పుడు ఆయన మనకు అణకువ గుణాన్నిస్తాడు. ఈ సుగుణం మన హృదయాల్ని మెత్తనచేస్తుంది. మృదువుచేయబడిన హృదయంతోనే మనం దేవుని మాటల్ని మరెక్కువగా వినగలం.

ఫిబ్రవరి 15

## "నా తమ్మునికి నేను కావలివాడనా ... ?"

"మనలో ఎవడును తన కోసమే బ్రదుకడు ... " (రోమా 14:7)

"క్రీస్తుయేసునందు మనలను ఆయనతోకూడ లేపి, పరలోకమందు ఆయనతోకూడ కూర్చుండబెట్టెను" (ఎఫెసీ 2:7). ఆధ్యాత్మిక విషయాల్లో నీకు దేవునియెదుట ఇతరులగురించి బాధ్యత ఉందనే ఆలోచన నీకెప్పుడైనా స్ఫురించిందా? ఉదాహరణకు, నా ఆంతరంగిక జీవితంలో నేను దేవునినుండి వైదొలగినట్లయితే నా చుట్టూ ఉన్నవారు కూడా వేదనకు గురవుతారు. "ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవములన్నియు దానితోకూడ శ్రమపడును ..." (1 కొరింథీ 12:26). నీ శరీరం స్వార్థాన్ని, నీ మనస్సు నిర్లక్ష్యాన్ని, నీ ఆత్మ జడత్వాన్ని కోరుకుంటుంటే నీతో సంబంధబాంధవ్యాలున్న వారందరూ బాధపడవలసి వస్తుంది. "అంత ఉన్నతంగా జీవించడం నావలన అయ్యే పనేనా" అని చెబ్తావేమో! "మావలన ఏదైన అయినట్లుగా ఆలోచించుటకు మాయంతట మేమే సమర్థులమని కాదు; మా సామర్థ్యము దేవునివలననే కలిగియున్నది" (2 కొరింథీ 3:5) అని నీవు చెబ్తావేమో!

"నాకు సాక్షులైయుందురని ...." (అ.కా. 1:8) - ఈ వచనం చదివారా? యేసు క్రీస్తుకొరకు సర్వస్వాన్నీ ధారపోయడానికి, అంటే శారీరకబలాన్ని మానసిక శక్తిసామర్థ్యాల్ని ఆధ్యాత్మికబలాన్ని అర్పించడానికి మనలో ఎంతమంది సిద్ధంగా ఉన్నారు? "సాక్షులై" ఉండడమంటే దేవుని దృష్టిలో ఇదే. ఇందుకు మనకు చాలా కాలం పడ్తుంది. అయితే నీ మట్టుకు నీవు ఓపిక వహించు. దేవుడెందుకు మనల్ని భూమ్మీద ఉంచాడు? కేవలం నీ మట్టుకు నీవు రక్షణ పొందడానికేనా? నీ మట్టుకు నీవు దేవునికొరకు ప్రతిష్ఠితుడవయ్యేందుకేనా? కానే కాదు. ఆయన సేవకొరకే నీవు రక్షించబడ్డావు, ప్రతిష్ఠించబడ్డావు. నేనాయనకొరకు రొట్టెగా విరవబడడానికి ద్రాక్షారసంగా పోయబడడానికి సిద్ధంగా ఉన్నానా? నన్ను నేను అల్పమైనవాడిగా ఎంచుకోడానికి సిద్ధంగా ఉన్నానా? ప్రభువైన యేసు తప్ప నా జీవితంలో మరో ప్రాధాన్యత లేదని చెప్పగలనా? దేవుడు నాకనుగ్రహించిన మహాద్భుత రక్షణకొరకు నేను "కృతజ్ఞత" తెలిపే మార్గం ఆయన సేవ చేయడమే. ఆయన సేవకు మనం మనఃపూర్వకంగా ముందుకు రాకపోతే ఆయన మనల్ని ప్రక్కన పెట్టేస్తాడేమో! మనం పనికిరాని తీగలుగా ఉంటే ఆయన మనల్ని కత్తిరించి వేస్తాడేమో! "ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో ..." (1 కొరింథీ 9:27).

ఫిబ్రవరి 16

## ఆధ్యాత్మిక అంకురార్పణకు ప్రేరణ

"మృతులలోనుండి లెమ్ము ... " (ఎఫెసీ 5:14)

అంకురార్పణలన్నీ కాదు గానీ, తొలి అడుగు వేయడానికి సంసిద్ధత చూపడం మాత్రమే దేవునివలన ప్రేరణపొందిన ప్రారంభం. "లేచి, బయలుదేరు" అని మీతో ఎవరైనా చెప్పవచ్చు. అయితే మీరు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఏది జరగాలని ఉంటే అదే జరుగుతుంది అన్నట్టు నిర్లిప్తత చూపడం మామూలే. మానవ ప్రేరణలకు పర్యవసానం ఇలాగే ఉంటుంది. అయితే దేవుని ఆత్మ మనతో "లేచి, బయలుదేరు" అని చెప్పినప్పుడు మనలో అనూహ్యమైన ప్రేరణ కలుగుతుంది.

యౌవనప్రాయంలో మనకు అనేక విషయాలగురించి కలలు కోరికలుంటాయి. అయితే వాటిని సాకారం చేసుకొనే శక్తి మనకు లేదని కొద్దికాలానికే మనం గ్రహిస్తాం. మనం చేయాలనుకున్న పనులు మనం చేయలేం కాబట్టి మన కలలు కోరికలు మృతతుల్యమయ్యాయని మనం భావిస్తుంటాం. అయితే దేవుడు మనతో "లేచి, బయలుదేరు" అని చెప్పినప్పుడు ఆయనే మనకు ప్రేరణగా ఉంటాడు. అప్పుడు మనం "మృతులలోనుండి లేచి" నట్టుగా అద్భుతశక్తితో మనం చేయాలనుకున్న పనులన్నీ చేయగలం. మనం "లేచి, బయలుదేరిన" తర్వాత మాత్రమే మనం ఆధ్యాత్మిక ప్రేరణ పొందడం గమనార్హం. దేవుడు అన్నిటినీ అధిగమించే శక్తిని మనకు ముందుగానే ఇవ్వడు గానీ, మనం లేచి బయలుదేరి నప్పుడు మాత్రమే ఆయన మనకు అడ్డుల్ని అధిగమించే శక్తి నిస్తాడు. దేవుడు మనతో "లేచి, బయలుదేరు" అని చెప్పినప్పుడు మనంతట మనమే లేవాలి తప్ప దేవుడు మనల్ని పైకి లేపడు. ఊచచెయ్యి ఉన్న వ్యక్తితో మన ప్రభువు "నీ చెయ్యి చాపుము" (మత్తయి 12:13) అని చెప్పాడు. ఆ వ్యక్తి తన చెయ్యి చాపిన వెంటనే అతని చేతికి స్వస్థత చేకూరింది. అయితే తొలి ప్రయత్నం మాత్రం ఆ వ్యక్తిదే. మనం కూడా అడ్డుల్ని అధిగమించడానికి తొలి ప్రయత్నం చేసినప్పుడు దేవుడు మనకు ప్రేరణనిస్తున్నాడని గ్రహించగలం. ఎందుకంటే ఆయన వెంటనే మనకు జీవాన్ని మరియు శక్తిని ఇస్తాడు.

ఫిబ్రవరి 17

## అధైర్యాన్నధిగమించేందుకు ప్రేరణ పొందడం

"నీవు లేచి భోజనము చేయుమని చెప్పెను." (1 రాజులు 19:5)

ఈ వాక్యభాగంలో దేవదూత ఏలీయాకు దర్శనాన్నివ్వలేదు, లేదా అతనికి దేవుని వాక్కుల్ని వివరించి చెప్పలేదు, లేదా అసాధారణమైనదేదీ చేయలేదు. దేవదూత ఏలీయాతో అత్యంత సాధారణమైన మాటల్ని పలికాడు. లేచి భోజనం చెయ్యమని దేవదూత ఏలీయాతో చెప్పాడు. మనలో ఎప్పుడో ఒకప్పుడు అధైర్యం కలగడం సహజమే. అయితే అధైర్యం కలిగినప్పుడు మనం మళ్లీ తిరిగి ధైర్యాన్ని పొందవలసి ఉన్నాం. భౌతికపరమైన అంశాలు మాత్రమే మనల్ని అధైర్యపరుస్తాయనడం సరికాదు. అయితే అధైర్యాన్ని జయించిన తర్వాతనే నిజమైన సంతోషమంటే ఏమిటో, నిజమైన ఔన్నత్యమంటే ఏమిటో మనం గ్రహించగలం. జీవితంలో మనకు పలు అంశాలు అధైర్యాన్ని కలిగిస్తాయి. ఉదాహరణకు, "మరణం" అనే ఆలోచన రాగానే అందరూ ధైర్యం కోల్పోతారు. నిన్ను నీవు పరీక్షించుకున్న ప్రతిసారీ అధైర్యాన్ని నీవెంతమట్టుకు జయించగలవో ఆలోచించు.

దేవుని ఆత్మ మనల్ని దర్శించినప్పుడు ఆయన మనకు కార్యకారణసంబంధంలేని అద్భుతదర్శనాన్నివ్వడు గానీ మనం చేయగలిగిన సాధారణమైన పనులే మనం చేయాలని చెబ్తాడు. మన జీవితంలో మనం ప్రతి రోజూ చేసే నిత్యకృత్యాలన్నీ దేవుని సృష్టిలో భాగమే. అయితే మనలో ఉన్న అధైర్యం మనం వీటిని చేయకుండా అడ్డుకుంటుంది. అయితే దేవుడు మనల్ని కదిలించినప్పుడు మన దైనందిన జీవితంలో సాదాసీదాగా ఉన్న పనులన్నిటినీ చేయగలం. అయితే దేవుడే ఇందుకు ప్రేరణ అని మొదట్లో మనం గ్రహించంగానీ మనం ఆ పనుల్ని చేస్తూ ఉన్నప్పుడు మనం దేవుని హస్తాన్ని చూడగలం. మనం అధైర్యాన్ని జయించేందుకు దేవుడిచ్చే ప్రేరణ ఇదే! అయితే  తొలి అడుగు మనమే వేయాలి! దేవుడిచ్చే ప్రేరణతో పని చేయాలి!  అంతే తప్ప అధైర్యాన్ని దూరంచేయడానికి ఏదో ఒక పని చేయాలని చేస్తే మనం అధైర్యాన్ని జయించం సరి కదా ఇంకా ఎక్కువ అధైర్యాన్ని పోగుచేసుకుంటాం. అయితే దేవుని ఆత్మ మనలో అంతర్బుద్ధి కలిగించి మనల్ని నడిపించినప్పుడు మనలో అధైర్యం పటాపంచలౌతుంది. మనం లేచి దేవునికి విధేయత చూపినప్పుడు జీవితంలో ఉన్నత మెట్టు నెక్కగలం.

ఫిబ్రవరి 18

## నిరాశ నధిగమించడం

"లెండి వెళ్లుదము ... " (మత్తయి 26:46)

గెత్సేమనే వనంలో శిష్యులు మెలకువగా ఉండవలసిన సమయంలో నిద్రలో ఉన్నారు. అది గ్రహించిన తర్వాత వారిలో నిరాశ చోటుచేసుకుంది. ఉపసంహరణకు వీలులేని పని చేసినప్పుడు మనలో నిరాశ కలుగుతుంది. "అంతా అయిపోయింది. సర్వనాశనమయ్యింది. ఇక ఇప్పుడు చేసేదేముంది?" అని మనం చెప్పవచ్చు. మనమిటువంటి నిరాశకు అతీతులమని తలంచడం నిజంగా పొరబాటే. నిరాశ చెందడం మానవజీవితంలో సాధారణమైన అనుభవం. మనకు లభించిన గొప్ప అవకాశాన్ని మనం ఉపయోగించుకోలేకపోయామని మనం గ్రహించినప్పుడు మనం నిరాశతో క్రుంగిపోవడం మామూలే. అయితే యేసు మన దగ్గరకు వచ్చి ప్రేమతో "అలసట తీర్చుకోండి. ఆ అవకాశం మళ్లీ రాదు. జరిగినదాన్ని మీరు మార్చలేరు. అయితే లేచి, మరొక పని చేద్దాం" అని చెబ్తాడు. అంటే, గతాన్ని నిద్రపోనివ్వండి గతాన్ని క్రీస్తు హస్తాల్లో సేదతీర్చుకోనివ్వండి ఇప్పుడు మనం యేసుతోబాటు తిరుగులేని భవిష్యత్తులోనికి నడుద్దామని అర్థం.

మనందరి జీవితాల్లో ఇటువంటి అనుభవాలు కోకొల్లలుగా ఉంటాయి. జీవితంలో పలు వాస్తవఘటనలు మనల్ని తీవ్రమైన నిరాశకు గురిచేస్తాయి. మనం ఆ నిరాశలోనుండి బయట పడడం చాలా కష్టమనిపించవచ్చు. ఈ వాక్యభాగంలో శిష్యులు ఊహించనలవికాని పని చేశారు. అంటే వారు యేసును కనిపెట్టుకొని ఉండడానికి బదులు నిద్రపోయారు. అయితే నిరాశతో నిండిన శిష్యులదగ్గరకు మన ప్రభువు వచ్చి వారికి ఆధ్యాత్మిక ధైర్యాన్నిచ్చాడు. "లెండి వెళ్లుదము" అని యేసు తన శిష్యులతో చెప్పాడు. దేవుడు మనకు ప్రేరణనిచ్చినట్లయితే మనం చేయవలసిన తదుపరి పని యేమిటి? ఆయణ్ణి సంపూర్ణంగా నమ్ముతూ ఆయన మనకనుగ్రహించిన విమోచననుబట్టి ప్రార్థించాలి.

గత వైఫల్యాలు నీ తదుపరి యత్నాల్ని ఓడించనివ్వకు.

ఫిబ్రవరి 19

## ఇష్టంలేని బలవంతపు పనికి వ్యతిరేకంగా ప్రయత్న ప్రారంభం

“లెమ్ము, తేజరిల్లుము” (యెషయా 60:1)

ఇష్టంలేని బలవంతపు పనిని వ్యతిరేకించేటప్పుడు దేవుడు అక్కడ లేడని, ఆయన మనకు సహాయం చేయడని ఆలోచిస్తూ తొలి అడుగు వేస్తాం. అటువంటి సందర్భంలో దేవుడు మనకు సహాయంచేయాలని కనిపెట్టడంలో అర్థం లేదు; ఎందుకంటే ఆయన సహాయం చేయడు కూడా. అయితే మనం పనిచేయడానికి ప్రయత్నపూర్వకంగా ఉద్యమించినప్పుడు దేవుడు అక్కడే ఉన్నాడని గ్రహించగలం. దేవుడు మనకు ప్రేరణ నిచ్చినప్పుడు మనం ప్రయత్నించడం నైతికపరమైన అంశమౌతుంది. ఇది విధేయతకు సంబంధించిన అంశం. మనం విధేయతతో ముందడుగు వేసి పనిచేయాలి తప్ప ఏమీ చేయకుండా సోమరిగా ఉండకూడదు. మనం లేచి ప్రకాశించినప్పుడు ఇష్టంలేని బలవంతపు పని దివ్యావేశంచేత సుందరదృశ్యంగా మారుతుంది.

మన స్వభావం లేదా మన గుణం ఎంత స్వచ్ఛమైనదో తెలుసుకోడానికి మనకిష్టంలేని బలవంతపు పని ఒక పరీక్షగా నిలుస్తుంది. బలవంతపు పని అంటే మనం చేయదగినదని ఊహించే పనికి భిన్నమైన పని. అది కఠినదాస్యం కావచ్చు, లేదా దైన్యంవలన చేసే హీనమైన పని కావచ్చు, విశ్రాంతి విరామంలేకుండా తీవ్రమైన అలసటకు గురవుతూ చేసే పని కావచ్చు, ఏ మాత్రం విలువలేని అల్పమైన పని కావచ్చు. అయితే మనం ఆ పని చేస్తున్నప్పుడు మన ఆధ్యాత్మికత తత్క్షణమే పరీక్షకు గురవుతుంది. అప్పుడే మనం ఆధ్యాత్మికంగా ఎంత స్వచ్ఛంగా ఉన్నామో తెలుస్తుంది. యోహాను సువార్త పదమూడవ అధ్యాయం చదవండి. దేవుని కుమారుడైన యేసు చేపలుపట్టేవారి పాదాలు కడగడాన్ని ఈ అధ్యాయంలో చూస్తాం. ఆయన వారితో “ప్రభువును బోధకుడనైన నేను మీ పాదములు కడిగినయెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే” (యోహాను 13:14) అని చెప్పాడు. బలవంతపు పని ఇష్టమైన పనిగా దివ్యకాంతితో ప్రకాశించాలంటే దేవునినుండి మనకు ప్రేరణ కావాలి. కొన్నిసార్లు పనిచేసే వ్యక్తి ఆ పనిపట్ల చూపే నిబద్ధత మరియు అంకితభావం ఆ పనిని ప్రత్యేకపర్చి పవిత్రపరుస్తాయి. అది మన దైనందిన జీవితంలో యెదురయ్యే సాధారణమైన పని కావచ్చు; అయితే ఆ పని పూర్తయిన తర్వాత అది భిన్నంగా ఉంటుంది. ప్రభువు మనద్వారా తన కార్యం జరిగించినప్పుడు అది సంపూర్ణంగా రూపాంతరం చెందుతుంది. మన ప్రభువు మన మానవశరీరాల్ని రూపాంతరీకరిస్తాడు. దేవుడు మన శరీరాల్ని రూపాంతరీకరించిన తర్వాత ప్రతి విశ్వాసి శరీరం “పరిశుద్ధాత్మకు ఆలయం” అవుతుంది.

ఫిబ్రవరి 20

## పగటికలలకు వ్యతిరేకంగా ప్రేరణ పొందడం

"లెండి, యిక్కడనుండి వెళ్లుదము." (యోహాను 14:31)

ఏదైనా ఒక పనిని సక్రమంగా ఎలా చేయాలో ఆలోచిస్తూ పగటికలల్లో మునిగి పోవడం సబబేమో గానీ మనం ఆ పనిని వాస్తవంగా చేస్తున్నప్పుడు పగటికలల్లో మునిగి పోవడం సరికాదు. ఈ వాక్యభాగంలో యేసు తన శిష్యులకు అనూహ్యమైన సంగతులు చెప్పిన తర్వాత అక్కడనుండి బయలుదేరి వెళ్లాలని చెప్పాడు. యేసు చెప్పిన సంగతులను శిష్యులు మర్చిపోకూడదు; మననం చేసుకుంటూ ఉండాలి. అయితే సోమరిగా కూర్చుని పగటికలల్లో మనిగిపోవడాన్ని యేసు అనుమతించలేదు. దేవునిపై దృష్టి పెట్టే సమయంలోను మనపట్ల ఆయన చిత్తాన్ని తెలుసుకొనే సమయంలోను పగటికలలుండడంలో తప్పు లేదోమో గానీ దేవుడు ఏదైనా పనిని ఆదేశపూర్వకంగా మన కప్పగించినప్పుడు మనం పని చేయాలి తప్ప పగటికలల్లో మునిగిపోకూడదు. దేవుడు పగటికలల్ని ఆశీర్వదించడు. పగటికలల్లో మునిగిన మనల్ని దేవుడు తట్టి లేపుతాడు. ఆయన మనకు "అక్కడే నిలబడవద్దు, కూర్చోవద్దు. బయలు దేరండి" అనే స్పష్టమైన ఆదేశాలనిస్తాడు.

దేవుడు మనతో "మీరేకాంతముగా ... వచ్చి" (మార్కు 6:31) అని మాట్లాడిన తర్వాత మనమాయన యెదుట మౌనంగా కనిపెట్టినట్లయితే మన పట్ల ఆయన చిత్తాన్ని తెలుసుకోగలుగుతాం. గానీ మనమొక విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దేవుడు మాట్లాడిన తర్వాత పగటికలల్లో మునిగిపోకూడదు. నీ కలలకు సంతోషాలకు ఆయన మూలాధారం కావాలి. అయితే దేవునిపట్ల విధేయత చూపుతూ ఆయన నీతో చెప్పినది చేయడానికి నీవు బయలుదేరి వెళ్లాలి. నీవు నిజంగా ఎవరినైనా ప్రేమిస్తే నీవు యథాలాపంగా కూర్చొని నీవు ప్రేమించిన వ్యక్తి గురించి పగటికలల్లో మునిగిపోవు గానీ బయటికి వెళ్లి ఆ వ్యక్తికొరకు ఏదో ఒకటి చేస్తావు గదా. యేసు క్రీస్తు మనలో కూడా ఈ క్రియాశీలతనే కోరుకుంటున్నాడు. దేవుడు మనతో మాట్లాడిన తర్వాత మనమాయనకు విధేయత చూపకుండా పగటికలల్లో మునిగిపోవడం మనకు ఆయనపట్ల సరైన విశ్వాసం లేదని తేటతెల్లం చేస్తుంది.

ఫిబ్రవరి 21

## ఆయణ్ణి నీవు నిజంగా ప్రేమిస్తున్నావా?

"ఈమె నాయెడల మంచి కార్యము చేసెను." (మార్కు 14:6)

మనం దేన్ని ప్రేమ అని పిలుస్తున్నామో అది మనల్ని మన పరిధిదాటి బయటికి వెళ్లనీయకపోయినట్లయితే అది నిజంగా ప్రేమ కాదు. ప్రేమలో జాగరూకత, సూక్ష్మబుద్ధి, తెలివితేటలు, విచక్షణ, ఆచితూచి వ్యవహరించే నైజం ఉంటాయని మనం భావించినట్లయితే ప్రేమంటే ఏమిటో మనం సరిగ్గా అర్థం చేసుకోలేదన్నమాట. పైన చెప్పిన లక్షణాలు ప్రేమలాంటి భావోద్వేగాన్ని లేదా మానసికస్థితిని సూచిస్తాయి. ఈ స్థితి మనకు ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని ఇచ్చినప్పటికీ ఇది ప్రేమలోని యథార్థతను నిర్దిష్టతను సూచించే స్థితి కాదు.

నీవు దేవుణ్ణి ప్రేమిస్తున్నందుకుగాను ఆయనకొరకు నీవెప్పుడైనా ఏమైనా చేశావా? అంటే, నీకు ప్రయోజనాన్నిస్తుందని కాక, బాధ్యత కాబట్టి చేయాలని కాక, నీ స్వలాభంకొరకు కాక కేవలం దేవునికొరకు ఆయనపట్ల నీకున్న ప్రేమనుబట్టి ఎప్పుడైనా ఏమైనా చేశావా? దేవుడు విలువైనవిగా ఎంచేవాటిని నీవాయనకు ఇవ్వగలవని నీవెప్పుడైనా గుర్తించావా? లేక, నీవాయనకొరకు చేయవలసినవాటిని నిర్లక్ష్యం చేస్తూ, అప్రయత్నంగా కూర్చొని దేవుడు నీకనుగ్రహించిన విమోచన ఎంత గొప్పదో ఊహిస్తూ పగటికలల్లో మునిగిపోయావా? దైవిక కార్యాలగురించి అద్భుతకార్యాలగురించి నేను ప్రస్తావించడం లేదు గానీ మన దైనందిన జీవితంలో మామూలుగా మనం చేసే చిన్న చిన్న పనుల గురించి నేను చెబుతున్నాను. నీవు దేవునికి సంపూర్ణంగా లోబడుతున్నావనేందుకు నీవు చేసే ఈ చిన్న పనులే రుజువులు. బేతనియలోని మరియ యేసు ప్రభువు హృదయంలో కలిగించిన అనుభూతిని నీవెప్పుడైనా ఆయన హృదయంలో కలిగించావా? - "ఈమె నాయెడల మంచి కార్యము చేసెను."

మన ప్రేమ ఎంత యథార్థమైనదో తనకు తెలియజేయాలని, మనం చిన్న చిన్న విషయాల్లో తనకు లోబడాలని దేవుడు ఎదురుచూసే సందర్భాలుంటాయి. దేవునికి మనల్ని మనం సంపూర్ణంగా లోబర్చుకోడం మన వ్యక్తిగత పరిశుద్ధతకన్నా విలువైనది. మన వ్యక్తిగత పరిశుద్ధతగురించి మనం అధికమైన శ్రద్ధ చూపించినప్పుడు మనం మనమీదనే ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తుంటాం. మనం దేవుణ్ణి దుఃఖపెడ్తున్నామనే భయంతో మన నడక మన మాట మన చూపుమీద ప్రధానంగా దృష్టి సారిస్తుంటాం. అయితే మనమొక విషయం గమనించాలి. "పరిపూర్ణప్రేమ భయమును వెళ్లగొట్టును" అని 1 యోహాను 4:18 వచనం సెలవిస్తోంది. మనల్ని మనం దేవునికి సంపూర్ణంగా లోబరచుకున్నప్పుడు మనలో ఉన్న భయం పటాపంచలౌతుంది. అప్పుడు "నేను దేవునికేమైనా ఉపయోగపడ్తానా?" అని మనల్ని మనం ప్రశ్నించుకోడానికి బదులు మనం దేవునికి ఉపయోగపడమనే సత్యాన్ని గ్రహించగలుగుతాం. ఉపయోగపడ్తామా ఉపయోగపడమా అనేది కాదు గానీ దేవుడు మనల్ని విలువైనవారిగా చూస్తున్నాడు. మనల్ని మనం దేవునికి సంపూర్ణంగా లోబరచుకున్నప్పుడు సదాకాలం ఆయన కార్యాలు మనలో కొనసాగుతుంటాయి.

ఫిబ్రవరి 22

## ఆధ్యాత్మిక విషయాల్లో లక్ష్యసాధనపట్ల పట్టుదల కలిగి ఉండడం

"ఊరకుండుడి నేనే దేవుడనని తెలిసికొనుడి" (కీర్తనలు 46:10)

పట్టుదల కలిగి ఉండడం వేరు, సహనం వేరు. మనం యెదురుచూస్తున్నది తప్పక జరుగుతుందనే అప్రతిహతమైన నిశ్చయత మరియు సంపూర్ణ విశ్వాసం తోడైన సహనాన్నే పట్టుదల కలిగి ఉండడమని చెప్పవచ్చు. పట్టుదల కలిగి ఉండడమంటే ఏదో ఒక విషయాన్ని పట్టుకొని వ్రేలాడడం కాదు. ఇలా వ్రేలాడడం మనలోని భయాన్ని ఆందోళనను బహిర్గతం చేస్తుంది. పట్టుదల కలిగి ఉండడం మనలోని భక్తివిశ్వాసాలకొక ఉత్కృష్ట ప్రమాణం. అంటే ఇది మన నాయకునికెన్నడూ ఓటమి ఉండదనే మన పరిపూర్ణమైన నమ్మకాన్ని వెల్లడిచేసే క్రియ. మన ప్రభువు ప్రేమ న్యాయం క్షమ కనికరం మొదలైనవాటిలో చివరివరకు పట్టుదల కలిగి ఉన్నట్టుగా మనుషులు చివరివరకు పట్టుదల కలిగి ఉండరనే భయం, వీటిని సాధించడం అసాధ్యమనే భయం మనలో ఉంటాయి. నిష్క్రియాతత్వంతో వ్రేలాడడానికి మనం పిలవబడలేదు గానీ దేవునికెన్నడూ అపజయం యెదురుకాదనే పరిపూర్ణ విశ్వాసంతో సంపూర్ణమైన దృఢనిశ్చయంతో నిండిన క్రియకొరకు మాత్రమే పిలుపు కలిగి ఉన్నాం.

మనలో ఉన్న నమ్మకాలు ఈ క్షణంలో అసంతృప్తికి గురవుతున్నట్లయితే అవి ప్రక్షాళన చేయబడుతున్నాయని అర్థం. మన ప్రతి కోరిక లేదా ప్రతి కల ఉన్నతమైనదైనట్లయితే దేవప్రేరితమైనదైనట్లయితే అది తప్పక నెరవేరుతుంది. అయితే మనం దేవునికొరకు కనిపెట్టే సమయంలో కూడా ఒత్తిడికి లోనవుతుంటాం. వాస్తవానికి ఇదే ముఖ్యమైన ఒత్తిడి. "నీవు నా ఓర్పు విషయమైన వాక్యమును గైకొంటివి గనుక ... నేనును నిన్ను కాపాడెదను" (ప్రకటన 3:10) అని చెప్పిన ప్రభువు తన వాగ్దానాన్ని తప్పక నెరవేరుస్తాడు.

కాబట్టి ఆధ్యాత్మిక విషయాల్లో పట్టుదల వీడవద్దు.

ఫిబ్రవరి 23

## పరిచర్య చేయాలనే దృఢసంకల్పం

“మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును ... వచ్చెనని చెప్పెను.” (మత్తయి 20:28)

“అయినను నేను మీ మధ్య పరిచర్య చేయువానివలె ఉన్నాను” (లూకా 22:27) అని యేసు చెప్పాడు. పరిచర్యగురించి మన ప్రభువుకు ఏ అభిప్రాయం వుందో పౌలుకు కూడా అదే అభిప్రాయం వుంది. “యేసు నిమిత్తము మేము మీ పరిచారకుల మనియు ప్రకటించుచున్నాము” (2 కొరింథీ 4:5-6) అని పౌలు వ్రాశాడు. పరిచర్యకు పిలవబడిన వ్యక్తి అందరిలాంటి వ్యక్తి కాదని, ఆ వ్యక్తి ఇతరులకంటె అధికుడని మనం ఆలోచిస్తుంటాం. అయితే యేసు క్రీస్తు మాటల ప్రకారం పరిచర్యకు పిలవబడిన వ్యక్తి కాళ్లు తుడుచుకోడానికి ఉపయోగపడే పీచుబట్టలాంటివాడని అర్థం. ఆ వ్యక్తి  ఎవరికి పరిచర్య చేస్తున్నాడో వారిని ఆధ్యాత్మిక విషయాల్లోకి నడిపించే నాయకుడే అయినప్పటికీ వారికంటె అధికుడు కాడు. “దీనస్థితిలో ఉండ నెరుగుదును ... ” (ఫిలిప్పీ 4:12) అని పౌలు చెప్పాడు. పౌలు దృష్టిలో పరిచర్య అంటే ఇతరులకొరకు తన జీవితాన్ని కడవరకు ధారపోయడం. పౌలు తనకు మెప్పు లభించినా, నింద యెదురైనా పట్టించుకోలేదు. యేసు క్రీస్తు అంటే ఎవరో తెలియకుండా ఏ ఒక్కరూ ఉండకూడదని పౌలు ఆతృత. యేసు అంటే ఎవరో తెలియనివారిని ఆయనచెంతకు నడిపించడంద్వారా తాను యేసుపట్ల తన ఋణం తీర్చుకుంటున్నానని పౌలు భావన. పౌలు పరిచర్యకు ముఖ్యమైన ప్రేరణ ప్రభువుపట్ల ప్రేమ. ప్రభువుపట్ల ప్రేమ మనకు ప్రేరణ అయినట్లయితే ఏదీ మనమితరులకు సేవ చేయకుండా ఆపలేదు.

తనకు క్రీస్తుకు మధ్య ఉన్న సంబంధమెటువంటిదో పౌలుకు తెలుసు. ఈ అవగాహనే అతణ్ణి పరిచర్యకు ప్రేరేపించిన రహస్యం. పౌలు తనగురించి “పూర్వము దూషకుడను హింసకుడను హానికరుడనైన నన్ను .... ” (1 తిమోతి 1:12-13) అని చెప్పుకున్నాడు. పౌలును ఇతరులెంత బాధపెట్టినప్పటికీ ఆ బాధలు పౌలు ఒకప్పుడు యేసుపట్ల చూపిన ద్వేషం ముందు పగముందు తక్కువే. ఎందుకూ కొరగాని మనల్ని, మనలోని స్వార్థాన్ని, మన పాపాల్ని చూసి కూడా యేసు మనల్ని ప్రేమించి మనకు పరిచర్య చేశాడని మనం గుర్తించినప్పుడు ఆయన నిమిత్తం ఇతరులకు పరిచర్య చేయాలని మనలో ఉన్న దృఢసంకల్పాన్ని ఏదీ అడ్డుకోలేదు.



ఫిబ్రవరి 24

## సమర్పణలో సంతోషం

“నాకు కలిగినది యావత్తు ... బహు సంతోషముగా వ్యయపరచెదను; నన్నును నేను వ్యయపరచుకొందును.” (2 కొరింథీ 12:15)

పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయాల్లో క్రుమ్మరించబడిన తర్వాత (రోమా 5:5) మన వ్యక్తిత్వాన్ని యేసు క్రీస్తు వ్యక్తిత్వంతో సరిపోల్చుకుంటాం. ఇది ఉద్దేశపూర్వకమైన పోలిక కాబట్టి యేసు క్రీస్తుకున్న ఉద్దేశాల్ని ఆలోచనల్ని ఇతరుల జీవితంలో సఫలం చేయాలనుకుంటాం. యేసు క్రీస్తు ప్రతి మనిషిపట్ల ఆసక్తి చూపిస్తున్నాడు. క్రైస్తవ సేవాధర్మంలో మన స్వంత అభిరుచులకు కోరికలకు స్థానం లేదు. వాస్తవానికి మనకు యేసు క్రీస్తుతో ఉన్న సంబంధానికి ఇదొక పరీక్ష. నా స్నేహితుడైన యేసుకొరకు నా ప్రాణాన్ని పణంగా పెట్టడం నాకు సంతోషాన్నిస్తుంది (యోహాను 15:13 చూడండి). నిర్లక్షధోరణితో ప్రాణాన్ని పణంగా పెట్టడం కాదు గాని యేసు క్రీస్తు కొరకు ఆయనకు మనందరిపట్ల ఉన్న ప్రేమనుబట్టి నేను ఉద్దేశపూర్వకంగా ప్రాణాన్ని పణంగా పెట్టడానికి సిద్ధపడ్తాను. ఇందులో నా స్వంత లాభంగానీ ప్రయోజనం గానీ లేదు. పౌలు జీవితంలో ఒకే ఒక లక్ష్యం వుంది. యేసు క్రీస్తుకొరకు మనుషులను సంపాదించడం పౌలుకున్న ఏకైక లక్ష్యం. పౌలు తనకొరకు మనుషులను సంపాదించుకొనలేదు గానీ క్రీస్తుకొరకు మాత్రమే మనుషులను సంపాదించాడు. “ఏ విధముచేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధములవాడనై యున్నాను” (1 కొరింథీ 9:22) అని పౌలు వ్రాశాడు.

పరిశుద్ధమైన జీవితం జీవించడంకొరకు దేవునితో ఏకాంతసమయం గడపాలని ఎవరైనా ఆలోచించినట్లయితే ఆ వ్యక్తి జీవితం ఇతరులకు ఉపయోగపడదు. ఇదెలా ఉంటుందంటే ఆ వ్యక్తి ఎత్తైన పీఠంమీద నిలబడి తనను తాను సమాజానికి దూరం చేసుకున్నట్టుగా ఉంటుంది. పౌలు పరిశుద్ధుడు. పౌలు తన జీవితాన్నంతా యేసుకొరకు వెచ్చించాడు కాబట్టి ఆయనే పౌలును కాపాడాడు. మనలో అనేకులకు స్వంత ప్రయోజనాలుంటాయి; మన జీవితాల్ని యేసుకొరకు వెచ్చించడంలేదు గనుక మన జీవితాల్లో యేసు చేసేదేముంటుంది? అయితే మనల్ని మనం యేసుకు సంపూర్ణంగా లోబర్చుకున్నప్పుడు మన స్వంత ప్రయోజనాలంటూ మనకేమీ ఉండవు. ఇతరులు కాళ్లు తుడుచుకొనే “పీచుబట్ట”లాగా ఎలా ఉండాలో పౌలుకు తెలుసు. “పీచుబట్ట”లాగా ఉండడానికి పౌలు అయిష్టత చూపలేదు. ఎందుకంటే పౌలుకు యేసుపట్ల ఉన్న భక్తివిశ్వాసాలే అతనికి ప్రేరణగా నిలిచాయి. మనలో కూడా భక్తి విశ్వాసాలున్నాయి గానీ అవి యేసుమీద కాక మనకు ఆధ్యాత్మిక స్వేచ్ఛనిచ్చే విషయాలమీద ఉన్నాయి. యేసుకు మనల్ని మనం సంపూర్ణంగా లోబర్చుకున్నప్పుడు మనకు ఆధ్యాత్మిక స్వేచ్ఛ లభించదు. ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం పౌలు లక్ష్యం కానే కాదు. వాస్తవానికి పౌలు “నా సహోదరులకొరకు నేను క్రీస్తునుండి వేరై శాపగ్రస్తుడనై యుండగోరుదును” (రోమా 9:3) అని వ్రాశాడు. పౌలు ఆలోచనల్లో ఏదైనా తప్పు ఉందా? లేనే లేదు! అమితంగా ప్రేమించే వ్యక్తి విషయంలో ఇది అతిశయోక్తి కాదు. ఎందుకంటే పౌలు యేసు క్రీస్తును అంత అమితంగా ప్రేమించాడు.

ఫిబ్రవరి 25

## పరిచర్యలో ఉండవలసిన ఉపేక్షాగుణం

"నేను మిమ్మును ఎంత యెక్కువగా ప్రేమించుచున్నానో అంత తక్కువగా మీరు నన్ను ప్రేమింతురా?" (2 కొరింథీ 12:15)

మనుషుల్లో స్వభావసిద్ధంగా ఉండే ప్రేమ ప్రతిఫలాన్ని కోరుకుంటుంది. ఇతరులు తనను ప్రేమించినా ప్రేమించకపోయినా తాను మాత్రం వారికొరకు తనను తాను రిక్తుణ్ణి చేసుకుంటానని పౌలు చెప్పాడు. ఇతరుల్ని దేవునిచెంతకు నడిపించడంకొరకే తాను ఈ విధంగా చేస్తున్నానని కూడా పౌలు చెప్పాడు. "మీరు మన ప్రభువైన యేసు క్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడైయుండియు మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింథీ 8:9). మన ప్రభువు పరిచర్యధర్మ మెటువంటిదో పౌలు పరిచర్యధర్మం కూడా అటువంటిదే. పరిచర్యలో పౌలు తనెంత వ్యయపర్చుకుంటున్నాడో తానెన్ని కష్టనష్టాల ననుభవిస్తున్నాడో అతనికి మాత్రమే తెలుసు. అయితే ఇవేమీ పౌలు పట్టించుకోలేదు. పైగా ఈ స్థితినిబట్టి పౌలు సంతోషించాడు.

దేవుని సేవకుడెలా ఉండాలనే విషయంలో సంస్థాగత సంఘం అభిప్రాయానికి యేసు క్రీస్తు అభిప్రాయానికి సారూప్యత కనిపించదు. మనమితరుల్ని సేవించడంద్వారా తనను సేవించాలని యేసు క్రీస్తు అభిప్రాయం. వాస్తవానికి ఆధునిక కాలంలోని సామ్యవాద సిద్ధాంతాలుగా పేరుగాంచిన సహజీవనాన్ని సమానత్వాన్ని సామరస్యాన్ని యేసు క్రీస్తు చాలా కాలం క్రితమే బోధించాడు. తన రాజ్యంలో అందరికంటె గొప్పవాడు కావాలనుకున్న వ్యక్తి అందరికీ పరిచారం చేయాలని (మత్తయి 23:11 చూడండి) యేసు సెలవిచ్చాడు. పరిశుద్ధుడికి పరీక్ష సువార్త ప్రకటించడానికి సంసిద్ధత చూపడంలో కాదు గానీ ఇతరుల పాదాల్ని కడగడానికి సంసిద్ధత చూపడంలోనే. అంటే మనుషుల దృష్టిలో ఘనహీనమైన పనులు దేవుని దృష్టిలో ఘనమైనవని అర్థం. కాబట్టి ఇతరులపట్ల దేవుని ఉద్దేశాల్ని నెరవేర్చడంకొరకు తనను తాను రిక్తుణ్ణి చేసుకోడం పౌలుకు ఆనందాన్నిచ్చింది. ఇందుకొరకు పౌలు తనను తాను వ్యయపర్చుకోడానికి సిద్ధమయ్యాడు. మనం మాత్రం పరిచర్యకంటె ఎక్కువగా మన వ్యక్తిగత ప్రయోజనాలగురించి డబ్బువిషయంలో లాభనష్టాలగురించి ఆలోచిస్తుంటాం. "దేవుడు నన్నక్కడికి వెళ్లమంటే ఏం చేయాలి? నా జీతంగురించి ఏమిటి? అక్కడి వాతావరణమెలా ఉంటుంది? నన్నెవరు చూస్తారు? వీటన్నిటిగురించి ఆలోచించాలి గదా?" - ఇవీ మన ఆలోచనలు. అయితే ఇవి దేవునికి సేవచేయడంపట్ల మనలో ఉన్న పరిమితుల్ని ఇంకా చెప్పాలంటే మనలో ఉన్న తిరోగమనభావాల్ని వెల్లడి చేస్తున్నాయి. అయితే అపొస్తలుడైన పౌలుకు ఏ పరిమితులూ లేవు, ఏ తిరోగమన భావాలూ లేవు. పరిశుద్ధుడుగా ఉండడమంటే యేసు క్రీస్తు దృష్టిలో ఏమిటో దానిమీదే పౌలు తన దృష్టిని కేంద్రీకరించాడు. పౌలు దృష్టిలో పరిశుద్ధుడంటే కేవలం సువార్త ప్రకటించే వ్యక్తి కాదు; పరిశుద్ధుడంటే ఇతరులకొరకు యేసు క్రీస్తు చేతులద్వారా విరవబడే రొట్టె, మరియు పోయబడే ద్రాక్షారసం.

ఫిబ్రవరి 26

## యేసు గురించి మనలో ఉన్న సంశయాలు

"అప్పుడా స్త్రీ -అయ్యా, యీ బావి లోతైనది, చేదుకొనుటకు నీకేమియు లేదే ... " (యోహాను 4:11)

"దేవుని వాక్యంలోని  అద్భుతసత్యాలు నామీద గట్టి ప్రభావం చూపాయి. అయితే వాటినన్నిటినీ నేను అనుసరించాలని, నా జీవితంలో వాక్యసత్యాలన్నీ కార్యరూపంలోకి రావాలని దేవుడు కోరుకోడంలేదు" అని నీతో నీవెప్పుడైనా చెప్పుకున్నావా? యేసు క్రీస్తు స్వభావంతో ఆయన కార్యదీక్షతో మన స్వభావాన్ని మన కార్యదీక్షను ముఖాముఖిగా పెట్టి చూసినట్లయితే మన వైఖరి మతనిష్ఠలో మనం అధికులమనే భావనను బహిర్గతం చేస్తుంది. యేసు ఉద్దేశాలు ఉన్నతమైనవనీ అవి మనపై గట్టి ప్రభావాన్ని చూపిస్తున్నాయని చెబ్తూనే ఆయన ఉద్దేశాల ప్రకారం మనం వాస్తవంగా జీవించడం సాధ్యంకాదని నమ్ముతూ ఉన్నాం. మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక విషయంలో ఎప్పుడో ఒకసారైనా ఈ విధంగా ఆలోచించి ఉండవచ్చు. మన దృష్టిని దేవునిమీదనుండి ప్రక్కకు మరల్చే ప్రశ్నలగురించి మనమెక్కువగా ఆలోచించినప్పుడు యేసుగురించి ఇటువంటి సందేహాలు సంశయాలు మనలో మొదలౌతాయి. మనం యేసుపట్ల ఆయన ఉన్నతమైన ఉద్దేశాలపట్ల విధేయత చూపాలని ఆలోచిస్తున్న తరుణంలో ఎవరో ఒకరు మనల్ని "బ్రతకడానికి కావలసిన డబ్బు నీకెలా వస్తుంది? నీవెలా జీవిస్తావు? నీ బాగోగులెవరు చూస్తారు?" అని అడగవచ్చు. లేదా "ప్రభువా, నేనున్న పరిస్థితుల్లో నీకొరకు పనిచేయడం కష్టం" అని మనం యేసుతో చెప్పే సందర్భంలో ఇటువంటి సంశయాలు మన హృదయంలోనే కలగవచ్చు. మనం "నీళ్లు పైకి తోడడానికి యేసు దగ్గర ఏం లేదు కదా! ఆయన మనకు నీళ్లెలా ఇస్తాడు? 'ప్రభువుమీద నమ్మకం ఉంచు' అని చెప్పడం సులువే. కానీ మనుషులు బ్రతకాలి కదా!" అని మనం చెబ్తామేమో! "యేసుగురించి నాకెటువంటి సంశయాల్లేవు గానీ నా గురించే నాకు సంశయాలున్నాయి" అని చెబ్తూ దేవుని విషయాల్లో నీవు వంచన చూపిస్తున్నావో జాగ్రత్తగా గమనించు. మనకు దేవునిపట్ల నిజాయితీ ఉన్నట్లయితే మనగురించి మనకు ఎటువంటి సంశయాలు లేవని మనం ఒప్పుకోగలుగుతాం. ఎందుకంటే మనం దేవునికొరకు పనిచేయగలమో లేదో మనగురించి మనకు బాగా తెలుసు. అయినప్పటికీ మనలో యేసుగురించి సంశయాలుంటాయి. మనం చేయలేనిది  యేసు చేయగలడనే ఆలోచనను సైతం అంగీకరించడానికి మన అహం అడ్డువస్తుంది.

యేసు ఏం చెబ్తున్నాడో, దాన్ని ఆయనెలా చేయగలడని నాలో నేను అన్వేషిస్తున్నప్పుడు నాలో కొన్ని సంశయాలు కలుగుతాయి. నా అంతరంగంలో ఉన్న న్యూనతాభావమే ఈ సంశయాలకు మూలం. నాలో ఉన్న ఈ సంశయాల్ని నేను వెతికి పట్టుకోగలిగినట్లయితే వాటిని నేను వెలుగులోకి తెచ్చి "ప్రభువా, నీగురించి ఇప్పటివరకు నాలో సంశయాలున్నాయి. నీ శక్తి నిప్పటివరకు నేను పూర్తిగా నమ్మలేకపోయాను. నేనిప్పటివరకు నా శక్తినే నమ్మాను. నీవు సర్వశక్తిమంతుడైన దేవుడవని నేను విశ్వసించలేకపోయాను. నీ శక్తి నా ఊహకందనిది" అని బహిరంగంగా ఒప్పుకోగలుగుతాను.

ఫిబ్రవరి 27

## యేసు పరిచర్యలో అశక్తత వుంటుందా?

"ఆ జీవజలము ఏలాగు నీకు దొరకును?" (యోహాను 4:11)

బావి చాలా లోతుగా ఉంది. ఎంత లోతుగా ఉందంటే సమరయ స్త్రీ ఊహకందనంత (యోహాను 4:11). మానవ స్వభావంలోని లోతులగురించి మానవజీవితంలోని అగాధాల గురించి ఆలోచించు. నీలో లోతుగా ఉన్న "బావుల" గురించి ఆలోచించు. యేసు పరిచర్యకు పరిమితులు విధిస్తున్నావా? ఆయన నీ జీవితంలో తన పరిచర్య జరిగించలేని బీదవాడా? నీ హృదయంలో బాధ అనే "బావి", లేదా కష్టం అనే "బావి" లోతుగా ఉందేమో! అయితే యేసు నీతో "మీ హృదయమును కలవరపడనియ్యకుడి ... " అని చెబుతున్నాడు. (యోహాను 14:1). నీ స్పందనేమిటి? నీవు భుజాలు తడుముకొని "అయితే ప్రభువా, బావి చాలా లోతుగా ఉంది. అందులోంచి నీవు నెమ్మదిని ఓదార్పును ఇవ్వలేవేమో" అని చెబ్తావా? ఇదేనా నీ జవాబు? ఇదే అయితే నువ్వు చెప్పింది నిజమే. ఎందుకంటే మానవ స్వభావమనే లోతైన బావిలోంచి యేసు ఏమీ పైకి తీసుకురాలేడు. ఆయన పరలోకంనుండి ఇచ్చే దేవుడు. మనమెంతవరకు దేవుణ్ణి మన జీవితంలోకి అనుమతించామో అంతవరకే జ్ఞాపకం చేసుకుంటూ, పైగా "దేవుడు ఈ పని చేయలేడేమో" అని చెబ్తూ మనమే ఇశ్రాయేలు పరిశుద్ధ దేవునికి పరిమితులు విధిస్తున్నాం. ఇటువంటి సందర్భంలోనే యేసుకు శిష్యులమైన మనం దేవుడు దేన్నైనా చేయగలడని నమ్మాలి. ఆయన సర్వశక్తిమంతుడనే సత్యాన్ని మర్చిపోయినప్పుడు మన మాయనకు అశక్తతను ఆపాదిస్తాం. అశక్తత ఆయనలో లేదు; మనలోనే ఉంది. ఆయన మనల్ని ఓదార్చేవాడని మనపట్ల కనికరంచూపి ఆదరించేవాడని నమ్ముతూనే సర్వశక్తిమంతుడినుండి దూరంగా జరుగుతుంటాం.

మనలో చాలామంది క్రైస్తత్వానికి మాదిరిగా ఉండలేకపోతున్నారు. ఇందుకు కారణం క్రీస్తు సర్వశక్తిమంతుడని గుర్తించకపోవడమే. మనలో క్రైస్తవ లక్షణాలున్నాయి, క్రైస్తవ అనుభవాలున్నాయి. అయితే యేసు క్రీస్తు మనలో కోరుకొనే సంపూర్ణ సమర్పణ మనలో లేదు. ఆయనయెదుట మనల్ని మనం తగ్గించుకోవలసినంతగా మనం మనల్ని తగ్గించుకోవడం లేదు. మనకు కష్టసమయాలెదురైనప్పుడు "ఆయనిది చేయగలడా?" అని చెబ్తూ మనమాయణ్ణి అశక్తుణ్ణి చేస్తున్నాం. మనంతట మనమే నీళ్లు తెచ్చుకోవాలని మన స్వంత ప్రయత్నంతో బావి లోతుల్లోకి దిగి అడుగుకు చేరుకుంటున్నాం. ఊరకే కూర్చొని "ఇది జరిగేది కాదు" అని చెప్పవద్దు. నీవు యేసువైపు చూచినట్లయితే ఇది జరుగుతుందని తెలుసుకోగలవు. నీలో ఉన్న అపరిపూర్ణత అనే బావి లోతైనదే. అయితే యేసువైపు చూడు. నీ అంతట నీవే నీళ్లు తోడడానికి ప్రయత్నించవద్దు.

ఫిబ్రవరి 28

## నీవిప్పుడు నమ్ముతావా?

"దీనివలన నమ్ముచున్నామని చెప్పగా యేసు వారిని చూచి -మీరిప్పుడు నమ్ము చున్నారా ... " (యోహాను 16:30-31)

శిష్యులు తాము నమ్ముతూ ఉన్నామని చెప్పారు. అయితే యేసు వారితో "మీరిప్పుడు నమ్ముచున్నారా? మీలో ప్రతివాడును ... నన్ను ఒంటరిగా విడిచిపెట్టు గడియ వచ్చుచున్నది, వచ్చేయున్నది"(యోహాను 16:31-32) అని చెప్పాడు. చాలామంది క్రైస్తవ సేవకులు యేసు క్రీస్తును ఒంటరిగా విడిచిపెట్టి, సేవచేయడం తమ బాధ్యత అన్నట్టుగా లేక సేవచేయవలసిన అవసరం వుందని తమ స్వంతజ్ఞానంతో ఆలోచిస్తూ సేవ చేస్తున్నారు. ఇందుకు కారణం పునరుత్థానుడైన యేసుగురించి అనుభవం లేకపోవడమే. మన స్వంత తెలివితేటలమీద ఆధారపడినందువల్ల మన ఆత్మ దేవునితో అన్యోన్యతకు దూరమయ్యింది (సామెతలు 3:5-6 చూడండి). ఇది ఉద్దేశపూర్వకమైన పాపం కాదు, ఈ పాపానికి శిక్ష ననుభవించవలసిన అవసరం లేదు. అయితే మనం యేసు క్రీస్తు గురించిన జ్ఞానం విషయంలో మనకు మనమే ఆటంకంగా ఉన్నామని గ్రహించినప్పుడు, మనకు మనమే అపనమ్మకాల్ని దుఃఖాల్ని కష్టాల్ని పోగుచేసుకున్నామని గ్రహించినప్పుడు, అవమానభారంతో పశ్చాత్తాపంతో ఆయనవద్దకు రాగలం.

యేసు క్రీస్తు పునరుత్థానంగురించి ఇప్పుడు మనకు ఉన్న జ్ఞానంకంటె అనుభవంకంటె ఇంకా లోతైన జ్ఞానం మరియు అనుభవం మనకు కావాలి. లోకజ్ఞానాన్ని ఆధారంచేసుకొని మన స్వంత నిర్ణయాలు తీసుకొని ఆ నిర్ణయాల్ని ఆశీర్వదించమని ఆయణ్ణి అడగడం కాదు గానీ ఎల్లప్పుడూ ప్రతి విషయంలోను క్రీస్తు చిత్తాన్ని తెలుసుకొనే విధేయతను అలవర్చుకోవాలి. మన స్వంత ప్రణాళికల్ని దేవుడు ఆశీర్వదించడు. ఎందుకంటే అవి ఆయన పరిధిలోకి రావు. ఈ ప్రణాళికల్లో యథార్థత ఉండదు. ఏదో బాధ్యతగా చేయాలి కాబట్టి మనం చేసినట్లయితే అది మనం యేసు క్రీస్తుతో పోటీపడి చేసినట్టుగా ఉంటుంది. మనం మితిమీరిన గర్వంతో అహంకారంతో అన్నీ మనకు తెలుసనీ మనం అన్నీ చేయగలమని విర్రవీగుతాం. పునరుత్థానుడైన యేసుకు సింహాసనాన్నివ్వడానికి బదులు మనమే సింహాసనంమీద కూర్చుంటాం. మనం మన అంతరాత్మ ప్రబోధం ప్రకారం నడవాలని, లేక మన బాధ్యత కాబట్టి నెరవేర్చాలని బైబిలు బోధించడంలేదు గానీ "ఆయన వెలుగులోనున్న ప్రకారము మనము వెలుగులో నడిచినయెడల ... " (1 యోహాను 1:7) అని మాత్రమే బైబిలు బోధిస్తుంది. దేన్నైనా మన బాధ్యతగా గుర్తించి మనం చేసినట్లయితే మన పనులగురించి ఇతరులకు వివరిస్తూ గొప్పగా చెప్పుకుంటాం. పరిశుద్ధుడు అవహేళనకు అపోహకు సులువుగా గురికావడం ఇందువల్లనే. అయితే మనం ప్రభువుపట్ల విధేయతతో పనిచేసినప్పుడు మనం వివరించడానికేమీ వుండదు; విధేయత తప్ప.



మార్చి 1

## ఈటెలాంటి ప్రశ్న

"నన్ను ప్రేమించుచున్నావా?" (యోహాను 21:17)

పేతురు యేసుతో "నేను నీతో కూడ చావవలసివచ్చినను, నిన్ను ఎరుగనని చెప్పను" (మత్తయి 26:35) అని సవాలు చేశాడు. (మత్తయి 26:33-34 వచనాలు కూడా చూడండి). అయితే కొన్ని రోజుల తర్వాత యేసు అడిగిన ఈ సూటి ప్రశ్నకు పేతురు స్పందన ఎంతో భిన్నంగా ఉంది. మన స్వాభావిక వ్యక్తిత్వం లేదా మన సహజస్వభావం ఎటువంటి సంకోచంలేకుండా మన అనుభూతుల్ని భావోద్వేగాల్ని బహిర్గతం చేస్తుంది. అయితే యేసు క్రీస్తు అడిగిన ప్రశ్న మనకు సూటిగా గుచ్చుకున్నప్పుడు మాత్రమే మన అంతరంగంలోని యథార్థమైన ప్రేమ బయటికి వస్తుంది. ఒక మనిషి తన స్వాభావిక వ్యక్తిత్వంతో ఎదుటి మనిషిలోని మంచితనాన్ని లేదా ఒక మంచి వ్యక్తిని ఎలా ప్రేమిస్తాడో పేతురు కూడా అలాగే యేసును ప్రేమించాడు. ఇది భావోద్వేగపూరితమైన ప్రేమ. భావోద్వేగపూరితమైన ప్రేమ మన సహజస్వభావంలోకి చొచ్చుకొనిపోగలదుగానీ మన జీవాత్మలోకి చొచ్చుకొనిపోలేదు. యథార్థమైన ప్రేమ అప్రయత్నంగా బహిర్గతం కాదు. "నన్ను మనుష్యులయెదుట ఒప్పుకొనువాడెవడో, మనుష్య కుమారుడు దేవుని దూతలయెదుట వానిని ఒప్పుకొనును" (లూకా 12:8) అని యేసు చెప్పాడు. అంటే, నోటిమాటలద్వారా కాదు గానీ మంచి క్రియలద్వారా ప్రేమను బహిర్గతం చేయడమే యేసును ఒప్పుకోడమని అర్థం.

మనగురించి మనం గొప్పగా ఊహించుకుంటూ మనల్ని మనం ఆత్మవంచన చేసుకుంటాం. మన హృదయం ఈ ఆత్మవంచనను గుర్తించి శోకపడేవరకు మన హృదయంలో దేవుని వాక్యం పనిచేయకుండా మనమే అడ్డుకుంటూ ఉంటాం. అయితే దేవుని వాక్యం మన హృదయంలోకి లోతుగా చొచ్చుకొనిపోయి మనలో పశ్చాత్తాపాన్ని కలిగించే శోకాన్ని పుట్టిస్తుంది. పాపం మన హృదయాన్ని మొద్దుబారేలా చేస్తుంది కాబట్టి పాపం మనలో శోకాన్ని పుట్టించదు. మన జ్ఞానేంద్రియాల్ని మేల్కొలిపే "నన్ను ప్రేమించుచున్నావా?" అనే ప్రశ్న మనలో సునిశితమైన బాధ కలిగిస్తుంది. ఈ బాధను మనం వర్ణించలేం. ఇది మన సహజస్వభావంలోను మనలో ఉన్న జీవాత్మలోను తీవ్రమైన కదలిక కలిగిస్తుంది. "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను ... విభజించునంతమట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది." (హెబ్రీ 4:12) దేవుని వాక్యం ఎంత సజీవంగా ఎంత బలంగా మనలోకి చొచ్చుకొనిపోతుందంటే ఇక మన హృదయంలో ఎటువంటి ఆత్మవంచనకు తావుండదు. అయితే యేసు మనల్ని ఈ ప్రశ్న అడిగినప్పుడు మనలో తీవ్రమైన ఆవేదన చోటుచేసుకుంటుంది కాబట్టి మనం ఆలోచించడం సరిగ్గా స్పందించడం అసాధ్యం. ఈ ప్రశ్న మనలో తీవ్రమైన దుఃఖాన్ని కలిగిస్తుంది కాబట్టి మనలో దేవుని చిత్తానికి వ్యతిరేకంగా ఉన్నవన్నీ ఈ బాధకు తీవ్రంగా చలిస్తాయి. దేవుని వాక్యంవలన కలిగే ఈ భారమైన దుఃఖాన్ని ఆయన పిల్లలెవరూ అపార్థం చేసుకోరు. మనలో ఈ బాధ కలిగిన మరుక్షణమే దేవుడు తన సత్యాన్ని మనకు వెల్లడి చేస్తాడు.

మార్చి 2

## ప్రభువు కలిగించిన బాధ ననుభవించావా?

"మూడవసారి ఆయన ... నన్ను ప్రేమించుచున్నావా? అని అతనిని అడిగెను" (యోహాను 21:17)

నీ అంతరంగంలో నీ జీవాత్మలో ప్రభువు కలిగించిన బాధ ననుభవించావా? దయ్యం నీ అంతరంగంలో ఎటువంటి బాధ కలిగించదు. పాపం కూడా నీ అంతరంగంలో ఎటువంటి బాధ కలిగించదు; భావోద్వేగాలు కూడా నిన్నంతగా కదిలించవు. దేవుని వాక్యం తప్ప మరేదీ నీ జీవాత్మలోకి చొచ్చుకొనిపోలేదు. "నన్ను ప్రేమించుచున్నావా అని మూడవసారి తన్ను అడిగినందుకు పేతురు వ్యసనపడి ... ఆయనతో చెప్పెను" (యోహాను 21:17). ఈ ప్రశ్నకు పేతురు తీవ్రంగా స్పందించాడు; ప్రభువుపట్ల పేతురుకున్న భయభక్తులు అతని అంతరంగాన్ని జాగృతపర్చాయి. యేసు ఎంతో సహనంతో అడిగిన ప్రశ్నకు అర్థమేమిటో అతను గ్రహించగలిగాడు. పేతురు మనస్సులో ఇక ఏ సందేహానికీ ఏ సంశయానికీ తావు లేదు. ఇక అతనిలో ఎన్నటికీ ఆత్మవంచనకు ఆస్కారం లేదు; ఉద్రేకపూరితమైన స్పందన అవసరంలేదు; తత్క్షణమే కార్యవిన్యాసం గానీ భావోద్వేగ ప్రదర్శనగానీ చూపనక్కర్లేదు. తానెంతగా ప్రభువును ప్రేమించాడో విస్పష్టంగా తెలుసుకోడానికి ఇది పేతురుకు జ్ఞానోదయం కలిగించే ప్రశ్న. ఈ ప్రశ్నకు పేతురు వ్యాకులతతో "ప్రభువా, నీవు సమస్తము ఎరిగినవాడవు ... " అని జవాబిచ్చాడు. ప్రభువుపట్ల తనకెంత ప్రేమ ఉందో పేతురు అంతరంగానికి బోధపడింది. ఇక పేతురు "ఇది చూడు ప్రభువా" అని గానీ "నా ప్రేమకు ఇది రుజువు" అని గానీ చెప్పనక్కర్లేదు. తన దృష్టి యేసు క్రీస్తు మీద మాత్రమే నిమగ్నమై ఉందని పేతురు గ్రహించాడు. అయితే ఇవేమీ పేతురు ముందుగా గ్రహించలేదు. పేతురు నొచ్చుకొనేలా ప్రభువతణ్ణి ప్రశ్నించినప్పుడు మాత్రమే పేతురుకు ఇవన్నీ బోధపడ్డాయి. ప్రభువు ప్రశ్నలెప్పుడూ మనలో ఎంత యథార్థత ఉందో మనకు బోధపరుస్తాయి.

యేసు క్రీస్తు పేతురు నడిగిన ప్రశ్నలో ప్రభువుకున్న సహనం సరళత కార్యదక్షత కనిపిస్తాయి. సరైన సమయం వచ్చేవరకు మన ప్రభువు ఎవరినీ ప్రశ్నించడు. ఎప్పుడో ఒకసారి మనందరి జీవితంలో ఆయన తన ప్రశ్నలద్వారా మన హృదయాల్లోకి లోతుగా చొచ్చుకొని వెళ్తాడు. అప్పుడు మాత్రమే మనమెంతగా ఆయణ్ణి ప్రేమిస్తున్నామో గుర్తించగలం. ప్రభువుపట్ల మన అంతరంగంలో ఉన్న ప్రేమ మాటలకందదు.

మార్చి 3

## ఆయన మనకిచ్చిన ఆదేశం

"నా గొఱ్ఱెలను మేపుము" (యోహాను 21:18)

దేవుని ప్రేమ సృష్టించబడిన ప్రేమ కాదు. ప్రేమ ఆయన స్వభావం. మనం పరిశుద్ధాత్మద్వారా క్రీస్తు జీవాన్ని పొందినప్పుడు దేవుని ప్రేమ మనలో వ్యక్తమయ్యేలా పరిశుద్ధాత్మ మనల్ని తన తండ్రితో ఏకం చేస్తాడు. పరిశుద్ధాత్మ మనలో నెలకొని ఉండడం కేవలం మనల్ని తండ్రితో ఏకంచెయ్యడం మాత్రమే కాదు గానీ యేసు ఏ విధంగా తన తండ్రితో ఏకమై ఉన్నాడో మనం కూడా అలాగే తండ్రితో ఏకమై ఉండడం కొరకే. యేసు క్రీస్తుకు తన తండ్రితో ఎటువంటి ఐక్యత ఉంది? ఎటువంటి ఐక్యత అంటే యేసును మనకొరకు బలియాగంగా అర్పించడానికి తండ్రి ఆయణ్ణి మన లోకానికి పంపినప్పుడు యేసు తన తండ్రిపట్ల పరిపూర్ణమైన విధేయత చూపాడు. "తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నానని" (యోహాను 20:21) యేసు చెప్పాడు.

యేసు పేతురును సూటిగా అడిగిన ప్రశ్నద్వారా పేతురుకు జ్ఞానోదయమయ్యింది. తానెంతగా యేసును ప్రేమిస్తున్నాడో పేతురు గ్రహించాడు. ప్రభువు తలంపుల ప్రకారం తదుపరి మెట్టు: "నిన్ను నీవు ధారపోసుకో. నువ్వు నన్నెంతగా ప్రేమిస్తున్నావో సాక్ష్యం చెప్పకు. నీకు కలిగిన అద్భుతమైన అనుభవంగురించి ఎక్కువగా మాట్లాడకు. నువ్వు చేయవలసిన పని నా గొర్రెల్ని మేపడం." యేసుకున్న గొర్రెలు విలక్షణమైనవి; కొన్ని మాట వినవు, కొన్ని నీచమైనవి, కొన్ని ఇబ్బందిపెడ్తాయి, కొన్ని దారి తప్పి ఉన్నాయి. అయితే దేవుడు ప్రేమిస్తూనే ఉన్నాడు. ఆయన ప్రేమ ఆగిపోడం అసాధ్యం. నాలో ఉన్న ప్రేమ దేవుని ప్రేమ అయినట్లయితే అది కూడా నిరంతరం వుండే ప్రేమే. అది ఆగిపోడానికి వీల్లేదు. నా సహజస్వభావం మూలంగా నాలో కలిగే పక్షపాతధోరణుల్ని దేవుని ప్రేమ ఏ మాత్రం పట్టించుకోదు. నా ప్రభువును నేను ప్రేమిస్తున్నట్లయితే నాలో ఉన్న సహజమైన రాగద్వేషాలు నన్ను శాసించకూడదు. నేనాయన గొర్రెల్ని మేపవలసిందే. ఆయన మనకిచ్చిన ఆదేశంనుండి మనం వైదొలగడానికి వీల్లేదు. నీలో ఉన్న మానవసహజ భావోద్వేగాలు భావస్వామ్యాలు (సానుభూతులు) తెలివితేటలు నీలో ఉన్న దేవుని ప్రేమమీద ఆధిపత్యం చెయ్యకుండా జాగ్రత్తపడు. అవి దేవుని యథార్థప్రేమను దుర్వినియోగం చెయ్యడానికి తప్ప మరెందుకూ ఉపయోగపడవు.

మార్చి 4

## ఇది నా విషయంలో నిజమేనా?

“అక్కడ నాకు ఏమేమి సంభవించునో తెలియదుగాని ... నా ప్రాణమును నాకెంతమాత్రమును ప్రియమైనదిగా ఎంచుకొనుటలేదు.” (అ.కా. 20:22-24)

దర్శనంలేకుండా, మరియు పిలుపు లేకుండా దేవుని సేవ చేయడం చాలా సులువు. ఎందుకంటే ఆయన నీనుండి ఏం కోరుకుంటున్నాడో అది నీకు పట్టదు. దర్శనం లేనిచోట పిలుపులేనిచోట ప్రాపంచిక జ్ఞానమే క్రైస్తవ భావోద్వేగపు ముసుగులో నీకు మార్గదర్శిగా ఉంటుంది. దేవుని పిలుపును నీవు గుర్తించనప్పటికీ  నీ చుట్టూ ఉన్న లోకం దృష్టిలో నీవు వర్ధిల్లుతూ ఉండవచ్చు, విజయాలు సాధిస్తూ ఉండవచ్చు.  నీవు తీరుబాటుగా కాలం గడుపుతూ ఉండవచ్చు. అయితే నీవు యేసు క్రీస్తు ఆదేశాన్ని చూడగలిగినప్పుడు నీ వైఖరి సమూలంగా మారిపోతుంది. దేవుడు నిన్ను ఏం అడుగుతాడో అనే స్మృతి నీవాయన చిత్తాన్ని నెరవేర్చేలా నిన్ను కార్యాచరణకు ప్రోత్సహిస్తుంది. అప్పుడాయనకొరకు పనిచేయడానికి నీవిక లోకజ్ఞానాన్ని ఆధారం చేసుకొనవు.

నేను దేన్ని నా ప్రాణానికి ప్రియంగా ఎంచుకుంటున్నాను? నేను యేసు క్రీస్తు చేత పట్టుకొనబడకపోయినట్లయితే, నేనాయనకు నన్ను నేను లోబర్చుకోకపోయినట్లయితే నేను దేవునికిచ్చే సమయాన్ని, సేవలో నా స్వంత ఆలోచనల్ని మిక్కిలి ప్రియమైనవిగా పరిగణిస్తాను. అంతే కాదు. నా ప్రాణాన్ని నేను ప్రియమైనదిగా భావిస్తాను. అయితే పౌలు తన ప్రాణంకంటె దేవుని పరిచర్యను ప్రియమైనదిగా పరిగణించాడు. తన యావత్‌శక్తినీ పరిచర్యకొరకే వినియోగించాడు. పౌలు తనగురించి తాను ఆలోచించడంలేదని ఇతరులు ప్రశ్నించడం అతనికి విసుగును బాధను కలిగించింది. మనం రెండు విషయాల మధ్య తీవ్రమైన స్పర్ధను చూస్తాం. మనం మన స్వంత ఆలోచనల ప్రకారం చేసే దేవుని సేవ వాస్తవానికి మనమాయనపట్ల చూపవలసిన సంపూర్ణ సమర్పణతో పోటీ పడ్తుంది. “నువ్విక్కడ ఉండడం ఎంత మంచిదో చూడు, నువ్వు ఈ పనిచేయడం ఎంత ముఖ్యమైనదో చూడు” అని నీ మనస్సు ప్రేరేపించే ఆలోచనలు నీ సేవకు ప్రేరణగా ఉంటాయి.  నువ్వెక్కడికి వెళ్లాలి నువ్వేం చేయాలి అనే విషయాల్లో నీవు నీ స్వంత ఆలోచనలు, అంచనాల ప్రకారం నడుస్తావు తప్ప దేవుని చిత్తం ప్రకారం నడవవు. అయితే నీవు ఉపయోగపడగలవా ఉపయోగపడలేవా అనే విషయాన్ని ప్రక్కన పెట్టి “మీరు మీ సొత్తు కారు” (1 కొరింథీ 6:19) అని పౌలు చెప్పిన మాటల్ని పరిగణనలోకి తీసుకో. నీవు నీ సొత్తు కావు; దేవుని సొత్తువు.

మార్చి 5

## ఆయన నిజంగా నా ప్రభువా?

"నా పరుగును, నేను ప్రభువైన యేసువలన పొందిన పరిచర్యను తుదముట్టింప వలెనని ... " (అ.కా. 20:24)

నేను నా స్వంత ఆలోచనలప్రకారం నడిచి విజయం సాధించడం నాకు నిజమైన సంతోషాన్నివ్వదు గానీ ఏ ఉద్దేశంతో దేవుడు నన్ను సృష్టించాడో మరియు నేనెందుకు తిరిగిపుట్టానో గ్రహించి దాన్ని సంపూర్ణంగా నెరవేర్చినప్పుడు మాత్రమే నిజమైన సంతోషం కలుగుతుంది. మన ప్రభువు తన తండ్రి తనకప్పగించిన పనిని నెరవేర్చినప్పుడు సంతోషాన్ని పొందాడు. "తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నానని ... " (యోహాను 20:21) యేసు చెప్పాడు. నీవు ప్రభువునుండి పరిచర్యను పొందావా? అయినట్లయితే నీకప్పగించబడిన పరిచర్యపట్ల నీవు నమ్మకంగా ఉండాలి. నీ పరిచర్యను నెరవేర్చినప్పుడు మాత్రమే నీ జీవితం ప్రయోజనకరమైందని భావించాలి. యేసు నీవేం చేయాలని నిన్ను పంపించాడో దాన్ని నీవు సంపూర్ణంగా నెరవేర్చినప్పుడు ఆయన నిన్ను "భళా, నమ్మకమైన మంచి దాసుడా" (మత్తయి 25:21) అని ప్రశంసించడం నీకెంత సంతృప్తినిస్తుందో ఆలోచించావా? మనందరికీ దేవుడు జీవితస్థానాన్ని నిర్దేశించాడు. అదేమిటో మనం ప్రభువునుండి పరిచర్యను పొందినప్పుడు మన ఆత్మకు తెలుస్తుంది. ప్రభువు మనకు తన పరిచర్య నప్పగించాలంటే మనమాయనతో అన్యోన్య సహవాసాన్ని కలిగి ఉండాలి; కేవలం యేసు నీ స్వంత రక్షకుడిగా ఉంటే సరిపోదు. "ఇతడు నా నామముకొరకు ఎన్ని శ్రమలను అనుభవింపవలెనో నేను ఇతనికి చూపుదునని అతనితో చెప్పెను" (అ.కా. 9:16) అని పౌలు విషయంలో ప్రభువనిన మాటలు మనల్ని బలంగా తాకాలి.

"నన్ను ప్రేమించుచున్నావా?", "నా గొఱ్ఱెలను మేపుము" (యోహాను 21:17,18) - ఇవి ఆదేశాలే తప్ప మన ఇష్టాన్ని మన అభిరుచిని తెలుసుకొనేందుకు మాట్లాడిన మాటలు కావు. ఆయన మన కప్పగిస్తున్న పనిపట్ల ఎటువంటి షరతుల్లేని మన సంపూర్ణ విధేయతను కోరుతూ ప్రభువు మాట్లాడిన మాటలివి. మనం దేవునితో అన్యోన్య సహవాసంలో ఉన్నప్పుడు మాత్రమే లోతైన ఈ మాటల్ని గ్రహించగలం. నీవు ప్రభువైన యేసునుండి పరిచర్యను పొందినట్లయితే అవసరత పిలుపు వేర్వేరని గ్రహించగలవు. పిలుపును అమలు చేసే అవకాశమే అవసరత. పిలుపు ప్రభువు నీకప్పగించిన పరిచర్యపట్ల నీవు నమ్మకంగా ఉండడం. అంటే నీకు వేర్వేరు పరిచర్యలనేకం ఉన్నాయని కాదు గానీ దేవుడు నీకు అప్పగించిన పరిచర్యపట్ల నీవు నమ్మకంగా ఉండడమని అర్థం. అయితే నీవు నీ పిలుపుపట్ల నమ్మకంగా ఉండడంకొరకు నీ జీవితంలోని ఇతర ప్రాధాన్యతల్ని ఉపేక్షించక తప్పదు.

మార్చి 6

## తదుపరి మెట్టు

"శ్రమలయందును ఇబ్బందులయందును ఇరుకులయందును దెబ్బలయందును .... మిగుల ఓర్పుగలవారమై " (2 కొరింథీ 6:4)

నీకు దేవునినుండి దర్శనం లేనట్లయితే నీలో ధ్యేయసాధన ఉండదు; నిన్ను గమనిస్తూ నిన్ను ప్రోత్సహించేవారుండరు. నీ భక్తివిశ్వాసాల్లో తదుపరి మెట్టుకు చేరాలంటే సర్వశక్తిమంతుడైన దేవుని కృప నీకు అవశ్యంగా కావాలి. దేవుని వాక్యాన్ని పఠించేటప్పుడు, ధ్యానించేటప్పుడు, నీ కుటుంబంలోను, నీ ఉద్యోగంలోను నీకు ఆయన కృప కావాలి. నీవు ఈ తదుపరి మెట్టునెక్కడం సువార్త ప్రకటించడంకంటె భారంగా ఉంటుంది. మరి నీవెంత ఎక్కువగా దేవునిమీద ఆధారపడాలో ఆలోచించు.

నీ చుట్టూ ఉన్నవారు యేసు క్రీస్తును నీలో చూస్తున్నామనుకొనే ప్రత్యక్ష అనుభవానికి నీవు వాస్తవరూపాన్నివ్వాలి. వాస్తవానికి ప్రతి క్రైస్తవుడూ ఇలాగే ఉండాలి. మనకు దర్శనం, ప్రేరణ, ఎదుగుదల లేనట్లయితే మనం ఆసక్తి కోల్పోతాం; మన జీవితం సర్వసాధారణమైన దైనందిన కార్యక్రమాలకు మాత్రమే పరిమితమవుతుంది. మనలో దేవునికొరకు బలమైన సాక్ష్యం ఉండాలంటే మనలో ఉండవలసినది ఎడతెగని పట్టుదల మాత్రమే. మనలో ఉన్న పట్టుదల మనం చేస్తున్న పరిచర్య ఇతరుల మెప్పును ప్రశంసను పొందలేకపోయినప్పటికీ మనలో పట్టుదల వీగిపోకూడదు. అపజయాన్నెరుగని జీవితం మనకు కావాలంటే ఏకైక మార్గం దేవునివైపు చూడడం మాత్రమే. నీ అంతరాత్మను పునరుత్థానుడైన క్రీస్తువైపు మళ్లించమని దేవుణ్ణి ప్రార్థించు. అప్పుడు నీవు పడుతున్న కష్టం నీకు నిరుత్సాహం కలిగించదు. కొన్ని పనులు నీ హోదాకు తగనివని లేదా అవి అత్యల్పమైనవనీ ఎప్పుడూ తలంచకు. క్రీస్తు చూపిన మాదిరిని (యోహాను 13:1-17) మనస్సులో పెట్టుకో.

మార్చి 7

## సమృద్ధ ఆనందానికి మూలం

"మనలను ప్రేమించినవానిద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము." (రోమా 8:37)

పరిశుద్ధుణ్ణి దేవునిప్రేమనుండి వేరుచేయగలవాటి గురించి పౌలు మాట్లాడుతున్నాడు. అయితే ప్రశంసించవలసిన విషయమేమిటంటే పరిశుద్ధుణ్ణి దేవుని ప్రేమనుండి ఏదీ వేరుచేయ లేదు. పౌలు ప్రస్తావించినవి (రోమా 8:38-39) మన ఆత్మకు దేవునికి మధ్య అన్యోన్య సహవాసాన్ని ఆటంకపర్చగలవుగానీ వీటిలో ఏదీ మనకు దేవునిప్రేమకు మధ్య నిలబడలేవు. కల్వరి సిలువలో వెల్లడైన దేవుని అద్భుతప్రేమ క్రైస్తవ విశ్వాసానికి పునాది. ఈ ప్రేమకు ఏ హద్దులూ అవధులూ లేవు. ఈ ప్రేమ మనం సంపాదించుకున్న ప్రేమ కాదు; వాస్తవానికి మనం సంపాదించుకోలేం కూడా. ఈ కారణంచేతనే పౌలు "మనలను ప్రేమించినవానిద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము" అని చెప్పాడు. ఏవి మనల్ని అణచివేసి ఓడిస్తాయని భావించామో వాటిపై మనం పొందిన అనూహ్యవిజయం మనల్ని విజేతల్ని చేసింది.

అనుభవంలేని సామాన్య ఈతగాడిని సముద్రంలో ఉవ్వెత్తున పైకి లేచే అలలు భయపెడతాయి; అయితే అవే అలలు నేర్పరియైన గజఈతగాడికి ఆనందావేశాల్ని కలిగించి అతడ్ని ఉ(దూతలూగిస్తాయి. ఈ దృష్టాంతాన్ని మన స్వంత అనుభవాలకు అనువర్తించు కుందాం. శ్రమలు బాధలు హింసలు మనల్ని భయభ్రాంతులకు గురిచేస్తాయి; మనం వీటిని తప్పించుకోవాలనుకుంటాం. అయితే ఇవే "మనలను ప్రేమించినవానిద్వారా" మనకు మితిలేని ఆనందాన్నిస్తాయి. "మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము" అని పౌలు వివరించాడు. అయితే ఒక విషయం గమనార్హం. శ్రమలున్నప్పటికీ మనం సంతోషించడం కాదు గానీ శ్రమలమధ్య సంతోషాన్ని పొందడం ఈ వచనంలో విశేషాంశం. శ్రమ కలిగినప్పటికీ పరిశుద్ధునికి ప్రభువులో ఆనందాన్ని చూడడంకాదు ముఖ్యం కాదుగానీ శ్రమనుబట్టి ఆనందించడం ప్రాముఖ్యమైన విషయం. "మా శ్రమయంతటికి మించిన అత్యధికమైన ఆనందముతో ఉప్పొంగుచున్నాను" (2 కొరింథీ 7:4) అని పౌలు వర్ణన.

సమృద్ధ ఆనందానికి సహజపరిణామం వన్నెతరగని ప్రకాశం. వన్నెతరగని ప్రకాశానికి కారణం క్షీణించేవి కాదు గానీ ఎన్నటికీ క్షీణించని, ఎన్నటికీ మారని, మార్పులేని దేవుని ప్రేమ మాత్రమే. ఇక మన జీవితానుభవాలు సర్వసాధారణమైన దైనందిన కార్యక్రమాలైనప్పటికీ, మనల్ని భయభ్రాంతులకు గురిచేసే అసాధారణ సంఘటనలైనప్పటికీ వాటికి మనల్ని దేవుని ప్రేమనుండి వేరుచేసే శక్తి లేదు. "మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను" (రోమా 8:38-39). ఇది పౌలు అనుభవం మాత్రమే కాదు; మన అనుభవం కూడా.

మార్చి 8

## లోబర్చబడిన జీవితం

"నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడియున్నాను" (గలతీ 2:20)

యేసు క్రీస్తుతో ఐక్యత కలిగి ఉండాలనుకున్న వ్యక్తి పాపాన్ని విడిచిపెట్టడానికి సిద్ధమవడంతోబాటు తన జీవితవైఖరిని కూడా సమూలంగా యేసుకు లోబర్చవలసి ఉంటుంది. దేవుని ఆత్మద్వారా తిరిగిపుట్టడమంటే మనం మన గురించి గొప్పగా ఊహించుకొనేవాటన్నిటిని వదిలిపెట్టవలసి ఉంటుంది. అన్నిటికంటె ముందుగా మనం మనలో ఉన్న కపటాన్ని లేదా వంచనను వదిలిపెట్టాలి. మనం మన మంచితనాన్ని నిజాయితీని సమర్థతను తన ముందు ప్రదర్శించాలని దేవుడు కోరుకోడు గానీ మనలో ఉన్న పాపాన్ని మనం విడిచిపెట్టాలని ఆయన కోరుకుంటున్నాడు. వాస్తవానికి ఆయన మనలోనుండి పాపాన్నే వెలుపలికి తీయాలనుకుంటున్నాడు. మనలోనుండి వెలుపలికి తీసిన పాపం స్థానంలో ఆయన తన నీతిని నింపాలనుకుంటున్నాడు. అయితే మనం గొప్పవారమనే కపట భావనను, దేవుని యెదుట మనం యోగ్యులమనే ఆత్మవంచనను మనలోనుండి తొలగించుకోవాలి.

మనలోనుండి కపటం వంచన వంటి దుర్గుణాలు తొలగించబడిన తర్వాత మనమింకా ఏ యే వాటిని వదిలిపెట్టవలసి ఉందో దేవుని ఆత్మ మనకు వెల్లడి చేస్తాడు. ఈ ప్రక్రియలో భాగంగా మనం మనల్ని ఉపేక్షించుకోవాలి. మనం మనకున్నాయనుకుంటున్న యోగ్యతల్ని మన కోరికల్ని మన జీవితంలోని సమస్తాన్ని వదిలి పెట్టవలసి ఉంటుంది. యేసు క్రీస్తు మరణంతో నిన్ను నీవు సారూప్యపర్చుకోడానికి నీవు సిద్ధమేనా?

మనల్ని మనం యేసుకు సంపూర్ణంగా లోబర్చుకున్నప్పుడు మనలోని భయ భ్రాంతులన్నీ వాటంతట అవే తొలగిపోతాయి. అయితే ఇది మన హృదయానికి బాధ కలిగించడం ఖాయం. ప్రభువు మనల్ని చూచినప్పుడు ఆయనకు మనమెలా కనిపిస్తామో అదే దృష్టితో మనల్ని మనం పరీక్షించుకున్నప్పుడు మన శరీరకార్యాలకంటె మిన్నగా మనల్ని బాధపెట్టేది యేసును తిరస్కరించే మన హృదయగర్వం. అయితే మనల్ని మనం ప్రభువు కాంతిలో పరిశోధించుకున్నప్పుడు మనలో కలిగే అవమానభారం విభ్రాంతి మనలో పశ్చాత్తాపాన్ని పుట్టించడం తథ్యం.

దేవునికి నీ జీవితాన్ని లోబర్చాలా వద్దా అనే సంఘర్షణ నీకెదురైనప్పుడు నీవు ఆ సంఘర్షణగుండా నడవడానికి, నిన్ను నీవు ఆయనకు అప్పగించుకోడానికి, నీకున్నవి ఆయనకు అప్పగించడానికి సిద్ధపడు. అప్పుడాయన నీనుండి ఏం కోరుకుంటున్నాడో వాటిని నీవు చేయడానికి నిన్ను సిద్ధపరుస్తాడు.

మార్చి 9

## వెనకడుగు వేయడమా లేక యేసుతో నడవడమా?

"మీరు కూడ వెళ్లిపోవలెనని యున్నారా?" (యోహాను 6:67)

సూటిగా హృదయానికి తగిలే ప్రశ్న! యేసు ప్రభువు సూటిగా మాట్లాడే మాటలు మనల్ని ఎక్కడ తాకాలో అక్కడ తాకుతాయి. యేసు ఎవరో మనకు తెలిసినప్పటికీ ఆయన మనల్ని "మీరు కూడ వెళ్లిపోవలెనని యున్నారా?" అని అడుగుతున్నాడు. ఈ ప్రశ్నకు మన స్వాభిమానం మనకు అడ్డుగా వచ్చినప్పటికీ మనమాయనపట్ల నిరంతరం సాహసోపేతవైఖరిని చూపెట్టాలి. వాస్తవానికి మనలో ఈ సాహసాన్నే యేసు కోరుకుంటున్నాడు.

"అప్పటినుండి ఆయన శిష్యులలో అనేకులు వెనుకతీసి, మరి ఎన్నడును ఆయనను వెంబడించలేదు" (యోహాను 6:66). వారు యేసుతో ముందుకు నడవడానికి బదులు వెనకడుగు వేశారు. వెనకడుగువేసి వారు పాపం చేయకపోయినప్పటికీ ఆయననుండి దూరంగా జరిగారు. నేడు అనేకమంది తమ జీవితాల్ని యేసుకొరకు ధారపోస్తూ ఆయనకొరకు పనిచేస్తున్నారుగానీ ఆయనతోబాటు నడవడంలేదు. యేసు మనలో ఎప్పటికీ కోరుకునేది మనమాయనతో నడవాలనేదే. మనం యేసుకొరకు ప్రత్యేకించబడిన తర్వాత ఆయనతో ఐక్యతను అన్యోన్యతను కాపాడుకోడానికి మనం నిరంతరం శ్రమించవలసి ఉన్నాం. దేవుడు తన చిత్తాన్ని నీకు వెల్లడిచేసి నిశ్చయపర్చినప్పుడు నీవాయనతో ఐక్యతను అన్యోన్యతను కాపాడుకోడానికి నీవు చేసే సాధనతో ఇక అవసరం వుండదు. ఇక నీవు చేయవలసినది యేసు క్రీస్తుపై పూర్తిగా ఆధారపడి ఏ భేషజాల్లేకుండా జీవించడం మాత్రమే. ఆయన మార్గంలో కాక మరో మార్గంలో నడుస్తూ ఆయనతోబాటు నడుస్తున్నానుకోకు. ఆయన మార్గమంటే ఆయనపట్ల అచంచలమైన భక్తివిశ్వాసాలు చూపడమే. ముందున్న అనిశ్చయతల్ని ఏ మాత్రం లెక్కచేయకపోడమే ఆయనతో నడవడంలో ఉన్న రహస్యం.

యేసు లోకానికి రక్షణనిస్తాడని, తనకు కూడా రక్షణనిస్తాడని మాత్రమే ఈ వచన భాగాల్లో పేతురు గ్రహించగలిగాడు. అయితే మనం యేసుతోబాటు సహపనివారిగా ఉండాలని ఆయన కోరుకుంటున్నాడు.

యోహాను 6:70 వచనంలో పేతురు తనతోబాటు నడుస్తానన్నాడని యేసు జ్ఞాపకం చేస్తున్నాడు. యేసు పేతురు నడిగిన ప్రశ్నను మనమే మన హృదయాన్నడిగి జవాబుకొరకు చూడాలి. "మీరు కూడ వెళ్లిపోవలెనని యున్నారా?"

మార్చి 10

## ఆయన సందేశానికి మాదిరిగా వుండడం

"వాక్యమును ప్రకటించుము" (2 తిమోతి 4:2)

మనమాయన సాధనాలుగా ఉండడంకొరకుమాత్రమే రక్షించబడలేదు; మనమాయన కుమారులం, కుమార్తెలం కూడా. దేవుడు మనల్ని కేవలం ఆధ్యాత్మిక కార్యకర్తలుగా మాత్రమే చూడడంలేదు; మనమాయన సందేశాల్ని మోసుకుపోయే దూతలం కూడా. అంతే కాదు, ఆయన సందేశం మన జీవితంలో ఒక అంతర్భాగం. దేవుని సందేశం ఆయన కుమారుడిగురించే: "నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి ... " (యోహాను 6:63) ఆయన శిష్యులమైన మన జీవితాలు ఈ పవిత్ర సందేశాన్ని వ్యక్తీకరించేవిగా ఉండాలి. నిర్మలమైన మన జీవితాలే ఈ సందేశానికి ఉదాహరణలు. రక్షించబడనివారు సైతం సేవచేస్తున్న సందర్భాల్ని చూస్తున్నాం. అయితే పాపాల విషయంలో పశ్చాత్తాపాన్ని, పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని పొంది, దేవుని ఉద్దేశాలనిమిత్తం నలగగొట్టబడిన విధేయత కలిగి ఉన్నప్పుడు మాత్రమే మన జీవితం దేవుని సందేశానికి పవిత్రమైన మాదిరిగా ఉండగలదు.

సాక్ష్యం చెప్పడం బోధించడం వేర్వేరు. బోధకుడికి దేవుని పిలుపు ఉంటుంది; బోధకుడు తన యావత్‌శక్తిని వినియోగించి దేవుని సత్యాల్ని ప్రకటిస్తాడు. మన ఆశలు ఆదర్శాలు కోరికలకంటె మిన్నగా దేవుడు మనల్ని హెచ్చించి మనల్ని తన ఉద్దేశాల కనుగుణంగా మలచుకుంటాడు. ఆయన తన శిష్యుల్ని పెంతెకొస్తు తర్వాత ఎలా మలచుకున్నాడో మనల్నికూడా తన ఉద్దేశాలకొరకు అలాగే మలచుకుంటాడు. పెంతెకొస్తు ఉద్దేశం శిష్యులకు ఏదో బోధించడం కాదు గానీ వారేం బోధిస్తున్నారో అది వారి జీవితంలో సాక్షాత్కరించేలా చేయడమే పెంతెకొస్తు ఉద్దేశం. "నాకు సాక్షులైయుందురని ... " (అ.కా. 1:8) - ఈ సందేశం మన జీవితంలో సాక్షాత్కరించడమే సాక్ష్యం.

నీవు మాట్లాడుతున్నప్పుడు దేవునికి నీ జీవితంలో స్వేచ్ఛనివ్వు. నీ ద్వారా దేవుని సందేశం ఇతరుల్ని విమోచించేముందు ఆ విమోచన నీ జీవితంలో వాస్తవం కావాలి. నీవు చెప్పబోయే సందేశంపట్ల శ్రద్ధ వహించు. అప్పుడు దేవుడు తన మహిమకొరకు "అగ్నిజ్వాల" వంటి సందేశాన్ని నీ నోటిలో ఉంచుతాడు.

మార్చి 11

## పరలోకసంబంధమైన దర్శనంపట్ల విధేయత

"ఆకాశమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక ... " (అ.కా. 26:19)

దేవుడు మనకనుగ్రహించిన పరలోకసంబంధమైన దర్శనానికి మనం దూరమైనట్లయితే అందుకు బాధ్యత వహించేది మనమే; దేవుడు కాదు. మనలో ఆధ్యాత్మిక ఎదుగుదల లేదు కాబట్టి మనం దర్శనానికి దూరమౌతున్నాం. దేవునిగురించి మనకున్న నమ్మకాల్ని మన దైనందిన జీవితానికి అనువర్తించుకోలేకపోయినట్లయితే దేవుడు మన కనుగ్రహించిన దర్శనాన్ని నెరవేర్చలేం. "పరలోకసంబంధమైన" దర్శనానికి సంపూర్ణ విధేయత చూపే ఏకైక మార్గం మన సర్వస్వాన్ని ఆయన ఘనతకొరకు, అంటే మన యావత్‌శక్తినీ ఆయన మహిమకొరకు అర్పించడం మాత్రమే. ఇది మనం దేవుని దర్శనాన్ని నిరంతరం జ్ఞాపకం చేసుకోవాలని దృఢనిర్ణయం తీసుకున్నప్పుడు మాత్రమే నెరవేరగలదు. పరలోకసంబంధమైన దర్శనంపట్ల మనం చూపే విధేయతకు కఠినపరీక్ష ఎదురయ్యేది మన వ్యక్తిగత ప్రార్థనల్లోనో లేదా బహిరంగ సమావేశాల్లోనో కాదు. మన దైనందిన జీవితంలో ప్రతి క్షణం పరీక్షా సమయమే.

"అది ఆలస్యముగా వచ్చినను దానికొరకు కనిపెట్టుము ... " (హబక్కూకు 2:3) మన స్వంత ప్రయత్నాలద్వారా దర్శనాన్ని నెరవేర్చలేం; దర్శనం నెరవేరేవరకు మనం దర్శనస్ఫూర్తితో పనిచేయాలి. మనం భావనాశూన్యమైన ఆచరణలవైపు మొగ్గుచూపిస్తూ దర్శనాన్ని మర్చిపోతున్నాం. మొదట్లో మనకు దర్శనం వుందిగానీ మనం దర్శనం సంపూర్ణ నెరవేర్పుకొరకు సహనంతో నిరీక్షించకుండా మన స్వంత కార్యాచరణలకొరకు త్వరపడ్డాం. దర్శనం నెరవేర్పును కూడా చూడలేనంతగా మన పనుల్లో నిమగ్నమయ్యాం. దర్శనం నెరవేర్పు ఆలస్యం కావడమే దేవునిపట్ల మన విశ్వాసానికి అసలు పరీక్ష. మన కార్యాచరణ హడావుడిలో మన ఆధ్యాత్మిక శ్రేయస్సును పణంగాపెట్టి దర్శనం నెరవేర్పును చూడలేకపోతున్నాం.

దేవుడు పంపించే తుపానుల్ని చూడు. దేవుడు మనల్ని బలంగా నిలబెట్టాలంటే సుడిగాలులు తప్పవు. లోపల గింజల్లేని గలగల్లాడే ఎండిన కాయల్లాగా ఉంటావా? ఇది నీవు దేవుని దర్శనపు కాంతిలో జీవిస్తున్నావో లేదో అనేదానిపై ఆధారపడి ఉంటుంది. దేవుడు నిన్ను సుడిగాలిలో ఉంచినప్పుడు నీ స్వంత ఆలోచనల ప్రకారం వెళ్లి గలగల్లాడే ఎండిన కాయల్లాగా నిష్ఫలంగా ఉండకు. దేవుడు నడిపించినప్పుడు మాత్రమే వెళ్లి "ఫలించు" (యోహాను 15:8).

దేవుని దర్శనపు కాంతిలో నడవడం ముఖ్యం. (1 యోహాను 1:7)

మార్చి 12

## సంపూర్ణ సమర్పణ

“పేతురు -ఇదిగో మేము సమస్తమును విడిచిపెట్టి నిన్ను వెంబడించితిమని ఆయనతో చెప్పసాగెను.” (మార్కు 10:28)

పేతురు తాను సమస్తాన్ని విడిచిపెట్టి వచ్చానని మన ప్రభువుతో చెప్పినప్పుడు ఆయన “నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ... ” (10:29) అని బదులిచ్చాడు. శిష్యులకు ఇందులో ఏదో ప్రయోజనం ఉంటుందనికాదు గానీ యేసుకొరకు సువార్తకొరకు వారు సమస్తాన్ని విడిచిపెట్టారని అర్థం. నిన్ను నీవు సమర్పించుకోడానికి నీ వ్యక్తిగత ప్రయోజనాలు ప్రేరణగా ఉన్నాయేమో సరిచూసుకో. ఉదాహరణకు, “నేను పాపంనుండి విడుదలపొంది పవిత్రంగా జీవించాలనుకుంటున్నాను కాబట్టి నన్ను నేను దేవునికొరకు సమర్పించు కుంటున్నాను” అని చెబ్తావేమో! అయితే ఇది వేరు, సమర్పణ వేరు. నిన్ను నీవు దేవునియెదుట సరిచేసుకోడానికి నీ పాపాల్ని విడిచిపెట్టి పవిత్రంగా జీవించాలనుకుంటున్నావు. అయితే ఇందుకొరకు నన్ను నేను సమర్పించుకుంటున్నానని తలంచడం సరైన దృక్పథం కాదు.  నీ వ్యక్తిగత ప్రయోజనం నీ సమర్పణకు ప్రేరణ కాకూడదు. మనమెంత స్వార్థచింతనతో సంకుచితంగా ఉన్నామంటే కేవలం మనకొరకు మాత్రమే దేవుణ్ణి అడుగుతున్నాంగానీ దేవునికొరకు దేవుణ్ణి ప్రార్థించడంలేదు. ఇదెలా ఉంటుందో చూడండి - “ప్రభువా, నాకు నీవక్కర్లేదు. నాకు నేనే కావాలి. అయితే నీవు నన్ను పరిశుద్ధపర్చి పరిశుద్ధాత్మతో నింపు. అప్పుడు నేను ‘దేవుడు నాపట్ల ఈ కార్యం జరిగించాడు’ అని నా గురించి గొప్పగా చెప్పుకుంటాను.”

పాపంనుండి విడుదల పొందడం, దేవునికొరకు ప్రయోజనకరంగా ఉండడం, పరలోకం సంపాదించుకోడం - ఇవేమీ సంపూర్ణ సమర్పణ కాదు. అసలైన సంపూర్ణ సమర్పణ అంటే కేవలం యేసు క్రీస్తు కొరకే జీవించాలని నీమట్టుకు నీవు వ్యక్తిగత ఎంపిక చేసుకోడం.

కుటుంబసంబంధాలు బంధుత్వాలు మన ఆలోచనల్లో అగ్రభాగాన్ని ఆక్ర మిస్తున్నప్పుడు ఇక యేసు క్రీస్తుకు తావెక్కడ? “అవును, ప్రభువా. నీవు నన్ను పిలుస్తున్నావని నాకు తెలుసు. అయితే నా కుటుంబానికి నేను కావాలి. నేను  చేయవలసిన స్వంత పనులు కొన్ని ఉన్నాయి. నేను నీకొరకు ముందుకు నడవలేను” (లూకా 9:57-62 వచనాలు చూడండి) అని మనలో అనేకులు ఆయణ్ణి విడిచిపెట్టడానికి ప్రయత్నిస్తుంటారు. అప్పుడు యేసు మనకిచ్చే జవాబు “వాడు నా శిష్యుడు కానేరడు” (లూకా 14:25-26).

మనలో స్వాభావికంగా ఉండే భక్తి వేరు, సంపూర్ణ సమర్పణ వేరు. మనల్ని మనం తగ్గించుకొని దేవునికొరకు సమర్పించుకున్నప్పుడు ఆయన మనకు కొదువగా ఉన్నవాటిని నింపుతాడు. నిన్ను నీవు సంపూర్ణంగా సమర్పించుకోడానికి నీకు అడ్డుగా ఉన్నవాటి విషయంలో జాగ్రత్తగా ఉండు. మనలో చాలామందికి సంపూర్ణ సమర్పణ దర్శనం వుంది గానీ దాని నిజమైన అనుభవం లేదు.

మార్చి 13

## మనకొరకు యేసు తనను తాను రిక్తుణ్ణి చేసుకోడం

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను ... ఆయనను అనుగ్రహించెను."
(యోహాను 3:16)

రక్షణ అంటే కేవలం పాపంనుండి విడుదల పొందడం లేదా పవిత్రంగా జీవించడం మాత్రమే కాదు. దేవుడనుగ్రహించే రక్షణ అంటే అహాన్ని పూర్తిగా విడిచిపెట్టి దేవునితో పరిపూర్ణ ఐక్యత కలిగి ఉండడమని అర్థం. నేను నా రక్షణానుభవంగురించి ఆలోచించేటప్పుడు సాధారణంగా నేను పాపంనుండి విడుదలపొందడంగురించి వ్యక్తిగతంగా పవిత్రంగా జీవించడం గురించి మాత్రమే ఆలోచిస్తాను. అయితే రక్షణ అంతకంటె గొప్పది! రక్షణ అంటే దేవుని ఆత్మద్వారా మనం దేవునితో అన్యోన్యసహవాసం కలిగి ఉండడమని అర్థం. నన్ను నేను దేవునికి సంపూర్ణంగా సమర్పించుకుంటున్నాననే భావన నాకు అత్యధికమైన ఆనందాన్ని పరవశాన్ని కలిగిస్తుంది. అనంతమైన ఈ భావనముందు నేను చాలా చిన్నవాడిని.

మనం పరిశుద్ధతగురించి, లేదా ప్రత్యేకించబడడంగురించి బోధించడానికి పిలవ బడ్డామని చెబ్తున్నామంటే మనం గురితప్పినట్లే. మనం యేసు క్రీస్తును ప్రకటించడానికి పిలవబడ్డాం (1 కొరింథీ 2:2 చూడండి). దేవుడు మనల్ని పాపంనుండి విడిపించి పరిశుద్ధ పర్చాడనే వాస్తవం యేసు మనకొరకు తనను తాను రిక్తుణ్ణి చేసుకున్న అత్యద్భుత సత్యంలో అంతర్భాగం.

మనల్ని మనం సంపూర్ణంగా సమర్పించుకున్నట్లయితే మన సమర్పణ జీవితంగురించి మనం గొప్పగా భావించం. మనమెవరికి మనల్ని మనం సమర్పించుకున్నామో మన యావత్‌జీవితం ఆయనకే అంకితం. సమర్పణగురించి తెలుసుకోకుండా సమర్పణగురించి మాట్లాడవద్దు. వాస్తవానికి, నీవు యోహాను 3:16 వచనాన్ని అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే, అంటే దేవుడు తనను తాను మనకొరకు రిక్తుణ్ణి చేసుకున్నాడని నీవు గ్రహించినప్పుడు మాత్రమే సమర్పణ అంటే ఏమిటో నీకు అర్థమవుతుంది. దేవుడు తనను తాను మనకొరకెలా రిక్తుణ్ణి చేసుకున్నాడో మనం కూడా అలాగే ఆయనకొరకు మనల్ని మనం సంపూర్ణంగా ఏ షరతుల్లేకుండా రిక్తుల్ని చేసుకోవాలి. అప్పుడు మన సమర్పణ పర్యవసానాలు ఫలితాలు మన మనస్సులోకి ప్రవేశించవు. ఎందుకంటే మన జీవితం ఆయనకొరకే అంకితమైంది కాబట్టి.

మార్చి 14

## లోబడడం

"లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో ... దానికే దాసులగుదురని మీరెరుగరా?" (రోమా 6:16)

మొట్టమొదట నేనొక విషయాన్ని ఒప్పుకోవాలి. నన్ను అదుపుచేసేవాటిగురించి నన్ను శాసించేవాటిగురించి నాలో నేను ఆత్మవిమర్శ చేసుకున్నప్పుడు ఏవి నన్ను అదుపు చేస్తున్నాయో ఏవి నన్ను శాసిస్తున్నాయో వాటికి నేను లొంగిపోయానని, అందుకు నేనే బాధ్యుడనని తెలుసుకున్నాను. నాకు నేనే బానిసనైనట్లయితే నన్ను నేనే నిందించుకోవాలి. అలాగే నేను దేవునికి విధేయత చూపిస్తున్నట్లయితే అందుకు కారణం నా జీవితంలో ఎప్పుడో ఒక సమయంలో నేను దేవునికి లోబడడమే.

ఒక చిన్న బిడ్డ తనలో ఉన్న స్వార్థానికి లొంగిపోయినప్పుడు ఆ బిడ్డ తనను స్వార్థం శాసిస్తోందని గ్రహించగలడు. మనం దేనికి లొంగిపోయామో అది మనల్ని శాసించడం చూస్తున్నప్పుడు ఇంతకంటె నిరంకుశమైనది క్రూరమైనది భూమ్మీద ఏదీ ఉండదని తెలుస్తుంది. ఎందుకంటే మానవసహజమైన లొంగుబాటును లేదా దాసత్వాన్ని బ్రద్దలు చేసే శక్తి మనలో ఉండదు. ఉదాహరణకు, ఒకే ఒక క్షణంలో మనం ఇంద్రియవాంఛలకు లొంగిపోయినట్లయితే, తర్వాత అలా లొంగిపోయినందుకు మనల్ని మనం అసహ్యించుకున్నప్పటికీ ఆ క్షణంలో ఆ వాంఛలు శాసించినట్లే. (ఇంద్రియ వాంఛలంటే, ఇదిప్పుడే నాకు కావాలనే ప్రగాఢమైన కోరిక అని జ్ఞాపకం పెట్టుకో. అది శరీరానికి సంబంధించినదైనా కావచ్చు, లేదా మనస్సుకు సంబంధించినదైనా కావచ్చు.) ఇంద్రియ వాంఛల్ని జయించడానికి మానవ సంబంధమైన శక్తి చాలదు; ఇది కేవలం విమోచనకున్న శక్తిద్వారానే సాధ్యం. శక్తిమంతుడైన ప్రభువైన యేసు క్రీస్తు మాత్రమే జీవితంలో నిన్ను శాసించేవాటన్నిటికీ బ్రద్దలు చేయగలడు. ప్రభువైన యేసుకు నీవు దీనుడవై లొంగిపో. "చెరలోనున్నవారికి విడుదలను ... ఆయన నన్ను పంపియున్నాడు" (లూకా 4:18,19 మరియు యెషయా 61:1).

నీవు ఏ దురలవాటుకైనా లొంగిపోయినప్పుడు అది నిన్నెలా శాసిస్తుందో నీవు త్వరలోనే గ్రహించగలవు. "నేనెప్పుడు కావాలంటే అప్పుడు మానెయ్యగలను" అని నీకు నీవు నచ్చచెప్పుకున్నప్పటికీ అది నీవలన కానే కాదు. కావాలనే నీవు ఆ దురలవాటుకు లొంగిపోయావు కాబట్టి అది నిన్ను శాసిస్తుంది. నీవు ఇంద్రియవాంఛలకు దురలవాట్లకు లొంగిపోయి వాటికి దాసుడవై జీవిస్తూ "సంకెళ్లన్నీ విప్పగల శక్తిమంతుడాయన" అని పాట పాడితే అది ఎలా ఉంటుందో ఆలోచించావా! అయితే యేసుకు మనం నిజంగా లొంగిపోయినప్పుడు ఆయన మన సంకెళ్లన్నిటినీ పటాపంచలు చేసి మనకు విడుదల నిస్తాడు.

మార్చి 15

## వ్యాకులత

"వెంబడించువారు భయపడిరి." (మార్కు 10:32)

యేసు క్రీస్తుతో మనం జీవించడం మొదలుపెట్టినప్పుడు ఆయన్నెలా వెంబడించాలో అంతా మనకు తెలుసనుకుంటాం. అన్నీ విడిచిపెట్టి ఆయనపట్ల మనకెంత ప్రేమ ఉందో ప్రకటించడం ఆహ్లాదాన్నిస్తుంది. అయితే రాను రానూ మనలో ఆ ఆహ్లాదం ఉండదు. మనకు కొన్ని నూతన విషయాలు బోధపడ్తాయి. యేసు మనకంటె చాలా ముందు నడుస్తున్నాడని ఆయనగురించి తెలుసుకోవలసినవెన్నో ఉన్నాయని గ్రహిస్తాం. "యేసు వారికి ముందు నడుచుచుండగా వారు విస్మయమొందిరి" (మార్కు 10:32).

యేసులో ఎటువంటి ప్రభావముందంటే ఆయన ఎవరి హృదయంలోకైనా సూటిగా చూడగలడు; ఆయన ఎవరిలోనైనా ఆధ్యాత్మిక ఆకలిదప్పులు కలిగించగలడు. "చెకుముకి రాతి" (యెషయా 50:7) వంటి ముఖంతో వర్ణనాతీతుడైన యేసు నా ముందు నడవడం నాలో విస్మయం కలిగిస్తుంది. ఆయనలో నాకు తెలియనివెన్నో ఉన్నాయి; ఆయన కేవలం నాకు హితుడు మాత్రమేనా? స్నేహితుడు మాత్రమేనా? అంతకంటే అధికుడాయన. నేను చేయగలిగినది ఆయనవైపు విస్మయంగా చూస్తూ ఆశ్చర్యపడడం మాత్రమే. మొదట్లో ఆయనగురించి అంతా నాకు తెలుసనుకున్నాను; ఇప్పుడలా కాదు. ఆయనగురించి ఇంకా నేను చాలా తెలుసుకోవాలి. నాకు ఆయనకు మధ్య చాలా దూరం వుంది. నేనాయనకు దగ్గరగా లేను; ఉండలేను కూడా. ఆయనెక్కడికి వెళ్తున్నాడో నాకు తెలియదు. నా లక్ష్యానికి నేను చాలా దూరంలో ఉన్నాను.

ప్రతి పాపంగురించి మన దుఃఖంగురించి యేసుకెలా తెలుస్తుందనే భావన నాలో ఉంది. ఈ భావనే నన్నాయనకు దూరం చేస్తోంది. ఈ భావన మనలో లోతుగా పాతుకొని ఉన్నప్పుడు ఆయనగురించి మనకు నిజంగానే తెలియదు. యేసు స్వభావంలో కనీసం ఒక అంశాన్ని కూడా మనం గుర్తించలేం. ఆయన్నెలా వెంబడించాలో కూడా మనకు తెలియదు. ఆయన మనకు దూరంగా ఉన్నాడని, ఆయనతో మనకు సన్నిహితత్వం లేదని భావిస్తుంటాం.

శిష్యుడు వ్యాకులతగురించి తప్పక తెలుసుకోవాలి. మనకు తెలియకుండానే మనం ప్రమాదంలో పడుతున్నాం. మనలో యేసుపట్ల ఉన్న అత్యుత్సాహం దృఢంగా ఉండాలని మనం గతంలో ఆయనపట్ల చూపిన విధేయతను ఆయనకొరకు చేసిన త్యాగాల్ని మాటి మాటికీ జ్ఞాపకం తెచ్చుకుంటున్నాం (యెషయా 1:10,11 వచనాలు చూడండి). అయితే వ్యాకులత నిన్ను ఆవరించినప్పుడు అది తొలగిపోయేవరకు ఓపికపట్టు. వ్యాకులతను సహించినప్పుడు మాత్రమే యేసును నిజంగా వెంబడించే శక్తి నీలో ఉంటుంది. ఈ శక్తి నీకు మాటల్లో చెప్పలేని అద్భుతమైన సంతోషాన్నిస్తుంది.

మార్చి 16

## యజమాని తీర్పు తీరుస్తాడు

"మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును."
(2 కొరింథీ 5:10)

మనందరం క్రీస్తు న్యాయపీఠంముందు నిలబడాలని పౌలు చెబుతున్నాడు. మనందరం అంటే బోధకులు సామాన్య ప్రజలు అని అర్థం. నీవు ఈ సంగతి గ్రహించి క్రీస్తు వెలుగులో జీవించినట్లయితే తీర్పుజరిగే రోజున దేవుడు నీలో చేసిన కార్యాన్నిబట్టి నీకు సంతోషం కలుగుతుంది. క్రీస్తు న్యాయపీఠాన్ని నిరంతరం నీ మదిలో ఉంచుకొని జీవించు. దేవుడనుగ్రహించిన పవిత్రతను కాపాడుకుంటూ క్రైస్తవజీవితం గడుపు. నీవెంత పరిశుద్ధుడవైనప్పటికీ నీలో ఇతరులపట్ల దురుద్దేశాలున్నట్లయితే నీవు దయ్యపు ఆత్మ ననుసరించేవాడివిగా ఉంటావు. నీవు ఇహికమనస్సుతో ఇతరుల్ని విమర్శిస్తున్నట్లయితే అది నీలో ఉన్న పైశాచిక ప్రవృత్తిని వెల్లడిచేస్తుంది. ఇతరుల్ని ఖండించే నైజం నీలో ఉన్నట్లయితే వెంటనే వెలుగులోనికి వచ్చి "ప్రభువా, నేను అపరాధిని" అని ఒప్పుకో. నీ అపరాధాన్ని నీవు ఒప్పుకోకపోయినట్లయితే నీ హృదయం మరింత కఠినంగా మారుతుంది. పాపానికి మనం పొందే దండనల్లో ఒకటి మనం ఆ పాపాన్ని ఒప్పుకోడమే. ప్రతి పాపానికీ శిక్ష ఉంది. మన పాపాల్ని మనం ఒప్పుకోకపోయినట్లయితే అవి తీర్పులోకి వస్తాయి. అప్పుడు మనం శిక్షకు పాత్రులమౌతాం. అంతే కాదు; పాపం కూడా తన భారాన్ని పాపిమీద మోపుతుంది. పాపపు భారం మోయశక్యం కానిది. ప్రార్థనగానీ మానసిక సంఘర్షణగానీ నీవు కొన్ని పనులు చేయకుండా ఆపలేవు. పాపానికి వచ్చే దండన నీకు అలవాటైపోతుంది. కొంత కాలానికి నీవు పాపాన్ని గుర్తించలేని స్థితిలో ఉంటావు. పరిశుద్ధాత్మ శక్తి తప్ప మరే శక్తి పాపాన్ని మరియు పాపంవలన వచ్చే పర్యవసానాన్ని అడ్డుకోలేదు.

"మనమును వెలుగులో నడిచినయెడల ... " (1 యోహాను 1:7) అని పరిశుద్ధ వాక్యం సెలవిస్తోంది. మనలో అనేకుల విషయంలో వెలుగులో నడవడమంటే ఇతరుల్ని మనం ఏ ప్రమాణాలతో విమర్శిస్తామో అవే ప్రమాణాలతో మనం నడవడమని అర్థం. నాటి పరిసయ్యుల్లాగా నేడు మనం కూడా ఆత్మవినాశకమైన దృక్పథాన్నే ప్రదర్శిస్తున్నాం. అది వేషధారణ కాదు గానీ అనుద్దేశపూర్వకంగానైనా అబద్ధాన్ననుసరించి జీవించడం.



మార్చి 17

## సేవకుని ప్రధాన లక్ష్యం

"ఆయన కిష్టులమై యుండవలెనని మిగుల ఆపేక్షించుచున్నాము."

(2 కొరింథీ 5:9)

" ... మిగుల అపేక్షించుచున్నాము." మన ముందున్న లక్ష్యాన్ని సాధించడానికి విజ్ఞతతో కూడిన నిర్ణయం మరియు ప్రయత్నం కావాలి. సంవత్సరాదినుండి చివరివరకు లక్ష్యసాధనకు మనం ప్రాధాన్యతనిస్తూ నిబద్ధత చూపాలి. ఆత్మలరక్షణ, సంఘస్థాపన, ఉజ్జీవసభలు మాత్రమే ప్రాధాన్యత కాదు గానీ "ఆయన కిష్టులమై" ఉండడానికి బద్ధులం కావాలి. ఆధ్యాత్మిక అనుభవం కొదువగా ఉండడం వైఫల్యానికి నడిపించదు గానీ మన లక్ష్యంపట్ల నిర్లక్ష్యధోరణి చూపడం, లక్ష్యసాధననుండి దృష్టిని మళ్లించడం అపజయానికి దారితీస్తుంది. కనీసం వారానికొకసారి దేవునియెదుట నిన్ను నీవు పరీక్షించుకో. నీ జీవితం దేవుడు నీకొరకు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఉండేలాగా నిన్ను నీవు సరిచేసుకో. ఈ విషయంలో పౌలు మాదిరిని జ్ఞాపకం చేసుకో.

దేవునికిష్టుడవై జీవించడానికి "నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుట ... " (2 తిమోతి 2:15) నీ ప్రధాన లక్ష్యం. నిన్ను నీ ప్రధాన లక్ష్యంనుండి తప్పించే ఇతర లక్ష్యాలు నీవాయన సేవ చేయకుండా నిన్ను వెనకకు మళ్లిస్తాయి. నీ లక్ష్యం నిన్నెక్కడికి నడిపిస్తుందో నీవు వివేచించినప్పుడు "యేసువైపు చూచుచు" (హెబ్రీ 12:2) ముందుకు నడవడం ఎంత ముఖ్యమో నీవు గ్రహించగలవు. మన లక్ష్యసాధనలో మన శరీరం మనల్ని ఆటంకపర్చే సందర్భాలు కూడా ఉంటాయి. మన శరీరాన్ని నియంత్రించుకోవలసిన అవసరత గురించి, దీనికున్న ప్రాముఖ్యతగురించి పౌలు చెప్పాడు. "నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి, దానిని లోపరచుకొనుచున్నాను." (1 కొరింథీ 9:27)

నా ప్రధాన లక్ష్యానికి ఏ ఆటంకం కలగకుండా నాకు సంబంధించినవన్నీ నా ప్రధాన లక్ష్యానికి అనుగుణంగా ఉండేలాగా చూడడం నేను అలవర్చుకోవాలి. నా ఆంతరింగిక జీవితమే దేవునియెదుట నా యోగ్యతకు ప్రమాణం. దేవుణ్ణి సంతోషపెట్టడం మరియు ఆయనకు అంగీకారంగా జీవించడం నా జీవితంలో ప్రధానలక్ష్యంగా ఉన్నాయా? లేక నాకు ఇతర లక్ష్యాలున్నాయా? ఇతర లక్ష్యాలు ఎంత గొప్పవైనప్పటికీ అవి నిష్ప్రయోజనకరమైనవే.

మార్చి 18

## నేను పరిపూర్ణత స్థాయికి చేరుకోగలనా?

“దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తిచేసికొనుచు ... ” (2 కొరింథీ 7:1)

“మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక ... మనలను పవిత్రులనుగా చేసికొందము.” మనకు దేవుని వాగ్దానాలున్నాయి. మనం వాటి నెరవేర్పును చూడాలి. ఇది మానవదృక్పథం. అయితే, నేను దేవుని స్వాధీనంలో ఉన్నానని ఆయన వాగ్దానాలద్వారా గ్రహించడం దేవుని దృక్పథం. ఉదాహరణకు, నా శరీరం “పరిశుద్ధాత్మకు ఆలయమై” ఉందని (1 కొరింథీ 6:19) నేను గ్రహిస్తున్నానా? లేక, దేవుని వెలుగులో నిలబడలేని నా శరీరబలహీనతల్ని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నానా? దేవుడు నన్ను పాపంనుండి విడిపించి పరిశుద్ధుణ్ణి చేసి తన కుమారుని స్వరూపంలోనికి నన్ను మార్చాడు (గలతీ 4:19 వచనం చూడండి). నేనిప్పుడు దేవునికి విధేయుడనై నా స్వాభావిక జీవితాన్ని ఆధ్యాత్మిక జీవితంగా రూపాంతరీకరించుకోవాలి. మన జీవితంలోని సూక్ష్మ మైన విషయాల్లో కూడా దేవుడు శ్రద్ధ చూపిస్తూ తన ఆదేశాలనిచ్చాడు. ఆయన నీలో పశ్చాత్తాపాన్ని పుట్టించినప్పుడు “మనుష్యమాత్రులతో” (1 కొరింథీ 1:16) సంప్రతించవద్దు. నీ పాపాలనుండి శుద్ధి పొందు (గలతీ :16). నీ అనుదిన జీవితం పవిత్రంగా ఉండేలాగా చూసుకో.

నా శరీరం మరియు నా ఆత్మ దేవునిస్వభావానికి అనుగుణంగా ఉండేందుకుగాను నాలో ఉన్న మలినాల్ని మురికిని వదిలించుకోవాలి. నా అంతరంగం నా ఆత్మ దేవుని కుమారుడైన యేసు క్రీస్తుకు సంబంధించినవిగా ఉన్నాయా? లేక, నా మనస్సులో అవిధేయత మరియు ధిక్కారం ఉన్నాయా? నేను క్రీస్తు మనస్సు కలిగి ఉన్నానా? (ఫిలిప్పీ 2:5 చూడండి). క్రీస్తు ఎన్నడూ తన హక్కులగురించి మాట్లాడలేదు; ఆయన నిరంతరం తన తండ్రికి విధేయత చూపి తనను తాను తగ్గించుకున్నాడు. ఈ బాధ్యత నాకు కూడా ఉంది. నా ఆత్మ పరిశుద్ధాత్మకు అనుగుణంగా ఉండేలాగా నన్ను నేను సరిచేసుకోవాలి. నేనిలా ఉన్నప్పుడు యేసు తన తండ్రి చిత్తానికెలా విధేయత చూపాడో నేను కూడా యేసు చిత్తానికి విధేయత చూపేలాగా ఆయన నన్ను హెచ్చిస్తాడు. అప్పుడు నాకు జీవితంలో ఏ ఇతర ప్రాధాన్యతలు ఉండవు. నేను దేవునికి భయపడుతూ పరిపూర్ణమైన పవిత్రతలోనికి నడుస్తున్నానా? నా జీవితంద్వారా దేవుడు తన ఉద్దేశాల్ని అమలుచేస్తున్నాడా? ఇతరులు నాలో రోజు రోజుకూ ఎక్కువగా క్రీస్తు మనస్సును చూస్తున్నారా?

నిన్ను నీవు దేవునికి సమర్పించుకొనే విషయంలో యథార్థంగా ఉండు. అన్య విషయాల్ని ఇష్టపూర్వకంగా వదిలిపెట్టు. నీ జీవితంలో దేవునికి ప్రథమస్థానాన్నివ్వు.

మార్చి 19

## అబ్రాహాము విశ్వాస జీవితం

"ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలువెళ్లెను." (హెబ్రీ 11:8)

ఒక వ్యక్తి దేవుని మాటలు విని ఎంత వేరుగా వెళ్లాడనేదే అతను దేవునికి ఎంత ఎక్కువగా లోబడ్డాడనేదానికి పాత నిబంధన కాలంలో కొలబద్ద. అబ్రాహాము జీవితంలో కూడా ఇదే చూస్తాం. అబ్రాహాము తన దేశాన్ని తన బంధుమిత్రుల్ని విడిచిపెట్టి వెళ్లాడు. దీన్ని నేడు మన సందర్భానికి అనువర్తించుకుందాం. వేరుగా వెళ్లడమంటే దేవునితో అన్యోన్యతలేని కుటుంబసభ్యుల్ని విడిచిపెట్టి వెళ్లాలనికాదుగానీ వారి ప్రాపంచిక దృక్పథాలకు వారి నైతికతకు దూరంగా ఉండడమని అర్థం. యేసు క్రీస్తు ఈ విషయాన్నే లూకా 14:25-26 వచనంలో ప్రస్తావించాడు.

నువ్వెక్కడకు వెళ్తున్నావో నీకు తెలియకపోయినప్పటికీ నిన్ను నడిపించే దేవుణ్ణి ప్రేమించడం ఆయణ్ణి కలిగి ఉండడమే విశ్వాసజీవితం. విశ్వాసజీవితమంటే అక్షరాలా ఇదే. విశ్వాసజీవితం బుద్ధికుశలతకు విచక్షణకు సంబంధించినది కాదు. నిన్ను వెళ్లమని పిలుస్తున్న దేవునిమాట వినడమే విశ్వాసజీవితం. నేడు విశ్వాసంగురించి మనం భ్రమలో ఉన్నాం. మనలో విశ్వాసం వున్నట్లయితే దేవుడు మనకు లోకంలో తప్పక విజయాన్నిస్తాడనే నమ్మకం నేడు బలంగా ఉంది. ఇది నిజంగా మనకు ఉరిలాంటిదే.

విశ్వాసజీవితంలో చివరి ఘట్టం నీతి లేదా ధర్మనిష్ఠ. ఈ ప్రక్రియలో అనేక పరిణామాలెదురౌతాయి. మనం ప్రార్థించినప్పుడు దేవుని సన్నిధిలో ఉన్నామనే అనుభూతి కలుగుతుంది. అయితే ఒక్క క్షణంలోనే మనలో మార్పు చోటుచేసుకుంటుంది. ప్రార్థించడం ముగించిన వెంటనే మనం ఎప్పటిలాగానే ప్రవర్తిస్తూ ఉంటాం; ప్రార్థనలో ఉన్నప్పటి ఆత్మసౌందర్యం వెంటనే అదృశ్యమవుతుంది. విశ్వాసజీవితమంటే కొండమీది మహిమోన్నత అనుభవం కాదు; విశ్వాసజీవితంలో పరిపూర్ణమైన పవిత్రత ఉండాలనేదేమీ లేదు. విశ్వాసజీవితమంటే ప్రతి రోజూ మన దైనందిన జీవితాన్ని నిబద్ధతతో గడపడమే; "అలయక ... సొమ్మసిల్లక" నడిచిపోవడమే (యెషయా 40:31 చూడండి). తరతరాలుగా పరీక్షకు నెగ్గి నిరూపణ సాధించిన ఘనత విశ్వాసజీవితానిది. అబ్రాహాము పరిపూర్ణ పవిత్రతకు ఆదర్శంగా కొనియాడబడలేదు గానీ విశ్వాసానికి ఆదర్శంగా కొనియాడబడ్డాడు. ఎంతగానంటే విశ్వాసానికి మారుపేరే అబ్రాహాము. "అబ్రాహాము దేవుని నమ్మెను ... " (రోమా 4:3). నీవు అబ్రాహాము వారసుడవు.

మార్చి 20

## దేవునితో స్నేహం

"నేను చేయబోవు కార్యము అబ్రాహామునకు దాచెదనా? " (ఆది 18:17)

**ఆయనతో స్నేహంలో ఉన్న సంతోషాలు:** దేవునితో నిజమైన స్నేహమెటువంటి ఆనందాన్నిస్తుందో ఆదికాండము పద్దెనిమిదో అధ్యాయంలో కన్పిస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు ప్రార్థిస్తూ దేవుని సన్నిధిలో పొందే అనుభూతికి భిన్నమైనదీ స్నేహం. ఈ స్నేహ మెటువంటిదంటే ఆయన చిత్తాన్ని తెలియజేయమని దేవుణ్ణి ప్రార్థించవలసిన అవసరంలేని అన్యోన్యత ఉన్న స్నేహం. నీకు దేవునితో ఉన్న ప్రగాఢమైన అన్యోన్యతకు ఇది రుజువు. ఇది నీ విశ్వాసజీవితానికి శిఖరాగ్రం. నీకు దేవునితో సరైన సంబంధం వున్నప్పుడు నీకు స్వేచ్ఛ స్వాతంత్ర్యం ఆనందం లభిస్తాయి; ఎందుకంటే నీవే ఆయన చిత్తం. నీ అంతరంగంలో నీవు సంయమం పాటిస్తూ నీవు విజ్ఞతతో తీసుకొనే నిర్ణయాలన్నీ వాస్తవానికి నీపట్ల ఆయన చిత్తమే. నీవాయనతో పరిపూర్ణమైన సంతోషదాయకమైన స్నేహంలో ఉన్నావు కాబట్టి నీవు తప్పు నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆయన నిన్ను ప్రేమతో వారిస్తున్నాడని తెలుసుకోగలవు. ఆయన నిన్ను వారించినప్పుడు వెంటనే ఆగిపో.

ఆయనతో స్నేహంలో ఉన్న కష్టాలు: కొన్నిసార్లు మనం పట్టుదలతో ప్రార్థించడం ఆపి "ఏమో, నాకు తెలియదు. ఇది దేవుని చిత్తం కాదేమో" అని ఆలోచిస్తుంటాం. అంటే విశ్వాసజీవితంలో మనమింకా ఎక్కవలసిన మెట్లు ఉన్నాయన్నమాట! మనకు దేవునికి మధ్య ఉండవలసిన అన్యోన్యత లేదన్నమాట! యేసు తన తండ్రితో ఎటువంటి అన్యోన్యత కలిగి ఉన్నాడో అటువంటి అన్యోన్యత మనలో లేదన్నమాట! మనమెటువంటి అన్యోన్యత కలిగి ఉండాలని యేసు కోరుకున్నాడో అటువంటి అన్యోన్యత మనలో లేదన్నమాట. "మనము ఏకమైయున్నలాగున, వారును ఏకమై యుండవలెనని ... " (యోహాను 17:22) అని యేసు ప్రార్థించాడు. నీవు చివరిసారిగా చేసిన ప్రార్థన గుర్తుందా? నీకు దేవునిపట్ల భక్తి ఉందా? లేదా, నీ కోరికలపట్ల శ్రద్ధ మాత్రమే ఉందా? నీవు పరిశుద్ధాత్మ వరాలు పొందాలనే నిర్ణయానికి మాత్రమే పరిమితమై ఉన్నావా? లేక, దేవునితో అన్యోన్యత ఉండాలని కోరుకుంటున్నావా? "మీకు అక్కరగానున్నవేమో ఆయనకు తెలియును" (మత్తయి 6:8). దేవుణ్ణి అడగాలనుకోడంలో ఆయనగురించి ఎక్కువగా తెలుసుకోవాలనుకోడం, ఆయనతో అన్యోన్యత కలిగి ఉండాలనుకోడం మాత్రమే ప్రధాన ఉద్దేశంగా ఉండాలి. "యెహోవానుబట్టి సంతోషించుము ఆయన నీ హృదయవాంఛలను తీర్చును" (కీర్తన 37:4). దేవునిగురించి మనం పరిపూర్ణంగా తెలుసుకోవాలనే తలంపుతో ప్రార్థిద్దాం!

మార్చి 21

## తాదాత్మ్యత వుందా? లేక కేవలం ఆసక్తి మాత్రమేనా?

"నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను ... " (గలతీ 2:20)

యావత్‌మానవజాతికీ ఒక ఆధ్యాత్మిక అవసరత ఉంది; ఇది అనివార్యమైన అవసరత. మనందరం మనలో ఉన్న పాపపుస్వభావానికి చరమగీతం పాడాలి. నాలో ఉన్న భావోద్వేగపూరితమైన ఉద్దేశాల్ని, ఆలోచనాపూర్వకమైన నమ్మకాల్ని నేను డోలాయమాన స్థితినుండి నైతికమైన తీర్పుకు మళ్లించి అవి నా పాపపు స్వభావాన్ని ఖండించేలాగా చేయాలి; నాగురించి నాలో ఉన్న అతిశయభావాలన్నీ తొలగిపోవాలి. "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడి యున్నాను ... " అని పౌలు ప్రకటించాడు. అంతే గానీ అతను "నేను యేసు క్రీస్తును అనుకరించాలని నిర్ణయించుకున్నాను" అని గానీ, "నేను యేసు క్రీస్తును వెంబడించడానికి ప్రయత్నిస్తున్నాను" అని గానీ చెప్పలేదు. తాను క్రీస్తు మరణంతో తాదాత్మ్యత కలిగి ఉన్నానని పౌలు భావన. నాలో ఉన్న సందిగ్ధతలు సందేహాలు తొలగి నైతికస్థైర్యం ఏర్పడినప్పుడు క్రీస్తు నాకొరకు సిలువమీద నెరవేర్చినది నాలో నెరవేరుతుంది. ఎటువంటి అడ్డులూ ఆటంకాలూ లేని సంపూర్ణనిర్ణయం నాలో ఉన్నప్పుడు నన్ను యేసు క్రీస్తు పరిశుద్ధతతో నింపడానికి పరిశుద్ధాత్మకు అవకాశం లభిస్తుంది.

నా వ్యక్తిత్వం నాదే! అయితే నా జీవితానికి ప్రేరణ, మరియు నా స్వభావం సమూలంగా మారిపోతాయి. నా శరీరం మారదు; అయితే నా శరీరంలో ఉన్న దుష్టప్రవృత్తి మారిపోతుంది. "ఇకను జీవించువాడను నేను కాను ... ."

"నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము ... ." ఇది నేను జీవించాలని కోరుకున్న జీవితం కాదు; లేక, ఎలా జీవించాలని ప్రార్థిస్తున్నానో అటువంటి జీవితం కాదు. ఇప్పుడు నేను నా శరీరంలో జీవించే జీవితం "నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసమువలన జీవించుచున్నాను" అని ఇతరులు నన్ను చూచి చెప్పగలిగే జీవితం. ఇది యేసు క్రీస్తులో పౌలుకున్న స్వంత విశ్వాసం కాదు గానీ దేవుని కుమారుడైన యేసు పౌలుకనుగ్రహించిన విశ్వాసం (ఎఫెసీ 2:8 చూడండి). ఇది విశ్వాసాన్ని విశ్వసించడంకాదుగానీ, దేవుని కుమారుడు మాత్రమే అనుగ్రహించే విశ్వాసం; మన ఊహకందని అవధులకు పైగా ఉన్న విశ్వాసం.

మార్చి 22

## మండుతున్న హృదయం

"మన హృదయము మనలో మండుచుండలేదా ... " (లూకా 24:32)

ఈ నిగూఢతను మనం ఛేదించాలి. మన హృదయం ఎందుకు మండుతుందో తెలుసుకోవాలి. యేసు హఠాత్తుగా మనయెదుట ప్రత్యక్షమైనప్పుడు మన హృదయంలో ఉద్విగ్నత చోటుచేసుకుంటుంది; మన మనోఫలకంమీద అద్భుతదర్శనం సాక్షాత్కరిస్తుంది. అయితే ఈ ఉద్విగ్నత ఆవిరైపోకూడదు; అద్భుతదర్శనం అదృశ్యమవకూడదు. ఏ అనుభూతినైనా పొందగలిగిన మన హృదయంలో ఈ ఉద్విగ్నత ఈ అద్భుతదర్శనం కలకాలం వుండాలి. అయితే మనం నిరంతరాయంగా యేసులో నిలిచి ఉండడం అలవర్చుకొనేవరకు మన దైనందిన జీవితంలోని ఉదాసీనత, ఊపిరితీసుకోనివ్వని మన దినకృత్యాలు మన హృదయంలోని ఉద్విగ్నతల్ని అణచివేస్తూ మన దర్శనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి.

మన దుఃఖానుభవాలు మన పాపానికి ప్రతిఫలమని కాదు గానీ మన స్వభావమేమిటో తెలుసుకోలేని మన అజ్ఞానమే మన దుఃఖానికి కారణం. ఉదాహరణకు ఒక చిన్న పరీక్ష: మన భావోద్వేగాల్ని మనం అదుపుచేయకపోతే చివరికి ఏమవుతుందో తెలుసుకోడం. సహేతుకంగా ఆలోచించు. నీ భావోద్వేగాలు చివరికి ఏ ఫలితానికి దారితీస్తాయో తెలుసుకో. ఆ ఫలితం దేవునికిష్టమైనది కానప్పుడు వెంటనే నీ భావోద్వేగాల్ని అదుపుచెయ్యి. ఒకవేళ అవి పరిశుద్ధాత్మ ప్రజ్వరిల్లచేసిన భావోద్వేగాలైనప్పుడు నీవు వాటి ప్రకాశాన్ని అడ్డుకున్నట్లయితే దేవుడు నీలో ఉద్దేశించిన కార్యాల్ని నీవు జరగనివ్వడంలేదని అర్థం. ఈ స్థితి అవాస్తవికమైన ఆలోచనలకు, ఉద్రిక్తమైన మనస్సుకు కారణమౌతుంది. నీ భావోద్వేగాల్లో ఎంత ఎక్కువ ఉద్రిక్తత ఉంటే నీ విశ్వాసం అంత క్రిందకు జారుతుంది. కాబట్టి పరిశుద్ధాత్మ నీ గుండెను మండించినప్పుడు వీలైనంతమట్టుకు కచ్చితమైన నిర్ణయాలు తీసుకో. నీ నిర్ణయాల్ని కార్యరూపంలో పెట్టు. ఫలితాలగురించి ముందుగానే నిరాశపడకు. మనం చిరకాలం రూపాంతరపు కొండమీద ఉండలేం గదా (మార్కు 9:1-9 వచనాలు చూడండి). అయితే కొండమీద ఉన్న వెలుగుకు మనం విధేయత చూపాలి. ఆ దివ్యప్రకాశాన్ని మన కార్యాల్లో ప్రతిబింబించాలి. దేవుడు మనకు దర్శనాన్ని అనుగ్రహించినప్పుడు ఆ దర్శనం పరిష్కారంకొరకు మనమెటువంటి మూల్యం చెల్లించవలసి వచ్చినప్పటికీ దేవునితోనే కొనసాగాలి.

మార్చి 23

## నాలో శరీరానుసారమైన మనస్సు వుందా?

"మీలో అసూయయు కలహమును ఉండగా మీరు శరీరసంబంధులై మనుష్యరీతిగా నడుచుకొనువారు కారా?" (1 కొరింథీ 3:3)

మనిషికి స్వభావరీత్యా శరీరేచ్ఛలపట్ల విచక్షణ ఉండదు. మనం తిరిగిపుట్టినప్పుడు మనలో ఒక సంఘర్షణ మొదలవుతుంది. ఇది మనలో ఉన్న స్వాభావికమైన శరీరేచ్ఛలకు పరిశుద్ధాత్మకు మధ్య జరిగే పోరాటం. "ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛలను నెరవేర్చరు" (గలతీ 5:16) అని పౌలు చెబుతున్నాడు. అంటే పరిశుద్ధాత్మ కార్యాలున్నచోట శరీరేచ్ఛలుండవని అర్థం.

నీవు తరచుగా తగాదాపడే మనిషివా? చిన్న చిన్న విషయాలకే విసుగుతెచ్చుకొనే వ్యక్తివా? క్రైస్తవులెవరూ ఇలా ఉండకూడదనుకుంటున్నావా? ఇవన్నీ క్రైస్తవుల్లో ఉన్నాయని పౌలు చెప్పాడు. ఈ లక్షణాలనే పౌలు శరీరేచ్ఛలని వర్ణించాడు. బైబిల్లోని ఏదైనా సత్యానికి నీవు వెనువెంటనే ద్వేషాన్ని లేక ఆగ్రహాన్ని తెచ్చుకున్నావా? తెచ్చుకున్నట్లయితే నీలో శరీరేచ్ఛలున్నాయని రుజువయిందన్న మాట! నీలో పవిత్రీకరణ ప్రక్రియ కొనసాగు తున్నట్లయితే నీలో శరీరేచ్ఛలకు తావుండదు.

దేవుని ఆత్మకు నీలో ఏదైనా తప్పు కనిపించినట్లయితే ఆ తప్పును సరిచేసికోమని ఆయన నిన్నడగడు. ముందుగా నీవు దేవుడు వెల్లడించిన నిజాన్ని ఒప్పుకోవాలని ఆయన కోరుకుంటాడు. ఆ తర్వాత ఆయన ఆ తప్పును సరిజేస్తాడు. వెలుగుసంబంధి పాపాన్ని తత్క్షణమే ఒప్పుకుంటాడు; దేవుని యెదుట యథార్థహృదయంతో నిలబడతాడు. అయితే చీకటిసంబంధి "అదెందుకంటే ... " అని తనను తాను సమర్థించుకుంటాడు. వెలుగు నీ మీద ప్రకాశించినప్పుడు, మరియు పరిశుద్ధాత్మ నీలో పశ్చాత్తాపాన్ని పుట్టించినప్పుడు వెంటనే వెలుగుబిడ్డగా మారు. నీ తప్పు ఒప్పుకో. అప్పుడు దేవుడు తానేం చేయాలనుకున్నాడో అదే చేస్తాడు. అలా కాకుండా నిన్ను నీవు సమర్థించుకున్నట్లయితే నీవు చీకటిసంబంధిగానే మిగిలిపోతావు.

నీలో శరీరేచ్ఛలు తొలగిపోయాయనడానికి రుజువేమిటి? ఆత్మవంచన చేసుకోకు. నీలోనుండి శరీరేచ్ఛలు తొలగిపోయాయో లేదో నీకు తెలుసు. ఇది వాస్తవం. నిన్ను నీవు పరీక్షించుకోడానికి దేవుడు నీకు పలు అవకాశాలిస్తాడు. ఆయన కృపద్వారా నీ జీవితమే ఒక అద్భుతమౌతుంది. ఇందుకు నీకు నువ్వే ఒక రుజువు. ఒక చిన్న పరీక్షద్వారా నువ్వు రుజువు పర్చుకోగలవు. "ఇది ఇంతకుముందే జరిగినట్లయితే నేను కోపం తెచ్చుకొని తిరస్కరించేవాడినేమో" అని నీవు చెప్పడం నీలో ఉన్న యథార్థతకు రుజువు. దేవుడు నీలో చేసిన కార్యం భూమ్మీద నిన్నొక ఆశ్చర్యంగా నిలబెడుతుంది. నీవెప్పటికీ ఇతరులకు ఒక ఆశ్చర్యంగానే ఉంటావు!

మార్చి 24

## ఆయన కొరకు తగ్గించుకోడం

“ఆయన హెచ్చవలసివున్నది, నేను తగ్గవలసియున్నది.” (యోహాను 3:30)

ఇతరులకు నీవొక అవసరమైన వ్యక్తిగా ఉన్నట్లయితే, నీవు దేవుని చిత్తానికి వెలుపల ఉన్నావని అర్థం. ఒక సేవకుడిగా నీ ప్రాథమిక బాధ్యత “పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు”గా (యోహాను 3:29) ఉండడమే. ఎవరైనా ఒకరు నీద్వారా యేసు క్రీస్తు దగ్గరకు వచ్చినట్లయితే ఆ వ్యక్తి జీవితంలో నీ పలుకుబడిని సరైన దిశలోనే ఉపయోగించావన్నమాట! అయితే ఆ వ్యక్తిలో సంఘర్షణ తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు దాన్ని ఆపాలని ప్రయత్నించవద్దు. పైగా నీవొక పని చేయాలి. ఆ వ్యక్తిలోని సంఘర్షణ అంతకంతకూ అధికమవ్వాలని ప్రార్థించు; ఎందుకంటే భూమ్మీద ఏ శక్తీ అతణ్ణి ఇక యేసు క్రీస్తుకు దూరం చేయలేదు. మళ్లీ మళ్లీ మనమొక తప్పిదాన్ని చేస్తుంటాం. ఇంకొకరి జీవితంలో అన్నీ సమకూర్చాలనే అత్యుత్సాహాన్ని చూపిస్తుంటాం. “ఇతనికి ఈ కష్టం వచ్చి ఉండాల్సింది కాదు” అని మాట్లాడుతూ ఆ వ్యక్తిపట్ల కుతూహలం చూపిస్తుంటాం. అయితే మనం ఆ వ్యక్తిపట్ల దేవునికున్న ఉద్దేశాలకు అడ్డు తగులుతున్నామన్నమాట! “పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు”గా ఉండవలసిన మనం ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తుంటాం. ఏదో ఒక రోజు ఆ వ్యక్తి మనతో “నీవొక దొంగవు. యేసు క్రీస్తును వెంబడించాలని నాలో ఉన్న కోరిక నీ మూలంగా పోయింది. నీ మూలంగా ఆయనకు దూరమయ్యాను” అని చెబ్తాడేమో!

తప్పునుబట్టి సంతోషించవద్దు గానీ మంచి విషయాల్నిబట్టి సంతోషించడానికి ప్రయత్నించు. పెళ్లికుమారుని స్నేహితుడు పెళ్లికుమారుడి స్వరం విని సంతోషిస్తాడు. కాబట్టి నాలో ఉన్న సంతోషం పరిపూర్ణమయ్యింది. ఆయన హెచ్చింపబడాలి; నేను తగ్గించబడాలి (యోహాను 3:29,30). మనం ఈ మాటల్ని సంతోషంతో పలకాలి; దుఃఖంతో పలకవలసిన మాటలు కావు. ఎందుకంటే మనం పెళ్లి కుమారుడిని చూస్తాం కాబట్టి. యోహాను ఇది తనకు సంతోషాన్నిచ్చిందని చెప్పాడు. ఇదొక నూతన మెట్టు. మనం సేవకుడిగా కాక, పెళ్లికుమారుడికి స్నేహితుడుగా ఉంటాం.

నీ యావత్‌శక్తినీ వినియోగించి ఇంకొకరి జీవితంలో పెళ్లికుమారుని స్వరాన్ని శ్రద్ధగా విను. అతనికెదురయ్యే కష్టనష్టాల గురించి ఆలోచించకు. పెళ్లికుమారుడి స్వరం విన్నానని సంతోషించు. ఈ సంతోషం నీలో దేవుడు కలిగించిన ఉత్సాహంవలన కలిగే సంతోషం. యేసు క్రీస్తు ఎవరినైనా రక్షించేముందు అతని జీవితాన్నెలా బ్రద్దలు చేస్తాడో వేచిచూడు.



మార్చి 25

## సరైన సంబంధాన్ని కొనసాగించడం

"పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు" (యోహాను 3:29)

మంచితనం మరియు పరిశుద్ధత ఇతరుల్ని యేసు క్రీస్తు చెంతకు ఆకర్షించే అయస్కాంతాలుగా ఉండాలి. అంతేగానీ ఇతరుల్ని వాటివైపు ఆకర్షించకూడదు. నాలో ఉన్న పరిశుద్ధత ఇతరుల్ని క్రీస్తుచెంతకు చేర్చకపోయినట్లయితే అది సరైన పరిశుద్ధత కాదు. అది మనుషుల్లో భావోద్వేగాల్ని దురాశల్ని విజృంభింపజేసి వారిని సరైన దారిలోనుండి ప్రక్కకు మళ్లించే పలుకుబడి మాత్రమే. పరిశుద్ధుడైన ఒక వ్యక్తి ఇతరులకు క్రీస్తుగురించి ప్రకటించకుండా, క్రీస్తు తనకొరకు ఏం చేశాడో వాటిగురించి చెబ్తూ ఉన్నట్లయితే ఆ వ్యక్తి ఇతరుల్ని ప్రభువు చెంతకు నడిపించడంలో ఆటంకంగా ఉన్నాడని అర్థం. ఇతరులు ఆ వ్యక్తి గురించి "ఇతనెంత మంచివాడు!" అనుకుంటారు. "పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు"గా ఉండడమంటే ఇది కాదు. నేనిలా ఉన్నట్లయితే నన్ను నేనే హెచ్చించుకుంటున్నాను తప్ప క్రీస్తును హెచ్చించడం లేదు.

పెళ్లికుమారునితో స్నేహాన్ని కొనసాగించాలంటే, అతనిపట్ల విశ్వాస్యత కలిగి ఉండాలంటే ఆయనతో మనకున్న సంబంధంపట్ల జాగరూకత వహించాలి. ఆయనతో మనకున్న సంబంధం నైతికపరమైన సంబంధంతోబాటు ప్రాణాధారమైన జీవశక్తితో కూడిన సంబంధం కూడ. ఇది అన్నిటికంటె మిన్నయైన సంబంధం, చివరికి విధేయత కంటె కూడ మిన్నయైన సంబంధం. మనం విధేయత చూపవలసినవాటన్నిటి పట్ల విధేయత చూపినప్పటికీ మిగిలి ఉండే సంబంధమిది. మన జీవనాడి యేసు క్రీస్తుతో కలిసిపోవాలి. మనకు క్రీస్తుకు మధ్య ఈ జీవనాడి మినహా ఏదీ ఉండకూడదు. మన జీవితంలో సంఘర్షణ చోటుచేసుకున్నప్పుడు దేవుని చిత్తమేదో మనం తెలుసుకోవాలి. అయితే మన జీవితంలో చాలా భాగం మనం ఉచితానుచితవిజ్ఞతతో కూడిన విధేయత చూపకపోయినప్పటికీ "పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు"గా ఉండాలనుకున్నాం. వాస్తవానికి మన పరిచర్య కొన్నిసార్లు ఇతరుల దృష్టిని యేసు క్రీస్తునుండి ప్రక్కకు మళ్లిస్తూ ఉంటుంది. "పెండ్లికుమారుని స్వరమువినెడి స్నేహితుడు"గా ఉండడానికి బదులు మనం ఇతరులకు దేవుని తరపున అన్నీ సమకూర్చిపెట్టాలని ఆలోచిస్తూ అత్యుత్సాహం ప్రదర్శించేవారిగా ఉంటున్నాం. అంటే, దేవుడు మన కనుగ్రహించినవాటినే మనం ఉపయోగించుకుంటూ ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నామన్నమాట!

మార్చి 26

## వ్యక్తిగత పరిశుద్ధత ద్వారా ఆధ్యాత్మిక దర్శనం (1)

"హృదయశుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు." (మత్తయి 5:8)

పరిశుద్ధత అంటే కేవలం నిష్కాపట్యం కాదు; అంతకంటె అధికమైనది. దేవునితో మనకున్న అవిచ్ఛిన్నమైన ఆధ్యాత్మిక సామరస్యానికి ఫలితమే పరిశుద్ధత. మనం పరిశుద్ధతతో వృద్ధిచెందాలి. దేవునితో మన జీవితం సరైనదిగా ఉండవచ్చు; మన అంతరంగం ఎటువంటి కళంకంలేనిదై ఉండవచ్చు. అయినప్పటికీ కొన్ని సార్లు మన బాహ్య జీవితంమీద మచ్చ పడుతుంది; మనం నిందలకు గురవుతాం. మన బాహ్యజీవితం ఇలా కాకుండా దేవుడు ఆపడు. బహుశా ఆయన ఉద్దేశపూర్వకంగానే ఆపడేమో! అయితే ఇది ఒక విధంగా మన మేలుకొరకే. ఇటువంటి సందర్భంలోనే మనం అంతరంగ పరిశుద్ధత ద్వారా మన ఆధ్యాత్మిక దర్శనాన్ని కొనసాగించవలసిన అవసరతను గుర్తిస్తాం. మన ఆధ్యాత్మిక జీవితం ఎంతో కొంత మసకబారినట్లయితే మనం దాన్ని సరిచేసుకొనేవరకు అన్నిటినీ ప్రక్కకు పెట్టాలి. ఒక విషయం గుర్తుంచుకో. మన ఆధ్యాత్మిక దర్శనం మన నడతమీద ఆధారపడి ఉంది. శుద్ధహృదయం ఉన్నవారే దేవుణ్ణి చూస్తారు.

దేవుడు మనల్ని పరిశుద్ధపరుస్తాడు. ఇది మనపట్ల దేవుడు చూపించిన సర్వోత్కృష్టమైన కృప. అయితే మనం అప్రమత్తంగా ఉండవలసిన మరో విషయం కూడా ఉంది! ఇతరులతో మనకున్న సంబంధాలు మన అభిప్రాయాలు కొన్ని సార్లు మనల్ని మలిన పరుస్తుంటాయి. మన "అంతరంగ ఆలయం" దేవునితో సరైన సంబంధాన్ని కొనసాగిస్తే సరిపోదు; మన "వెలుపలి ఆవరణలు" కూడ దేవుడు తన కృపనుబట్టి మనకనుగ్రహించిన పరిశుద్ధతతో పరిపూర్ణమైన సామరస్యం కలిగి ఉండాలి. మన ప్రభువైన యేసు క్రీస్తుతో మన అన్యోన్యత కొనసాగాలంటే మనం చాలా అప్రమత్తంగా ఉండాలి. మనల్ని మలినపర్చే పనులు మనం చేయకూడదు; కనీసం ఆ పనుల గురించి ఆలోచించనైనా ఆలోచించకూడదు. ఇతరులకు ఆమోదయోగ్యమైన కొన్ని పనులు మనకు ఆమోదయోగ్యమైనవి కావు.

ఇతరులతో నీకు ఉన్నటువంటి సంబంధాలద్వారా నీ అంతరంగ పవిత్రత మలినపడకుండా ఉండడానికొక ప్రయోగాత్మకమైన సలహా. దేవునికి మనపట్ల ఎటువంటి దృక్పథం వుందో మనకు కూడా అటువంటి దృక్పథమే ఉండాలి. "ఆ వ్యక్తి క్రీస్తు యేసులో పరిపూర్ణుడు" అని ఇతరులగురించి ఆలోచించు. "నా స్నేహితుడు క్రీస్తు యేసులో పరిపూర్ణుడు" అని ఆలోచించు. "నా బంధువు క్రీస్తు యేసులో పరిపూర్ణుడు" అని ఆలోచించు."



మార్చి 27

**వ్యక్తిగత పరిశుద్ధత ద్వారా ఆధ్యాత్మిక దర్శనం (2)**

"ఇక్కడికి ఎక్కి రమ్ము; ఇకమీదట జరుగవలసినవాటిని నీకు కనుపరచెదననెను." (ప్రకటన 4:1)

మన వ్య క్తిగత నడవడిలో ఉన్నత ప్రమాణాలు ఉండాలి. అప్పుడే మనలో ఉన్నతమైన మనస్సు మరియు ఆధ్యాత్మిక దర్శనం వుంటాయి. నీ బాహ్యజీవితం కూడా ఉన్నతమైనదిగాను ఉత్తమమైనదిగాను ఉన్నప్పుడు దేవుడు నిర్విరామంగా "స్నేహితుడా, ఇంకా పైకి రమ్ము" అని చెబ్తాడు. అయితే, పైకి వెళ్లాలనే ప్రయత్నంలో ఒక ప్రమాదం పొంచి ఉంది. ఇంకా ఎత్తుకు ఎదగాలనే శోధనలో నీవు పడవచ్చు. దీనితోబాటు మరికొన్ని శోధనలు ఎదురుకావచ్చు; నీ ప్రవర్తనలో విలక్షణమైన అలవాట్లు చోటుచేసుకోవచ్చు. నీవు పైకి ఎదగాలని దేవుడు కోరుకుంటున్నాడు. అయితే సాతాను కూడా ఇదే వ్యూహాన్ని ఎరగా వేస్తున్నాడు. సాతాను వ్యూహం నిన్ను శోధనకు గురిచేస్తుంది; పర్యవసానం దారుణంగా ఉంటుంది. అయితే సాతాను వ్యూహాన్ని నీవు కనిపెట్టవచ్చు. సాతాను నిన్ను ఎత్తుకు నడిపిస్తున్నప్పుడు సాతాను నీలో ఒక వింత ఆలోచన పుట్టిస్తాడు. పరిశుద్ధత ఆత్మకు సంబంధించినదని, రక్తమాంసాలతో నిండిన శరీరానికి సంబంధించినదికాదని శరీరంద్వారా పవిత్రతను సాధించడం అసాధ్యమనే విడ్డూరమైన ఆలోచన నీలో బలంగా ఉంటుంది. అప్పుడు నీ జీవితం నేలవిడిచి సాము చేసినట్టుగా ఉంటుంది. నీవు గాలిలో వేలాడుతూ ఒక అంగుళం అటు గానీ ఇటు గానీ కదల్లేవు. అయితే దేవుడు నిన్ను తన కృపద్వారా ఉన్నత స్థితికి నడిపిస్తున్నప్పుడు నీవు సునాయాసంగా పైకి ఎక్కగలవు.

ఒక చిన్న పరీక్ష. గత సంవత్సరం ఇదే వారంలో నీ ఆధ్యాత్మిక ఉన్నతిని నేటి ఆధ్యాత్మిక ఉన్నతితో పోల్చి చూడు. మనం ఉన్నత స్థితికి ఎదగడానికే పిలవబడ్డాం. దేవుడు నీకు తెలియజేసిన సత్యాన్ని వెంటనే ఆచరణలో పెట్టు. సత్యాన్ని నీ జీవితానికి అనువర్తించుకో. వెలుగులో నడుస్తూ సత్యాన్ననుసరించు.

నీవు కృపలో ఎదుగుతున్నావనేందుకు రుజువు నీవు వెనకడుగు వేయకపోవడం కాదు గానీ నీ ఆధ్యాత్మిక స్థితి ఏమిటో నీవు గ్రహించడమే. "ఇంకా పైకి రా" అని పిలిచే దేవుని స్వరం నీ బాహ్యజీవితపు రణగొణధ్వనుల్లో నీకు బిగ్గరగా వినబడక పోవచ్చేమో గానీ నీ అంతరాత్మలో నీ ఆంతరంగిక శీలంలో నిమ్మళంగా వినిపిస్తూనే ఉంటుంది!

"నేను చేయబోవు కార్యము అబ్రాహామునకు దాచెదనా" (ఆది 18:17). నీ అంతరంగ శీలం మరియు నీ బాహ్యనడత దేవుడు కోరుకున్న స్థితికి చేరినప్పుడు ఆయన తానేం చేస్తున్నాడో తప్పక నీకు వెల్లడి చేస్తాడు. అంతవరకు ఆయన దాచక తప్పదు.

మార్చి 28

## అపోహపడడం లేదు గదా?

“మనము యూదయకు తిరిగి వెళ్లుదమని తన శిష్యులతో చెప్పగా ఆయన శిష్యులు ... అక్కడికి తిరిగి వెళ్లుదువా అని ఆయన నడిగిరి.” (యోహాను 11:7,8)

యేసు క్రీస్తు ఏం చెబ్తున్నాడో నాకు అర్థంకానప్పుడు ఆయన పొరబడుతున్నాడని నేను ఆలోచించే హక్కు నాకు లేదు. ఇది అత్యంత ప్రమాదకరమైన స్థితి. దేవుని నడిపింపు ప్రకారం నేను నడుస్తున్నప్పుడు ఆయనకు అవమానం కలుగుతుందని నేను ఆలోచించడం సరికాదు. వాస్తవానికి ఆయన నడిపింపు ప్రకారం నేను నడవకపోవడమే ఆయనకు అవమానం తెస్తుంది. ఏది దేవునికి ఘనత తెస్తుందో, ఏది ఆయనకు అవమానం తెస్తుందో నా స్వంత అభిప్రాయాల ప్రకారం ఆలోచించడం సరికాదు. ఈ విషయంలో దేవునికి బహిరంగంగా అవమానం కలగకూడదని నేను బలంగా కోరుకున్నప్పటికీ అది సరైనది కాదు. ఎందుకంటే దేవుడు నన్ను ఆదేశించిన ప్రకారం నేను చేయాలి; వాస్తవానికి నేనాయన నడిపింపు నడిగాను కాబట్టే దేవుడు నన్ను ఈ దిశగా నడిపిస్తున్నాడు. అయితే నేను లాభనష్టాలగురించి అంచనా వేసినప్పుడు నా మనస్సులోకి సందేహాలు వాదోపవాదాలు ప్రవేశిస్తాయి. దేవునికి సంబంధించనివాటికి నేను నా మనస్సులో చోటు ఇస్తున్నాను. ఇందువల్లనే దేవుడు నాకిచ్చిన ఆదేశాలు సరిగ్గా లేవని నేను అపోహపడుతున్నాను. మనలో అనేకులకు యేసు క్రీస్తు గురించి విశ్వసనీయమైన అభిప్రాయాలున్నాయి. అయితే ఎంతమంది యేసు క్రీస్తుపట్ల విశ్వాస్యత చూపుతున్నారు? అడుగు ముందుకు వేయడానికి నాకు యేమీ కన్పించక పోయినప్పటికీ అడుగు ముందుకు వెయ్యడమే విశ్వాస్యత (మత్తయి 14:29 చూడండి). అయితే నాలో ఉండకూడనిదొకటుంది; అది నా స్వంత అభిప్రాయాలపట్ల విశ్వాస్యత. నా మనస్సును ముందుగా నేను దిటవు చేసుకోవాలి. విశ్వాసమంటే మేధోపరమైన అవగాహన కాదు; నా కళ్లకేమీ కనిపించకపోయినప్పటికీ యేసు క్రీస్తు పట్ల నిర్వివాదమైన నిబద్ధత చూడమే విశ్వాసం.

యేసులో విశ్వాసపు ముందడుగు వేయాలా, లేక దేవుడు సెలవిచ్చినది స్పష్టంగా కనబడేంతవరకు వేచి చూడాలా అనే విషయంలో నీ మనస్సులో చర్చ మొదలయ్యిందా? అవధుల్లేని ఆనందంతో వెంటనే ఆయనకు విధేయత చూపు. ఆయన నీకు ఏదైనా సెలవిచ్చినప్పుడు నీలో నీవు చర్చించుకున్నట్లయితే ఏది ఆయనకు ఘనత తెస్తుందో ఏది ఆయనకు అవమానం తెస్తుందో అనే విషయంలో నీవు అపోహపడుతున్నావని అర్థం. నీకు యేసుపట్ల విశ్వాస్యత ఉందా? లేక, నీ స్వంత అభిప్రాయాలపట్ల విశ్వాస్యత ఉందా? ఆయన సెలవిచ్చినదానిపట్ల నీకు విశ్వాస్యత ఉందా? లేక, నీవు ఆయన మాటల్ని ఆయనకు చెందని ఆలోచనతో జతచేయడానికి ప్రయత్నిస్తున్నావా? “ఆయన మీతో చెప్పునది చేయుడనెను.” (యోహాను 2:5)

మార్చి 29

## మన ప్రభువు ఆకస్మిక సందర్శనలు

"... మీరును సిద్ధముగా ఉండుడని చెప్పెను." (లూకా 12:40)

యేసు క్రీస్తును ఎప్పుడైనా ఎక్కడైనా ముఖాముఖిగా చూడడానికి సిద్ధంగా ఉండడం ప్రతి క్రైస్తవుని తత్క్షణ అవసరత. మన విశ్వాసానుభవ మెటువంటిదైనప్పటికీ ఇది అంత సులువైనది కాదు. మన సంఘర్షణ పాపంతో కాదు కష్టాలతో కాదు గడ్డు పరిస్థితులతో కాదు. మనం యేసును ఏ సమయంలోనైనా ముఖాముఖిగా కలుసుకోలేనంతగా ఆయన సేవలోనే నిమగ్నమవుతున్నాం. ఇదే అసలు సంఘర్షణ! ఆయణ్ణి ముఖాముఖిగా చూసే సిద్ధబాటు మనలో లేదు; ఇదే మనకెదురయ్యే సంఘర్షణ. మతవిశ్వాసాలు లేదా మత సిద్ధాంతాలతో తలపడడం మనకు ముఖ్యం కాదు; మనమాయనకు ప్రయోజనకరంగా ఉన్నామా లేదా అనేది కూడా ముఖ్యం కాదు; ఆయనకెదురుగా రావడమే మన తత్క్షణ అవసరత.

మనమెదురు చూచినప్పుడు యేసు రాడు. మనం యెదురుచూడనప్పుడు, మరీ ముఖ్యంగా మనం అనవసరమని తలంచిన సందర్భాల్లో యేసు మన దగ్గరికి వస్తాడు. సేవకునికుండవలసిన ఏకైక అవసరత ప్రభువు ఆకస్మికంగా వచ్చినప్పుడు ఆయన యెదుటకు రాగలిగిన సిద్ధబాటు మాత్రమే. సేవద్వారా ఈ సిద్ధబాటు రాదు. యేసును ఏ క్షణంలోనైనా ఎదుర్కోడానికి నిరీక్షించడం ద్వారా, వీలైనంత ఎక్కువగా ఆధ్యాత్మిక సత్యాల్ని అవగాహన చేసుకోడంద్వారా ఈ సిద్ధబాటు కలుగుతుంది. ఈ నిరీక్షణ మనలో నిష్కాపట్యానికి, శిశుసహజమైన అమాయకత్వానికి దోహదం చేస్తుంది. ఈ నిర్మలత్వాన్నే ఈ స్వచ్ఛతనే ఆయన మనలో కోరుకుంటున్నాడు. మనం యేసు క్రీస్తుకొరకు సిద్ధపడుతున్నట్లయితే మనం మతాన్ని ఆచరించడం మానుకోవాలి. అంటే, మతనిష్ఠ కలిగి ఉండడమే ఉదాత్తమైన జీవితమని ఆలోచిస్తూ మతాన్ని ఆచరించడం మానుకోవాలని అర్థం. మన ఆధ్యాత్మికత ఒక వాస్తవం కావాలి!

మతవిషయాల్లో నేడు మనం చూస్తున్న ఆలోచనలకు అభిప్రాయాలకు భిన్నంగా మనం "యేసువైపు చూచుచు" (హెబ్రీ 12:2) ఆయన కోరుకుంటున్నవాటిమీద మనస్సు పెడుతున్నట్లయితే, ఆయన ఆలోచనల్నే మనం ఆలోచిస్తున్నట్లయితే ఇతరులు మనల్ని ఆచరణసాధ్యంకాని తలంపులు కలిగినవారిగా పగటికలలు కనేవారిగా పరిగణిస్తారు. అయితే ఆయన మన జీవితంలోని రణగొణధ్వనుల మధ్య హఠాత్తుగా ప్రత్యక్షమైతే నీవు మాత్రమే సిద్ధపడినవాడివిగా ఉంటావు. అవును, ఇది నిజం. నీవొక్కడివే సిద్ధపడిన వ్యక్తివిగా ఉంటావు. నీవు మనుషుల్ని నమ్మకు. ఎవరైనా నీకు యేసు క్రీస్తుకు మధ్య ఆటంకంగా ఉన్నట్లయితే చివరికి ఆ వ్యక్తి విశ్వాసంలో ఎంత గొప్ప వ్యక్తియైనా సరే నీకు యేసు క్రీస్తుకు మధ్య అడ్డుగా వచ్చినట్లయితే ఆ వ్యక్తిని నమ్మకు.



మార్చి 30

## పరిశుద్ధతా? లేక కాఠిన్యమా?

" మధ్యవర్తి లేకుండుట చూచి ఆశ్చర్యపడెను." (యెషయా 59:16)

మనలో అనేకులు ప్రార్థించడం మాని దేవునిపట్ల హృదయకాఠిన్యం చూపడానికి కారణం ప్రార్థనపట్ల భావోద్వేగపూరితమైన వైఖరి కలిగి ఉండడమే. మనం ప్రార్థిస్తున్నామని చెప్పడం మంచిదే. ప్రార్థనవలన ఒనగూడే మేళ్లను వివరించే పుస్తకాలను కూడా మనం చదువుతుంటాం. ప్రార్థించినప్పుడు మన మనస్సు తేలికపడుతుంది. ప్రార్థించినప్పుడు మన ఆత్మ ఎంతో ఎత్తుకు ఎదిగినట్టుగా ఉంటుంది. అయితే ప్రార్థనగురించి మనలో ఉన్న ఇటువంటి ఆలోచనలు దేవునికి దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయని యెషయా ప్రవక్త ఈ వచనంలో చెబుతున్నాడు.

ఆరాధన మరియు విజ్ఞాపన రెండూ ముఖ్యమైనవే. ఆరాధనలేకుండా విజ్ఞాపన లేదు; విజ్ఞాపన లేకుండా ఆరాధన లేదు. విజ్ఞాపన అంటే ఇంకొకరి పక్షాన మధ్యవర్తిగా ఉండి దేవుణ్ణి ప్రార్థించడమని అర్థం (ఫిలిప్పీ 2:5 చూడండి). దేవుణ్ణి ఆరాధించడానికి బదులు ప్రార్థనద్వారా ఎటువంటి కార్యాలు జరుగుతాయో దేవునికే వివరిస్తుంటాం. "అయితే దేవా, నువ్వు ఇదెలా చేస్తావో నాకు తెలియదు ప్రభువా?" అని ప్రార్థిస్తూ మనం దేవుణ్ణి ఆరాధిస్తున్నామా? లేక, ఆయనతో విభేదిస్తున్నామా? మనం ఆరాధించడంలేదని చెప్పడానికి ఇటువంటి ప్రార్థన బలమైన రుజువు. మన దృష్టి దేవునిమీద లేనప్పుడు మనలో హృదయకాఠిన్యం మరియు వితండవాదం చోటుచేసుకుంటాయి. మన మనవులన్నీ ఆయన సింహాసనందగ్గర పడవేసి ఆయన ఏం చేయాలో మనమే ఆదేశిస్తుంటాం. మనం దేవుణ్ణి ఆరాధించడం లేదనేది యథార్థం; మన మనస్సుల్ని క్రీస్తు మనస్సుతో అనుగుణ్యపర్చడం లేదనేది వాస్తవం. మనం దేవునిపట్ల హృదయకాఠిన్యం చూపినట్లయితే మనం సాటిమనుషులపట్ల కూడా హృదయకాఠిన్యాన్నే ప్రదర్శిస్తుంటాం.

మనం ఆరాధించవలసిన పద్ధతిలో దేవుణ్ణి ఆరాధిస్తున్నామా? మనమెవరికొరకు విజ్ఞాపన చేస్తున్నామో వారిపట్ల దేవుని చిత్తాన్ని కనుగొనగలిగిన విధంగా ఆయనతో అన్యోన్యత కలిగి ఉన్నామా? మనం దేవునితో పరిశుద్ధమైన సంబంధంలో జీవిస్తున్నామా? లేక, ఆయనపట్ల హృదయకాఠిన్యం చూపిస్తూ ప్రార్థనలో వితండవాదం చేస్తున్నామా?

సరిగ్గా విజ్ఞాపన చేసేవారు లేనేలేరని నీలో నీవు ఆలోచించుకుంటున్నావా? అయితే సరిగ్గా విజ్ఞాపన చేసే వ్యక్తి నీవే ఎందుకు కాకూడదు? దేవుణ్ణి ఆరాధించే వ్యక్తిగా ఉండు; ఆయనతో పరిశుద్ధమైన సంబంధం కలిగి జీవించు. విజ్ఞాపన పరిచర్య భారం వహించు. ఈ పరిచర్య నీ యావత్‌శక్తినీ సాధికారంతో కోరుకొనే పరిచర్య. ఈ పరిచర్యలో ఎటువంటి చిక్కులు ఆపదలు ఉండవు. సువార్త ప్రకటించడంలో కొన్ని చిక్కులు ఆపదలు ఎదురుకావచ్చేమో గానీ విజ్ఞాపన ప్రార్థనాపరిచర్యలో అటువంటివేమీ ఉండవు.



మార్చి 31

## జాగరూకతా? లేక నయవంచనా?

"తన సహోదరుడు మరణకరము కాని పాపము చేయగా ఎవడైనను చూచిన యెడల అతడు వేడుకొనును; అతనిబట్టి దేవుడు మరణకరముకాని పాపము చేసినవారికి జీవము దయచేయును." (1 యోహాను 5:16)

మనలో జాగరూకత లేనట్లయితే, దేవుని ఆత్మ మనలో చేస్తున్న కార్యంపట్ల మనం శ్రద్ధ చూపకపోయినట్లయితే మనలో ఆధ్యాత్మిక నయవంచన ఉందని అర్థం. ఇతరులెక్కడ పడిపోతున్నారో మనం చూస్తూనే ఉన్నప్పటికీ వారి క్షేమంగురించి విజ్ఞాపన చేయడానికి బదులుగా మనం మన విజ్ఞత మర్చిపోయి నిశిత పరిశీలనతో వారిని హేళన చేస్తుంటాం; విమర్శాత్మక దృష్టితో వారిని ఖండిస్తుంటాం. మన బుద్ధికుశలతతో మనం ఇతరులు పడిపోతున్నారని తెలుసుకోలేం గానీ దేవుని ఆత్మ వారిగురించి మనకు వెల్లడిచేసినప్పుడు మాత్రమే మనం తెలుసుకోగలం. మనం వారిపట్ల శ్రద్ధ చూపకపోతే దేవుడు మనలో ఉంచిన ఆధ్యాత్మికవిజ్ఞతను విస్మరిస్తూ వారిపట్ల కఠినంగానూ విమర్శనాదృష్టితోనూ వ్యవహరిస్తుంటాం. దేవుడు ఏం చెబుతున్నాడో కూడా మనం మర్చిపోతాం: "తన సహోదరుడు మరణకరము కాని పాపము చేయగా ఎవడైనను చూచినయెడల అతడు వేడుకొనును; అతనిబట్టి దేవుడు మరణ కరముకాని పాపము చేసినవారికి జీవము దయచేయును." నీలో ఆధ్యాత్మిక నయవంచన లేకుండా చూసుకో. నీవు దేవుణ్ణి ఆరాధించు, ఇతరుల కొరకు విజ్ఞాపన చేయి. అంతే గానీ దేవుని యెదుట ఇతరుల్ని సరిచేయాలని ప్రయత్నిస్తూ కపటభక్తి చూపకు.

ఇతరులగురించి వివేచించే భారాన్ని దేవుడు మన హృదయాల్లో ఉంచాడు. ఇది అత్యంత సునిశితమైనదే కాక మనలో జాగరూకత లేనప్పుడు మనల్ని భ్రమపరిచే భారం కూడా. ఇతరులకొరకు మనం బాధ్యత వహిస్తూ వారి విషయంలో మనం క్రీస్తు మనస్సును కలిగి ఉండాలని (ఫిలిప్పీ 2:5 చూడండి) దేవుడు మనలో ఈ భారాన్నుంచాడు. దేవుడు మనకు ఏం సెలవిచ్చాడో దాని ప్రకారం మనం విజ్ఞాపన చేయవలసి ఉన్నాం: "తన సహోదరుడు మరణకరముకాని పాపము చేయగా ఎవడైనను చూచినయెడల అతడు వేడుకొనును; అతనిబట్టి దేవుడు మరణకరముకాని పాపము చేసినవారికి జీవము దయచేయును." మన మనస్సుకు దేవుణ్ణి సమీపించే శక్తి ఉందని కాదు గానీ మనమెవరికొరకు విజ్ఞాపన చేస్తున్నామో వారినిబట్టి దేవుడు తన మనస్సును మనకు తెలియజేస్తాడు.

యేసు క్రీస్తు మనస్సు మనకు ఉన్నప్పుడు ఆయనపడే వేదన మన మనస్సులో కూడా ఉంటుంది. మనం యేసు క్రీస్తుతో అన్యోన్యత కలిగి ఉన్నప్పుడు మాత్రమే ఆయన మన హృదయంలో ఇతరులపట్ల ఉన్న వేదనను చూస్తాడు. మనం నిండుమనస్సుతో విజ్ఞాపన చేయడం అలవర్చుకుందామా? అలవర్చుకున్నట్లయితే మన విజ్ఞాపన పరిచర్య యేసు క్రీస్తుకు సంతృప్తిని అమితానందాన్ని ఇస్తుంది.

ఏప్రిల్ 1

**ఇతరులకు సహాయకారివా, లేక నిర్దయాపరుడివా?**

"మనకొరకు విజ్ఞాపనము కూడ చేయువాడును ఆయనే ... ఆయన దేవుని చిత్త ప్రకారము పరిశుద్ధులకొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు." (రోమా 8:34,27)

మనమితరులకొరకు విజ్ఞాపన చేయడానికి ఇంతకంటె రుజువులు కావాలా? "ఈయన ... విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు" (హెబ్రీ 7:25). పరిశుద్ధాత్మ పరిశుద్ధుల పక్షాన విజ్ఞాపన చేస్తున్నాడు. మనం కూడా ఇతరుల పక్షాన విజ్ఞాపన చేసే అన్యోన్యత కలిగి ఉన్నామా? ఎందుకంటే దేవుని పిల్లలమైన మనం పరిశుద్ధాత్మ మనకు బోధించిన ప్రకారం చేయాలి. మన ప్రస్తుత పరిస్థితుల నొకసారి చూద్దాం. వ్యక్తిగతంగానూ కుటుంబాల్లోనూ వ్యాపారాల్లోనూ సమాజంలోనూ దేశంలోనూ మనమెదుర్కొంటున్న సమస్యలు మనల్ని అణగారుస్తున్నాయా? దేవుణ్ణి ఆరాధించే సమయం కూడా మనకు లేదా? మనం దేవుని సన్నిధికి దూరంగా ఉన్నామా? దూరంగా ఉన్నట్లయితే మనం అన్యమనస్కతలన్నిటిని పారద్రోలి దేవుని సన్నిధిని సమీపించి ఆయనతో అన్యోన్యత కలిగి ఉండాలి; ఇతరుల పక్షాన మనం దేవునియెదుట విజ్ఞాపన చేస్తూ ఇతరులతో కూడా అన్యోన్యత కలిగి ఉండాలి. అప్పుడు దేవుడు అద్భుతాలు చేస్తాడు.

దేవునికంటె ముందుగా ఆయన చిత్తాన్ని నెరవేర్చాలని తొందరపడకు. అనేక కార్యక్రమాల్లో అనేక ప్రణాళికల్లో తలమునకలై మనం దేవునిచిత్తాన్ని ఆయనకంటె ముందుగా చేయాలనుకుంటున్నాం. దినచర్యలెక్కువై క్షణం తీరికలేకుండా గడుపుతుంటే మనకు దేవుణ్ణి ఆరాధించే సమయం కూడా ఉండదు. ఈ వైఖరి దేవునిపట్ల కాఠిన్యానికి, మన హృదయాల్లో నిరాశానిస్పృహలకు దారితీస్తుంది. ప్రతి రోజూ మనకు అనేకమంది తారసపడుతుంటారు. మనం దేవునిపట్ల చూపవలసిన భయభక్తులు చూపకపోయినట్లయితే మనం వీరిపట్ల కూడా నిర్దయగా ప్రవర్తించడం ప్రారంభిస్తాం. వారితో గబగబా మాట్లాడి బైబిల్లోంచి ఏదో ఒక వచనం వారికి చెప్పి హడావుడిగా వారి దగ్గరనుండి వెళ్లిపోతాం. వారిపట్ల ఎటువంటి దయగానీ ఎటువంటి మంచితనంగానీ చూపం. నిర్దయాపరుడైన క్రైస్తవుడు ప్రభువుకు తీరని వేదన కలిగిస్తాడు.

మన ప్రభువు పరిచర్య మరియు పరిశుద్ధాత్మ పరిచర్య అయినటువంటి విజ్ఞాపన పరిచర్యలో మనఃపూర్వకంగా పాల్గొనడానికి మన జీవితాలు యోగ్యమైనవిగా ఉన్నాయా?

ఏప్రిల్ 2

## అధిగమించరాని మహిమ

"ప్రభువైన యేసు, నీవు దృష్టిపొంది ... నింపబడునట్లు నన్ను పంపియున్నాడని చెప్పెను." (అ.కా. 9:17)

పౌలు దృష్టి పొందిన తర్వాత అతను పరిశుద్ధాత్మతో నింపబడినవాడై యేసు క్రీస్తు ఎవరో సంపూర్ణంగా తెలుసుకున్నాడు. పౌలు యావత్‌జీవితం అతని బోధ యేసు క్రీస్తుకే అంకితమయ్యాయి. "నేను, యేసు క్రీస్తును అనగా, సిలువవేయబడిన యేసు క్రీస్తును తప్ప, మరి దేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" (1 కొరింథీ 2:2) అని పౌలు తన గురించి చెప్పాడు. యేసునుండి తనను దూరం చేసే దేన్నీ పౌలు తన జీవితంలోకి అనుమతించలేదు. పౌలు అంతఃకరణంలో యేసు క్రీస్తు తప్ప ఎవరూ లేరు; అతనికి సర్వస్వం యేసే.

జీవితంలో సద్వ ర్తన మరియు యథార్థత చాలా ముఖ్యం. యేసు క్రీస్తు మనకనుగ్రహించిన దర్శనంపట్ల మనం యథార్థంగా ఉండాలి.

జీవితంలో యేసు క్రీస్తును వాస్తవం చేయడం, మరియు దేవుని ఉద్దేశాల్ని ఇతరులకు ప్రకటించడం మాత్రమే ఒక వ్యక్తిలోని ఆధ్యాత్మిక సామర్థ్యానికి కొలబద్ద. ఆ వ్యక్తి హృదయభారమంతా యేసుకొరకే. మనమెవరిలోనైనా ఈ హృదయభారాన్ని చూచినట్లయితే ఆ వ్యక్తి దేవుని చిత్తానుసారమైన వ్యక్తి అని వెంటనే అర్థం చేసుకోగలం (అ.కా. 13:22 చూడండి).

యేసు క్రీస్తు మీద నిలిచిన నీ దృష్టి ప్రక్కకు మళ్లేలా నీ జీవితంలోకి దేన్నీ అనుమతించకు. నీలో ఉన్న ఆధ్యాత్మికతకు ఇదొక విషమపరీక్ష. నీలో ఆధ్యాత్మికత లేనట్లయితే నీవు అన్యవిషయాలపట్ల ఆకర్షితుడవు కాగలవు. అయితే నీ దృష్టి యేసుమీద ఉన్నప్పుడు మిగిలినవాటికి నీవు గుడ్డివాడవు. దర్శనం కలిగిన ఆత్మతో సిలువవైపు తేరి చూడు.

యేసును గాంచిన నా నేత్రాలు
చూడలేకపోయాయిక దేన్నీ
సిలువమీద క్రీస్తును చూస్తూ
నా ఆత్మ అయ్యింది బందీ ఆయనకే.

ఏప్రిల్ 3

## నీవు తెలుసుకున్నట్లయితే

"నీవును ఈ దినమందైనను సమాధాన సంబంధమైన సంగతులను తెలిసికొనినయెడల నీ కెంతో మేలు; గాని యిప్పుడవి నీ కన్నులకు మరుగు చేయబడియున్నవి." (లూకా 19:42)

యేసు జయోత్సాహంతో యెరూషలేం నగరంలోనికి ప్రవేశించాడు. అయితే నగరంలో అనూహ్యమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యమైన ప్రకంపన పరిసయ్యుల్లో; వీరి అభిమానం దెబ్బతిన్నది. పరిసయ్యులు తాము మాత్రమే భక్తిపరులమని, తాము మాత్రమే నీతిమంతులమని ఆలోచిస్తూ తమ స్వాభిమానాన్నే దైవంగా భావించారు. యేసు వారిని "సున్నముకొట్టిన సమాధుల"తో పోల్చి వర్ణించాడు. " ... పరిసయ్యులారా, మీరు సున్నముకొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చినవారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్నవి" (మత్తయి 23:27).

నేడు నీవు దేవుని సమాధానాన్ని చూడకుండా ఏది నీకు గుడ్డితనం కలిగిస్తోంది? పరిసయ్యుల్లాగా నీవు కూడా నీ స్వాభిమానాన్నే దైవసమానంగా భావిస్తున్నావా? నీలో ఉన్న ఈ వింత నైజం ఉగ్రరూపంలో ఉండకపోయినప్పటికీ బహుశా నీ జీవితాన్ని నియంత్రించే అపవిత్రమైన అలవాటుగా లేక అపవిత్ర స్వభావంగా ఉందేమో! దేవుడు అనేక పర్యాయాలు నాలో ఉన్న వింత నైజాన్ని నాకు ముఖాముఖిగా చూపించాడు. నేను దీన్ని విడిచిపెట్టి ఉన్నట్లయితే బాగుండేదిగానీ నేను విడిచిపెట్టలేకపోయాను. విడిచిపెట్టాలని నేనెంతగా ప్రయత్నించినప్పటికీ నాలో ఇంకా ఆ నైజం ఉందని తెలుసుకున్నాను. నాలో సమాధానాన్ని కలిగించేవాటిని చూడలేని గుడ్డితనం నాలో ఉంది. ఎటువంటి ఆటంకాల్లేని మార్గంలో దేవుని పరిశుద్ధాత్మ మనల్ని నడిపించాలని చూస్తుంటే మనకు మనమే దురవస్థ తెచ్చుకుంటున్నాం. దేవుని యెదుట మన దోషాల్ని ఎక్కువ చేసుకుంటున్నాం.

"నీవును ... తెలిసికొనినయెడల " - దేవుడు పలికిన ఈ మాటలు మన హృదయాల్లోకి సూటిగా గుచ్చుకుంటున్నాయి. ఈ మాటల వెనక యేసు ఆశ్రువులున్నాయి. మనం చేసిన తప్పులకు మనమే బాధ్యులమనే విషయాన్ని ఈ మాటలు మనకు గుర్తుచేస్తున్నాయి. మనం చూడవలసినవాటిని చూడడానికి నిరాకరించినందుకు మనలో ఉన్న పాపాన్నిబట్టి వాటిని చూడలేకపోయినందుకు దేవుడు మనల్ని లెక్క అడుగుతాడని ఈ మాటలు మనల్ని హెచ్చరిస్తున్నాయి. సమాధానకరమైన సంగతులు "నీ కన్నులకు మరుగు చేయబడి" ఉండడానికి నీ స్వభావాన్ని నీవు సంపూర్తిగా దేవునికి స్వాధీనం చేయకపోవడమే కారణం. ఇదెంత ఎడతెగని దుఃఖం! దేవుడు ఒక సారి మూసివేసిన మార్గాల్ని మళ్లీ తెరవడు. ఆయన ఇతర మార్గాల్ని మనకు చూపిస్తాడు. మనం మూసివేసిన మార్గాల గురించి, మరియు మూసివేయకూడని మార్గాల గురించి దేవుడు మనల్ని హెచ్చరిస్తాడు. దేవుడు నీ గతాన్ని నీకు గుర్తు చేసినప్పుడు భయపడకు. నీ జ్ఞాపకాల్ని నీలో పదిలంగానే ఉండనివ్వు. నిన్ను గద్దించి నీకు దుఃఖం కలిగించడానికి దేవుడు పంపించిన సేవకులుగా వాటిని భావించు. భవిష్యత్తులో నా అభివృద్ధికొరకు దేవుడు నేర్పిన అద్భుతమైన పాఠాలే నీ గతం!

ఏప్రిల్ 4

## స్థిరమైన విశ్వాసానికి మార్గం

"మీలో ప్రతివాడును ... చెదరిపోయి నన్ను ఒంటరిగా విడిచిపెట్టు గడియ వచ్చుచున్నది, వచ్చేయున్నది" (యోహాను 16:32)

ఈ వచనంలో యేసు తన శిష్యుల్ని గద్దించడం లేదు. శిష్యుల విశ్వాసంలో నిజాయితీ ఉంది. అయితే వారి విశ్వాసంలో క్రమం లోపించింది; వారి విశ్వాసం గురి తప్పింది. జీవితంలో వారికెదురైన అతిప్రాముఖ్యమైన సందర్భంలో వారి విశ్వాసం క్రియాశూన్యమయ్యింది. శిష్యులు ఎవరికి వారుగా చెల్లాచెదురయ్యారు. మనం దేవునితో పరిపూర్ణమైన అన్యోన్యత కలిగి ఉన్నప్పుడు, పరిశుద్ధాత్మ మనల్ని శుద్ధీకరించి ప్రత్యేకించినప్పుడు మన విశ్వాసం మన దైనందిన జీవితంలో ప్రతిఫలించాలి. అలా కాకపోతే మన జీవితంలో శూన్యత చోటుచేసుకుంటుంది; మన విశ్వాసం చెదిరిపోతుంది; మన విశ్వాసం అర్థాన్ని కోల్పోతుంది; మనం నిష్ఫలులమవుతాం; మనలో దేవుని ఆశీర్వాదాల ఉనికికే భంగం వాటిల్లుతుంది. ఇందుకు మనం సిద్ధమేనా? ఇలా జరగాలని మనమెన్నడూ కోరుకోం. అయితే మన సందర్భాలు అటువంటి పరిస్థితికి నడిపిస్తాయి. దీన్ని మనం అనుభవపూర్వకంగా తెలుసుకొనేంతవరకు మన విశ్వాసం వాస్తవికతకు కాక అనుభూతులకు ఆశీర్వాదాలకు మాత్రమే పరిమితమవుతుంది. అయితే ఇది మనకు అనుభవమైనప్పుడు దేవుడు మనల్ని యెటువంటి పరిస్థితుల్లోకి నడిపించినప్పటికీ దేవుడు మనకు మేలు మాత్రమే జరిగిస్తాడని ఆయణ్ణి స్తుతించేవారిగా ఉంటాం. విశ్వాసం మన జీవితంలో వాస్తవమవడమంటే ఇదే.

"నన్ను ఒంటరిగా విడిచిపెట్టు గడియ వచ్చుచున్నది" - మనం కూడా చెదిరిపోయి యేసును ఒంటరిగా విడిచిపెట్టామా? ఆయన మనపట్ల చూపిస్తున్న కృపాకటాక్షాలను చూడలేకపోతున్నామా? దేవుడు కొన్నిసార్లు మనకు దట్టమైన అంధకారంతో నిండిన పరిస్థితుల్ని రప్పిస్తాడు. అయితే దేవుడు మన విషయంలో ఏం చేయాలనుకుంటున్నాడో ఆయన వాటిని చేయడానికి మనం సిద్ధంగా ఉన్నామా? దేవుడు అనుగ్రహించే బాహ్య ఆశీర్వాదాలకు దూరంగా ఉండడానికి మనం సిద్ధమేనా? యేసు మన జీవితాలకు ప్రభువయ్యేంతవరకు మనం మన స్వంత ఉద్దేశాలతోనే సేవ చేస్తుంటాం. మన విశ్వాసంలో నిజాయితీ ఉన్నప్పటికీ మన విశ్వాసంలో స్థిరత్వం ఉండదు! దేవుడెప్పుడూ త్వరపడడు. వేచిచూడడానికి మనం సిద్ధంగా ఉన్నట్లయితే మనం దేవునిమీద కంటె ఆయన అనుగ్రహించే ఆశీర్వాదాలమీదే ఎక్కువగా దృష్టి పెడుతున్నామని మనవ గ్రహించగలం. దేవుని ఆశీర్వాదాలే అన్నిటికీ మూలాధారం.

"ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాననెను" (యోహాను 16:33). మనకు కావలసినది ఎట్టి పరిస్థితుల్లోను ధైర్యం సడలని ఆధ్యాత్మిక ధీరోదాత్తత.

ఏప్రిల్ 5

## ఆయన వేదన, మరియు మన సామీప్యత

"యేసు వారితో కూడ గెత్సేమనే అనబడిన చోటికి వచ్చి ... మీరు ఇక్కడ నిలిచి, నాతో కూడ మెలకువగా నుండుడని వారితో చెప్పి ... " (మత్తయి 26:36,38)

గెత్సేమనే వనంలో యేసు అనుభవించిన వేదన మనకెన్నటికీ పూర్తిగా గ్రాహ్యం కాకపోయినప్పటికీ మనం దాన్నెన్నడూ అపార్థం చేసుకోకూడదు. దేవుని కుమారుడు మరియు మనుష్యకుమారుడు అయిన యేసు మన పాపంతో ముఖాముఖిగా తలపడినప్పుడు ఆయన అనుభవించిన వేదన ఇది. మనం వ్యక్తిగత అనుభవం ద్వారా గెత్సేమనే గురించి తెలుసుకోలేం. గెత్సేమనే మరియు కల్వరి సాటిలేనివి. మనం జీవంలో ప్రవేశించడానికి ముఖద్వారాలివి.

యేసు గెత్సేమనేలో వేదన ననుభవించినది తాను పొందబోయే సిలువ మరణంగురించి కాదు; వాస్తవానికి ఆయన తాను మరణించడానికి వచ్చానని మరీ మరీ చెప్పాడు. అయితే మనుష్యకుమారుడుగా యేసు మానవసంబంధమైన సంఘర్షణ ననుభవించాడు. దేవుని కుమారుడైన తనను సాతాను ఏం చేయలేడని యేసుకు తెలుసు. యేసు తన తండ్రిమీద కాక తన స్వశక్తిమీద ఆధారపడేలా చేయాలని సాతాను కుటిలయత్నం చేశాడు. యేసు తన తండ్రిమీద కాక తన స్వంత యత్నంమీద ఆధారపడినట్లయితే మనకు రక్షకుడయ్యేవాడు కాడు (హెబ్రీ 9:11-15 వచనాలు చూడండి). యేసుకు అరణ్యంలో శోధన ఎదురైన సందర్భంతో గెత్సేమనే వనంలో ఆయన వేదన ననుభవించిన వృత్తాంతాన్ని పోల్చి చదవండి. "అపవాది ప్రతి శోధనను ముగించి, కొంతకాలము ఆయనను విడిచిపోయెను" (లూకా 4:13). గెత్సేమనే వనంలో యేసు దగ్గరకు అపవాది మళ్లీ వచ్చాడు. అయితే గతంలోలాగానే ఇప్పుడు కూడా అపవాది ఓడిపోయాడు. మనుష్య కుమారుడైన యేసుమీద సాతాను ప్రయోగించిన తుది యత్నమిది.

గెత్సేమనే వనంలో యేసు అనుభవించన వేదన లోకరక్షకుడిగా తాను నెరవేర్చవలసినవాటిని నెరవేర్చడానికి అనుభవించిన వేదన. మనందరం దేవుని కుమారులుగా యోగ్యత పొందడానికి దేవుని కుమారుడిగా యేసు చెల్లించిన మూల్యాన్ని ప్రత్యక్షపరచేలా తెర పైనుండి క్రిందికి రెండుగా చీలింది. యేసు అనుభవించిన వేదన మనకు ఉచితంగా రక్షణ ననుగ్రహించింది. మనుష్యకుమారుడికి సిలువ ఒక విజయసంకేతం. ఇది మన ప్రభువు విజయానికి మాత్రమే కాక, ఆయనద్వారా సకల మానవులకు లభించిన రక్షణకు కూడా సంకేతం. మనుష్య కుమారుడు అనుభవించిన వేదనద్వారా ప్రతి మానవునికీ దేవుని సాన్నిధ్యంలోనికి వెళ్లగలిగే సామీప్యత సాధ్యమయ్యింది.



ఏప్రిల్ 6

## దేవుడు పాపాన్ని ఎదుర్కొడడం

"ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను."
(1 పేతురు 2:24)

పాపంమీద దేవుని తీర్పు గురించిన వాస్తవాన్ని క్రీస్తు సిలువ వెల్లడిచేసింది. క్రీస్తు సిలువను సాక్ష్యంకొరకు హతంకావడంతో పోల్చి చూడకండి. క్రీస్తు సిలువ అత్యున్నత విజయం. క్రీస్తు సిలువ నరకం పునాదుల్ని పటాపంచలు చేసింది. క్రీస్తు సిలువమీద నెరవేర్చిన కార్యాన్ని కాదనేదేదీ ఇప్పటివరకు లేదు, ఇక రాబోదు. క్రీస్తు తన సిలువద్వారా సమస్త మానవుల్ని దేవునితో సరైన సంబంధానికి నడిపించాడు. మానవులకు మూలాధారమైన విమోచచను ఆయన మనకిచ్చాడు. ప్రతి మనిషీ దేవుణ్ణి సమీపించడానికి ఆయన మార్గమయ్యాడు.

యేసు జీవితంలో సిలువ యాదృచ్ఛిక సంఘటన కాదు; ఆయన మరణించడానికే వచ్చాడు. క్రీస్తు ఈ లోకానికి వచ్చిన ఉద్దేశమే సిలువ. "జగదుత్పత్తి మొదలుకొని వధింపబడియున్న గొఱ్ఱెపిల్లయొక్క ... " (ప్రకటన 13:8). సిలువ లేనట్లయితే క్రీస్తు నరావతారుడుగా జన్మించడంలో అర్థమే లేదు. "ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను" (1 తిమోతి 3:16) అనే మాటల్ని "ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథీ 5:21) అనే మాటలనుండి వేరుచేసి చూడకూడదు. యేసు రాకకు ముఖ్యోద్దేశం విమోచన. దేవుడు తనకొరకు ఏదైనా గొప్పకార్యాన్ని చేయడంకొరకు కాక, మన పాపాల్ని తొలగించి మనకు విమోచన ననుగ్రహించడం కొరకు మాత్రమే శరీరధారుడయ్యాడు. కాలంవిషయంలోను మరియు నిత్యత్వం విషయంలోను సిలువ కేంద్రబిందువు; కాలానికి మరియు నిత్యత్వానికి సంబంధించిన సందిగ్ధమైన ప్రశ్నలన్నిటికి పరిష్కారం సిలువే.

దేవుడు సిలువలో జరిగించిన కార్యం ఆయన మాత్రమే చేయగలిగిన కార్యం; అది మనిషి చేయగలిగిన కార్యం కాదు. మన అనుభవం క్రీస్తు సిలువను పూర్తిగా గ్రహించలేదు. దేవుడు సిలువలో తన స్వభావాన్ని వెల్లడిచేశాడు. ఏ మనిషైనా సరే దేవునితో ఐక్యమయ్యే మార్గం సిలువ ఒక్కటే. క్రీస్తు సిలువలో లభించే ప్రేమలో మనం నిలిచి ఉన్నప్పుడే ఈ మార్గంలో మనం నడవగలం!

దేవుని రక్షణ ప్రణాళిలో సిలువ అత్యంత ప్రధానమైనది. దేవుడు సిలువద్వారా చెల్లించిన మూల్యంద్వారా మనకు రక్షణ ఉచితంగా లభించింది. పరిశుద్ధుడైన దేవుడు మరియు పాపాత్ముడైన మనిషి ముఖాముఖిగా కలుసుకున్న స్థలం సిలువ; జీవానికి మార్గం తెరవబడింది సిలువలోనే. ఇందుకు దేవుడు చెల్లించిన మూల్యం మరియు ఆయన అనుభవించిన వేదన ఆయన హృదయానికి మాత్రమే తెలుసు.

ఏప్రిల్ 7

## మనమెందుకు అర్థం చేసుకోలేకపోతున్నాం?

"మనుష్యకుమారుడు మృతులలోనుండి లేచినప్పుడేగాని, అంతకుముందు మీరు చూచినవాటిని ఎవనితోను చెప్పవద్దని ఆయన వారికి ఆజ్ఞాపించెను." (మార్కు 9:9)

శిష్యుల్లాగానే నీవు కూడా నీలో పునరుత్థాన అనుభవం కలిగేవరకు ఎవరితో ఏమీ చెప్పకు. పునరుత్థానుడైన యేసు అనుగ్రహించిన జీవం నీ జీవితాన్ని నడిపిస్తున్నప్పుడు మాత్రమే నీవు యేసు బోధల్ని నిజంగా అర్థం చేసుకోగలవు. నీవు ఆత్మలో ఎదుగుతున్నప్పుడు, నీ అంతరంగంలో యథార్థత పెంపొందుతున్నప్పుడు యేసు బోధలు నీకు చాలా స్పష్టంగా అర్థమౌతాయి. ఇంతకాలం యేసు బోధల్ని అర్థం చేసుకోకపోయినందుకు నీకు నీవే విస్మయం చెందుతావు. వాస్తవానికి ఇప్పటివరకు నీలో సరైన ఆధ్యాత్మిక స్థితి లేనందువల్లే నీవాయన బోధల్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయావు.

మన ప్రభువు మనకు తెలియజేయకుండా ఏ విషయాన్నీ దాచిపెట్టలేదు. అయితే మనమే వాటిని అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నాం. మన ఆధ్యాత్మికస్థితి సరిగ్గా ఉన్నప్పుడు మాత్రమే మనం వాటిని అర్థంచేసుకోగలుగుతాం. "నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు" (యోహాను 16:12) అని యేసు చెప్పాడు. యేసు బోధించిన సత్యాల్ని మనం అర్థం చేసుకోడానికంటె ముందు మనం ఆయన పునరుత్థానంలోను, పునరుత్థానంద్వారా లభించిన నూతనజీవంలోను పాలివారమవ్వాలి; సమానానుభవం కలిగినవారమవ్వాలి. పునరుత్థానుడైన యేసు జీవం నీలో నివసించాలని నీకు తెలుసా? యేసు బోధించిన సత్యాలు నీకు అర్థమవడమే ఆయన జీవం నీలో ఉందనడానికి రుజువు. దేవుని ఆత్మ మనలో లేనట్లయితే దేవుడు మనకేదీ బోధించడు. మనలో ఉన్న తిరుగుబాటుతనం మరియు కఠినమైన అభిప్రాయాలు దేవుడు మనకు బోధించకుండా అడ్డుకుంటాయి. అయితే పునరుత్థానుడైన యేసు జీవం మనలో ఉన్నప్పుడు అర్థం పర్థంలేని మన ఆలోచనలు అభిప్రాయాలు వాటంతట అవే సమసిపోతాయి.

"ఎవనితోను చెప్పవద్దని ... " - అయితే మనలో అనేకులు తమ రూపాంతరపు కొండమీద అనుభవాల్ని ఇతరులతో పంచుకుంటారు. వారు తమ దర్శనంగురించి ఇతరులకు సాక్ష్యం చెబ్తారు. అయితే వారు చెప్పినదానికీ వారి జీవితానికీ పొంతన ఉండదు. వారి జీవితాలు యేసు వారి హృదయాల్లో నివసిస్తున్నాడనే విషయాన్ని వెల్లడిచేయడంలేదు. ఇంకెంత కాలం నీవు నీలో పునరుత్థాన అనుభవం లేకుండా జీవిస్తావు?

ఏప్రిల్ 8

## ఆయన పునరుత్థానానికున్న లక్ష్యం

"క్రీస్తు ఈలాగు శ్రమపడి తన మహిమలో ప్రవేశించుట అగత్యము కాదా ..."
(లూకా 24:26)

మన ప్రభువు సిలువ ఆయన జీవానికి మార్గం. తన జీవాన్ని మనకివ్వడానికి యేసుకు శక్తి మరియు అధికారం ఉన్నాయని ఆయన పునరుత్థానం ద్వారా వెల్లడయ్యింది. నేను తిరిగి పుట్టినప్పుడు పునరుత్థానుడైన యేసు జీవాన్ని నేనాయననుండి పొందాను.

క్రీస్తు పునరుత్థానికొక లక్ష్యం ఉంది. ఇది ముందుగా ఉద్దేశించబడిన లక్ష్యం. "ఆయన అనేకులైన కుమారులను మహిమకు తెచ్చుచుండగా ... " (హెబ్రీ 2:10) - మనల్ని మహిమలోకి నడిపించడమే క్రీస్తు పునరుత్థానానికున్న అంతిమ లక్ష్యం. యేసు తన లక్ష్యాన్ని నెరవేర్చి మనల్ని దేవునికి పిల్లల్ని చేశాడు. మనకు దేవునితో ఉన్న సంబంధం దేవుని కుమారుడైన యేసుకు తన తండ్రితో ఉన్న సంబంధం వంటిది కాదు. అయితే మనం దేవుని కుమారుడైన యేసుద్వారా దేవునికి పిల్లలుగా ఉండడానికి పిలవబడ్డాం. మన ప్రభువు మృతుల్లోంచి లేచినప్పుడు ఆయన మహిమ శరీరంతో సజీవుడై లేచాడు. యేసు పునరుత్థానం మన జీవితంలో వాస్తవం కావాలంటే మనం కూడా మన ప్రాచీన స్వభావం విషయంలో మృతిచెంది యేసులో నూతన జీవంతో తిరిగి లేవాలి. ఏదో ఒక రోజు మనం కూడా యేసుకు ఉన్నట్టి మహిమ శరీరాన్ని పొందుతాం. అయితే ఇప్పుడు మనం ఆయన పునరుత్థానికున్న శక్తిని మరియు ప్రభావాన్ని తెలుసుకొని "నూతన జీవము పొందినవారమై" (రోమా 6:4) ఉండాలి. "ఆయన పునరుత్థానబలము" (ఫిలిప్పీ 3:10-11) ఎటువంటిదో తెలుసుకోడాన్నే పౌలు తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్నాడు.

"నీ కుమారునికిచ్చిన వారికందరికిని ఆయన నిత్యజీవము అనుగ్రహించునట్లు సర్వశరీరులమీదను ఆయనకు అధికారమిచ్చితివి" (యోహాను 17:2) అని యేసు ప్రార్థించాడు. తండ్రితోను కుమారునితోను ఏకమై ఉన్న పరిశుద్ధాత్మ క్రీస్తు మనకొరకు సిలువమీద చేసిన బలియాగం మన జీవితాల్లో ప్రభావాన్ని చూపేలా చేసి మనకు నిత్యజీవాన్నిస్తాడు. ఇది మనలో నిరంతరం కొనసాగే పరిశుద్ధాత్మ కార్యం. పరిశుద్ధాత్మ మనల్ని పిలుస్తున్నప్పుడు మనమాయన పిలుపుపట్ల విధేయత చూపిపట్లయితే ఆయన మనలో యేసు స్వభావాన్నుంచుతాడనే మహోన్నత మరియు మహిమోన్నత సత్యాన్ని తెలుసుకున్నందుకు దేవునికి సదా వందనాలు.

ఏప్రిల్ 9

## నీవు యేసును చూశావా?

"ఆ తరువాత ... ఆయన మారురూపము గలవాడై వారికి ప్రత్యక్షమాయెను" (మార్కు 16:12)

యేసును చూడడం వేరు, రక్షణ పొందడం వేరు. యేసును చూడనివారనేకులు దేవుని కృపను పొందారు. అయితే నీవాయనను చూచినట్లయితే నీ జీవితం మునుపటిలాగా ఉండదు. ఇదివరకు నీ జీవితాన్ని ప్రభావితం చేసినవాటన్నిటికీ ఇక నీ జీవితంలో ఎటువంటి ప్రాముఖ్యతా ఉండదు.

యేసు నీకొరకేం చేశాడో చూడు; అలాగే యేసు ఎలా ఉండాలని నీవు కోరుకుంటున్నావో చూడు. రెండూ వేర్వేరుగా కనిపిస్తున్నాయి గదా. ఈ రెండు భావనల మధ్య ఉన్న తేడాను నువ్వెప్పుడూ జ్ఞాపకం పెట్టుకోవాలి. యేసు నీకొరకేం చేశాడో దాన్ని మాత్రమే నీవు చూస్తున్నట్లయితే దేవుని ఔన్నత్యాన్ని నీవు సరిగ్గా గుర్తించలేవు. అయితే నీకు దర్శనం ఉన్నట్లయితే యేసు ఎలా ఉన్నాడో నీవాయణ్ణి అలాగే చూడగలవు. నీకు పలు అనుభవాలుండవచ్చు గానీ నీవాయణ్ణి "అదృశ్యుడైనవానిని చూచుచున్నట్టు ... "గా (హెబ్రీ 11:27) చూస్తుంటావు. పుట్టుకనుండి గుడ్డివాడుగా ఉన్న వ్యక్తికి యేసు ఎవరో తెలియదు (యోహాను తొమ్మిదవ అధ్యాయం చూడండి). అయితే యేసు అతని దగ్గరకు వచ్చి తానెవరో అతనికి తెలియజేశాడు. అప్పుడు మాత్రమే అతను యేసు ఎవరో గ్రహించాడు. ఎవరికొరకైతే తాను కార్యం జరిగించాడో యేసు వారిదగ్గరకు వస్తాడు. అయితే ఆయణ్ణి రమ్మని నీవు ఆజ్ఞాపించలేవు; ఆయన ఎప్పుడు వస్తాడో నీకు తెలియదు. ఆయన ఎప్పుడైనా నీ జీవితంలోకి అడుగుపెట్టగలడు. "ఇప్పుడు చూచు ... "చున్నానని (యోహాను 9:25 చూడండి) ఆశ్చర్యపడడం మాత్రమే నీ వంతు.

యేసు నీ యెదుట ప్రత్యక్షం కావాలి; నీ స్నేహితుడి యెదుట కూడా ప్రత్యక్షం కావాలి. నీ కళ్లతో నీవు మాత్రమే చూడాలి. ఇతరులు నీ కళ్లతో చూడలేరు. ఒకరు ఆయణ్ణి చూచి, ఇంకొకరు ఆయణ్ణి చూడకపోయినట్లయితే మరొక విధంగా ఉంటుంది. నీ స్నేహితుడు యేసును చూచేలాగా నీవు చేయలేవు. అయితే దేవుడు ఈ కార్యాన్ని చేయగలడు. నీవు యేసును చూశావా? చూచినట్లయితే ఇతరులు కూడా ఆయణ్ణి చూడాలని నీవు కోరుకుంటావు. "వారు వెళ్లి తక్కినవారికి ఆ సంగతి తెలియజేసిరి గాని, వారు వీరి మాటనైనను నమ్మకపోయిరి" (మార్కు 16:13). ఇతరులు నమ్మకపోయినా సరే, నీవు యేసును చూచిన సంగతి వారికి చెప్పు.

చెప్పాలి నీకొక మాట, నీవు నమ్మక తప్పదు!
నేనేం చూశానో అదే నీకు చెబ్తాను!
నీకెలా చెప్పను? నీవెలా తెలుసుకుంటావు?
నాకు కనబడిన యేసే నీకూ కనబడతాడు!



ఏప్రిల్ 10

## పాపం విషయంలో సంపూర్తియైన మరియు కార్యసాధకమైన నిర్ణయం

"మనమికను పాపమునకు దాసులము కాకుండునట్లు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీనస్వభావము ఆయనతోకూడ సిలువవేయబడెనని యెరుగుదుము." (రోమా 6:6)

సిలువతో సమానానుభవము : నీలో ఉన్న పాపాన్ని సమూలంగా అంతమొందించడానికి నిర్ణయం తీసుకున్నావా? పాపం విషయంలో సంపూర్తియైన మరియు కార్యసాధకమైన నిర్ణయం తీసుకోడం అంత సులువైన విషయం కాదు. పాపాన్ని కొద్ది కాలం వాయిదా వేయడమో లేక పాపం చేయకుండా ఆగడమో కాక పాపాన్ని అంతమొందించాలని నీవు ఆలోచించడం నీ జీవితంలో ఒక గొప్ప నిర్ణయమవుతుంది. లోకపాపాలన్నిటికొరకు యేసు క్రీస్తు ఒక్కసారే సిలువ మరణం పొందినట్లుగా నీవు కూడా ఒక్క సారే సంపూర్ణమైన నిర్ణయం తీసుకోడం సరైనది. ఈ నిర్ణయం తీసుకొనేలాగా ఎవరూ ఎవరినీ ప్రేరేపించలేరు. మన మనస్సులోను మన ఆత్మలోను ఈ నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు, మనం చేయవలసిన పని వెంటనే ఆ నిర్ణయాన్ని అమలుచేయడమే. పౌలు ఈ విషయాన్నే ఈ వచనంలో నొక్కి చెబుతున్నాడు.

నీ మనస్సు దిటవు చేసికొని, దేవుని సన్నిధిలో కొంత సమయం గడిపి, ఈ నిర్ణయం తీసుకో. "ప్రభువా, నాలో ఉన్న పాపం సిలువవేయబడేలాగా నీ మరణంతో సమానానుభవానికి వస్తున్నాను" అని చెప్పు. నీలో ఉన్న పాపాన్ని అంతమొందించే సరైన మరియు తిరుగులేని నిర్ణయం తీసుకో.

పౌలు ఈ నిర్ణయాన్ని భవిష్యత్కాలంలో జరగబోయే సంఘటనగా భావించలేదు. ఇది అతని జీవితంలోని వాస్తవమైన మరియు సమూలమైన మార్పుకు కారణమైన బలోపేతమైన నిర్ణయం. దేవుని ఆత్మ నీ ఆత్మను పరిశోధించి పాపం విషయంలో నీవిక నిర్ణయం తీసుకొనేలాగా నిన్ను ఒప్పించడానికి నీవు దేవుని ఆత్మకు అనుమతి నిస్తున్నావా? నీలో దేవునికి వ్యతిరేకంగా వున్నవి తొలగిపోయేలాగా దేవుని ఆత్మ నిన్ను ఒప్పించడానికి ఆయనకు అనుమతినిస్తున్నావా? అనుమతిస్తున్నట్లయితే, పాపం విషయంలో దేవుని తీర్పుతో నీవు ఏకీభవిస్తున్నట్లని అర్థం. అంటే నీవు యేసు సిలువ మరణంతో సమానానుభవం కలిగి ఉండడానికి సమ్మతిస్తున్నావని అర్థం. దేవునియెదుట నిన్ను నీవు సమూలంగా పరీక్షించుకొని ఆయనకు లోబడేంతవరకు నీవు "పాపము విషయమై మృతులు" (రోమా 6:11) కానట్లే.

క్రీస్తు సిలువతో సమానానుభవాన్ని కలిగిన ఆధిక్యతలోకి నీవు ప్రవేశించావా? నీ శరీరాత్మలు ఇప్పుడు క్రీస్తు కొరకేనా? "నేను క్రీస్తుతోకూడ సిలువవేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు ... " (గలతీ 2:20).

ఏప్రిల్ 11

## నిరవధికమైన మరియు కార్యసాధకమైన దైవత్వం

“ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల, ఆయన పునరుత్థానముయొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము.” (రోమా 6:5)

సహ-పునరుత్థానం: నేను యేసుతోబాటు పునరుత్థాన అనుభవంలో పాలుపంచుకున్నాననడానికి రుజువు నాలో దేవుని పోలిక సుస్పష్టంగా ఉండడమే. నాకు పరలోక జీవాన్నిచ్చే అధికారం యేసుకు ఉంది. ఈ అధికారం ఆయనకు పునరుత్థాన అనుభవం ద్వారా లభించింది. కాబట్టి నా జీవితానుభవాలకు దేవుని జీవం పునాది కావాలి. ఇక్కడే ఇప్పుడే నేను యేసు పునరుత్థానంలో ఆయనతో పాలుపంచుకోగలను. పరిశుద్ధతద్వారా నేను ఈ సాదృశ్యాన్ని బహిర్గతం చేయాలి.

అపొస్తలుడైన పౌలు సందేశాల్లో ఈ భావనే మనకు ప్రధానంగా కనిపిస్తోంది. యేసు మరణంతో మనకు సాదృశ్యత ఉన్నట్లయితే ఆయన పునరుత్థానంతో కూడా మనకు సాదృశ్యం ఉంటుంది; ఆయన పునరుత్థాన శక్తి మన స్వభావంలోకి అణువణువునా చొచ్చుకుపోతుంది. సర్వశక్తిమంతుడైన దేవుని నిరవధికమైన మరియు కార్యసాధకమైన దైవత్వం మూలంగానే మానవ శరీరంలో దేవుని కుమారుని జీవాన్ని కలిగి ఉండడం మరియు ఆ జీవాన్ని బహిర్గతం చేయడం వీలవుతుంది. పరిశుద్ధాత్మ ఏదో ఒక గదిలో ఉండే అతిథి కాడు; ఆయన ఇల్లంతటా వ్యాపించి ఉన్నవాడు. నాలో ఉన్న “ప్రాచీన పురుషుడు” (నేను వారసత్వంగా పొందిన పాపపు స్వభావం) యేసు మరణంలో పాలుపంచుకున్నప్పుడు, పరిశుద్ధాత్మ నా జీవితాన్ని ఆవరిస్తాడు. నా జీవితంలో ప్రతిదీ పరిశుద్ధాత్మ ఆధీనంలో ఉంటుంది. పరిశుద్ధాత్మ వెలుగులో నడుస్తూ ఆయన నాకు వెల్లడిచేసినవాటన్నిటికీ విధేయత చూపడమే నా బాధ్యత. పాపం విషయంలో నేనిటువంటి ముఖ్యమైన నిర్ణయం తీసుకున్న తర్వాత నేనిక “పాపం విషయంలో మృతుడనే.” నేనిక క్రీస్తు యేసులో సజీవుడను (రోమా 6:11). మానవ స్వభావం ఒక్కతీరుగా ఉన్నట్లుగానే యేసు పరిశుద్ధత కూడా ఒక్కతీరుగానే ఉంటుంది. దేవుడు ఈ పరిశుద్ధతనే మనకనుగ్రహించాడు. దేవుడు తన కుమారునిదైన ఈ పరిశుద్ధతనే మనకనుగ్రహించాడు. నేనిక ఆత్మవిషయంలో నూతన జీవం కలిగిన నూతనసృష్టిని.

ఏప్రిల్ 12

## నిరవధికమైన మరియు సంపూర్ణమైన ఆధిపత్యం

"మరణమునకు ఇకను ఆయనమీద ప్రభుత్వము లేదనియు ఎరిగి ఆయనతోకూడ జీవించుదుమని నమ్ముచున్నాము ... దేవుని విషయమై క్రీస్తు యేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి." (రోమా 6:8-11)

సహ నిత్యజీవం : యేసు క్రీస్తులో నిత్యజీవం వుంది. ఈ నిత్యజీవాన్నే ఆయన మనకిచ్చాడు. మనం తిరిగి పుట్టినప్పుడు నిత్యజీవాన్ని పొందుతాం. నిత్యజీవం దేవుని వరం. యేసులో ఉన్న శక్తి మరియు బలం మనలో కూడా ఉంటాయి. ఇది దేవుని సర్వశక్తమంతమైన కృపవలన కలిగే కార్యం. పాపంవిషయంలో మనమొక స్థిరమైన నిర్ణయంతీసుకొన్నప్పుడు దేవుని కృపను మనం చూడగలం.

"పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు ... " (అ.కా. 1:8). ఈ శక్తి మనకివ్వబడిన బహుమతి కాదు; పరిశుద్ధాత్మే మన శక్తి. యేసు సిలువమరణంతో మనకు సమానానుభవం ఉన్నప్పుడు యేసులో ఉన్న జీవంతోకూడా మనం సమానానుభవం కలిగినవారమౌతాం. పాపం విషయంలో నిర్ణయం తీసుకోకుండా మనం అనిశ్చిత పరిస్థితిలో ఉన్నప్పుడు మనం దేవునియెదుట మనల్ని సరిచేసుకోడంలేదని ఆయణ్ణి నిరాకరిస్తున్నామని అర్థం. అయితే పాపం విషయంలో స్థిరమైన నిర్ణయం తీసుకున్న వెంటనే దేవునిలో ఉన్న సంపూర్ణ జీవం మనకు లభిస్తుంది. అనంతమైన మరియు సమృద్ధమైన ఈ జీవాన్ని మనకివ్వడానికే యేసు ఈ లోకానికి వచ్చాడు (ఎఫెసీ 3:15-18 వచనాలు చూడండి). నిత్యజీవానికి కాలంతో పనిలేదు. ఇది అనంతమైనది. అనంతమైన నిత్యజీవం యేసు క్రీస్తు మాత్రమే మనకనుగ్రహించగలడు.

పాపాన్ని విడిచిపెట్టి అప్పుడే తిరిగిపుట్టిన పరిశుద్ధుడు సైతం దేవుని కుమారుడైన యేసులోని శక్తిని అనుభవపూర్వకంగా తెలుసుకోగలడు. అయితే మనం పాపాన్ని పట్టుకొని వ్రేలాడుతూ ఉన్నప్పుడు యేసులోని జీవాన్ని పొందలేం. దేవుని కుమారుడైన యేసు క్రీస్తులో ఉన్న అనంతమైన మరియు సమృద్ధమైన జీవం మనం పొందేలాగా మనం ప్రతి పాపంనుండి విడుదలపొంది ఆయన ఆధిపత్యం క్రిందకు రావాలి; మన జీవితాన్ని యేసు సర్వాధిపత్యానికి లోబరచాలి. అప్పుడే ఇతరులు మనం యేసుకు చెందినవారమని గ్రహించగలరు.

ఏప్రిల్ 13

## నీ భారం భరించరానిదిగా ఉన్నప్పుడు ఏం చేయాలి

"నీ భారము యెహోవామీద మోపుము" (కీర్తనలు 55:22)

మనం భరించగలిగిన భారమేదో, భరించలేని భారమేదో మనమే గుర్తించాలి. పాపపు భారాన్ని మరియు సందేహాలు సంశయాల భారాన్ని మనం మోయవలసిన పనిలేదు. అయితే దేవుడు మనం మోయవలసిన కొన్ని భారాల్ని మనమీద మోపుతాడు. వీటిని దేవుడు తీసివేయడు. దేవుడు మనమీద ఉంచిన భారం నిమిత్తం పనిచేస్తూ మనం దేవునికి దూరంగా ఉన్నట్లయితే మనమేదో భరించరాని బాధ్యతలు మోస్తున్నట్లుగా ఉంటుంది. మనం బాధ్యతల్లో మునిగిపోయి ఉన్నామనే ఆలోచన మనల్ని ఆశాభంగానికి గురిచేస్తుంది. దేవుడు మనతో ఏం చెబుతున్నాడో చూద్దాం: "నీ భారము యెహోవామీద మోపుము". దేవుడు మనమీద ఉంచిన పనుల భారాన్ని మోయడానికి మనం దేవునిమీద ఆధారపడినట్లయితే ఆయన తన సన్నిధిని మనతో ఉంచి మనకు సహాయం చేసి మన పనుల భారాన్ని తేలికచేస్తాడు.

అనేకులు ఎంతో ఉత్సాహంతో దేవుని సేవచేయడానికి ముందుకు వస్తారు. వారి ఉద్దేశాలు మంచివే. అయితే వారికి యేసు క్రీస్తుతో అన్యోన్యత లేనప్పుడు వారు ఉత్సాహం కోల్పోయి ఆశాభంగానికి గురవుతారు. తమ పనుల భారాన్నెలా మోయాలో వారి కర్థంకాదు; విసుగుతో మరియు అలసటతో ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటారు. ఇతరులు వారిని చూచి "ఎంతో ఆర్భాటంతో మొదలుపెట్టారు, ఇప్పుడు పరిస్థితి ఇలాగయ్యింది" అని చెప్పుకుంటారు.

"నీ భారము యెహోవామీద మోపుము" - ఈ వచనాన్ని నీవు చాలా కాలంనుండి వింటూనే ఉన్నావు గానీ ఆచరించడంలేదు. నీ పనుల భారాన్ని దేవునికి అప్పగించు. "ఆయన భుజముమీద రాజ్యభారముండును" (యెషయా 9:6). దేవుడు నీ మీద ఉంచిన భారాన్ని తిరిగి ఆయనకు అప్పగించు. నీ భారాన్ని ప్రక్కన పెట్టకు; దేవునికి అప్పగించి కనిపెట్టు. నీవు దేవునితో అన్యోన్యత కలిగి ఉన్నప్పుడు నీ పనుల భారం తేలిక అవుతుంది. నీ పనుల భారాన్ని దేవునిమీద మోపు; తప్పించుకోడానికి ప్రయత్నించవద్దు.

ఏప్రిల్ 14

## అంతరంగ అజేయత

“మీమీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి” (మత్తయి 11:29)

“ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును ... ” (హెబ్రీ 12:5-6). ఈ వచనం చదివిన తర్వాత మన అభియోగాలు ఎంత అల్పంగా కనిపిస్తున్నాయో చూశారా! యేసు మనల్ని తన వద్దకు రమ్మని పిలుస్తున్నాడు; ఆయన కాడిని మనం మోయాలని యెదురుచూస్తున్నాడు. మన ప్రభువు మనల్ని తనతో అన్యోన్య సహవాసంలోకి పిలుస్తున్నాడు. అప్పుడు మన ప్రతి మొర్ర, ప్రతి మూలుగూ ఆయన వింటాడు. అందుకనే యేసు “నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి” (మత్తయి 11:30) అని చెబుతున్నాడు. నీకు ప్రభువైన యేసుతో ఇటువంటి అన్యోన్య సహవాసం వుందా? ఉన్నట్లయితే ఆయన నీ మీద ఉంచిన భారాన్నిబట్టి ఆయనకు వందనాలు చెల్లిస్తూ సంతోషంగా ఉన్నావా?

“శక్తిహీనులకు బలాభివృద్ధి కలుగజేయువాడు ఆయనే” (యెషయా 40:29). దేవుడు మన ఉద్విగ్నతలన్నీ తొలగిస్తాడు; అప్పుడు మన అభియోగాల స్థానంలో స్తుతిగీతాలుంటాయి. దేవుని శక్తిని పొందడానికి ఏకైక మార్గం యేసు కాడిని ఎత్తుకొని ఆయన దగ్గర నేర్చుకోడమే.

“యెహోవాయందు ఆనందించుటవలన మీరు బలమొందుదురు” (నెహెమ్యా 8:10). దేవుని బిడ్డలకు సంతోషాన్నిచ్చేదేది? మనం కొంతమంది సేవకుల్ని చూచి వీళ్ల కసలు సేవపట్ల భారం లేదని ఆలోచిస్తుంటాం. అయితే మనమే మన కళ్లమీద ఉన్న ముసుగును తీసివేయాలి. వారిలో  కనిపించే సమాధానం వెలుగు సంతోషం అన్నీ దేవునినుండి కలిగినవే. వాస్తవానికి వారు దేవుని భారాన్ని మోస్తున్నారనడానికి నిదర్శనం యివే. దేవుడు మనమీద ఉంచిన భారాన్ని ఒక ఉదాహరణతో వివరించవచ్చు. ద్రాక్షపళ్లను త్రొక్కి ద్రాక్షరసం తీసినట్టుగా దేవుడు మనమీద ఉంచిన భారం మనల్ని నలగగొట్టి మనలోనుండి ద్రాక్షరసంవంటి మధురపదార్థాలను వెలుపలికి తీస్తుంది. అయితే మనలో అనేకులు ద్రాక్షరసాన్నే చూస్తున్నారు గానీ భారాన్ని చూడడంలేదు. భూమ్యాగాధాల్లోని ఏ శక్తీ మనలో ఉంచబడిన దేవుని ఆత్మను జయించలేదు. దేవుని ఆత్మ మన అంతరంగంలో అజేయత నిస్తుంది.

నీ జీవితంలో ద్రాక్షరసంవంటి మధురపదార్థాలున్నాయా? లేక నిష్ఫలమైన ఏడుపులు పెడబొబ్బలు మాత్రమే ఉన్నాయా? నీ జీవితంలోని ఏడుపుల్ని పెడబొబ్బల్ని బయటికి త్రోసివేయి. దేవుని బలం కలిగి ఉన్న నీవు బలహీనుడుగా ఫలహీనుడుగా ఉండడం ఘోరమైన తప్పే.

ఏప్రిల్ 15

## సునిశిత శ్రద్ధను చూపలేకపోడం

"ఆసా ఉన్నతస్థలములను ఇశ్రాయేలీయులలోనుండి తీసివేయలేదు గాని యితడు బ్రదికిన కాలమంతయు ఇతని హృదయము యథార్థముగా ఉండెను." (2 దిన 15:17)

ఆసాలో సంపూర్ణ విధేయత లేదు. అతని బాహ్యజీవితంలో ఉండవలసిన విధేయత లోపించింది. అతను చాలా ముఖ్యమైన విషయాల్లో విధేయత చూపినప్పటికీ అతని విధేయతలో సంపూర్ణత లేదు. "నాలో ఇదేమీ అంత గొప్ప విషయం కాదు" అని మనలో మనం ఆలోచిస్తుండవచ్చు. నీ మట్టుకు నీకు అది అంత ముఖ్యమైనదిగా కనిపించకపోవచ్చేమో గానీ దేవుని కది చాలా ముఖ్యమైనది కావచ్చు. దేవుని బిడ్డ దేన్నీ అల్పమైనదిగా ఎంచకూడదు. ఇంకెంత కాలం దేవుడు చెబ్తున్న మాటల్ని వినకుండా ఆయణ్ణి అడ్డుకుంటూ ఉందాం! అయితే దేవుడు సహనంతో మళ్లీ మళ్లీ మనకు బోధిస్తున్నాడు. ఆయన దీర్ఘశాంతుడు. "నేను దేవునియెదుట సరిగ్గానే వున్నాను" అని నీలో నీవు ఆలోచిస్తుండవచ్చు. అయినా నీ జీవితంలో ఇంకా కూలద్రోయవలసిన "ఉన్నతస్థలములు" ఉన్నాయేమో! ఇంకా నీ జీవితంలో ఎక్కడో ఒక చోట అవిధేయత ఉందేమో! నీ హృదయం దేవునియెదుట సరిగ్గా ఉందని నీవు దృఢంగా ఉన్నావేమో! అయినా నీ జీవితంలో ఎక్కడో ఒక చోట ఏదో సందేహం సంశయం ఉన్నాయేమో! దేనిగురించైనా దేవుడు నీలో సందేహాన్నుంచినప్పుడు అదెటువంటిదైనా అక్కడే ఆగిపో. మన జీవితంలో ఏదీ దేవునికి అప్రాముఖ్యమైనది కాదు.

నీ జీవితంలోని కొన్ని విషయాల్లో శ్రద్ధ చూపడం పూర్తిగా మర్చిపోయావా? మర్చిపోయినట్లయితే నీవు ఆ విషయాల్లో సరిగ్గానే ఉన్నావని ఆలోచిస్తున్నావని అర్థం. అయితే అది నీలో నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపిస్తోంది. నీవు శ్రద్ధ చూపించవలసినవాటిపట్ల శ్రద్ధ చూపడంలేదని అర్థం. నీ గుండె కొట్టుకోకుండా ఉంటే ఎలా ఉంటుందో ఒక్క సారి ఆలోచించు. నీవు శ్రద్ధ చూపించవలసినవాటి పట్ల నీ ఆధ్యాత్మిక గుండె కొట్టుకోకపోతే కూడా అలాగే ఉంటుంది. సరైన పనులు చేయకుండా నేను సరిగ్గానే ఉన్నానంటే ఎలా! ఆధ్యాత్మికత లోపించినప్పుడు నేను ఆధ్యాత్మికంగా సరిగ్గానే ఉన్నానంటే ఎలా? దేవుడు నిన్నూ నీ సర్వస్వాన్నీ కోరుకుంటున్నాడు. నీవు అమూలాగ్రం ఆయన బిడ్డగా వుండాలని కోరుకుంటున్నాడు. కాబట్టి నీవు దేవునికి యోగ్యమైన బిడ్డగా ఉండాలంటే నీ జీవితంలోని అన్ని విషయాలపట్ల సునిశితమైన శ్రద్ధ చూపాలి. ఇందుకు చాలా సమయం కావాలి; సహనం కూడా కావాలి. అయితే కొంతమంది కొన్ని నిమిషాల ప్రయత్నంతోనే ఒక కొండమీదనుండి మరొక కొండమీదకు దూకే ప్రయత్నాలు చేస్తుంటారు!

ఏప్రిల్ 16

## కొండమీదనుండి దిగి రాగలవా?

"మీకు వెలుగుండగనే వెలుగునందు విశ్వాసముంచుడని ... " (యోహాను 12:36)

మనం ఇదివరకటికంటె ఇప్పుడు బాగున్నామనే అనుభూతి మనందరికీ ఎప్పుడో ఒకప్పుడు కలిగే ఉంటుంది! "నేనెప్పుడూ ఇలాగే ఉంటే ఏ పనైనా చేయగలను" అని కూడా చెప్పి ఉండవచ్చు! అయితే ఇదంతా వాస్తవ జీవితంలో సాధ్యం కాదు; అయినా మనం ఉండవలసినది ఇలాగే. మన దైనందిన జీవితం కొండమీద అనుభవం లాగా ఉండదు; మన దైనందిన జీవితంలో మనం చాలా నిస్తేజంగా ఉంటాం. అయితే మనం కొండమీద చూచిన స్థాయికి మన దైనందిన జీవితం ఎదగాలి.

నీకు కొండమీద కలిగిన ఉద్వేగాన్ని చల్లారనీయకు. "అటువంటి అనుభూతుల్లో ఉండడం ఎంత గొప్ప సంగతి!" అని ఆలోచిస్తూ ఏం చేయకుండా ఉన్నావేమో! వెంటనే ఏదో ఒకటి చేయి. నీవు ప్రార్థిస్తున్నప్పుడు దేవుడు నీకేదైనా వెల్లడిచేసినట్లయితే "నేను చేస్తాను" అని చెప్పకు; వెంటనే చేసెయి. ఒక్కసారి నీలో ఉన్న బద్ధకాన్ని దులిపివేయి. కొండమీద అనుభవాన్ని ఆశిస్తూ మనం సోమరులుగా ఉంటున్నామేమో! కొండమీద అనుభవం గురించి మాట్లాడుతూ కాలం గడుపుతున్నామేమో! మనం కొండమీద చూచిన అనుభవంతో సాదాసీదాగా ఉన్న దైనందిన జీవితాన్ని గడపడం నేర్చుకోవాలి.

ఆటంకాలున్నాయని లేదా అర్థం కావడంలేదని నీ ప్రయత్నాలు ఆపకు. మళ్లీ మళ్లీ ప్రయత్నించు. మనఃపూర్వకంగా దేవునికొరకు నిలబడు. నీ నిర్ణయాల్ని మాటి మాటికీ మార్చుకోకు. అయితే నీ నిర్ణయాలు కొండమీద నీకు కలిగిన అనుభూతికి, అక్కడ నీవు నేర్చుకున్నదానికి అనుగుణంగా ఉండేలా చూసుకో.

ఏప్రిల్ 17

## పూర్ణం, లేదా శూన్యం

“ఆయన ప్రభువని సీమోను పేతురు విని, వస్త్రహీనుడై యున్నందున పైబట్ట వేసి సముద్రములో దుమికెను.” (యోహాను 21:7)

నీ జీవితంలో నీవు దేన్నైనా కావాలని వదిలివేశావా? లేదా నిదానంగా ఆలోచించుకొని దేన్నైనా వదిలివేశావా? లేదా నిర్లక్ష్యంతో దేన్నైనా వదిలివేశావా? నీ జీవితంలో ఇటువంటి సంఘర్షణ ఎప్పుడైనా ఎదురయ్యిందా? ఇది నీ ఇచ్ఛాశక్తికి లేదా నీ సంకల్పశక్తికి సంబంధించిన విషయం. బయటనుండి వచ్చిన ఎన్నో వత్తిళ్లు నిన్ను ప్రేరేపించి ఉండవచ్చు గానీ అవేమీ కార్యరూపం దాల్చి ఉండకపోవచ్చు. ఎందుకంటే నిజమైన సంఘర్షణ బాహ్యపరిస్థితులకు సంబంధించింది కాదు గానీ, నీ అంతరంగానికి సంబంధించింది మాత్రమే. బయటి పరిస్థితులకు తలొగ్గి భౌతికమైనవాటిని వదిలిపెట్టడం వాస్తవానికి నీవు ఏదో సంకెళ్లల్లో ఉన్నావనడానికి సూచన.

నీవు మనఃపూర్వకంగా నీ ఇచ్ఛను నీ సంకల్పాన్ని యేసు క్రీస్తుకు లోబర్చావా? ఇది భావోద్వేగాలకు సంబంధించింది కాదు; ఇది నీ మనోసంకల్పానికి నీ ఇచ్ఛాశక్తికి సంబంధించిన విషయం మాత్రమే. ఒక వేళ నీ భావోద్వేగాలు నిన్ను ప్రేరేపించినట్లయితే అది తాత్కాలికమైనదే అవుతుంది. నీ భావోద్వేగాల్ని నీవు పరిగణనలోకి తీసుకున్నట్లయితే నీవెప్పటికీ నీ మనోసంకల్పానుసారం చేయలేవు. నీవు చేయవలసిన పని ఎటువంటిదని దేవుణ్ణి అడగకు; అదెటువంటిదైనా నీ ఇచ్ఛను నీ సంకల్పాన్ని దేవుని చిత్తానికి లోబర్చు.

సముద్రపుటలలమీద నీవు యేసు క్రీస్తు స్వరాన్ని వినినట్లయితే నీవాయనతో అన్యోన్య సహవాసం కలిగి ఉండు. అప్పుడు నీ అభిప్రాయాలు నీ ఆలోచనలు నీ పట్టుదల వాటంతట అవే దృఢంగా ఉంటాయి.

ఏప్రిల్ 18

## సిద్ధబాటు

"దేవుడు ఆ పొద నడుమనుండి -మోషే మోషే అని అతనిని పిలిచెను. అందుకతడు -చిత్తము ప్రభువా అనెను." (నిర్గమ 3:4)

దేవుడు మాట్లాడినప్పుడు మనలో చాలామంది అయోమయస్థితిలో ఉంటారు. మనమాయనకు జవాబు చెప్పలేం. మోషే జవాబు అతనెక్కడ ఉన్నాడో అతనికి తెలుసనీ, అతను సిద్ధంగా ఉన్నాడని తెలియజేస్తోంది. సిద్ధబాటు అంటే దేవునితో సరైన సంబంధాన్ని కలిగి ఉండడం, మరియు మనమెక్కడ వున్నామో తెలుసుకోడం. మనమెక్కడ కెళ్లాలనుకుంటున్నామో దేవునితో పదే పదే చెబ్తుంటాం. అయితే దేవునికొరకు ఆయన పనికొరకు సిద్ధపడినవారికి తగిన సమయంలో ప్రతిఫలం లభిస్తుంది. ఏదో ఒక గొప్ప అవకాశం మనల్ని వెతుక్కుంటూ వస్తుందని, అనూహ్యమైనదేదో మనకు తారసపడుతుందని మనం యెదురుచూస్తుంటాం. అటువంటి అవకాశం వచ్చినప్పుడు మనం "నేనున్నాను" అని జవాబిస్తాం. ఏదైనా ఒక గొప్ప పనికొరకు యేసు క్రీస్తు మనల్ని పిలిచినప్పుడు మనం సిద్ధంగా ఉంటాం. అయితే ఏదైనా చిన్న పనికి, ఏ ప్రాముఖ్యతా లేని పనికి మాత్రం సిద్ధపడం.

పని ప్రాముఖ్యత ఉన్నదైనా లేక ప్రాముఖ్యత లేనిదైనా పని పనే; మనం ఏ పనికైనా సరే సిద్ధపడాలి. ఇదే నిజమైన సిద్ధబాటు. ఎందుకంటే మనం దేవుని ఉద్దేశాల ప్రకారం చేస్తున్నట్లయితే మనం చేయవలసిన పనిని ఎంచుకునే అవకాశం మనకు లేదు. దేవుడిచ్చిన పని ఏదైనా సరే మనం సిద్ధపడి ముందుకు నడవాలి. యేసు క్రీస్తు ప్రతి పనిలోను తన తండ్రి మాట విన్నట్టుగా, మనం కూడా ప్రతి పనిలోను తండ్రి మాట వినాలి. అప్పుడే మనలో సంపూర్ణమైన సిద్ధబాటు మరియు దేవునిపట్ల నిజమైన ప్రేమ ఉన్నాయని అర్థం. యేసు తాను తండ్రితో ఎటువంటి అన్యోన్యత కలిగి ఉన్నాడో మననుండి అటువంటి అన్యోన్యతనే కోరుకుంటున్నాడు. యేసు క్రీస్తు మనల్ని ఘనమైన పనికొరకు పిలవవచ్చు; లేదా అల్పమైన పనికొరకు పిలవవచ్చు. ఎందుకంటే అది ఆయన ఇష్టం; ఆయన పని. అయితే ఆయన మనలో తన మనస్సు ఉండాలని కోరుకుంటున్నాడు. "మనము ఏకమై యున్నలాగున, వారును ఏకమై యుండవలెనని ... " (యోహాను 17:22).

దేవుడు నిన్ను ఉన్న పళంగా పిలుస్తాడేమో; ఎప్పుడూ సిద్ధంగా ఉండు. సిద్ధపడి ఉన్న వ్యక్తి సిద్ధంగానే ఉంటాడు కాబట్టి అతనింకా సిద్ధపడవలసిన పని లేదు. దేవుడు పిలిచిన తర్వాత మనం సిద్ధపడడానికి ఎంతో సమయాన్ని వ్యర్థం చేస్తున్నామేమో! సిద్ధబాటుకు సిద్ధపడి ఉన్నవారికి దేవుడు సమీపంగా ఉంటాడనడానికి మండే పొద సాదృశ్యం.

ఏప్రిల్ 19

## ప్రతి చిన్న శోధన విషయంలోను జాగ్రత్తగా వుండు

"యోవాబు అబ్షాలోము పక్షము అవలంబింపకపోయినను అదోనీయా పక్షము అవలంబించియుండెను" (1 రాజులు 2:28)

యోవాబు ఎన్నో విషమపరీక్షలకు తట్టుకొని నిలిచాడు. అబ్షాలోము అత్యాశకు, ఆకర్షణకు లోనుకాకుండా దావీదు రాజుకు అత్యంత విధేయుడుగా ఉన్నాడు. అయితే యోవాబు తన జీవిత చరమాంకంలో అశక్తుడు పిరికివాడు అయిన అదోనీయావైపు మళ్లాడు. యోవాబువంటి వ్యక్తి ఇటువంటి పరిస్థితుల్లో శోధనలో పడ్డాడు కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో ఉన్నవారెవరైనా శోధనలో పడ్తారని జ్ఞాపకం పెట్టుకో (1 కొరింథీ 10:11-13 వచనాలు చూడండి). నీవు జటిల సమస్యలనుండి, తీవ్రమైన శోధనలనుండి అవలీలగా బయటపడి ఉండవచ్చు; అయితే నీకు తెలియకుండానే నిన్ను శోధనలోకి నడిపించే చిన్న చిన్న విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉండు. ఒకప్పుడు నీవు సాధించిన అఖండ విజయాలు నిన్ను ఏ సమస్యల్లోకి లాగవని ధీమాగా ఉండకు. గొప్ప విజయాలు సాధించిన నీవు చిన్న చిన్న విషయాల్లో శోధనలో పడవచ్చు.

"గొప్ప గొప్ప శోధనలెదుర్కొన్న నన్ను ఈ చిన్న విషయాలు ఏం చేయగలవు" అని మనం చెబుతుండవచ్చు. శోధన ఎక్కడనుండి వస్తుందో ఊహించలేవు. కొన్ని సార్లు చాలా చిన్న విషయాలే నిన్ను పెద్ద ప్రమాదంలో పడవేస్తాయి. ఒక గొప్ప ఆధ్యాత్మిక విజయం తర్వాత చాలా చిన్న విషయాలు నిన్ను సమస్యల్లో పడవేయవచ్చు. అవి అంత పెద్దవి బలమైనవి కాకపోవచ్చు గానీ సమస్య సమస్యే గదా. నీవు వాటి విషయంలో ముందునుండి అప్రమత్తంగా లేకపోతే అవి నిన్ను ముంచివేయవచ్చు. జటిల సమస్యల్లో గొప్ప శోధనల్లో నీవు దేవునిపట్ల నమ్మకంగా ఉండవచ్చు. అయితే పైకి కనిపించనివాటిపట్ల జాగ్రత్తగా ఉండు. నిన్ను నీవు అసాధారణంగా అంచనాలకు మించి పరీక్షించుకొని భయపడనక్కర్లేదు గానీ అప్రమత్తంగా ఉండు. దేవునియెదుట నిన్ను నీవు కాచుకొని ప్రవర్తించు. నీ బలాన్ని నీవు కాపాడుకోలేకపోతే అది రెండింతలు నిన్ను బలహీనుణ్ణి చేస్తుంది. నీ బలాన్ని హరించే శోధనలు ప్రవేశించేది వాస్తవానికి ఇటువంటి సందర్భాల్లోనే. బైబిల్లోని వ్యక్తులు కొందరు తాము బలవంతుల మనుకొంటూ తొట్రుపడిన సందర్భాలున్నాయి. వాళ్లెవరూ తాము బలహీనులమని తలంచిన సందర్భాల్లో శోధనలో పడలేదని గుర్తుంచుకో.

"విశ్వాసముద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీకొరకు .... భద్రపరచబడి యున్నది" (1 పేతురు 1:5).

ఏప్రిల్ 20

## పరిశుద్ధుడు దేవుణ్ణి నిందించగలడా?

"దేవుని వాగ్దానములు ఎన్నియైనను అన్నియు క్రీస్తునందు అవునన్నట్టుగానే యున్నవి గనుక ... అవి ఆయనవలన నిశ్చయములైయున్నవి" (2 కొరింథీ 1:20).

మత్తయి 25:14-30 వచనాల్లో యేసు బోధించిన తలాంతుల ఉపమానం మనకొక హెచ్చరికగా ఉంది. మనం మన సామర్థ్యాల్ని కొన్ని సార్లు సరిగ్గా అర్థంచేసుకోడంలో పొరబడతామనే హెచ్చరిక ఇందులో కనిపిస్తోంది. ఈ ఉపమానం మనలో అంతర్గతంగా ఉన్న విలక్షణమైన తెలివితేటలగురించి మరియు మన సామర్థ్యాలగురించి చెప్పడం లేదుగానీ పరిశుద్ధాత్మకు సంబంధించినది మాత్రమే. శిష్యులు పెంతుకొస్తు పండుగనాడు పరిశుద్ధాత్మను పొందారు. మన విద్యార్హతలు మన మేధస్సు మనలో ఉన్న ఆధ్యాత్మిక స్థితికి ఏ మాత్రం ప్రమాణాలు కావు. ఆధ్యాత్మిక విషయాల్లో మన సామర్థ్యాలకు దేవుని వాగ్దానాలే ప్రమాణాలు. మనమెలా ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడో మనం అంతకు తక్కువగా ఉన్నప్పుడు మనం దేవునిమీదే నిందారోపణ చేసేవారిగా ఉంటాం. పై ఉపమానంలోని మూడవ సేవకుడు "నువ్వు నాకిచ్చిన శక్తికి మించి నాలోనుండి ఫలితాల్ని కోరుకుంటున్నావు. నాదగ్గరనుండి చాలా యెక్కువ పని రావాలని యెదురుచూస్తున్నావు. నేనీ పని చేయలేను" అని చెప్పినట్టుగా మనం కూడా చెబుతున్నామేమో! "నేను ఈ పని చేయలేను" దేవుని సర్వశక్త పరిశుద్ధాత్మకు అని చెప్పవద్దు. నీలో అంతర్గతంగా ఉన్న సహజసామర్థ్యాలకున్న పరిమితుల్ని దేవుని పరిశుద్ధాత్మ అనుగ్రహించే శక్తికి ఆపాదించకు. మనం పరిశుద్ధాత్మను పొందినవారమైతే, దేవుడు మనలో పరిశుద్ధాత్మ కార్యాలు వెల్లడికావాలని కోరుకుంటాడు.

ఉపమానంలోని సేవకుడు తనను తాను సమర్థించుకున్నాడు. పనిలో పనిగా తన యజమానిని నిందించాడు. "ఇచ్చినదానికంటె ఎక్కువ రావాలని కోరుకుంటున్నావు" - ఇదీ ఆ సేవకుని ఆరోపణ. "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" (మత్తయి 6:33) అని యేసు ప్రభువు మనకు చెప్పిన తర్వాత కూడా మనం దిగులుపడ్తూ దేవుణ్ణి నిందించేవారిగా ఉన్నామా? "ఇచ్చినదానికంటె ఎక్కువ రావాలని కోరుకుంటున్నావు" అని ఉపమానంలోని సేవకుడు చెప్పడంలో దేవుడు అతనికి ఏదో తక్కువచేసినట్టు ఆలోచిస్తూ కలతచెందినట్టు కనిపిస్తోంది కదా! సోమరితనం వున్న వ్యక్తిలో ఇతరుల్ని నిందించే లక్షణం వుంటుంది. "నాకు మంచి అవకాశం రాలేదు; నాకు మంచి అవకాశం ఎవరూ ఇవ్వలేదు" అంటూ సోమరి తన వైఫల్యాల్ని ఇతరులకు ఆరోపిస్తాడు. ఆధ్యాత్మిక విషయాల్లో సోమరులుగా ఉన్నవారు తమ వైఫల్యాలకు దేవుణ్ణి నిందించేవారుగా ఉంటారు. సోమరులెప్పుడూ ఇతరులమీద దాడిచేస్తుంటారు.

ఆధ్యాత్మిక విషయాల్లో మన శక్తిసామర్థ్యాలు దేవుని వాగ్దానాలమీద నిలిచి ఉన్నాయని, దేవుని వాగ్దానాలే మన శక్తిసామర్థ్యాలకు నిర్దిష్టప్రమాణాలనే విషయం మర్చిపోవద్దు. దేవుడు తన వాగ్దానాల్ని నెరవేర్చలేడా? జవాబు మనం దేవుని పరిశుద్ధాత్మను పరిశుద్ధాత్మ మనకనుగ్రహించే శక్తిని పొందామా లేదా అనేదానిమీదే ఆధారపడి ఉంది.



ఏప్రిల్ 21

## ప్రభువును దుఃఖపెట్టవద్దు

"ఫిలిప్పూ, నేనింత కాలము మీయొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా?" (యోహాను14:9)

మన స్వంత అభిప్రాయాలు మన స్వంత ఆలోచనలు కొన్ని సార్లు మనల్ని మూర్ఖుల్ని మందమతుల్ని చేస్తాయి. మనలో ఉన్న మూర్ఖత్వం మందబుద్ధి ప్రభువుకు విస్మయం కలిగిస్తాయి. మనం ఎటువంటి అన్యమనస్కతల్లేకుండా సూటిగా ప్రభువు మాటల్ని నమ్మినప్పుడు మనలో మూర్ఖత్వానికి మందబుద్ధికి తావుండదు. ఫిలిప్పుకు తన భవిష్యత్తు అయోమయంగా అస్పష్టంగా కనిపించింది. అతను యేసు క్రీస్తు గురించి తనకంతా తెలుసు కాబట్టి పరలోకపు తండ్రిని చూడాలనుకున్నాడు. పరలోకానికి సంబంధించిన నిగూఢమైన విషయాలు సుదూరంలో కంటికి కనిపించనంత దూరంలో లేవు; అవి ఇప్పుడు మన మధ్య యేసులో వెల్లడిచేయబడ్డాయి. ఫిలిప్పు యేసును వెంబడించడానికి విముఖత చూపడంలేదు గానీ "ప్రభువా, తండ్రిని మాకు కనబరచుము, మాకంతే చాలునని ..." (యోహాను 14:8) ప్రభువును దుఃఖపెట్టాడు. మనం కూడా ఫిలిప్పులాగే ఉన్నాం. ప్రభువు వెంటనే ఫిలిప్పుతో "ఫిలిప్పూ, నేనింత కాలము మీయొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు" అని చెప్పాడు. ఇది మనకు కూడా ఒక హెచ్చరికే! దేవుడు తనను తాను వెల్లడి చేసుకోవాలని మనం అడుగుతుంటాం గానీ ఆయన మనద్వారా వెల్లడి అవుతూనే ఉన్నాడన్న సంగతిని గుర్తించం. మనల్ని చూస్తున్న ఇతరులు ఈ సంగతిని గ్రహిస్తారు గానీ మనమే గ్రహించలేకపోతున్నాం. దేవుడు మనలో ఏ కార్యాలు చేస్తున్నాడో మనం సంపూర్ణంగా తెలుసుకోవాలనుకుంటున్నాం గానీ మనలో ఆ సంపూర్ణ అవగాహన లోపించి, ఇంకా మనకు దేవునినుండి ఏదో ఒక గొప్ప అనుభవం రావాలని పదే పదే ఎదురుచూడడం జరుగుతోంది. ఎంత సేపూ దేవుడు మనకు గొప్ప అనుభవాల నివ్వాలని యెదురుచూస్తుంటే ఈ అనుభవాలే మనకు దేవునికి మధ్య ఆటంకం కాగలవు; వీటి మూలంగానే మనం ప్రభువును దుఃఖపెట్టేవారిగా ఉంటామేమో! మనం దేవుణ్ణి అడిగే ప్రశ్నలు ఆయణ్ణి దుఃఖానికి గురిచేస్తాయి; ఎందుకంటే ఇవి ఆయన పిల్లలు అడగవలసిన ప్రశ్నలు కావు.

"మీ హృదయమును కలవరపడనియ్యకుడి" (యోహాను 14:1,27). నా హృదయాన్ని కలవరపాటుకు గురిచేసి నేను యేసును దుఃఖపెడ్తున్నానా? నేను యేసును, ఆయన విలక్షణ స్వభావాల్ని నమ్ముతున్నట్లయితే నా నమ్మకానికి తగినట్టుగా జీవిస్తున్నానా? లేక, నా హృదయాన్ని కలవరానికి గురిచేస్తున్నానా? అర్థంపర్థంలేని అనవసరమైన ప్రశ్నలకు నా హృదయంలో తావిస్తున్నానా? నేను దేవునితో సంపూర్ణ మైన మరియు నిరపేక్ష మైన కలిగి ఉండాలి; అప్పుడు నేను దేవునినుండి నేను కోరుకున్న అనుభవాలు కాక ఆయన యిచ్చే అనుభవాల్ని యథాతథంగా అంగీకరించగలుగుతాను. దేవుని కాపుదల రాబోయే కాలంనాటిదే కాదు; ఆయన ఇప్పుడు కూడా ఇక్కడ కూడా మనతోనే ఉన్నాడు; మనల్ని కాపాడుతూ మనల్ని నడిపిస్తున్నాడు. దేవుడు మన మధ్యే ఉన్నాడని, ఆయన తత్‌క్షణమే మనకు విడుదలనిస్తాడని గుర్తించు.

ఏప్రిల్ 22

## నిత్యం వెలిగే వెలుగు

"మనమందరమును ముసుకులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను ప్రతిఫలింపజేయుచు ... మార్చబడుచున్నాము" (2 కొరింథీ 3:18)

దేవుని సేవకుడు ఒంటరిగా ఉన్నప్పటికీ తాను ఒంటరిగా ఉన్నాననే ఆలోచన అతనిలో ఉండకూడదు. క్రైస్తవ జీవితం తొలినాళ్లలో నిరుత్సాహపూరితమైన సంఘటనలు చోటుచేసుకోవచ్చు. తీక్షణమైన వెలుగుతో నిండినవారు మెల్లమెల్లగా మసకబారుతూ ఉండవచ్చు. మనతోబాటు ఉన్నవారు మనల్ని విడిచిపెట్టి వెళ్లిపోవచ్చు. అయితే మనం వీటన్నిటినీ చూస్తూ కూడా నిబ్బరంగా ఉండాలి. ఎంత నిబ్బరంగా ఉండాలంటే మనం ఒంటరిగా ఉన్నామనే ఆలోచన సైతం మనలో ఉండకూడదు. "ఎవడును నా పక్షమున నిలువలేదు, అందరును నన్ను విడిచిపోయిరి ... ప్రభువు నా ప్రక్క నిలిచి నన్ను బలపరచెను" ( 2 తిమోతి 4:16-17) అని పౌలు తన జీవితానుభవం గురించి చెప్పాడు. మనం మన విశ్వాసాన్ని మసకబారే వెలుగుమీద కాక నిత్యం ప్రజ్వరిల్లే వెలుగుమీద కట్టుకోవాలి. మన జీవితంలో చాలా "ముఖ్యమైనవారు" మనల్ని విడిచిపెట్టి వెళ్లినప్పుడు మనం విచారపడ్తాం. అయితే వారు వెళ్లిపోవలసినవాళ్లేనని మనం గుర్తించినప్పుడు మనం చేయవలసిన పని ఒకటే. మనం మనకొరకు దేవునివైపు చూడాలి.

నీ విషయంలోను, నీవు నమ్మినవాటి విషయంలోను నీవు దేవునివైపు చూడాలని గట్టి పట్టుదలతో ఉన్నప్పుడు ఏదీ నిన్ను ఆటంకపర్చకుండా చూసుకో. నీవు బోధించే ప్రతిసారీ ముందుగా దేవునివైపు చూడు. అప్పుడు నీ బోధలో దేవుని మహిమ ప్రతిఫలిస్తుంది. నిజమైన సేవకుడు సర్వదా దేవునివైపు చూస్తూనే ఉంటాడు. మనం క్రీస్తుకొరకు పరిచర్యలో దేవుని మహిమ ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఇది కొన్నిసార్లు మనకు తెలియకపోవచ్చు. "తన ముఖ చర్మము ప్రకాశించిన సంగతి మోషేకు తెలిసియుండ లేదు" (నిర్గమ 34:29).

మనకున్న సందేహాల్నీ సంశయాల్నీ ప్రదర్శించడానికి దేవుడు మనల్ని పిలవలేదు; లేక, దేవునితో మనకున్నటువంటి గొప్ప అనుభవాల్ని ఆనందాల్ని అందరికీ బాహాబాహీగా చెప్పడానికి పిలవలేదు. దేవునిలో సదా నిలిచి ఉండడమే నిజమైన సేవకుని విజయరహస్యం!

ఏప్రిల్ 23

## నీవు పనిని ఆరాధిస్తున్నావా?

“మేము దేవుని జతపనివారమునై యున్నాము ...” (1 కొరింథీ 3:9)

దేవునికొరకు నీవు చేసే ఏ పనైనా ఆయనమీద నీకున్న ఏకాగ్రతకు భంగం కలిగిస్తోందా? ఏదీ నీ ఏకాగ్రతను చెదరగొట్టకుండా జాగ్రత్తపడు. చాలామంది క్రైస్తవులు దేవుణ్ణి ఆరాధిస్తున్నామనుకుంటున్నారు గానీ వారు తమ పనినే ఆరాధిస్తున్నారు. క్రైస్తవుని దృష్టి దేవునిమీదే ఉండాలి. దేవునిమీద ఏకాగ్రత చూపేవారు అన్యవిషయాలకు దాసులు కాక, దేవుడనుగ్రహించిన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తుంటారు. ఏకాగ్రతలేనివారు తమ పనిలో మునిగితేలుతూ తమకు తామే హద్దులు ఏర్పరుచుకొని తమను తామే నియంత్రించుకుంటూ దేవుడనుగ్రహించిన స్వాతంత్ర్యానికి దూరంగా ఉంటారు. దేవునిమీద తదేకదృష్టిలేనివారు పనిలో త్వరత్వరగా అలసట చెంది చివరికి ఓటమిపాలవుతారు; జీవితంలో స్వేచ్ఛను సంతోషాన్ని కోల్పోతారు. వాళ్ల మనస్సుల్ని హృదయాల్ని నరనరాల్ని విసుగు అలసట ఆవరిస్తాయి. వాళ్లు దేవుని ఆశీర్వాదాన్ని కోల్పోతారు.

నాణెం అవతలివైపు కూడా చూద్దాం. మనం దేవునిమీద తదేక దృష్టి నిలిపి ఏకాగ్రతతో ఉన్నప్పుడు మనల్ని ఏ పరిమితులూ నియంత్రించవు. మనం దేవుని ఆధీనంలోఉంటాం కాబట్టి మనం దేనికీ దాసులయ్యే వీలు లేదు. నీకున్న ఒకే ఒక బాధ్యత దేవునిలో సదా నిలిచి ఉండడం, మరియు ఏదీ నీ ఏకాగ్రతకు భంగం కలిగించకుండా కాపాడుకోడం మాత్రమే. దేవునిచేత పరిశుద్ధపర్చబడిన వ్యక్తి దేవుడనుగ్రహించిన స్వాతంత్ర్యాన్ననుభవిస్తాడు. ఇంత క్రితం అతణ్ణి కట్టి పడవేసిన బంధకాలు ఇప్పుడతణ్ణి ఏమీ చేయలేవు. నీవొక విషయాన్ని మర్చిపోకూడదు. నీవు దేవుని జతపనివాడవు మాత్రమే. కాబట్టి నీ జతపనివాడిపట్ల శ్రద్ధాసక్తులు చూపించు.

మనమెక్కడ ఉండాలో మన చిత్తంగానీ మన ఇష్టంగానీ కాదు. దేవుడు మనల్ని దేనికి సిద్ధపరుస్తున్నాడో మనకు ముందుగా తెలియదు. అన్నీ దేవుని ఆధీనంలో ఉన్నాయి; మన జీవితాన్ని నడిపించేది ఆయనే. దేవుడు మనల్నెక్కడ ఉంచినా మన అంతిమ లక్ష్యం ఆయన మన కప్పగించిన పనిలో ఆయనకొరకు ధారగా పోయబడడమే. “చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనినైనను నీ శక్తిలోపము లేకుండ చేయుము.” (ప్రసంగి 9:10)

ఏప్రిల్ 24

## ఆధ్యాత్మిక విజయాల్ని కోరుకొనేవారికొక హెచ్చరిక

"దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని ..." (లూకా 10:20)

క్రైస్తవులు లోకాన్ని పాపాన్ని శోధనగా పరిగణించడం మామూలే. అయితే ఉచ్చు కూడా పొంచి ఉంది. ఆధ్యాత్మిక విజయాల్ని కోరుకోడం కూడా ఒక ఉచ్చులాంటిదే. మనం ఏర్పరుచుకున్న ప్రమాణాల ప్రకారం, లేదా మనుషులు ఊహలు ఆలోచనల ప్రకారం ఉన్న ప్రమాణాల ప్రకారం ఆధ్యాత్మిక విజయాల్ని లెక్కంచడం మనం చూస్తున్న సంగతే. దేవుడు ఆదేశించినది అనుమతించినది తప్ప మరి దేన్నీ కోరుకోవద్దు. ఆయన ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లడానికి ఏం చేయమంటే అది చేయడానికి "నిందను భరించుచు శిబిరము వెలుపలికి ఆయనయొద్దకు" (హెబ్రీ 13:13) సర్వదా సిద్ధంగా ఉండు. సేవ విజయవంతంగా చేస్తున్నామని మనం సంతోషపడనక్కర్లేదు. మనల్ని ఎక్కువగా సంతోషపెట్టేది మన ఆధ్యాత్మిక విజయాలే. యేసు ప్రభువు మన విజయాల్ని కోరుకోడం లేదు (లూకా 10:20 చూడండి). మనందరిలో ఎంతో కొంత వ్యాపారదృక్పథం ఉంటుంది. ఎన్ని ఆత్మల్ని రక్షించామని లెక్కబెట్టుకొనేవారు మనలో ఉన్నారు. మనం దేవునికి వందనాలు చెల్లిస్తూ అంతా బాగుందని ఆలోచిస్తుంటాం. అయితే మన పని దేవుని కృపమీద ఆధారపడిందని జ్ఞాపకం పెట్టుకోవాలి. మనం ఆత్మల్ని రక్షించలేం. మనల్ని రక్షించేది పరిశుద్ధపర్చేది దేవుడు మాత్రమే. అది దేవుని సర్వోన్నత కృపవలన జరిగే కార్యం. యేసు గురించి ప్రకటించడం, యేసును నమ్మినవారిని ఆయనకు విశ్వాసపాత్రులైన శిష్యులుగా తీర్చడం మనం చేయవలసిన పని. దేవుని సేవకులుగా మనం ఇతరుల్ని మన పోలికలోకి మార్చాలి. వారు మన మధ్య క్రీస్తుకు సాక్షులుగా ఉండి దేవుని పొలంలో పనిచేసే పనివారుగా ఉంటారు. దేవుడు తన కృపనుబట్టి మనల్ని తన చిత్తానుసారం మలచుకుంటాడు. కాబట్టి మనం ఇతరుల్ని దేవుని చిత్తానుసారం మలచడం మన బాధ్యత.

"మీ జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది" (కొలొస్స 3:2-3). సేవకునికి దేవునిలో భద్రం చేయబడిన జీవం లేనట్లయితే అతను నిజమైన శిష్యుడు కాలేడు. జీవంలేని సేవకుడు ఇతరులకు ఆదర్శవంతుడుగా ఉండడుగానీ నిరంకుశమైన అధికారిగా మాత్రమే ఉండగలడు. మనలో అనేకులు మనం కోరుకున్నవాటిని ఇతరులపై రుద్దుతూ నిరంకుశంగానే ప్రవర్తిస్తుంటారు. అయితే యేసు మనతో ఎప్పుడూ ఇలా ఉండడు. శిష్యులుగా ఉండడంగురించి యేసు మాట్లాడిన ప్రతి సారీ ఆయన మాటల్లో ఒక విశేషార్థం కనిపిస్తుంది: ఆయన ఎవరినీ వత్తిడి చేయడు. శిష్యులుగా ఉండడం మన ఇచ్ఛకే వదిలివేయబడిన విషయం.

ఏప్రిల్ 25

## ఏ సమయానికైనా సిద్ధంగా ఉండు

"సమయమందును అసమయమందును ప్రయాసపడుము" (2 తిమోతి 4:2)

ఇక్కడ సమయం కాలానికి సంబంధించినది కాదు; మనకు సంబంధించిన విషయం. మనలో కొన్నిసార్లు సిద్ధబాటు విషయంలో సమతూకం ఉండదు; చెప్పిరాని సమయంకొరకు మనలో అనేకులకు సిద్ధబాటు ఉండదు. ఈ వచనంలో "వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము" అని ఉంది. అంటే మనకిష్టం వున్నా లేకపోయినా మనం దేనికైనా సిద్ధంగా ఉండాలని అర్థం. మనం సాధారణంగా మనకిష్టమైతేనే దేన్నైనా చేస్తుంటాం. కొంతమంది అసలేమీ చేయరు కూడా. మనలో చాలామంది ఆధ్యాత్మిక నిరుద్యోగులు కూడా ఉన్నారు. వీరు ఆధ్యాత్మికంగా అశక్తులు. వీరు అలౌకికమైన ప్రేరణ వస్తేనే తమకు తాముగా దేన్నీ చేయరు. దేవునితో మనకు ఉన్న సంబంధం సరైనదనడానికి రుజువు మన పనే, మన సిద్ధబాటే. అలౌకికమైన ప్రేరణ కలిగినా, కలగకపోయినా మనం దేవునికొరకు దేన్నైనా చేయవచ్చు.

విశేషమైన స్వంత అనుభూతిద్వారా ప్రేరణ పొందాలని కోరుకోడం ఒక ఉచ్చులాంటిది. మనలో అనేకులు ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు కూడా. దేవుని ఆత్మ నిన్ను ప్రేరేపించి, నీకు అంతర్దృష్టి నిచ్చినప్పుడు "దేవుడు నాకు ప్రశస్తమైన అనుభవాన్నిచ్చాడు; నేనెప్పుడూ ఇలాగే ఉండాలి" అని నీవు ఆలోచించవచ్చు. లేదు; నీవెప్పుడూ అలాగే ఉండలేవు. దేవుడు నీకు దివ్యప్రేరణ నను[గ్రహించిన సమయాలు నీకు వరంలాంటివే. అయితే నీవు కోరుకున్న ప్రతిసారీ ఇవి లభించవు. "అలాంటి అనుభూతి ఉంటే తప్ప నేను దేవునికొరకు పనిచేయను" అని నీవనుకుంటే దేవునికి నీవు భారం కాగలవు. దేవుడు ప్రతి సమయంలోను నిన్ను ప్రేరేపిస్తే తప్ప ఆయనకొరకు నీవు దేన్నీ చేయలేవు. నీకు లభించిన ప్రశస్తక్షణాల్ని నీవు "దైవం"గా భావిస్తే నీ జీవితంలోంచి నీవు దేవుణ్ణి ప్రక్కనపెట్టేవాడివిగా ఉంటావు. మళ్లీ నీవు దేవునికి విధేయత చూపి నీ "ప్రశస్త సమయాల్ని" ప్రక్కనబెడ్తే తప్ప ఆయనకొరకు నీవు ఏ పనీ చేయలేవు.

ఏప్రిల్ 26

## పై మెట్టు

"నీకు ఒక్కడైయున్న నీ కుమారుని ... తీసికొని .... వెళ్లి .... అక్కడ నేను నీతో చెప్పబోవు పర్వతములలో ఒకదానిమీద దహనబలిగా అతని నర్పించుమని చెప్పెను." (ఆది 22:2)

ఒక వ్యక్తి దేవుని చిత్తాన్నెలా అర్థం చేసుకుంటాడో అతని ప్రవర్తన నిర్ణయిస్తుంది (కీర్తనలు 18:25-26 చూడండి). తాను అమితంగా ప్రేమించిన తన కుమారుణ్ణి దేవుడు అడుగుతున్నాడని అబ్రాహాము అర్థం చేసుకున్నాడు. సాధారణంగా మనుషుల నమ్మకాలు వారి స్వంత ఆలోచనలననుసరించి ఉంటాయి. కొన్ని సందర్భాల్లో వారు దేవుణ్ణి అపార్థం చేసుకొనే ప్రమాదం లేకపోలేదు. దేవుడు అబ్రాహాము ఆలోచనల్ని పరిశోధించాలనుకున్నాడు. అందుకే ఆయన అబ్రాహామును అతని కుమారుణ్ణి తనకు దహనబలిగా అర్పించమని అడిగాడు. దేవుడు తనను ఆజ్ఞాపించిన విషయంలో అబ్రాహాము తన స్వంత ఆలోచనల్ని పరిగణనలోకి తీసుకోలేదు. దేవుని ఆజ్ఞను అబ్రాహాము యథాతథంగా పాటించడంద్వారా దేవుడెటువాడో అబ్రాహాము అర్థం చేసుకున్నాడు. మనం దేవుని ఆజ్ఞలకు విధేయత చూపడంద్వారా దేవునిపట్ల మనకున్న ఆలోచనల్ని సరిదిద్దుకోగలం. ఉదాహరణకు, ఒక స్త్రీ తన కుమారుణ్ణి గాఢంగా ప్రేమిస్తోంది కాబట్టి దేవుడామెకు అతణ్ణి దూరం చేస్తాడని చాలామంది ఆలోచించవచ్చు. ఇది అపవాది సృష్టించిన అబద్ధం; సాతాను ఉద్దేశపూర్వకంగా దేవుని స్వభావంమీద మచ్చవేయడానికి చేసే ప్రయత్నం. మనం దేవుణ్ణి అర్థం చేసుకోడంలో ఉన్నతమైన మెట్లు ఎక్కకుండా సాతాను తన కుయుక్తితో అడ్డుకోగలడు. అయితే మనం యథార్థవర్తనతో దేవుణ్ణి అనుసరించినప్పుడు దేవుడెటువంటివాడో మనకు అర్థమౌతుంది.

దేవునికొరకు అబ్రాహాము దేన్నైనా చేయగలడని అతను దేవునిపట్ల పరిపూర్ణమైన విధేయత చూపగలడని ఈ వృత్తాంతంనుండి మనం తెలుసుకొనే పాఠం. మనం దేవునికి విధేయత చూపినప్పుడు ఆయనకు మనకు మధ్య ఉన్న అడ్డుగోడలన్నీ తొలగిపోతాయి; దేవుడెవరో, ఆయన స్వభావమెటువంటిదో మనకు చాలా స్పష్టంగా గోచరిస్తుంది. అయితే మనం దేవునికి విధేయతచూపడంలో ఆయనపట్ల మనకున్న స్వంత అభిప్రాయాల్ని స్వంత ఆలోచనల్ని విడిచిపెట్టేవారిగా ఉండాలి. నిన్ను పరీక్షించమని దేవుణ్ణి వేడుకోవద్దు. దేవునికొరకు దేన్నైనా చేస్తానని చెప్పకు. "ప్రభువా, నీతో కూడ చెరలోనికిని మరణమునకును వెళ్లుటకు సిద్ధముగా ఉన్నానని ..." (లూకా 22:33) పేతురు చెప్పినట్టుగా చెప్పకు. అబ్రాహాము తన విశ్వాసంగురించి ఎటువంటి ప్రగల్భాలు పలకలేదు. అతను దేవునిపట్ల యథార్థంగా ఉన్నాడు; అతని విశ్వాసం దేవుడు పెట్టిన పరీక్షలో నెగ్గింది.

ఏప్రిల్ 27

## నీకేం కావాలి?

"నీ నిమిత్తము నీవు గొప్పవాటిని వెదకుచున్నావా? వెదకవద్దు ... " (యిర్మీయా 45:5)

నీవొక గొప్ప వ్యక్తిగా ఉండాలని కోరుకోడానికి బదులు నీకొరకు గొప్ప బహుమానాలు కావాలని కోరుకుంటున్నావా? కేవలం దేవునినుండి బహుమానాలు పొందడంకొరకే ఆయన నిన్ను పిలవలేదు; ఆయన నిన్ను తనతో అన్యోన్య సహవాసంలోనికి పిలుస్తున్నాడు. మనం కోరుకొనే బహుమానాలు సందర్భానుసారమైన ఆకస్మికమైన బహుమానాలు మాత్రమే. ఇవి అప్రధానం; వస్తుంటాయి పోతుంటాయి. అయితే దేవుడిచ్చేదేదీ అప్రధానమైనది కాదు. నీవు దేవుణ్ణి కోరుకుంటున్నట్లయితే ఆయనతో అన్యోన్య సహవాసాన్ని కలిగి ఉండడంకంటె సులువైనది మరేదీ ఉండదు.

ఇది కావాలి అది కావాలి అని నీవు దేవుణ్ణి అడుగుతున్నట్లయితే సమర్పణగురించి నీకేమీ తెలియదన్నమాట. నీ స్వంత ఆలోచనల ప్రకారమే నీవు నడుస్తున్నావని అర్థం. బదులుగా నీవు "నేను పరిశుద్ధాత్మ ననుగ్రహించమని దేవుణ్ణి అడిగాను. అయితే నేను కోరుకున్న విశ్రాంతిని సమాధానాన్ని ఆయన నాకివ్వలేదు" అని తిరస్కారంతో మాట్లాడుతున్నావేమో. ఇందుకు దేవునిదగ్గర ఉన్న జవాబు ఒక్కటే. నీవు దేవుణ్ణి వెతకడం లేదు; దేవుణ్ణి కాక మరి వేటినో వెతుకుతున్నావు. "అడుగుడి మీకియ్యబడును ... " (మత్తయి 7:7) అని యేసు సెలవిచ్చాడు. నీవు దేవుణ్ణి అడుగుతూ ఉండు; ఆయనతో నీవు అన్యోన్య సహవాసంలో బలపడుతూ ఉన్నప్పుడు నీవు అడగడం మానివేస్తావు. ఎందుకంటే నీవు "అడుగక మునుపే ... అక్కరగా నున్నవేవో ఆయనకు తెలియునని" (మత్తయి 6:8) నీవు తెలుసుకుంటావు. ఇక నీవెందుకు అడగాలి? అడిగితే ఆయనగురించి ఇంకా లోతుగా తెలుసుకోవాలని మాత్రమే అడుగుతావు.

నీకొరకు గొప్పవాటిని కోరుకుంటున్నావా? "ప్రభువా, నన్ను పరిశుద్ధాత్మతో నింపుము" అని అడిగావా? నీవు పరిశుద్ధాత్మను పొందలేదంటే అందుకు కారణం నిన్ను నీవు ఆయనకు సంపూర్ణంగా అప్పగించుకోకపోవడంగానీ, లేక నీలో ఉన్న తిరస్కారధోరణి గానీ కావచ్చు. నీవు దేవునినుండి కోరుకొనేవాటిని ఎందుకు కోరుకుంటున్నావో గ్రహిస్తున్నావా? నీకు నీ ప్రస్తుత అవసరాలే ముఖ్యం కావచ్చు; అయితే దేవుడు నీ భవిష్యత్తులోకి చూస్తున్నాడు. ఆశీర్వాదాలన్నీ ఇప్పుడే ఇచ్చివేసి నిన్ను సంతోషపెట్టాలని దేవుడు కోరుకోడంలేదేమో! నీవు దినదినం వృద్ధిచెందుతూ పరిపూర్ణతలోకి నడవాలని దేవుడు కోరుకుంటున్నాడు. "మనము ఏకమై యున్నలాగున, వారును ఏకమై యుండవలెనని ..." (యోహాను 17:22). యేసు కోరుకుంటున్నాడని నీవు గ్రహించడమే అన్నిటికన్నా ముఖ్యమైనది, కోరుకోదగినది కూడా.

ఏప్రిల్ 28

## నీకేం లభిస్తాయి

"నీవు వెళ్లు స్థలములన్నిటిలో దోపుడు సొమ్ము దొరికినట్టుగా నీ ప్రాణమును నీకిచ్చు చున్నాను" (యిర్మీయా 45:5)

"నీ ప్రాణమును నీకిచ్చుచున్నాను" - అచంచలమైన భక్తివిశ్వాసాలతో దేవుణ్ణి నమ్మేవారికి ఆయననుండి లభించే అభయమిదే. ఇది వారికి మాత్రమే తెలిసిన రహస్యం. మనిషికి తన ప్రాణంకన్నా గొప్పదేదైనా ఉంటుందా? మనలో చాలామంది గొప్పకొరకు దేవుడు తమకిచ్చిన ఆశీర్వాదాల్ని ఇతరులకు ప్రదర్శిస్తూ ఉంటారు. మనం గొప్పగా చూపించేవాటినన్నిటినీ మనం వదిలివేయాలి. అయితే మనమెప్పటికీ కాపాడుకోవలసినది ఒకటుంది. అది "క్రీస్తుతో కూడ దేవునియందు దాచిపెట్టబడిన జీవము" (కొలొస్స 3:2-3).

జీవితంలో నీవు గొప్పవి అనుకున్నవాటిని విడిచిపెట్టడానికి, దేవునిలో నిలిచి ఉండడానికి సిద్ధంగా ఉన్నావా? నిన్ను నీవు దేవునికి సంపూర్ణంగా సమర్పించుకోడానికి సిద్ధంగా ఉన్నావా? ఇంకా నీవు విడిచిపెట్టవలసినవి నీలో ఇంకేమైనా ఉన్నాయా? నీ స్వంత ఆలోచనల విషయంలో నీ స్వంత ఊహల విషయంలో జాగ్రత్తగా ఉండు. "ఈ విషయంలో నేనేం చేయాలి?" అని నీవు ఆలోచిస్తున్నట్లయితే నీవు దేవుణ్ణి పూర్తిగా నమ్మలేదని, ఆయనకు నిన్ను నీవు పూర్తిగా అప్పగించుకోలేదని అర్థం. నిన్ను నీవు దేవునికి పూర్తిగా సమర్పించు కున్నప్పుడు దేవుడు నీ జీవితంలో ఏం చేస్తాడోనని నీవిక ఆలోచించవు. విడిచిపెట్టడమంటే నిన్ను నీవు ప్రశ్నించుకొనే అలవాటును మానుకోడమే. నిన్ను నీవు దేవునికి అప్పగించుకున్నప్పుడు, వెంటనే ఆయన నీతో "నీ ప్రాణమును నీకిచ్చుచున్నాను" అని చెబ్తాడు. నిన్ను నీవు దేవుని ఆధీనానికి అప్పగించుకున్నప్పుడు ఆయన నీకు ఏ పరిమితుల్లేని సంపూర్ణమైన మరియు అనంతమైన జీవాన్ని నీకు ఇస్తాడు. ఇది నీలో లోపించినట్లయితే కారణం నీలో ఉన్న అవిధేయత గానీ, నీ తిరస్కారంగానీ కావచ్చు.

ఏప్రిల్ 29

## కృపతోకూడిన అనిశ్చితస్థితి

"మనమిక ఏమవుదుమో అది ఇంకను ప్రత్యక్షపరచబడలేదు ... " (1 యోహాను 3:2)

రానున్న రోజుల్లో కచ్చితంగా ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే కుతూహలం మనలో అత్యంత సహజంగా ఉండే గుణం. అనిశ్చితస్థితి మంచిదికాదని మన నమ్మకం. మనం ముందుగా నిర్దేశించుకున్న లక్ష్యాల్ని సాధించాలని మనం ప్రయత్నిస్తుంటాం. అయితే ఆధ్యాత్మిక విషయాల్లో ఇటువంటి నైజం సరైనది కాదేమో! అనిశ్చిత పరిస్థితుల్లో సైతం నిశ్చయత కలిగి ఉండడమే ఆధ్యాత్మికంగా సరైన నైజం. అనిశ్చయధోరణివల్ల మనం ఆధ్యాత్మికంగా లోతుగా వేళ్లూనుకోలేం; "ఇటువంటి పరిస్థితుల్లో నేనుంటే ఎట్లా?" అని మనలో ఉన్న లోకజ్ఞానం మనల్ని హెచ్చరిస్తూ ఉంటుంది. ఊహించని పరిస్థితుల్లోకి, ఇంతకు ముందు అనుభవంకాని పరిస్థితుల్లోకి వెళ్లడాన్ని మనం ఆలోచనల్లో సైతం ఊహించుకోలేం.

అన్నిటినీ నిశ్చయంగా తెలుసుకోడం లోకజ్ఞానానికి మచ్చుతునక. కృపతోకూడిన అనిశ్చయత ఆధ్యాత్మిక జీవితానికి నిదర్శనం. రేపేం జరగబోతోందో తెలియని అనిశ్చయత ఉన్నప్పటికీ దేవుని విషయాల్లో నిశ్చయత మనలో ఉంటుంది. మనల్ని మనం దేవునికి అప్పగించుకొని ఆయన మనకప్పగించిన పనిని చేపట్టినప్పుడు ఆయన మన జీవితాన్ని ఆశ్చర్యకార్యాలతో నింపుతాడు. అప్పుడు మనం కేవలం విశ్వాసులం కాదు. "మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనేగాని ... " (మత్తయి 18:3) అని యేసు చెప్పాడు. దేవుని బిడ్డకు కావలసినది ఆధ్యాత్మిక జీవితం. దేవునిగురించి మనకు అనిశ్చయత లేదు; అయితే దేవుడు మన జీవితంలో ఏం చేయబోతున్నాడనే విషయం మాత్రం మనకు అనిశ్చయతే. మనం కేవలం మన నమ్మకాన్ని మాత్రమే నమ్ముతున్నట్లయితే మనలో స్వనీతి మరియు విమర్శనాదృష్టి అధికమౌతాయి. అప్పుడు మనం మన నమ్మకాలు మాత్రమే సమగ్రమైనవనీ స్థిరమైనవనీ అభిప్రాయపడ్తాం. అయితే మనకు దేవునితో సరైన సంబంధం వున్నప్పుడు మన ఆధ్యాత్మిక జీవితంలో నిరీక్షణకు తావుంటుంది; అనిశ్చయత ఉన్నప్పటికీ అది సంతోషాన్నే ఇస్తుంది. "నాయందును విశ్వాసముంచుడి ..." (యోహాను 14:1) యేసు చెప్పాడు. అంటే అన్ని విషయాల్లో మనం యేసును నమ్మాలని అర్థం. మన జీవితాన్ని యేసు చేతుల్లో పెట్టినప్పుడు అది కృపతోనిండిన జీవితమౌతుంది. కృప ఉన్నచోట అనిశ్చయత ఉన్నా అది మనకు నిశ్చయతే. యేసు నీ జీవితంలోకి ప్రవేశిస్తాడని నమ్ము; ఆయనపట్ల విశ్వాసం కలిగి ఉండు.

ఏప్రిల్ 30

## అప్రయత్నపూర్వకమైన ప్రేమ

"ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును" (1 కొరింథీ 13:4)

ప్రేమ ప్రయత్నపూర్వకంగా పుట్టదు; అది తటాలున పుడ్తుంది. ప్రేమ అసాధారణమైన రీతిలో పెల్లుబుకుతుంది. "నేనిప్పటినుండి ఏ చెడు ఆలోచనల్ని నా మనసులోకి రానివ్వను, యేసు చెప్పినవన్నీ నేను నమ్ముతాను" అని మన మనసుల్ని మన క్రియల్ని ముందుగా సిద్ధంచేసి పెట్టుకోలేం. పౌలు ప్రేమగురించి వర్ణించేటప్పుడు ప్రేమకు పరిమితులున్నాయని ప్రస్తావించలేదు. ఎందుకంటే ఉద్దేశపూర్వకంగా ప్రయత్నపూర్వకంగా పుట్టేది నిజమైన ప్రేమ కాదు. యేసు బోధించిన ప్రేమను మన జీవితాల్లో ఆచరించాలని మనమెంతగా ప్రయత్నించి నప్పటికీ కొన్ని సార్లు అది మనకు సాధ్యం కాకపోవచ్చు. అయితే పరిశుద్ధాత్మ మనతో ఉన్నప్పుడు ఎటువంటి ప్రయత్నంలేకుండానే యేసు బోధించిన ప్రేమ మన జీవితాల్లో వెల్లడవుతుంది. మన జీవితాల్ని మనం పరీక్షించుకున్నప్పుడు మన భావోద్వేగాల్లో అప్రయత్నంగానే ప్రేమ వెల్లడవుతోందన్న సత్యాన్ని గుర్తించి ఆశ్చర్యచకితులమౌతాం. మన జీవితంలో ప్రేమ ఉన్నప్పుడు మాత్రమే మనకు దేవునికి మధ్య అన్యోన్యత ఉందనే విషయాన్ని ఇతరులు తెలుసుకుంటారు.

ప్రేమకు మూలం దేవుడు, మనుషులు కాదు. ప్రేమ దేవుని లక్షణం. మనుషుల్లో ఉన్న దేవుని ప్రేమ స్వాభావికమైనదనీ, అది సహజంగానే పుడుతుందని ఆలోచించడం హాస్యాస్పదంగా ఉంటుంది. "మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవుని ప్రేమ మన హృదయములో కుమ్మరింపబడియున్నది" (రోమా 5:5) కాబట్టి మనలో దేవుని ప్రేమ ఉంది.

మనం దేవుణ్ణి ఎంతగా ప్రేమిస్తున్నామో ఆయనకు తెలియజేయాలని ప్రయత్నించడం అవివేకమే; ఎందుకంటే అది మనమాయణ్ణి నిజంగా ప్రేమించడంలేదని తెలియజేస్తుంది. మనలో అప్రయత్నపూర్వకంగా, అనుద్దేశపూర్వకంగా పుట్టే ప్రేమ మనలో ఆయనపట్ల ఉన్న ప్రేమను చెప్పకనే చెబ్తుంది. మనం చేసే పనులు దేవుని ప్రేమ ఉన్నప్పుడే చేయగలం; మనకు ఆయనపట్ల ప్రేమ ఉందనడానికి ఇదే గుర్తు. దేవుడు మనకనుగ్రహించిన పరిశుద్ధాత్మద్వారా ప్రేమ ధారాళంగా ప్రవహిస్తుంది కాబట్టి దేవుని జీవం మరియు ఆయన ప్రేమ మనలో అప్రయత్నంగానే తొంగిచూస్తుంటాయి.

మే 1

## విశ్వాసం కావాలి, భావోద్వేగం కాదు

"వెలిచూపు వలన కాక విశ్వాసమువలననే నడుచుకొనుచున్నాము" (2 కొరింథీ 5:6)

మనపట్ల దేవుడెటువంటి శ్రద్ధాసక్తులు చూపిస్తున్నాడో మనకు తెలుసు. అయినప్పటికీ దేవుడు మనల్ని తన పనికొరకు ఉపయోగించు కోవాలనుకున్నప్పుడు మనమీద మనమే సానుభూతి చూపించుకుంటూ మన శ్రమలగురించి మన కష్టాలగురించి ఏకరువు పెడుతుంటాం. దేవుడు మనల్ని తన మరుగున ఉండి పని చేయాలని కోరుకుంటున్నాడు గానీ మనం ప్రాచుర్యం పొందాలని కోరుకోడంలేదు. అయితే ఒక విషయం. మనమెవరం ఆధ్యాత్మికంగా మరుగున ఉండడానికి ఇష్టపడం. మనలో కొందరు తమ ప్రాముఖ్యతను ఇతరులు గుర్తించాలని, తమ సలహాలను సంప్రతింపుల్ని ఇతరులు కోరుకోవాలని ఆశపడుతుంటారు. గొప్పతనాన్ని చాటుకొనే సేవకుడు దేవునికి ఉపయోగపడడు. పలుకుబడిని ప్రాచుర్యాన్ని కోరుకొనే సేవకుని స్వభావం దేవుని స్వభావానికి పూర్తిగా విరుద్ధంగా ఉంటుంది. ఆ వ్యక్తిలో ఆధ్యాత్మిక క్రమశిక్షణ ఉండదు. మనం ఈ లోకంలో దేవుని పని జరిగించే సాధారణ మానవులం. మనమేమీ అన్నిటినీ అధిగమించే దేవదూతలం కాదు. ఆర్భాటపు మనస్తత్వాన్ని మనం పరలోకసంబంధమైన శక్తితో మాత్రమే జయించగలం.

మనం అనుభవించిన అద్భుతప్రేరణలకు ప్రాముఖ్యతనిస్తూ వాటిని మాటిమాటికీ జ్ఞాపకం చేసుకోడం దేవుడు మనల్ని కోరుకోడంలేదని సూచిస్తుంది. ఎందుకంటే దేవుడు మనతో మాట్లాడిన అద్భుతక్షణాల్ని మాటి మాటికీ జ్ఞాపకం చేసుకుంటూ దేవుడు మళ్లీ మళ్లీ అలాగే మాట్లాడాలని కోరుకుంటున్నాం. అయితే మనం "విశ్వాసము వలననే" నడవాలని దేవుడు కోరుకుంటున్నాడు. మనలో ఎంతమంది "దేవుడు నాకు కనిపించి, లేదా నాతో మాట్లాడి వెల్లడిచేస్తే తప్ప నేనిది చేయలేను" అని చెబుతున్నారు? దేవుడు ఈ పని చేయడు. మనం ముందుకు వచ్చి పని చేయడానికి ఉద్యమించినప్పుడు "దేవుడు నాతోనే ఉన్నాడు, నేను ఆయణ్ణి గుర్తించలేదు" అని ఆశ్చర్యకరంగా తెలుసుకుంటాం. అద్భుతక్షణాలకొరకు వేచిచూస్తూ సమయాన్ని వ్యయపర్చుకోకు. అవి ఆశ్చర్యఘడియలు. మనం వెలిచూపులో పడకుండా ( ప్రేరణల వెల్లువలో కొట్టుకొనిపోకుండా) స్థిరవిశ్వాసాన్ని కలిగి ఉన్నప్పుడు దేవుడు తప్పకుండా ఆ అద్భుతక్షణాల్ని మన జీవితంలోకి మళ్లీ రప్పిస్తాడు. అయితే మనకు ప్రేరణగా ఉండవలసినవి ఈ అద్భుత క్షణాలు కాదు గానీ మన పని మాత్రమే.

మే 2

## దర్శనంకొరకు వేచిచూడడంలో ఓరిమి చూపించడం

"అది ఆలస్యముగా వచ్చినను దానికొరకు కనిపెట్టుము" (హబక్కూకు 2:3)

సహనం వేరు, ఉదాసీనత వేరు. సహనం ఒక వ్యక్తిలోని స్థితప్రజ్ఞతకు నిదర్శనం. సహనశీలి ఎన్ని అవమానాలైనా తట్టుకొని స్థిరంగా నిలబడతాడు. దేవునినుండి దర్శనం పొందడంలో మనం సహనాన్ని చూపాలి. ఎందుకంటే సహనమే మనకు నిజమైన మరియు యుక్తమైన ప్రేరణ. మోషే సహనానికి కారణం అతనిలోని భక్తిశ్రద్ధలు మరియు కర్తవ్యదీక్ష కాదుగానీ అతనికి దేవునినుండి కలిగిన దర్శనం మాత్రమే కారణం. "విశ్వాసమునుబట్టి అతడు అదృశ్యుడైనవానిని చూచుచున్నట్టు ..." (హెబ్రీ 11:27) అని మోషే గురించి వ్రాయబడింది. దేవునినుండి దర్శనంపొందిన వ్యక్తి కేవలం దేవునికి మాత్రమే అంకితమవుతాడు. ఇక ఏదీ అతణ్ణి కదల్చలేదు; అతని దృష్టిని మరల్చలేదు. దర్శనంవలన మనం స్ఫూర్తి పొందుతాం కాబట్టి ఏదీ దర్శనమో మనం గ్రహించగలం. దర్శనం మరియు దర్శనస్ఫూర్తి దేవునినుండి కలుగుతాయికాబట్టి దర్శనం మన జీవితానికొక విశిష్టతను మరియు జీవశక్తినీ ఇస్తుంది. దర్శనం పలు విధాలుగా ఉంటుంది. దర్శనంలో దేవుడు మనతో అసలు మాట్లాడకపోవచ్చు; అయితే మనకు ఆయన ఆధ్యాత్మిక సహనాన్నివ్వవచ్చు. ఉదాహరణకు, శోధన సమయంలో దేవుడు యేసుకు ఆధ్యాత్మిక సహనాన్నిచ్చాడు. నీ జీవితంలో దేవుడిటువంటి సందర్భాన్ని రప్పించినప్పుడు సహనం వహించు. నీవు దేవునివైపు చూస్తున్నావు కాబట్టి సహించే శక్తిని నీకు దేవుడిస్తాడు.

"అది ఆలస్యముగా వచ్చినను దానికొరకు కనిపెట్టుము" - మన దర్శనం మనం ఊహించినదానికంటె గొప్పది. దర్శనాన్ని మనమెంత అర్థం చేసుకున్నప్పటికీ ఇంకా అర్థం చేసుకోవలసినది మిగిలి ఉంటుంది. మనల్ని మనం ఆధ్యాత్మికంగా సంతృప్తి పర్చుకోలేం కూడా. అందుకే కీర్తనరచయిత "నేనాయనకేమి చెల్లించుదును? రక్షణ పాత్రను చేతపుచ్చుకొని ... ప్రార్థన చేసెదను" (కీర్తన 116:12,13) అని చెబుతున్నాడు. మనం మన అంతరంగంలోకి తొంగిచూచి "ఇప్పుడు నేను తెలుసుకున్నాను. దేవుడు నన్ను పవిత్రపర్చాడు. నేనిప్పుడు సహనం చూపగలను" అని చెప్పాలి. "ఇదివరకే సంపూర్ణసిద్ధి పొందితిననియైనను నేను అనుకొనుటలేదు గాని ... నేను దేని నిమిత్తము క్రీస్తు యేసుచేత పట్టబడితినో దానిని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాను" (ఫిలిప్పీ 3:12) అని పౌలు కూడా చెబుతున్నాడు. కేవలం మనకు తెలిసినది మాత్రమే మనం చేసినట్లయితే అది ఏ మాత్రం ఎన్నదగినది కాదు. అయితే దేవునినుండి కలిగిన దర్శనం మనకు ప్రేరణగా ఉన్నట్లయితే మన అనుభవాలకంటె మిన్నయైనదాన్ని మనం చూడగలం. ఆధ్యాత్మికంగా పట్టుసడలకుండా నిన్ను నీవు జాగ్రత్తగా కాచుకో.



మే 3

## జీవశక్తితో కూడిన  విజ్ఞాపన

“ఆత్మవలన ప్రతి సమయమందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు ...” (ఎఫెసీ 6:18)

ఇతరులకొరకు విజ్ఞాపన చేస్తున్నప్పుడు మనమొకవిషయాన్ని గ్రహించగలం. మనమెవరికొరకు విధేయతతో విజ్ఞాపన చేస్తున్నామో వారు మన విజ్ఞాపనల్నిబట్టి కొంత మూల్యం చెల్లించవలసి ఉంటుంది. ఇది మొదట్లో మన ఊహకందదు. మొదట్లో వారిపట్ల సహృదయంతో సానుభూతితో మనం విజ్ఞాపన చేయడం ప్రారంభిస్తాం. తర్వాత, వారి పట్ల దేవుని ఉద్దేశాలు నెరవేరాలని విజ్ఞాపన చేస్తాం. మన విజ్ఞాపనలకు జవాబుగా దేవుడు వారిని భిన్న మైన పరిస్థితుల్లోకి నడిపిస్తాడు. వారిపట్ల దేవునికున్న ఉద్దేశాల్నిబట్టి కాక మనం కేవలం సానుభూతితో విజ్ఞాపన చేసినట్లయితే మనకు దేవునికి మధ్య ఉండవలసిన సంబంధం బలహీనమవుతుంది. మనం దేవుని ఉద్దేశాల్నిబట్టి కాక మన సానుభూతినిబట్టి విజ్ఞాపన చేసినట్లయితే అది దేవుణ్ణి ధిక్కరించినట్లే.

దేవుని ఉద్దేశాలగురించి పరిపూర్ణమైన మరియు సమగ్రమైన నిశ్చయత ఉన్నప్పుడే మనం చేసే విజ్ఞాపనలో జీవం మరియు శక్తి ఉంటాయి. మనలో ఉన్న పక్షపాత ధోరణులు మరియు మనం చూపించే సానుభూతి విజ్ఞాపనకు అవసరమైన సంపూర్ణ నిశ్చయతకు హాని కలిగిస్తాయి. విజ్ఞాపనకు అత్యంత్య ప్రధానమైనది దేవునితో ఏకీభావం కలిగి ఉండడం. మనమితరులపట్ల చూపే సానుభూతి కొన్నిసార్లు మనం వారికొరకు విజ్ఞాపన చేయకుండా అడ్డుపడుతుంది. మనం సానుభూతితో “ఇలా జరగడం బాగుండదు” అని మనం ఆలోచిస్తాం. వాస్తవానికి మన తత్క్షణమే దేవునితో ఏకీభావాన్ని పోగొట్టుకున్నామన్నమాట!

జీవశక్తితో నిండిన విజ్ఞాపన గనక నీవు చేస్తున్నట్లయితే నీకొరకు నీవు విజ్ఞాపన చేసే సమయంగానీ ఆసక్తిగానీ నీకు ఉండవు. నీమీద నీవు సానుభూతి చూపించుకోవద్దు. నీ గురించి నీవు ఆలోచించకుండా ఉండడానికి నీకెటువంటి సంఘర్షణ యెదురుకాదు. ఎందుకంటే నీ మనస్సంతా, నీ హృదయమంతా ఇతరులపట్ల దేవునికున్న తలంపులమీద ఆయన ఉద్దేశాలమీద నిమగ్న మై ఉంటుంది. దేవుడే వారి అవసరతల్ని మనం దృష్టించేలాగా చేస్తాడు. మనం వారికొరకు విజ్ఞాపన చేస్తున్నాం కాబట్టి వారిలో ఉన్న లోపాల్ని తప్పుబట్టే పని ఉండదు.

మే 4

## ప్రత్యామ్నాయంగా నిలిచే విజ్ఞాపన

"ఆయన రక్తమువలన పరిశుద్ధస్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుకను" (హెబ్రీ 10:19-20)

విజ్ఞాపనగురించి తెలుసుకో. విజ్ఞాపన అంటే ఇతరులపట్ల నీ స్వంత సానుభూతిని ఆలోచనల్ని దేవుని సన్నిధిలో వివరించి మనం అడిగినవాటినన్నిటినీ చేయమని ఆయణ్ణి వత్తిడిచేయడం కాదు. మనం పొందవలసిన శిక్షను యేసు భరించి ప్రత్యామ్నాయంగా నిలిచినందువలననే మనమిప్పుడు దేవుణ్ణి సమీపించగలుగుతున్నాం. యేసు ప్రత్యామ్నాయంగా నిలబడిన విధానాన్నే ఇతరులకొరకు విజ్ఞాపన చేసే విషయంలో మనం మాదిరిగా తీసుకోవాలి. మనకిప్పుడు "ఆయన రక్తమువలన పరిశుద్ధ స్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది".

ఆధ్యాత్మిక విషయాలపట్ల మొండితనాన్ని ప్రదర్శించడం విజ్ఞాపనకు పెద్ద ఆటంకంగా నిలుస్తుంది. ఎందుకంటే మన స్వవిషయాలపట్ల మరియు ఇతరులపట్ల సానుభూతి చూపి ఆ యా క్రియలకు పశ్చాత్తాపం అక్కర్లేదని తలంచడం ఆధ్యాత్మిక విషయాల్లో మొండితనం చూపించడం క్రిందికే వస్తుంది. ప్రతి మనిషిలో ఏదో ఒక మంచితనం లేదా ఏదో ఒక సుగుణం ఉంటుందనే ఆలోచన క్రీస్తు సిలువ ద్వారా కలిగిన ప్రాయశ్చిత్తాన్ని దూరం చేసుకుంటోంది. ఈ ఆలోచనవలన కలిగే మందకొడితనం మరియు అనాసక్తత మనం ఇతరులకొరకు విజ్ఞాపన చేయకుండా అడ్డుపడుతుంది. మనం విజ్ఞాపనకు దూరమైనప్పుడు ఇతరులపట్ల దేవునికున్న శ్రద్ధాసక్తులను ఆయన కృపను అర్థం చేసుకోలేం కాబట్టి దేవునితో ఏకీభావాన్ని కోల్పోతాం. దేవుని ఉద్దేశాలతో ఏకీభావం లేకుండా మనం విజ్ఞాపన చేసినప్పుడు అది దేవుని కోరుకొనే విజ్ఞాపనగా ఉండదు గానీ మనల్ని మనం హెచ్చించుకున్నట్టుగా ఉంటుంది. సిలువలో క్రీస్తు చేసిన ప్రాయశ్చిత్తాన్ని మనం గుర్తించినప్పుడు మన స్వభావంలోను మరియు మన అభిరుచుల్లోను సమూలమైన మార్పు చోటుచేసుకుంటుంది. ప్రత్యామ్నాయంగా నిలిచే విజ్ఞాపన అంటే ఇతరులపట్ల మనం చూపించే సానుభూతి స్థానంలో వారిపట్ల దేవునికున్న శ్రద్ధాసక్తుల్ని ప్రత్నామ్నాయపర్చడమని అర్థం.

నేను మొండిగా ఉన్నానా? లేక, ప్రత్యామ్నాయంగా ఉన్నానా? నేను దేవునితో అన్యోన్యతను పోగొట్టుకున్నానా? లేక, ఆయనతో సంపూర్ణమైన అన్యోన్యత కలిగి ఉన్నానా? నేను నా ఇష్టానుసారంగా ప్రవర్తించాలనుకుంటున్నానా? లేక, దేవునితో ఏకీభావం కలిగి ఉండాలనుకుంటున్నానా?

మే 5

## తీర్పు, మరియు దేవుని ప్రేమ

"తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది" (1 పేతురు 4:17)

రక్షణ దేవుని మహోన్నత ఉద్దేశమని, అది మానవుని తలంపుల్లోది కాదని క్రైస్తవ సేవకుడు ఎన్నటికీ మర్చిపోకూడదు. కాబట్టి రక్షణ లోతుల్ని తెలుసుకోడం మనకు అందని విషయం. రక్షణ దేవుని మహోన్నతమైన ఉద్దేశం కాబట్టి మనం ప్రత్యక్ష జ్ఞానంతో దీన్ని ఆసాంతం తరచి తెలుసుకోలేం. మనం రక్షణ పొందామనే నమ్మకం మనకొక ప్రవేశ మార్గం వంటిది. ఇది మన అంతఃకరణంలో చైతన్యం కలిగిస్తుంది. తద్వారా మన జీవితంలో ఏ మార్పు జరిగిందో మనం గ్రహించగలం. నీ అనుభవంగురించి ఇతరులకు బోధించకు; నీ అనుభవం వెనుక ఉన్న దేవుని మహోన్నత ఉద్దేశంగురించి బోధించు. మనం బోధించేటప్పుడు ఒక విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మనుషులు నరకంనుండి ఎలా రక్షించబడాలో బోధించడంతోబాటు, వాళ్లెలా పవిత్రమైన నైతిక జీవనాన్ని గడపాలో కూడా బోధిస్తున్నాం. దేవుడు మానవాళికి అనుగ్రహించిన శుభవార్తను మనం ప్రకటిస్తున్నాం.

యేసు క్రీస్తు బోధల్లో తీర్పుగురించి పలు చోట్ల కనిపిస్తుంది. ఇది మనపట్ల దేవునికున్న ప్రేమను వ్యక్తపరుస్తుంది. దేవునిదగ్గరకు రావడానికి ఇష్టపడనివారిపట్ల నీవు సానుభూతి చూపక్కర్లేదు. ఎందుకంటే ఇందుకు కారణం వాళ్లేగాని దేవుడు కాదు. వాళ్లు దేవుని దగ్గరకు రాకపోడానికి గల కారణాల్ని మనం వెతకనక్కర్లేదు. దేవుని ఆత్మ వాళ్ల హృదయాల్ని తీర్పుగురించి ఒప్పించేలాగా దేవుని సత్యంగురించి బోధించు. దేవుని సత్యంగురించి మనం బోధించినప్పుడు దేవుని ఆత్మ ప్రతి మనిషిని దేవునిదగ్గరకు నడిపిస్తాడు. మన బోధ నిజమైన బోధ అని చెప్పడానికి మనకిదే నిదర్శనం.

మనం చేయవలసిన పనిని యేసు మనకప్పగించినప్పుడు ఆయన మనల్ని అందుకు సంసిద్ధుల్ని చేస్తాడు. ఇది సత్యం. మన అసమర్థతను మనం అడ్డుగా చేసుకుంటున్నట్లయితే, లేక విధేయత చూపడానికి సాకులు చెబుతున్నట్లయితే మనం దేవునితో ఏం చెబుతున్నామో తెలుసా? ఆయనకు మనగురించి తెలియదని చెబుతున్నట్టు కనిపిస్తోంది గదా? దేవుని శక్తిచేత మన స్వంత ఆలోచనల్ని మన స్వశక్తిని మనం అంతమొందించాలి. మనలోని బలహీనతలేవో మనం గుర్తించి దేవునిమీద మనం సంపూర్ణంగా ఆధారపడినప్పుడు దేవుడు తన ఆత్మద్వారా మనకు అపూర్వమైన శక్తినిస్తాడు.

మే 6

## విడుదల మరియు యేసు బోధించిన నిర్దిష్ట ప్రమాణాలు

“ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసి యున్నాడు” (గలతీ 5:1)

దేవుని ఆత్మానుసారుడైన వ్యక్తి “దీన్ని నమ్ము” లేక “దాన్ని నమ్ము” అనే మాటలు చెప్పడు. యేసు మనకు బోధించిన నిర్దిష్టమైన ప్రమాణాల ప్రకారం నీ జీవితాన్ని మలచుకోవాలని మాత్రమే ఆత్మానుసారుడైన వ్యక్తి మనకు బోధిస్తాడు. బైబిల్లో మనకు వెల్లడైన దేవుణ్ణి మనం నమ్మాలని యేసు మనతో చెబుతున్నాడు (యోహాను 5:39,40 వచనాలు చూడండి). స్వాతంత్ర్యమంటే ఏమిటో ఇతరులు గ్రహించి వాళ్లు దాన్ని పొందేలాగా చెప్పడానికే దేవుడు మనల్ని పిలిచాడు; కేవలం వాళ్లు స్వాతంత్ర్యంగురించి ఆలోచించడానికి అభిప్రాయాలేర్పరుచుకోడానికి కాదు. క్రీస్తు అనుగ్రహించిన స్వాతంత్ర్యం మనలో ఉన్నట్లయితే, మనం ఇతరుల్ని కూడా ఆ స్వాతంత్ర్యంలోకి నడిపించగలుగుతాం. మనం యేసు క్రీస్తు అధికారానికి, ఆయన ఆధిపత్యానికి లోబడినప్పుడు మాత్రమే ఈ స్వాతంత్ర్యం మనదవుతుంది.

నీ జీవితం యేసు బోధల ప్రకారం ఉందో లేదో ఎల్లప్పుడూ పరీక్షించుకో. ఆయన కాడి క్రిందికి వచ్చి ఆయనకు లోబడు. నీ జీవితాన్ని ఆయన ఆధిపత్యానికి అప్పగించు. ఆయనకు మాత్రమే లోబడు. యేసు క్రీస్తుకు చెందని కాడిని ఇతరులమీద మోపకు. అందరూ మనం ఆలోచించినట్టే ఆలోచించాలని యెదురుచూడడం సరైనది కాదు. మన ఆలోచనలు ఇలా వుంటే మనల్ని సరిదిద్దడానికి దేవునికి చాలా కాలం పడుతుంది. పైగా ఇలా ఆలోచించడం దేవుని అభిమతం కాదు కూడా. నిజమైన విడుదల ఒక్కటే. అది యేసు క్రీస్తులో లభించే విడుదల మాత్రమే; సరైనది మరియు ఒప్పైనది మాత్రమే చేయడానికి మనల్ని సరైన దిశలో నడిపించే స్వేచ్ఛ అది.

ఇతరుల్ని చూచి సహనం కోల్పోవద్దు. దేవుడు నీపట్ల ఎంత సహనం చూపించాడో, ఎంత దయ చూపించాడో జ్ఞాపకం చేసుకో. దేవుని సత్యాన్ని హేళన చేయకు. దేవుని సత్యం తన పని తాను చేసుకుపోతుంది. నీవు చేయవలసిన నీవు చేయాలి. “సమస్త జనులను శిష్యులనుగా చేయుడి” (మత్తయి 28:19) అని యేసు చెప్పాడు. యేసు చెప్పిన ప్రకారంగా చేయి; అంతేగానీ మనుషుల్ని నీ స్వంత సిద్ధాంతాలవైపు, నీ స్వంత ఆలోచనలవైపు మళ్లించకు.

మే 7

## నిత్యత్వానికి పునాది

"మీలో ఎవడైనను ఒక గోపురము కట్టింపగోరినయెడల దానిని కొనసాగించుటకు కావలసినది తన యొద్ద ఉన్నదో లేదో అని కూర్చుండి తగులుబడి మొదట లెక్క చూచుకొనడా .... " (లూకా 14:28)

యేసు ప్రభువు ఈ వచనంలో మనం లెక్కచూడవలసిన మూల్యంగురించి మాట్లాడడంలేదుగానీ ఆయన చెల్లించిన మూల్యంగురించి మాట్లాడుతున్నాడు. ఆ మూల్యం ఆయన నజరేతులో గడిపిన ముప్పయి సంవత్సరాలు, తర్వాత మూడు సంవత్సరాల పరిచర్య ఆయన పొందిన అవమానాలు హేళనలు నిందలు గెత్సేమనే వనంలో ఆయన అనుభవించిన తీవ్రమైన వేదన సిలువ శ్రమ - ఇవన్నీ ఆయన చెల్లించిన మూల్యమే; ఇదే మన నిత్యత్వానికి ఆయన చెల్లించిన మూల్యం. ఎవరూ చేయలేని పనిని, ఎవరూ చెల్లించలేని మూల్యాన్ని ఆయన మనకొరకు చెల్లించాడు. ఎవరూ ఆయణ్ణి చూచి "ఈ మనుష్యుడు కట్ట మొదలుపెట్టెను గాని కొనసాగింపలేక పోయెనని ... " (14:30) అపహాస్యం చేయలేరు.

26,27 మరియు 33 వచనాల్లో మన ప్రభువు శిష్యత్వపు షరతుల్ని వివరించాడు. "ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" (14:25-26). యేసు షరతులు భిన్నమైనవి; కచ్చితమైనవి. అవి పట్టుసడలవు. భూమ్మీద ఉన్న ఏ సంబంధమూ క్రీస్తుతో మనకు ఉండవలసిన సంబంధంకంటె గొప్పది కాదు. అందుకే మన స్వంతవారిని ప్రేమించే ప్రేమకంటే ఎంతో ఉన్నతమైన ప్రేమతో యేసును గాఢంగా ప్రేమించాలి. ఆయణ్ణి గాఢంగా ప్రేమించేవారినే ఆయన తన పనిలో వాడుకుంటాడు.

మనం చేసే ప్రతి పనినీ దేవుడు పరీక్షిస్తాడు. దేవుడు మనల్ని అగ్నితో శుద్ధిచేసి పరిశోధించినప్పుడు మన పునాది యేసు మీద ఉండాలి (1 కొరింథీ 3:10-15). మనం దేవునికొరకు పనిచేస్తున్నాం అని చెప్పుకుంటున్నాంగానీ ఆ పని మనది కాదు; దేవునిదే. దేవుని పనిని కొనసాగించే మహా నిర్మాణకుడు యేసే. పనీ, పని నమూనాలు, పని ప్రణాళికలు అన్నీ యేసువే. మనమెక్కడ ఎలా పనిచేయాలో నిర్ణయించే అధికారం యేసుదే. మనకు ఏ హక్కూ లేదు!



మే 8

## ఓర్పు వహించడానికి అవసరమైన విశ్వాసం

“నీవు ఓర్పు విషయమైన వాక్యమును గైకొంటివి గనుక ... నేనును నిన్ను కాపాడెదను.” (ప్రకటన 3:10)

ఓర్పు వహించడమంటే కేవలం ఏదో ఒక కష్టాన్ని సహించడం మాత్రమే కాదు; ఓర్పు అంటే చిట్టచివరవరకు గట్టిగా పట్టుకొని ఉండడంకంటే ఎక్కువే. విలుకాని చేతిలో ఉన్న విల్లులాగా బాణాల్లాగా పరిశుద్ధుని జీవితం దేవుని చేతుల్లో ఉంది. దేవుడు దేన్ని దృష్టిస్తున్నాడో పరిశుద్ధుని దృష్టికి అందదు. అయితే మన ప్రభువు మనల్ని చిట్టచివరివరకు నడిపిస్తూనే ఉంటాడు. మనమే మధ్య మధ్యలో సహనం కోల్పోయి “నేనిక నడవలేను” అని చెబుతుంటాం. అయినా దేవుడు మనం తన ఉద్దేశాల్ని దృష్టించేవరకు మనల్ని నడిపించి, మన ద్వారా తన ఉద్దేశాల్ని నెరవేర్చుకుంటాడు. నిన్ను నీవు దేవుని చేతులకు అప్పగించుకో. నీ జీవితంలో నీవు ఓర్పు వహించవలసినవి ఏవైనా ఉన్నాయా? నీ విశ్వాసంలో ఓర్పు వహించి యేసు క్రీస్తుతో అన్యోన్య సహవాసం కలిగి ఉండు. “ఆయన నన్ను చంపినను, నేను ఆయనకొరకు కనిపెట్టుచున్నాను” (యోబు 13:15) అని యోబు చెప్పినట్టు నీవు చెప్పగలవా?

విశ్వాసమంటే అదేదో అశక్తతతోకూడిన దయనీయమైన భావోద్వేగం కాదు. దేవుడు పవిత్ర ప్రేమామయుడనే వాస్తవంమీద నిలిచిన దృఢమైన స్థిరమైన మరియు ధైర్యంతోకూడిన నమ్మకం. దేవుడు ప్రస్తుతం నీకు అగోచరుడిగా ఉన్నప్పటికీ ఆయన కార్యాలు నీకు అస్పష్టంగా ఉన్నప్పటికీ ఆయనెవరో నీకు తెలుసు. దేవుడు పవిత్ర ప్రేమామయుడనే శాశ్వత సత్యంమీద నీవు దృఢంగా నిలిచి ఉండలేనప్పుడు నీవు అశాంతికి లోనై ఆపదల్లో పడతావు. నీ జీవితంలో అత్యంత ఉన్నతమైనది నీ విశ్వాసమే. దేవునిమీద పరిపూర్ణమైన నమ్మకంతో నిన్ను నీవు ఉపేక్షించుకొని ఆయనకు నిన్ను అప్పగించుకో.

దేవుడు మనల్ని రక్షించడానికి యేసు క్రీస్తుద్వారా తనను తాను ఉపేక్షించుకున్నాడు. ఇప్పుడు మనంకూడా మనల్ని మనం ఉపేక్షించుకొని తనకొరకు నిలబడాలని దేవుడు కోరుకుంటున్నాడు. మనలో ఇంకా విశ్వాసం కార్యరూపం దాల్చని రంగాలు చాలా ఉన్నాయి. మనలో ఇంకా దేవుని వాక్యంచేత తాకబడని ప్రదేశాలు చాలా ఉన్నాయి. యేసు క్రీస్తు జీవితంలో అటువంటివేమీ లేవు; మన జీవితంలో కూడా ఉండడానికి వీల్లేదు. “అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము” (యోహాను 17:3) అని యేసు ప్రార్థించాడు. ఈ సత్యాన్ని మనం గ్రహించినట్లయితే మన జీవితం సుందరంగా మారుతుంది. మనం ఏ స్థితిలో ఉన్నప్పటికీ అద్భుతాల్ని చూడగలిగిన అపూర్వక్షణాలు మన స్వంతమవుతాయి. దేవుడు మనల్ని ఉన్నతమైన మెట్టును ఎక్కించడానికే మనల్ని సరిదిద్ది క్రమశిక్షణలో పెడ్తున్నాడు.



మే 9

## మన ఊహకందనిదాన్ని చేరుకోడం

"దేవోక్తి లేనియెడల జనులు కట్టులేక తిరుగుదురు" (సామెతలు 29:18)

సిద్ధాంతాన్ని గట్టిగా పట్టుకొని ఉండడానికి, దర్శనం కలిగి ఉండడానికి మధ్య చాలా వ్యత్యాసం వుంది. సిద్ధాంతం నైతిక ప్రేరణలోంచి పుట్టదు. అయితే దర్శనానికి ప్రేరణ నీతి. ఆదర్శాలే ధ్యేయంగా సిద్ధాంత భావజాలంలో మునిగితేలే వ్యక్తులు ఏ పనీ చేయలేరు. దేవునిగురించి, ఆయన గుణగణాలగురించి స్వంత అభిప్రాయాలేర్పరుచుకున్న వ్యక్తి వాటిని తన వైఫల్యాన్ని సమర్థించుకోడానికి ఉపయోగించుకుంటాడు. యోనా ఇదే చేశాడు. యోనా తన అవిధేయతను సమర్థించుకోడానికి దేవుణ్ణి తప్పుబట్టాడు "నీవు కటాక్షమును జాలియును బహు శాంతమును అత్యంత కృపయుగల దేవుడవై యుండి, పశ్చాత్తాపపడి కీడుచేయక మానుదునని నేను తెలిసికొని" (యోనా 4:2) ఉన్నావని యోనా తన నిర్లక్ష్యాన్ని సమర్థించుకున్నాడు. నీకు కూడా దేవునిగురించి, ఆయన గుణగణాలగురించి తెలిసి ఉండవచ్చు; అయితే నీవు చేయవలసిన పనిని నిర్లక్ష్యం చేయడానికి అవే కారణం కావచ్చు. అయితే దర్శనం వున్నచోట యథార్థత మరియు అంకితభావం వుంటాయి. ఎందుకంటే దర్శనం నైతికవర్తనను ప్రోత్సహిస్తుంది.

మన స్వంత ఆదర్శవాదం మనల్ని నాశనానికి నడిపిస్తుంది. నీకు దర్శనం వుందా, లేక నీవు సిద్ధాంతాల్లో మునిగి ఉన్నావా అని నిన్ను నీవు పరీక్షించుకో.

ఓహో! మనిషి తనకందనిదాన్ని అందుకుంటే ఎంత మేలు!
పరలోకమంటే అదే కదా!

"దేవోక్తి లేనియెడల జనులు కట్టులేక తిరుగుదురు". మనం దేవునికి దూరంగా జరిగినప్పుడు మన జీవితం భగ్నమౌతుంది. ఏది తప్పో మనకు తెలిసినా మనం తప్పుచేయకుండా మనల్ని ఆపి ఉంచే హద్దుల్ని అతిక్రమిస్తాం. మనం ప్రార్థించడం మానివేస్తాం; జీవితంలోని చిన్న విషయాల్లో సైతం దేవుని దర్శనాన్ని చూడలేని స్థితిలో ఉంటాం. దర్శనానికి దూరమైన మనం మన స్వంత ఆలోచనలప్రకారం అభిప్రాయాల ప్రకారం నడిచేవారిగా ఉంటాం. మన జీవితంలో దేవుని ప్రమేయం లేకుండా మనం కష్టపడుతున్నాం మన భోజనం మనం తింటున్నాం అని ఆలోచిస్తే మనం తిరోగమనంలో ఉన్నామని దర్శనానికి దూరమయ్యామని అర్థం. నేడు మన వైఖరి దేవుని దర్శనంలోంచి పుట్టినదేనా? మన జీవితంలో ఇంతకు ముందు లేనట్టుగా దేవుడు గొప్ప కార్యాలు చేయాలని కోరుకుంటున్నామా? మన ఆధ్యాత్మిక దృక్పథంలో నవ్యత మరియు జీవశక్తి ఉన్నాయా?

మే 10

## ప్రయత్నం ప్రారంభించు

“మీ విశ్వాసమునందు సద్గుణమును .... అమర్చుకొనుడి” (2 పేతురు 1:5-7)

“అమర్చుకొనుడి” అంటే మనం చేయవలసినదేదో ఇంకా ఏదో ఉందన్నమాట! మనమొక విషయాన్ని మర్చిపోతున్నాం. దేవుడు చేయగలిగిన పనిని మనం చేయలేం, మనం చేయగలిగిన పనిని దేవుడు చేయడు. మన రక్షణను మనం సంపాదించుకోలేం, మనల్ని మనం పరిశుద్ధపర్చుకోలేం. ఈ పని చేసేది దేవుడు మాత్రమే. మనం కలిగి ఇంకా ఏదో ఉండవలసిన సద్గుణాలను మనమే అలవర్చుకోవాలి; దేవుడు వాటిని మనకివ్వడు. మన ప్రవర్తన ఇలా ఉండాలి అలా ఉండాలి అని మనల్ని దేవుడు వత్తిడిచేయడు. అయితే మనం చేయవలసిన పని ఒకటుంది: “మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి” (ఫిలిప్పీ 2:12). అంటే దేవుడు మనలో చేసిన కార్యాన్ని మనం కొనసాగించాలని అర్థం. “అమర్చుకొనుడి” అంటే మనం ప్రయత్నపూర్వకంగా మరియు ఉద్దేశపూర్వకంగా మనలో సద్గుణాల్ని పెంపొందించుకోవాలని అర్థం. మొదట్లో ఇది కష్టంగానే ఉంటుంది. అయితే మనం ప్రయత్నం ప్రారంభించాలి. మనం నడవవలసిన మార్గమేదో మన అంతరాత్మకు తెలుసు కాబట్టి మనం అంతరాత్మ ప్రబోధాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

మనం నడవవలసిన మార్గం మనకు బాగా తెలిసినప్పటికీ దాన్ని తెలియజేయమని అడగడం మనకు అలవాటుగా మారింది. సందేహాలు మాను, ప్రయత్నం ప్రారంభించు, మొదటి మెట్టు ఎక్కు. దేవుడు నీతో మాట్లాడినప్పుడు ఆయన నిన్ను చేయమన్న పనిని విశ్వాసంతో వెంటనే ప్రారంభించు. నీ మొదటి ఆలోచనల్ని, మొదటి నిర్ణయాల్ని ఎప్పటికీ మార్చుకోకు. దేవుడు నీకొక పని నప్పగించినప్పుడు నీవు సందేహించి జంకినట్లయితే ఆయనపట్ల నిర్లక్ష్యం చూపుతున్నావని అర్థం. నీకు జీవాధారమైన కృపను నీవు తిరస్కరిస్తున్నావని అర్థం. మనఃపూర్వకంగా నీ ప్రయత్నం ప్రారంభించు, దృఢమైన నిర్ణయం తీసుకో. ఎట్టిపరిస్థితుల్లోని వెనుకకు చూడవద్దు. ఒక రకంగా చెప్పాలంటే, వెనుకకు చూడడం అసాధ్యం అని నీవు నిర్ణయించుకోవాలి. “ఈ ఉత్తరం వ్రాశాక పని ప్రారంభిస్తాను” లేదా “ఈ అప్పు తీర్చిన తర్వాత పని ప్రారంభిస్తాను” అని నీ పని వాయిదా వేయకు. నీ పని తత్క్షణమే ప్రారంభించు; తిరుగులేని నిర్ణయం తీసుకో.

ప్రతి విషయంలోను దేవుని మాటల్ని జాగ్రత్తగా వినడం నేర్చుకో. ఆయన ఏం చెబుతున్నాడో తెలుసుకోడానికి, ఆచరణలో పెట్టడానికి ఉద్యమించు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు సహజంగానే మనం దేవునివైపు చూస్తాం. అలా చూడడం మన సహజగుణమని మనకు తెలుసు. మనమెక్కడ ఉన్నామో అక్కడనుంచే మనం దేవునివైపు చూడాలి.

మే 11

## ఒకరి నొకరు ప్రేమించండి

“సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి” (2 పేతురు 2:7)

మనలో అనేకులు ప్రేమను నిర్వచించలేరు. మనం ప్రేమగురించి మాట్లాడతాం గానీ అదేమిటో నిర్దిష్టంగా చెప్పలేం. ఒక వ్యక్తి తనకంటె ఎదుటివ్యక్తిని అన్ని విషయాల్లో మిన్నగా భావించడమే ప్రేమ అని చెప్పవచ్చు. వాస్తవానికి యేసు కూడా ఇదే కోరుకున్నాడు. మనం యేసును అందరికంటె మిన్నగా భావించాలి (లూకా 14:26 చూడండి). ప్రేమ మానవలక్షణం కాదు; ప్రేమ దేవుని లక్షణం. “మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవుని ప్రేమ మన హృదయములో కుమ్మరింపబడియున్నది” (రోమా 5:5). ఈ ప్రేమ మనలో ఉన్నట్లయితే మనం అన్ని విషయాల్లో ప్రథమ స్థానాన్ని యేసుకే ఇస్తాం. మనలో ఉన్న ఈ ప్రేమ కార్యసాధకం కావాలంటే మనం పేతురు వ్రాసిన రెండవ పత్రిక మొదటి అధ్యాయంలో ఉన్న క్రైస్తవ సుగుణాల్ని అలవర్చుకోవాలి.

దేవుడు నాలోంచి చిత్తరాహిత్యాన్ని అహంభావాన్ని శూన్యతను తొలగించినప్పుడు దేవుడు నన్ను ప్రేమిస్తున్నాడని పరిశుద్ధాత్మద్వారా గ్రహించగలను. దేవుడు నాలో ఉన్న యోగ్యతల్ని చూచి నన్ను ప్రేమించడంలేదు గానీ, ప్రేమించడం ఆయన నైజం కాబట్టి ఆయన నన్ను ప్రేమిస్తున్నాడు. ఇప్పుడు నేను అదే ప్రేమను ఇతరులకు చూపించాలని దేవుడు కోరుకుంటున్నాడు. “నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీరొకని నొకడు ప్రేమించవలెననుటయే దేవుని ఆజ్ఞ” (యోహాను 15:12). దేవుడు మనకిష్టంలేనివారిని, మనల్ని ప్రేమించనివారిని మన యెదుటకు తీసుకవస్తాడు. వారిని మనం ప్రేమించ గలిగినప్పుడు మనలో దేవుని ప్రేమ ఉందని అర్థం. క్రైస్తవ సుగుణమైన ఈ ప్రేమను మనం అలవర్చుకోవాలని పేతురు వ్రాస్తున్నాడు. మనం బలవంతంగా ఇతరుల్ని ప్రేమించడానికి ప్రయత్నించి ఉండవచ్చుగానీ బలవంతపు ప్రేమ విసుగుకు నైరాశ్యానికి దారి తీస్తుంది.

“ప్రభువు ... యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక ... మీయెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు” (2 పేతురు 3:9). నా అంతరంగాన్ని నేను పరీక్షించుకొని దేవుడు నన్నెంతగా ప్రేమించాడో నా పట్ల ఎంత దీర్ఘశాంతాన్ని ఎంత దయను చూపించాడో జ్ఞాపకం చేసుకోవాలి. దేవుడు అనంతమైన మరియు అపరిమితమైన ప్రేమతో నన్ను ప్రేమించాడని నేను తెలుసుకున్నప్పుడు నాకొక బాధ్యత ఉన్నట్టు కూడా తెలుసుకుంటాను. నేను కూడా అదే ప్రేమతో ఇతరుల్ని ప్రేమించాలి. నాకిష్టంలేని వ్యక్తిని ప్రేమించడం ఆ వ్యక్తితో కలిసి ఉండడం నాకు కష్టంగానే ఉంటుంది. అయితే అప్రియమైన నన్ను దేవుడు ప్రేమించాడనే సత్యం నేనితరుల్ని ప్రేమించేలా చేస్తుంది. నేను దేవుని బిడ్డను! నేను దేవునిలో నిలిచి ఉన్నాను! నాకొరకు తన జీవితాన్నర్పించిన యేసులాగా ఉండడానికి నేను సిద్ధంగా ఉన్నానా? ఇది నేను నా అంతరంగాన్ని అడగవలసిన ప్రశ్న! నేను కోరుకుంటేతప్ప, నేను అలవర్చుకుంటే తప్ప మానవసహజమైన ప్రేమగానీ దేవలక్షణమైన ప్రేమగానీ నాలో పెంపొందలేవు. ప్రేమ అప్రయత్నపూర్వకంగా ఉండాలి; అప్రయత్నపూర్వకమైన ప్రేమ నాలో ఎప్పుడూ ఉండేలా దాన్ని నేను అలవర్చుకోవాలి.

మే 12

## ఏ అలవాట్లూ లేని అలవాటును కలిగి ఉండడం

“ఇవి మీకు విస్తరించినయెడల అవి ... మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును” (2 పేతురు 1:8)

మనం దేన్నైనా అలవాటుగా చేసుకున్న ప్రారంభదశలో మనకు దానిగురించి బాగా తెలిసే ఉంటుంది. సద్గుణాలు మరియు దైవభక్తి కలిగి ఉండడమంటే ఏమిటో మనకు తెలుసు. అయితే మనం ఆధ్యాత్మికంగా వృద్ధిచెందే పరిణామంలో మనం ఈ అవగాహన దశను వెంటనే దాటడం జరుగుతుంది. మనమిక్కడే ఆగిపోయినట్లయితే మనలో ఆధ్యాత్మికంగా గర్వం చోటుచేసుకుంటుంది. అయితే మనం చేయవలసిన యుక్తమైన పని మనలో ఉన్న దైవభక్తి సంబంధమైన అలవాట్లను క్రీస్తు జీవంలో లోతుగా నాటాలి. ఎంత లోతుగానంటే మన అలవాట్లకు క్రీస్తు జీవానికి మధ్య వ్యత్యాసం లేనంతగా. అప్పుడు మనలో సద్గుణాలు వాటంతట అవే వ్యక్తమవుతాయి. వాస్తవానికి అవే మన లక్షణాలుగా మారతాయి కాబట్టి వాటిగురించి మనం ప్రయత్నపూర్వకంగా ఆలోచించనక్కర్లేదు. అయినా మన ఆధ్యాత్మికస్థితి మనల్ని పదే పదే మన అంతరాత్మను పరిశోధించుకొనేలా చేస్తుంది. ఎందుకంటే మనందరం ఏదో ఒక సద్గుణాన్ని ఎప్పటికప్పుడూ అలవర్చుకోవలసి ఉన్నాం.

అయితే నీ అలవాట్లు నీకు “దైవం”గా మారకూడదు. ప్రార్థించే సమయం, లేదా రోజులో కొంత సమయాన్ని బైబిలు అధ్యయనానికి కేటాయించడం వంటి అలవాట్లు రానురానూ నీకు పరిమితులు విధించకూడదు. నీవు దేవుణ్ణి ఆరాధించడానికి బదులు నీ “అలవాటు”నే ఆరాధిస్తున్నట్లయితే దేవుడు నీ దినచర్యను తారుమారు చేస్తాడేమో ఆలోచించు. “ఇది నేను దేవునితో గడిపే ఏకాంత సమయం, నేనిప్పుడు ఈ సహాయం చేయలేను” అని ఎవరితోనైనా నీవు చెప్పినట్లయితే ఆ సమయం నీవు “నీ అలవాటుతో ఏకాంతంగా గడిపే సమయం” అవుతుంది. అప్పుడు నీలో క్రైస్తవునిలో ఉండవలసిన ఏదో ఒక సుగుణం లోపించిందని అర్థం. నీలో ఉన్న లోపాన్ని గుర్తించి, ఆ లోపాన్ని సరిదిద్దుకోడానికి ప్రయత్నించు.

ప్రేమ అట్టహాసంగా ఆర్భాటంగా వెల్లడి కాకూడదు. ఎందుకంటే నీ అలవాట్లు ప్రభువు జీవంలో లోతుగా నాటబడి ఉన్నప్పుడు నీలో అవి అప్రయత్నంగానే వెల్లడవుతాయి కాబట్టి ఇతరులపట్ల నీకు ఉన్న ప్రేమను నీకు తెలియకుండానే నీవు వెల్లడిచేస్తావు కాబట్టి ఎటువంటి అట్టహాసానికి ఆర్భాటానికి తావుండదు. నీలో ఉన్న పవిత్రత గురించి, ప్రేమ గురించి నీవు పదే పదే ఆలోచిస్తూ ఉన్నట్లయితే నీకు తెలియకుండానే నీకు నీవే హద్దులు విధించుకుంటున్నావని అర్థం; ఏ పనైనా చేయడానికి నీకు నీవే పరిమితులు విధించుకుంటున్నావని అర్థం. వాస్తవానికి ఏ సహాయాన్నైనా ఎప్పుడైనా చేయడానికి మనం సంసిద్ధతతో ఉండాలి. దేవుడు మనలో కోరుకునేది ఇటువంటి ప్రేమనే. దేవుడు నీ ప్రేమకు ఏ పరిమితులూ ఏ హద్దులూ విధించలేదు. నీ ప్రేమకు నీకు నీవే హద్దులు విధించుకుంటున్నట్లయితే నీలో ఏదో లోపం వుందన్నమాట, నీవు ఏదో ఒక సుగుణాన్ని అలవర్చుకోవలసి ఉన్నావని అర్థం. భూమ్మీద ఒకే ఒకరు మహత్తరమైన జీవితం గడిపారు. ఆయన మన ప్రభువైన యేసు మాత్రమే. ఎందుకంటే ఆయన మనల్ని కార్యకారణసంబంధాని కతీతంగా, ఎటువంటి షరతుల్లేకుండా దివ్యప్రేమతో మనల్ని ప్రేమించాడు. అన్నివేళల్లోనూ ఆయనలో ప్రేమాస్వరూపియైన దేవుడు సాక్షాత్కరించాడు. అన్నివేళల్లోనూ నీలో ప్రేమ సాక్షాత్కరిస్తోందా? లేనట్లయితే నిన్ను సరిదిద్దడానికి దేవుణ్ణి అనుమతించు. నీలో లోపించిన క్రైస్తవ సుగుణాల్ని అలవర్చుకొని దేవునిలో వృద్ధిచెందు. నీవు దేవుని లక్షణాల్ని అలవర్చుకున్నప్పుడు నీవు నిజంగా దేవుని బిడ్డవే.

మే 13

## నిర్దోషమైన మనస్సాక్షి

"దేవునియెడలను మనుష్యులయెడలను ఎల్లప్పుడు నా మనస్సాక్షి నిర్దోషమైనదిగా ఉండునట్లు అభ్యాసము చేసికొనుచున్నాను." (అ.కా. 24:16)

దేవుడు మనకిచ్చిన ఆజ్ఞల్ని అనుసరించడం కష్టంగానే ఉంటుంది; అయితే మనం వాటికి విధేయత చూపడం నేర్చుకున్నప్పుడు వాటిని పాటించడం సులువుగానే ఉంటుంది. "క్రీస్తు స్వరూపము మీయందేర్పడువరకు ... " (గలతీ 4:19) అని పౌలు వ్రాస్తున్నాడు. క్రీస్తు స్వరూపంలో మనలో ఉన్నప్పుడు మనలో నిర్దోషమైన మనస్సాక్షి ఉంటుంది. ఎందుకంటే క్రీస్తు నిర్దోషి.

మన మనస్సాక్షి మనకు నైతిక విలువల్ని నిర్దేశిస్తుంది. అంతే కాదు, మనం ఆ విలువల్ని పాటిస్తున్నామో లేదో మనల్ని హెచ్చరిస్తూ ఉంటుంది కూడా. మన మనస్సాక్షి మనల్ని దేవునివైపు చూడగలిగేలా చేసే మనోనేత్రం కూడా. అందుకే మనలో ఎవరి మనస్సాక్షి వారికే ప్రత్యేకం. ఉదాహరణకు దేవుడు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం జీవించే అలవాటు నాకు ఉన్నట్లయితే నా మనస్సాక్షి నాకు పదే పదే దేవుని ఆజ్ఞల్ని గుర్తుచేస్తూ నేను వాటిని ఆచరించాలని నన్ను హెచ్చరిస్తూ ఉంటుంది. ఇప్పుడు అసలు ప్రశ్న - నేను నా మనస్సాక్షి ప్రబోధానికి విధేయత చూపిస్తున్నానా? ఇతరులకు ఏ హానీ చేయకుండా నా మనస్సాక్షిని నేను కాపాడుకోవాలి. దేవుని కుమారుడైన క్రీస్తు స్వరూపం నాలో దినదిన ప్రవర్ధమానవుతోంది కాబట్టి నేను ఉత్తమమైనది మరియు పరిపూర్ణమైనది అయినటువంటి ఆయన చిత్తాన్ని తెలుసుకోగలను (రోమా 12:2; ఎఫెసీ 4:23 చూడండి).

దేవుడు ప్రతి చిన్న విషయంలోనూ మనకు బోధిస్తాడు. దేవుని ఆత్మ నిమ్మళంగా నా అంతరంగంలో ప్రబోధిస్తున్నప్పుడు వినగలిగే చెవులు నాకు ఉన్నాయా? "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి" (ఎఫెసీ 4:30). దేవుడు ఉరుము ఉరిమినట్టు నీతో మాట్లాడడు. దేవుడు నీతో నిమ్మళంగా మాట్లాడతాడు కాబట్టి నీవాయన స్వరాన్ని వినలేకపోవచ్చు. దేవుని స్వరాన్ని వినడానికి నీ మనస్సాక్షిని అప్రమత్తంచేయి. ఆయనతో నీవు వాదిస్తున్నట్లయితే నీ వాదనల్ని వెంటనే కట్టిపెట్టు. "నేనెందుకు దీన్ని చేయకూడదు?" అని దేవుని ప్రశ్నించకు. అలా అడిగినట్లయితే నీవు నడవవలసిన త్రోవలో నడవడంలేదని అర్థం. నీ మనస్సాక్షి నీకు ప్రబోధిస్తున్నట్లయితే వాదనకు తావుండదు. ప్రతి విధమైన అవిధేయతను విడిచిపెట్టు; అప్పుడు నీ మనస్సాక్షి నిర్దోషంగా స్వచ్ఛంగా ఉంటుంది.

మే 14

## ప్రతికూలతల్లో సంతోషంగా ఉండగలిగే అలవాటు

"యేసుయొక్క జీవము మా శరీరమందు ప్రత్యక్షపరచబడుటకై ... "
(2 కొరింథీ 4:10)

దేవుని కృపమూలంగా మన జీవితంలో ఏ యే కార్యాలు జరగాయో వాటిని ఇతరులకు వ్యక్తం చేయాలంటే మనం దైవభక్తిని పెంపొందించుకోవాలి. రక్షణ పొందడమంటే కేవలం నరకశిక్షనుండి తప్పించబడడం మాత్రమే కాదు; రక్షణ పొందడమంటే యేసు క్రీస్తు జీవం మనలో వెల్లడి కావడమని అర్థం. మనమెదుర్కొనే ప్రతికూల పరిస్థితులు మానవమాత్రమైన మన శరీరాల్లో యేసు క్రీస్తు జీవాన్ని విశదీకరిస్తాయి. ఇతరులు నాలో దేవుని కుమారుడైన యేసు క్రీస్తు జీవంలోని మాధుర్యాన్ని చూస్తున్నారా? లేక, దేవునికి దూరమైనప్పుడు కలిగే అసంతృప్తిని అశాంతిని నాలో చూస్తున్నారా? దేవునికుమారుడైన యేసు జీవం నాలో వెల్లడికావడానికి నేననుమతించినప్పుడు మాత్రమే నేను లోకంలో ప్రతికూలపరిస్థితుల్లో సంతోషంగా ఉండగలను. ఇదెంత కష్టతరమైనప్పటికీ నేను "ప్రభువా, నేనెదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితుల్లో నీకు విధేయత చూపడం నాకు చాలా ఆనందంగా ఉంది" అని చెప్పిన తత్క్షణమే దేవుని కుమారుడు నా జీవితంలో ప్రథమస్థానాన్ని అధిష్టిస్తాడు. అప్పుడు దేవునికి మహిమగలిగించేవన్నీ నా శరీరంలో వెల్లడవుతాయి.

నీకు వాదన అనవసరం. నీవు దేవుని వెలుగుకు విధేయత చూపిన తత్క్షణమే ఆయన కుమారుడు నీలో ప్రకాశిస్తాడు. నీవు దేవునితో వాదించినట్లయితే ఆయన పరిశుద్ధాత్మను దుఃఖపెట్టినవాడవవుతావు (ఎఫెసీ 4:30 చూడండి). దేవుని కుమారుడైన యేసు క్రీస్తు జీవం నీలో వెల్లడయ్యేలా నీవు ప్రతికూల పరిస్థితుల్లో సైతం దేవునికి ప్రియమైనట్టుగా జీవించు. అంతేగానీ కష్టాల్లో నీమీద నీవే సానుభూతి చూపించుకోకు. నీకెదురైన ప్రతికూల పరిస్థితులద్వారా దేవుని కుమారుడైన యేసు క్రీస్తుకున్న సంపూర్ణత, ఆయన పరిశుద్ధత ఇతరులకు వెల్లడవుతాయి. ఇది నీకు నవ్యానుభూతిని నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది. దేవుడు నీ జీవితంలో ప్రతికూల పరిస్థితుల ననుమతించినప్పుడు ఆయన నిన్ను నిస్సహాయస్థితిలో విడిచిపెట్టడు. "కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ 4:19).

దేవుని కుమారుడైన యేసు క్రీస్తు జీవం నీలో వెల్లడయ్యేలా నీ ఆత్మను వినమ్రంగా ఉంచుకో. గతానుభవాల జ్ఞాపకాల దొంతరల్లో జీవించకు. దేవుని వాక్యం నిన్ను జీవశక్తితో చైతన్యంతో నింపేలాగా వాక్యానికి నీ హృదయంలో చోటివ్వు.

మే 15

## ఏ సందర్భానికైనా సిద్ధంగా ఉండడం

"ఆయన మిమ్మును పిలిచిన పిలుపువల్లనైన నిరీక్షణ యెట్టిదో ... "
(ఎఫెసీ 1:17-19)

నీవు రక్షణ పొందావనే విషయం జ్ఞాపకం పెట్టుకో. యేసు క్రీస్తు జీవం నీ శరీరంలో విశదం కావాలి (2 కొరింథీ 4:10 చూడండి). దేవుని బిడ్డగా జీవించేందుకు నీ యావత్‌శక్తినీ ఉపయోగించు. నీకెదురైన ఏ సందర్భంలోనైనా దేవునికొరకు పనిచేయడానికి సిద్ధంగా ఉండు.

రక్షణ పొందడానికి నీవేమీ కష్టపడలేదు. అయితే నీ రక్షణను ఇతరులు చూసేలా నీవేమైనా చేయాలి. దేవుడు నీలో జరిగించిన కార్యాన్ని ఇతరులు నీలో చూడాలి. "మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి" (ఫిలిప్పీ 2:12) అని పౌలు వ్రాశాడు. నీ మాటలు నీ ఆలోచనలు నీ భావోద్వేగాలు నీవు నీ రక్షణను "కొనసాగిస్తున్నావని" రుజువు చేస్తున్నాయా? నీవింకా అసంతృప్తితో సణుగుతూ గొణుగుతూ, తీవ్రమైన అశాంతితో నీ ఇష్టానుసారంగా జీవిస్తూ "దేవుడు నన్ను రక్షించాడు; ఆయన నన్ను పవిత్రీకరించాడు" అని చెప్పడం అబద్ధం అవుతుందేమో ఆలోచించు.

దేవుడు పరమశిల్పి. ఆయన నిన్ను పరీక్షించడాన్కి, నీవు కష్టాలనెలా అధిగమిస్తావో చూడడానికి నీ జీవితంలోకి కావాలనే కష్టాలను అనుమతిస్తాడు. "నా దేవుని సహాయమువలన ప్రాకారమును దాటుదును" (కీర్తన 18:29) అని దావీదు చెప్పినట్టు నీవు చెప్పగలవా? నీవు దేవుని బిడ్డగా ఉన్నందువలన ఆయన నీకు ఏ కష్టాన్ని రానివ్వడని ఆలోచించకు. "ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమనుగూర్చి మీకేదో యొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి" (1 పేతురు 4:12) అని పేతురు వ్రాశాడు. ఏ సమయానికైనా ఏ సందర్భానికైనా సిద్ధంగా ఉండు. శ్రమనెదుర్కోడానికి ఏం చేయాలో అది చేయి. యేసు క్రీస్తు జీవం నీలో ఉంది కాబట్టి నీవు యెటువంటి శ్రమకు భయపడనక్కర్లేదు.

మనలో ఎటువంటి సణుగులను గొణుగులను, ఎటువంటి అసంతృప్తిని దేవుడు చూడకూడదు. ఎంతటి కష్టం యెదురైనా యెంతటి నష్టం ఎదురైనా దాన్ని అధిగమించడానికి మనం నిబ్బరంగా ఉండాలి. జీవితంలో ఏకైక లక్ష్యం మనలో దేవుని కుమారుడైన యేసు క్రీస్తు వెల్లడి కావడమే. ఇది జరిగినప్పుడు మన అసంతృప్తి మన ఫిర్యాదులు అన్నీ కనుమరుగవుతాయి. మన ప్రభువు తన తండ్రికి ఏ విషయంగురించి ఫిర్యాదు చేయలేదు; ఏ విషయంలోనూ అసంతృప్తి వెల్లడిచేయలేదు. కాబట్టి దేవుని పిల్లలమైన మనలో కూడా ఎటువంటి అసంతృప్తీ, ఎటువంటి ఫిర్యాదులూ ఉండకూడదు. దేవుడు తన చిత్తాన్ని మనద్వారా జరిగించడానికి మనమాయన చిత్తానికి వినమ్రతతో విధేయత చూపాలి. దేవుడు యెదురుచూసే వినయవిధేయతలు నీలో ఉన్నప్పుడు ఇతరులకు నీ జీవితాన్ని ధారపోయగలవు.

మే 16

## దేవుని ఏర్పాటును గుర్తించే అలవాటు

"దేవస్వభావమునందు పాలివారగునట్లు ... " (2 పేతురు 1:4)

దేవుడు తన వాగ్దానాలద్వారా మనల్ని తన స్వభావంలో పాలిభాగస్థుల్ని చేశాడు. మనం దైవభక్తితో కూడిన అలవాట్లను సుగుణాల్ని పెంపొందించుకొని మనలో దేవస్వభావాన్ని యెడతెగకుండా కాపాడుకోవాలి. మనందరం పెంపొందించుకోవలసిన మొదటి అలవాటు దేవుడు మనకొరకు ఏర్పాటుచేసి సిద్ధపర్చినవాటిని గుర్తించడం. మనం కొన్ని సార్లు బేలగా "ఈ పని చేయలేను" అని చెబుతుంటాం. మనమిలా చెప్పినట్లయితే మనం అబద్ధమాడుతున్నామని అర్థం. ఎందుకుంటే దేవుడు మనకేమీ ఇవ్వడని, మనకెటువంటి సహాయం చేయడని చెప్పకనే చెబుతున్నట్టు గదా! మనలో నిజంగా దీనస్వభావం ఉన్నట్లయితే "ఇది కష్టంగా ఉన్నప్పటికీ ఈ రోజు నేను కొంత చేయగలిగాను" అని చెబ్తాం. ప్రభువైన యేసుద్వారా సర్వశక్తిమంతుడైన దేవుని మహదైశ్వర్యం మనదే కదా! మనమాయనకు విధేయత చూపినట్లయితే ఆయన మనకు కడవరకు తోడుగా ఉంటాడు. మనకెదురైన కష్టతరమైన పరిస్థితులు నిజంగా అంత అసాధ్యమైనవా? అన్నిటినీ సాధ్యపరిచే దేవుడు మనకున్నప్పుడు అవి అసాధ్యమెలా అవుతాయి? మనమీద మనమే జాలిపడ్తూ దైన్యంలో పడిపోతే మన జీవితాల్లోంచి మనమే దేవుని మహదైశ్వర్యాన్ని తొలగించుకున్నట్టవుతుంది; పైగా ఆ మహదైశ్వర్యాన్ని పొందకుండా ఇతరుల్ని కూడా అడ్డుకున్నవారమవుతాం. మనమీద మనమే జాలిపడడాన్ని మించిన దురవస్థ ఇంకేదైనా ఉందా? ఇటువంటి దురవస్థలో ఉన్న మనం దేవుణ్ణి మహిమపర్చడానికి బదులుగా ఆయనగురించి సణుగుతూ గొణుగుతూ ఉంటాం. నీళ్లు పీల్చుకొనే స్పాంజి ముక్కల్లాగా ఎప్పుడూ దేవునినుండి అందుకొనేవారుగా ఉంటాంగానీ ఆయనకు ఇచ్చేవారిగా ఉండం. ప్రేమతోను దయతోను ఉండవలసిన మన జీవితాలు ఎప్పుడూ అసంతృప్తితో కొట్టుమిట్టాడుతుంటాయి.

మన జీవితంలో మనం గొప్పగా భావించేవాటన్నిటినీ విడిచి, దేవుడే మనకు సర్వస్వమనీ ఆయనే మనకు ఆధారమనీ ఆలోచించినప్పుడే మనల్ని చూచి దేవుడు సంతోషిస్తాడు. "మా ఊటలన్నియు నీయందే యున్నవని వారందురు" (కీర్తనలు 87:7). దేవుని మహిమాప్రభావం, కృప మరియు శక్తి మనలో వెల్లడికానట్లయితే అందుకు కారణం మనమే. "అన్నిటియందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వసమృద్ధిగలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీయెడల సమస్తవిధములైన కృపను విస్తరింపచేయగలడు" (2 కొరింథీ 9:8). దేవుడు నీ పట్ల చూపిన కృపను ఇతరులకు అందించు. దేవస్వభావంతో తాదాత్మ్యం చెందు. దేవుని ఆశీర్వాదం నీమీద సదాకాలం వుండుగాక.



మే 17

## ఆయన ఆరోహణం, మరియు మన సామీప్యత

“వారిని ఆశీర్వదించుచుండగా ఆయన వారిలోనుండి ప్రత్యేకింపబడి పరలోకమునకు ఆరోహణుడాయెను” (లూకా 24:51)

మన ప్రభువు జీవితంలో రూపాంతరం తర్వాతనుండి ఆరోహణంవరకు జరిగిన సంఘటనలు మన జీవితాల్లో మనకు అనుభవంలోనికి రాలేదు. గెత్సేమనే అనుభవం, సిలువ అనుభవం, పునరుత్థాన అనుభవం వాస్తవానికి మనం అనుభవించం. భూమ్మీద ప్రతి మనిషీ దేవుని జీవంలోనికి ప్రవేశించడానికి యేసే మార్గం. ఆయన పునరుత్థానం ద్వారా మనకు నిత్యజీవం అనుగ్రహించబడింది. ఆయన ఆరోహణం మనకొరకు పరలోకపు వాకిళ్లను తెరిచింది.

యేసు ఆరోహణుడైన కొండమీదనే ఆయన రూపాంతరంకూడా జరిగింది. ఆయన రూపాంతరంనాడే అక్కడనుండి పరలోకానికి ఆరోహణుడైనట్లయితే ఆయన ఒంటరిగా పరలోకానికి వెళ్లి ఉండేవాడు. అప్పుడాయన మనకు కేవలం ఒక దివ్యతేజోమూర్తిగానే మిగిలి ఉండేవాడు. అయితే ఆయన రూపాంతరపు మహిమాప్రభావాలను విడిచిపెట్టి కొండమీదనుండి దిగివచ్చి పతనమైన మానవజాతి నిమిత్తం సిలువమీద మరణించాడు.

రూపాంతరపు పరిపూర్ణ ఆవిష్కరణ ఆరోహణం. మన ప్రభువు తన పూర్వ మహిమను తిరిగి పొందాడు. ఆయన దేవుని కుమారుడిగానే కాక మనుష్యకుమారుడిగా కూడా పరలోకానికి వెళ్లాడు. మనుష్యకుమారుడైన యేసు ఆరోహణంద్వారా మనందరికీ దేవుని సింహాసనంవద్దకు వెళ్లే సామీప్యత లభించింది. ఆరోహణుడైన మన ప్రభువు సర్వశక్తిమంతుడు సర్వాంతరవ్యామి, మరియు సర్వజ్ఞాని. ఆయన సర్వశక్తిసంపన్నుడై తన మహిమైశ్వర్యంలో దేవుని కుడిపార్శ్వంలో ఉన్నాడు. దివ్యారోహణుడైన మన ప్రభువైన యేసు రాజులకు రాజు మరియు ప్రభువులకు ప్రభువు.

మే 18

## సామాన్యమైన జీవితం

“ఆకాశపక్షులను చూడుడి ... అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి” (మత్తయి 6:26,28)

“అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి, అవి కష్టపడవు ఒడకవు” అవి అత్యంత సహజంగానే వైభవోపేతంగా ఉన్నాయి. అలలతో నిండిన కడలి, వీచే గాలి, ప్రకాశించే సూర్యుడు, మెరిసే నక్షత్రాలు, చల్లని వెలుగుల జాబిల్లి - వీటన్నిటి గురించి ఒక్కసారి ఆలోచించు. దేవుడు మనుషుల మేలుకొరకు వాటికి నిర్దేశించిన పనుల్ని అవి చేసుకుంటూ పోతున్నాయి. అయితే మనుషులమైన మనమే దేవునికి మనపట్ల ఉన్న ఉద్దేశాల్ని గ్రహించక ఆయనకొరకు ఏ పనిచేయక నిష్ఫలంగాను నిరుపయోగంగా ఉన్నాం. మనం ఆధ్యాత్మికంగా దినదినాభివృద్ధి చెందాలంటే మనం చేయవలసిన ఒకే ఒక పని మనం దేవునిలో విశ్వాసం కలిగి ఉండడం మాత్రమే. మన మాటల్లో చెప్పాలంటే “మనుషులకెలా ఉపయోగపడాలో చింతించవద్దు. కేవలం నన్ను విశ్వసించండి” అని యేసు చెబుతున్నాడని అర్థం. “నాయందు విశ్వాసముంచువాడెవడో ... వాని కడుపులోనుండి జీవజలనదులు పారునని బిగ్గరగా చెప్పెను” (యోహాను 7:38).

మానవసహజమైన జిజ్ఞాసతోను మరియు హేతుబద్ధమైన విజ్ఞానంతోను మనలో ఉన్న జీవానికి మూలాల్ని మనం కనుగొనలేం. మనం మన పరలోకపు తండ్రిలో నిలిచి ఉన్నప్పుడు మాత్రమే మనలో జీవం వుంటుంది. మన పరిస్థితులన్నీ మన జీవనగతులన్నీ మన పరలోకపు తండ్రికి తెలుసు. మనం మన దృష్టిని మన స్థితిగతులమీద కాక దేవునిమీద నిలిపినప్పుడు “అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి” అని మన ప్రభువు చెప్పినట్టుగా మనమాయనలో ఆధ్యాత్మికంగా ఎదగగలం.

మనతో ఎప్పుడూ మాట్లాడుతూ ఉండేవారు మనమీద ప్రభావం చూపలేరు గానీ ఎటువంటి అట్టహాసం ఆడంబరంలేని “అడవిపువ్వులు” లాంటివారు మాత్రమే మన జీవితాల్ని ప్రభావితం చేయగలరు. వీళ్లే మనకు ఆదర్శమూర్తులు; స్ఫూర్తిప్రదాతలు.

నీవు దేవునికి ఉపయోగపడేలా ఉండాలంటే యేసు క్రీస్తుద్వారా ఆయనతో సరైన సంబంధం కలిగి ఉండు. నీకు తెలియకుండానే ఆయన నిన్ను నీ సమయాన్ని తనకొరకు ఉపయోగించుకుంటాడు.

మే 19

**అట్టడుగునుండి పైపైకి**

“క్రీస్తు ప్రేమనుండి మనలను ఎడబాపువాడెవడు?” (రోమా 8:35)

దేవుడు తన పిల్లలకు శ్రమలనుండి మినహాయింపు నివ్వడు. అయితే ఆయన “శ్రమలో నేనతనికి తోడైయుండెదను” (కీర్తనలు 91:15) అని వాగ్దానం చేస్తున్నాడు. మనకెదురయ్యే ప్రతికూలతలు ఎంత తీవ్రమైనవైనా కావచ్చు; క్రీస్తు ప్రేమనుండి, ఆయనతో మనకున్న అన్యోన్య సహవాసంనుండి ఏదీ మనల్ని దూరం చేయలేదు. “మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము” (రోమా 8:37) అని పౌలు వ్రాశాడు. పౌలు ఆ మాటల్ని ఊహించి వ్రాయలేదు గానీ తన జీవితంలో వాస్తవంగా జరిగినవాటి గురించే వ్రాశాడు. మనం శ్రమల్లో గెలుపు సాధించిన విజేతలమని పౌలు అభిప్రాయం. ఈ విజయం మన స్వంత తెలివితేటలవలన, లేదా మన ధైర్యంవలన వచ్చిన విజయం కాదు. ఎందుకంటే మన స్వంత తెలివితేటలు లేదా మన ధైర్యం యేసు క్రీస్తుతో మన అన్యోన్యతను పెంపొందించలేవు.

“శ్రమయైనను ... ” (రోమా 8:35) - ఎవరూ శ్రమల్ని స్వాగతించరు. అయితే శ్రమలు మనకు అలసట పుట్టించినప్పటికీ, చిరాకు పుట్టించినప్పటికీ, మనల్ని తాత్కాలికంగా బలహీనపర్చినప్పటికీ అవి మనల్ని “క్రీస్తు ప్రేమనుండి” వేరుచేయలేవు. కాబట్టి శ్రమలు ఐహికవిచారాలు మనల్ని నిష్ఫలుల్ని చేయకుండా మనం జాగ్రత్తపడాలి (మత్తయి 13:22 చూడండి).

“బాధయైనను ... ” (రోమా 8:35) - మనకెదురైన పరిస్థితులు, మనచుట్టూ ఉన్నవారు ఆయన ప్రేమ అబద్ధం అని చెబుతున్నప్పుడు న్యాయమనేది లేనే లేదని చెబుతున్నప్పుడు దేవుని ప్రేమ మనల్ని బంధించి ఉంచగలదా? “కరవైనను ... ” (రోమా 8:35) - తినడానికి తిండిలేని పరిస్థితుల్లో మనం దేవుడు మనల్ని ప్రేమిస్తున్నాడని విశ్వసించగలమా? అంతే కాదు; మనం “అత్యధిక విజయము” పొందుతున్నామని నమ్మగలమా?

ఇటువంటి పరిస్థితులెదురైనప్పుడు తప్పొప్పుల్ని ఎంచడానికి తావులేదు. ఇటువంటి పరిస్థితుల్లో మనకు అవసరమైనది ఒక్కటే. అది యేసు క్రీస్తుద్వారా మనం పొందే దేవుని ప్రేమ; ఆయనతో మనల్ని అన్యోన్యతకు నడిపించే బలీయమైన ప్రేమ. ఈ ప్రేమ మూలంగానే నేను విరిగి నలిగి ముక్కలైన ప్రతి సారీ అట్టడుగునుండి పైకి లేస్తున్నాను.

మే 20

## మన ఆత్మను మన స్వాధీనంలో ఉంచుకోడం

"మీరు మీ ఓర్పుచేత మీ ప్రాణములను దక్కించుకొందురు" (లూకా 21:19)

నీవు తిరిగి పుట్టిన మొదట్లో నీవొక ఆధ్యాత్మిక శిశువువి. శిశువువంటి నీకు ఆధ్యాత్మిక పరిణతి ఉండదు. అయితే క్రీస్తు మనస్సు నీలో పెంపొందుతూ ఉంటుంది (ఫిలిప్పీ 2:5 చూడండి) కాబట్టి నీలో నూతన జీవం వ్యక్తం కావాలి. మనం ఓర్పు వహించడంద్వారా మన ఆత్మల్ని అంతంవరకు కాపాడుకోగలమని లూకా 21:19 వచనం సెలవిస్తోంది. అయితే మనలో అనేకులు ఆధ్యాత్మిక జీవితంలో మొదటిమెట్టు దగ్గరే ఆగిపోతున్నారు; దేవుడు మనలో ఉంచిన నూతన జీవాన్ననుసరించి పరిణతి చెందడంలేదు. దేవుడు మనల్నెలా చేశాడో గ్రహించక పోవడంవలన మనం వైఫల్యం చెందుతున్నాం. మనలో క్రమశిక్షణ లేకపోవడం మూలంగా మనంతట మనమే తెచ్చుకున్న వైఫల్యాల్ని సాతానుమీదికి తోస్తున్నాం. మనం మన వాస్తవ స్థితిగతుల్ని గుర్తిస్తే ఎంత మేలు!

మనలోనుండి దిగులును తొలగించమని మనం దేవుణ్ణి ప్రార్థించనక్కర్లేదు. మనం ప్రార్థిస్తే మన దిగులు మనల్ని వీడదు. అయితే మన జీవితాల్లోంచి మనమే దిగులును బయటికి వెళ్లగొట్టాలి. మనకెదురైన బాహ్యపరిస్థితులు దిగుళ్లకు కారణం కావచ్చేమో గానీ మనలో ఉన్న అంతరంగం మన దిగుళ్లకు ఎన్నడూ కారణం కాదు. మన బాహ్య పరిస్థితులకు తలొగ్గి ఒక్క క్షణంకూడ మనం దిగులుచెందకూడదు. ఇది సంఘర్షణతో కూడినదే అయినప్పటికీ మనం నిబ్బరంగా ఉండాలి. అప్పుడే మనం మన కసాధ్యమైనవన్నీ విశ్వాసంద్వారా సాధ్యం చేయగలమనే విషయాన్ని గ్రహించగలం. అయితే మన దురదృష్టమేమిటంటే మనం నిబ్బరంగా ఉండం. ఆధ్యాత్మిక నిబ్బరం మరియు దృఢచిత్తం మన దైహిక జీవితంలో వెల్లడికావడమే నిజమైన క్రైస్తవ జీవితం.

మే 21

## జ్ఞానానికందని విశ్వాసం

"మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును." (మత్తయి 6:33)

యేసు పలికిన ఈ మాటలు విప్లవాత్మకమైనవిగా కనిపిస్తాయి. మనుషులు ఇటువంటి మాటల్ని ఇంతకు ముందెన్నడూ వినలేదు. "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి ... " - ఆధ్యాత్మికంగా పరిణతి చెందినవారు సైతం "నేను బ్రతకాలి కదా! నేను బ్రతకాలంటే నాకు కొంతమట్టుకైనా డబ్బు కావాలి. అన్నవస్త్రాలకొరకు నేను పాటుపడాలి కదా!" అని ఈ మాటలకు భిన్నంగానే అభిప్రాయపడుతుంటారు. అనేకులకు జీవితంలో ప్రధానసమస్య రాజ్యాన్వేషణ కాదు గానీ లోకంలో బ్రతుకుతెరువే. అయితే యేసు ఈ పరిస్థితిని తారుమారుచేసి నూతన సత్యాన్ని ఆవిష్కరించాడు. మనిషికి జీవితంలో మొదట అవసరమైనది దేవునితో సరైన సంబంధాన్ని కలిగి ఉండడం; అంతే గానీ కేవలం ఐహిక విషయాలు మాత్రమే కాదు.

"మీ ప్రాణమును గూర్చియైనను ... చింతింపకుడి" (6:25). మన బ్రతుకు గురించి ఆలోచించి విచారపడడం అవివేకమని యేసు బోధించాడు. జీవితంలో ఏ గమ్యంలేని మనిషి ధన్యజీవి అని మన ప్రభువు చెప్పలేదు. వాస్తవానికి అటువంటి మనిషి అవివేకి. అయితే యేసు బోధించిన సత్యం జీవితంలో అన్నిటికంటె ప్రధానమైనది దేవునితో సరైన సంబంధాన్ని కొనసాగించడం. దేవునితో సరైన సంబంధాన్ని కొనసాగించడంతో పోల్చినట్లయితే మనిషికి జీవితంలో మరొక ప్రాధాన్యత ఏదీ లేదు. "మీ దృష్టి జీవితంలో అన్నవస్త్రాలవంటి కనీసావసరాలమీద ఉండకూడదుగానీ ప్రధానంగా దేవునిమీదనే ఉండాలి" అని యేసు సందేశాన్ని మనం విశదీకరించవచ్చు. కొంతమంది ఏం తింటున్నారో ఏం కట్టుకుంటున్నారో పెద్దగా పట్టించుకోరుగానీ వాటికొరకు తాపత్రయపడుతుంటారు. జీవితంలో ప్రధానంగా అవసరమైనదాన్ని అన్వేషించని వారు తమ నిర్లక్ష్యానికి దేవునికి లెక్క అప్పచెప్పవలసి ఉంటుంది. మనిషికి జీవితంలో ప్రాధాన్యత దేవుడే; ఏదైనా దేవుని తర్వాతనే.

క్రైస్తవ జీవితంలో ఇది చాలా కష్టంగానే కనిపిస్తుంది. అయితే యేసు మాటల్లోని సత్యంతో మనం ఏకీభవించే శక్తిని పొందడానికి మన హృదయాల్లోకి పరిశుద్ధాత్మకు స్వాగతం పలుకుదాం.

మే 22

## మన కష్టాలకు వివరణ

“తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమైయుండవలెనని .... వారికొరకును ప్రార్థించుచున్నాను” (యోహాను 17:20-21)

నీవు ఒంటరితనంతో వేసారుతున్నట్లయితే యోహాను సువార్త పదిహేడవ అధ్యాయం చదువు. నీవెందుకలా ఉన్నావో ఎక్కడ ఉన్నావో ఈ అధ్యాయం సరిగ్గా వివరిస్తుంది. ఎందుకంటే ఈ అధ్యాయంలో యేసు ప్రభువు “నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమైయుండవలెనని” తండ్రిని ప్రార్థించాడు. యేసు ప్రార్థనకు దేవుడిచ్చిన జవాబును నీ జీవితంలో కనుగొన్నావా? లేక, జీవితంలో నీకు అన్యమనస్కతలేవైనా ఉన్నాయా? నీవు యేసు శిష్యుడివిగా మారిన తర్వాత నీ జీవితం నీ ఇష్టానుసారంగా ఉండడానికి వీల్లేదు.

యోహాను సువార్త పదిహేడవ అధ్యాయంలో దేవుని ఉద్దేశం మనకు వెల్లడవుతుంది. మనమాయన హృదయాన్ని ఆయన ఆలోచనల్ని తెలుసుకోవాలని ఆయన కోరుకుంటున్నాడు. “నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమైయుండవలెనని” (యోహాను 17:20-21) యేసు మనకొరకు ప్రార్థించాడు. యేసు ఏమని ప్రార్థించాడో గ్రహించావా? యేసు ప్రార్థించినట్టుగా దేవునితో అన్యోన్యతను కోరుకుంటున్నావా?

మన స్వంత ఆలోచనల్ని స్వంత తలంపుల్ని దేవుడు లెక్కచేయడు. అయితే మనకు కొన్నిసార్లు జీవితంలో కష్టాలు బాధలు ఒంటరితనంవంటి సమస్య లెదురవుతుంటాయి. అయితే మనం దేవుని ఉద్దేశాల్ని తెలుసుకోడానికి ఆయన కొన్ని సార్లు వీటిని మన జీవితంలోకి అనుమతిస్తాడు. జీవితంలో ఎదురైన కష్టనష్టాలు ఆటుపోట్లు మనల్ని మరింత ఉదాత్తుల్ని చేయాలి. నీ జీవితంలో ఎదురైన కష్టాలు నిన్ను ఉదాత్తుడ్ని చేస్తున్నాయా? లేక, అవి నీలో విమర్శనాదృష్టిని పెంచుతూ నిన్ను మొండివాడిగా రంధ్రాన్వేషకుడిగా చేస్తున్నాయా? జీవితంలో మనకెదురయ్యే ఆటుపోట్లు మనల్ని చెడ్డవారిగానైనా చేస్తాయి; లేదా మనల్ని సుగుణవంతులుగానైనా చేస్తాయి. అయితే మనమేమౌతామనేది దేవునితో మనకున్న సంబంధంమీద, ఆయనతో మనకున్న అన్యోన్యతమీద ఆధారపడి ఉంటుంది. మన జీవితాల్లో “నీ చిత్తమే సిద్ధించుగాక” (మత్తయి 26:42) అని మనం ప్రార్థించినట్లయితే యోహాను సువార్త పదిహేడవ అధ్యాయంద్వారా మనకు ఆదరణ ధైర్యం లభిస్తాయి. ఎందుకంటే మన జీవితంలో ఏది మంచిదో మనకు ఏది అవసరమో మనకంటె ఎక్కువగా దేవునికి తెలుసు కాబట్టి మన జీవితంలో దేవుని చిత్తం నెరవేరాలని ప్రార్థిద్దాం. దేవుని ఉద్దేశాల్ని మనం గ్రహించినప్పుడు మనలో సంకుచితదృష్టికి, ప్రతిదానికీ తప్పుపట్టే అల్పబుద్ధికి తావుండదు. యేసు తాను తన తండ్రితో ఏకమై ఉన్నట్టుగా మనంకూడా తండ్రితో ఏకమై ఉండాలని ప్రార్థించాడు. ఇంతకంటె మనకు జీవితంలో గొప్పదేదైనా ఉందా? అయితే మనలో అనేకులు తండ్రితో ఏకంగా లేరు. అయితే మనమాయనతో ఏకమయ్యేవరకు దేవుడు మనల్ని ఒంటరివారిగా విడిచిపెట్టడు. ఎందుకంటే యేసు మనగురించి “నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమైయుండవలెనని” ప్రార్థించాడు. ఇది యేసు అభిమతం.

మే 23

## అప్రమత్తతతో కూడిన మన అపనమ్మకం

“ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి ... ” (మత్తయి 6:25)

మన బ్రతుకుగురించి మనం విచారాన్ని చింతను వెలిబుచ్చడం యేసు దృష్టిలో అపనమ్మకంతో సమానం. మనం దేవుని ఆత్మతో నింపబడినవారమైతే మన జీవితంలో ప్రాధాన్యత దేవునికి మాత్రమే ఉండేలా ఆయన ఆత్మ మనల్ని నిర్బంధిస్తాడు. ఇక మనజీవితంలో మిగిలినవాటికి స్థానం దేవుని తర్వాతే. “ఈ వేసవి సెలవుల్లో ఎక్కడికి వెళ్లాలి?” “చదవడానికి కొత్త పుస్తకాలు ఏమైనా వున్నాయా?” వంటి ప్రశ్నలు మన జీవితంలో అనామకంగా మిగిలిపోతాయి. మన జీవితంలో దేవునికి కాకుండా ఇతరమైన వాటికి ప్రాధాన్యతనిచ్చినప్పుడు మనం విచారానికి చింతకు గురవుతాం.

“మీ ప్రాణమును గూర్చియైనను ... చింతింపకుడి” - నీ బ్రతుకు భారాన్ని నీ తలమీద మోయకు. దిగులుపడడం  కేవలం పొరబాటు మాత్రమే కాదు; అపనమ్మకం కూడా. విచారపడడమంటే దేవుడు మన అన్ని అవసరాల్ని తీర్చగలడని నమ్మకపోవడమని అర్థం. మనలో దేవుని వాక్యాన్ని అణచివేసేవేమిటో యేసు ప్రభువు సెలవిచ్చారు గదా! అవేమిటో గమనించావా? సాతానా? కాదు! చిన్న చిన్న విషయాలే మనల్ని క్రుంగదీస్తాయి. “ఐహికవిచారము” అని ప్రభువు సెలవిచ్చారు. “నా కళ్లతో చూడకపోతే నేను దేన్నీ నమ్మను” అని చెబ్తుంటాంగదా! ఇక్కడే అపనమ్మకం మొదలవుతుంది. అపనమ్మకాన్ని తొలగించే ఔషధం దేవునిఆత్మకు విధేయత చూపడం మాత్రమే.

యేసు తన శిష్యులకు సెలవిచ్చిన గొప్ప మాట “చింతింపకుడి”.

మే 24

## నిరాశలో ఆనందం

"నేనాయనను చూడగానే చచ్చినవానివలె ఆయన పాదములయొద్ద పడితిని" (ప్రకటన 1:17)

అపొస్తలుడైన యోహాను యేసుతో అన్యోన్యత కలిగి ఉన్నట్టుగా నీకు కూడా యేసుతో అన్యోన్యత ఉందా? అయినప్పటికీ ఆయన తన మహిమాప్రభావాలతో మన యెదుట ప్రత్యక్ష మైనట్లయితే మనం కూడా "చచ్చినవానివలె ఆయన పాదముల యొద్ద" పడతాం. దేవుడు తన మహామహిమతో ప్రత్యక్షమయ్యే సందర్భాలు కొన్ని ఉంటాయి. మహిమోన్నతమైన ఈ దర్శనమే మనకు నిరాశలో ఆనందాన్నిస్తుంది.

మనం అట్టడుగునుండి పైకిలేవాలంటే అది దేవుని హస్తం మనల్ని పైకి లేపినప్పుడేనని మనం గుర్తించినప్పుడు మనకు నిరాశానిస్పృహల్లో సైతం ఆనందం పెల్లుబుకుతుంది.

"ఆయన తన కుడిచేతిని నామీద ఉంచి ... " (1:17) - సంభ్రమాశ్చర్యాల్లో మునిగి ఉన్న మనల్ని ఒక దివ్యహస్తం తాకుతుంది! ఆ హస్తం యేసు ప్రభువు దక్షిణహస్తం మాత్రమే. ఆ హస్తం మనల్ని అడ్డుకొనే హస్తం కాదు, మనల్ని దండించే హస్తం కాదు. ఆ హస్తం మన నిత్యుడైన తండ్రి కుడిహస్తం. ఆయన తన హస్తంతో నిన్ను తాకిన ప్రతి సారీ నీకు అనిర్వచనీయమైన సమాధానం ఆదరణ లభిస్తాయి. "నిత్యముగ నుండు బాహువులు నీ క్రిందనుండును" (ద్వితీ 33:27) - ఈ హస్తాలు నీకు ఆదరణను ఓదార్పును కాపుదలను బలాన్ని ఇస్తాయి. ఆయన హస్తాలు నిన్ను తాకిన తర్వాత ఇక ఏ భయమూ నిన్ను చేరదు! పరలోకానికి ఆరోహణుడైన యేసు తన మహిమలోనుండి "భయపడకుము" (ప్రకటన 1:17) అని అల్పుడైన శిష్యునితో చెబుతున్నాడు. ఆయన మృదువైన మాటలు అత్యంత మధురంగా ఉన్నాయి. ఈ యేసు నీకు తెలుసా?

నిన్ను నిరాశానిస్పృహల్లోకి నెట్టివేసేవాటి నొకసారి చూడు. నిరాశానిస్పృహలు నిన్ను నిరీక్షణకు ఆనందానికి దూరం చేస్తున్నాయి. "నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును" (రోమా 7:18) అని పౌలు గుర్తించినట్టుగా నీవు కూడా గుర్తించినట్లయితే నీ నిరాశ ఆనందంగా మారుతుంది. దేవునియెదుట నీవు సాష్టాంగపడవలసి ఉన్నావని తెలుసుకున్నప్పుడు, దేవుని హస్తం తప్ప మరేదీ నిన్ను పైకి లేపదని నీవు గ్రహించినప్పుడు నీలో ఉన్న నిరాశ మటుమాయమై నీలో ఆనందం పెల్లుబుకుతుంది. మానవమాత్రుడనైన నేను నాకున్న పరిమితుల్ని సాధ్యాసాధ్యాల్ని గుర్తించినప్పుడు, నాకు అసాధ్యమైనవాటిని దేవుడు మాత్రమే సాధ్యంచేయగలడని నేను గ్రహించినప్పుడు ఆయన తప్పకుండా నాకొరకు ఏమైనా చేయగలడు, చేస్తాడు!

మే 25

**మంచిది, ఇంకా మంచిది?**

"నీవు ఎడమతట్టునకు వెళ్లినయెడల నేను కుడితట్టుకును, నీవు కుడితట్టునకు వెళ్లినయెడల నేను యెడమతట్టునకును వెళ్లుదునని ... " (ఆది 13:9)

విశ్వాసజీవితాన్ని ప్రారంభించిన నీవు భౌతిక ప్రయోజనాల్ని కూడా చూడ గలుగుతావు. ఇవి నీకు ఒక విధంగా స్వాస్థ్యం లేదా హక్కు వంటివే. అయితే నీలో ఉన్న విశ్వాసాన్నిబట్టి నీవు నీ స్వాస్థ్యాన్ని లేదా హక్కును వదులుకోడానికి కూడా సిద్ధపడగలవు. దేవుడే నీ స్వాస్థ్యాన్ని నిర్ణయిస్తాడనే నమ్మకంతో కార్యభారాన్ని ఆయన చేతులకే అప్పగించగలవు. కొన్ని సార్లు దేవుడు భౌతిక ప్రయోజనాలద్వారా నీకు పరీక్షించవచ్చు. నీలో సరైన విశ్వాసం లేనట్లయితే నీలో స్వార్థం చోటుచేసుకోడానికి ఆస్కారముంటుంది. నీలో సరైన విశ్వాసం ఉన్నట్లయితే నీవు నీ హక్కును కోల్పోడానికైనా వెనుకడుగు వేయవు. దేవుని స్వరానికి నీవు చూపుతున్న ఈ విధేయతద్వారా ఆయన నిన్ను ప్రకృతిసంబంధమైన వ్యక్తినుండి ఆత్మసంబంధమైన వ్యక్తిగా మారుస్తున్నాడు.

మనకున్న హక్కులు మన జీవితాలకు మార్గదర్శకాలైనప్పుడు మనలో ఆధ్యాత్మిక అంతర్దృష్టి మందగిస్తుంది. కొన్ని సార్లు మన విశ్వాసానికి ప్రధమ శత్రువు మనం తీసుకుంటున్న నిర్ణయాలే కావచ్చు. మనం మంచివి అనుకున్న నిర్ణయాలు వాస్తవానికి మంచివి కాకపోవచ్చు. మనం పైన చదివిన వచనంలోంచి ఒక విషయాన్ని అర్థం చేసుకోగలం. అబ్రాహాము తనకేదీ కావాలో తెలివిగా నిర్ణయించుకోగలడు. ఒక రకంగా ఇది అబ్రాహాముకు హక్కు కూడా. తనకు కావలసినది కోరుకోనందుకు అబ్రాహాము పరిచయస్థులు అతణ్ణి తెలివితక్కువవాడిగా కూడా లెక్కకట్టవచ్చు.

మనలో అనేకులు ఆధ్యాత్మికంగా పరిణతి చెందకపోడానికి కారణం మనం మన హక్కుల్ని వదులుకొని మనకేదీ కావాలో నిర్ణయించే అవకాశం దేవునికి ఇవ్వకపోవడమే. మనం దేవుని దిశానిర్దేశంమీద ఆయన విలువలమీద ఆధారపడి నడవడం నేర్చుకోవాలి. అప్పుడు దేవుడు అబ్రాహాముతో "నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము" (ఆది 17:1) అని చెప్పినట్టు మనతో కూడా చెబ్తాడు.

మే 26

## యేసు నేర్పిన ప్రార్థనగురించి ఆలోచించడం

"యెడతెగక ప్రార్థన చేయుడి" (1 థెస్స 5:15)

ప్రార్థనగురించి మనలో ఉన్న ఆలోచనలు మన మనస్సుల్లోని భావనలమీద ఆధారపడి ఉంటాయి. ఈ భావనలు ఒప్పు కావచ్చు, లేదా తప్పు కావచ్చు. ప్రార్థన గురించి ఈ భావన ఒప్పుగా ఉంటుందేమో: ప్రార్థన మన ఊపిరితిత్తుల్లోని శ్వాసవంటిది; మన గుండెలో ప్రవహించే రక్తంవంటిది. మన గుండె "నిరంతరం" కొట్టుకుంటూనే ఉంటుంది; మన ఊపిరితిత్తులు "నిరవధికంగా" శ్వాసిస్తూనే ఉంటాయి. ఈ విషయాన్ని మనం పెద్దగా పట్టించుకోకపోయినప్పటికీ ఇది మనలో యెడతెగకుండా జరిగే సహజ ప్రక్రియ. మనం యేసుద్వారా తండ్రితో ఏకమై ఉన్నామనే సత్యాన్ని మనం కొన్ని సార్లు గుర్తించకలేకపోతున్నాం. అయినప్పటికీ ఆయన యెడతెగకుండా మనం తండ్రితో ఏకమై ఉండేలాగా చూస్తున్నాడు. మనమాయనకు చూపించే విధేయతనుబట్టి ఈ విషయాన్ని గుర్తించగలం. ప్రార్థన ఒక అభ్యాసం కాదు. ఇది ఊపిరి అంత సహజమైనది. నీ ప్రార్థనను అడ్డుకొనేవాటి విషయంలో అప్రమత్తంగా ఉండు. "యెడతెగక ప్రార్థన చేయుడి" - నీ హృదయంలో ఎల్లప్పుడూ దేవుణ్ణి ప్రార్థించు. అప్పుడు నీలో చిన్న బిడ్డలకున్న మనస్సు ఉంటుంది.

జవాబులేని ప్రార్థనగురించి యేసు ఎన్నడూ ప్రస్తావించలేదు. మనం చేసే ప్రతి ప్రార్థనకూ జవాబు ఆయనదగ్గర ఉంది. ఇది నిశ్చయం! ప్రార్థన విషయంలో యేసుకున్న నిశ్చయతను దేవుని ఆత్మద్వారా నీవుకూడా కలిగి ఉన్నావా? లేక, దేవుడు నీ ప్రార్థనకు జవాబివ్వలేదని ఆలోచిస్తున్నావా? "అడుగు ప్రతివాడును పొందును" (మత్తయి 7:8) అని యేసు ప్రభువు సెలవిచ్చాడు. అయినా మనం "కానీ ... కానీ ... " అని చెబుతున్నాం. దేవుడు ప్రతి సారీ మన ప్రార్థనకు జవాబిస్తాడు. అయితే ఆ జవాబు మనం ఆలోచించినట్టుగా ఉండకపోవచ్చు; మనం యెదురుచూచినప్పుడు రాకపోవచ్చు. నీ ప్రార్థనకు దేవునినుండి జవాబుకొరకు యెదురుచూస్తున్నావా?

మన ఆలోచనల ప్రకారం, మనలో ఉన్న యుక్తాయుక్త వివేచన ప్రకారం దేవుని జవాబు ఉంటుందని మనం యెదురుచూస్తుంటాం. ఇది సరైన అభిప్రాయం కాదు! ఎందుకంటే నీ స్వంత వివేచనకు దేవుని ఆలోచనలకు చాలా వ్యత్యాస్యం ఉంటుంది. ప్రార్థనగురించి యేసు బోధించిన సత్యాలు ఆయన మనకు వెల్లడిచేసిన దివ్యసత్యాలు!

మే 27

**ఆయణ్ణి కనుగొనే జీవం**

"మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడని వారితో చెప్పెను" (లూకా 24:49)

శిష్యులు పెంతెకొస్తు పండుగరోజు వరకు యెరూషలేం పట్టణంలో కనిపెట్టి ఉండాలి. ఈ సమయం వారికి సిద్ధబాటు సమయం; పైగా ప్రభువు మహిమ పొందేవరకు వారు కనిపెట్టాలి. ప్రభువు మహిమ పొందిన తర్వాత ఏం జరిగింది? "ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది ... దీనిని కుమ్మరించి యున్నాడు" (అ.కా. 2:33). "యేసు ఇంకను మహిమపరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింపబడి యుండలేదు" అని యోహాను 7:39 వచనంలో ఉన్న ప్రకటన నేడు మనకు వర్తించదు. ఎందుకంటే పరిశుద్ధాత్మ ఇంతకుముందే కుమ్మరించబడ్డాడు; మన ప్రభువు మహిమపర్చబడ్డాడు. ఇప్పుడు మనం కనిపెట్టి చూడవలసినది నాడు శిష్యులు కనిపెట్టినట్టుకాదు గానీ మన ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించి మాత్రమే.

పెంతెకొస్తుకు ముందు కూడా పరిశుద్ధాత్మ ప్రభావం మరియు శక్తి కార్యరూపంలో ఉన్నాయి. అయితే అప్పుడాయన ఇక్కడ నివసించలేదు. మన ప్రభువు పరలోకానికి ఆరోహణుడై మహిమపర్చబడిన తర్వాత పరిశుద్ధాత్మ ఈ లోకంలోనికి వచ్చాడు. ఆయన అప్పటినుండి ఇక్కడే నివసిస్తున్నాడు. ఆయన ఇక్కడే ఉన్నాడని మనకు వెల్లడిచేయబడిన సత్యాన్ని మనం అంగీకరించాలి. పరిశుద్ధాత్మను స్వాగతించడం మరియు ఆయణ్ణి మన జీవితంలోకి చేర్చుకోడం విశ్వాసి జీవితంలో ఒక నిరంతర ప్రక్రియ. మనం పరిశుద్ధాత్మను పొందడంద్వారా ఉజ్జీవాన్నిచ్చే జీవశక్తిని ఆరోహణుడైన మన ప్రభువునుండి పొందుతున్నాం.

ఆరోహణుడైన క్రీస్తు అనుగ్రహించే శక్తిని మనం పరిశుద్ధాత్మద్వారా పొందుతున్నాం. ఈ జీవశక్తి మనల్ని క్రీస్తు స్వరూపంలోకి మార్చుతుంది. పరిశుద్ధ లేఖనాల ప్రకారం పరిశుద్ధాత్మ బాప్తిస్మానికి యేసు క్రీస్తుతో మన అనుభవానికి సంబంధం వుంది. ఈ రెండూ వేర్వేరు కావు. పరిశుద్ధాత్మ ఆరోహణుడైన క్రీస్తుగురించి సాక్ష్యమిస్తున్నాడు. కాబట్టి మనం యేసు క్రీస్తును పరిశుద్ధాత్మను విభేదించి చూడకూడదు.

పరిశుద్ధాత్మ బాప్తిస్మం నిన్ను భవిష్యత్తులోకి లేదా నిత్యత్వంలోకి నెట్టివేయదు. పరిశుద్ధాత్మ బాప్తిస్మం నీకొక అత్యద్భుత సత్యాన్ని వాస్తవీకరిస్తుంది. "అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" (యోహాను 17:3). ఆయణ్ణి తెలుసుకోడం ప్రారంభించు; ఆయనగురించి తెలుసుకోడంలో ప్రారంభమేగానీ ముగింపు ఉండదు.



మే 28

## ఆక్షేపణల్లేని ప్రకటన

"ఆ దినమున మీరు దేనిగూర్చియు నన్ను అడుగరు" (యోహాను 16:23)

"ఆ దినము" ఎప్పుడు? ఆరోహణుడైన మన ప్రభువు మనల్ని తండ్రితో ఏకంచేసిన రోజే ఆ రోజు. యేసు తన తండ్రితో ఏకమై ఉన్నట్టుగా మనం కూడా ఆయనతో ఏకమై ఉన్న "ఆ దినమున మీరు దేనిగూర్చియు నన్ను అడుగరు" అని ఆయన చెబుతున్నాడు. పునరుత్థానుడైన యేసు జీవం నీలో ప్రస్ఫుటంగా వెల్లడయ్యేవరకు నీలో ఎన్నో సందేహాలు సంశయాలు ఆక్షేపణలు ఉంటాయి. అయితే తర్వాత అవన్నీ ఉండవు. నీవాయణ్ణి అడగడానికి ఎటువంటి ప్రశ్నలుండవు. నీకు పునరుత్థానుడైన యేసులో సంపూర్ణ విశ్వాసం ఉంది కాబట్టి ఈ విశ్వాసం నిన్ను దేవుని ఉద్దేశంతో ఆయన సంకల్పంతో ఏకం చేస్తుంది. అటువంటి జీవితం ఉందా నీకు? లేనట్లయితే నీవెందుకలా జీవించడంలేదు?

"ఆ దినము" నాడు కూడా నీకు ఎన్నో విషయాలు నీ జ్ఞానానికి నీ వివేచనకు అంది ఉండకపోవచ్చు. అయితే అదేమీ నీకు దేవునికి మధ్య అడ్డుగా నిలవదు. ఈ రోజున నీవు ఆయణ్ణి ఏమీ అడగవు. "ఆ దినమున మీరు దేని గూర్చియు నన్ను అడుగరు". ఎందుకంటే దేవుడు తన చిత్తానుసారం నీకు వెల్లడిచేస్తాడని నీలో నిశ్చయత ఉంది. యోహాను 14:1 వచనంలోని విశ్వాసం మరియు సమాధానం నీ మనోవైఖరి కావాలి. అప్పుడు నీవడిగేందుకు ప్రశ్నలుండవు. నీకేదైనా అగమ్యగోచరంగా ఉన్నట్లయితే, అది నీకు దేవునికి మధ్య ఆటంకంగా ఉన్నట్లయితే దానిగురించి నీ మనస్సును వివరణ కోరవద్దు. సమస్య ఎక్కడుందో నీ అంతరాత్మలో అన్వేషించు. నీ అంతరాత్మ యేసుకు లోబడినట్లయితే నీ మట్టుకు నీవే స్పష్టంగా అర్థంచేసుకోగలవు. అప్పుడు నీకు తండ్రికి మధ్య ఉన్న ఆటంకాలు తొలగిపోయి నీవు సంపూర్ణ విశ్వాసంతో సంపూర్ణ సమాధానంతో కొనసాగగలవు. ఆ రోజున నీ తండ్రీ నీవూ ఏకమై ఉంటారు కాబట్టి నీలో ఎటువంటి ఆక్షేపణలుండవు. ఆ రోజెప్పుడు?

మే 29

## నిష్కాపట్యమైన అన్యోన్యత

"ఆ దినమందు మీరు నా పేరట అడుగుదురుగాని ... తండ్రి తానే మిమ్మును ప్రేమించుచున్నాడు" (యోహాను 16:26,27)

"ఆ దినమందు మీరు నా పేరట అడుగుదురుగాని " - "నా పేరట" అంటే దేవుని స్వభావాన్ననుసరించి అని అర్థం; అంతేగానీ నామకార్థంగా యేసు పేరు నుపయోగించడం కాదు. యేసుతో అన్యోన్య సహవాసంలో ఉన్నవారు ఆయన స్వభావాన్ననుసరించి దేవుణ్ణి అడుగుతారని అర్థం. "ఆ దినమందు" అంటే ఎప్పుడో భవిష్యత్కాలానికి సంబంధించిన రోజు కాదు గానీ యేసు స్వభావాన్ని మనం కలిగి ఉన్న రోజని అర్థం. "తండ్రి తానే మిమ్మును ప్రేమించుచున్నాడు" - యేసుతో మన అన్యోన్య సహవాసం పరిపూర్ణమైన సహవాసమని ఎటువంటి షరతులకు తావులేని సంపూర్ణ సహవాసమని తండ్రి ప్రేమ రుజువు చేస్తోంది. మనకు ఎక్కడనుండి ఎటువంటి కష్టాలు ఇబ్బందులు తలెత్తవని మరియు మనం బాధలనుండి మినహాయించబడ్డామని ప్రభువు చెప్పడంలేదు. అయితే తండ్రి ప్రేమను మనం అర్థం చేసుకోగలం కాబట్టి పరిశుద్ధాత్మ బాప్తిస్మంద్వారా తండ్రి మన హృదయాలకు పరలోకసంబంధమైన సంగతుల్ని బోధించి మనకు ఔన్నత్యాన్నిస్తాడు.

"మీరు తండ్రిని నా పేరట ఏమి అడిగినను" (యోహాను 16:23) - మనం తండ్రిని అడిగే రోజు సమాధానంతో నిండిన రోజు; దేవునికి మనకు మధ్య అన్యోన్య సహవాసం ఉన్న రోజు. యేసు తన తండ్రి సమక్షంలో నిందారహితుడిగా నిష్కాపట్యంతో నిలిచినట్టుగా మనం కూడా పరిశుద్ధాత్మ బాప్తిస్మంద్వారా ఆయన అద్భుతశక్తిని ప్రభావాన్ని పొంది ఆయనతో అన్యోన్య సంబంధాన్ని కలిగి ఉన్న రోజు. యేసు తన తండ్రితో ఏకమై ఉన్నట్టుగా మనం కూడా "ఏకమై యుండవలెనని నీవు నాకు అనుగ్రహించిన మహిమను నేను వారికి ఇచ్చితిని" (యోహాను 17:22) అని ఆయన మనతో చెప్పే రోజది.

"ఆయన మీకు అనుగ్రహించునని" (యోహాను 16:23) - మనం యేసు నామంలో అడుగుతున్నాం కాబట్టి తండ్రి యేసు నామాన్నిబట్టి మనం అడిగేవాటినన్నిటినీ అనుగ్రహిస్తాడు. యేసు నామంలో ప్రార్థించడం ఎంత గొప్ప అవకాశం! యేసు తన పునరుత్థానంద్వారా ఆరోహణంద్వారా తాను పంపిన పరిశుద్ధాత్మద్వారా మనల్ని ఔన్నత్యానికి నడిపిస్తున్నాడు. యేసు అనుగ్రహించిన ఔన్నత్యంలో ఉన్న మనం ఆయన నామంలో కేవలం నామకార్థంగా కాక ఆయన స్వభావాన్ననుసరించి ప్రార్థించాలి. ఇది మనకు పరిశుద్ధాత్మ అనుగ్రహించిన వరం! "మీరు తండ్రిని నా పేరట ఏమి అడిగినను ఆయన మీకు అనుగ్రహించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 16:23) అని యేసు వాగ్దానం చేస్తున్నాడు. యేసు మాటలు ఆయన సర్వోన్నత స్వభావానికి సాక్ష్యాలు!

మే 30

**అవును .... కానీ!**

"ప్రభువా, నీ వెంట వచ్చెదను గాని" (లూకా 9:61)

దేవుడు నీకొక అంతులేని పరీక్ష పెట్టినట్లయితే ఏం చేస్తావు? నీకు ఇష్టంలేని పనిని దేవుడు నీకు అప్పగించినట్లయితే ఏం చేస్తావు? చేయగలవా? లేక, "నేను చేయను?" అని చెబ్తావా? "నేను ఈ విషయంలో దేవునికి విధేయత చూపి చేస్తాను ... కానీ" అని చెబ్తావా? లేక, "నేను దేవునికి లోబడి చేస్తాను గానీ ఇలా చేయడం నాకు పెద్దగా ఇష్టంలేదు" అని చెబ్తావా? లేక, "నాకు తెలియనిదాన్ని నేనెలా చేయగలను?" అని చెబ్తావా? సాధారణ జీవితంలో పరీక్షలెదురవుతుంటాయి; కొంతకాలానికి ఇవి మనకు అలవాటయిపోతాయి. పరీక్ష విషయంలో మనలో ఒక దృఢమైన అభిప్రాయం ఏర్పడుతుంది. ఆధ్యాత్మిక విషయాల్లో కూడా అంతే. ఆధ్యాత్మిక విషయాల్లో నీకు పరీక్షలెదురైనప్పుడు మొదట్లో అవి నీకు ఇష్టంలేకపోయినా రాను రానూ అవి అలవాటయి, నీకు తెలియకుండానే నీవు దేవునికి పూర్తిగా లోబడతావు.

మనం భౌతిక జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎంత సాహసోపేతంగా ఎదుర్కొంటామో ఆధ్యాత్మికజీవితంలో ఎదురయ్యే సవాళ్లను కూడా అంతే సాహసోపేతంగా ఎదుర్కోవాలి. భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉన్నప్పటికీ సాసంతో ముందడుగు వేయాలి. ఇది మనం విశ్వాసంతో వేసే సాహసపుటడుగు. ఒక సారి అడుగు ముందుకు వేసిన తర్వాత ఇది నీవు చేయడానికి యుక్తమైన పనేనని గ్రహించగలవు.

లౌకిక జ్ఞానాన్ననుసరించి చూచినట్లయితే యేసు మాటలు విపరీతార్థంలో కనిపించవచ్చేమోగానీ విశ్వాసంతో చూచినప్పుడు అవి నిత్యమైన దివ్యవచనాలని గ్రహించగలవు. దేవుణ్ణి దృఢంగా నమ్ము; సంపూర్ణంగా నమ్ము! అప్పుడు నీవాయనకొరకు సాహసోపేతమైన కార్యాల్ని చేయగలవు.

మే 31

## దేవునికి ప్రథమస్థానాన్నివ్వు!

“ఆయన తన్ను వారి వశము చేసికొనలేదు. ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు” (లూకా 2:24)

మొదటగా దేవునిమీద ఆధారపడు. మన ప్రభువు మనిషిమీద ఎన్నడూ ఆధారపడలేదు. అయినా ఆయనెన్నడూ మనుషుల్ని ద్వేషించలేదు, ఎవరినీ అనుమానించలేదు, ఎవరి విషయంలోనూ సహనం కోల్పోలేదు. ఎందుకంటే ఆయన తన తండ్రిమీద ఆధారపడ్డాడు. మనుషులపట్ల దేవునికున్న కృపమీద ఆయన అపరిమితమైన అచంచలమైన నమ్మకాన్నుంచాడు. మనం మనుషులమీద ఆధారపడినట్లయితే మనకు చివరకు మిగిలేది నిరాశే. ఎందుకంటే మనుషులవలన మనకు ఆశాభంగం కలుగుతుంది. ఎందుకంటే మనుషులెవరిలోనూ పరిపూర్ణత ఉండదు! కాబట్టి మనుషుల్ని కాక దేవుని కృపనే నమ్ము!

దేవుని చిత్తానికి ప్రథమ స్థానాన్నివ్వు. “నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నానని చెప్పుచున్నాడు” (హెబ్రీ 10:9).

నేడు మనం తండ్రి చిత్తానికి ప్రథమస్థానాన్నివ్వక అన్యవిషయాలకు ప్రథమ స్థానాన్నిస్తున్నాం. అయితే మన ప్రభువు తన తండ్రి చిత్తానికి విధేయుడయ్యాడు. నేడు మనం ఒకటే మాటను వింటున్నాం: “అన్యులు నశించిపోతున్నారు. మనం వెళ్లి వాళ్లకు యేసుగురించి చెప్పాలి”. అయితే మనం ముందుగా దేవుని చిత్తం మరియు ఆయన కోరుకున్నది మన వ్యక్తిగత జీవితాల్లో నెరవేరుతున్నాయో లేదో పరీక్షించుకోవాలి. “మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడని వారితో చెప్పెను” (లూకా 24:49) అని మన ప్రభువు చెప్పాడు. దేవుడు కోరుకున్నవాటిని జరిగించడానికి, ఆయన చిత్తాన్ని నెరవేర్చడానికి మనం ముందుగా ఆధ్యాత్మిక క్రమశిక్షణ నలవర్చుకోవలసివున్నాం. ముందుగా మనలో ఆయన చిత్తం ఆయన ఉద్దేశాలు నెరవేరిన తర్వాత ఆయన తన చిత్తాన్ని తన ఉద్దేశాల్ని ఇతరులపట్ల నెరవేర్చడానికి మనకు అవకాశాల్నిస్తాడు.

దేవుని కుమారుడికి ప్రథమ స్థానాన్నివ్వు. “ఈలాటి యొక బిడ్డను నా పేరట చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును” (మత్తయి 18:6).

దేవుడు మనకొరకు ఈ లోకంలో నరావతారిగా జన్మించాడు. ఆయన మనకొరకు తననర్పించుకున్నాడు. బేత్లేహేములో శిశువుగా జన్మించిన యేసు నీ హృదయాన్ని ఆయనకొరకు బేత్లెహేముగా కోరుకుంటున్నాడు. దేవుని కుమారుని జీవానికి నాలో స్థానాన్నిస్తున్నానా? ఆయన జీవం నాలో పెంపొందుతోందా? దేవుడు అంతిమంగా కోరుకొనేది ఆయన కుమారుడైన యేసు నాలో వెల్లడి కావడమే!

జూన్ 1

## అధైర్యంతో నిండిన ప్రశ్న

“ఆయన -నరపుత్రుడా, యెండిపోయిన యీ యెముకలు బ్రదుకగలవా? అని నన్నడుగగా .... ” (యెహెజ్కేలు 37:3)

ఒక పాపి పరిశుద్ధుడిగా మారగలడా? అస్తవ్యస్తమైన జీవితం సవ్యంగా మారగలదా? “ప్రభువా, యెహోవా అది నీకే తెలియుననీ ...” చెప్పిన యెహెజ్కేలు పలుకులే ఈ ప్రశ్నలకు యుక్తమైన జవాబు. నీ ఆధ్యాత్మిక జ్ఞానంతో ముందుకు దూసుకువెళ్లి “అవును, మారగలడు! ఎక్కువసేపు బైబిలు చదవడం, ఏకాంత ధ్యానం, మరియు ప్రార్థన ఉన్నట్లయితే ఈ మార్పు సాధ్యమని నాకు తెలుసు” అని చెప్పవద్దు.

విశ్వాసంతో దేవునిమీద ఆధారపడడం కష్టంగానీ, మనకు సాధ్యమయ్యే పనులు చేయడం సులువుగానే ఉంటుంది. మనం మన చుట్టూ చురుగ్గా సాగుతున్న పనుల్ని చూస్తూ మనలో చోటుచేసుకునే ఆకస్మిక భయాల్నే ప్రేరణలుగా భ్రమపడ్తున్నాం. అందుకే మనం దేవునికొరకు పనిచేస్తున్నవారిని అనేకులను చూస్తున్నప్పటికీ దేవునితోబాటు పనిచేస్తున్నవారిని కొద్దిమందిని మాత్రమే చూస్తున్నాం. మనం దేవునికొరకు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ మనలో అనేకుల్లో ఆయనపట్ల యథార్థతతో నిండిన విశ్వాసం లేదు. నాకు అసాధ్యమైన పనిని దేవుడు నాలో జరిగిస్తాడని, నా ద్వారా జరిగిస్తాడని నేను యథార్థంగా నమ్ముతున్నానా? ఇతరులగురించి నాలో ఉన్న నిరాశాధోరణి దేవుడు నాలో జరిగించినదాన్ని నేను గుర్తించకపోవడంమూలంగా ఏర్పడినదేనా? దేవుని శక్తినీ, ఆయన ఆధిపత్యాన్నీ నా స్వంత జీవితంలో అనుభవించిన నేను అదే శక్తినీ అదే ఆధిపత్యాన్నీ ఇతరుల జీవితాల్లో చూడలేనా? నాలో అసలు ఆధ్యాత్మిక క్రియ జరిగిందా? నాలో ఉన్న భయాందోళనలస్థాయి నా ఆధ్యాత్మిక అనుభవశూన్యతకు సరిసమానంగా ఉందా?

“నా ప్రజలారా, మీరున్న సమాధులను నేను తెరచెదను ... ” (యెహెజ్కేలు 37:12). మనం దేవునికి దూరంగా జీవిస్తున్నప్పుడు మానవ స్వభావమెలా ఉంటుందో దేవుడు నీకు చూపించాలనుకుంటున్నట్లయితే నీ స్వభావాన్నే ఆయన నీకు చూపిస్తాడు. నీవు దేవుని కృపకు దూరంగా ఉన్నప్పుడు నీవెలా ఉన్నావనే దర్శనాన్ని దేవుని ఆత్మ నీకు చూపించినప్పుడు మాత్రమే నీవెంత ఘోరపాపివో నీవు గ్రహించగలవు. దేవుని ఆత్మ నీలో కార్యం జరిగిస్తున్నప్పుడు మాత్రమే నీవెంత ఘోరపాపివో నీవు గ్రహించగలవు. అప్పుడు నీవు నిన్ను మించిన ఘోరపాపి మరెవరూ లేరని గ్రహిస్తావు. దేవుడు నా “సమాధి”ని తెరచి “నాలోవున్నవాటిని” చూపించాడు. “నాయందు ... మంచిది ఏదియు నివసింపదని” (రోమా 7:18) నాకు గ్రాహ్యమయ్యింది. దేవుని కృపకు దూరంగా ఉన్నప్పుడు మానవస్వభావమెలా ఉంటుందో ఆయన బిడ్డలకు దేవుని ఆత్మ సదా వెల్లడి చేస్తూ ఉంటాడు.

జూన్ 2

## నీవు దేని గురించైనా వదలని ఆలోచనల్లో నిమగ్నమై ఉన్నావా?

"యెహోవాయందు భయభక్తులు గలవాడెవడో " (కీర్తనలు 25:12)

నీవు దేనిగురించైనా వదలని ఆలోచనల్లో నిమగ్నమై ఉన్నావా? బహుశా నీవు "లేదు!" "అలా లేనే లేదు!" అని జవాబు చెబ్తావేమో! అయితే మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక విషయంగురించి లేదా మన స్వంత విషయాలగురించి వదలకుండా ఆలోచిస్తూనే ఉంటాం. అయితే మనం అన్యవిషయాల గురించి కాక దేవునిగురించి వదలకుండా ఆలోచించాలని కీర్తన రచయిత సెలవిస్తున్నాడు. కేవలం ఆలోచనలు మట్టుకే కాదు; క్రైస్తవ జీవితానికి కేంద్రం దేవుడే కాబట్టి మన అంతరంగం మరియు మన బాహ్యజీవితం దేవుని సన్నిధితో సంబంధం కలిగి ఉండాలి. అనుద్దేశపూర్వకంగానే అయినప్పటికీ ఒక చిన్నబిడ్డ ఆలోచనలన్నీ తల్లిచుట్టూ ఉంటాయి. అయితే ఈ విషయం బిడ్డకు తెలియకపోవచ్చేమోగానీ ఆ బిడ్డకు బాధ కలిగినప్పుడు మాత్రమే తల్లితో ఆ బిడ్డకున్న అవినాభావసంబంధం వెల్లడవుతుంది. ఆ విధంగానే "మనమాయనయందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగి యున్నాము ... " (అ.కా. 17:28) అని పౌలు సెలవిచ్చినట్టుగా మనం కూడా దేవునితో ఏకమై ఉండాలి. మన సమస్తమూ దేవునిలో నిమగ్నమై ఉన్నప్పుడు ఈ నిమగ్నత మనం వేసే ప్రతి అడుగులోనూ కనబడాలి.

మన జీవితం దేవునితో ఏకమై ఉన్నట్లయితే ఏ చింతలూ ఏ శ్రమలూ ఏ దిగుళ్లూ మనల్ని ఏమీ చెయ్యలేవు. మన ప్రభువు మనల్ని కలవరపడవద్దని ఎందుకు మాటిమాటికీ చెప్పాడో మనకప్పుడు గ్రాహ్యమవుతుంది. దేవుడు మనల్ని ఆవరించి ఉన్నప్పుడు మనమాయణ్ణి నమ్మకుండా ఉండగలమా? మన జీవితం దేవునిమీద నిమగ్నమై ఉన్నప్పుడు శత్రువు మనపై చేసే దాడులన్నిటినీ త్రిప్పికొట్టగల శక్తి మనకు దేవునినుండి లభిస్తుంది.

"అతని ప్రాణము నెమ్మదిగా ఉండును అతని సంతానము భూమిని స్వతంత్రించుకొనును" (కీర్తన 25:13) - దేవుడు మనకనుగ్రహించే ఈవి యిదే. "మీ జీవము క్రీస్తుతోకూడ దేవునియందు దాచబడి ... " (కొలొస్స 3:2-3) ఉన్నట్లయితే శ్రమల్లో కష్టనష్టాల్లో నిందాపనిందల్లో దేవుడు నీకు ధైర్యంచెబ్తూ నిన్ను కాపాడతాడు. అయితే దేవునితో మనకున్న ఈ అద్భుతమైన అన్యోన్యతను ఆయనతో మనకున్న సామీప్యతను కొన్ని సార్లు మనకు మనమే దూరం చేసుకుంటున్నాం. "దేవుడు మనకు ఆశ్రయమును దుర్గమునై యున్నాడు" (కీర్తనలు 46:1) కాబట్టి మన జీవితం దేవునిమీద నిమగ్నమై ఉన్నప్పుడు ఆయన కాపుదలనుండి మనల్ని ఏదీ విడదీయలేదు.



జూన్ 3

## యెహోవా నిగూఢత

"యెహోవా మర్మము ఆయనయందు భయభక్తులు గలవారికి తెలిసియున్నది" (కీర్తనలు 25:14)

నిజమైన స్నేహితుడెవరు? తన మనసులో దాగిన బాధల్ని నీతో పంచుకొనే వ్యక్తియేనా? కాదు! తన మనసులోని సంతోషాల్ని నీతో పంచుకొనేవాడే నిజమైన స్నేహితుడు. నీ స్నేహితుడు అరమరికల్లేకుండా తన మనసులోని సంతోషాల్ని నీతో పంచుకున్నప్పుడు మాత్రమే మీ ఇద్దరిమధ్య నిజమైన స్నేహం వుందని అర్థం. చాలామంది తమ కష్టాలగురించి బాధలగురించి నీదగ్గర ఏకరువు పెట్టుండవచ్చు. అయితే వాళ్లు నీకు నిజమైన ఆత్మీయులనడానికి గుర్తు వాళ్లు తమ గుండెల్లోని సంతోషాల్ని నీతో పంచుకోడం మాత్రమే. దేవుడు తన సంతోషాల్ని నీతో పంచుకోడానికి ఆయణ్ణి అనుమతిస్తున్నావా? లేక, ఎప్పుడూ నీవాయనతో నీ కష్టాలన్నీ ఏకరువుబెడ్తూ ఆయన నీతో మాట్లాడడానికి సమయం లేకుండా చేస్తున్నావా? మన విశ్వాస జీవితం ప్రారంభంలో మనమెప్పుడూ దేవునికి ఏదో ఒక విషయంగురించి మనవిచేసి ఉంటాం. అయితే ఆధ్యాత్మికంగా మనం పరిణతి చెందు తున్నప్పుడు దేవుడు మనతో అన్యోన్యతను ఆత్మీయతను కోరుకుంటున్నాడని, మనమాయన ఉద్దేశాల్ని గ్రహించాలని కోరుకుంటున్నాడని తెలుసుకుంటాం. దేవుని నిగూఢమైన విషయాల్ని మనం గ్రహించగలిగేలాగా "నీ చిత్తము ... నెరవేరునుగాక " (మత్తయి 6:10) అని యేసు మనకు నేర్పించిన ప్రార్థనతో ఏకీభవిస్తున్నామా? దేవుడు మనకనుగ్రహించే గొప్ప ఆశీర్వాదాలు మనల్ని ఆయనకు సన్నిహితుల్ని చేయవుగానీ మనల్ని ఆయనకు దగ్గరచేసే చిన్న చిన్న విషయాలే మనకు ఆయనకు మధ్య అన్యోన్యతను పెంపొందిస్తాయి. మన జీవితంలో దేవునికి తెలియనిదంటూ ఏమీ లేదు.

"యెహోవాయందు భయభక్తులు గలవాడెవడో వాడు కోరుకొనవలసిన మార్గమును ఆయన వానికి బోధించును" (కీర్తన 25:12). దేవుడు మనల్ని నడిపిస్తున్నాడనే నిశ్చయత ముందుగా మనలో ఉండాలి. మనం ఆత్మసంబంధమైన విషయాల్లో క్రమక్రమంగా వృద్ధి చెందుతున్నప్పుడు మనకు దేవునిగురించి సంపూర్ణంగా తెలుస్తుంది కాబట్టి ఆయన చిత్తమేమిటని మనం దేవుణ్ణి అడగవలసిన అవసరం వుండదు. ఎందుకంటే దేవుని చిత్తం తప్ప మరో చిత్తం గురించి మనకు ఆలోచనే ఉండదు. రక్షణానుభవం మరియు పరిశుద్ధమైన జీవితం ఉన్నట్లయితే మన జీవితంలోని నిర్ణయాలన్నీ దేవుని చిత్తప్రకారమే ఉంటాయి. ఆయన కోరుకొననిదాన్నేదైనా మనం కావాలనుకుంటున్నట్లయితే దాన్ని దేవుడెలాగైనా ఆపివేస్తాడు. దేవునికిష్టంలేని దాన్నేదైనా మనం కోరుకుంటున్నప్పుడు ఆయన మన హృదయంలో ఏదో ఒక సంశయాన్ని పుట్టిస్తాడు; లేదా, ఏదో ఒక ఆటంకం కలుగుతుంది. మనం ఈ హెచ్చరికను గుర్తించాలి. ఈ హెచ్చరికను నీవు గుర్తించినట్లయితే దేవునికిష్టంలేని పని చేయకు. నీ హృదయంలో చైతన్యస్పృహ కలిగినప్పుడు వెంటనే ఆగిపో. "నేనెందుకు దీన్ని చేయకూడదు?" అని నీలో నీవే తర్కించవద్దు. మనమేం నిర్ణయించుకోవాలో దేవుడే మనకు బోధిస్తాడు. మన ఇంగితజ్ఞానం కూడా ఆయన ఆధీనంలోనే ఉంది. మనమాయన బోధకు లోబడి ఆయన నడిపింపు ప్రకారం నడుస్తున్నట్లయితే "ప్రభువా, ఇప్పుడు నీ చిత్తమేమిటి?" అని ఆయన ఆత్మను పదే పదే విసిగించం.

## ఎన్నడూ మనల్ని ఎడబాయని దేవుడు

"నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను ..." (హెబ్రీ 13:5)

నా ఆలోచనలు ఎటు నడుస్తున్నాయి? నేను దేవునివైపు చూస్తున్నానా? లేక, నాలో అంతర్లీనంగా ఉన్న భయాలవైపు చూస్తున్నానా? దేవుని మాటల్ని నేను కేవలం చెప్పేవాడిగానే ఉన్నానా? నిజంగా ఆయన మాటల్ని నేను వింటున్నానా? ఆయన మాటలపట్ల సానుకూలంగా స్పందిస్తున్నానా? ఆయన మనతో ఏం చెబుతున్నాడో చూద్దామా: "నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను ...". దేవుడు మనకు అభయాన్నిచ్చాడు కాబట్టి మనం ధైర్యంతో "ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయ గలడు?" (హెబ్రీ 13:6) అని చెబ్దాం!

"నిన్ను ఏమాత్రమును విడువను" - మనలో పాపం స్వార్థం మూర్ఖత్వం అశ్రద్ధ ఉన్నాయి. అయినా దేవుడు మనల్నెన్నడూ విడిచిపెట్టకుండా మనకొరకు యెదురు చూస్తున్నాడు. మనకు నిత్యం తోడుగా ఉన్న దేవుడు నీతో "నిన్ను ఎన్నడును ఎడ బాయను" అని చెప్పడానికి ఆయణ్ణి అనుమతిస్తున్నావా? దేవునినుండి లభించే ఈ నిశ్చయతపట్ల నీవింకా సానుకూలంగా స్పందించనట్లయితే, ఆయన మాటల్ని మళ్లీ విను.

"నిన్ను ఎన్నడును ఎడబాయను" - సవాళ్లులేని సాదాసీదా జీవితం, నిర్విరామంగా కొనసాగే నిత్యకృత్యాలు కొన్ని సార్లు బ్రతుకు భారమనిపించేలా చేస్తాయి; పెద్ద సమస్యలంటూ ఏవీ ఉండవు, దిశానిర్దేశం చేసే దర్శనం కూడా ఉండదు, అద్భుతాలుండవు, ఆశ్చర్య కార్యాలుండవు. సాదాసీదాగా జీవితం కొనసాగుతున్నప్పుడు దేవుడు మనల్ని మర్చిపోయాడని మనం భావించడం కద్దు. ఇటువంటి పరిస్థితుల్లో దేవుడు నీతో "నిన్ను ఎన్నడును ఎడ బాయను" అని మాట్లాడడం వినగలుగుతున్నావా?

దేవునినుండి అనూహ్యమైన అద్భుతాన్ని మనం యెదురుచూడడం సహజమే. భవిష్యత్తులో మనం చేయబోయే అసాధారణమైన పనులకొరకు దేవుడు మనల్ని సిద్ధం చేస్తున్నాడని ఆలోచిస్తూ ఉంటాం. అయితే మనమాయన కృపలో వర్ధిల్లే కొలదీ జీవితం సాదాసీదాగా గడిచినా, అనూహ్యమైన అద్భుతాలతో గడిచినా ప్రతి దాంట్లోనూ దేవుడు తనకు మహిమ తెచ్చుకుంటాడని తెలుసుకుంటాం. దేవుడనుగ్రహించిన నిశ్చయతను నీవు నమ్మినప్పుడు ఆయన నీకు అత్యద్భుతమైన శక్తిని అనుగ్రహిస్తాడు. ఆయన మనకనుగ్రహించిన నిశ్చయతనుబట్టి కష్టాల్లో సైతం ఆనందగీతాల్ని పాడగలం; సాదాసీదాగా గడిచే నిరాసక్త జీవితంలో సైతం మహోన్నతుడైన దేవుణ్ణి మహిమ పర్చగలం!

జూన్ 5

## దేవుడనుగ్రహించిన అభయం

"ఆయనయే చెప్పెను గదా ... అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము" (హెబ్రీ 13:5,6)

నా నిశ్చయతకు మూలం దేవుడు నాకనుగ్రహించిన అభయం. "నిన్ను ఏ మాత్రమును విడువను" అని దేవుడు చెబుతున్నాడు కాబట్టి నేను ధైర్యంగా "ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు?" అని చెప్ప గలను. అందరికీ అర్థమయ్యేలా చెప్పాలంటే నాకు దేవుని నిశ్చయత ఉంది కాబట్టి నేను భయాందోళనల్లో మునిగిపోనక్కర్లేదని అర్థం. అంటే నేను భయమనే శోధనకు గురి కానని కాదు గానీ దేవుడు నాకు సహాయుడనే ధైర్యవచనాల్ని నేను జ్ఞాపకం చేసుకుంటున్నానని అర్థం; తండ్రి మాట జవదాటని పిల్లవాడు ధైర్యంగా ఉన్నట్టు నేను ధైర్యంగా ఉన్నానని అర్థం. భయాందోళనలు మనస్సులోకి ప్రవేశించినప్పుడు అనేకుల్లో విశ్వాసం తడబడుతుంది; దేవుడు అభయాన్నిచ్చే సహాయుడని మర్చిపోవడం సహజం. దాంతో వారు ఆధ్యాత్మికంగా ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. దేవుడిచ్చే అభయం మాత్రమే మన జీవితాల్లోంచి భయాందోళనల్ని తొలగించగలదు.

నీవెందుకు భయపడుతున్నావు? నీలో భయాందోళనలకు కారణమేమిటి? కారణాలెన్నైనా ఉండవచ్చు; నీవు మాత్రం పిరికివాడివి కావు! భయాందోళనల్ని యెదుర్కొనే స్థైర్యం నీలో ఉంది. అయినా నీవెందుకో భయపడుతున్నావు. నిన్ను ఒంటరితనం భయపెట్టిన క్షణంలో, లేదా నీకు సహాయం చేసేవారెవరూ లేరని నీ మనస్సులోకి ఆలోచన వచ్చిన వెంటనే "ప్రభువు నాకు సహాయుడు" అని నీ మనస్సుకు నీవే ధైర్యం చెప్పుకో. నీవు మాట్లాడానికి ముందుగా దేవుని మాటలు వినడానికి సిద్ధంగా ఉన్నావా? లేక, అన్నీ నీవే మాట్లాడుతూ నీ మాటలకు దేవుని మాటల్ని పొంతనచేసి నిన్ను నీవే బుజ్జగించుకుంటున్నావా? దేవుడిచ్చే అభయాన్ని ఆనందించు; ఆత్మస్థైర్యంతో "నేను భయపడను" అని చెప్పు. ఏ కష్టమైనా ఏ నష్టమైనా సరే నీవు భయపడవలసిన పనిలేదు; ఎందుకంటే "నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను ..." అని చెప్పిన దేవుడు నీకు నిత్యం తోడుగా ఉన్నాడు.

దేవుడు పలికిన ధైర్యవచనాలకు, మన స్వంత మాటలకు ఆలోచనలకు మధ్య మన దౌర్బల్యం అడ్డుగా ఉంది. మన దౌర్బల్యంముందు మనకెదురైన కష్టాలు సమస్యలు పెద్ద కొండల్లాగా కనిపిస్తాయి. ఆ కొండలముందు చిన్న మిడతల్లాగా ఉన్న మనం దేవుడు సహాయం చేయడంలేదని ఆవేదన చెందుతుంటాం. ఇటువంటి క్షణాల్లోనే "నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను ..." అని దేవుడు పలికిన నిశ్చయతావచనాల్ని మనం జ్ఞాపకం చేసుకోవాలి. దేవుని అభయవచనాల్ని విని మనం ఆనందంతో ఆయణ్ణి కీర్తిస్తున్నామా? "ప్రభువు నాకు సహాయుడు" అని ఏ వేళలోనైనా ధైర్యంతో చెప్పగలమా? లేదా, భయాందోళనలకు లొంగిపోతున్నామా?

జూన్ 6

## దేవుడు నీలో చేస్తున్న కార్యాన్ని నీవితరులపట్ల చేస్తున్నావా?

" ... మీ సొంతరక్షణను కొనసాగించుకొనుడి ... మీలో కార్యసిద్ధి కలుగ జేయువాడు దేవుడే" (ఫిలిప్పీ 2:12,13)

నీ మనస్సు దేవునితో ఏకీభావం కలిగి ఉండవచ్చు; అయితే నిన్ను అశక్తుణ్ణి చేసే స్వభావం నీ శరీరంలో ఉంది. ఇది నీలో ఉన్నంతకాలం నీవు చేయాలనుకున్న పనిని నీవు చేయలేవు. దేవుడు మొదటిసారి నీ అంతరాత్మను తాకినప్పుడు నీ మనస్సాక్షి మేలు కొంటుంది; నీలో మనోసంకల్పం మొదలవుతుంది. అప్పుడు నీ మనస్సు దేవుని మనస్సుతో ఏకీభవిస్తుంది. అయినా నీవు "నా మనస్సాక్షి దేవుని చిత్తానుసారం ఉన్నదో లేదో" అని మధన పడుతుంటావు. "నేను దేవునికి నిజంగా లోబడుతున్నానా" అని ఆలోచించేలా నిన్ను పురి కొల్పే కారణాలు వాస్తవానికి నీ మనోసంకల్పంముందు అతిసులువుగా వీగిపోయేవే! అయితే వక్రత, మొండితనంవంటి దుర్లక్షణాలు దేవుని చిత్తాన్ని ప్రతిఘటిస్తాయి. అయితే మనిషిలో అత్యంత సున్నితమైనది మరియు సూక్ష్మ మైనది  పాపం కాదుగానీ అతని మనోసంకల్పమే.

నరుడు దేవుని సృష్టికే మకుటం; అయితే మకుటానికే మకుటం నరునిలోని మనస్సాక్షి. అయితే నరునిలోకి  ప్రవేశించిన పాపానికి సర్వత్రా చొచ్చుకుపోయే లక్షణం వుంది. అయితే మనిషి తిరిగిపుట్టినప్పుడు అతనిలో దేవుని చిత్తం కార్యరూపం దాల్చుతుంది. అప్పుడతని చిత్తానికి మనోసంకల్పానికి మూలం సర్వశక్తిమంతుడైన దేవుడే. అతని మాట మనస్సు క్రియ అన్నీ దేవుణ్ణి సంతోషపెట్టేవిగా ఉంటాయి; "మీరు ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయాసంకల్పము నెర వేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే". దేవుడు నీలో జరిగించే కార్యాల్ని నీవు తదేకదృష్టితో అమితశ్రద్ధతో ఇతరులపట్ల జరిగించినప్పుడు దేవుడు కోరుకున్న కార్యసిద్ధి నీలో ఉంటుంది. నీకు నీవు రక్షణ తెచ్చు కోలేవు; నీ రక్షణ దేవుడు నీకనుగ్రహించినది. అయితే దేవుడనుగ్రహించిన రక్షణను నీలో కొన సాగించేది నీవే. నీలో జరిగిన దేవుని సంపూర్ణ విమోచనాకార్యాన్ని అచంచలమైన విశ్వాసంతో కృతనిశ్చయంతో బహిర్గతంచేస్తూ ఇతరుల్లో దేవునికార్యం జరిగేలా కార్యోన్ముఖుడవుగా జీవించు. అప్పుడు నీ చిత్తం దేవుని చిత్తాన్ని ప్రతిఘటించదు; నీలో ఉన్న సహజ వాంఛలు ఆపేక్షలు అన్నీ దేవుని చిత్తాన్ననుసరించేవిగా ఉంటాయి. అప్పుడు క్రీస్తులో నీ జీవితం శ్వాస నిశ్వాసలంత సహజంగా ఉంటుంది. మొండితనం వివేకాన్ని వికాసాన్ని అడ్డుకొని మౌఢ్యానికి అజ్ఞానానికి నడిపిస్తుంది. పరిశుద్ధాత్మకు లోబడినప్పుడు మాత్రమే మొండి తనం పటాపంచ లవుతుంది.

నా మనోసంకల్పానికి మూలం సర్వశక్త దేవుడేనని నేను నమ్ముతున్నానా? దేవుడు మన వెలుపల ఉండి మనమాయన చిత్తాన్ని నెరవేర్చాలని కోరుకోడంలేదు; ఆయన మనలోనే ఉండి మన ద్వారానే తన చిత్తాన్ని నెరవేరుస్తున్నాడు.

జూన్ 7

## శక్తికి మూలాధారం

"మీరు నా నామమున దేని నడుగుదురో ... దానిని చేతును" (యోహాను 14:13)

విజ్ఞాపన పరిచర్య రహస్యంగా కూడా చెయ్యవచ్చు. నా హృదయపు లోలోతుల్లో నేను విజ్ఞాపన పరిచర్య చేస్తున్నానా? నిజమైన విజ్ఞాపనలో వంచనకు అహంకారానికి తావుండదు. రహస్యంగా సాగే ఈ పరిచర్యద్వారా ఒనగూడే ఫలాలు దేవునికి మహిమతెస్తాయి. నా ఆధ్యాత్మిక జీవితాన్ని వృధాగా వ్యయపరుస్తున్నానా? లేక, నా ఆధ్యాత్మిక జీవితానికి మూలా ధారమైన క్రీస్తు బలియాగంమీద నా దృష్టిని కేంద్రీకరిస్తున్నానా? నా జీవితంలోని ప్రతి కోణం యేసు క్రీస్తు ఆధీనంలో ఉందా? క్రీస్తు నాకొరకు చేసిన ప్రాయశ్చిత్తం నా జీవితంమీద బలమైన ప్రభావాన్ని చూపినట్లయితే నా జీవితంలోని ప్రతి రంగంలోనూ నేనాయనకొరకు ఫలించగలను.

అయితే నేనొక విషయాన్ని గ్రహించవలసి ఉన్నాను. నా శక్తికి మూలమేది? కనీసం గంటలో ఒక్క నిమిషమైనా నేను దీనిగురించి తీవ్రంగా ఆలోచించానా? "నాయందు మీరును ... నిలిచియుండినయెడల" - అంటే మన శక్తికి మూలాధారమైన క్రీస్తు ప్రాయశ్చిత్తం మన జీవితంలో కేంద్రబిందువు అయినట్లయితే ఏం జరుగుతుంది? "మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును" (యోహాను 15:7). నేనాయనలో నిలిచి ఉన్నానా? నేనాయనలో నిలిచి ఉండడానికి నా సమయాన్ని కేటాయిస్తున్నానా? నా జీవితంలో శక్తికి మూలాధారమేది? నా పనా? నా సేవా? నా త్యాగమా? దేవునికొరకు నేను కష్టపడడమా? ఇవేమీ కాదు! నా జీవితంలో నాకు శక్తి నిచ్చేది క్రీస్తు నాకొరకు చేసిన ప్రాయశ్చిత్తం. అయితే మనం మనకు శక్తినిచ్చేదానిమీద మనస్సు పెట్టంగానీ మనల్ని వశపర్చుకొనేవాటిమీద మనస్సు పెడుతుంటాం. మన మనస్సుల్ని మన ఆలోచనల్ని క్రీస్తు సిలువలో మనకొరకు చేసిన బలియాగంవైపు మళ్లిద్దామా?

"మీరు నా నామమున దేని నడుగుదురో ... దానిని చేతును" - యేసులో నిలిచి ఉన్న శిష్యుడు దేవుని చిత్తానుసారంగా జీవించే శిష్యుడు. ఈ నిజమైన శిష్యుడు జీవితంలో కోరుకునేవన్నీ వాస్తవానికి దేవుడు ముందుగా నిర్ణయించిన ఆదేశాలే. ఇది నిగూఢంగా కని పిస్తోందా? హేతుబద్ధమైన వాదనకు భిన్నంగా ఉందా? అవును! అయితే ఇది దేవునిబిడ్డకు ఎంత మహోన్నత సత్యం!



జూన్ 8

## తర్వాత ఏం చేయాలి?

"ఈ సంగతులు మీరు ఎరుగుదురు గనుక వీటిని చేసినయెడల మీరు ధన్యులగుదురు" (యోహాను 13:17)

ఎదుటివారికంటె ఎక్కువగా తెలుసుకోవాలనే పట్టుదల కలిగి ఉండు: నీవు సముద్రపు లోతుల్లోకి వెళ్లకుండా లంగరు వేసుకొని రేవుకే పరిమితమైనట్లయితే నీ లంగరును తెంపి నిన్ను సముద్రం మధ్యలోనికి త్రోసివేయడానికి దేవుడు తుపాను రప్పిస్తాడు. నీ జీవితాన్ని దేవునిమీద మోపి ఆయన ఉద్దేశాలనే అలలమీద ప్రయాణం చేయడానికి సిద్ధపడు. అప్పుడు నీవు చూడ వలసినవాటిని చూసేలాగా నీ నేత్రాలు తెరుచుకుంటాయి. నీవు యేసును నిజంగా నమ్మి నట్లయితే నీవు రేవు దరిదాపుల్లో ఉన్న ప్రశాంత జలాల్లో సంతోషంగా కాలం గడపాలని కోరు కోకు. నీవు రేవుదాటి సుదూరపులోతుల్లోకి వెళ్లి నీ అంతట నీవు అన్వేషణ కొనసాగించు. అప్పుడు నీకు ఆధ్యాత్మిక అంతర్దృష్టి కలుగుతుంది.

నీవు దేన్నైనా చేయాలనుకున్నప్పుడు నీలో ఇంకా తెలుసుకోవాలనే జిజ్ఞాస అధిక మౌతుంది. ఏ యే విషయాల్లో నీవు మందకొడిగా ఉన్నావో, ఎక్కడ నీలో ఆధ్యాత్మిక నిరాసకత్త మొదలయ్యిందో నిన్ను నీవు పరీక్షించుకో. కారణం నీకే తెలుస్తుంది. ఏం చేయాలో నీకు తెలిసి కూడా నీవు దాన్ని చేయలేకపోవడమే ఇందుకు కారణమని ఎవరూ చెప్ప నక్కర్లేకుండా నీ అంతట నీవే తెలుసుకుంటావు. నీవు చేయలేకపోవడానికి కారణం నీలో స్ఫూర్తి మరియు ఉత్తేజం లోపించడమే; నీలో ఆధ్యాత్మిక క్రమశిక్షణ లోపించడమే. నీలో అంతర్దృష్టి మరియు వివేచన కొరవడడం వలన సమస్యలెదురైనప్పుడు నీవు ఆధ్యాత్మిక సుడి గుండంలో కొట్టు మిట్టాడే పరిస్థితుల్ని తెచ్చుకుంటావు. ఆధ్యాత్మికంగా జ్ఞానవివేచనల్ని పెంపొందించుకోడాన్ని నీవు తిరస్కరించినప్పుడు ప్రమాదంలో పడతావు.

రోమా 12:1-2 వచనాల్లో నిజమైన యథార్థత కనిపిస్తుంది. నీలో ఉన్న యథార్థత నిజ మైనదో కాదో తేల్గ్గా కనిపెట్టవచ్చు. నీవేదో త్యాగపరుడిలాగా కనబడాలని నీకు నీవే అవకాశాల్ని కల్పించుకోడం నకిలీ విధేయత. నీలో ఉన్న కుతూహలాన్ని అమితాసక్తిని చూసి నీవు జ్ఞానివని ఇతరులు పొరబాటు పడవచ్చు. ఆధ్యాత్మికలక్ష్యం వైపు నడవడం కష్టతరమైనదే గానీ అసాధ్యమైనది కాదు. త్యాగం వేరు, అధ్యాత్మిక లక్ష్యం వేరు. ఆధ్యాత్మిక వివేచన త్యాగం కంటె ఎన్నో రెట్లు గొప్పది. దేవుడు ఏం కోరుకుంటున్నాడో తెలుసుకున్నావా? నీపట్ల దేవునికి ఏ ఉద్దేశాలున్నాయో, నీపట్ల ఆయన చిత్తమేదో ముందుగా తెలుసుకో. అప్పుడు నీవాయన ఉద్దేశాల్ని సులభంగా నెరవేర్చగలవు. "బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు ... మాట వినుటయు శ్రేష్ఠము" (1 సమూయేలు 15:22). నీ గతజీవితాన్ని పదే పదే జ్ఞాపకం చేసుకోవద్దు. ఎందుకంటే భవిష్యత్తులో నీవెలా ఉండాలని దేవుడు కోరు కుంటున్నాడో నీ ఊహకందదు! "ఎవడైనను ఆయన చిత్తముచొప్పున చేయ నిశ్చ యించు కొనినయెడల .... వాడు తెలిసి కొనును" (యోహాను 7:17).

జూన్ 9

## ఆ తర్వాత ఏం చేయాలి?

"అడుగు ప్రతివాని కియ్యబడును" (లూకా 11:10)

నీవు పొందకపోయినట్లయితే అడుగు. అడగడం కష్టమే అయినప్పటికీ అసాధ్యమైనది కాదు. మనకు కొన్నిటిపట్ల అమితమైన కోరిక ఉంటుంది; వాటిని పొందకపోయినందుకు మనం మిక్కిలి నిరాశపడిన సందర్భాలు కూడా ఉంటాయి. అయితే మనం వాటిని అడిగినట్లయితే పొంది ఉండేవాళ్లం. అడగకపోవడానికి కారణం మనలో ఆధ్యాత్మికత కొరవడిందని కాదు గానీ మనఃపూర్వకంగా అడగకపోవడమే. నీలో కొదువగా ఉన్నవాటిని నింపమని మనఃపూర్వకంగా దేవుణ్ణి అడిగావా? "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును" (యాకోబు 1:5). అడిగేముందు నీలో స్పష్టత ఉండాలి; నీకు జ్ఞానం కొదువగా ఉంది. ఈ సంగతి మర్చిపోవద్దు. యేసు క్రీస్తు మనకిచ్చిన వాగ్దానాన్ని (లూకా 11:13) ఆధారంచేసికొని పరిశుద్ధాత్మ ననుగ్రహించమని దేవుణ్ణి అడుగు. దేవుణ్ణి అడిగినప్పుడు నీ ఆధ్యాత్మిక స్థాయి ఏమిటో నీవు గ్రహించగలవు. యేసు క్రీస్తు నీ జీవితంలో చేసిన కార్యాన్ని అప్పటినుండి పరిశుద్ధాత్మ కొనసాగిస్తాడు.

"అడుగు ప్రతివానికియ్యబడును". అడగకపోతే పొందలేమని ఈ మాటలు స్ఫురింపజేయడంలేదు గానీ నీకు అక్కరగా ఉన్నవాటిని అడిగి, వాటిని దేవునినుండి పొంద వలసి ఉన్నావనే అర్థం ఇందులో ఉంది (మత్తయి 5:45). నీవు దేవుణ్ణి అడిగి ఆయన నుండి పొందడానికి ముందు ఆయనతో సరైన సంబంధాన్ని కలిగి ఉండు. అప్పుడు నీవు మానసికంగా నైతికంగా ఆధ్యాత్మికంగా సరైన జ్ఞానవివేచనలతో నీకు కావలసినవాటి నన్నిటినీ దేవుడు మాత్రమే అనుగ్రహించగలడనే సత్యాన్ని గ్రహించగలుగుతావు.

"మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును". నీకేదైనా కొదువగా ఉందని నీవు గ్రహించినట్లయితే నీకు దేవునితో సరైన సంబంధం లేదనే ఆధ్యాత్మిక వాస్తవాన్ని గుర్తించినట్లే. మళ్లీ మళ్లీ ఆధ్యాత్మిక గుడ్డితనాన్ని తెచ్చుకోకు. "అడుగు" అనే పదానికి "యాచించు" అనే అర్థం కూడా ఉంది. కొంతమంది ఎప్పటికీ నిరుపేదల్లాగానే ఉంటారు. వారికి తమ పేదరికాన్ని పోగొట్టుకోడం ఇష్టం వుండదు. వీరు తమ ఆధ్యాత్మిక లేమితనాన్ని మాటిమాటికీ బహిర్గతం చేస్తుంటారు. ఏదో ఒక ఫలితాన్ని ఆశిస్తూ మనం దేవుణ్ణి అడిగినట్లయితే మనం దేన్నీ పొందలేం. ఎందుకంటే మన లేమినిబట్టి కాదుగానీ మన దురాశల్ని బట్టి మనం దేన్నీ పొందలేకపోతున్నాం. ఏ దిక్కునుండి ఏ సహాయాన్ని పొందలేని నిస్సహాయుడైన నిరుపేద తన పేదరికపు దౌర్భాగ్య పరిస్థితుల్లో సహాయంకొరకు వేడుకొంటాడు కాబట్టి అతను యాచించడానికి వెనుకడుగు వేయడు. "ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు" (మత్తయి 5:3).

జూన్ 10

## ఆ తర్వాత ఏం చేయాలి?

"వెదకుడి, మీకు దొరకును ... " (లూకా 11:9)

నీకు కోరుకున్నది దొరకకపోయినట్లయితే వెతుకు. "మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశములతో అడుగుదురు గనుక మీకేమియు దొరకుటలేదు" (యాకోబు 4:3). పరలోకసంబంధమైనవాటిని కాక నీవు ఐహికమైనవాటిని అడిగినట్లయితే నీవు సరైనవాటిని అడగడంలేదని అర్థం. అంటే నీవు నీ స్వంత కోరికల ప్రకారం నీ సంతృప్తికొరకు అడుగుతున్నావని అర్థం. నీవెంత ఎక్కువగా నీ స్వంత కోరికల్ని నెరవేర్చుకుంటున్నట్లయితే అంత తక్కువగా వెతుకుతున్నావని అర్థం. "వెదకుడి, మీకు దొరకును". వెతుకు. నీ ఆసక్తిని అభిరుచిని కేవలం వెతకడంవైపే మళ్లించు. నీవెప్పుడైనా మనఃపూర్వకంగా దేవుణ్ణి వెతికావా? లేక, ఉద్విగ్నతలో బాధ భరించలేక కేవలం బాధానివృత్తికొరకే దేవునికి దయనీయంగా మొరపెట్టావా? యథార్థతతో వెతుకు. నీకు కావలసినది దొరకుతుంది.

"దప్పిగొనినవారలారా, నీళ్లయొద్దకు రండి" (యెషయా 55:1). నీవు దప్పికతో ఉన్నావా? నీవు ఉదాసీనంగా ఉన్నావా? నీవు తటస్థంగా ఉన్నావా? నీ స్వంత అనుభావాలతో సంతృప్తిచెంది దేవునినుండి ఇక నాకేమీ అక్కర్లేదనుకుంటున్నావా? నీ స్వంత అనుభవం ప్రారంభం మాత్రమే; తుది గమ్యం కాదు. నీవు నీ స్వంత అనుభవంమీద విశ్వాసజీవితాన్ని కట్టుకుంటున్నావేమో! అప్రమత్తంగా ఉండు! నీవు నీ స్వంత అనుభవాల్ని ఆధారం చేసుకున్నట్లయితే నీ జీవితంలో యథార్థత లోపిస్తుంది; నీలో విమర్శనాదృష్టి ద్విగుణీకృతమౌతుంది. నీవు నీ స్వంత అనుభవాలమీద ఆధారపడినట్లయితే నీవు పొందినదాన్ని ఇతరులకు నీవివ్వలేవనే విషయాన్ని జ్ఞాపకం పెట్టుకో. బదులుగా ఇతరులు నీ అనుభవాల్ని ఆశించేలాగా చేయగలవు.

"తట్టుడి, మీకు తీయబడును" (లూకా 11:9). "దేవునియొద్దకు రండి ... " (యాకోబు 4:8). తలుపు వేసి ఉంది; తట్టు! నీవు తలుపుతట్టుతున్నకొద్దీ నీ గుండె వేగంగా కొట్టుకుంటుంది. "మీ చేతులను శుభ్రము చేసికొనుడి" (4:8). గట్టిగా తట్టు! అప్పుడు నీలో ఎంత మురికి ఉందో నీకే తెలుస్తుంది. "మీ హృదయములను పరిశుద్ధ పరచుకొనుడి ... " (4:8). ఇప్పుడిది నీ ఆంత రంగిక విషయం! నీవిప్పుడు నిస్సహాయుడవు. నిజంగా నీగురించి నీవు ఆలోచిస్తున్నట్లయితే నీ కొరకు నీవేమైనా చేయగలవు. "దుఃఖపడుడి" (4:9). నీవెప్పుడైనా చింతించావా? నీ ఆంత రంగిక జీవితాన్నిబట్టి దేవునియెదుట నీవెప్పుడైనా దుఃఖించావా? నీ మీద నీవే సానుభూతి చూపకు. నీనుండి వచ్చే ఒప్పుకోలు నీవెటువంటి వ్యక్తివో తెలుపుతుంది. "మిమ్మును మీరు తగ్గించుకొనుడి ..." (4:10). నిన్ను నీవు తగ్గించుకొని తలుపు తట్టాలి. ప్రభువుతో బాటుగా సిలువ వేయబడిన నేరస్థుడు తట్టినట్టుగా తట్టాలి. అప్పుడు నీకు తలుపు తెరుచుకుంటుంది. "తట్టు వానికి తీయబడునని మీతో చెప్పుచున్నాను" (లూకా 11:10).

జూన్ 11

## అక్కడికి వెళ్లడం (1)

"నా యొద్దకు రండి" (మత్తయి 11:28)

పాపానికి మరియు దుఃఖానికి ఎక్కడ ముగింపు ఉంటుందో అక్కడ పరిశుద్ధుని పాట మొదలవుతుంది. నేనక్కడికి వెళ్లాలని నిజంగా కోరుకుంటున్నానా? కోరుకుంటున్న ట్లయితే వెళ్లగలను. జీవితంలో అత్యంత ముఖ్యమైనవిగా లెక్కించదగిన ప్రశ్నలు కొన్ని మాత్రమే ఉంటాయి. వాటన్నిటీ పరిష్కారం "నా యొద్దకు రండి" అనే మాటల్లో కనిపిస్తుంది. మన ప్రభువు "దీన్ని చేయాలి" "దాన్ని చేయవద్దు" అని చెప్పడంలేదు. ఆయన "నాయొద్దకు రండి" అని పిలుస్తున్నాడు. నేను యేసు పిలుపును మన్నించి ఆయన దగ్గరకు వచ్చినట్లయితే నా జీవితం ధన్యమౌతుంది. జీవితంలో నాకేది కావాలో అది నాకు దొరుకుతుంది. నేనిక పాపానికి దూరంగా ఉండగలను. నా జీవితంలో ప్రభువు ఆనందగీతం మొదలవుతుంది.

నీవు యేసును సమీపించావా? "నా యొద్దకు రండి" అని నిష్కాపట్యంతో నిన్ను పిలుస్తున్న యేసును సమీపించావా? పాపానికి దూరంగా ఉండాలని నీవు కోరుకుంటు న్నట్లయితే యేసును సమీపించడం మినహా నీకు మరో మార్గం లేదు.

యేసు పిలుపు నీలో ఉన్న యథార్థతకు పరీక్ష. ఆయన మనల్ని "రండి" అని ఎలా పిలుస్తున్నాడో చూడు. నీవు ఊహించని పరిస్థితుల్లో ప్రభువు నిన్ను "నాయొద్దకు రండి" అని మృదుమధురమైన స్వరంతో పిలుస్తున్నాడు. నీవాయన పిలుపును త్రోసి వేయలేవు. యేసుతో నీ సాన్నిహిత్యం నీ జీవితాన్ని సమూలంగా మార్చివేస్తుంది. ఇంకేమీ ఆలోచించకుండా యేసును సమీపించి ఆయన మాటలకు కట్టుబడి ఉండు. నీవాయణ్ణి సమీపించడానికి చేయ వలసినది నీ జీవితంలోని సర్వస్వాన్ని నీ ఆధీనంలో నుండి యేసు ఆధీనానికి అప్పగించడం మాత్రమే.

" ... నేను మీకు విశ్రాంతి కలుగజేతును" అని ప్రభువు చెబుతున్నాడు. నీవాయణ్ణి సమీపించినట్లయితే విసిగి వేసారిన నీ బ్రతుకులో అలసట అశాంతి కనుమరుగవుతాయి; మృతతుల్యమైన పరిస్థితుల్లోంచి నీవు జీవంలోకి వస్తావు. నీవు సమృద్ధజీవంతో పరిపూర్ణతవైపు నడుస్తావు. ఇవన్నీ ఇవ్వడానికి యేసు నిన్ను పిలుస్తున్నాడు. అయినా నీవింకా అశక్తతతో దయనీయంగా ఉన్నట్లయితే దేవుని కుమారుని శక్తి నీలో ఎక్కడ ఉన్నట్లు? నీ జీవితంలో ఆయన ఆధిపత్యం ఉన్నట్లేనా?



జూన్ 12

## అక్కడకు వెళ్లడం (2)

“వారు -రబ్బీ, నీవు ఎక్కడ కాపురమున్నావని ఆయనను అడిగిరి ... వచ్చి చూడుడని ఆయన వారితో చెప్పగా” (యోహాను 1:38,39)

మనలో నిజమైన ఆసక్తి జాగృతం కావడం: “ఆ దినము ఆయనయొద్ద బసచేసిరి” మనలో కొంతమంది చేస్తున్న పని యిదే! కొంత కాలం ఆయనతో ఉంటాం; మరి కొంత కాలంతర్వాత జీవితంలోని కఠినవాస్తవాలు గుర్తుకు వస్తాయి. దాంతో మనలో స్వార్థచింతన మొదలై యేసులో నిలిచి ఉండడం గతకాలానికి సంబంధించినదవుతుంది. అయితే మనం యేసులో నిలిచి ఉండలేనంత దుర్భరమైన పరిస్థితులు లేవు.

“నీవు ... సీమోనువు; నీవు కేఫా అనబడుదువని చెప్పెను” (యోహాను 1:42). మన హృదయంలో గర్వం స్వావలంబన మరియు స్వార్థం తొలగిన చోట్ల మాత్రమే దేవుడు మన కొత్త పేరును వ్రాస్తాడు. దేవుడు కొత్త పేరును వ్రాసిన రంగాల్లో మాత్రమే మనం సరైనవారిగా ఉంటాం. ఇతరచోట్ల మన జీవితంలో మచ్చలు మిగిలే ఉంటాయి. మనం ఆధ్యాత్మికంగా ఉత్తేజంగా ఉన్నప్పుడు మనకంటె పరిశుద్ధులు లేరని మనం ఆలోచిస్తుంటాం. అయితే మనలో ఉత్తేజం లోపించినప్పుడు మనల్ని మనం పరీక్షించు కోడానికే భయపడుతుంటాం. నిజమైన శిష్యుడి హృదయంమీద పూర్తిగా కొత్త పేరు వ్రాయబడి ఉంటుంది. నిజమైన శిష్యుడిలో స్వార్థం గర్వం స్వావలంబన మచ్చుకైనా కనబడవు.

గర్వం మూలంగా మన “అహం” మనకు దైవంగా మారుతుంది. నేడు కొంత మందిలో ఈ భావన కనిపిస్తోంది. వీరు పరిసయ్యుడిలాంటివారు కాదు గానీ సుంకరి లాంటివారు (లూకా 18:9-14 వచనాలు చూడండి). “నేను పరిశుద్ధుడిని కాను” అని చెప్పడం గర్వంపట్ల మనకున్న భావనల ప్రకారం సరైనది కావచ్చేమో గానీ ఈ ప్రకటనలో అంతర్లీనంగా దేవదూషణ దాగి ఉన్నట్టు కనిపించడంలేదా? దేవుడు నిన్ను పరిశుద్ధుడగా మార్చడం నీకు ఇష్టంలేదా? “నేను బలహీనుడిని నిస్సహాయుణ్ణి క్రీస్తు చేసిన ప్రాయశ్చిత్తానికి దూరంగా ఉన్నాను” అని చెబ్తావేమో! నీవెందుకు పరిశుద్ధుడివి కావు? నీవు పరిశుద్ధుడిగా మారాలనుకోడంలేదా? లేక, దేవుడు నిన్ను పరిశుద్ధుడిగా మార్చగలడని నమ్మడంలేదా? “దేవుడు నాకు రక్షణ ప్రసాదించాడు కాబట్టి నేరుగా నన్ను పరలోకానికి తీసుకొనివెళ్లాలనుకుంటున్నాను” అని ఆలోచిస్తున్నావా? వాస్తవానికి ఆయన చేసే పని అదే. మనమాయన దగ్గరకు వెళ్లడం కాదు గానీ ఆయన వచ్చి మనతో నివాసం చేస్తాడు. “మేము వానియొద్దకు వచ్చి వానియొద్ద నివాసము చేతుము” (యోహాను 14:23). నీకు నీవు షరతులు పరిమితులు విధించుకోవద్దు. యేసే నీ సర్వస్వం కావాలి. అప్పుడు యేసు నిన్ను తనతోబాటు నిత్యనివాసానికి తీసుకొని వెళ్తాడు.

జూన్ 13

## అక్కడకు వెళ్లడం (3)

"నీవు వచ్చి నన్ను వెంబడింపుమని ... " (లూకా 18:22)

ఎక్కడ మన స్వంత కోరికలు మరణిస్తాయో అక్కడ పవిత్రమైన సమర్పణ ప్రాణం పోసుకుంటుంది: యేసు వద్దకు వచ్చేందుకు ఉన్న ప్రధానమైన ఆటంకాల్లో మనలో ఉన్న సహజ ప్రవృత్తి ఒకటి. మనం యేసును సమీపించకుండా మనకు మనమే మన స్వంత నైజం మరియు మన సహజవాంఛలు మనల్ని అడ్డుకొనేలా చేస్తున్నాం. అయితే మనం యేసును సమీపించినప్పుడు ఆయన మన సహజకోరికల్ని పట్టించుకోడంలేదని తెలుసుకుంటాం. మనలో ఉన్న వరాల్ని దేవునికి అంకితమివ్వాలనే ఆలోచన మనలో ఉంటుంది. అయితే మనది కాని దాన్ని మనమాయనకెలా అంకితమివ్వగలం. అయితే మనం యేసుకు అప్పగించుకొనేది మనదగ్గర ఒకటుంది. అది మనల్ని మనమే ఆయనకు సమర్పించుకోడం (రోమా 12:1 చూడండి). నిన్ను నీవు సజీవయాగంగా దేవునికి సమర్పించుకున్నట్లయితే ఆయన నీ విషయంలో ఏం చేయాలనుకుంటున్నాడో దాన్ని చేస్తాడు. ఆయన తలంపులు ఎప్పటికీ విజయం సాధిస్తాయి. దేవునికొరకు ఏదైనా చేయాలని అంతరంగంలోంచి పొంగిపొరలే సృజనాత్మకశక్తి దేవుని బిడ్డకు నిజమైన గుర్తు. ఈ శక్తి యేసు క్రీస్తుకు సంపూర్ణంగా అప్పగించుకున్నప్పుడు కలిగే శక్తి. పరిశుద్ధులైన దేవునిబిడ్డల జీవితంలో ఈ శక్తి నిత్యం ప్రవహించే ఊటగా ఉంటుంది. దేవుని ఆత్మ ఈ ఊటకు మూలం. విశ్వాసి తన జీవితం దేవుని చేతిలో ఉందనీ, తన జీవితంలోని ప్రతిదీ దేవుని ఆధీనంలో ఉందనీ గ్రహిస్తాడు కాబట్టి అతను ఏ విషయంలోనూ దేవునికి ఫిర్యాదు చేయడు. అతని జీవితంలో వంకలు సాకులు ఉండవు గానీ కేవలం సమర్పణ మాత్రమే ఉంటుంది. నీ స్వంత అనుభవాల్ని ఇతరుల మీద రుద్దకు. దేవుడు నిన్ను తనకొరకెలా ప్రత్యేకించుకున్నాడో వాళ్లను కూడా అలాగే ప్రత్యేకపర్చుకోనివ్వు. నీ జీవితంలోని ప్రతిదాన్నీ నీవు యేసు చేతుల్లో పెట్టినట్లయితే ఆయన "నీవు వచ్చి నన్ను వెంబడింపుమని ... " నీతో చెప్పిన మాటల్ని నీద్వారా ప్రతిధ్వనింపజేస్తాడు. నీవు క్రీస్తు మాటల్ని ప్రతిధ్వనిస్తూ లోకంలోనికి వెళ్లు. తనను తాను ఉపేక్షించుకొని యేసును సమీపించిన ప్రతి ఒక్కరిలోనూ ఇదే ఉండాలి.

నేను యేసును సమీపించానా? నేనిప్పుడు యేసును సమీపించగలనా?

జూన్ 14

**కదులు! (1)**

"నాయందు నిలిచియుండుడి" (యోహాను 15:4)

నిర్ణయం: క్రీస్తు నాకొరకు సిలువమీద చేసిన ప్రాయశ్చిత్తంద్వారా ఆయన ఆత్మను పొందిన నేను నా ఆలోచనల్ని నా ఉద్దేశాల్ని ప్రభువు ఆలోచనలతో ఆయన ఉద్దేశాలతో అనుసంధానం చేయడం అలవర్చుకోవాలి. ఇది ఒక రోజులో ముగిసే కార్యం కాదు. దేవుడు నన్ను యేసులాగా ఆలోచించేలా చేయడు; నేనే యేసులాగా ఆలోచించడం నేర్చుకోవాలి. "ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి" (2 కొరింథీ 10:5) అని పౌలు చెప్పినట్టుగా నేను నా ప్రతి ఆలోచనను ప్రభువుకు బందీగా చేయాలి. "నాయందు నిలిచియుండుడి" - ఈ మాటలు మన జీవితంలోని ప్రతి అంశానికీ వర్తిస్తాయి. మన జీవితానికి బహుముఖకోణాలున్నాయి; జీవితం ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితమైనది కాదు.

దేవునితో నా సహవాసానికి ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో నా జీవితంలో దేవుని కార్యాలు జరగకుండా అడ్డుకుంటున్నానా? ఇదెంత అసమంజస మైనదో ఎంత అగౌరవమైనదో తెలుసా? నా పరిస్థితులెటువంటివైనా కావచ్చు! నేను యేసులో నిలిచి ఉండగలననే నిశ్చయత నాలో ఉంది. నా పరిస్థితుల్ని నేను సర్దుబాటు చేసుకోవలసిన అవసరంలేదు. మన ప్రభువు తన తండ్రిలో నిలిచి ఉన్న వైనాన్ని జ్ఞాపకం చేసుకో. యేసు పవిత్రుడిగా నిందారహితుడుగా తన తండ్రిలో నిలిచి ఉన్నాడు. ఆయన ప్రతి సందర్భంలోనూ తన తండ్రిలో నిలిచి ఉన్నాడు. యేసు తన పరిస్థితుల్ని తానే చక్కదిద్దుకోవాలనుకోలేదు. యేసు తన తండ్రి ఉద్దేశాలపట్ల, తన తండ్రి నడిపింపుపట్ల సంపూర్ణ వినయవిధేయతలు చూపిన సాత్వికుడు. తన తండ్రిమీద ఆనుకొనిన మన ప్రభువు ఎంత నెమ్మదిని ఎంత ఉపశమనాన్ని పొంది ఉండవచ్చు! యేసు తన తండ్రిమీద ఆనుకున్నట్టుగా మనం దేవునిమీద ఆనుకోడంలేదు. "మీ జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది" (కొలొస్స 3:2-3). క్రీస్తులో దాచిపెట్టబడిన జీవం స్వచ్ఛమైనది మరియు నిర్మలమైనది. ఈ జీవం నాలో ఉందా?

నీవు క్రీస్తులో నిలిచి ఉండకుండా నిన్ను ప్రక్కకు తప్పించేవాటిగురించి ఆలోచించు. "అవును ప్రభువా, ఒక్క నిమిషం! ఇంకా ఈ పని మిగిలింది. ఈ పని పూర్తికాగానే నీలో నిలిచి ఉంటాను" అని చెబుతున్నావా? కదులు! ముందుకు నడువు! నిలిచి ఉండడం ప్రారంభించు! మొదట్లో నీ ప్రయత్నం నిర్విరామంగా ఉండడం కొంచెం కష్టంగానే ఉంటుంది. అయితే కాలక్రమంలో ఆయనలో నిలిచి ఉండడం నీ జీవితంలో అంతర్భాగమౌతుంది. ఇప్పుడూ, మరి ప్రతి సందర్భంలోనూ యేసులో నిలిచి ఉండడానికి దృఢంగా నిర్ణయించుకో!

జూన్ 15

**కదులు (2)**

"మీ విశ్వాసమునందు ... " (2 పేతురు 1:5)

పరిశ్రమ: మనకు "దేవస్వభావమునందు" భాగం ఉంది కాబట్టి మనం సత్ప్రవర్తన నలవర్చుకోవాలి. పేతురు పేర్కొన్న ఈ సుగుణాలన్నీ మన సద్వర్తనలో భాగం. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. సద్వర్తన పుట్టుకతో రాదు. మనం సుగుణాల్ని "అమర్చుకున్నప్పుడు" మనలో సద్వర్తన ఉంటుంది. అలవాట్లు కూడా మనకు పుట్టుకతో రావు. దేవుడు మనకనుగ్రహించిన నూతన జీవాన్ననుసరించి, మనలో ఉన్న "దేవస్వభావము" ననుసరించి మన అలవాట్లను మనమే పెంపొందించుకోవాలి. దేవుని పరిపూర్ణతకు ఆయన ప్రకాశానికి మనం మచ్చుతునకలం కాదు గానీ ఆయన అత్యద్భుత కృపను మన అనుదిన జీవితంలో ప్రతిబింబించేవారంగా ఉండాలి. పరిశ్రమ సత్ప్రవర్తనకు అసలు పరీక్ష. మన ఆధ్యాత్మిక జీవితంలో పెద్ద ఆటంకంగా ఉన్నదేమిటంటే మనం గొప్ప పనులు చేయాలనుకోడమే. అయితే యేసు ఏం చేశాడో చూడండి: "యొక తువాలు తీసికొని ... శిష్యుల పాదములు కడుగుటకును, తాను కట్టుకొనియున్న తువాలుతో తుడుచుటకును మొదలుపెట్టెను" (యోహాను 13:4,5).

మన జీవితం కాంతివిహీనంగా నిస్సారంగా నిరుత్సాహంగా సాదాసీదాగా గడిచిన రోజుల్ని గుర్తు తెచ్చుకుందాం. ఇది మనందరి జీవితాల్లో కనిపించే అనుభవమే. దీన్ని మనం తేలిగ్గా కొట్టిపారవేయకూడదు. ఇటువంటి పరిస్థితుల్లోనే మన జీవితంలో ఆకస్మాత్తుగా ఒక మెరుపు మెరిసింది; మనం దేవునినుంచి అత్యద్భుతమైన ప్రేరణను పొందాం. అయితే మిరుమిట్లు గొల్పే మెరుపులు ఎప్పుడూ ఉండవు; దేవుని శక్తిని పొందుతూ మనం సాదాసీదా జీవితాన్నే కొనసాగించాలి.

"అమర్చుకొనుడి" అని పేతురు చెప్పిన సంగతి కష్టతరమైనదే గానీ అసాధ్యమైనది కాదు! పూలపాన్పుమీద కూర్చుంటే పరలోకం చేరలేమని మనకు తెలిసినప్పటికీ మనం పూలపాన్పునే కోరుకుంటున్నాం! జీవితంలో ఏ చిన్న విషయంలోనైనా మనం చూపే విధేయత సర్వశక్త దేవుని అత్యద్భుత కృపతో మాత్రమే సాధ్యమయ్యే విధేయత. ఏదో చెయ్యాలి కాబట్టి చెయ్యాలనే నిరాసక్తత ఉన్నప్పుడు మనం దేన్నీ చేయలేం. దేవుడు మన జీవితంలోని ప్రతి సమయాన్ని ప్రతి సందర్భాన్ని అనుకూలపరుస్తాడని మనం నమ్మాలి. మన విధేయతకు మూలం సిలువమీద క్రీస్తు మనకొరకు చేసిన బలియాగమైనప్పుడు, దేవుని మహోన్నత కృప మనదే!

జూన్ 16

## నీ ప్రాణాన్నర్పించగలవా?

“తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు ... ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను”

(యోహాను15:13,15)

“నీ కొరకు నా ప్రాణము పెట్టుదునని” పేతురు యేసు ప్రభువుతో చెప్పాడు. ఈ మాటల్ని ఏ ఉద్దేశంతో పేతురు చెప్పాడో అతనికి తెలుసు (యోహాను 13:37). పేతురుకు వీరత్వం ఎక్కువే. పేతురు చెప్పినట్టుగా మనం చెప్పలేకపోయినట్లయితే దాన్నొక అవమానంగా మనం భావిస్తాం. మనం కూడా వీరోచిత కార్యాల్నే కోరుకుంటున్నాం. ప్రభువు నిన్నెప్పుడైనా తనకొరకు నీ ప్రాణంపెట్టమని అడిగాడా? ప్రతి రోజూ దేవుని పిలుపు ప్రకారం ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా జీవించడంకంటె ఒక్కసారే చనిపోడం చాలా తేలిక. కళ్లు మిరుమిట్లుగొల్పే మెరుపులు ముఖ్యం కాదుగానీ మన సాదాసీదా జీవితాలు వెలుగు ననుసరించి ఉంటే చాలు. యేసు భూమ్మీద ఉన్నప్పుడు ఆయనకు ఒకే ఒక అనుభవం ఉంది. అదే రూపాంతర అనుభవం. కొండమీద ఆయన రూపాంతరం చెందినప్పుడు ఆయన మహిమ అక్కడ తేజరిల్లింది. తర్వాత ఆయన కొండ దిగివచ్చినప్పుడు దయ్యంపట్టిన వ్యక్తి ఎదురయ్యాడు (మార్కు 9:1-29). యేసు ముప్పయి సంవత్సరాలపాటు తన తండ్రి చిత్తాన్ని ప్రాణసమంగా నెరవేర్చాడు. “ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము” (1 యోహాను 3:16). యేసు చేసిన కార్యం మానవమాత్రులవలన అయ్యే కార్యం కాదు!

నేను యేసుకు స్నేహితుడనైనట్లయితే ఆయన కొరకు ప్రాణంపెట్టడానికి సంసిద్ధత చూపాలి. ఇది కష్టమే! అయితే ఇలా చేయవలసి ఉంది కాబట్టి దేవునికి వందనాలు! మనల్ని రక్షించడానికి దేవుడు మూల్యం చెల్లించాడు కాబట్టి మనకు ఉచితంగా లభించింది. అయితే మన జీవితంలో రక్షణానుభవాన్ని కలిగి ఉండడం చాలా కష్టం. దేవుడొక వ్యక్తిని రక్షించి తన ఆత్మతో నింపి “విశ్వాసంతో నీ జీవితాన్ని కొనసాగించు. నీ చుట్టూ ఉన్నవన్నీ నిన్ను విశ్వాసంలోంచి బయటికి లాగడానికి ప్రయత్నిస్తుంటాయి” అని చెబుతున్నాడు. “మిమ్మును ... స్నేహితులని పిలుచుచున్నాను” అని కూడా యేసు ప్రభువు చెబుతున్నాడు. నీ స్నేహితుడిపట్ల నమ్మకంగా ఉండు. ఆయన ఘనత కొరకు నీ ప్రాణాన్ని పణంగా పెట్టు.



జూన్ 17

## తీర్పు తీర్చడంలో జాగ్రత్తగా ఉండు

"మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మునుగూర్చి తీర్పు తీర్చబడదు"
(మత్తయి 7:1)

ఇతరుల్ని విమర్శించడంగురించి యేసు ఇచ్చిన ఆజ్ఞ చాలా సూటిగా ఉంది. "తీర్పు తీర్చకుడి" అని ఆయన చెప్పాడు. సగటు క్రైస్తవునిలో ముఖ్యంగా కనబడే లక్షణం తీవ్రమైన విమర్శలుచేయడం. ఇతరుల్ని విమర్శించడం నిత్యజీవితంలో ఒక భాగంగా మనం చూస్తూనే ఉన్నాం. అయితే విమర్శవలన ఆధ్యాత్మిక రంగంలో మనం ఏ ప్రయోజనాన్ని పొందలేం. విమర్శ ఎంతటి ప్రభావం చూపుతుందంటే ఎవరైతే విమర్శకు గురవుతారో వారి శక్తిసామర్థ్యాలన్నీ వీగిపోయి వారు అశక్తులౌతారు. విమర్శ చేసే (తీర్పుతీర్చే) అధికారం పరిశుద్ధాత్మకు మాత్రమే ఉంది. పరిశుద్ధాత్మ ఎవరినీ బాధించకుండా ఎవరినీ నొప్పించకుండా లోపాల్ని ఎత్తిచూపిస్తాడు. విమర్శనాదృష్టితో మనం దేవునితో అన్యోన్యత కలిగి ఉండడం కష్టమే. విమర్శనాదృష్టి నీలో కర్కశత్వాన్ని కక్షను నిర్దయను పెంచుతుంది; ఇతరులకంటే నీవు గొప్పవాడివనే అభిప్రాయాన్ని కలిగిస్తుంది. ఇతరుల్ని విమర్శించే స్వభావం తన శిష్యుల్లో ఉండకూడదని యేసు చెబుతున్నాడు. విమర్శనాదృష్టిని మార్చుకోడం అంత తేలికైన విషయం కాదు; ఇది సుదీర్ఘకాల ప్రక్రియ. ఇతరులకంటె నీవు గొప్పవాడివని నీలో కలిగే ఆలోచనల విషయంలో జాగ్రత్తగా ఉండు.

యేసు మనల్ని సూటిగా చూసినప్పుడు ఆయన దృష్టినుంచి మనం దేన్నీ దాచలేం. మనకు ఇతరుల కంట్లో నలక కనబడినట్లయితే మన కంట్లో దూలం ఉందని అర్థం (7:3-5 చూడండి). ఇతరుల్లో నేను చూసే ప్రతి తప్పునూ దేవుడు నాలో కూడా చూస్తాడు. ఇతరులకు నేను తీర్పుతీర్చే ప్రతి సారీ నాకు నేనే తీర్పుతీర్చుకుంటున్నాను (రోమా 2:17-24 వచనాలు చూడండి). ఇతరుల్ని కొలతవేయడానికి ప్రయత్నించకు. ఎందుకంటే ఇతరులగురించి మనకు తెలిసినదానికన్నా తెలియనిదే ఎక్కువ. మన అంతరంగాన్ని పరిశుద్ధపర్చాలని దేవుడు కోరుకుంటున్నాడు. ఆయన మన అంతరంగాన్ని పరిశుద్ధపర్చిన తర్వాత అందులో అహంభావం స్వార్థం ఉండడానికి వీల్లేదు. నేను దేవునికి దూరంగా ఉన్నప్పటి స్థితిని జ్ఞాపకం చేసుకున్నట్లయితే నేనెవరినీ విమర్శించే ధైర్యంచేయలేను. ఎందుకంటే అందరిలో నేనూ ఒకడినే.

జూన్ 18

## యేసును గుర్తించు

"పేతురు ... యేసునొద్దకు వెళ్లుటకు నీళ్లమీద నడచెను గాని గాలిని చూచి భయపడి మునిగిపోసాగి" (మత్తయి 14:29,30)

గాలి ప్రచండంగా ఉంది; అలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. అయితే పేతురు మొదట్లో వీటిని పట్టించుకోలేదు. అతను వాటినసలు లెక్కలోకి తీసుకోలేదు. పేతురు ప్రభువును గుర్తించాడు; ఆయణ్ణి గుర్తిస్తూ "నీళ్లమీద" నడిచాడు. తర్వాత అతను తన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని చూశాడు. పేతురు వెంటనే మునిగిపోసాగాడు. పేతురు నీళ్ల మీద నడవడానికి శక్తి నిచ్చిన దేవుడు అతను నీళ్లకింద నడవడానికెందుకు శక్తి నివ్వలేదు? మన ప్రభువు అతనికి నీళ్ల అడుగున నడిచే శక్తినివ్వాలనుకున్నట్లయితే ఇచ్చి ఉండేవాడు. అయితే ఎందుకివ్వలేదంటే పేతురు తన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని చూచి యేసు ప్రభువును గుర్తించడం కొనసాగించ లేకపోయాడు గనక.

మనం మొదట్లో ప్రభువును గుర్తిస్తూ మొదలుపెడతాం. అయితే తర్వాత మనల్ని మనం పరిగణనలోకి తీసుకోడంతో వెనక్కు తగ్గే పరిస్థితులెదురౌతాయి. మనం నిజంగా ఆయణ్ణి గుర్తిస్తున్నట్లయితే ఆయన మనల్ని ఎక్కడికి ఎలా నడిపిస్తున్నాడనే విషయాల్ని పట్టించుకోం. మన చుట్టూ ఉన్న పరిస్థితులు వాస్తవిక పరిస్థితులే; మనం వీటివైపు చూచి ఓటమి భయంలో పడి యేసును గుర్తించడం మర్చిపోతాం. సరిగ్గా ఇటువంటి సందర్భంలోనే యేసు మనల్ని "అల్పవిశ్వాసీ, యెందుకు సందేహపడితివని" మందలిస్తాడు (14:31). నీ చుట్టూ ఉన్న పరిస్థితు లెటువంటివైనప్పటికీ యేసును గుర్తించడం మటుకు కొనసాగించు. ఆయనమీద పూర్తిగా ఆధారపడు.

దేవుడు నీతో మాట్లాడినప్పుడు నీవు ఒక క్షణంపాటైనా సందిగ్ధంలో పడినట్లయితే నీవు వెనక్కు తగ్గినట్లే. "ఆయన నిజంగా నాతో మాట్లాడాడా?" అని మొదలుపెట్టవద్దు. ఆయన మాట్లాడిన వెంటనే నీవు దేనికైనా సిద్ధపడి నీ భారమంతటినీ ఆయనమీద మోపు. ఆయన స్వరం నీకెప్పుడు వినబడుతుందో నీకు తెలియదు. అయితే నీవు మాత్రం నిన్ను నీవు విస్మరించుకొని యేసును గుర్తించడం కొనసాగిస్తూ ఆయనకు సంపూర్ణంగా లోబడు. నిన్ను నీవు విస్మరించుకున్నప్పుడు మాత్రమే, నీ చుట్టూ ఉన్న పరిస్థితుల్ని విస్మరించినప్పుడు మాత్రమే నీవు యేసును గుర్తించగలవు. నిన్ను నీవు విస్మరించినప్పుడు, ఎంతటి అపాయానికైనా సిద్ధపడినప్పుడు మాత్రమే ఆయన స్వరాన్ని నీవు స్పష్టంగా వినగలవు.

జూన్ 19

## ఉద్వేగభరితమైన భక్తిప్రపత్తులు

"నన్ను ప్రేమించుచున్నావా ... నా గొఱ్ఱెలను కాయుమని చెప్పెను" (యోహాను 21:16)

నీ ఆలోచనలకు తలొగ్గే విధంగా ఇతరుల్ని మార్చమని ప్రభువు చెప్పలేదు. ఆయన తన గొర్రెల్ని కాస్తూ ఉండమని చెప్పాడు. కాస్తుండడమంటే వాళ్లకు ఆత్మసంబంధమైన పోషణనివ్వాలని అర్థం. మనం చేస్తున్న కార్యక్రమాల్ని మనం సేవ అని పిలుస్తున్నాంగానీ యేసు దృష్టిలో సేవ అంటే మనం ఆయనకొరకు చేసే కార్యక్రమాలు కాదు. ఆయన దృష్టిలో సేవ అంటే మనం ఆయనకు ఏమై ఉన్నామో అదే. శిష్యత్వానికి పునాది యేసు క్రీస్తుపట్ల మాత్రమే ఉన్న భక్తిప్రపత్తులు. ఏదో ఒక సిద్ధాంతాన్ని లేదా ఏదో ఒక నమ్మకాన్ని పట్టుకొని వ్రేలాడడం శిష్యత్వం కాదు. "ఎవడైనను నాయొద్దకు వచ్చి ... సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:25-26). ఈ వచనంలో యేసు తనను వెంబడించమని ఎవరితోనూ వాగ్వివాదం చేయడంలేదు; ఎవరినీ వత్తిడి చేయడంలేదు. "నాకు శిష్యుడుగా ఉండాలనుకున్నవారి భక్తిశ్రద్ధలు కేవలం నామీదే ఉండాలి" అని యేసు చాలా సూటిగా చెబుతున్నాడని అర్థం. దేవుని ఆత్మచేత తాకబడిన వ్యక్తి "యేసు ఎవరో ఇప్పుడు నేను చూస్తున్నాను" అని హఠాత్తుగా చెబ్తాడు. ఉద్వేగభరితమైన భక్తి అంటే ఇదే.

నేడు మనం వ్యక్తిగత నమ్మకాల స్థానంలో సిద్ధాంతపరమైన నమ్మకాలకు చోటిస్తున్నాం. కేవలం కొద్దిమంది మాత్రమే యేసు క్రీస్తుమీద భక్తిప్రపత్తులు చూపడానికి, అనేకులు ఇతరత్రా కారణాలమీద భక్తిశ్రద్ధలు చూపడానికి కారణం. అనేకులకు యేసుమీద భక్తికంటె సేవాకార్యక్రమాలమీద భక్తి ఎక్కువ. నేటి తరంలోని విద్యావంతులు యేసు క్రీస్తు అంటే మనస్సు నొచ్చుకుంటున్నారు. కారణం, వాళ్లు ఆయననొక హితుడుగా తప్ప యే విధంగానూ అంగీకరించలేకపోతున్నారు. మన ప్రభువు అన్నిటికంటె ఎక్కువగా తన తండ్రి చిత్తానికి విధేయత చూపాడు. మనుషుల్ని రక్షించడం, వారి అవసరాల్ని తీర్చడం యేసు ప్రభువు తన తండ్రి చిత్తానికి చూపించిన విధేయతకు అనుగుణ్యమైన సహజ ఫలితాలు. నేను కేవలం మానవత్వంమీదనే నా భక్తిశ్రద్ధలు చూపినట్లయితే త్వరలోనే నిస్త్రాణకు గురికావడం ఖాయం. అప్పుడు నాలో ఉన్న ప్రేమ సంకోచవ్యాకోచాలకు గురై నేను తడబడతాను. అయితే నేను వ్యక్తిగతంగాను ఉద్వేగభరితంగాను యేసును ప్రేమించినట్లయితే మనుషులు నన్ను కాళ్లు తుడుచుకొనే పీచుబట్టగా ఎంచినప్పటికీ నేను వాళ్లకు సేవచేయగలను. శిష్యుని జీవితరహస్యం అతనికి యేసుక్రీస్తు మీద ఉన్న భక్తి మాత్రమే; అప్రాముఖ్యతను కోరుకోడం, అణకువగా ఉండడం శిష్యుని స్వాభావిక లక్షణాలు. అయినా శిష్యుడి జీవితం నేలలో నాటబడిన విత్తనంలాగా ఉంటుంది. నేలలో నాటబడిన విత్తనం మొలిచి ఎదిగి ఫలించి ప్రయోజనకరంగా ఉంటుంది. "గోధుమగింజ భూమిలో పడి ... చచ్చినయెడల విస్తారముగా ఫలించును." (యోహాను 12:24)

జూన్ 20

## “ఎప్పుడు” అనే స్థితికి వచ్చావా? అయినా!

“యోబు తన స్నేహితుల నిమిత్తము ప్రార్థన చేసినప్పుడు యెహోవా అతని క్షేమస్థితిని మరల అతనికి దయచేసెను” (యోబు 42:10)

శోచనీయమైన, దుర్బలమైన, మరియు స్వార్థపూరితమైన ప్రార్థన క్రొత్త నిబంధనలో మనకెక్కడా కనిపించదు; దేవునితో సరైన సంబంధం కలిగి ఉండాలనే ప్రయత్నపూర్వకమైన పట్టుదల మరియు స్వప్రయోజనాన్ని కోరుకొనే ప్రయత్నాలు కూడా కనిపించవు. నేను దేవునితో సరైన సంబంధం కలిగి ఉన్నాననే ఆలోచన వాస్తవానికి సిలువమీద క్రీస్తు బలి యాగాన్ని ధిక్కరిస్తుంది. “ప్రభువా, నీవు నా ప్రార్థన ఆలకించినట్లయితే నా హృదయాన్ని సరిచేసుకుంటాను; నీవు నాకు సహాయం చేసినట్లయితే నీ యెదుట సరిగ్గా నడుస్తాను” అని నేను ప్రార్థించాననుకోండి. నా అంతట నన్ను నేను దేవునియెదుట సరిచేసుకోలేను; నా అంతట నేను నా జీవితాన్ని పరిపూర్ణంగా మలచుకోలేను. యేసు క్రీస్తు ప్రభువు నాకొరకు చేసిన బలియాగాన్ని నేనొప్పుకొంటేనే దేవునితో నాకు సరైన సంబంధం వుంటుంది. యేసు క్రీస్తు సిలువమీద చేసిన బలియాగం అప్రతిహతమైన బహుమానం. ఈ బలియాగాన్ని ఒప్పుకొనే దీనత్వం నాలో ఉందా? ఈ బలియాగాన్ని అంగీకరించే వినమ్రత నాలో ఉందా? నా హక్కుల్ని నా కోరికల్ని వదులుకున్నప్పుడు నాలో దీనత్వం వుందని అర్థం. నా స్వంత ప్రయత్నాల్ని మానివేసినప్పుడు నాలో వినమ్రత ఉందని అర్థం. నన్ను నేను సంపూర్తిగా దేవుని హస్తాలకు అప్పగించుకోవాలి. అప్పుడు మాత్రమే నేను ఇతరులకొరకు విజ్ఞాపనచేసే యాజకుడిగా ఉండగలను. క్రీస్తు బలియాగంగురించి మనం చేసే ప్రార్థనల్లో కొన్ని సార్లు మనలో ఉన్న అప నమ్మకం బయటపడుతూ ఉంటుంది. యేసు మనల్ని రక్షించడం ఇప్పుడు మొదలు పెట్టడంలేదు. ఆయన ఎప్పుడో మనందరికొరకు రక్షణకార్యాన్ని సంపూర్తి చేశాడు. ఇది నెరవేరిన కార్యం. మళ్లీ మళ్లీ మనం యేసును సిలువవేయడం ఆయణ్ణి అవమానపర్చినట్లే.

యేసు వాగ్దానం చేసిన “నూరు రెట్లు” (మత్తయి 19:29 చూడండి) ప్రతిఫలాన్ని నీవు పొందనట్లయితే, దేవుని వాక్యంలోకి లోతుగా వెళ్లలేకపోతున్నట్లయితే నీ స్నేహితులకొరకు వెంటనే ప్రార్థించు; ఆంతరంగిక జీవితపరిచర్యలోకి ప్రవేశించు. “యోబు తన స్నేహితుల నిమిత్తము ప్రార్థన చేసినప్పుడు యెహోవా అతని క్షేమస్థితిని మరల అతనికి దయచేసెను” (యోబు 42:10). రక్షణపొందిన నీవు వాస్తవంగా చేయవలసిన పరిచర్య విజ్ఞాపన ప్రార్థన. దేవుడు నిన్ను ఏ పరిస్థితుల్లో ఉంచినప్పటికీ నీవు చేయవలసిన పని యేసు సిలువమీద చేసిన బలియాగం ఇతరుల జీవితాల్లో వాస్తవం కావాలని ప్రార్థించడమే. నీ స్నేహితులకొరకు ఇప్పుడే ప్రార్థించు. ఇప్పుడే నీకు పరిచయమైనవారికొరకు ప్రార్థించడం మొదలుపెట్టు. యోబు తన స్నేహితులకొరకు ప్రార్థించినప్పుడు దేవుడు అతను పోగొట్టుకున్నవన్నీ మళ్లీ ఇచ్చాడు. రక్షించబడిన వ్యక్తిగా నీ తొలి పరిచర్య ఇతరులకొరకు విజ్ఞాపనచేసే పరిచర్య. దేవుడు నిన్ను ఎటువంటి పరిస్థితుల్లో ఉంచినప్పటికీ సిలువ బలియాగాన్ని నీవు గుర్తించినట్టుగానే ఇతరులు కూడా గుర్తించేలాగా వారికొరకు ప్రార్థించు. నీ స్నేహితులకొరకు ఇప్పుడే ప్రార్థించు. నీతో పరిచయం ఉన్నవారికొరకు వెంటనే ప్రార్థించు.

జూన్ 21

## ఆంతరంగిక పరిచర్య

"మీరు ... రాజులైన యాజకసమూహము"(1 పేతురు 2:9)

ఏ హక్కుచేత మనం "రాజులైన యాజకసమూహము" అయ్యాం? క్రీస్తు సిలువద్వారా సంపూర్తిచేయబడిన బలియాగం ద్వారానే కదా! మనల్ని మనం ఉపేక్షించుకోడానికి మనం సిద్ధంగా ఉన్నామా? ఇతరులకొరకు విజ్ఞాపనచేసే యాజక పరిచర్య చేయడానికి సిద్ధంగా ఉన్నామా? మనల్ని మనం నిరంతరం పరిశోధించుకొనే ప్రయత్నం చేస్తున్నామా? మన ప్రయత్నాలు స్వార్థపూరితంగా దుర్బలంగా ఉన్నాయా? దేవుని బిడ్డకు ఉండవలసిన నిష్కపటమైన జీవితం మనలో లేదా? మనలో ఆధ్యాత్మిక చురుకుదనం లోపించిందా? మనం దేవునితో సరైన సంబంధాన్ని కలిగి ఉండేవరకు మన జీవితాలు నిస్తేజంగానే ఉంటాయి. "ఎంత గొప్ప విజయం!" అని మనం మాటల్లో చెప్పినప్పటికీ మన జీవితాల్లో విమోచన అద్భుతాన్ని సూచించే లక్షణాలేవీ కనబడవు. నీవు చేయవలసినది ఒక్కటే. విమోచన సంపూర్తి చేయబడిందని ఎటువంటి అడ్డూ లేకుండా స్వేచ్ఛగా ప్రకటించు; ఎటువంటి స్వంత ఆలోచనలు లేకుండా నిర్భయంగా ప్రకటించు. ఇక నీగురించి దిగులు చెందకు. యేసు క్రీస్తు చెప్పిన విధంగా చేయడం ప్రారంభించు. అర్ధరాత్రిలో నీ సహాయంకోరిన నీ స్నేహితుడికొరకు ప్రార్థించు. దేవుని బిడ్డలకొరకు ప్రార్థించు. అందరికొరకు ప్రార్థించు. "ప్రభువా, నేను చేయగలిగినంతమటుకు చేశాను. దయచేసి నా మొర విను" అనే ధోరణి విడిచిపెట్టి నీవు క్రీస్తు యేసులో మాత్రమే పరిపూర్ణత పొందగలవనే వివేచనగలిగి ప్రార్థించు.

మనగురించి మనం ఆలోచించే అనారోగ్యకరమైన అలవాటునుంచి మనల్ని విడిపించడానికి దేవునికెంత సమయం కావాలి? మనం మనగురించి మాత్రమే ఆలోచించడం విడిచిపెట్టాలి. మన అల్పత్వం ఎంత లోతుగా పాతుకుపోయిందో మనం తెలుసుకోలేని స్థితిలో ఉన్నాం. మనం దేవునితో సరైన సంబంధాన్ని కలిగి ఉండే ఒకే ఒక అవకాశం క్రీస్తు యేసులో మాత్రమే. ఒక సారి మనం క్రీస్తు యేసులో ఉన్నప్పుడు ఆంతరంగిక పరిచర్యకొరకు మన జీవితాన్ని మనం ధారపోయాలి.

జూన్ 22

## మార్పులేని తీర్పు నియమం

"మీరు తీర్చు తీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పుతీర్చబడును, మీరు కొలుచు కొలత చొప్పుననే మీకును కొలువబడును" (మత్తయి 7:2)

ఈ ప్రకటన యాదృచ్ఛికమైనది కాదు; ఇది దేవుని శాశ్వత నియమం. ఇతరులకు నీవెలా తీర్పు తీరుస్తావో నీకూ కచ్చితంగా అదే తీర్పు ఇవ్వబడుతుంది. ప్రతీకారం వేరు, ప్రతిఫలం వేరు. ఇతరులకు మనం ఏ కొలత ఉపయోగిస్తామో మనకూ అదే కొలత ఉపయోగించబడుతుంది. యేసు మనకెదురయ్యే ప్రతిఫలంగురించి ఈ మాటలు చెప్పాడు. ఇతరుల్లో లోపాలు వెతకడంలో మనం నేర్పరులమైతే, మనలో లోపాలు వెతికే నేర్పరులు కూడా ఉంటారు. ఇతరులకు నీవు ఏమిస్తావో దాన్నే నీవు ప్రతిఫలంగా పొందుతావు. ఈ నియమం దేవుని సింహాసనంనుంచి వెలువడే శాశ్వత నియమం (కీర్తన 18:25,26 చూడండి).

ఈ విషయాన్నే రోమా 2:1 వచనం మరింత విపులీకరిస్తోంది. ఇతరుల్లో ఏది నేరమని తీర్పు తీరుస్తామో మనం కూడా అదే విషయంలో నేరస్థులం. దేవుడు క్రియను మాత్రమే చూడడు; ఆయన క్రియకు మూలమైన ఆలోచనల్ని, ఆలోచనల్ని ఉత్పత్తి చేసే హృదయపు లోతుల్లోకి చూస్తాడు. కొన్ని సార్లు మన ప్రవర్తన మనం బైబిలును నమ్మడం లేదేమో అన్నట్టుగా ఉంటుంది. ఉదాహరణకు, రోమా 2:1 వచనంలో ఉన్న బైబిలు సత్యాన్ని మనం నిజంగా నమ్ముతున్నామా? ఇతరుల్లో ఏది నేరమని తీర్పు తీరుస్తామో మనం కూడా అదే విషయంలో నేరస్థులమని మనం నమ్ముతున్నామా? నమ్ముతున్నట్లయితే ఇతరుల్లో మనకు కనిపించే నటన వంచన కృత్రిమత్వం మనలో కూడా ఉన్నాయని నమ్ముతున్నామా? "అవును. దేవుని కృప లేనట్లయితే ఇవన్నీ, ఇంకా చాలా చెడు స్వభావాలు నాలో కూడా ఉండేవి. కాబట్టి ఇతరులకు తీర్పు తీర్చే హక్కు నాకు లేదు" అని చెప్పగలిగే వినమ్రత నీలో ఉందా? దేవుని బిడ్డలో ఉండవలసినవి దీనత్వం, మరియు అణకువ.

"మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మునుగూర్చి తీర్పు తీర్చబడదు" (మత్తయి 7:1) అని యేసు చెప్పాడు. ఇతరులకు మనం ఏ తీర్పు తీరుస్తామో మనకూ అదే తీర్పు తీర్చబడుతుందని కూడా యేసు చెప్పాడు. "నా దేవా, ఇతరులకు నేను తీర్చిన తీర్పునే నాకూ తీర్చు" అని మనలో ఎవరైనా దేవుని యెదుట నిలబడి ధైర్యంగా చెప్పగలరా? ఇతరులు పాపాత్ములని మనం తీర్పు తీర్చాం. దేవుడు మనకు కూడా అదే తీర్పు తీర్చినట్లయితే మనం కూడా పాపాత్ములమే కదా! మనం నరకపాత్రులమే కదా! దేవుడు మనుషులకు తీర్పు తీర్చేటప్పుడు సిలువమీద క్రీస్తు బలియాగాన్ని కొలతగా తీసుకొని తీర్పు తీరుస్తాడు!

జూన్ 23

## దుఃఖంతో చెలిమి

"వ్యసనాక్రాంతుడుగాను వ్యాధిననుభవించినవాడుగాను ... ఉండెను" (యెషయా 53:3)

మన ప్రభువు అనుభవించిన "వేదన" మనం అనుభవించలేదు. మనం కూడా శ్రమల్ని వేదనల్ని సహించాం. అయితే ప్రభువు స్వయంగా వేదన ననుభవించినట్టుగా మనం అనుభవించలేదు. మొదట్లో మనకు పాపం గురించిన వాస్తవం తెలియదనే చెప్పాలి. మనిషి తన సహజవాంఛల్ని అదుపుచేసుకున్నట్లయితే, సుగుణాల నలవర్చుకున్నట్లయితే మనిషి దేవుడిగా మారగలడనే మిథ్యావాదాన్ని బలపర్చేవారు కూడా ఉన్నారు. ఇది మనిషిలోని తార్కిక జ్ఞానం. అయితే మనిషి జీవితంలో అత్యంత ప్రధానమైనది ఒకటి ఉంది. అది పాపం. పాపం మన ఆలోచనల్ని మన ఉద్దేశాల్ని భ్రష్టు పట్టిస్తుంది. పాపం మూలంగా మన ఆలోచనలు అగమ్యగోచరమయ్యాయి, అదుపుతప్పిపోయాయి, అవివేకమైనవయ్యాయి.

మానవజీవితంలో పాపం ఒక వాస్తవమని మనం ఒప్పుకోవాలి. పాపం కేవలం ఒక లోపం మాత్రమేనని సరిపెట్టుకోకూడదు. పాపం దేవునికి వ్యతిరేకమైన ఒక కఠోర విద్రోహం. జీవితంలో పాపానికి స్థానం వున్నట్లయితే దేవునికి స్థానం లేదని అర్థం. జీవితంలో దేవునికి స్థానం వున్నట్లయితే పాపానికి స్థానం లేదని అర్థం. క్రొత్త నిబంధన సరిగ్గా ఈ సత్యాన్నే నొక్కి చెబ్తోంది. పాపం నన్ను పరిపాలిస్తున్నట్లయితే నాలో దేవుని జీవం వుండదు. దేవుడు నన్ను పరిపాలిస్తున్నట్లయితే పాపం నాలో ఉండదు. ఇంతకంటె మౌలిక సత్యం మరొకటి లేదు. పాపానికి చరమావస్థ యేసు క్రీస్తు సిలువమరణం. యేసు క్రీస్తు సిలువ మరణం ఒక చారిత్రక వాస్తవం. యేసు క్రీస్తు సిలువమరణం నీ జీవితచరిత్రలోనూ నా జీవితచరిత్రలోనూ కూడా వాస్తవం కావాలి. అంటే పాపం విషయంలో మనం అత్యవసరంగా ఒక పరిష్కారానికి రావాలి. పాపాన్ని పరిష్కరించడంకొరకే యేసు క్రీస్తు లోకంలోనికి వచ్చాడు. ఆ పాపానికి పరిష్కారమే మనలో కలిగే దుఃఖం, మరియు వేదన.

జూన్ 24

## పాపమనే వాస్తవంతో పరిష్కారానికి రావడం

"ఇది మీ గడియయు అంధకార సంబంధమైన అధికారమును ... " (లూకా 22:53)

పాపాన్ని పరిష్కరించుకోకపోయినట్లయితే, పాపాన్ని గుర్తించి పాపనివృత్తి చేసుకోక పోయినట్లయితే జీవితంలో యెదురయ్యేవన్నీ అనార్థాలు అవాంతరాలే. మానవ స్వభావంలోని ఔన్నత్యంగురించి నీవు గొప్పగా మాట్లాడవచ్చు; అయితే నీవు మానవ స్వభావంలో గొప్పగా భావించేవాటినన్నిటినీ పరిహాసం చేసేది కూడా మానవ స్వభావంలోనే ఉంది. మానవ స్వభావంలో దుష్టత్వం స్వార్థం ఉన్నాయనే వాస్తవాన్ని నీవు ఒప్పుకోకపోయినట్లయితే, నీవు వాటిని పరిష్కరించుకోడానికి బదులు వాటితో రాజీపడి జీవించడం నేర్చుకుంటావు. నీ జీవితంలో పాపాన్ని నీవు "గడియ"గాను, "అంధకారసంబంధమైన అధికారము"గాను పరిగణించావా? లేక, పాపాన్ని లెక్కచేయనక్కర్లేదనే అభిప్రాయం నీలో ఉందా? మానవ సంబంధాల్లోను స్నేహ సంబంధాల్లోను పాపాన్ని పరిష్కరించుకుంటున్నావా? పరిష్కరించు కోకపోయినట్లయితే రాజీపడడమనే ఉచ్చు ఏదో ఒక మూల పొంచి ఉంటుంది. పాపాన్ని పరిష్కరించుకోవాలనుకున్నప్పుడు మాత్రమే మానవసంబంధాల్లో పాపం ఎటువంటి ఉప ద్రవాల్ని సృష్టిస్తుందో నీవు గుర్తించగలవు. అప్పుడు నీవు "అవును. పాపమంటే ఏమిటో ఇప్పుడు నాకు తెలిసింది" అని చెప్పగలవు. మానవసంబంధాల్లో స్నేహసంబంధాల్లో పాపాన్ని పరిష్కరించుకోడంవలన ఆ సంబంధాలేవీ తెగిపోవు. వాస్తవానికి సంబంధబాంధవ్యాలు ఇంకా బలోపేతమౌతాయి. జీవితంలో పాపంవలన ఎటువంటి విపత్కర పరిణామాలెదురవుతాయో ఇతరులు కూడా తెలుసుకుంటారు. పాపమనే వాస్తవాన్ని విస్మరిస్తూ జీవితంగురించి గొప్పగా ఊహించుకోకు.

మానవ స్వభావపు తీరుతెన్నులు యేసు క్రీస్తుకు తెలుసు. అయినా ఆయన మనుషుల్నెన్నడూ విమర్శించలేదు, సందేహించలేదు. ఎందుకంటే మానవ స్వభావాన్ని మార్చడానికి తాను చేయాలనుకున్నదానిపట్ల ఆయనకు పూర్తి నమ్మకం వుంది. కొందరిలో అమాయకత్వం వుంటుంది. అమాయకుల్ని పరిశుద్ధులని లెక్కించకూడదు. వాస్తవానికి ఎవరైతే రక్షించబడతారో వారే పరిశుద్ధులు. రక్షణ లేనంతవరకు మనకు జీవితం భద్రమైనది కాదు. అమాయకులుగా లెక్కించబడాలనుకోడం అవివేకమే. మనం అమాయకులుగా ఉండాలని దేవుడు కోరుకోడంలేదు; మనం పరిశుద్ధులుగా సుగుణవంతులుగా ఉండాలని దేవుడు కోరు కుంటున్నాడు. అమాయకత్వం పసిపిల్లల లక్షణం. పాపాన్ని పరిష్కరించుకోడానికి ప్రయత్నించని మనిషి నిందార్హుడే.



జూన్ 25

## అగ్నివంటి వేదన

"నేనేమందును?  -తండ్రీ, యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము; అయినను ఇందుకోసరమే నేను ఈ గడియకు వచ్చితిని; తండ్రీ, నీ నామము మహిమ పరచుమని చెప్పెను" (యోహాను 12:27-28)

దేవుని బిడ్డగా వేదనలపట్ల నా వైఖరి ఎలా ఉండాలి? శ్రమల్ని వేదనల్ని నివారించమని నేనడగకూడదు. అయితే శ్రమల్లోను వేదనల్లోను నన్ను కాపాడమని నేను దేవుణ్ణి ప్రార్థించాలి; అగ్నివంటి శ్రమగానీ వేదనగానీ వచ్చినప్పుడు నేను దేవుని ఉద్దేశాల ప్రకారం ఆయనలో నిలిచి ఉండేలాగా దేవుణ్ణి  ప్రార్థించాలి. శ్రమలోను వేదనలోను సైతం మన ప్రభువు తానెవరో, తాను ఏం చేయవలసి ఉందో మర్చిపోలేదు. ఆ "గడియ"నుంచి ఆయన తప్పించుకోలేదు గానీ, ఈ "గడియ"ను సంపూర్తి చేశాడు.

జీవితంలో ఎటువంటి బాధలు రాకూడదని మనం కోరుకుంటాం; అయితే బాధలు వస్తాయి. వాటిని మనం భరించక తప్పదు. బాధల్ని తప్పించుకోవాలనుకోడం అవివేకం. జీవితంలో బాధలు కూడా ఒక వాస్తవం. బాధలుండకూడదని చెప్పడంలో అర్థం లేదు. పాపం, బాధ, శ్రమ ఉంటాయి. దేవుడు వాటిని అనుమతించి పొరబాటు చేశాడని మనం తలంచ కూడదు.

శ్రమ మనిషిలోని అల్పబుద్ధిని మిడిమిడి జ్ఞానాన్ని తొలగిస్తుంది. అయితే శ్రమ మనిషిని గొప్పవాడిని చేయదు. శ్రమ నాకు గెలుపునైనా ఇస్తుంది; లేక, ఓటమినైనా ఇస్తుంది. ఎప్పుడూ విజయమే నీకు లభించదు. లభించినట్లయితే గర్వంతో నిన్ను నీవు మర్చిపోతావు. శ్రమలేకపోయినా కూడా జీవితం విసుగ్గానే ఉంటుంది. అయితే శ్రమల్లో నిబ్బరంగా ఉండాలని మనం కోరుకోవాలి. పరిశుద్ధ లేఖనం కూడా శ్రమానుభవంగురించి ఇదే చెబ్తోంది; మనుషుల అనుభవాలు కూడా ఇదే చెబ్తున్నాయి. శ్రమల్లో నిబ్బరంగా ఉన్నవారిని మనం తేలిగ్గానే గుర్తించగలం. వీరు మనకు శ్రమ వచ్చినప్పుడు మనకు తోడుగా ఉంటారు. మనకు వీరి దగ్గర ఆదరణ లభిస్తుంది. జీవితంలో ఏ వ్యక్తికైనా శ్రమానుభవం లేనట్లయితే అతనిలో ధిక్కారం వుంటుంది. అటువంటి వ్యక్తి నిన్ను చులకనగా చూస్తాడు; నీకు తోడుగా ఉండడు. ఇతరులకు సహాయంచేసే గుణం అతనిలో ఉండదు. శ్రమల్లో నీవు నిబ్బరంగా ఉన్నట్లయితే నీవితరుల మేలును అభివృద్ధిని కోరుకునే వ్యక్తిగా ఉంటావు. శ్రమల్లో నీవు నిబ్బరంగా ఉన్నట్లయితే ఇతరుల్ని అభిమానించే వ్యక్తిగా ఉంటావు; ఇతరుల అభిమానాన్ని కూడా పొందుతావు.

జూన్ 26

## దేవుని కృపను పొందడం - ఇప్పుడు

"దేవుని కృపను వ్యర్థము చేసికొనవద్దని మిమ్మును వేడుకొనుచున్నాము" (2 కొరింథీ 6:1)

నిన్నటి కృప నిన్నటి కొరకే. నేటి కృప నేటిదే. కృప నిరంతరం దేవునినుండి జాలువారుతూనే ఉంటుంది. కృప నీకెప్పుడూ అందుబాటులో ఉంటుంది. "శ్రమలయందును ఇబ్బందులయందును ఇరుకులయందును ... మిగుల ఓర్పుగలవారమై" (2 కొరింథీ 6:4) - ఇది పౌలు జీవితానుభవం. శ్రమల్లోను ఇబ్బందుల్లోను ఇరుకుల్లోను నీవు దేవుని కృపమీద ఆధారపడడంలేదా? "ఈ ఒక్కసారీ ... పరవాలేదులే" అని నీలో నీవు అనుకుంటున్నావా? ఇక్కడ మన చర్చ నీ ప్రార్థనగురించి, నీవు దేవుణ్ణి సహాయం చేయమని వేడుకొనడంగురించి కాదుగానీ ప్రస్తుత క్షణంలో నీవు దేవుని కృపను ఎంతగా కోరుకుంటున్నావనేదానిగురించి మాత్రమే. మన సేవకు ప్రార్థనే సిద్ధబాటు అని మనం ఆలోచిస్తుంటాం. అయినా ఇలాగని బైబిల్లో ఎక్కడా లేదు. ప్రార్థన దేవునికృపను పొందే సాధనం మాత్రమే. "నా శ్రమలన్నీ తొలగిపోయేవరకు భరించి ప్రార్థిస్తాను" అని చెప్పకు. ఈ క్షణంలోనే ప్రార్థించు. అవసరతలో తత్క్షణమే ప్రార్థించి దేవుని కృపను పొందు. ప్రార్థన మనలో కలిగే అతిసాధారణమైన స్పందన; ఫలితాన్నిచ్చే ప్రక్రియ. ప్రార్థన నీ భక్తిని ప్రదర్శించే పరావృత చర్య కాదు. ప్రార్థనద్వారా దేవుని కృపను పొందే విషయంలో మనం ఇంకా చాలా నేర్చుకోవలసి ఉన్నాం.

"దెబ్బలయందును చెరసాలలలోను అల్లరులలోను ప్రయాసములలోను ... " (2 కొరింథీ 6:5) - వీటన్నిటిలో దేవుని కృపమీద ఆధారపడు. అప్పుడు ఇతరులకు నీవే ఒక అద్భుతంగా కనిపిస్తావు. సమయాన్ని వాయిదా వేయకు; ఇప్పుడే, తత్క్షణమే కృపను పొందు. ఆధ్యాత్మిక పదావళిలో "ఇప్పుడే" అనే పదం చాలా ముఖ్యమైనది. పరిస్థితులు నిన్నెక్కడికైనా నడిపించనివ్వు; నీవు ఏ స్థితిలోనైనా ఉండు - నీవు మాత్రం దేవుని కృపను పొందుతూనే ఉండు. నీవు దేవుని కృపను పొందుతున్నావనేందుకు నిదర్శనం నీలో ఉన్న దీనత్వం. కృపను తప్ప ఏ భావోద్రేకాన్ని వెల్లడిచేయని నీ అణకువ స్వభావమే నీవు దేవుని కృపను పొందుతున్నావనేందుకు రుజువు.

"ఏమియు లేనివారమైనట్లుండియు ... " . నీకొరకు ఏదీ దాచుకోవద్దు. నిన్ను నీవు రిక్తుణ్ణి చేసుకో. నీవు ఇవ్వగలిగినంత ఇవ్వు. ఎప్పుడూ దీనత్వంలో అణిగి ఉండు. దేవుడు నీకు ఇచ్చిన సమృద్ధి విషయంలో సంపదల విషయంలో మనస్సు విప్పి మాట్లాడు; తెలివితేటలు చూపకు. "సమస్తమును కలిగినవారము" - పేదరికానికి నిమ్నస్థితికి లభించే ఘనవిజయం ఇదే! (6:10)

జూన్ 27

## దేవుని విడుదల

“నిన్ను విడిపించుటకు నేను నీకు తోడైయున్నాను; ఇదే యెహోవా వాక్కు” (యిర్మీయా 1:8)

తాను స్వయంగా యిర్మీయాను విడిపిస్తానని దేవుడతనితో చెప్పాడు. “దోపుడు సొమ్ము దక్కించుకొనునట్లు నీ ప్రాణమును నీవు దక్కించుకొందువు ... ” (యిర్మీయా 39:18) - దేవుడు తన పిల్లలతో ఈ వాగ్దానం చేస్తున్నాడు. దేవుడు మనకు ఏ స్థితి రప్పించినా సరే, ఆయన మన ప్రాణాన్ని కాపాడతాడు. ధనకనకవస్తువాహనాలకు మనం అంతగా ప్రాముఖ్యత ఇవ్వవలసిన అవసరంలేదు. ఇవన్నీ అస్థిరమైనవి. అలా కాకపోతే మనకు దిగులు, చింత, గుండెపోటు తప్పవు. దేవుడు మనల్ని స్వయంగా విడిపిస్తాడని మనం గాఢంగా నమ్ముతూ ఉంటే ఇందుకు బలమైన నిదర్శనం భౌతిక సంపదలపై మనకున్న తటస్థ దృక్పథం.

లోకంలో న్యాయంకొరకు ఎదురు చూడవద్దు! న్యాయంకొరకు ఎదురు చూసినట్లయితే మనం ఫిర్యాదులు చేస్తూనే ఉండాలి. మనం న్యాయం జరగలేదనే అసంతృప్తితో వేసారుతూ ఉండాలి. లేదా, “నాకెందుకు ఇలా జరిగింది” అని మనమీద మనమే సానుభూతి చూపించుకోవలసి ఉంటుంది. ఎందుకంటే లోకంలో న్యాయం లేదు గనక. లోకంలో న్యాయం కొరకు ఎదురుచూడడం మన దృష్టిని మన ప్రభువుమీదనుంచి ప్రక్కకు మళ్లిస్తున్నామని సూచిస్తుందేమో! నీకు న్యాయం జరిగినా జరగకపోయినా నీవు మాత్రం న్యాయం జరిగించు. అన్ని విషయాల్లో న్యాయాన్ననుసరించు. మన దృష్టి యేసు క్రీస్తు మీద ఉన్నట్లయితే మనకు న్యాయం ఎదురైనా అన్యాయం ఎదురైనా మనం పట్టించుకోవలసిన అవసరం లేదు. దేవుడు మనకు అప్పగించిన పని మనం చేయాలి. ఆయన మన ప్రాణాన్ని కాపాడతాడు. నిన్ను నీవు కాపాడుకోగలిగితే దేవుని కాపుదల నీకక్కర్లేదని అర్థం. మన ప్రభువు కొండమీద చేసిన ప్రసంగంలో “చింతింపకుడి” అని చెప్పాడు. అంటే ఎవరు మనకు న్యాయం జరిగించినా, న్యాయం జరిగించకపోయినా మనం చింతించనక్కర్లేదనే కదా! మనలో అత్యంత భక్తి తత్పరతలు ఉన్నవారు సైతం ఈ విషయంలో తమలోని అపనమ్మకాన్ని బైటపెట్టడం సహజం. ఎందుకంటే మనలో ఉన్న ఇంగిత జ్ఞానానికి పెద్దపీట వేస్తూ, మన లోకజ్ఞానానికి దేవుని పేరును జతచేస్తున్నాం. పూర్ణహృదయంతో దేవునిమీద ఆధారపడడానికి బదులు మన స్వంత తెలివితేటలమీద ఆధారపడుతున్నాం (సామెతలు 3:5-6 వచనాలు చూడండి).

జూన్ 28

## దేవుని బలమైన పిడికిలిలో

“నేను దేని నిమిత్తము క్రీస్తుయేసుచేత పట్టబడితినో దానిని పట్టుకొనవలెని పరుగెత్తుచున్నాను” (ఫిలిప్పీ 3:12)

దేవుడు తన పనికొరకు నిన్ను పట్టుకున్నప్పుడు నీవు “కుడికేగాని యెడమకే గాని తిరుగక మీ దేవుడైన యెహోవా ఆజ్ఞాపించునట్లు చేయుటకు” (ద్వితీ 5:33) జాగ్రత్తగా ఉండు. మనం దేవుని పని చేయాలని కోరుకున్నాం కాబట్టి చేయడం కాదు గానీ, దేవుడు మనల్ని పట్టుకున్నాడు కాబట్టి మనం చేస్తున్నాం. ఒకసారి ఆయన మనల్ని పట్టుకున్న తర్వాత “నేను ఈ పనికి తగినవాడిని కానేమో” అనే ఆలోచన మనలో ఉండకూడదు. నీవేం బోధించాలో అది నీ తలంపు కాదు; దేవుడే నీవేం బోధించాలో తెలియజేస్తాడు. నీ బోధ విషయంలో నీలో ఉన్న సహజ జ్ఞానం నీకు అక్కరకు రాదు; నీ స్వంత ఆలోచనలు నీ స్వంత ఇష్టాలు పనిచేయవు. నీవు కేవలం నీ సాక్ష్యం చెప్పడంకొరకు పిలవబడలేదు; నీవు సువార్త ప్రకటించడంకొరకు పట్టబడ్డావు. ప్రతి క్రైస్తవుడు దేవుని సత్యానికి సాక్షి. నీవు బోధించాలని దేవుడు కోరుకుంటున్నట్లయితే ఆయన నిన్ను గట్టిగా పట్టుకుంటాడు. దేవుని హస్తం బలమైనది. ఇక నీ జీవితం ఆయన చేతుల్లోనే ఉంటుంది. మనలో ఎంతమంది దేవునిచేత పట్టబడ్డారు?

దేవుని వాక్యాన్ని ఎన్నడూ అనాలోచితంగా బోధించకు; దేవుని వాక్యం ఏం చెబుతుందో దాన్ని కచ్చితంగా బోధించు. దేవుని వాక్యం ఏం చెబుతుందో దాన్ని ఉన్నది ఉన్నట్టు బోధించడానికి వెనుకడుగు వేయకు. అయితే ఇతరులతో నీవు వ్యవహరించవలసి వచ్చినప్పుడు నీవొక గొప్పవాడిగా నీ గురించి ఊహించుకోకు; కృపద్వారా రక్షించబడిన నీవు గతంలో పాపివే.

“సహోదరులారా, నేనిదివరకే పట్టుకొని యున్నానని తలంచుకొనను. అయితే ఒకటి చేయుచున్నాను ... క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురియొద్దకే పరుగెత్తుచున్నాను” (ఫిలిప్పీ 3:13,14)

జూన్ 29

## కఠోర నియమం

“నీ కుడిచెయ్యి నిన్నభ్యంతరపరచినయెడల దాని నరికి నీయొద్దనుండి పారవేయుము; నీ దేహమంతయు నరకములో పడకుండ నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనకరము గదా!” (మత్తయి 5:30)

ప్రతి వ్యక్తీ తన కుడిచేతిని నరికివేసుకోవాలని యేసు ప్రభువు చెప్పడంలేదు. అయితే దేవునితో మన ప్రవర్తన విషయంలో మన కుడి చెయ్యి మనతో పాపం చేయిస్తున్నట్లయితే దాని “తొలగించాలని” అర్థం. లోకంలో చాలా విషయాలు పైకి చూడడానికి న్యాయసమ్మతంగా ఉన్నట్టుగానే కనిపిస్తాయి. అయితే మన దృష్టి లోకంమీద కాక దేవునిమీద ఉన్నప్పుడు ఆ పనులు న్యాయసమ్మతమైనవి కావని మనకు తెలుస్తుంది కాబట్టి మనం వాటిని చేయలేం. మన కుడి చెయ్యి మనకు చాలా ముఖ్యమైన అవయవం. అయితే యేసు బోధలప్రకారం జీవించడంలో మన కుడి చెయ్యి మనకు అడ్డంగా ఉన్నట్లయితే దాన్ని “నరికి”వేయాలి. యేసు బోధించిన ఈ నియమం చాలా కఠోర నియమం. మానవ చరిత్రలో ఎవరూ ఈ విధంగా బోధించి ఉండరు.

దేవుడు నీకు నూతన జీవాన్నిచ్చి నిన్ను తిరిగి పుట్టించినప్పుడు మొదట్లో నీ చెయ్యి కుంటిదిగానే ఉంటుంది. ఎందుకంటే మనం చేయదగిన పనులకంటే చేయకూడని పనులెక్కువగా ఉంటాయి. ఈ పనులు పాపమే. వాటి విషయంలో మనకు కుడి చెయ్యి లేనట్లే కదా! అయితే ఆధ్యాత్మిక సత్యాలకు దూరంగా ఉన్నవారు “ఆ పని చేస్తే తప్పేమిటి? నీవు తెలివితక్కువవాడివి” అనడం కూడా మామూలే. కుంటి చేతులు లేని పరిశుద్ధులు అసలు ఉండరేమో! అయితే కుంటి చేతితోనైనా పరలోకంలోకి ప్రవేశించడం మంచి పనేమో! ఎందుకంటే మనుషుల దృష్టిలో రెండు చేతులున్నవారిగా ఉండడంకంటె దేవుని దృష్టిలో ఒక్క చెయ్యి కలిగి ఉండడం మంచిది. లోకంలో అందరికీ మంచిగా కనిపించే పనులు మనకు మంచివి కాకపోవచ్చు. ఏది మంచిదో ఏది మంచిది కాదో పరిశుద్ధాత్మ మన హృదయానికి బోధిస్తాడు. అయితే పరిశుద్ధాత్మ నీకు విధించే ఆంక్షలతో ఇతరుల్ని నీవు విమర్శించవద్దు.

మొదట్లో క్రైస్తవ జీవితం కుంటిచేతి బతుకులాగా కనిపించినప్పటికీ అది అవయవలోపం ఉన్న జీవితం కాదు. అది పరిపూర్ణత మరియు పరిశుద్ధత నిండిన జీవితం. “మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు” (మత్తయి 5:48).

జూన్ 30

## వెంటనే చెయ్యి

"త్వరగా వానితో సమాధానపడుము" (మత్తయి 5:25)

ఈ వచనంలో యేసు క్రీస్తు ఒక ప్రాముఖ్యమైన నియమాన్ని బోధించాడు. "నీవు ఏం చేయాలో నీకు తెలుసు కాబట్టి దాన్ని వెంటనే చెయ్యి. ఇప్పుడే చెయ్యి. చెయ్యకపోయినట్లయితే అనివార్యమైన పర్యవసానం యెదురవుతుంది. నీవు "కడపటి కాసు" (5:26) చెల్లించవలసి ఉంటుంది. అప్పుడు నీకు బాధ వేదన మరియు నిరాశ తప్పవు. దేవుని నియమాలు మార్పులేని నియమాలు. నీవు వాటిని తప్పించుకోలేవు. యేసు బోధలు హృదయంలోకి సూటిగా గుచ్చుకుపోయే కఠిన సత్యాలు.

నీ ప్రతివాదితో, లేక నీ శత్రువుతో సమాధానపడు. నీవు మోసానికి వంచనకు గురయ్యావనేది వాస్తవమే. అయితే నీవు మాత్రం నీ ప్రతివాదిని మోసం చేయకూడదు; నీ శత్రువును వంచించకూడదు. మనం సమాధానపడాలని యేసు బోధించాడు కాబట్టి సమాధానపడం అనివార్యం. ఇది ఏ కాలానికైనా వర్తించే శాశ్వత నియమం కూడా. దీన్ని నీవు తప్పించుకోలేవు. నీవు నీ హక్కుల గురించి వాదిస్తావా? లేక, మన ప్రభువైన యేసు క్రీస్తు వైపునుంచి ఆలోచించి నీ ప్రతివాదితో సమాధానపడతావా?

ఏం చేయాలనుకున్నావో దాన్ని త్వరగా చెయ్యి. నిన్ను నీవు పరీక్షించుకో. నైతిక విషయాల్లో ఆధ్యాత్మిక విషయాల్లో తత్క్షణ స్పందన అవశ్యం. నీవు నిర్దాక్షిణ్యంగా ఉంటే నీకూ నిర్దాక్షిణ్యమే యెదురవుతుంది. దేవుడు తన పిల్లల్ని ప్రతి మాలిన్యంనుంచి ప్రతి మకిలనుంచి కడిగి శుద్ధిచేస్తాడు. దేవుడు తన పిల్లలు మంచులాగా నిర్మలంగా ఉండాలని కోరుకుంటున్నాడు. ఆయన బోధలపట్ల మనం విధేయత చూపాలని దేవుని ప్రగాఢమైన కోరిక. మనల్ని విధేయతకు రప్పించడానికి ఏం చేయాలో పరిశుద్ధాత్మకు తెలుసు. మనలో ఏ తప్పూ లేదని పరిశుద్ధాత్మతో వాదించేందుకు మనం చేసే ప్రతి ప్రయత్నం మనలోని అవిధేయతనే ఎత్తి చూపుతుంది. "సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడియున్నవని ప్రత్యక్షపరచ బడునట్లు వెలుగునొద్దకు వచ్చును" (యోహాను 3:21). మనం దేవుని వెలుగులో నడవాలని, వెలుగు ప్రకాశించే జీవితాన్ని జీవించాలని ఆయన కోరుకుంటున్నాడు.

"నీ ప్రతివాదితో ... త్రోవలో ఉండగానే త్వరగా వానితో సమాధానపడుము". ఇతరులతో నీ సంబంధ బాంధవ్యాల్లో ఎప్పుడైనా నీకు హఠాత్తుగా కోపం వచ్చిందా? నీలో కోపం ఉన్నట్లయితే వెంటనే దేవునియెదుట ఒప్పుకో. నీవు ఎవరిమీద కోపపడ్డావో త్వరగా వాళ్లతో సమాధానపడు. ఇది అవశ్యం, మరియు అనివార్యం.



జూలై 1

## తప్పించుకోలేని శిక్ష

“కడపటి కాసు చెల్లించువరకు అక్కడనుండి నీవు వెలుపలికి రానేరవని ... ” (మత్తయి 5:26)

పరలోకమంటే అచ్చంగా పరలోకమే. అందులో నరకానికి సంబంధించింది లేశం కూడా ఉండదు. దేవుడు నిన్ను పరిశుద్ధపర్చి, యోగ్యుణ్ణి చేసి, ప్రత్యేకించాలనుకుంటున్నాడు కాబట్టి పరిశుద్ధాత్మ నిన్ను నిశితంగా పరిశీలిస్తుంటాడు. పరిశుద్ధాత్మ సూక్ష్మపరీక్షనుంచి నీవు తప్పించుకోలేవు. పరిశుద్ధాత్మ నీ పాపాల్ని నీకు చూపించి నీవు అపరాధివని నీకు తెలియపరిచాడు. అయితే నీవు వెంటనే లోబడలేదు. అప్పుడు అనివార్యమైన ప్రక్రియ ఆరంభమైంది. అవిధేయతకు శిక్ష వచ్చింది. అవిధేయతకు శిక్ష అనివార్యం. “అంతట నీవు చెరసాలలో వేయబడుదువు. కడపటి కాసు చెల్లించువరకు అక్కడనుండి నీవు వెలుపలికి రానేరవని ... ” (మత్తయి 5:25,26) బైబిలు చాలా స్పష్టంగా చెబ్తోంది. అయినా నీవు “ఈయన కృప ఉన్న దేవుడేనా? ప్రేమ ఉన్న దేవుడేనా?” అని అడుగుతావు. దేవునివైపునుంచి చూసినప్పుడు వాస్తవానికి ఇది ప్రేమ కార్యమే; కొనియాడదగిన చర్యే. దేవుడు నిన్ను పరిశుద్ధుడిగా నిష్కళంకుడిగా నిర్దోషిగా బయటికి తీసుకొని రావాలనుకుంటున్నాడు. అయితే నీ స్వభావమెటువంటిదో నీవు గుర్తించాలని ఆయన కోరుకుంటున్నాడు. నీగురించి నీకు హక్కు ఉందనే స్వభావం నీది. నీ స్వభావాన్ని మార్చడానికి నీవు దేవునికి అనుమతి ఇవ్వడానికి సిద్ధపడినప్పుడు నీలో దేవుని నూతన కార్యాలు మొదలవుతాయి. నీవు దేవునితోను సాటిమనుషులతోను సరైన సంబంధాలు కలిగి ఉండడం దేవుని ఉద్దేశమని నీవు గుర్తించినప్పుడు ఆయన నిన్ను ఋజుమార్గంలో నడిపిస్తాడు. కాబట్టి వెంటనే సమాధానపడు. “అవును ప్రభువా, నా ప్రతివాదికి ఇప్పుడే సమాధానపడుత్తూ ఉత్తరం రాస్తాను” అని తీర్మానం చేసుకో. లేక, “ప్రభువా, ఇప్పుడే నేను నా విరోధితో సమాధానపడతాను” అని ఒప్పుకో.

యేసు క్రీస్తు బోధలు నీ మేధస్సుకొరకు కావు. అవి నీ చిత్తవృత్తి కొరకు, నీ మనస్సాక్షి కొరకు. నీ మేధస్సుతో ఆలోచించి యేసు క్రీస్తు బోధలతో విభేదిస్తూ వాదించినట్లయితే నీ హృదయాన్ని నీవే మందం చేసుకుంటున్నావని అర్థం.

“నేను ఆధ్యాత్మికంగా ఎందుకు ఎదగలేకపోతున్నాను?” అని నిన్ను నీవు ప్రశ్నించుకున్నట్లయితే, వెంటనే నీ మనస్సాక్షిని నీవు మరో ప్రశ్న కూడా అడగాలి. దేవుని విషయంలో నీవు ఋణస్థుడివే. దేవునికి నీ ఋణాలన్నీ తిరిగి చెల్లించావా? ఏదో ఒక రోజు నీవు దేవునికి చెల్లించవలసినవి ఇప్పుడే చెల్లించు, వెంటనే చెల్లించు. ప్రతి నైతిక ప్రశ్న లేదా నైతిక పిలుపు తర్వాత “తప్పక చేయాలి” అనే సహాయక క్రియాపదం ఉంటుంది. నీవు చేయవలసిన పనేదో తెలుసుకో, తత్క్షణమే చేయి.

జూలై 2

## శిష్యత్వపు షరతులు

“ఎవడైనను నాయొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు. మరియు ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడు ... ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచిపెట్టనివాడు నా శిష్యుడు కానేరడు” (లూకా 14:25-26,27,33).

మనకు ఇతరులతో ఉన్న సంబంధబాంధవ్యాలు యేసు క్రీస్తుకు మనమీద ఉన్న హక్కులకు ఆటంకంగా ఉన్నట్లయితే మన ప్రభువు మననుంచి అవశ్యంగా విధేయత కోరుకుంటాడు. ఒక వ్యక్తిపట్ల వ్యక్తిగతమైన మరియు భావావేశపూరితమైన భక్తిశ్రద్ధల్నే శిష్యత్వంగా చెప్పవచ్చు. మనం శిష్యత్వం ప్రభువుతోనే. ఒక వ్యక్తిపట్ల భక్తిశ్రద్ధల్ని చూపడం వేరు, ఒక సిద్ధాంతంపట్ల లేదా ఒక పని పట్ల భక్తిశ్రద్ధల్ని చూపడం వేరు. శిష్యుడుగా ఉండాలనుకోడమంటే మన ప్రభువుకు దాసుడుగా ఉండాలనుకోడమే. ఇలా ఉండాలనుకోడానికి ప్రేరణ ప్రభువుపట్ల మనలో ఉన్న ప్రేమ మాత్రమే. అయితే నేడు క్రైస్తవుల్లో చాలామందిలో యథార్థమైన భక్తిశ్రద్ధలు లేవు. పరిశుద్ధాత్మ అనుగ్రహిస్తే తప్ప భూమ్మీద ఎవరిలోనూ ప్రభువైన యేసుపట్ల భావావేశపూరితమైన ప్రేమ ఉండదు. మనం ప్రభువుపట్ల భక్తిశ్రద్ధలు చూపించినప్పటికీ ఆయణ్ణి మనఃపూర్వకంగా ప్రేమించడం అరుదు. “మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది” (రోమా 5:5) అని బైబిలు సెలవిస్తుంది. నీ ద్వారా యేసు మహిమపర్చబడాలని పరిశుద్ధాత్మ ఉద్దేశమైనప్పుడు పరిశుద్ధాత్మ కుమ్మరించే దేవుని ప్రేమ నీలో పొంగి ప్రవహిస్తుంది.

క్రైస్తవ జీవితానికి మరొక గుర్తు యథార్థమైన మరియు అప్రయత్నపూర్వకమైన ప్రేమ. యేసు క్రీస్తుకు శిష్యుడుగా ఉన్న వ్యక్తి కూడా యేసు క్రీస్తులాగే ఉండాలి. యేసు క్రీస్తు తన పరలోకపు తండ్రితో ఏకరీతిగా అన్యోన్యత కలిగి ఉన్నాడు. అలాగే క్రైస్తవుని అన్యోన్యత యేసు క్రీస్తుతోనే! ఒకదానితో మరొకటి పొసగని అసమ్మతితో కూడిన సిద్ధాంతాలతో కాదు. మనుషులు తమ స్వంత నమ్మకాలకు సిద్ధాంతాలకు బద్ధులై ఉంటారు. అయితే మనుషులు యేసు క్రీస్తుపట్ల యథార్థమైన ప్రేమను చూపించాలంటే వారి హృదయాల్లో బలంగా వేళ్లూనిన స్వంత అభిప్రాయాల్ని దేవుడే పటాపంచలు చేయాలి.

జూలై 3

## వ్యక్తిగత పాపపు తీవ్రత

“అయ్యో, నేను అపవిత్రమైన పెదవులు గలవాడను ... నేను నశించితిని ” (యెషయా 6:5)

నేను దేవుని సన్నిధిలోకి వచ్చినప్పుడు నాలో ఉన్న పాపాలు ఎంత తీవ్రస్థాయిలో ఉన్నాయో నాకు తెలుస్తుంది. “నాకు తెలుసు, నేను పాపినే” అనే మాటలు ఎవరైనా చాలా సులువుగా చెప్పగలిగే మాటలు. అయితే ఒక వ్యక్తి దేవుని సన్నిధిలోకి వచ్చినప్పుడు తన పాపాల విషయంలో అనిర్దిష్టమైన అస్పష్టమైన ధోరణి విడిచిపెట్టాలి. యెషయా తనలో ఉన్న దోషాన్ని నిర్దిష్టంగా గుర్తించినట్టుగా మనం కూడా మనలో ఉన్న పాపాన్ని సూటిగా స్పష్టంగా గుర్తించాలి. ఒక వ్యక్తి దేవుని సన్నిధిలో ఉన్నాడనేందుకు రుజువు పాపాన్ని స్పష్టంగా సూటిగా ఒప్పుకోడం మాత్రమే. పరిశుద్ధాత్మ మన ఆలోచనల్ని అంతరంగాన్ని పరిశోధించినప్పుడు మనం దేవునికి విధేయత చూపి మన పాపాల్ని ఒప్పుకోవాలి. మన పాపాలు ఎంత విస్తారంగా ఉన్నాయో ఎంత తీవ్రంగా ఉన్నాయో పరిశుద్ధాత్మ మనకు వెల్లడిచేస్తాడు. ఇది మనం దేవుని సన్నిధిలో ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమౌతుంది.

ప్రతి మనిషి జీవితంలోను పాపం ఉంటుంది. అయితే మొదట్లో మనం “ఏది పాపమో నాకు తెలియడం లేదు” అని చెబ్తాం. పరిశుద్ధాత్మ ఏది పాపమో మన అంతరాత్మకు బోధిస్తాడు. ఈ అనుభవం దేవుని సన్నిధిలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ తెలిసినదే. యెషయాకు దర్శనం కలిగినప్పుడు అతను అపవిత్రమైన పెదవులు గలవాడినని గ్రహించాడు. “బలిపీఠముమీదనుండి కారుతో తీసిన నిప్పును చేతపట్టుకొని నా యొద్దకు ఎగిరి వచ్చి నా నోటికి దాని తగిలించి - ఇది నీ పెదవులకు తగిలెను గనుక నీ పాపమునకు ప్రాయశ్చిత్తమాయెను, నీ దోషము తొలగిపోయెను అనెను” (యెషయా 6:7). పాపం తీవ్రంగా ఉన్నచోట నిప్పుతో శుద్ధిచేయవలసిందే!

జూలై 4

## "వద్దు" అని దేవుడు చెప్పినవి

"వ్యసనపడకుము అది కీడుకే కారణము" (కీర్తన 37:8)

వ్యసనం మనకు మానసికంగా ఆధ్యాత్మికంగా స్థానభ్రంశం కలిగిస్తుంది. "వ్యసనపడకూడదు" అని మనం చెప్పడం ఒక విషయమైతే, వ్యసననడకుండా ఉండలేని స్వభావం మనలో ఉండడం మరొక విషయం. "యెహోవా యెదుట మౌనముగానుండి ఆయనకొరకు కనిపెట్టుకొనుము" (37:7) అని చెప్పడం సులువే గానీ మన స్వంత అనుభవం విషయంలో మనం కూడా అందరిలాగానే వ్యసనపడకుండా ఉండడానికి తలక్రిందులవుతుంటాం. ఇటువంటి సమయంలో దేవుని యెదుట మౌనంగా కనిపెట్టడం మనకు సాధ్యమయ్యే పనేనా? "వ్యసనపడకుము" అనే ఆజ్ఞను ఇక్కడ మనం అమలు చేయలేకపోయినట్లయితే ఎక్కడా ఆ ఆజ్ఞను అమలుచేయలేం. మన కష్టసమయాల్లోనే కాదు, మనకెదురైన అనిశ్చిత పరిస్థితుల్లోనే కాదు, మనం శాంతియుతంగా ఉన్న సమయాల్లో కూడా "వ్యసనపడకుము" అనే ఆజ్ఞను పాటించకపోతే ఎప్పటికీ ఆ ఆజ్ఞను పాటించలేం. నీ విషయంలో ఈ ఆజ్ఞ పనిచేయకపోతే ఎవరి విషయంలోనూ ఈ ఆజ్ఞ పనిచేయదు. దేవునియెదుట మౌనంగా కనిపెట్టడానికి నీ బాహ్యపరిస్థితులకు ఎటువంటి సంబంధం లేదు. దేవునియెదుట మౌనంగా కనిపెట్టడం దేవునితో నీకున్నటువంటి అన్యోన్యతమీద ఆధారపడిన విషయం.

మనోవ్యథ పాపానికి దారితీస్తుంది. ఏదైనా విషయంగురించి మథనపడడం ఆందోళనచెందడం మనలో ఉన్న తెలివితేటలకు నిదర్శనమని మనం ఆలోచించినప్పటికీ వాస్తవానికి అది మనలో ఉన్న చెడుస్వభావానికి నిదర్శనం. మనోవ్యథకు కారణం మన స్వంత ఆలోచనల్ని మనం నమ్మడం, మన స్వంత పరిష్కారాల్ని మనం కోరుకోడం. మన ప్రభువు ఎన్నడూ ఆందోళన చెందలేదు; ఎన్నడూ దేనిగురించి మథనపడలేదు. కారణం, ఆయన తన తన స్వంత ఉద్దేశాల్ని కాక దేవుని ఉద్దేశాల్ని నెరవేర్చాలని కోరుకోడమే. దేవుని బిడ్డ విషయంలో మనోవ్యథ అతిక్రమమే.

నీకు ఎదురైన పరిస్థితుల్ని దేవుడు సరిచేయలేడనే బుద్ధిహీనమైన ఆలోచనలు నీలో ఉన్నాయా? నీ ఆలోచనలు నీ చింతలు అన్నీ ప్రక్కన పెట్టి "సర్వశక్తుని నీడను" (కీర్తన 91:1) విశ్రమించు. ఏం జరిగినా సరే వ్యాకులత చెందనని నిర్భయంగా దేవునితో చెప్పు. మనలో ఉన్న వ్యథకు వ్యాకులతకు కారణం మన స్వంత ఆలోచనలే, స్వంత ప్రణాళికలే.

జూలై 5

## దేవుడు లేకుండా ప్రణాళికలు వేసుకోవద్దు

"నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము నీవు ఆయనను నమ్ముకొనుము ఆయన నీ కార్యము నెరవేర్చును" (కీర్తన 37:5)

దేవుడు లేకుండా ప్రణాళికలు వేసుకోవద్దు: దేవునికి చోటివ్వకుండా మనం వేసుకున్న ప్రణాళికల్ని ఆయన వమ్ము చేస్తాడు. దేవుని ఉద్దేశాల్లో లేని ప్రణాళికల్లో మనం మునిగి ఉన్నట్లయితే ఏదో ఒక రోజు మనకు వైఫల్యం తప్పదు. ఇందుకు కారణం మనం దేవుడిచ్చే జీవానికి ఉత్తేజానికి దూరంగా ఉండడమే. అయితే మనం ఆందోళన చెందకుండా ఉండాలంటే మనం చేయవలసినది మన ప్రణాళికల్లో దేవునికి ప్రథమ స్థానాన్నివ్వడమే.

ఆధ్యాత్మిక విషయాల్లో మనం దేవునికి ప్రథమ స్థానాన్నివ్వడం సహజమే. అయితే మన దైనందిన జీవితానికి సంబంధించిన విషయాల్లో దేవునికి స్థానమివ్వ నక్కర్లేదని మనం ఆలోచిస్తుంటాం. "ఆధ్యాత్మిక ముసుగు" లేకుండా మనం దేవుణ్ణి సమీపించలేమనే అపోహ మనలో ఉండడమే ఇందుకు కారణం. మనం ఎలా ఉన్నామో అలాగే దేవుని దగ్గరకు రావాలి. మన జీవితంలో ఏ సమయమైనా ఏ సందర్భమైనా అది దేవునిదే.

దుష్టత్వంగురించి నీ మనస్సులో బాధపడ్తూ ప్రణాళిక వేయకు: లోకంలో దుష్టత్వం వుంది. అయితే మనం దృష్టత్వాన్ని లెక్కలోకి తీసుకొని మన ప్రణాళికల్ని వేసుకోకూడదు. ఎందుకంటే ప్రేమ వీటన్నిటినీ పట్టించుకోదు. "ప్రేమ ... అపకారమును మనస్సులో ఉంచుకొనదు" (1 కొరింథీ 13:5). మన ప్రణాళికల్లో దేవునికి చోటు లేనట్లయితే మన మనస్సులు లోకంలో ఉన్న దుష్టత్వాన్ని లెక్కలోకి తీసుకొని ప్రణాళికలు వేస్తాయి. మన ఆలోచనలన్నీ ఈ విషయంమీదే నిలిచి ఉంటాయి.

రేపటికొరకు దాచుకోవాలనే ఆలోచనతో ప్రణాళిక వేయకు: నీవు క్రీస్తును నిజంగా నమ్ముతున్నట్లయితే రేపటికొరకు ఏదీ దాచుకోవు. "మీ హృదయమును కలవరపడ నియ్యకుడి" (యోహాను 14:1) అని యేసు చెప్పాడు. ఇది ఒక రకంగా ఆజ్ఞలాంటిదే. మనం కలతచెందడం యేసుకు ఇష్టం లేదు. ఈ ఆజ్ఞను ఆచరించడం కష్టమే. రోజులో ఎన్ని సార్లు నీవు కలత చెందకుండా ఉండాలని ప్రయత్నించి విఫలమైనప్పటికీ మళ్లీ మళ్లీ ప్రయత్నించు. అన్నిటిలోను దేవునికి ప్రథమస్థానాన్నివ్వు. నీ ప్రణాళికల్లో దేవునికి చోటివ్వు.

జూలై 6

## దర్శనాలు నెరవేరడం

"ఎండిన భూమిలో నీటిబుగ్గలు పుట్టును" (యెషయా 35:7)

మొదటగా దర్శనం; తర్వాత దర్శనం సార్థకత. దర్శనం సార్థకం కాబోయే దశలో సాతాను మన ముందుకు శోధనలు తెస్తాడు. ఇక ముందుకు నడవడం అసాధ్యమని మనం డీలా పడిపోతుంటాం. దర్శనాన్ని సార్థకం చేయడానికి బదులు మనల్ని మనమే చిన్నబుచ్చుకుంటాం.

*నిరాశాగనిలో తవ్వితీసిన*
*మట్టిలోని మాణిక్యం జీవితం*
*కష్టాలు కన్నీళ్లు సానబెట్టగా*
*అయ్యిందొక అపురూప వజ్రం.*

దేవుడు మనకు దర్శనాన్నిస్తాడు. ఆ దర్శనం మనలో సార్థకంకావడానికి ఆయన మనల్ని కష్టాలలోయలో నడిపిస్తాడు. ఇక్కడే మనలో చాలామంది అధైర్యపడి తమ ప్రయత్నాల్ని విరమించుకుంటారు. దేవుడనుగ్రహించే ప్రతీ దర్శనం మనలో సహనం ఉన్నప్పుడు మాత్రమే సార్థకమవుతుంది. దేవుని సమాయాల్ని ఒక్కసారి చూడు! ఆయన తొందరపడడు, ఎవరినీ తొందరపెట్టడు. మనమే అన్నిటికీ హద్దుమీరి తొందరపడు తుంటాం. దర్శనం సంపూర్ణంగా వెల్లడికాకముందే మనం కార్యరంగంలోకి దూకుతాం. దేవుడు మనల్ని కష్టాలకొలిమిలో బాధలసుడిగుండంలో నడిపించి సానబెట్టినప్పుడు మనలో దర్శనం సార్థకమవుతుంది. దేవుడు మనకు దర్శనం అనుగ్రహించినప్పటినుంచి ఆ దర్శనం మనలో సార్థకం చేయడానికి ఆయన పనిచేస్తూనే ఉన్నాడు. ఆయన లక్ష్యం మనలో నెరవేరడానికి ఆయన మనల్ని సానబెడుతూనే ఉన్నాడు. అయినా మనం మాటిమాటికీ మనల్ని సానబెట్టే శిల్పి చేతుల్లోంచి తప్పించుకోడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాం. కారణం మనం దేవుని ఉద్దేశాన్ని కాక మన స్వంత ఉద్దేశాన్నే కోరుకోడం.

దేవుడు మనకనుగ్రహించిన దర్శనం మనం అందుకోలేనంత ఎత్తులో లేదు. అది ఇక్కడే మనలోనే ఉంది. నిన్ను సారెమీద పెట్టి గిరాగిరా త్రిప్పి తాను కోరుకున్న పాత్రగా మలచుకోడానికి పరమకుమ్మరికి అనుమతి ఇవ్వు. అప్పుడు నీవు అచ్చంగా దేవుడు కోరుకున్నట్టుగా ఉంటావు; నీలో ఆయన దర్శనం సార్థకమవుతుంది. అయితే ఈ ప్రక్రియలో నిరాశపడకు. దర్శనంమధ్యలో సంతృప్తిచెంది దర్శనాన్ని విడిచిపెట్టడానికి ప్రయత్నించకు. దేవునికది ఇష్టం లేదు. దర్శనం సార్థకతకొరకు ప్రయత్నించు.



జూలై 7

**యోగ్యత, మరియు శ్రేష్ఠత అప్రయత్నంగా కలగవు**

"ఇరుకు ద్వారమున ప్రవేశించుడి ... జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దిరి సంకుచితమునై యున్నది" (మత్తయి 7:13-14)

మనం యేసు శిష్యులుగా జీవించాలని కోరుకుంటున్నట్లయితే యోగ్యమైన మరియు శ్రేష్ఠమైన జీవితాన్ని జీవించడానికి చాలా కష్టపడాలి. ఈ విషయం మనం మర్చి పోకూడదు. క్రైస్తవ జీవితం నిస్సందేహంగా ఇరుకైనదే; అయితే ఆ ఇరుకు మనల్ని అధైర్యపర్చదు కుంగజేయదుగానీ మనం గెలవాలని మనలో చైతన్యస్పృహ కలిగిస్తుంది. యేసు క్రీస్తుద్వారా దేవుడు మనకనుగ్రహించిన అద్భుత రక్షణను మనం గణించవలసిన రీతిలో గణిస్తున్నామా? ఆయన ఘనతకొరకు ఆయన మహిమకొరకు మనమర్పించే సర్వస్వం ఈ గణనకు తగినదేనా?

దేవుడు తన సర్వోన్నత కృపద్వారా యేసు బలియాగాన్నిబట్టి మనుషులందరినీ రక్షిస్తున్నాడు. "మీరు ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయా సంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు ఆయనే" (ఫిలిప్పీ 2:13). అయితే అనుదినం మనమే మన దైనందిన జీవితకృత్యాల్లో రక్షణకు "కార్యసిద్ధి" కలిగేలా చూడవలసిన బాధ్యత మనదే (ఫిలిప్పీ 2:12). దేవుడు మన కనుగ్రహించిన విమోచనను బట్టి ఆయన మనకాజ్ఞాపించినదాన్ని నెరవేర్చడానికి ఉద్యమించినప్పుడు కార్యసిద్ధి సాధ్యమేనని గ్రాహ్యమవుతుంది. గ్రహించలేనట్లయితే దేవుడు మనలో ఉంచిన రక్షణపట్ల మనం కార్యోన్ముఖులం కాలేదని అర్థం. మనలో కార్యసిద్ధి ఉన్నదో లేదో మనకు పరీక్ష ఎదురైనప్పుడు బయటపడుతుంది. మనం పరిశుద్ధాత్మకు విధేయులమై మన దైనందిన జీవితంలో "కార్యసిద్ధి" కలిగి ఉన్నప్పుడు మనకెదురైన పరీక్షలో సంకటసమయంలో ధైర్యంగా నిలబడగలం; మన హృదయాల్ని మనం దిటవు చేసుకోగలం; దేవుని కృప కూడా మనకు తోడుగా ఉంటుంది.

మనకెదురైన పరీక్షల్నిబట్టి ఆయనకు వందనాలు! ఆయన రక్షణ మనకు ఆనందాన్నిస్తుంది. అయితే రక్షణ మనలో ధైర్యసాహసాల్ని నీతివర్తనను కూడా కోరు తుంది. అంతే కాదు, రక్షణ మనలో ఉన్న యోగ్యతను సైతం పరీక్షిస్తుంది. యేసు "అనేకులైన తన కుమారులను మహిమకు" (హెబ్రీ 2:10) తెచ్చుచున్నాడు. అయితే మనకు లభించిన కుమారత్వానికి కార్యసిద్ధి కలిగించే భారం మనదే. ఇందుకు మనకు మినహాయింపులేదు. దేవుని కృపమూలంగా మనం యేసు క్రీస్తుతో అన్యోన్యత కలిగి ఉన్నాం. అయితే ఆయన మనల్ని గారాబం చేయడు; మనల్ని ఏ పనీ చేయలేని దుర్బలుల్ని చేయడు. జీవితవాస్తవాల్ని గ్రహిస్తూ, యోగ్యత మరియు శ్రేష్ఠత కలిగి జీవించాలంటే శిష్యునికి వ్యక్తిగత క్రమశిక్షణ చాలా అవసరం. క్రమశిక్షణ నలవర్చు కోడానికి ప్రయత్నం కూడా అంతే అవసరం.



జూలై 8

## నమ్మకంగా ఉండాలనే ఇచ్ఛాశక్తి

''మీరు ఎవని సేవించెదరో ... నేడు మీరు కోరుకొనుడి'' (యెహోషువ 24:15)

ఒక వ్యక్తిలోని ఇచ్ఛాశక్తి అతని క్రియలద్వారా విశదమవుతుంది. నా సంకల్పాన్ని నేను వదిలిపెట్టకూడదు; ఎలాగైనా సరే నేను సంకల్పించినదాన్ని నెరవేర్చే ఇచ్ఛాబలం నాలో ఉండాలి. దేవునిపట్ల విధేయత చూపడానికి, ఆయన అనుగ్రహించే ఆయన ఆత్మను పొందడానికి నాలో సంకల్పబలం వుండాలి. దేవుడు నాకు సత్యంగురించి దర్శనాన్నిచ్చినప్పుడు ఆయన ఏం చేస్తాడనేది ప్రశ్నార్థకం కాదుగానీ నేనేం చేస్తాననేదే ముఖ్యం. దేవుడు మనలో ప్రతి ఒక్కరిముందూ గొప్ప ప్రతిపాదనలు ప్రణాళికలు ఉంచుతున్నాడు. అయితే, దేవుడు నిన్ను రక్షించిన తొలి క్షణాల్ని జ్ఞాపకంచేసుకో; ఆయన నిన్ను తాకిన తొలి సందర్భాన్ని గుర్తుకు తెచ్చుకో; నీవు యేసుదగ్గరకు వచ్చిన మొదటి పరిచయాన్ని జ్ఞాపకం చేసుకో; బైబిల్లోని సత్యాన్ని తొలిసారిగా తెలుసుకున్న సమయాన్ని జ్ఞాపకం చేసుకో. దేవుడు నీ ముందు ఉంచినవాటిపట్ల అప్పుడు నీ కర్తవ్యమేమిటో నీకు బోధపడుతుంది; ఆ ప్రతిపాదనలగురించి ప్రణాళికలగురించి ఏం చేయాలో నీవే గ్రహించగలవు. పరిశుద్ధాత్మ నీ ముందుకు క్రొత్త ప్రతిపాదన తెచ్చిన ప్రతిసారీ నీ అనుభవాల్ని జ్ఞాపకం చేసుకో.

''మీరు ఎవని సేవించెదరో ... నేడు మీరు కోరుకొనుడి''. నీ ఎంపిక మనఃపూర్వకంగానూ బహిరంగంగానూ ఉండాలి. నీ ఎంపిక అవ్యక్తమైనది అనాలోచితమైనది యాంత్రికమైనది కాదు; ఇది నీ సంకల్పశక్తికి నీ ఇచ్ఛాబలానికి సంబంధించిన ఎంపిక. నీవెవరిని సేవించాలో తీర్మానం చేసుకొనేవరకు నీ జీవితంలో ఇతర కార్యక్రమాలన్నీ తాత్కాలికంగా సందిగ్ధంలో పడతాయి. ఈ ఎంపిక లేదా ఈ తీర్మానం నీకూ దేవునికి సంబంధించినది కాబట్టి ఇది నీ ఒక్కడి సంకల్పానికి ఇచ్ఛకు సంబంధించిన విషయం. ఇందులో ఇంకెవరికీ ప్రమేయం లేదు. అందుకే పౌలు ''ఆయనను నాయందు బయలుపరప ననుగ్రహించినప్పుడు మనుష్యమాత్రులతో నేను సంప్రతింపలేదు'' (గలతీ 1:16) అని తన స్వంత అనుభవం గురించి చెప్పాడు. ప్రతి ప్రణాళిక దేనికదే! క్రొత్త ప్రతిపాదన వచ్చిన ప్రతిసారీ మనం మన చుట్టూ ఉన్నవారికి దూరమైపోతున్నామనే ఆలోచన మనకు కలుగుతుంది. సరిగ్గా అందుకే మనలో ఆందోళన మొదలవుతుంది. ఇతరుల్ని నీవు సంప్రతిస్తే నష్టం లేదుగానీ నీవు కోరుకుంటున్నదాన్ని నీ మనోభిలాషను ఇతరులెంతవరకు గ్రహించారో నీకు స్పష్టంగా తెలియకపోవచ్చు. దేవుడు నిన్నెక్కడికి నడిపించాలనుకుంటున్నాడో ఆయన నీకు వెల్లడిచేయవలసిన పనిలేదు; అయితే ఆయన తన గురించి మాత్రం నీకు వెల్లడిచేస్తాడు.

అప్పుడు నీవు ''నేనును .... యెహోవాను సేవించెదము'' అని బహిరంగంగా ఒప్పుకో. నీవు యేసు క్రీస్తును సేవించడానికి నిర్ణయించుకున్నప్పుడు ''మిమ్మును గూర్చి మీరే సాక్షులై'' ఉన్నారనే విషయాన్ని జ్ఞాపకం పెట్టుకో. సహక్రైస్తవుల్ని సంప్రతించవలసిన పనిలేదు; నీ మట్టుకు నీవు సూటిగా స్వేచ్ఛగా ''నేనును .... యెహోవాను సేవించెదము'' అనే నీ నిర్ణయాన్ని తెలియచేయి. నమ్మకంగా ఉండాలనే ఇచ్ఛాశక్తిని సంకల్పబలాన్ని కలిగి ఉండు. ఇతరుల్లో కూడా ఇచ్ఛాశక్తిని సంకల్పబలాన్ని పెంపొందించు.

జూలై 9

## నిన్ను నీవు పరీక్షించుకుంటావా?

“అందుకు యెహోషువ -యెహోవా పరిశుద్ధ దేవుడు ... మీరాయనను సేవింపలేరు” (యెహోషువ 24:19)

నీ నమ్మకం సంపూర్తిగా దేవునిమీదనేనా? లేశమాత్రమైనా ఇతర ఆధారాలను నమ్ముతున్నావా? ఇతరమైనవాటిని నమ్మడం నీవు పూర్తిగా విడిచిపెట్టావా? లేక ఇతరమైనవాటిని నమ్మే స్వాభావిక నైజం నీలో ఇంకా మిగిలి ఉందా? లేక ఫలానా సమయాన్ని, ఫలానా సందర్భాన్నీ నమ్ముతున్నావా? నీ అంతరాత్మను ఈ ప్రశ్నలడుగుతూ నిన్ను నీవు పరీక్షించుకుంటున్నావా? “నా అంతట నేను యోగ్యుడిగా జీవించలేను” అని నిన్ను నీవు పరీక్షించుకోడం యథార్థతో కూడినదే. అయితే యేసు నీ జీవితాన్ని యోగ్యమైన జీవితంగా రూపొందించగలడని నమ్ము. “మీరాయనను సేవింపలేరు” - అయితే శక్తి ననుగ్రహించమని సర్వశక్తుడైన దేవుణ్ణి అడుగు. దేవుని అద్భుతజీవం నీలో వెల్లడయ్యేలా నీకు దేవునితో సరైన సంబంధం వుందా?

“జనులు -అట్లు కాదు, మేము యెహోవాయే సేవించెదమని యెహోషువతో చెప్పిరి” (యెహోషువ 24:21). ఇది హఠాత్తుగా కలిగే మానసిక ప్రేరణమీద ఆధారపడిన క్రియ కాదు; ఇది సావధానమైన ఉద్దేశపూర్వకమైన మరియు ప్రయత్నపూర్వకమైన క్రియ. “దేవుడు నన్ను ఈ పనికొరకు ఏర్పరుచుకోడు; నేను అయోగ్యుడిని” అని నీవు చెబ్తావేమో! ఆయన నిన్నే ఏర్పరుచుకున్నాడు. నీవెంత అశక్తుడవైనప్పటికీ నీవెంత బలహీనుడవైనప్పటికీ ఆయన నిన్నే పిలుస్తున్నాడు. తన గుణగణాలమీద తనకు, తన శక్తిసామర్థ్యాలమీద తనకు అపారనమ్మకం వున్న వ్యక్తిని దేవుడు ఏర్పరుచుకోడు. దేవుడు తనమీద ఆధారపడి తనను నమ్మేవారికే తన పని నప్పగిస్తాడు. తన మీద తనకు అపారనమ్మకం వున్న వ్యక్తి దేవునియెదుట “నేను దేవుణ్ణి మాత్రమే సేవిస్తాను” అని చెప్పలేడు.

ఇప్పుడు ప్రశ్న “నేను నమ్ముతున్నానా?” మనలో ఉన్న అపనమ్మకాన్ని యేసు తీవ్రంగా పరిగణిస్తున్నాడు. “వారి అవిశ్వాసమునుబట్టి ఆయన అక్కడ అనేకమైన అద్భుతములు చేయలేదు” (మత్తయి 13:58). నీలో నిజంగా అపనమ్మకం వున్నట్లయితే నీ పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించు.

జూలై 10

## ఆధ్యాత్మిక సోమరి

“కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు ... ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము” (హెబ్రీ10:24-25)

మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక విషయంలో ఆధ్యాత్మిక సోమరులమే. జీవితం పూలబాటలాగా సాగిపోవాలని మనం కోరుకుంటూ ఎగుడుదిగుళ్లను మనమే కావాలని తప్పించుకుంటున్నాం. జీవితం సుఖవంతంగా సాగించి, చివరకు ప్రశాంతంగా ఈ లోకాన్ని వీడివెళ్లడమే ప్రధానమని మనం ఆలోచిస్తుంటాం. మనం ఐకమత్యంగా ఉండాలని ఇతరుల్ని ప్రేమించే విషయంలోను మంచిపనులు చేసే విషయంలోను ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఉండాలని హెబ్రీ పత్రిక పదవ అధ్యాయంలోని ఈ వచనాల్లో కనిపిస్తోంది. ప్రేమించడానికైనా మంచిపనులు చేయడానికైనా అంతఃప్రేరణ చాలా ముఖ్యం. మనకొరకు మనం కష్టపడడంకాదుగానీ క్రీస్తుకొరకు కష్టపడడానికి సంసిద్ధత చూపాలి. ఎవరితోనూ కలవకుండా అంటీ ముట్టనట్టుగా ఉండడం ఆధ్యాత్మికత కాదు. వాస్తవానికి యేసు క్రీస్తు బోధించిన ఆధ్యాత్మికత ఇందుకు పూర్తిగా విరుద్ధం.

అన్యాయం న్యూనత కృతఘ్నత కలత వంటివి మన ఆధ్యాత్మికతకు నిజమైన పరీక్ష. వీటికి భీతిచెంది మనం ఆధ్యాత్మికంగా సోమరులుగా తయారవుతాం. మనకు అన్యాయం జరిగినప్పుడు, మనల్నెవరైనా కించపర్చి న్యూనత చూపినప్పుడు, మనం చేసిన మేళ్లను మర్చి ఎవరైనా కృతఘ్నత చూపినప్పుడు, మనం కలతచెందినప్పుడు మనం ఒంటరిగా ప్రార్థించడంగానీ లేక బైబిలు చదువుతూ మనకు మనమే ఏకాంతంగా గడపడంగానీ చేస్తుంటాం. మనకు సంతోషం కలగడానికి, సమాధానం కలగడానికి మాత్రమే మనం దేవుణ్ణి సమీపిస్తుంటాం. మనం యేసు క్రీస్తును తెలుసుకోవలసిన రీతిలో తెలుసుకోకుండా మనకు అవసరమైనప్పుడు మాత్రమే ఆయన దగ్గరకు వస్తుంటాం. మనం సరైన దారిలో నడవడం లేదనడానికి ఇది మొదటి గుర్తు. మనం యేసు క్రీస్తునుంచి పొందాలనుకుంటున్న సంతోషం సమాధానం మనం పొందాలనుకుంటున్న ఫలితాలే; అయితే వాటిని మనం ఫలితాలుగా కాక ఉద్దేశకారణాలుగా చూడాలి.

“మిమ్మును రేపుట న్యాయమని యెంచుకొనుచున్నాను” (2 పేతురు 1:13-14) అని పేతురు చెబుతున్నాడు. అంటే, ప్రేమ విషయంలోను సత్కార్యాలు చేయడంలోను మనలో ప్రేరణ కలిగించడం సరైనదని పేతురు ఉద్దేశం. మనం ఆధ్యాత్మికంగా చురుగ్గా ఉండడమంటే ఖాళీ సమయం అనేది లేకుండా ఎప్పుడూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండడం కాదు. క్షణం ఖాళీలేకుండా మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసే పనులు ఆధ్యాత్మిక చురుకుదనానికి నిజమైన ఉదాహరణలు కావు. ఆధ్యాత్మిక సోమరితనమంటే ఎప్పుడూ వినడమే గానీ, విన్నవాటిని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించని మొద్దుతనం; ఇతరుల ప్రోత్సాహాన్ని తిరస్కరించే మంకుతనం. యేసు ప్రభువు మనల్ని విశ్రాంతి తీసుకోడానికి పిలవలేదు. మనం చురుగ్గా పనిచేయాలని ఆయన కోరుకుంటున్నాడు. “మీరు వెళ్లి ... వారికి తెలుపుడనెను” (మత్తయి 28:10). ఆధ్యాత్మిక సోమరితనాన్ని విడిచిపెట్టు; కదిలి అడుగు ముందుకు వెయ్యి.

జూలై 11

## ఆధ్యాత్మిక తీక్షణత ఉన్న పరిశుద్ధుడు

''ఆయనను ... ఎరుగు నిమిత్తమును'' (ఫిలిప్పీ 3:10-11)

పరిశుద్ధుడికి తన స్వంత శక్తిసామర్థ్యాలు ముఖ్యం కాదుగానీ, యేసు క్రీస్తును ఆయన చిత్తాన్ని ఆయన ఉద్దేశాల్ని తెలుసుకోడమే ముఖ్యం. ఆధ్యాత్మిక తీక్షణత ఉన్న పరిశుద్ధుడు తనకెదురైన సంఘటనల్ని అలవోకగా జరిగిన సంఘటనలుగా పరిగణించడు. పరిశుద్ధుడు తన ఆధ్యాత్మికజీవితం వ్యావహారికజీవితం వేర్వేరని కూడా ఆలోచించడు. పరిశుద్ధుడు తన జీవితంలోని ప్రతి సందర్భంలోను యేసు క్రీస్తుగురించి తెలుసు కుంటాడు; ప్రతి సందర్భంలోనూ తనను తాను యేసు క్రీస్తుకు అప్పగించుకోడానికి సిద్ధపడతాడు. మన జీవితంలోని ప్రతి రంగంలోను మనం యేసు క్రీస్తును వాస్తవికంగా వెల్లడిచేయాలని పరిశుద్ధాత్మ కోరుకుంటున్నాడు. ఈ విషయాన్ని మనం మర్చిపోకుండా ఉండడానికి పరిశుద్ధాత్మ మనల్ని పదే పదే హెచ్చరిస్తున్నాడు. మనగురించి మనం ఆలోచించినప్పుడు మనం చేసిన మంచి పనులు మనకు గొప్పగా కనబడతాయి. అయితే మనం చేసిన మంచి పనుల్నిబట్టి యేసు క్రీస్తును ఘనపర్చడమే నిజమైన పరిశుద్ధుడి లక్షణం. పరిశుద్ధుడు ఇతరులపట్ల చేసే ప్రతి పనీ తాను యేసు క్రీస్తుకు చేస్తున్నట్లు పరిగణిస్తాడు. పరిశుద్ధుడు తన జీవితాన్ని యేసు క్రీస్తుతో అనుగుణ్యం చేస్తాడు. మన ప్రభువు ప్రతి పనిలోనూ తన తండ్రి చిత్తాన్ని చూశాడు; తన తండ్రితో అన్యోన్యత కలిగి ఉన్నాడు. ''తాను దేవునియొద్దనుండి బయలుదేరి వచ్చెననియు, దేవునియొద్దకు వెళ్లవలసియున్నదనియు యేసు ఎరిగి ... యొక తువాలు తీసికొని ... శిష్యుల పాదములు కడుగుటకును, తాను కట్టుకొనియున్న తువాలుతో తుడుచుటకును మొదలుపెట్టెను'' (యోహాను 13:3-5).

''ఆయనను ... ఎరుగు నిమిత్తమును'' - ఆధ్యాత్మిక తీక్షణత ఉన్న పరిశుద్ధుడి లక్ష్యం యేసు క్రీస్తును తెలుసుకోడమే. ఈ రోజు, ఇప్పుడు, ప్రస్తుత సందర్భంలో యేసు క్రీస్తును తెలుసుకున్నానా? లేనట్లయితే ఆయనపట్ల నేను యథార్థంగా లేనని అర్థం. నా గొప్పతనాన్ని గుర్తించడం ఆధ్యాత్మిక లక్ష్యం కాదు గానీ యేసును తెలుసుకోడమే ఆ ఆధ్యాత్మిక లక్ష్యం. మనకొరకు ఏవో కొన్ని పనులు మనమే నిర్దేశించుకొని వాటిని నెరవేర్చడమే ఆధ్యాత్మిక సాఫల్యమని సాధారణంగా ఆలోచిస్తుంటాం. అయితే ప్రతి సందర్భంలోను యేసు క్రీస్తును వాస్తవం చేయడమే ఆధ్యాత్మిక తీక్షణత ఉన్న పరిశుద్ధుడి జీవితలక్ష్యం!

జూలై 12

### ఆధ్యాత్మికంగా స్వప్రయోజనాన్ని ఆశించే సంఘం

‘‘క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారమగువరకు’’ (ఎఫెసీ 3:11-12)

పునరుద్ధరణ అంటే దేవునికిని సమస్త మానవజాతికిని మధ్య సంబంధాన్ని తిరిగి యేర్పరచడం. అంటే దేవుడు ఆదిలో ఏ సంబంధాన్ని ఉద్దేశించాడో ఆ సంబంధాన్ని తిరిగి యేర్పరచడం. యేసు క్రీస్తు విమోచన పునరుద్ధరణను సఫలంచేసింది. సంఘం స్వప్రయోజనాల్ని ఆశిస్తున్నట్లయితే, వ్యవస్థాగత ప్రయోజనాల్ని కోరుకుంటున్నట్లయితే సంఘంలో ఆధ్యాత్మికత లోపించినట్లే. మనం వ్యక్తిగతంగా యేసు క్రీస్తును తెలుసుకోడంతో మాత్రమే సంతృప్తి చెందకూడదు; మనందరి జీవితాల్లో యేసు క్రీస్తు సమష్టిగా వాస్తవం కావడం పునరుద్ధరణలో భాగం. ఇది దేవుని ఉద్దేశం కూడా. యేసు క్రీస్తు తన వ్యక్తిత్వం సమష్టిగా వెల్లడయ్యేలాగా అనేకుల్ని సంఘంగా చేయడానికి అపొస్తలుల్ని బోధకుల్ని పంపించాడు. మనం కేవలం మన స్వంత ఆధ్యాత్మిక జీవితాన్ని పెంపొందించుకోడం, ఆధ్యాత్మిక విశ్రాంతిసమయాల్ని ఆనందించడం కాదు. యేసు క్రీస్తు శరీరాన్ని, అంటే మనం సంఘాన్ని కట్టడానికి వున్నామనే సత్యం మనందరి జీవితాల్లో ప్రతిధ్వనించాలి.

నా వ్యక్తిగత ఎదుగుదలకొరకు మాత్రమే నేను కష్టపడుతున్నానా? లేక, క్రీస్తు సంఘాన్ని కట్టడానికి కష్టపడుతున్నానా? అయితే అవశ్యమైన విషయం క్రీస్తుతో నా అన్యోన్యత. ‘‘ఆయనను ... ఎరుగు నిమిత్తమును’’ (ఫిలిప్పీ 3:10-11) - ఈ అన్యోన్య సహవాసమే క్రైస్తవునికి అవశ్యంగా కావాలి. నాలో దేవుని ఉద్దేశం పరిపూర్ణంగా వాస్తవం కావాలంటే నాలో సంపూర్ణ సమర్పణ ఉండాలి. అంటే నన్ను నేను ఉపేక్షించుకొని, నన్ను నేను దేవుని అధీనతకు అప్పగించుకోవాలి. నేను నా స్వప్రయోజనాల్ని కోరుకుంటున్నట్లయితే నాపట్ల దేవునికున్న ఉద్దేశానికి భంగం వాటిల్లినట్లే. యేసు క్రీస్తు నాకొరకు చేసిన బలియాగాన్ని నా జీవితంలో నేను వాస్తవం చేసుకోలేకపోతే పర్యవసానం నేను అవమానభారంతో క్రుంగిపోవడమే.

*సంతోషం కాదు, శాంతి కాదు, దీవెన కాదు.*
*నా దేవా, నీవే! నీవే నాకు కావాలి!*

నా జీవితానికి ప్రామాణికం ఇదేనా? మరొకటేమైనా ఉందా?

జూలై 13

## దర్శనం మూల్యం

''రాజైన ఉజ్జియా మృతినొందిన సంవత్సరమున .... ప్రభువు ఆసీనుడైయుండగా నేను చూచితిని'' (యెషయా 6:1)

మనం గొప్పగా భావించేవన్నీ అంతమైన తర్వాతనే మన ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభమవుతుంది. మన జీవితంలో దేవుడు ప్రథమ స్థానంలోకి రావాలంటే మన జీవితంలో అప్పటివరకు ప్రథమస్థానంలో ఉన్నవన్నీ తొలగిపోవాలి. నేను దైవసమానంగా భావించినవన్నీ దూరంకావడం నాకు నిరాశను నిరుత్సాహాన్ని కలిగిస్తుందా? లేక, ''రాజైన ఉజ్జియా మృతినొందిన సంవత్సరమున .... ప్రభువు ఆసీనుడైయుండగా నేను చూచితిని'' అని యెషయా చెప్పినట్టుగా నేను చెప్పగలనా?

''నేను ప్రభువును చూశాను'' అని నేను చెప్పడానికి పూర్వం నా స్వభావం దేవుని స్వరూపంలోకి మారాలి. నేను తిరిగిపుట్టేవరకు, దేవుని రాజ్యాన్ని చూడడం ప్రారంభించేవరకు నేను ప్రతిదాన్నీ నాలో ఉన్న నా స్వంత అభిప్రాయం ప్రకారమే చూస్తాను. నాకు కావలసినది దేవుడు నన్ను సమూలంగా మార్చడం. దేవుడు నాకు కొన్ని బాహ్యాపరిస్థితుల్ని రప్పించి నా అంతరంగాన్ని శుద్ధిచేస్తాడు. నేను దేవుణ్ణి చూసే దర్శనం నా స్వభావంమీద ఆధారపడి ఉంటుంది. నాకు సత్యం వెల్లడిచేయబడుతుందా వెల్లడిచేయబడదా అనే విషయాన్ని నా స్వభావం నిర్ణయిస్తుంది.

నా మొదటి ప్రాధాన్యత దేవుడే, చిట్టచివరి ప్రాధాన్యత కూడా దేవుడే. నేను ముఖాముఖిగా దేవుణ్ణి చూసేవరకు నాకూ ఆయనకు మధ్య ఏదీ అడ్డు రాకూడదు. అప్పుడు నేను ''దేవా, లోకంలో నీవు మాత్రమే ఉన్నవాడవు'' అని ప్రార్థించగలను.

మూల్యం చెల్లించు. నీవు దర్శనం కొరకు బ్రతకగలవని దేవునికి చూపించు!

జూలై 14

**అవమానభారం**

``దుష్టుని ఎదిరింపక, నిన్ను కుడిచెంపమీద కొట్టువానివైపునకు ఎడమచెంపకూడ త్రిప్పుము'' (మత్తయి 5:39)

క్రైస్తవునికి అవమానం ఎదురవుతుందని ఈ వచనం చెబ్తోంది. మనల్ని ఎవరైనా కొట్టినప్పుడు మనం తిరిగి కొట్టకపోతే లోకం దృష్టిలో మనం పిరికివాళ్లక్రింద లెక్క. అయితే మనం తిరిగికొట్టకపోవడం మన జీవితంలో దేవుని కుమారుడున్నాడనేందుకు రుజువు. నిన్నెవరైనా అవమానపర్చినప్పుడు ఎదురు తిరగకు. నీ జీవితంలో దేవుని కుమారుడున్నాడని రుజువుచేయడానికి నీకు ఇదొక అవకాశం. యేసు స్వభావాన్ని నీవు పూర్తిగా అనుకరించలేవనేది నిజమే. అయితే నీకెదురైన అవమానంద్వారా మన ప్రభువైన యేసులో ఉన్న మాధుర్యాన్ని వెల్లడిచేయగలవు.

కొండమీద ప్రసంగంలో విధాయకమైన ఆజ్ఞలు మనకు కనిపించవుగానీ ఆజ్ఞలకంటె శ్రేష్ఠమైనవి కనిపిస్తాయి. యెడమచెంప త్రిప్పడం రెండవ మైలు నడవడం నీ విధిలో భాగం కావు. అయితే మనం యేసు శిష్యులమైనట్లయితే యెడమచెంప త్రిప్పాలి, రెండవ మైలు నడవాలి. ఎందుకంటే యేసు వీటిని ఆచరించాడు కాబట్టి. ``నేనివి చేయలేను. నా గురించి తప్పుగా చెప్పారు, నన్ను అపార్థం చేసుకున్నారు'' అని నేను చెబ్తానేమో! నా హక్కులగురించి నేను వాదించిన ప్రతిసారీ నేను దేవుని కుమారుణ్ణి అవమాన పరుస్తున్నాను. ఆ దెబ్బ నేను భరించినట్లయితే యేసుకు ఆ అవమానం కలిగేది కాదేమో! ``క్రీస్తు పడిన పాట్లలో కొదువైనవాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను'' (కొలొస్స 1:24) అని పౌలు చెప్పడం బహుశా ఇందుకేనేమో! శిష్యుడు తన గౌరవాన్ని కాపాడుకోడం ముఖ్యం కాదుగానీ యేసు గౌరవాన్ని కాపాడడం ముఖ్యం.

ఎదుటి వ్యక్తిలో నీతి ఉండాలని ఎదురుచూడకు. అయితే నీవు మాత్రం నీతి తప్పి నడవకు. లోకంలో న్యాయం ఉండాలని మనం కోరుకుంటాం. ఇది మానవసహజం. అయితే లోకంలో న్యాయంకొరకు ఎదురు చూడకూడదని, మనం మాత్రం న్యాయం తప్పి నడవరాదని కొండమీద ప్రసంగ సారాంశం!

జూలై 15

## ఆధ్యాత్మిక ఘనత మరియు బాధ్యత

‘‘గ్రీసు దేశస్థులకును గ్రీసుదేశస్థులు కానివారికిని ... నేను ఋణస్థుడను’’ (రోమా 1:14)

తాను యేసు క్రీస్తుకు ఋణస్థుడననే భావన పౌలులో బలంగా ఉంది. పౌలు తన జీవితకాలమంతా ఈ విషయంలో కృతజ్ఞత వెల్లడిచేశాడు. ఈ భావన పౌలుకు గొప్ప ప్రేరణ కూడా ఇచ్చింది. రక్షించబడనివారిపట్ల నాలో కూడా ఈ భావన ఉందా? నేను కూడా ఈ విధంగా క్రీస్తుకు ఋణపడి ఉన్నానా? దేవుని బిడ్డగా నాకొక బాధ్యత ఉంది; నశించిపోతున్నవారిగురించి నేను క్రీస్తుకు ఋణస్థుడను. ఇది నాకు లభించిన అరుదైన ఘనత కూడా. జీవితంలో నాకు లభించే ప్రతి గౌరవం అది చిన్నదైనా పెద్దదైనా యేసు క్రీస్తు నాపట్ల జరిగించిన విమోచనద్వారానే నేను పొందాను. ఇతరుల జీవితాల్లో కూడా ఈ విమోచన వాస్తవం కావడానికి నేనేమైనా చేస్తున్నానా? నేను క్రీస్తుకు ఋణస్థుడననే భావన పరిశుద్ధాత్మ నాలో పుట్టించినప్పుడు ఇతరులకొరకు నేనేమైనా చేయగలను.

ఇతరులకంటె నేను ఏ విషయంలోను గొప్పవాడిని కాను. నేను ప్రభువైన యేసు దాసుడను. ‘‘మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడినవారు’’ (1 కొరింథీ 6:19,20) అని పౌలు చెప్పాడు. పౌలు తనను తాను యేసు క్రీస్తుకు విక్రయించుకున్నాడు. అందుకే పౌలు తనగురించి ‘‘యేసు క్రీస్తు దాసుడను’’ అని చెప్పుకున్నాడు. యేసు సువార్త పౌలును అందరిపట్ల ఋణస్థుడ్ని చేసింది. ఇది ప్రతి క్రైస్తవుని జీవితలక్ష్యం కావాలి. నీ గురించి మాత్రమే ప్రార్థించడం మాను. యేసు క్రీస్తు దాసుడుగా నీ జీవితాన్ని మానవసేవలో గడుపు. యేసు క్రీస్తుకొరకు విరవబడిన రొట్టెలాగా పోయబడిన ద్రాక్షారసం లాగా ఉండడమంటే ఇదే!

జూలై 16

## దేవుని ఏలుబడి

"పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును" (మత్తయి 7:10-11)

కొండమీద ప్రసంగంలో యేసు తన ఆత్మను కలిగి ఉన్నవారికొరకు ప్రవర్తనా నియమావళినిచ్చాడు. అన్నిటిమీదా దేవుని ఏలుబడి ఉంది. అడగడానికి వెతకడానికి శిష్యుడికి దేవునిమీద అచంచలమైన విశ్వాసం మరియు తీవ్రమైన ఆకాంక్ష ఉండాలి.

"ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును" - నా దేవునికి అన్నీ తెలుసనే భావన నీలో ఉన్నప్పుడు జీవితంలో నీకెదురయ్యే కష్టాల్ని అనిశ్చిత పరిస్థితుల్ని సునాయాసంగా దాటగలవు. దేవుని ఏలుబడిగురించి నీ మనస్సులో బలమైన భావన ఏర్పడక మునుపు నీకు ఎదురైన ప్రతి మనిషినీ సహాయంచేయమని నీవు అడిగి ఉండవచ్చు. అయితే ఇప్పుడు నీవు మనుషులను అడగవు. నీకు కావలసినవాటిగురించి దేవుడినే అడుగుతావు. అయితే దేవుని ఆత్మను పొందినవారిలో "దేవుడు నా తండ్రి, ఆయన నన్ను ప్రేమిస్తున్నాడు, ఆయన నాగురించి ఏదీ మర్చిపోడు, ఇంక నాకు దిగులులేదు భయంలేదు" అనే భావన ఉంటుంది.

నీకు సహాయం ఎక్కడనుంచి లభించనప్పుడు, దేవుడు నీ పట్ల నిర్దాక్షిణ్యంగా ఉన్నాడని నీవు ఆలోచించి ఉండవచ్చు. ఆయన ఒక సహజమైన తండ్రిలాగా నీ పట్ల వ్యవహరించడంలేదని నీవు ఆలోచించి ఉండవచ్చు. ఆయన నీకు అన్యాయం చేశాడని నీవు ఆలోచించి ఉండవచ్చు. అయితే ఆయనలో నిర్దాక్షిణ్యంలేదు. ఆయన నీపట్ల అసహజంగా ప్రవర్తించడు. ఆయన అన్యాయస్థుడు కాడు. ఒక విషయం గుర్తుంచుకో. నీవు దేవుని ఏలుబడిలో ఉన్నావు. ఆయన ఏలుబడి బహు శక్తిమంతమైనది. దేవుని ఏలుబడిలేకుండా ఆయన చిత్తం లేకుండా నీ జీవితంలో ఏ చిన్న పని సైతం జరగదు. కాబట్టి దేవునిమీద పరిపూర్ణమైన విశ్వాసాన్ని కలిగి ఉండు. ప్రార్థన అంటే కేవలం అడగడం కాదు; అడగడం చాలా సహజమైన ప్రక్రియగా నీవు భావించే మనోవైఖరిని పెంపొందించుకోడమే ప్రార్థనకు నిజమైన అర్థం. "అడుగుడి మీకియ్యబడును" (మత్తయి 7:7).

జూలై 17

## నమ్మకమనే అద్భుతం

''నేను మాటలాడినను సువార్త ప్రకటించినను, జ్ఞానయుక్తమైన తియ్యని మాటలను వినియోగింపక'' (1 కొరింథీ 2:4)

పౌలు ధర్మశాస్త్రంలో నిష్ణాతుడు, గొప్ప వక్త. పౌలు తాను దైన్యవచనాలతో మాట్లాడుతున్నానని చెప్పడంలేదుగానీ తాను సువార్త ప్రకటించినప్పుడు ఒక గొప్ప వక్తలాగా కాక దేవుని శక్తిని ప్రస్ఫుటంగా వెల్లడిచేయడంకొరకే మాట్లాడుతున్నానని చెబుతున్నాడు. యేసులో విశ్వాసం కలిగి ఉండడం కేవలం విమోచనద్వారా ఒనగూడే అద్భుతం మాత్రమే. వాక్చాతుర్యంవలనగానీ నచ్చచెప్పడంవలనగానీ బ్రతిమలాడడం ద్వారాగానీ ఎవరిలోనూ విశ్వాసాన్ని పెంపొందించలేం. విశ్వాసం కలిగి ఉండడం కేవలం దేవుని శక్తితోనే సాధ్యం. విశ్వాసం కలిగి ఉండడానికి మానవసహాయం అవసరంలేదు. సువార్త ప్రబోధంద్వారా సృజనాత్మకమైన విమోచనాకార్యం మొదలవుతుంది. సువార్త బోధకుని వ్యక్తిత్వంమూలంగా ఎవరిలోనూ విమోచనాకార్యం మొదలు కాదు.

నిజమైన మరియు శక్తిమంతమైన ఉపవాసమంటే బోధకుడు అన్నపానీయాలు మానివేయడం కాదు. వాగ్ధాటితో చేసే అనర్గళ ప్రసంగాలనుంచి, ఇతరుల్ని ఆకర్షించే వాక్సరణినుంచి, దేవుని సువార్తను ఆటంకపర్చే ప్రతిదానినుంచి ఉపవసించడమే నిజమైన ఉపవాసం. సువార్త బోధకుడు క్రీస్తుకు రాయబారి. ''దేవుడు మాద్వారా వేడుకొనినట్టు మేము క్రీస్తుకు రాయబారులమై'' (2 కొరింథీ 5:20) అని తన జీవితానుభవంగురించి చెబుతున్నాడు. పౌలు దేవునిసువార్తకు ప్రతినిధి, లేదా రాయబారి. నీ బోధవలన మనుషులు బాగుపడతారని నీవు ఆలోచిస్తున్నట్లయితే వాళ్లెప్పటికీ యేసు క్రీస్తు దగ్గరకు రాలేరు. నీవు సువార్త బోధించేటప్పుడు నీగురించి స్వంత పొగడ్తలు నీగురించి అనుచితమైన ప్రశంసలు ఉన్నట్లయితే నీవు యేసుకు ద్రోహంచేస్తున్నట్లే; సృజనాత్మకమైన విమోచనాశక్తిని అడ్డు కుంటున్నావని అర్థం.

''నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందునని చెప్పెను'' (యోహాను 12:32).

జూలై 18

## విశ్వాసం  ఒక నిగూఢత

''ప్రభువా, నీవెవడవని అతడడుగగా'' (అ.కా. 9:5)

తార్సు పట్టణస్థుడైన పౌలు పూర్వనామం సౌలు. ఇతను పరిసయ్యుడు; అద్భుతమైన విమోచనద్వారా శక్తిమంతుడు మరియు దృఢచిత్తుడు అయిన సౌలు ప్రభువైన యేసుకు దీనుడు మరియు విశ్వాసపాత్రుడు అయిన దాసుడయ్యాడు.

మనం మతాచారాల్ని విడిచిపెట్టిన తర్వాతనే మనలో దేవునిపట్ల యథార్థమైన భక్తి చోటుచేసుకుంటుంది. ఎందుకంటే మనకు ఒకడే యజమాని. మన యజమాని యేసు క్రీస్తు మాత్రమే; మతం కాదు. ఆయణ్ణి చూసిన తర్వాత కూడా ఆయనకు నేను విధేయత చూపకపోతే ''నేను నశించినట్లే'' (యెషయా 6:5; వచనం 1 కూడా చూడండి). తనకు విధేయత చూపమని యేసు క్రీస్తు ఎన్నడూ నన్ను వత్తిడి చేయలేదు. అయితే నేను విధేయత చూపకపోయినట్లయితే నా హృదయంలో దేవుని కుమారుడికి స్థానం లేనట్లే. నేను యేసు క్రీస్తుతో ముఖాముఖిగా ''నేను నీకు విధేయత చూపను'' అని చెప్పగలనా? విధేయత చూపమని యేసు నన్ను వత్తిడి చేయకపోయినప్పటికీ, నేనాయనకు విధేయత చూపకపోయినట్లయితే విమోచనకున్న సృజనాత్మక శక్తిని నేను అడ్డుకున్నట్లే. నేను వెలుగు దగ్గరకు వచ్చినప్పుడు నేనెంత హేయమైనవాడినో తెలుస్తుంది. నేను వెలుగును తిరస్కరించినట్లయితే ''నేను నశించినట్లే'' (యోహాను 3:19-21 వచనాలు చూడండి).

ఎదుటి వ్యక్తిని వివరణ అడగడం చాలా మందికి ఒక రివాజు. ఇది మానవసహజం. పౌలు కూడా యేసు క్రీస్తును వివరాలు అడిగాడు. యేసు క్రీస్తు తానెవరో చెప్పాడు. ఈ వివరణలో ఎటువంటి ఆశ్చర్యంగానీ ఎటువంటి నిగూఢతగానీ లేదు. పౌలు తానెవరితో మాట్లాడుతున్నాడో గ్రహించాడు. మనల్ని ఆదేశిస్తున్న వ్యక్తికున్న అధికారాన్ని, మనల్ని ఆజ్ఞాపిస్తున్న వ్యక్తికున్న ఆధిపత్యాన్ని గుర్తించడమే నిజమైన విధేయత. అందుకే పౌలు పరమపావనమూర్తి సర్వశక్తిమంతుడు అయిన యేసు క్రీస్తుకు దాసుడయ్యాడు.

జూలై 19

## విశ్వాసి వినమ్రత

“బోధకుడనియు ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు ... మీరిట్లు పిలుచుట న్యాయమే” (యోహాను 13:13)

మన ప్రభువు తన ఆధిపత్యాన్ని మన మీద బలవంతంగా రుద్దడు. “నాకు లోబడు” అని మన ప్రభువు యెన్నడూ ఎవరినీ వత్తిడిచేయడు. లోబడాలనే నిర్ణయం మన ఇచ్ఛకు వదిలివేయబడిన విషయం. ఆయన మనకు కావాలనుకున్నా వద్దనుకున్నా ఆ నిర్ణయం మన ఇష్టానికే మన స్వేచ్ఛకే వదిలిపెట్టబడింది. ఆయన తన మీద ఉమ్మివేసినవారితో, తనను మరణానికి అప్పగించినవారితో సైతం ఒక్క మాట కూడా పరుషంగా మాట్లాడలేదు. అయితే యేసు విమోచనాకార్యంద్వారా నాలో ఆయన జీవం సృష్టించబడినప్పుడు యేసుకు నా మీద సర్వాధిపత్యం వుందనే సత్యాన్ని నేను గ్రహించగలను. అప్పుడు నేను “నీవే మహిమ ఘనత ప్రభావములు పొందనర్హుడవని” (ప్రకటన 4:10-11) చెప్పగలను. ఎందుకంటే తనను నమ్మినవారిమీద, తనకు లోబడిన వారిమీద యేసుకు సంపూర్ణమైన మరియు కార్యసాధకమైన ఆధిపత్యం వుంది. మన దైనందిన జీవితంలో కూడా మనం ఇతరులకు లోబడవలసిన సందర్భాలు అనేకం వుంటాయి. మనం లోబడకపోతే మనలో అవిధేయత ఉందని రుజువవుతుంది. మనకు విధేయతను బోధించడానికి దేవుడు ఈ సందర్భాలనే ఉపయోగించుకుంటాడు. దేవుడు మనలో సంపూర్ణమైన విధేయతను చూసి సంతోషిస్తాడు.

మన ప్రభువు తన ఆధిపత్యాన్ని మన మీద బలవంతంగా రుద్దినట్లయితే ఆయన కఠినుడైన యజమానిలాగా ఉంటాడు. అయితే ఆయన మనల్ని లోబడమని వత్తిడి చేయడం లేదు. అయితే మనం ఆయన సర్వాధిపత్యాన్ని గుర్తించి మనమే ఇచ్ఛా పూర్వకంగా ఆయనకు లోబడాలి. అప్పుడు మన జీవితం ఆయన అధీనతలో ఉంటుంది. ఆయన మనకు ప్రభువుగా ఉంటాడు. మనం ఆయణ్ణి మహిమపరుస్తూ స్తుతిస్తూ ఉంటాం. లోబడడంపట్ల నా వైఖరి నేను కృపలో ఎంత వర్ధిల్లుతున్నానో తెలియజేస్తుంది. విధేయత అనే పదం లోతైనది. ప్రాపంచిక దృక్పథంలో విధేయత వేరు; ఆధ్యాత్మిక రంగంలో విధేయత వేరు. తండ్రి కుమారుల మధ్య ఉన్న విధేయత ఇరువురు సమానస్థాయి వ్యక్తుల మధ్య ఉన్న విధేయత; దాసుడు యజమానిపట్ల చూపే విధేయత వేరు. “నేనును తండ్రియు ఏకమై యున్నామని” (యోహాను 10:30) చెబ్తూ విధేయతకు యేసు మాదిరిగా నిలిచాడు. “ఆయన, కుమారుడైయుండియు తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను” (హెబ్రీ 5:8). యేసు దేవుని కుమారుడుగా మనల్ని విమోచించి తన తండ్రిపట్ల విధేయత చూపాడు; దేవుని కుమారుడు కావడానికి కాదు!

జూలై 20

## దేవుని సన్నిధిని ఆశ్రయించు

“యెహోవాకొరకు ఎదురు చూచువారు ... సొమ్మసిల్లక నడిచిపోవుదురు” (యెషయా 40:31)

నడకపట్ల మనం అంతగా ఉత్సాహం చూపం. అయితే దార్ఢ్యతకు నడకే అసలైన పరీక్ష. అలయకుండా సొమ్మసిల్లకుండా నడిచి వెళ్లడం బలానికి సూచన. బైబిల్లో “నడవడం” అనే పదాన్ని విశేషార్థంతో ఉపయోగించారు. ఈ పదం ఒక వ్యక్తి స్వభావాన్ని మనోవైఖరిని తెలియజేస్తుంది. “నా సన్నిధిలో నడుచుచు ... యుండుము” (ఆది 17:1) అని దేవుడు అబ్రహాముతో చెప్పాడు. ఈ మాటల్లో ఆచరణసాధ్యంకానిది అస్పష్టంగా ఉన్నది ఏదీ లేదు. అంతా చాలా వాస్తవికంగా ఉంది; అంతా చాలా సూటిగా స్పష్టంగా ఉంది.

మనం ఒళ్లు ఝల్లుమనే త్రుళ్లింతలకొరకు ఎదురుచూడడం సహజమే. అయితే ఇది శారీరకంగాగానీ భావోద్వేగపరంగాగానీ అనారోగ్యస్థితికి సూచన. శరీరపరంగా చూసినట్లయితే పరిశుద్ధాత్మ కార్యాల్ని మనం కృత్రిమంగా అనుకరించే ప్రయత్నాలకు ఇది దారితీస్తుంది. భావోద్వేగపరంగా చూసినట్లయితే ఇది మనల్ని భ్రమలోకి నెట్టి మన నైతికవర్తనకు భంగం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక రంగంలో కూడా మనం ఝల్లుమనే త్రుళ్లింతలకొరకు ఎదురుచూస్తున్నట్లయితే అది రెక్కలు కట్టుకొని గాలిలో ఎగిరినట్లుగా ఉంటుంది. ఇది మన ఆధ్యాత్మికతకు పెనుముప్పుగా మారుతుంది.

దేవుని సన్నిధి ఒక ప్రత్యేక సమయానికి ఒక ప్రత్యేక స్థలానికి పరిమితమైనది కాదు. అన్ని సమయాల్లోను అన్ని సందర్భాల్లోను ప్రభువుకు ప్రథమస్థానాన్నిస్తూ ఆయన ఆధిపత్యానికి అధికారానికి తల ఒగ్గి ఉండాలనే దృఢచిత్తం నీలో ఉన్నప్పుడు ఆయన సన్నిధి నీతోనే ఉంటుంది. వాస్తవానికి మన సమస్యలకు అసలు కారణం దేవుణ్ణి ఆశ్రయించకపోవడమే. కీర్తన రచయిత అనుభవం చూద్దామా! “భూమి మార్పు నొందినను నడిసముద్రములలో పర్వతములు మునిగినను ... మనము భయపడము” (కీర్తన 46:2,3). దేవుని సన్నిధి మన జీవితంలో వాస్తవమైనప్పుడు మన అనుభవం కూడా కీర్తన రచయిత అనుభవంలాగానే ఉంటుంది. జీవితంలో క్లిష్టసమస్య లెదురైనప్పుడు నడిపింపుకొరకు దేవుణ్ణి ఆశ్రయించడం అవశ్యం. అయితే ప్రతి చిన్న విషయానికి “దేవా, నన్ను నడిపించు” అని నీవు అడగనక్కర్లేదు. ఎందుకంటే ఆయన నిన్ను నడిపిస్తూనే ఉన్నాడు. దైనందిన జీవితంలో మన నిర్ణయాలు ఆయన చిత్తానుసారంగా లేనట్లయితే మనం ముందుకు నడవడం కష్టతరమే. అప్పుడు మనం మౌనంగా ఉండి నడిపింపుకొరకు ఆయన సన్నిధిలో వేచి చూడడం తథ్యం.

జూలై 21

## రాజ్యప్రవేశం

"ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు" (మత్తయి 5:3)

యేసు క్రీస్తు కేవలం బోధకుడు మాత్రమే కాదు. ఆయన కేవలం బోధకుడు మాత్రమే అయినట్లయితే నాకు అసాధ్యమైన నిర్దిష్ట ప్రమాణాల్ని నాకు విధించి నన్ను ఆశాభంగానికి గురిచేసి ఉండేవాడు. నేను అందుకోలేని ఉన్నత లక్ష్యాల్ని నాకు నియమించడంలో అర్థం లేదు గదా! ఇవి నాకు తెలియకుండా ఉంటేనే నేను సంతోషంగా ఉండేవాడిని. నాకు సాధ్యంకానిదాని గురించి (అంటే శుద్ధహృదయం కలిగి ఉండడం - మత్తయి 5:8) నాకు చెప్పడంలో ఏం మేలు జరుగుతుంది? ఏది నేను నా కర్తవ్యంగా భావించానో దానికంటె అధికమైనది, దేవునిపట్ల సంపూర్ణమైన భయభక్తులు కలిగి ఉండడం నావలన అయ్యే పనేనా? యేసు బోధల్ని నేను అర్థం చేసుకోవాలంటే నేను ముందుగా ఆయన నా రక్షకుడని తెలుసుకోవాలి. ఆయణ్ణి నేను రక్షకుడిగా తెలుసుకోకపోయినట్లయితే ఆయన నియమించిన ఉన్నత లక్ష్యాలు నన్ను ఆశాభంగానికి గురిచేస్తాయి. అయితే నేను దేవునిఆత్మద్వారా తిరిగిపుట్టినప్పుడు యేసు క్రీస్తును బోధకుడిగా మాత్రమే కాదు, ఆయన తన బోధల్ని నా జీవితంలో వాస్తవంచేయగలడని కూడా తెలుసుకోగలను. యేసు ఏ స్వభావాన్ని కలిగి ఉన్నాడో ఆ స్వభావాన్నే ఆయన నాలో ఉంచడం విమోచనకు నిజమైన అర్థం. దేవుడు నియమించిన నిర్దిష్ట ప్రమాణాలన్నిటికీ మూలం ఈ స్వభావమే.

ప్రకృతిసిద్ధమైన స్వభావం ఉన్న వ్యక్తికి కొండమీద ప్రసంగం నిరాశ కలిగిస్తుంది. ఎందుకంటే యేసు కోరుకున్నవాటిని ప్రకృతిసహజమైన స్వభావం వున్న వ్యక్తి చేయలేడు గనక. మన ప్రభువు బోధల ననుసరించి మనంతట మనం జీవించగలమనే స్వనీతి మనలో ఉన్నంత కాలం మన అజ్ఞానం మూలంగా మనం తడబడడం ఖాయం. మనం స్వనీతిని విడిచిపెట్టి దీనహృదయంతో యేసును వెంబడించినప్పుడు మాత్రమే ఆయన బోధల్ని అర్థం చేసుకోగలం; వాటి ప్రకారం జీవించగలం. "ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు" - దేవుని రాజ్యనియమాల్లో ఇది మొదటిది. యేసు క్రీస్తు రాజ్యానికి ఆధారనియమం సిరిసంపదలు కాదు, దీనహృదయం మాత్రమే; యేసుకొరకు నిర్ణయాలు తీసుకోడం కాదు, "ప్రభువా, నేనిది ఏ మాత్రం చేయలేను" అని భగ్న హృదయంతో ప్రభువు యెదుట ఒప్పుకోడం మాత్రమే. అప్పుడు యేసు మనతో "మీరు ధన్యులు" (మత్తయి 5:11) అని చెప్తాడు. దీనత్వమే రాజ్యానికి ప్రవేశం. అయితే మనం దీనులమని ఒప్పుకోడానికి చాలా కాలం పడుతుంది. యేసు క్రీస్తు తన కార్యాన్ని మనలో నెరవేర్చే అర్హత మనలో ఉండాలంటే ముందుగా మనలో దీనత్వం వుండాలి; దీనులమని మనం ఒప్పుకోవాలి.

జూలై 22

**పాపవిమోచన (1)**

"మీరు పరిశుద్ధులగుటయే ... దేవుని చిత్తము" (1 థెస్స 4:3)

మరణంగురించి: దేవుడు మనల్ని పాపంనుంచి విమోచించి పరిశుద్ధపర్చే విషయంలో మరణాన్ని ఎలా పరిగణనలోకి తీసుకున్నాడో జీవాన్ని కూడా అలాగే పరిగణనలోకి తీసుకున్నాడు. పరిశుద్ధత పొందాలంటే మనం పాపంవిషయంలో మరణించాలి. అయితే అనేకులు ఈ విషయంలో క్రియలేకుండా కేవలం ఆలోచన మాత్రమే చేస్తూ జాగుచేస్తుంటారు. పాపవిమోచనపొంది పరిశుద్ధపర్చబడే తరుణంలో మనలో తీవ్రమైన సంఘర్షణ చోటుచేసుకుంటుంది. మనలో ఉన్న ఏదో ఒక స్వభావం మనల్ని క్రీస్తు కోరుకున్నవాటితో విభేదించేలా చేస్తుంది. పాపవిమోచన అంటే ఏమిటో, పరిశుద్ధపర్చబడడమంటే ఏమిటో పరిశుద్ధాత్మ మనకు వెల్లడిచేసిన తర్వాత మనలో సంఘర్షణ మొదలవుతుంది. "ఎవడైనను నాయొద్దకు వచ్చి ... తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:25-26).

పాపవిమోచనలో భాగంగా దేవుని ఆత్మ నేను అన్నిటినీ విడిచిపెట్టేలాగా చేసి చివరికి నన్ను మరణానుభవానికి నడిపిస్తుంది. నేను ఒంటరివాడిగా ఉండడం నాకు ఇష్టమేనా? కుటుంబసభ్యులతో బంధుమిత్రులతో ఇదివరకు నాకు ఉన్నటువంటి వ్యావహారిక సంబంధాల్ని విడిచిపెట్టడం, నా స్వంత అభిరుచుల్ని ఇష్టాఇష్టాల్ని దూరం చేసుకోడం నాకు ఇష్టమేనా? పరిశుద్ధతకు కావలసినది ఇదే. "నేను భూమిమీదికి ... ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు" (మత్తయి 10:34) అని చెప్పిన యేసు మాటల్లో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. సంఘర్షణ మొదలయ్యేది ఇక్కడే; అనేకులు తడబడేది ఇక్కడే. అనేకులు క్రీస్తుమరణంతో సమానానుభవాన్ని తిరస్కరించేది ఇక్కడే. "ఇది చాలా కఠినంగా ఉంది; ఆయన నానుంచి ఇటువంటిది కోరుకోడు" అని మనం చెబ్తుంటాం. నిజమే! మన ప్రభువు ఈ విషయంలో చాలా కచ్చితంగా ఉంటాడు. ఆయన మనలో ఏ తడబాటును ఏ అలసత్వాన్ని కోరుకోడు.

నేను నా చుట్టూ ఉన్నవాటినన్నిటినీ విడిచి కేవలం నేనుగా మిగలడానికి సిద్ధంగా ఉన్నానా? ఒంటరివాడిగా నన్ను నేను దేవునికి అప్పగించుకోడానికి నేను సిద్ధంగా ఉన్నానా? ఉన్నట్లయితే దేవుడు నన్ను వెంటనే సంపూర్ణంగా పరిశుద్ధపరుస్తాడు. దేవుణ్ణి తప్ప మిగిలినవాటినన్నిటినీ విడిచిపెట్టే విషయంలో నేను గట్టి పట్టుదలతో స్థిరచిత్తుడిగా ఉంటాను (1 థెస్స 5:23,24 చూడండి).

"ప్రభువా, నా విషయంలో పరిశుద్ధత అంటే ఏమిటో నాకు వెల్లడిచేయి" అని మనం ప్రార్థించినట్లయితే ఆయన తప్పక మనకు తెలియజేస్తాడు. మనం పరిశుద్ధపర్చబడినప్పుడు క్రీస్తుతో ఏకంగా ఉంటాం; అంటే మనలో క్రీస్తు స్వభావం వుండడమని అర్థం (1 కొరింథీ 1:30) చూడండి).

జూలై 23

**పాపవిమోచన (2)**

"అయితే ఆయన మూలముగా మీరు క్రీస్తుయేసునందున్నారు" (1 కొరింథీ 1:30)

జీవం గురించి: మనం పాపంనుంచి విమోచించబడి పరిశుద్ధపర్చబడిన తర్వాత యేసు క్రీస్తులో ఉన్న పరిపూర్ణ గుణశ్రేష్ఠత మనలో కూడా విశదమవుతుంది. క్రీస్తును విశ్వసించడంద్వారా "ఆయనమూలముగా" మనం పరిశుద్ధత అనే ఈవిని పొందాం. విశ్వసించిన మనలో ఇది వెనువెంటనే కార్యం. అంటే ఆయనలో ఉన్న పరిపూర్ణమైన మరియు విశిష్టమైన గుణాలన్నీ మనలో కూడా వెల్లడవుతాయని అర్థం! ఇదే పరిశుద్ధత గురించి దేవుడు వెల్లడిచేసిన మర్మం.

పరిశుద్ధ జీవితమంటే యేసును అనుకరించడం కాదు; యేసులో ఉన్న పరిపూర్ణ గుణశ్రేష్ఠత మన దేహంలో విశదం కావడమే పరిశుద్ధ జీవితం. "ఈ మర్మముయొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో అది, ఆయన మీయందున్న క్రీస్తు, మహిమ నిరీక్షణయై యున్నాడను సంగతిని దేవుడు తన పరిశుద్ధులకు తెలియపరచగోరి యిప్పుడు ఆ మర్మమును వారికి బయలుపరచెను" (కొలొస్స 1:27). పాపవిమోచన మరియు పరిశుద్ధతద్వారా నేను క్రీస్తులో ఉన్న అద్భుతజీవాన్ని పొందాను. ఇది దేవుని సర్వోన్నత కృపవలన జరిగిన కార్యం. దేవుని వాక్యంలో ఉన్నట్టుగా నాలో ఉన్న పరిశుద్ధతను వాస్తవీకరించడానికి నేను సిద్ధంగా ఉన్నానా?

క్రీస్తులో ఉన్న గుణాలన్నీ నాలో విశదం కావడమే పరిశుద్ధత అని చదువుకున్నాం గదా! క్రీస్తులో ఉన్న సహనం ప్రేమ పవిత్రత విశ్వాసం స్వచ్ఛత మరియు దైవత్వం పరిశుద్ధపర్చ బడిన వారందరిలో కూడా ఉండడం అవశ్యం! పరిశుద్ధత అనుకరణ కాదు; పరిశుద్ధత స్పష్టీకరణ! అనుకరణ స్పష్టీకరణకు పూర్తిగా భిన్నమైనది. యేసు పరిపూర్ణుడు. యేసులో ఉన్న పరిపూర్ణత నాలో ఉండడమే పరిశుద్ధత విశదం కావడంలో ఉన్న మర్మం. పరిశుద్ధత ఫలితంగా వర్ణించశక్యంగాని నిర్దిష్టత స్వస్థత మరియు పవిత్రత కలిగిన జీవితాన్ని "దేవుని శక్తిచేత" (1 పేతురు1:5) జీవించగలుగుతాను. ఈ ప్రక్రియ నిదానమైనది కావచ్చు గానీ నిశ్చయమైనది!

జూలై 24

## ఆయన స్వభావం, మన ప్రేరణలు

"శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 5:20)

శిష్యుడు మంచి పనులు చేస్తే సరిపోదు; అతని అంతఃప్రేరణలు కూడా మంచివై ఉండాలి. పరలోకంలో ఉన్న దేవుని కృపద్వారా మాత్రమే మనం మంచివారమయ్యాం. మంచిప్రేరణలు కలిగి ఉండడం మంచి పనులు చేయడంకంటె గొప్పది. మనకొక నూతన వారసత్వాన్నివ్వడానికి యేసు వచ్చాడు. ఈ వారసత్వంద్వారా మనం పొందిన నీతి ధర్మశాస్త్రబోధకుల నీతికంటె పరిసయ్యుల నీతి కంటె అధికమైనది. "నీవు నా శిష్యుడవైతే నీ క్రియలు మాత్రమే మంచివైతే సరిపోదు; నీ అంతఃప్రేరణలు, నీ ఆశలు, నీ అంతరంగపు లోతుల్లో దాగి ఉన్న ఆలోచనలు కూడా మంచివై ఉండాలి" అని యేసు మనతో చెబుతున్నట్టుగా ఉంది కదూ! నీ అంతఃప్రేరణలు ఎంతగా నిర్మలమైనవై ఉండాలంటే సర్వశక్త దేవుడు నీ అంతరంగాన్ని పరిశోధించినప్పుడు నిందార్హ మైనదేదీ ఆయనకు కనబడకూడదు. ఇటువంటి పరిశుద్ధత అందరిలోను ఉండదు. దేవుని నిత్యవెలుగులో ఆయన దృష్టిలో నిందార్హ మైనదేదీ లేకుండా ఎవరు నిలబడగలరు? కేవలం దేవుని కుమారుడైన యేసు క్రీస్తు, మరియు యేసు క్రీస్తు అనుగ్రహించిన విమోచనద్వారా ఆయన స్వభావాన్ని కలిగి ఉండి యేసుకు చెందినవారు మాత్రమే. నా అంతరంగం మార్పుచెంది నేను క్రొత్తగా రూపొందితేనే తప్ప దేవుడు ఎదురుచూసే పరిశుద్ధత నాలో ఉండడం అసాధ్యం. అయితే యేసు క్రీస్తు విమోచనే దీన్ని సాధ్యం చేసింది.

ఆజ్ఞలు పాటించడంద్వారా ఎవరూ పరిశుద్ధత పొందలేరు. యేసు క్రీస్తు బోధల్లో ఆజ్ఞలు కనిపించవు గానీ పారమార్థిక సత్యాలు కనిపిస్తాయి. ఆయన స్వభావం మనలో ఉన్నప్పుడు మాత్రమే ఈ సత్యాలు మనకు అర్థమౌతాయి. యేసు క్రీస్తు మనకు అనుగ్రహించిన రక్షణద్వారా మన పాత వారసత్వం స్థానంలో మనం నూతన వారసత్వాన్ని పొందాం. ఆయన మన స్వాభావిక నైజాన్ని మార్చడు గానీ మన స్వాభావిక నైజానికి మూలమైన అంతఃప్రేరణల్ని మారుస్తాడు.

జూలై 25

**నేను ధన్యుడనేనా?**

"మీరు ధన్యులు ..." (మత్తయి 5:3-11)

యేసు పలికిన ధన్యత వచనాల్ని మనం మొట్టమొదటిసారి చదివినప్పుడు అవి మనకు చాలా నిరాడంబరంగా కనిపిస్తాయి; అవి మనల్ని తుళ్లిపడేలా చేయవు; అయితే అవి మనకు తెలియకుండానే మన మనస్సు పొరల్లోకి జారుకుంటాయి. మచ్చుకు, ఆధ్యాత్మికత ఉన్నవారికి ఇవి ఓదార్పునిచ్చే ధర్మసూత్రాలుగా కనిపిస్తాయి. అయితే నేటి ప్రాపంచిక జీవనవిధానంలో క్షణంకూడా ఖాళీగా ఉండకుండా ఉరుకులుపరుగులుగా జీవించేవారి విషయంలో ఇవి ఏ మాత్రం ఇమడనట్టుగా కనిపిస్తాయి. అయితే ఆలోచించి చూసినప్పుడు ధన్యతవచనాల్లో పరిశుద్ధాత్మ క్రియాశీలకశక్తి కనిపిస్తుంది. అనూహ్యమైన ఈ శక్తి మన జీవితాల్లో పెల్లుబికి విచ్చు కుంటుంది. పరిశుద్ధాత్మ ధన్యతవచనాల్ని మనకు జ్ఞాపకం చేసినప్పుడు మనం తుళ్లిపడతాం. దేవుని ఆత్మ తన కార్యాన్ని జరిగించే విధం ఇదే! అప్పుడు నిర్ణయం తీసుకోడం మన వంతు! ధన్యతవచనాల్లోని ఆదేశాత్మక సందేశానికి విధేయత చూపాలా వద్దా అని నిర్ణయించు కోవలసినది మనమే! కొండమీద ప్రసంగాన్ని అక్షరార్థంగా ఆచరించడానికి మనం తిరిగిపుట్ట నక్కర్లేదు. చిన్న పిల్లలు సైతం ధన్యత వచనాల్ని కంఠతః చెప్పగలరు. అయితే కొండమీద ప్రసంగంలోని ఆధ్యాత్మిక సత్యాల్ని దేవుని ఆత్మ మనకు బోధించినప్పుడు మాత్రమే తెలుసుకోగలం.

యేసు బోధలు కొందరికి అసౌకర్యంగా కనిపించవచ్చు; ఎందుకంటే మనలో ఉండే సహజజ్ఞానానికి జిజ్ఞాసకు ఇవి అందవు. పరిశుద్ధాత్మ మన అంతరాత్మకు బోధిస్తుండగా మనం యేసు ఉదేశాల ప్రకారం నడుస్తున్నప్పుడు మాత్రమే మనం క్రమక్రమంగా కొండమీద ప్రసంగాన్ని అర్థంచేసుకోగలం. కొండమీద ప్రసంగం ఒక నియమావళి కాదు. పరిశుద్ధాత్మ నడిపింపులో కొనసాగే మన జీవితానికొక సమగ్ర రూపమే పర్వత ప్రసంగం!

జూలై 26

## పరిశుద్ధతకు మార్గం

"నోటనుండి బయటికి వచ్చునవి హృదయములోనుండి వచ్చును ... దురాలోచనలు నరహత్యలు వ్యభిచారములు వేశ్యాగమనములు దొంగతనములు అబద్ధ సాక్ష్యములు దేవదూషణలు హృదయములోనుండియే వచ్చును. ఇవే మనుస్యుని అపవిత్రపరచును" (మత్తయి 15:18-20)

మొదటగా మనం మనలో ఉన్న అజ్ఞానాన్ని అమాయకత్వంగా పిలుస్తూ అజ్ఞానాన్నే గొప్పగా నమ్ముతాం. తర్వాత మనలో ఉన్న అమాయకత్వాన్ని పరిశుద్ధతగా భావిస్తాం. అయితే ప్రభువు పలికిన ఈ కఠోరసత్యాల్ని విన్నప్పుడు మనం వెనక్కు తగ్గి "నా హృదయంలో ఇటువంటి చెడ్డవిషయాలు ఎప్పుడూ లేవు" అని మనల్ని మనమే వంచించుకుంటాం. యేసు వెల్లడిచేసినవాటిని తిరస్కరిస్తాం. ఈ సత్యాల్ని మనకు వెల్లడిచేసిన యేసుకు మన హృదయంమీద సర్వాధిపత్యం వుందా? లేక, ఆయణ్ణి మనం ఏ మాత్రం పట్టించుకోవలసిన అవసరంలేని అప్రధానమైన వ్యక్తిగా చూస్తున్నామా? నా హృదయపు లోతుల్లోకి సూటిగా చొచ్చుకుపోతున్న యేసు వాక్యాన్ని నమ్ముతున్నానా? లేక, నేను నాలో ఉన్న అమాయకత్వపు అజ్ఞానాన్నే నమ్ముతున్నానా? నన్ను నేను నిజాయితీగా పరిశోధించుకున్నట్లయితే యేసు క్రీస్తు చెప్పినవి యథార్థమైనవనే హెచ్చరిక నన్ను కుదిపివేస్తుంది. అప్పుడు నాలో ఉన్న చెడు, నాలో ఉన్న దుష్టత్వం ఎంత ఘోరమైనవో నాకు తెలుస్తుంది. అయితే నన్ను నేను అమాయకుడిగా ఊహించుకుంటూ కృత్రిమమైన భద్రతాభావంతో ఊహాలోకంలో విహరిస్తున్నంత కాలం నేను వాస్తవాల్ని విడిచి గాలిమేడలో కూర్చున్నట్లే. ఎవరితోనైనా నేను కఠినంగా ఉండకపోయినట్లయితే అందుకు కారణం ఎవరినీ నొప్పించకూడదనే నాగరిక జీవనశైలిగానీ, లేక పిరికితనంగానీ కావచ్చు. నన్ను నేను దేవునియెదుట బహిరంగపర్చుకున్నప్పుడు యేసు క్రీస్తు నాలో ఉన్న వ్యాధిని సరిగ్గానే నిర్ధారణ చేశాడని గ్రహించగలను.

నిజమైన భద్రత యేసు క్రీస్తు విమోచనద్వారా మాత్రమే లభిస్తుంది. నన్ను నేను సూటిగా ఆయనకు అప్పగించుకున్నప్పుడు నా హృదయంలో దాగి ఉన్న చెడు స్వభావం తొలగిపోతుంది కాబట్టి వాటి వలన నాకు ఎటువంటి దుష్ఫలితాలు కలగవు. నా అంతట నేను ఎన్నటికీ పరిశుద్ధతను పొందలేను. అయితే నాలో పరిశుద్ధాత్మ కార్యం మొదలైనప్పుడు నా హృదయం పరిశుద్ధాత్మకు నివాసంగా ఉంటుంది కాబట్టి నేను ఎటువంటి నిందార్హత లేకుండా పరిశుద్ధుడిగా జీవించగలను. యేసు క్రీస్తును పోలి నడుచుకోవడమంటే ఇదే!

జూలై 27

## జ్ఞానానికి మార్గం

"ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనినయెడల, ఆ బోధ దేవునివలన కలిగినదో, లేక నా యంతట నేనే బోధించుచున్నానో, వాడు తెలిసికొనును." (యోహాను 7:17)

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సముపార్జించడానికి మేధస్సు అక్కర్లేదు; విధేయత ఉంటే చాలు. శాస్త్రపరిజ్ఞానాన్ని పెంపొందించుకోడానికి జిజ్ఞాస అవసరం. జిజ్ఞాస మేధస్సుకు సంబంధించినది. అయితే యేసు క్రీస్తు బోధల్లోని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని మరియు అంతర్దృష్టిని ఆయనపట్ల విధేయత ఉన్నవారు మాత్రమే పొందగలరు. ఎవరికైనా ఆధ్యాత్మిక సత్యాలు మరుగై ఉన్నాయంటే, ఎవరికైనా అంతర్దృష్టి అజ్ఞాతస్థితిలో ఉన్నట్లయితే వారిలో ఏదో ఒక అవిధేయత ఉందని అర్థం. మేధస్సుకు సంబంధించిన అజ్ఞాతస్థితికి కారణం అజ్ఞానం; ఆధ్యాత్మిక అజ్ఞాతస్థితికి కారణం అజ్ఞానం కాదు, ఉద్దేశపూర్వకమైన అవిధేయత మాత్రమే.

ఎవరూ దేవుని వాక్యానికి తత్క్షణమే లోబడరు. అవిధేయత మనలో ఉండగా ఆధ్యాత్మికంగా ఎదగడంలేదని విస్మయం చెందుతుంటాం. "నీవు బలిపీఠముమీద అర్పణము అర్పించుచుండగా నీమీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము; అటు తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము" (మత్తయి 5:23,24) అని యేసు ప్రభువు చెప్పాడు. యేసు బోధ హృదయంలోకి దూసుకుపోతున్నట్టుగా ఉంది కదూ! మనం వంచనతో ఆయన యెదుట నిలబడగలమా? మనం చేయవలసినదానిలో ఆయన ఏ చిన్న పనినీ చూసీ చూడనట్టుగా విడిచిపెట్టడు. దేవుని ఆత్మ మన హృదయాన్ని శోధించి చూసి మన హృదయపు లోతుల్లో దాగి ఉన్నవాటిని వెల్లడిచేసినప్పుడు ఇంతకు ముందెన్నడూ మన గురించి మనకే తెలియని రహస్యాలు బయటికి వస్తాయి.

యేసు తన వాక్యంద్వారా నీతో ఏమైనా చెప్పినప్పుడు దాన్ని తప్పించుకోడానికి ప్రయత్నించకు. తప్పించుకోడానికి నీవు ప్రయత్నించినట్లయితే నీలో వంచన ఉందని అర్థం. నీవు భుజాలు తడుముకొనే పరిస్థితి వచ్చినట్లయితే ఆత్మపరిశీలన చేసుకో; ఎక్కడ నీలో అవిధేయత ఉందో నిన్ను నీవే పరీక్షించుకో. నీవెందుకు ఆధ్యాత్మికంగా ఎదగడం లేదో అప్పుడు నీకే అర్థమవుతుంది. "మొదట వెళ్లి" అని యేసు చెప్పినట్టుగా చేయి. ఎవరైనా నిన్ను మతావేశంగలవాడివని విమర్శించినా సరే, దేవుడు నిన్ను ఏం చెయ్యమని చెబ్తే దాన్ని చేయడానికి విధేయత చూపు!

జూలై 28

## దేవుని ఉద్దేశమా? లేక, నా ఉద్దేశమా?

"దోనె ఎక్కి అద్దరినున్న బేత్సయిదాకు ముందుగా వెళ్లుడని ఆయన తన శిష్యులను వెంటనే బలవంతము చేసెను" (మార్కు 6:45)

యేసు క్రీస్తు మనల్ని ఏ పనైనా చేయమని చెప్పినప్పుడు విధేయతతో మనం ఆ పని చేసినప్పుడు ఆయన మనల్ని ఘనవిజయానికి నడిపిస్తాడని మనం ఆలోచిస్తూ ఉంటాం. విజయంగురించి మనం కనే కలలన్నీ దేవుని ఉద్దేశాలని మనం ఆలోచించకూడదు. వాస్తవానికి దేవుని ఉద్దేశం ఇందుకు భిన్నంగా ఉండవచ్చు. మనం కోరుకున్న లక్ష్యం వైపు దేవుడు మనల్ని నడిపిస్తున్నాడని మనం ఆలోచిస్తూ ఉంటాం. అయితే మనం కోరుకున్న లక్ష్యాల్ని ఆయన కోరుకోకపోవచ్చు.

నాపట్ల దేవునికున్న ఉద్దేశమేమిటి? ఆయన దర్శనమేమిటి? సమయం ఏదై నప్పటికీ సందర్భం ఏదైనప్పటికీ దేవునిమీద ఆయన శక్తిమీద నేను తత్క్షణమే ఆధారపడడం ఆయన ఉద్దేశం. జీవితసమస్యల్లో నేను ప్రశాంతంగా ఉన్నప్పుడు, అంతరాత్మశుద్ధిగా విశ్వాసం కలిగి ఉన్నప్పుడు, ఎటువంటి కలవరం లేకుండా నిర్భయంగా ఉన్నప్పుడు దేవుని ఉద్దేశాలు నాలో నెరవేరతాయి. "ఆయన సముద్రముమీద నడుచుట" (6:49) నేను చూడాలని దేవుడు కోరుకుంటున్నాడు. ఇదే నాపట్ల దేవునికున్న ఉద్దేశం. తీరానికి దూరంగా ఉన్నప్పుడు, విజయానికి దూరంగా ఉన్నప్పుడు, కనుచూపుమేరలో గమ్యం కనబడనప్పుడు నాలో సడలని విశ్వాసం ఉండాలని ఆయన ఎదురుచూస్తున్నాడు. ఎందుకంటే "ఆయన సముద్రముమీద నడుచుట" నేను చూస్తున్నాను కాబట్టి. దేవునికి మహిమ కలిగించేది ప్రక్రియ, ఫలితం కాదు! మనం ఫలితాన్ని చూస్తాం; దేవుడు ఆ ఫలితాన్ని మనమెలా సాధిస్తున్నామో చూస్తున్నాడు. ఫలితం కాదు, ప్రక్రియే దేవునికి నా పట్ల ఉన్న ఉద్దేశం; దర్శనం!

దేవుని శిక్షణాభ్యాసం ఇప్పటికొరకే; ఎప్పటికొరకో కాదు! మన ప్రస్తుత సమయం దేవునికి ముఖ్యం; మన భావికాలం కాదు. విధేయతకు వచ్చే ప్రతిఫలంతోను ప్రయోజనంతోను మనకు పని లేదు. మన పని విధేయతచూపడం మాత్రమే! మనుషులు దేన్ని సిద్ధబాటు అంటారో, దేని ప్రయత్నం అంటారో దేవుని దృష్టిలో అదే లక్ష్యం!

నా జీవనసాగరజలాలమీద తాను నడుస్తున్నాడని నేను చూసేలా చేయడమే ఆయన ఉద్దేశం. ఇంతకన్నా గొప్ప లక్ష్యం మనకు ఉన్నట్లయితే మనం మన ప్రస్తుత కర్తవ్యంపట్ల సరిగ్గా శ్రద్ధచూపడంలేదని అర్థం! అనుక్షణం విధేయత చూపడమే మన లక్ష్యమని మనం గుర్తించినట్లయితే మన జీవితంలో ప్రతీ క్షణం ప్రశస్తమైనదే!

జూలై 29

## నీ మేఘాల్లో యేసును చూస్తున్నావా?

"ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు" (ప్రకటన 1:7)

మేఘాలకు దేవునికి సాహచర్యం వున్నట్టు బైబిల్లో కనిపిస్తుంది. "మేఘములు ఆయనకు పాదధూళిగానున్నవి" (నహూము 1:3). మేఘం దేవుని సన్నిధికి సూచన. దేవుడు తన తేజస్సుతో మనల్ని సమీపించడు; ఆయన మేఘాల నడుమ మన దగ్గరకు వస్తాడు. మన జీవితంలో కూడా కొన్ని కారుమబ్బులుంటాయి. మన బాహ్యజీవితంలోను ఆంతరంగిక జీవితంలోను ఉన్న దిగుళ్లు చింతలు బాధలు మనల్ని ఆవరించి ఉన్న కారుమబ్బులు. ఈ మబ్బుల్లోంచి మనం దేవుణ్ణి చూడగలమా? అవును! చూడగలం. ఈ కారుమబ్బుల్లోనే మనం విశ్వాసంతో నడవాలని పరిశుద్ధాత్మ  మనకు బోధిస్తున్నాడు. దిగుళ్లు బాధలు చింతలనే మబ్బులు మన జీవితంలో లేనట్లయితే మనలో విశ్వాసం వుండదేమో!

మన శ్రమలద్వారా మాత్రమే దేవుడు మనకు బోధిస్తాడని చెప్పడం సరికాదు. అయితే కష్టమనే ప్రతి మబ్బులోనూ మనకు ఆయన మార్గం కనిపిస్తుంది. మనలో ఉన్న కొన్ని అలవాట్లను మనం వదిలిపెట్టాలని దేవుడు కోరుకుంటున్నాడు. దేవుడు మన జీవితంలోకి బాధలనే మబ్బుల్ని రప్పించడానికి కారణం మనకు ఆయనకు మధ్య ఉన్న సంబంధం తండ్రికి బిడ్డకు మధ్య ఉండే సంబంధంలాగా బలంగా ఉండడానికే. మనకు దేవునికి మధ్య ఇటువంటి సంబంధం ఉన్నప్పుడు ఇక ఏ మబ్బులూ అడ్డురావు. మనకు దేవునితో ఇటువంటి సంబంధం వుందా?

"వారు ఆ మేఘములో ప్రవేశించినప్పుడు శిష్యులు భయపడిరి" (లూకా 9:34). మేఘంలో యేసు తప్ప ఎవరైనా ఉన్నారా? "వెంటనే వారు చుట్టు చూచినప్పుడు తమ యొద్దనున్న యేసు తప్ప మరి ఎవరును వారికి కనబడలేదు" (మార్కు 9:8).

జూలై 30

## భ్రమల్ని పోగొట్టే ఉపదేశం

"ఆయన తన్ను వారి వశము చేసికొనలేదు. ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు" (యోహాను 2:24,25)

అపార్థాలు, అపోహలు, దురూహలు తొలగినప్పుడు భ్రమలు వీగిపోతాయి. అప్పుడు ఎటువంటి వంచనలకు తావుండదు. మనం ఎటువంటి మోసాలకు గురికాకపోయినప్పటికీ గతకాలపు భ్రమల అనుభవం మనల్ని నిర్లిప్తతకు గురిచేస్తుంది. మనం ఇతరుల్లో లోపాలు వెతికే రంధ్రాన్వేషకులుగా మారే ప్రమాదం పొంచి ఉంటుంది. అయితే దేవుడు మన భ్రమల్ని తొలగించినప్పుడు మనం ఇతరుల్లో లోపాలు వెతికేవారిగా, కువిమర్శలు చేసేవారిగా ఉండంగానీ; వారి వాస్తవిక స్థితిగతుల్ని తెలుసుకొనేవారిగా మాత్రమే ఉంటాం. ఇతరులకు మన మూలంగా బాధ మనోవేదన దుఃఖం కలుగుతున్నాయంటే అందుకు కారణం మనం ఇతరులగురించి వాస్తవాల్ని తెలుసుకోక భ్రమల్లో ఉండడమే. ఇతరుల నిజస్థితి తెలుసుకోవాలని మనం కోరుకోడంలేదుగానీ ఇతరులగురించి దురూహలతో అపార్థాల్లో అపోహల్లో కొనసాగుతున్నాం. ఎవరిలోనైనా అంతా మంచే ఉంటుందని, లేకపోతే అంతా చెడే ఉంటుందని ఆలోచిస్తున్నాం.

భ్రమల్ని తొలగించుకోకపోడానికి ఇష్టపడకపోవడమే మానవజీవితంలో పలు ఇక్కట్లకు కారణం. ఇదే బాధలకు కారణం. మనం ఎవరినైనా ఎక్కువగా ప్రేమిస్తున్నట్లయితే వారిలో అన్నీ ఉత్తమగుణాలే ఉండాలని కోరుకుంటాం. వారిలో మనం ఎదురుచూసే ఉత్తమగుణాలు కనబడనప్పుడు వారిపట్ల కాఠిన్యాన్ని చూపిస్తూ కక్షసాధిస్తుంటాం. మనుషుల్లో ఏది అసాధ్యమో దాన్ని వారిలో కోరుకుంటున్నాం. అయితే అన్ని ఉత్తమగుణాలు, మనం ఎదురుచూసే పరిపూర్ణత ఒకే ఒకరిలో ఉన్నాయి. ఆయనే ప్రభువైన యేసు క్రీస్తు. పరిపూర్ణుడైన యేసును ప్రేమించడానికి బదులు అపరిపూర్ణులైన మనుషుల్ని ప్రేమించి నిరాశపడడమెందుకు? యేసుకు మన బాధలన్నీ తెలుసు; మన ఆవేదనలన్నీ తెలుసు. ఆయన మాత్రమే మన సమస్య లన్నిటిని పరిష్కరించి మనల్ని సంతృప్తిపర్చగలడు. అయితే యేసు మనలో విశ్వాసాన్ని కోరు కుంటున్నాడు. యేసులో విశ్వాసం ఉన్నప్పుడు మాత్రమే ఆయనతోను, సాటి మనుషులతోను మనం సరైన సంబంధాన్ని కొనసాగించగలం. విశ్వసనీయతలేని సంబంధాలు ఎక్కువకాలం మనుగడలో ఉండవు. మానవహృదయ మెటువంటిదో యేసుకు తెలుసు. "ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యునిగూర్చి ఆయనకు సాక్ష్యమియ్య నక్కరలేదు." అయినా యేసు ఎన్నడూ మనుషుల్లో లోపాలు వెతకలేదు; ఎవరినీ సందేహించ లేదు; ఎన్నడూ ఎవరిగురించీ నిరాశపడలేదు. కారణం ఆయనకు తండ్రిలో ఉన్న అపారమైన విశ్వాసం, తండ్రియైన దేవునికృపలో ఉన్న అచంచలమైన నమ్మకం. మనం యేసును నమ్మక, మనుషుల్ని నమ్మినట్లయితే నిరాశపడడం తథ్యం!

జూలై 31

## పూర్తిగా ఆయనకు చెందినవాళ్లం

“మీరు సంపూర్ణులును, అనూనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి” (యాకోబు 1:4)

సాధారణంగా మనం సరిగ్గానే ఉన్నట్టు కనిపించినప్పటికీ కొన్ని కొన్ని విషయాల్లో అశ్రద్ధ బద్ధకం చూపిస్తుంటాం. ఇది పాపం కాకపోవచ్చుగానీ ఐహిక జీవితపు అవశేషాలే మనలో ఉన్న నిర్లక్ష్యానికి కారణం. అశ్రద్ధ మరియు నిర్లక్ష్యం పరిశుద్ధాత్మను అవమానపరుస్తాయి. మనం దేవుని ఆరాధించే విషయంలో అశ్రద్ధ చేయకూడదు; నిర్లక్ష్యం చూపకూడదు. అలాగే మన అనుదిన కృత్యాల్లో కూడా అశ్రద్ధ నిర్లక్ష్యంవంటివి ఉండకూడదు.

ఆంతరంగిక జీవితంలో దేవునితో మనకు సరైన సంబంధం వుంటే సరిపోదు. ఆ సంబంధం మన బాహ్యజీవితంలో కూడా వ్యక్తమవ్వాలి. దేవునిదృష్టినుంచి ఏదీ తప్పించుకోలేదు. మన జీవితంలోని ప్రతి చిన్న విషయాన్ని కూడా దేవుడు సూక్ష్మంగా పరిశీలిస్తున్నాడు. మనం పాఠంనేర్చుకొనేవరకు దేవుడు మనల్ని పదే పదే హెచ్చరిస్తూనే ఉంటాడు. ఎందుకంటే దేవుడు మనలో పరిపూర్ణతను పరిణతిని కోరుకుంటున్నాడు. సమస్య ఏదైనా కావచ్చు; సమస్యకు కారణం మనలో ఉన్న ఆవేశం కావచ్చు; మనలో ఉన్న బద్ధకం కావచ్చు; విచ్చలవిడితనం కోరుకొనే మన నైజం కావచ్చు; లేదా మనలో ఉన్న స్వార్థం కావచ్చు.  అయితే దేవుడు పట్టువిడవని సహనంతో మనల్ని పరిపూర్ణత దిశగా నడిపిస్తూనే ఉన్నాడు. ఈ ప్రక్రియలో భాగంగా దేవుడు మనలో ఉన్న అక్రమమైవాటినన్నిటినీ మనకు వెల్లడిచేస్తూనే ఉన్నాడు.

“ ... ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి” - పరిశుద్ధాత్మ యాకోబుద్వారా మనకు ఈ అమూల్యసత్యాన్ని వెల్లడిచేస్తున్నాడు. జీవితంలో ఏ చిన్న విషయంపట్ల అశ్రద్ధ చూపకు; దేన్నీ నిర్లక్ష్యంగా చూడకు. మనం పరిపూర్ణంగా ఆయనకు చెందినవాళ్లమయ్యేవరకు దేవుడు మనపట్ల నిరంతరంగా సహనం చూపిస్తూనే ఉంటాడు.

ఆగస్ట్ 1

## ఆయన మార్గాల్ని తెలుసుకోడం

"యేసు తన పంద్రెండుమంది శిష్యులకు ఆజ్ఞాపించుట చాలించిన తరువాత వారి పట్టణములలో బోధించుటకును ప్రకటించుటకును అక్కడనుండి వెళ్లిపోయెను" (మత్తయి 11:1)

**ఆయన మనల్ని ఎక్కడికి పంపిస్తాడో అక్కడికి ఆయనకూడా వస్తాడు**. దేవుడు నిన్ను బయలుదేరి వెళ్లమని చెప్పిన తర్వాత నీవు ఇంట్లోనే ఉన్నట్లయితే, నీ కుటుంబ సభ్యుల్ని బంధుమిత్రుల్ని విడిచిపెట్టలేకపోయినట్లయితే దేవుడు నిన్ను వెళ్లమన్న స్థలంలో ఉన్నవారికి యేసు క్రీస్తు బోధల్ని దూరంచేసినవాడవవుతావు. దేవునికి విధేయుడవై ఆయన పంపించిన స్థలానికి నీవు వెళ్లినట్లయితే యేసు కూడా నీతో వచ్చి వారికి బోధిస్తాడు. దేవునికి అవిధేయుడవై నీవు వెళ్లకపోయినట్లయితే దేవుని మార్గాల్ని అడ్డుకున్నవాడవవుతావు. దేవునితో వాదించడం ఎక్కడ మొదలుపెట్టావో గమనించుకో. ఏవి నీ విధులని నీవు భావిస్తున్నావో వాటిని యేసు నీకిచ్చిన ఆజ్ఞలతో పోటీకి నిలిపినట్లయితే అవి నిలబడగలవా? ఆయన ఆజ్ఞలపట్ల నీవు చూపవలసిన విధేయత ముందు నీ విధులు నిలబడగలవా? "ఆయన నన్ను వెళ్లమన్నాడు గానీ, నేను చేయవలసిన పని ఇక్కడే ఉంది" అని ఆయనతో నీవు చెప్పగలవా? చెప్పినట్లయితే యేసు బోధల్ని నీవు సరిగ్గా నమ్మడంలేదని అర్థం.

ఆయన మనల్ని ఎక్కడ బోధించవద్దన్నాడో ఆయన అక్కడే బోధిస్తాడు. "ఏలినవాడా ... మూడు పర్ణశాలలు మేము కట్టుదుమని ... చెప్పెను" (లూకా 9:33). ఇతరుల జీవితాల్లో దేవుడు నెరవేర్చవలసిన కార్యాన్ని మనమే నెరవేర్చాలని కుతూహలం చూపిస్తున్నామా? మనమే ఆదేశాలిస్తూ హడావుడి చేస్తూ దేవుణ్ణి దగ్గరకు రానివ్వడంలేదా? మనం మౌనంగా ఉండి మన ఆత్మల్ని అప్రమత్తం చేయడం నేర్చు కోవాలి. మనం దేవునికుమారుడైన యేసుగురించి బోధించాలని ఆయన ఉపదేశం. ఆయన మన ప్రార్థనాసమయాల్ని రూపాంతరపుకొండలుగా మార్చాలనుకుంటున్నాడు. దేవుని కార్యాలు మన ఊహకందవు. ఆయన కార్యాలు మన అంచనాలకు ఆలోచనలకు భిన్నంగా ఉండవచ్చు.

ఆయన మనల్ని కనిపెట్టమని చెప్పినప్పుడు తన కార్యాల్ని జరిగిస్తాడు. "మీరు పైనుండి శక్తి పొందేవరకు ... నిలిచియుండుడని" (లూకా 24:49).

"యెహోవాకొరకు కనిపెట్టుకొని యుండుము" (కీర్తనలు 37:34). నీవు కనిపెడ్తున్నప్పుడు ఆయన తన కార్యాలు జరిగిస్తాడు. అయితే నీగురించి నీవే విచారపడ్తూ, ఆధ్యాత్మిక విషయాల్లో రుసరుసలాడుతూ, ఏం చేయాలో అగమ్యగోచరంగా ఉందనే బెంగతో కాలం గడపవద్దు. దేవునికొరకు "కనిపెట్టుకొని" ఉంటున్నావా? నీ భావోద్వేగాలు నీ అదుపులో ఉన్నాయా? "యెహోవా యెదుట మౌనముగానుండి ఆయనకొరకు కనిపెట్టుకొనుము. తన మార్గమున వర్ధిల్లువాని చూచి వ్యసనపడకుము దురాలోచనలు నెరవేర్చుకొనువాని చూచి వ్యసనపడకుము" (కీర్తన 37:7). కనిపెట్టి చూడడమంటే చేతులు ముడుచుకొని ఖాళీగా కూర్చోడం కాదు. కనిపెట్టడమంటే దేవుడు మనకు అప్పగించినపని ఎలా చేయాలో నేర్చుకోడం.

దేవుని మార్గాల్ని తెలుసుకొనే కొన్ని ప్రయత్నాలివి. అయితే మనం వీటిని గుర్తించే ప్రయత్నం చేయడంలేదు!

ఆగస్ట్ 2

## ప్రతికూలతల గురించి

“లోకములో మీకు శ్రమలు కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాననెను” (యోహాను 16:23)

ప్రతికూలతలేవీ క్రైస్తవుని దరిచేరవనే అభిప్రాయాన్ని నమ్మేవాళ్లు  చాలా మంది ఉన్నారు. క్రైస్తవునికి శ్రమలు రావని కాదుగానీ శ్రమలనుంచి  విడుదల కలుగుతుందని దీని భావం. శ్రమలు రాకూడదనడం వేరు, శ్రమలనుంచి విడుదల కోరుకోడం వేరు. “మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు నీకు అపాయమేమియు రాదు ఏ తెగులును నీ గుడారమును సమీపించదు” (కీర్తన 91:1,10).  సర్వశక్తుని నీడ మనకు నిజమైన విశ్రమస్థానం.

నీవు దేవుని బిడ్డవైతే లోకంలో నీకు శ్రమలు తప్పవు. “లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి” ఉన్నానని యేసు ప్రభువు చెప్పాడు. యేసు ప్రభువు మనకు అభయాన్నిచ్చాడు కాబట్టి మనకు శ్రమలు ఎదురైనప్పుడు మనం ఆశ్చర్యపడనక్కర్లేదు, అధైర్యపడనక్కర్లేదు. రక్షణ పొందకమునుపు ఎన్నడూ తమ కెదురైన శ్రమలగురించి మాట్లాడనివారు రక్షణపొందిన తర్వాత తమకు యెదురయ్యే శ్రమలగురించి ఫిర్యాదు చేస్తూ దిగులుపడుతుంటారు. ఇందుకు కారణం పరిశుద్ధ పర్చబడిన దేవునిబిడ్డ జీవితంగురించి వారిలో అపోహ ఉండడమే.

దేవుడు మనకు ముందుగానే అన్నిటినీ అధిగమించే జీవితానివ్వడు. మనం అధిగమిస్తున్నప్పుడు జయజీవితం మనదే! జీవితంలో ఎదురయ్యే ప్రయాసలు మనలో దృఢత్వాన్ని పెంచుతాయి. పరిశ్రమ లేనట్లయితే మనలో దృఢత్వం వుండదు. జీవాన్నివ్వమని స్వేచ్ఛనివ్వమని సంతోషాన్నివ్వమని దేవుణ్ణి అడుగుతున్నావా? ఆయన ఇవ్వడు; నీవు పరిశ్రమకు ప్రయాసకు సిద్ధపడితే తప్ప. నీకు ఆటుపోట్లు ఎదురైనప్పుడు వాటిని తట్టుకొనే బలం దానంతటదే వస్తుంది. పిరికితనాన్ని అధిగమించి తొలి అడుగు వెయ్యి. అప్పుడు దేవుడు నీకు పరిపుష్టినిస్తాడు. “జయించినవానికి దేవుని పరదైసులో ఉన్న జీవవృక్షఫలములు భుజింపనిత్తును” (ప్రకటన 2:7) అని  యేసు ప్రభువు చెబుతున్నాడు. శారీరక పరిశ్రమ అధికమైనప్పుడు అలసట కలుగుతుంది. అయితే ఆధ్యాత్మిక పరిశ్రమ అధికమైనప్పుడు మనకు బలం కూడా అధికమవుతుంది. రేపటికి కావలసిన శక్తిని దేవుడు మనకు ఈ రోజే ఇవ్వడు. నేడు మనకు కావలసిన శక్తిని ఈ క్షణంలోనే దేవుడు ఇస్తాడు. అయితే మనమే ఒక శోధనలో ఇరుక్కుంటున్నాం. మన స్వంత శక్తియుక్తులతో మన ఇంగితజ్ఞానంతో మనకెదురయ్యే ప్రతికూలపరిస్థితుల్ని అధిగమించాలని ప్రయత్నిస్తున్నాం. దేవునిబిడ్డ శ్రమల్లో ధైర్యంగా ఉండాలి. ప్రభువు మనల్ని ధైర్యంగా ఉండమని చెప్పాడు గనక మనం ధైర్యంగా ఉండాలి. విజయం ఎవరికైనా అసాధ్యమే, దేవునికి తప్ప!

ఆగస్ట్ 3

## బలీయమైన దేవుని ఉద్దేశం

"ఆయన ... ఇదిగో యెరూషలేమునకు వెళ్లుచున్నాము" (లూకా 18:31)

మన ప్రభువు జీవితంలో యెరూషలేముకు మహత్వపూర్ణ స్థానం వుంది. ఆయన తన తండ్రి చిత్తాన్ని పరిసమాప్తి చేసిన స్థలం యెరూషలేం. "నన్ను పంపినవాని చిత్తప్రకారమే చేయగోరుదునుగాని నా యిష్టప్రకారము చేయగోరను ... " (యోహాను 5:30) అని యేసు చెప్పాడు. తన తండ్రి చిత్తాన్ని నెరవేర్చడం మన ప్రభువుకున్న ఏకైక లక్ష్యం. సంతోషమైనా దుఃఖమైనా విజయమైనా విజయంకానిదైనా ఏదీ మన ప్రభువు దృష్టిని ఆయనకున్న ఏకైక లక్ష్యంనుంచి మళ్లించలేదు. "ఆయన యెరూషలేమునకు వెళ్లుటకు" (లూకా 9:51) తన మనస్సు స్థిరపర్చుకున్నాడు.

మన జీవితంలో కూడా యెరూషలేం వుంది. అది మన స్వంత ఉద్దేశాల్ని కాక, దేవుని ఉద్దేశాల్ని మాత్రమే నెరవేర్చే పవిత్ర కర్తవ్యం. మనిషిలో స్వాభావికంగా తాహతుకు మించిన ఆశలుంటాయి. అయితే క్రైస్తవునిలో స్వంత ఆశలుండవు. క్రీస్తు కొరకు మనం తీసుకొనే నిర్ణయాలగురించి, క్రైస్తవులుగా జీవించాలనే మన దృఢ సంల్పంగురించి, ఇంకా ఈ విషయంగురించి, ఆ విషయంగురించి మనం నేడు చాలా గొప్పగా మాట్లాడుతుంటాం. అయితే క్రొత్త నిబంధనలో ప్రబలంగా కనిపించే విషయం ఒకటే. అది: "మీరు నన్ను ఏర్పరచుకొనలేదు ... నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని" (యోహాను 15:16).

దేవుని ఉద్దేశాలగురించి మనలో స్పృహ కలగక పూర్వమే ఆయన మనల్ని తన ఉద్దేశాలకొరకు ఏర్పరచుకున్నాడు. దేవుని ఉద్దేశాలు మొదట్లో మనకు తెలియవు. కొన్ని సార్లు దేవుని ఉద్దేశంగురించి మనలో సందిగ్ధం వుంటుంది. ఆయన ఉద్దేశాల్ని మనం స్పష్టంగా చూడలేం. దేవుని ఉద్దేశాలు గురితప్పినట్టుగా కనిపిస్తాయి. ఇందుకు కారణం దేవుని ఉద్దేశాల్ని చూడలేని మన హ్రస్వదృష్టి మాత్రమే. పరిచర్య ప్రారంభంలో దేవుని ఉద్దేశాలగురించి మనకు మనమే స్వంత ఆలోచనలతో స్వంత అభిప్రాయాలేర్పరుచుకుంటాం. "దేవుడు అక్కడికి నన్ను వెళ్లమన్నాడు" అనిగానీ, "దేవుడు నన్ను ఈ పని చేయమన్నాడు" అనిగానీ, "దేవుడు నన్ను ఈ పనికొరకు ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు" అనిగానీ చెబ్తుంటాం. మన స్వంత తలంపుల ప్రకారం ఇది మంచిదని లేక అది మంచిదని చెబ్తూ వాటినే చేస్తుంటాం. అయితే దేవుని బలీయమైన ఉద్దేశాన్ని నెరవేర్చే భారం మనమీదే ఉంది. దేవుని బలీయమైన ఉద్దేశంతో పోల్చి చూసినప్పుడు మనం చేసే పని ఏ మాత్రం లెక్కలోనిది కాదు. దేవుని బృహత్ప్రణాళికలో మన సేవ అత్యల్పమైనది. "ఆయన తన పండ్రెండుమంది శిష్యులను పిలిచి ... " (లూకా 18:31) దేవుని బలీయమైన ఉద్దేశంగురించి వారికి వివరించాడు. దేవుడు మనల్ని కూడా ప్రక్కకు పిలిచి చెబ్తున్నాడు. ఎందుకంటే దేవుని బలీయమైన ఉద్దేశాల్ని అర్థం చేసుకోలేని పసిపిల్లలం మనం.

ఆగస్ట్ 4

## దేవునితో సాహసోపేతమైన స్నేహం

"ఆయన తన పండ్రెండుమంది శిష్యులను పిలిచి ... " (లూకా 18:31)

మనల్ని నమ్మిన దేవుడెంత సాహసి! "నేను మంచివాడ్ని కాను, నేనెందుకూ పనికిరానివాడ్ని, దేవుడు నన్ను ఎన్నుకోడం నిజంగా అవివేకమేమో" అని చెబుతున్నావా? దేవుడు సరిగ్గా ఇందుకే నిన్ను ఎన్నుకున్నాడు. దేవునికి నీవు చాలా ఉపయోగకరమైన వాడివని నీగురించి నీవే గొప్పగా ఊహించుకుంటున్నంతకాలం ఆయన నిన్ను ఎన్నుకోడు! నీకు స్వంత ఉద్దేశాలున్నంతకాలం ఆయనకు నీవు అక్కర్లేదు! ఎప్పుడైతే నీవు స్వావలంబన విడిచి, నిన్ను నీవు ఆయనయెదుట రిక్తుణ్ణి చేసుకుంటావో అప్పుడాయన నిన్ను తనతోబాటు "యెరూషలేము"కు ఎన్నుకుంటాడు (18:31). అంటే ఆయన నీతో చర్చించని ఉద్దేశాల్ని నీద్వారానే నెరవేరుస్తాడు.

జన్మతః శక్తిసామర్థ్యాలున్నవారే మంచి క్రైస్తవులుగా జీవించగలరనే అపోహ చాలామందిలో ఉంది. దేవునికి మనలో కావలసినది మన స్వంత శక్తిసామర్థ్యాలు కాదు; ఆయన మనలో రిక్తతను దీనత్వాన్ని కోరుకుంటున్నాడు. మనలో స్వాభావికంగా ఉన్న శక్తియుక్తులు, మన పాండిత్యం, మన జ్ఞానం, మన అనుభవం, మన గుణగణాలు, మన గురించి మనమే గొప్పగా చెప్పుకునేవేవీ దేవునికి అక్కర్లేదు. తన ఉద్దేశాలు నెరవేర్చడానికి ఏం కావాలో వాటిని దేవుడు మనలో ఉంచుతాడు; వాటినే మనం ఆయనకు తిరిగి ఇవ్వాలి. ఆయన దృష్టిలో విలువైనది ఒక్కటే! ఆయన బలీయమైన ఉద్దేశంకొరకు ఆయనకు మనం స్నేహితులుగా ఉండడం మాత్రమే (1 కొరింథీ 1:26-31 వచనాలు చూడండి). తమను తాము రిక్తుల్ని చేసుకున్నవారిని దేవుడు తన స్నేహితులుగా లెక్కిస్తాడు. "నేను దేవునికెంతో ఉపయోగకరమైనవాడిని" అని ప్రగల్భాలు పలికేవారిద్వారా ఆయన తన కార్యాల్ని నెరవేర్చడు. మనం మనకొరకు దేవుని పని చేయడం కాదుగానీ దేవునికొరకు దేవునిపని చేయాలి. మనం మనకొరకు దేవునిపని చేయడం వేరు; దేవునికొరకు దేవునిపని చేయడం వేరు. ఈ రెండూ ఒకదానితో ఒకటి పొసగవు. దేవుని బలీయమైన ఉద్దేశమేమిటో మనకు తెలియదు; అయినా ఆయనతో మన అన్యోన్యత కొనసాగాలి. దేవునితో మన స్నేహానికెప్పుడూ భంగం కలగకూడదు. ఎప్పుడైనా ఈ స్నేహానికి ఆటంకం కలిగినట్లయితే వెంటనే దేవుని యెదుట మనల్ని మనం సరిచేసుకోవాలి. క్రైస్తవధర్మంలో మనం చేసే సేవ కంటె కూడా ముఖ్యమైనవి దేవునితో మనకున్న అన్యోన్యత, అ అన్యోన్యత మూలంగా సిద్ధించే ఉపఫలాలు. దేవుడు మనలో ఫలాల్ని కోరుకుంటున్నాడు. ముఖ్యమైన సంగతి: ఫలాలున్న చెట్టుకు రాళ్లదెబ్బలు తప్పవు!

ఆగస్ట్ 5

## దిగ్భ్రమ కలిగించే దేవుని పిలుపు

"మనుష్యకుమారునిగూర్చి ప్రవక్తలచేత వ్రాయబడిన మాటలన్నియు నెరవేర్చ బడును ... ఆయన చెప్పిన సంగతులు వారికి బోధపడలేదు" (లూకా 18:31,34)

దేవుడు యేసు క్రీస్తును శ్రమకొరకే పంపించాడు. ఈ శ్రమ నిశ్చయం; మరియు అనివార్యం. తన శ్రమను మరణాన్ని తన శిష్యులు చూడాలనే యేసు క్రీస్తు వారిని ముందుగా ఏర్పరుచుకున్నాడు. యేసు క్రీస్తు శ్రమను, ఆయన మరణాన్ని ప్రత్యక్షంగా చూసిన శిష్యులు కలతచెందారు. యేసు క్రీస్తు కష్టాలనుభవించాడు కాబట్టి ఆయన జీవితంలో జయం లేదని మనుషుల అంచనా. అయితే దేవుని దృష్టిలో యేసు జీవితం విజయసిద్ధి పొందిన సంపూర్ణజీవితం. మనుషుల దృష్టిలో ఏది వైఫల్యమో దేవుని దృష్టిలో అది విజయం! ఎందుకంటే దేవుని ఆలోచనలు వేరు, మనుషుల ఆలోచనలు వేరు.

మనం దేవుని పిలుపును వినినప్పుడు మొదట దిగ్భ్రమ చెందుతాం. దేవుని పిలుపును మనం సంపూర్ణంగా అర్థంచేసుకోలేం; బయటికి వివరించి చెప్పలేం. దేవుని పిలుపును మన అంతరాత్మకు మాత్రమే గ్రాహ్యమవుతుంది. దేవుని పిలుపు సముద్రమంత గంభీరమైనది. మనలో గంభీరభావం వున్నప్పుడే దేవుని పిలుపు మనకు గ్రాహ్యమవుతుంది. దేవుడు నన్ను ఇందుకొరకే పిలిచాడని నిశ్చయాత్మకంగా చెప్పలేం. ఎందుకంటే పిలుపు ఆయన ఉద్దేశాలు నెరవేర్చడంకొరకు కాబట్టి ఏ ఉద్దేశమో నిర్దిష్టంగా చెప్పలేం కదా! దేవుడు ఏం కోరుకుంటున్నాడో వాటిగురించి ఆయనకు తెలుసని నమ్మడంలోనే ఉంది అసలు పరీక్ష. దేవుని ఉద్దేశాలు యాదృచ్ఛికంగా నెరవేరే ఉద్దేశాలు కాదు. అవి ఆయన ఆజ్ఞానుసారం నెరవేరే ఉద్దేశాలు. దేవునికి తన ఉద్దేశాలమీద సర్వాధిపత్యం వుంది.

మనకు దేవునితో అన్యోన్యత మరియు ఏకత ఉన్నట్లయితే ఆయన ఉద్దేశాల్ని ఆనవాలు పట్టగలం. అప్పుడు మనమిక ఆయన ఉద్దేశాల్ని తెలుసుకోడానికి ఎటువంటి ప్రయత్నం చేయనక్కర్లేదు. క్రైస్తవ జీవితంలో మనం పరిణతి చెందుతున్నకొలదీ, "దేవుడు ఎందుకు దీన్ని అనుమతించాడు, ఎందుకు దాన్ని అనుమతించాడు" అని అడగడం తగ్గిపోతుంది. జీవితంలో అన్నిటి వెనక అంతర్లీనంగా ఉన్న బలీయమైన దేవుని ఉద్దేశాన్ని, ఆ ఉద్దేశంకొరకు దేవుడు మనల్ని రూపొందించడాన్ని మనం చూడ గలుగుతాం. నిజమైన క్రైస్తవుడు తన శక్తిసామర్థ్యాల్ని నమ్మడు; దేవుని జ్ఞానవివేకాల్ని నమ్ముతాడు. మనకు మన స్వంత ఉద్దేశాలున్నట్లయితే మనం దేవుని పిల్లల్లాగా ఉండలేం. ఎందుకంటే దేవుడు తన పిల్లల్లో ఎదురుచూసే నిష్కాపట్యం నిశ్చలత ప్రశాంతత మనలో ఉండవు గనక.

ఆగస్ట్ 6

## ప్రార్థనలో సిలువ

"ఆ దినమందు మీరు నా పేరట అడుగుదురు గాని ..." (యోహాను 16:26)

"మీరు మీ తండ్రిని అడుగక మునుపే మీకు అక్కరగా నున్నవేవో ఆయనకు తెలియును" (మత్తయి 6:8). ఇక మనమెందుకు అడగాలి? ప్రార్థన దేవునినుంచి పొందడం కొరకు కాదు; ఆయనతో పరిపూర్ణమైన అన్యోన్యత మరియు ఏకత కలిగి ఉండడం కొరకు. కేవలం మనకు కావలసినవాటిని పొందడంకొరకు మాత్రమే మనం ప్రార్థన చేసినట్లయితే దేవునిమీద మనకు కోపం విసుగు వస్తాయి. మనం ప్రార్థించిన ప్రతి సారీ ఆయన జవాబిస్తాడు; అయితే ఆ జవాబు మనం ఎదురుచూసినట్టుగా ఉండక పోవచ్చు. దేవునిమీద కోపం తెచ్చుకోడం ప్రార్థనలో మనం దేవునితోను ఆయన ఉద్దేశాలతోను ఏకీభవించడంలేదని వెల్లడిచేస్తుంది. దేవుడు మన ప్రార్థనలకు జవాబిస్తాడని నిరూపించనక్కర్లేదుగానీ, మనం దేవుని కృపకు విజయచిహ్నాలుగా ఉన్నాం!

"మీ విషయమై నేను తండ్రిని వేడుకొందునని మీతో చెప్పుట లేదు ... తండ్రి తానే మిమ్మును ప్రేమించుచున్నాడు" (యోహాను 16:26,27). దేవునితో నీకు ఈ స్థాయిలో అన్యోన్యత ఉందా? నీ ప్రార్థనాజీవితానికి యేసు ప్రార్థనాజీవితంతో తాదాత్మ్యత ఉందా? నీలో యేసు జీవం ప్రత్యామ్నాయంగా ఉందా? ఉన్నట్లయితే "ఆ దినమందు" నీకు యేసుతో సాన్నిహిత్యం సాహచర్యం వుంటాయి.

నీ ప్రార్థనకు జవాబు రానప్పుడు ఇతరుల్ని నిందించడానికి ప్రయత్నించకు. ఇది సాతాను కుయుక్తి. జవాబు రానప్పుడు అందుకు కారణం వుంటుంది. జవాబుకొరకు నీవు కనిపెట్టే సమయాల్లో ఆయన నీకు జ్ఞానోపదేశం చేస్తాడు. ఈ ఉపదేశం కేవలం నీకొరకే!

ఈ ఉపదేశాన్ని నీవు గ్రహించినప్పుడు నీకు సిలువ సందేశం అర్థమవుతుంది. సిలువసందేశం: మనకు ప్రభువైన యేసుతో ఉన్న సంపూర్ణమైన సమగ్రమైన నిరర్గళమైన అనన్యతకు సూచిక సిలువే. ప్రార్థనకంటె మనకు ఈ అనన్యతే ముఖ్యం!



ఆగస్ట్ 7

## తండ్రి ఇంటిలో ప్రార్థన

"ఆయన దేవాలయములో ... ఉండగా చూచిరి. ... ఆయన -మీరేల నన్ను వెదకుచుంటిరి? నేను నా తండ్రి పనులమీద నుండవలెనని మీరెరుగరా అని వారితో చెప్పెను" (లూకా 2:46,49)

మన ప్రభువు బాల్యం అపరిపక్వ దశ కాదు. ఆయన బాల్యంనుంచి తండ్రి పనులమీద ఉన్నాడు. ఆయన బాల్యంనుంచి తండ్రితో తాదాత్మ్యత కలిగి ఉన్నాడు. నా ప్రభువుతో నా రక్షకునితో నేను కూడా నిష్కళంకమైన దేవునిబిడ్డగా ఉన్నానా? నా జీవితం నా తండ్రి ఇంటిలో ఉన్న జీవితమేనా? నా హృదయమనే తండ్రి ఇంటిలో యేసు ఉన్నాడా? నేను కూడా నా తండ్రితో తాదాత్మ్యత కలిగి ఉన్నానా?

ఎప్పటికీ నిలిచి ఉండే శాశ్వతమైన సత్యం దేవుడే. ఈ సత్యంతో నిరంతరం నేను సంబంధం కలిగి ఉన్నానా? లేక, నా జీవితంలో అస్తవ్యస్తమైన పరిస్థితులెదురైనప్పుడు మాత్రమే ప్రార్థిస్తున్నానా? "నా తండ్రి పనులమీద" ఉండడం నా జీవితంలో నిత్యకృత్యం కావాలి. నా జీవితంలో ప్రతి క్షణాన్ని నేను నా తండ్రి ఇంటిలో గడపాలి.

నీ పరిస్థితులగురించి ఆలోచించు. నీకు ప్రభువుతో తాదాత్మ్యత ఉందా? నిత్యం ఆయనతో మాట్లాడుతున్నావా? నీవు పొందేవన్నీ ఆయన చేతుల్లోంచి వచ్చినవేనని నమ్ముతున్నావా? నీ హృదయం నీ గృహం నీ వ్యాపారం నీ ఉద్యోగం నీ మిత్రబృందం దేవుని కృపా పరిచర్యకు నెలవుగా ఉన్నాయా? లేక ఇటువంటి పరిస్థితులు నాకెందుకు ఎదురయ్యాయని ఆశ్చర్యపడుతున్నావా? ఈ పరిస్థితులగుండా నీవు మాత్రమే నడవడంలేదు; మన ప్రభువుతో నీకున్న తాదాత్మ్యతనుబట్టి ఆయనకూడా నీతోబాటే ఈ పరిస్థితులగుండా నడుస్తున్నాడు. ఇది నీ పట్ల తండ్రి చిత్తం!

మన ప్రభువు భూమ్మీద జీవించిన జీవితం ఆయన నడిచిన మార్గం నీకు ప్రాణ వాయువు కావాలి. నాడు ఆయన చేసిన పరిచర్యను నేడు నీలోను నీ ద్వారాను కూడా చేస్తాడు.

ఆగస్ట్ 8

## తండ్రికి ఘనత కలిగించే ప్రార్థన

"పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును" (లూకా 1:35)

దేవుని కుమారుడు పరిశుద్ధాత్మద్వారా కన్య మరియకు జన్మించాడు. ఇది చారిత్రక వాస్తవం. ఇది పరిశుద్ధాత్మకున్న అద్భుత సృజనాత్మకశక్తికి నిరూపణ. పరిశుద్ధాత్మద్వారా యేసు క్రీస్తు మనస్సు నాలో రూపొందుతోంది. ఇది కూడా పరిశుద్ధాత్మ అద్భుత సృజనాత్మకశక్తికి నిరూపణే. దేవుని కుమారుడైన యేసు నిష్కళంకుడు; పరమ పవిత్రుడు; తండ్రితో ఆయనకు తాదాత్మ్యత ఉంది. మరి నాలో కూడా ఈ గుణాలున్నాయా? దేవుని బిడ్డనైన నేను దేవుని కుమారుడైన యేసును పోలి జీవిస్తున్నానా? దేవుని బిడ్డకు ఒక ఆధిక్యత ఉంది. అది: ప్రార్థనద్వారా తండ్రితో ముఖాముఖిగా మాట్లాడడం. ఈ ఆధిక్యతను నేను సద్వినియోగం ఆయన చేసిన పరిచర్యను చేసుకుంటున్నానా? యేసు ప్రభువు తన తండ్రి పనులమీద సదా నిమగ్నమై ఉన్నాడు. మరి నేను కూడా తండ్రి పనులమీద నిమగ్నమై ఉన్నానా? "నేను నా తండ్రి పనులమీద నుండవలెనని మీరెరుగరా ... " (లూకా 2:49). మనకెదురైన పరిస్థితులెటువంటివైనప్పటికీ మనలో ఉన్న క్రీస్తు స్వరూపంద్వారా మనం తండ్రితో అన్యోన్యత కలిగి ఉండాలి.

నా ప్రభువుతో నేను అనన్యత కలిగి ఉన్నానా? నా ఉద్దేశాలు దేవుని ఉద్దేశానుసారంగా ఉన్నాయా? "క్రీస్తు స్వరూపము మీయందేర్పడువరకు ... " అని పౌలు గలతీయులగురించి చెబ్తున్నాడు. నాలో కూడా క్రీస్తు స్వరూపం పరిపూర్ణంగా ఏర్పడడానికి పరిశుద్ధాత్మతో నేను సహకరిస్తున్నానా? లేక, నా జీవితంలోంచి యేసును నేను ప్రక్కకు త్రోస్తున్నానా? నా హృదయంలో నా జీవితంలో దేవుని కుమారుడైన యేసుకు చోటులేకుండా చేస్తున్నానా? యేసు పుట్టినప్పుడు ఆయనకు ఎక్కడా స్థలం దొరకలేదు! నేను కూడా ప్రశాంతతకు, పవిత్రతకు, తండ్రితో సహవాసానికి నాలో స్థలం లేకుండా చేస్తున్నానా?

నాలో ఉన్న క్రీస్తు తన తండ్రిని ఘనపరుస్తూ ఆయణ్ణి ప్రార్థించేలా అనుమతిస్తున్నానా? లేక, ఎప్పుడూ నా కోరికల్నే దేవునికి విన్నవించుకుంటున్నానా? యేసు భూమ్మీద ఉన్నప్పుడు ఎటువంటి పరిచర్య చేశాడో ఇప్పుడాయన నాద్వారా కూడా అదే పరిచర్య చేయడానికి ఆయనకు అనుమతి నిస్తున్నానా? లేక నా ద్వారా యేసు తన తండ్రి ఉద్దేశాల్ని నెరవేర్చడంలో ఆయనకు సహకరించడానికి బదులు ఆయణ్ణి శ్రమపెడుతున్నానా? దేవుని బిడ్డగా మన హృదయస్థితి ఎటువంటిదో మనం తెలుసుకున్నప్పుడు దేవుని ఉద్దేశాలగురించి కూడా తెలుసుకుంటాం. "క్రీస్తు పడిన పాట్లలో కొదువైనవాటియందు నావంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (కొలొస్స 1:24) అని పౌలు చెబ్తున్నాడు. ఇది పౌలు అనుభవం; అతని పరిచర్య. మన అనుభవం, మన పరిచర్య కూడా ఇదే కావాలి. "సంపూర్ణము చేయుచున్నాను" అనే మాటలు ఇంకా మనం చేయవలసిన పనులు చాలా ఉన్నాయని సూచిస్తున్నాయి గదా!

ఆగస్ట్ 9

## తండ్రి వినికిడిలో ప్రార్థన

"యేసు కన్నులు పైకెత్తి -తండ్రీ, నీవు నా మనవి వినినందున నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను ... " (యోహాను 11:41)

దేవుని కుమారుడైన యేసు ప్రార్థించిన ప్రతి సారీ ఆయన తన తండ్రిమీదే దృష్టి నిలిపాడు. దేవుడు తన కుమారుడైన యేసు ప్రార్థనలన్నీ విన్నాడు. "క్రీస్తు స్వరూపము" (గలతీ 4:19) నాలో ఉన్నట్లయితే తండ్రి నా ప్రార్థనలన్నీ వింటాడు. అయితే "క్రీస్తు స్వరూపము" నాలో ఏర్పడేలాగా నేను పరిశుద్ధాత్మను నా జీవితంలోకి అనుమతించాలి. "మీ దేహము ... మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా?" (1 కొరింథీ 6:19). నీ హృదయం దేవునికుమారుడికి బేత్లెహేము కావాలి. దేవుని కుమారుడు నాద్వారా పనిచేయడానికి ఆయనకు నేను అనుమతినిస్తున్నానా? నా అనుదిన జీవితంలో నేను నాలో ఉన్న దేవుని కుమారుణ్ణి పోలి నడుచుకుంటున్నానా? దేవుని కుమారుడైన యేసు చేసిన ప్రార్థనను నా అనుదిన జీవితంలో నేను కూడా చేస్తున్నానా? "ఆ దినమందు మీరు నా పేరట అడుగుదురు ..." (యోహాను 16:26) అని యేసు చెప్పాడు. అది ఏ రోజు? పరిశుద్ధాత్మ నాలో నివసించడానికి వచ్చిన రోజే ఆ రోజు. నాకు  నా ప్రభువుతో అనన్యత ఏర్పడిన రోజే ఆ రోజు.

నీ జీవితం యేసు ప్రభువుకు సంతృప్తి కలిగిస్తోందా? లేక, నీలో ఆధ్యాత్మిక గర్వం వుందా? నీలో ఉన్న ఇంగిత జ్ఞానం అధికమై దేవుని కుమారుడైన యేసును ప్రక్కకు నెట్టి వేయకుండా చూడు. మానవజాతికి ఇంగిత జ్ఞానం దేవుడిచ్చినదే! అయితే ఇది యేసులోని నూతనజీవంద్వారా లభించినది కాదు; పరలోకసంబంధమైన జ్ఞానం మనకు యేసుద్వారా లభించింది. పరలోకసంబంధమైన జ్ఞానాన్ని ప్రక్కకు నెట్టి నీలో ఉన్న ఇంగిత జ్ఞానాన్ని సింహాసనంమీద కూర్చోపెట్టకు. కుమారుడెప్పుడూ తన తండ్రితో అనన్యత కలిగి ఉన్నాడు. ఇది పరలోక సంబంధమైన జ్ఞానంద్వారానే సాధ్యం. మన స్వాభావిక నైజం మనం దేవుణ్ణి ఆరాధించేలా మనకు ప్రేరణ కలిగించదు. అయితే పరిశుద్ధాత్మ మనలో నివాసమున్నప్పుడు ఆయన మన స్వాభావిక నైజాన్ని మన చిత్తవృత్తిని మారుస్తాడు. అప్పుడు మనం యథార్థహృదయంతో దేవుణ్ణి ఆరాధించగలం. మన దేహాత్మలు ఎప్పుడూ దేవునికి విధేయత చూపేలా చేయడం మన తత్క్షణ కర్తవ్యం. దేవుని కార్యాలు మనలో నెరవేరేలా, మనద్వారా కొనసాగేలా మన జీవితాన్ని దేవుని ఆధీనతకు అప్పగించాలి. మనలో దేవుని కుమారుని జీవం వెల్లడయ్యేలా మనం దేవునిమీద ఆధారపడి ఉన్నామా?

ఆగస్ట్ 10

## పరిశుద్ధుని శ్రమలు

"దేవుని చిత్తప్రకారము బాధపడువారు సత్ప్రవర్తన గలవారై ... " (1 పేతురు 4:19)

శ్రమలెదురవ్వాలని ఎవరూ కోరరు. కోరుకుంటున్నట్లయితే ప్రవర్తనలో ఏదో వ్యత్యాసం వుందని చెప్పవచ్చు. అయితే దేవుని చిత్తాన్ని కోరుకోడం, దేవుని చిత్తప్రకారం వచ్చిన శ్రమల ననుభవించడం వేరు. పరిశుద్ధుడు సైతం శ్రమల్ని కోరుకోడు. అయితే అతను దేవుని చిత్తాన్ని కోరుకుంటాడు; శ్రమలు వచ్చినా, శ్రమలు రాకపోయినా. యేసు కూడా దేవుని చిత్తాన్నే కోరు కున్నాడు. ఎదుటి వ్యక్తికి శ్రమ వచ్చినప్పుడు అతని గురించి పట్టించుకోకపోవడం లోకనైజం.

క్రీస్తు మనస్సును కలిగి ఉన్న పరిశుద్ధుడు ఇతరులకు శ్రమలు వచ్చినప్పుడు ఇతరుల్ని ఆదరించి వారికి ధైర్యాన్నిస్తాడు; వారు బలంపొందేలా, పరిణతిచెందేలా వారిని ప్రోత్స హిస్తాడు. అయితే బలపర్చడం వేరు, సానుభూతి చూపడం వేరు. సానుభూతి చూపేవారు మనల్ని బలపర్చకపోవచ్చు. పైగా, ఇతరుల సానుభూతి మనల్ని పిరికిపందల్ని చేస్తుంది. క్రీస్తు మనస్సును కలిగి ఉన్న సహోదరుడు మాత్రమే ఇతరుల్ని అర్థం చేసుకోగలడు. మనం కేవలం సానుభూతినే కోరుకుంటున్నట్లయితే "దేవుడు నాపట్ల చాలా కఠినంగా ఉన్నాడు; అందుకే నాకు కష్టాలొచ్చాయి" అని ఆలోచించేవారిగా ఉంటాం. మత్తయి 16:21-23 వచనాలు చూడండి. యేసు ప్రభువు పేతురు సానుభూతిని కోరుకోలేదు. యేసు ప్రభువు ఉన్నడూ ఎవరి సానుభూతిని కోరుకోలేదు! ఈ వచనాల ప్రకారం సానుభూతి మాటలు అపవాదికి సంబంధించినవని తెలుస్తోంది గదా! యేసు ప్రభువు దేవుని కృపను, దేవదూతల ఉపచారాన్ని కోరుకున్నాడు (లూకా 15:10 చూడండి).

మనం దేవునికి ఉపయోగపడుతున్నామా ఉపయోగపడడంలేదా అనేదాన్ని ఆయన చూడడు. ఆయన మనల్ని లాభనష్టాల ఆధారంగా బేరీజు వేయడు. ఆయన మన ప్రయోజకత్వాన్ని బట్టి చూసినట్లయితే మనుషులెవరూ ఆయనకు ఉపయోగపడరు. ఆయన మనల్ని కొన్ని సార్లు ఎటువంటి సత్ఫలితాలు రాని స్థలాల్లో ఉంచుతాడు. ఫలితాలు ఎలా ఉన్నా సరే, మనం ఎక్కడ ఉన్నా సరే దేవుణ్ణి ఘనపర్చాలని ఆయన కోరుకుంటున్నాడు. మనం ఎక్కడ ఉండాలనే నిర్ణయం మనది కాదు; దేవునిది.

ఆగస్ట్ 11

## అనుభవం తప్పనిసరి

"ఏలీయా సుడిగాలిచేత ఆకాశమునకు ఆరోహణమాయెను. ఎలీషా ... అంతలో ఏలీయా అతనికి మరల కనబడకపోయెను" (2 రాజులు 2:11,12)

నీ జీవితంలో కూడా "ఏలీయా"ఉండవచ్చు. నీవు "ఏలీయా" మీద ఆధారపడడం తప్పు కాదు. అయితే "ఏలీయా" వెళ్లవలసిన సమయం వస్తుందని మర్చిపోవద్దు. ఎందుకంటే దేవుడు "ఏలీయా"ను ఎప్పటికీ నీతోనే ఉంచడు. ఎప్పటికీ "ఏలీయా" నీకు గురువుగా నాయకుడిగా ఉండడు. "ఏలీయా" ఉండడనే ఊహ సైతం నిన్ను నిరుత్సాహపరుస్తుంది. "నా గురువు లేకుండా నా నాయకుడు లేకుండా నేనెలా కొనసాగగలను" అని నీవు చెప్పవచ్చు. అయితే నీవు కొనసాగాలని దేవుడు చెబుతున్నాడు.

*యొర్దాను దగ్గర ఒంటరిగా (2:14).* యొర్దాను నది దగ్గర ఎలీషా ఒంటరిగా ఉన్నాడు. నీ జీవితంలో కూడా ఈ అనుభవం ఉంటుంది. నీవు కూడా "యొర్దాను" దగ్గర ఒంటరిగా ఉంటావు. నిన్ను నడిపించడానికి, నీ బాధ్యత తీసుకోడానికి ఎవరూ ఉండకపోవచ్చు. "ఏలీయా" దగ్గర నీవు నేర్చుకున్నవాటికి "యొర్దాను" దగ్గర పరీక్ష యెదురవ్వవచ్చు. నీవు అనేకసార్లు "ఏలీయా"తో కలిసి "యొర్దాను" దగ్గరకు వెళ్లి ఉండవచ్చు. అయితే నీవిప్పుడు "యొర్దాను" దగ్గర ఒంటరిగా ఉన్నావు. "నేను వెళ్లలేను" అని నీవు చెప్పడంలో అర్థం లేదు. నీవు వెళ్లక తప్పదు. నీవు విశ్వసించిన దేవునిగురించి నిజంగా నీవు తెలుసుకోవాలనుకుంటున్నట్లయితే నీవు ఒంటరిగా "యొర్దాను" దాటాలి.

*"యెరికో"లో ఒంటరిగా (2:15).* "యెరికో"లో "ఏలీయా" గొప్ప పనులు చేయడం నీవు చూసి ఉండవచ్చు. అయితే ఇప్పుడు నీవు "యెరికో"లో ఒంటరిగా ఉన్నావు. ముందడుగు వేయడానికి ఎందుకో నీలో అయిష్టత కనిపిస్తోంది. నీవు "ఏలీయా" దగ్గర నేర్చుకున్నవాటిపట్ల నీలో యథార్థత ఉన్నట్లయితే నీవు కూడా అద్భుతాలు చేయగలవు. "ఏలీయా"కు తోడుగా ఉన్న దేవుడు నీకు కూడా తోడుగా ఉన్నాడు.

*"బేతెలు" దగ్గర ఒంటరిగా (2:23).* "బేతెలు" దగ్గర నీవు నీ స్వంత శక్తిమీద నీ స్వంత తెలివితేటలమీద ఆధారపడలేవు. అయితే నీవిప్పుడు భీతిచెందకూడదు. దేవునిపట్ల యథార్థంగా ఉండు. అప్పుడు నీవు దేవుణ్ణి ఆరాధిస్తున్నావని వ్యక్తమవుతుంది. "ఏలీయా" దగ్గర నీవు నేర్చుకున్నవన్నీ ఇప్పుడు ఆచరణలో పెట్టు. "ఏలీయా" దుప్పటి తీసుకొని ప్రార్థించు (2:13,14 చూడండి). దేవుణ్ణి సంపూర్ణంగా విశ్వసించాలనే కృతనిశ్చయంతో ఉండు. ఇక "ఏలీయా" కొరకు చూడకు.

ఆగస్ట్ 12

## దేవుణ్ణి ఆశ్రయించడం

"అల్పవిశ్వాసులారా, యెందుకు భయపడుచున్నారని ... " (మత్తయి 8:26)

మనం భయపడినప్పుడు దేవుణ్ణి ప్రార్థించడం మినహా ఏమీ చేయలేం. తన నామాన్ని కోరుకొనేవారు కష్టసమయాల్లో తనను ఆశ్రయిస్తారని; వారికి తనమీద అచంచలమైన విశ్వాసం వుంటుందని దేవుడు ఎదురుచూస్తున్నాడు. అయితే కొన్ని సమయాల్లో మనలో దేవునిమీద ఉండవలసిన విశ్వాసం వుండడం లేదు. దేవుణ్ణి తెలుసుకొననివారు కష్టసమయాల్లో ఎలా స్పందిస్తారో మనం కూడా కొన్నిసార్లు అలాగే స్పందిస్తున్నాం. మనకు దేవుడున్నాడనే విషయాన్నే మర్చిపోవడం, అన్నీ దేవుని వశంలోను ఆయన అధీనతలోను ఉన్నాయనే విషయాన్ని విస్మరించడం సాధారణంగా జరుగుతున్నదే. దేవుడు మనల్ని పట్టించుకోడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తుంటాం (మత్తయి 8:25 చూడండి). ఇటువంటి సమయాల్లో మనకు దేవుణ్ణి కాక, మనచుట్టూ ఉన్న రాకాసి అలల్నే చూస్తూ ఉంటాం.

"అల్పవిశ్వాసులారా ... " - కలవరపాటుతో భీతిల్లిన శిష్యులకు ఈ మాట ఈటెలాగా గుచ్చుకొని ఉంటుంది. కష్టసమయాల్లో దేవుణ్ణి ఆశ్రయించకుండా ఆవేదన చెందినందుకు మనకు కూడా ఈ మాట ఈటెలాగానే గుచ్చుకుంటుంది.

మన జీవితంలో ఏ సమస్యలు ఏ సంఘర్షణలు ఏ తుపానులు లేని ప్రశాంత సమయాలు ఉంటాయి. ప్రశాంత వాతావరణానికి కారణం మనమేనని గొప్పగా భావిస్తాం. అయితే సమస్య వచ్చినప్పుడు సంఘర్షణ చోటచేసుకున్నప్పుడు తుపాను రేగినప్పుడు వెనువెంటనే దేవుణ్ణి నిందిస్తాం. మనం ప్రశాంతసమయాల్లోను క్లిష్టసమయాల్లోను దేవుణ్ణి ఆశ్రయించినప్పుడు ఆయణ్ణి ఆరాధించినప్పుడు మనం ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికి మనలో విశ్వాసం చెక్కుచెదరదు.

దేవునితో మనకున్న అన్యోన్యతను అనన్యతను వెల్లడిచేసే మన విశ్వాసం మనల్ని ఆయనయెదుట నిందారహితులుగా నిలబెట్టడమే కాక, మనకు అవధుల్లేని ఆనందాన్నిస్తుంది.

ఆగస్ట్ 13

## "ఆత్మను ఆర్పకుడి"

"ఆత్మను ఆర్పకుడి" (1 థెస్స 5:19)

దేవుని స్వరం మెల్లని స్వరం; మృదువైన స్వరం. నీవు దేవునితో సంపూర్ణ సహవాసంలో ఉంటే తప్ప, ఆయనతో ఏకత కలిగి ఉంటే తప్ప వినబడనంత మెల్లని స్వరం దేవునిది. పరిశుద్ధాత్మ కూడా అంతే మెల్లగా, అంతే మృదువుగా మన అంతరాత్మను తాకుతూ ఉంటాడు; మనల్ని నిమ్మళంగా హెచ్చరిస్తూ ఉంటాడు. సునీతమైన ఆయన స్వరాన్ని విన గలిగే సున్నితత్వం సూక్ష్మగ్రాహ్యత నీలో లేనట్లయితే ఆయన స్వరాన్ని నొక్కివేసేవాడివిగా ఉంటావు. ఫలితం, నీ ఆధ్యాత్మిక జీవితం కుంటుపడుతుంది. నీవు సంయమనం పాటించాలని గుర్తుచేసేటప్పుడు, నీ భావోద్వేగాల్ని నీవు అదుపుచేసుకోవాలని హెచ్చరించేటప్పుడు దేవుడు నీతో "మిక్కిలి నిమ్మళముగా మాటలాడు ... స్వరముతో" (1 రాజులు 19:12) మాట్లాడతాడు. ఎంత మెల్లని స్వరమంటే అది నీకు మాత్రమే వినబడుతుంది.

"చాలా కాలం క్రిందట నేను రక్షణపొందాను" అని నీ వ్యక్తిగత సాక్ష్యాన్ని ఇతరులతో పంచుకుంటున్నావేమో! రక్షణ గతకాలానికి మాత్రమే సంబంధించింది కాదు; నీవెప్పుడో రక్షణపొందినప్పటికీ ఆ రక్షణ ప్రస్తుతకాలంలో దేవునితో నీకు ఉన్న సహవాసానికి అనన్యతకు ముడిపడి ఉంది (లూకా 9:62; 1 యోహాను 1:6,7 వచనాలు కూడా చూడండి). నీ మనోదృష్టిని గతంమీదనుంచి వర్తమానంమీదకు మళ్లించు. గత క్షణాల్ని మాటిమాటికీ జ్ఞాపకం చేసుకోడం మూలంగా నీ మనోప్రవృత్తి మారే అవకాశం వుంటుందేమో! వర్తమానాన్ని విడిచి నీవు గతకాలపు జ్ఞాపకాల్లో కాలం గడుపుతున్నావేమో! వెలుగులో నడుస్తున్న నీవు "నాగలిమీద చెయ్యివేసి" వెనక్కు చూడకు. నీవు గురితప్పే ప్రమాదం వుంది. ఇందుకు నీ సాక్ష్యమే నిదర్శనం. గతకాలంలోని రక్షణానుభావాన్ని జ్ఞాపకం చేసుకుంటూ నీవు ముందుకు కదలక పోయినట్లయితే ఎలా వెలుగులో నడవగలవు? పరిశుద్ధాత్మ మెల్లగా నీ హృదయాన్ని తట్టి నిన్ను హెచ్చరించినప్పుడు వెంటనే నిన్ను నీవు సరిచేసుకో. లేనట్లయితే నీకు తెలియకుండానే నీలో ఉన్న పరిశుద్ధాత్మను నీవు ఆటంకపర్చేవాడివిగా ఆర్పివేసేవాడివిగా ఉంటావు.

నీలో ఉన్న సహనానికి పరీక్ష నీకెదురయ్యే సమస్యలే. దేవుడు నీ ఓర్పును పరీక్షించ డానికి సమస్యల్ని రప్పించవచ్చు! నీవు సహనం కోల్పోయినప్పుడు నీలో అపరాధభావం కూడా చోటుచేసుకుంటుంది. సహనం కోల్పోయి అవిధేయత చూపినందుకు నీ హృదయంలో ఆవేదన ఉంటుంది. నీలో ఉన్న పరిశుద్ధాత్మను నీవు దుఃఖపెట్టేవాడివిగా ఉంటావు. అయితే సమస్యల్లో సంఘర్షణల్లో క్లిష్టకాలంలో నీవు సహనం చూపినప్పుడు సంయమనం పాటించి నప్పుడు దేవునికి స్తుతి కలుగుతుంది. నీలో నివసించే పరిశుద్ధాత్మకు ఆనందం కలుగుతుంది. పరలోకపు తండ్రికి, పరిశుద్ధాత్మకు దుఃఖం కలిగించే ఏ పనీ చేయకు.



ఆగస్ట్ 14

## దేవుడు మనల్ని క్రమశిక్షణలో పెట్టడం

"నా కుమారుడా, ప్రభువు చేయు
శిక్షను తృణీకరించకుము
ఆయన నిన్ను గద్దించినప్పుడు
విసుకకుము" (హెబ్రీ 12:5-6)

దేవుని పరిశుద్ధాత్మను మనం అతి సులువుగా దుఃఖపెడుతుంటాం. దేవుడు మనల్ని సరిదిద్దుతున్నప్పుడు ఆయణ్ణి త్రోసివేసినట్లయితే, లేక దేవుడు మనల్ని గద్దించినప్పుడు మనం నిరుత్సాహపడినట్లయితే పరిశుద్ధాత్మ దుఃఖిస్తాడు. పరిశుద్ధపర్చబడిన అనుభవం మనలో లోతుగా లేనట్లయితే మనం దేవునిగురించి అపార్థం చేసుకొనే అవకాశం లేకపోలేదు. దేవుని ఆత్మ మనల్ని హెచ్చరిస్తున్నప్పుడు ఆ స్వరం దేవునిది కాదని మనం పొరబాటు పడవచ్చు.

"ఆత్మను ఆర్పకుడి" (1 థెస్స 5:19). "ఈ విషయంలో గుడ్డిగా నడవకు" అని పరిశుద్ధాత్మ నిన్ను హెచ్చరించినప్పుడు విసుగుచెందకు. ప్రభువు నిన్ను సరిదిద్ది క్రమశిక్షణలో పెట్టినప్పుడు ఆయన మార్గంలో నడువు. నీ స్వంత త్రోవల్ని విడిచిపెట్టు. దేవునితో అన్యోన్యత కలిగి ఉండు; ఆయనతో అనన్యతను దూరం చేసుకోకు.

"*ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుకకుము.*" కొన్ని సార్లు దేవునిమీద చిరాకును విసుగును చూపిస్తుంటాం. "నేను ప్రార్థించానుగానీ, నాకు అనుకూలంగా జరగలేదు. ఈ విషయం ఇంతటితో వదిలేస్తాను" అని ఫిర్యాదు చేస్తుంటాం. జీవితంలో అన్ని విషయాల్లో మనం ఇలాగే ఉంటున్నామా? ఇలాగే వదిలేస్తున్నామా?

దేవుడు తన చేతితో నన్ను పట్టుకున్నప్పుడు ఆయన చేతిలో నేను ఇముడుతున్నానా? లేక, తప్పించుకోడానికి ప్రయత్నిస్తున్నానా? ఇమిడినట్లయితే నాలో మరియు నాద్వారా ఆయన కార్యాలు నెరవేరతాయి. మనల్ని సరిదిద్ది పరిశుద్ధపర్చే ప్రక్రియ దేవునిది; మనది కాదు! ఆయన మనలో ఏం కోరుకుంటున్నాడో దానికనుగుణంగా ఆయన మనల్ని తీర్చి దిద్దుతాడు. అయితే ఇది మనం ఆయన గద్దింపుపట్ల యథార్థమైన విధేయత చూపించి నప్పుడు, ఆయన క్రమశిక్షణకు లోబడినప్పుడు మాత్రమే! (1 థెస్స 5:23,24)

ఆగస్ట్ 15

## నూతన జన్మకు రుజువు

"మీరు క్రొత్తగా జన్మింపవలెనని ... " (యోహాను 3:7)

"ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు?" అని నీకొదేము ప్రశ్నించాడు. ఈ ప్రశ్నకు జవాబు: జీవితంలో అన్ని కోల్పోడానికి సిద్ధమై, పాత అలవాట్లను ఆలోచనల్ని ఆచరణల్ని గతింపజేసి, క్రీస్తు అనుగ్రహించే నూతనజీవం పొందడానికి సిద్ధం కావడమే తిరిగి పుట్టడం; ఇదే నూతన జన్మ. ఈ అనుభవం జీవితంలో ఇంతకు ముందు లేదు గనక; మనలో నూతనజీవం మూలంగా నూతన స్వభావం ఏర్పడింది గనక ఇది క్రొత్తగా జన్మించడంతో సమానం. పాపం విషయంలో మనం పశ్చాత్తాపం పొందినప్పుడు, పరిశుద్ధతను వెల్లడిచేసే విషయంలో మనలో ఎటువంటి నటన లేనప్పుడు మనలో నూతనజీవం వెల్లడవుతుంది. ఇదే మన నూతన జన్మకు నిదర్శనం.

"తన్ను *ఎందరంగీకరించిరో వారికందరికి ...* " (యోహాను 1:12). ఇతరుల ద్వారా నీవు యేసు క్రీస్తుగురించి విని ఆయణ్ణి అంగీకరించావా? లేక, నీ ఆధ్యాత్మిక అన్వేషణద్వారా యేసు క్రీస్తును తెలుసుకొని ఆయణ్ణి అంగీకరించావా? యేసు క్రీస్తు నీ స్వంత రక్షకుడని చెప్పడానికి నీ జీవితంలో ఏది నిదర్శనంగా ఉంది? నీ ఆధ్యాత్మిక జీవితానికి పునాది యేసు క్రీస్తును నీ స్వంత రక్షకుడిగా అంగీకరించడం మాత్రమే. నీవు తిరిగిపుట్టినప్పుడు మాత్రమే యేసును చూడగలవు.

"*ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని*" (యోహాను 3:3). దేవుని రాజ్యం నిజంగా ఉందని తెలుసుకోడానికి మాత్రమే వెతుకుతున్నావా? లేక, నీ జీవితంమీద సర్వాధిపత్యం దేవునిదేనని ఒప్పుకుంటూ ఆయన ఆధీనానికి నిన్ను నీవు అప్పగించుకుంటున్నావా? అన్నిటిమీదా దేవునికి ఆధిపత్యం వుంది. నూతనజన్మ నీకు నూతన దృష్టిని కూడా ఇస్తుంది. నీవిప్పుడు దేవుని అధీనాన్ని స్పష్టంగా చూడగలవు. నీలో దేవుని పోలిక ఉన్నప్పుడు ఆయన కృత్యాలు ఆయన కార్యాలు నీకు సుస్పష్టంగా కనిపిస్తాయి.

"దేవుని మూలముగా పుట్టిన ప్రతివానిలో ... వాడు పాపము చేయడు" (1 యోహాను 3:9). పాపం చేయడం మానివేశావా? లేక, పాపం చేయడం మానివేయడానికి ప్రయత్నిస్తున్నావా? "వాడు పాపము చేయడు" అని బైబిలు ఉద్ఘాటించి చెబ్తోంది. అంటే, మనం పాపంచేయడానికి ప్రలోభపడమని కాదుగానీ, మనలో ఉన్న దేవుని జీవానికి మనం విధేయత చూపించినప్పుడు మనం పాపం చేయలేమని అర్థం. ఇది మాత్రమే మనం తిరిగి పుట్టినవారమనేందుకు నిదర్శనం.

ఆగస్ట్ 16

## ఆయనకు నేను తెలుసా?

"అతడు తన సొంత గొఱ్ఱెలను పేరుపెట్టి పిలిచి ... " (యోహాను 10:3)

*ఆయణ్ణి నేను అపార్థం చేసుకున్నానా?* (యోహాను 20:11-18 వచనాలు చూడండి). మతసిద్ధాంతాలు క్షుణ్ణంగా తెలిసినప్పటికి కూడా యేసును తెలుసుకొననివారు చాలామంది ఉన్నారు. యేసును తెలుసుకోడానికంటె సిద్ధాంతాల్ని తెలుసుకోడానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చినప్పుడు మనలో ఉన్న జీవాత్మకు అపాయకరమైన స్థితి ఎదురవుతుంది. ఎందుకు మగ్దలేనే మరియ ఏడ్చింది? మతసిద్ధాంతాలు ఆమెకు కాళ్లక్రింద ఉన్న గడ్డిపోచలతో సమానం. వాస్తవానికి మతసిద్ధాంతాల్లో నిష్ఠాగరిష్ఠులైన పరిసయ్యులకు మగ్దలేనే మరియ హాస్యాస్పదంగా కనిపించి ఉండవచ్చు. అయితే, యేసు ప్రభువు ఆమెలోంచి ఏడు దయ్యాల్ని వెళ్లగొట్టాడనే వాస్తవాన్ని పరిసయ్యులు హాస్యాస్పదంగా ఎంచలేరు (లూకా 8:2 చూడండి). అయితే ఆమెకు అన్నిటికంటె యేసే మిన్న! "ఆమె ... వెనుకతట్టు తిరిగి, యేసు నిలిచియుండుట చూచెనుగాని ఆయన యేసు అని గుర్తుపట్టలేదు ... యేసు ఆమెను చూచి -మరియా అని పిలిచెను" (యోహాను 20:14,16). యేసు మరియను పేరుపెట్టి పిలిచినప్పుడు ఆమె యేసును గుర్తు పట్టింది. "ఆమె ఆయనవైపు తిరిగి ఆయనను ... రబ్బూనీ అని పిలిచెను" (యోహాను 20:16).

*నేను మొండిపట్టుదలతో సందేహించానా?* (యోహాను 20:24-29 వచనాలు చూడండి). యేసుగురించి నాలో సందేహాలున్నాయా? ఇతరులు యేసుగురించి చెప్పే సాక్ష్యానుభవం నాలో లేదా? తక్కిన శిష్యులు తోమాతో "మేము ప్రభువును చూచితిమని" చెప్పారు. అయితే తోమా సందేహించాడు. తోమా "నేనాయన చేతులలో ... నమ్మనే నమ్మనని" శిష్యులతో కుండబద్దలుకొట్టినట్టుగా చెప్పాడు. యేసు ప్రభువును తన కళ్లతో తాను చూస్తేనేగాని నమ్మనని తోమా మొండి పట్టుదల. అయితే ఎప్పుడు మనం యేసును స్పృశించి చూస్తామో మనకు తెలియదు. అయితే మనం యేసును స్పృశించి చూసే అనుభవం మాటలకందని ప్రశస్తమైన అనుభవం. "తోమా ఆయనతో -నా ప్రభువా, నా దేవా అనెను" (యోహాను 20:28). యేసు ప్రభువును చూసిన తోమా సాక్ష్యం ఇది.

*స్వార్థంతో ఆయణ్ణి నేను ఖండిస్తున్నానా?* (యోహాను 21:15-17 వచనాలు చూడండి). పేతురు ఒట్టుపెట్టుకొని, తనను తాను శపించుకొని యేసు క్రీస్తును నిరాకరించాడు (మత్తయి 26:69-75 వచనాలు చూడండి). అయితే యేసు పునరుత్థానం తర్వాత పేతురుయెదుట ప్రత్యక్షమయ్యాడు. పేతురు ఒంటరిగా ఉన్నప్పుడు అతణ్ణి యేసు పూర్వస్థితికి తెచ్చాడు. మళ్లీ అందరియెదుట యేసు పేతురును పూర్వస్థితికి తెచ్చాడు. పూర్వస్థితిని పొందిన పేతురు యేసుతో "ప్రభువా, నీవు సమస్తము ఎరిగినవాడవు" అన్నాడు (యోహాను 21:17).

యేసు క్రీస్తును నేను వ్యక్తిగతంగా తెలుసుకున్నానా? శిష్యత్వానికి నిజమైన గుర్తు యేసుతో ఉన్న అన్యోన్యత మరియు అనన్యత మాత్రమే. అప్పుడు ఏదీ మనల్ని యేసుకు దూరం చేయలేదు.

ఆగస్ట్ 17

## నీవు నిరుత్సాహంగా ఉన్నావా? లేక, ఆసక్తి కలిగి ఉన్నావా?

"యేసు విని -నీకింక ఒకటి కొదువగానున్నది; నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము ... నీవు వచ్చి నన్ను వెంబడింపుమని అతనితో చెప్పెను. అతడు మిక్కిలి ధనవంతుడు గనుక ఈ మాటలు విని మిక్కిలి వ్యసనపడగా ... " (లూకా 18:22,23)

మన ప్రభువు నీతో మాట్లాడిన మాటలు నీకు కఠినంగా ఉన్నాయా? ఆయన నిన్ను చెయ్యమన్న పని నీకు దుస్సాధ్యంగా కనిపిస్తోందా? యేసు మాటల్లో మహత్తరమైన శక్తి ఉంది. వినడానికి ఆచరించడానికి యేసు మాటలు కొందరికి కష్టంగానే ఉంటాయి; కొంతమంది ఆయన మాటలు వినడానికి సైతం ఇష్టపడరు. కారణం, ఆయనకు లోబడడం ఇష్టం లేకనే. అయితే యేసు మాటల్లో కర్కశత్వం లేదు. ఆయన మనలో మార్పు కోరుకుంటున్నాడు.

యేసు ప్రభువు ధనవంతుడైన యువ అధికారితో మాట్లాడినప్పుడు అతను తన మాటలకు సమ్మతించాలని యెదురుచూడలేదు. అతను తన వెంట వస్తాడని కూడా యెదురు చూడలేదు. యేసు ప్రభువు ఆ వ్యక్తితో "నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము ... నీవు వచ్చి నన్ను వెంబడింపుమని" చెప్పాడు. ఆయన ఆ వ్యక్తిని తన వెంట రమ్మని బ్రతిమ లాడలేదు; తన ననుసరించమని ప్రలోభపెట్టలేదు. అతను ఏం చేయాలో యేసు ప్రభువు సూటిగా మాట్లాడి, నిర్ణయాన్ని అతని ఇష్టానికే వదిలిపెట్టాడు. యేసు ప్రభువు ఇలా మాట్లాడడం కొంతమందికి కఠినంగా నిష్కర్షగా ఉండవచ్చు.

యేసు ప్రభువు ఎప్పుడైనా నీతో ఇలా మాట్లాడిన సందర్భం వుందా? నీకు మాత్రమే వర్తించే మాటల్ని , కేవలం నీవు మాత్రమే వినవలసిన మాటల్ని యేసు నీతో అన్నాడా? పై వచనాల్లోని అధికారికి యేసు మాటలు స్పష్టంగా అర్థమయ్యాయి. యేసు ప్రభువు మాటల సారాంశం అతనికి తెలుసు. కానీ అతని హృదయం భంగపడింది. అతను ఎంతో ఉత్సాహంతో నిశ్చయభావంతో యేసు దగ్గరికి వచ్చాడు. అయితే అతను న్యూనతతో తిరిగివెళ్లలేదుగానీ, నిరుత్సాహంతో వ్యాకులతతో తిరిగి వెళ్లాడు. యేసు మాటలు అతణ్ణి నిశ్చేష్టుణ్ణి చేశాయి. యేసు మాటలు అతనిలో ఉత్సాహపూరితమైన భక్తివిశ్వాసాల్ని కలిగించడానికి బదులు వ్యాకులత కలిగించాయి. యేసు అతనివెంట వెళ్లి అతణ్ణి బ్రతిమిలాడలేదు; అతని ఇష్టానికే అతణ్ణి వదిలివేశాడు. మనం యేసు మాటల్ని నిజంగా వినినట్లయితే అవి ఏదో ఒక రోజు మనలో ఫలిస్తాయి. ప్రభువు మాటల్ని మనఃపూర్వకంగా వినడానికి కొందరు ఇష్టపడరు. అయితే కరుణామయుడైన ప్రభువు మన వైఫల్యాల్నిబట్టి మనల్ని నిందించడు!

ఆగస్ట్ 18

## నీవెప్పుడైనా విచారంతో నిశ్చేష్టుడవయ్యావా?

"అతడు మిక్కిలి ధనవంతుడు గనుక ఈ మాటలు విని మిక్కిలి వ్యసనపడగా ..." (లూకా 18:23)

యేసు మాటలకు ఏ జవాబు చెప్పలేని ధనవంతుడైన యువ అధికారి విచారవదనంతో అక్కడనుంచి వెళ్లిపోయాడు. యేసు మాటలపట్ల అతనిలో ఏ సందేహం లేదు. యేసు మాటల సారాంశం అతనికి పూర్తిగా తెలుసు. అయితే యేసు కోరుకున్న జవాబు తన దగ్గరలేదని అతనికి తెలుసు. నీకెప్పుడైనా ఇటువంటి సందర్భం అనుభవంలోకి వచ్చిందా? దేవుని వాక్యం నీలో ఉన్న లోపాల్ని సూటిగా నీకు గుర్తు చేసిందా? నీవు సరిదిద్దుకోవలసినవి ఏవైనా ఉన్నాయా? బహుశా ఆయన నీ స్వభావంలో మార్పును కోరుకొని ఉండవచ్చు; నీ కోరికల్లో నీ అభిరుచుల్లో మార్పును కోరుకొని ఉండవచ్చు; ఇతరులతో నీ సంబంధాల్లో మార్పును కోరుకొని ఉండవచ్చు. అప్పుడు నీవు విచారంతో నిశ్చేష్టుడవయ్యావా? దేవుడు నిన్ను బ్రతిమలాడడు. అయితే నీతో మాట్లాడిన ప్రతి సారీ ఆయన నీకు ఇదే గుర్తు చేస్తాడు. ఎందుకంటే నీవు చేయవలసినది ఇదే కాబట్టి.

"*నీకు కలిగినవన్నియు అమ్మి* ... " (18:22). నిన్ను వశపర్చుకొనేవాటన్నిటినుంచి నీవు బయటపడాలని యేసు ఉద్దేశం. దేవునికి నీవు మాత్రమే కావాలి; నీ సిరిసంపదలు కాదు. ఇదే అసలు సంఘర్షణ. దేవుని యెదుట నీకు అసలు పరీక్ష ఇదే. నీకు యేసు మాటలు కఠినంగా నిష్కర్షగా ఉండవచ్చు. యేసు మాటలు నీకు నిరుత్సాహాన్ని విచారాన్ని కలిగించి ఉండవచ్చు. యేసు మాటలకు సమ్మతించడం నీకు కష్టంగా ఉండవచ్చు. నిజమే! అయితే నీలో క్రీస్తు మనస్సు ఉన్నప్పుడు, క్రీస్తు స్వభావం ఉన్నప్పుడు ఆయన మాటలు నిన్ను నిరుత్సాహపరచవు; నీకు విచారం కలిగించవు. కచ్చితమైన మరియు సూటియైన యేసు మాటల్ని ఎవరైనా నీకు మార్దవంగా చెబ్తారేమో! వారి విషయంలో అప్రమత్తంగా ఉండు!

*యేసుకొరకు నిరుపేదగా మారడానికి నీవు సిద్ధమేనా?* మారడానికి సిద్ధపడక పోయినట్లయితే, యేసుకొరకు నీ సిరిసంపదల్ని దూరం చేసుకోడం నీకు విచారాన్ని కలిగిస్తుంది. నీమీద నీకు ఉన్న ప్రేమ నిన్ను యేసుకొరకు నిరుపేదగా మారనివ్వదు. అయితే నీమీద నీకు ఉన్న ప్రేమ నిన్ను యేసు ప్రేమకు దూరం చేస్తుంది. నీమీద నీకు ఉన్న ప్రేమ నీ స్వనీతిమీద నీకు ఉన్న ప్రేమ కావచ్చు. ఇది యేసుపట్ల నీకు ఉన్న ప్రేమ కాదు!

ఆగస్ట్ 19

## స్వయం స్పృహ

"నా యొద్దకు రండి " (మత్తయి 11:28)

మనం క్రీస్తులో పరిపూర్ణమైన జీవితం జీవించాలని దేవుడు కోరుకుంటున్నాడు. అయితే కొన్ని సార్లు మన జీవితంమీద బయటినుంచి దాడి జరుగుతుంది. ఇది ఎందుకు జరిగిందనే విషయంమీద మనకు మనమే నిర్ణయాలు తీసుకోడం తదనంతర పరిణామం. ఈ అలవాటు మనలోనుంచి తొలగిపోయిందనే ఇప్పటివరకు తలంచాం. దేవునిలో మన పరిపూర్ణజీవితానికి మొదటి ఆటంకం మనగురించి మనమే నిర్ణయాలు తీసుకోడం. ఈ అలవాటు మనలో అలజడిని సంఘర్షణను రేపుతుంది. మనగురించి మనమే నిర్ణయాలు తీసుకోడం పాపం కాదు; పిరికితనం, ఉద్విగ్నత, భావోద్రేకాలు ఇందుకు కారణం. ఉన్నపాటున క్రొత్త మనుషుల మధ్యకు వెళ్లడం, క్రొత్త పరిస్థితులు ఎదురుకావడం కూడా ఇందుకు కారణం కావచ్చు. అయితే మనం దేవునిమీద తప్ప ఎవరిమీదనైనా ఆధారపడడం దేవునిచిత్తం కాదు. చివరకు మనం మనమీద, అంటే మన ఆలోచనలమీద మన నిర్ణయాలమీద ఆధారపడడం కూడా దేవునిచిత్తం కాదు. దేవునితో మన విశ్రాంత సమయాల్ని అడ్డుకునే పరిస్థితులన్నిటిని మనం సరిదిద్దుకోవాలి. మనం వాటిని విస్మరించడంద్వారా లేక, వాటిపట్ల నిర్లక్ష్యం చూపడంద్వారా మనల్ని మనం సరిచేసు కోలేం. మనం యేసు వద్దకు రావడంద్వారా మాత్రమే మనల్ని మనం సరిచేసుకోగలం. మనం క్రీస్తును సమీపించినప్పుడు, మన జీవితంలో ఆయన నిర్ణయాల్ని కోరు కున్నప్పుడు మనం అడిగినవి ఆయన తప్పక చేస్తాడు. మనం క్రీస్తులో నిలిచి ఉండాలని కూడా దేవుడు కోరుకుంటున్నాడు.

క్రీస్తుతో నీ అన్యోన్యతను అనన్యతను ఏదీ అడ్డుకోకుండా అప్రమత్తంగా ఉండు. నీ స్నేహితులు నిన్ను క్రీస్తుకు దూరం చేయకుండా అప్రమత్తంగా ఉండు. నీవు అప్రమత్తంగా లేనట్లయితే నీలో ఆధ్యాత్మికబలం తగ్గి, నీ ఆధ్యాత్మిక ఎదుగుదల కుంటుపడుతుంది. క్రీస్తునుంచి నిన్ను ఏవి వేరుచేస్తున్నాయో వాటి విషయంలో అప్రమత్తంగా ఉండు. ఆధ్యాత్మిక క్రమశిక్షణ ముందు, అన్నీ అల్పమైనవే. మన సమస్యలన్నిటికీ మన సంఘర్షణలన్నిటికీ ఒకే ఒక పరిష్కారం వుంది. అది: "నా యొద్దకు రండి" అని మనల్ని పిలుస్తున్న యేసు పిలుప మాత్రమే. మేధోపరంగా నైతికంగా ఆధ్యాత్మికంగా మనమెంత లోతైన వాళ్లమో, మనలో ఎంత యథార్థత ఉందో యేసు పిలుపు నిర్ణయిస్తుంది. మన జీవితాల్లో యథార్థత లోపించినప్పుడు మనం యేసును సమీపించడానికి బదులు స్వయంస్పృహ మీద ఆధారపడుతున్నాం.

ఆగస్ట్ 20

## క్రీస్తు స్పృహ

"నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (మత్తయి 11:28)

ఏదైనా నిన్ను క్రీస్తుకు దూరంచేస్తున్నట్లయితే వెంటనే ఆయణ్ణి సమీపించి నీ విశ్రాంతిని పూర్వస్థితికి తెచ్చుకో. నీకు ఆశాంతి కలిగించే దేన్నీ నీ జీవితంలోకి అనుమతించకు. క్రీస్తునుంచి నిన్ను వేరుచేసి ఆధ్యాత్మికంగా నిన్ను శిథిలంచేయడానికి ప్రయత్నించే ప్రతిదాన్నీ త్రిప్పికొట్టు; ఏవి నిన్ను ఆధ్యాత్మికంగా ఛిద్రంచేస్తున్నాయో వాటి అవశేషాల్ని నీలో మిగిలి ఉండనీయకు. ఆయనగురించి చైతన్యస్పృహను నీలో నింపమని క్రీస్తును ప్రార్థించు. అప్పుడు నీ గురించి నీవే నిర్ణయాలు తీసుకోడం ఆగిపోతుంది. అప్పుడు నీకు సర్వస్వం ప్రభువే. నీ గురించి నీకు అధికమైన స్పృహ ఉన్నప్పుడు నీమీద నీవే సానుభూతి చూపించుకుంటావు. నీ మీద నీవు సానుభూతి చూపించుకోడం అపవాదికి చెందినది. "వాళ్లు నన్ను అపార్థం చేసు కున్నారు. ఇందుకుగాను వాళ్లే నాకు క్షమాపణలు చెప్పాలి. వాళ్లమీద నాలో ఎటువంటి దురుద్దేశాలు లేవు గదా" అని నిన్ను నీవు సమర్థించుకోకు. ఇటువంటి విషయాల్లో మనుషుల ఇష్టాయిష్టాలగురించి ఆలోచించకు. నీలో క్రీస్తు స్పృహను ఉంచమని దేవుణ్ణి ప్రార్థించు. ఆయన నీకు క్రీస్తులో సంపూర్ణతనిస్తాడు.

దేవుని బిడ్డ జీవితం సంపూర్ణమైన జీవితం. ఆరోగ్యంగురించి ఆరోగ్యవంతునికి తెలిసినదానికంటె అనారోగ్యం ఉన్న వ్యక్తికి ఎక్కువగా తెలుసు. దేవుని బిడ్డకు దేవుని చిత్తం గురించి స్పృహ ఉండదు; కారణం, తానే దేవుని చిత్తం కాబట్టి. మనం దేవుని చిత్తానికి లేశ మాత్రమైనా దూరమైనప్పుడు "ప్రభువా, నీ చిత్తమేమిటి?" అని అడుగుతాం. దేవుడు తన ప్రార్థనలకు ఎప్పుడూ జవాబిస్తాడని దేవుని బిడ్డలో నిశ్చయత ఉండాలి.

మన ఇంగిత జ్ఞానం మనం మన నిర్ణయాలు తీసుకొనేలా మనల్ని ప్రోత్సహిస్తుంది. మనంతట మనం విశ్రాంతి పొందలేం. విశ్రాంతి క్రీస్తు మాత్రమే ఇవ్వగలడు. అందుకే ఆయన "నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును" అని మనల్ని పిలుస్తున్నాడు. క్రీస్తు మన ప్రయాసలనుంచి మనల్ని విడిపించి మనకు విశ్రాంతి నిచ్చినప్పుడు మనలో ఉన్న స్వయంస్పృహ స్థానంలో క్రీస్తు స్పృహ చోటుచేసుకుంటుంది. యేసు ఎక్కడ ఉంటే అక్కడ సమాధానం విశ్రాంతి ఉంటాయి. ఇంతవరకు జీవితంలో మనమెన్నడూ అనుభవించని సమాధానాన్ని విశ్రాంతిని మనం క్రీస్తునుంచి పొందుతాం.

ఆగస్ట్ 21

## అనామకుల పరిచర్య

"ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు ... " (మత్తయి 5:3)

లోకప్రమాణాల ప్రకారం చూచినట్లయితే క్రొత్త నిబంధనలోని చాలా విషయాలు మనకు ఆసక్తికరంగా ఉండవు. "ఆత్మవిషయమైన దీనులైనవారు ధన్యులు ... " - అక్షరాలా ఈ మాటలకు రిక్తులు ధన్యజీవులని అర్థం! నిర్భాగ్యులు నిరుపేదలు ఎక్కడంటే అక్కడ మనకు కనిపిస్తారు. వీరినెవరూ పెద్దగా పట్టించుకోరు. ఎవరిలోనైనా విశిష్ట గుణాలున్నప్పుడు, గొప్పతనం ఉన్నప్పుడు, ఆ వ్యక్తిని అందరూ మన్ననతో చూడడం సహజమే! వారికి సమాజంలో మంచి గుర్తింపు కూడా ఉంటుంది. "యేసు కొరకు నిర్ణయం తీసుకో" అనే నినాదాన్ని మనం చాలా కాలంగా వింటూనే ఉన్నాం. ఈ నినాదం మన ప్రమేయాన్ని మన పాత్రను మన ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నట్టు కనిపిస్తోంది కదా! అయితే మన ప్రభువు మనల్ని తనకొరకు ఈ నిర్ణయం తీసుకొమ్మని ఆ నిర్ణయం తీసుకొమ్మని ఎన్నడూ అడగడు; ఆయనకు మనం విధేయత చూపాలని మాత్రమే కోరుకుంటున్నాడు. నిర్ణయం వేరు; విధేయత వేరు. మనలో యేసుకు కావలసినది మన నిర్ణయాలు కాదు; మన విధేయత; మనఃపూర్వకమైన విధేయత. యేసు రాజ్యానికి, దీనత్వానికి దగ్గరి సంబంధం వుంది. నా ఘనత నా ఐశ్వర్యం నా హోదా నాకు యేసు రాజ్యంలో ప్రవేశం కలిగించవుగానీ నాలో ఉన్న దీనత్వమే నన్ను యేసు రాజ్యంలోకి నడిపిస్తుంది. దీనుల్నే యేసు ధన్యులంటున్నాడు.

అయితే దీనత్వాన్ని ఎవరూ గుర్తించరు. మనగురించి మనం ఎక్కువగా ఊహించుకోడం, మనల్ని మనం గొప్పగా ఎంచుకోడం దీనత్వం కాదు; ఇది గర్వంతో సమానం. అతిశయభావమంటే ఇదే! ఇది క్రైస్తవ లక్షణం కూడా కాదు. విశ్వాసిలో దీనస్వభావం లేనట్లయితే అతను నిజమైన విశ్వాసి కాడు! "నేను దేవునికి ఉపయోగపడతాను" అనే ఆలోచనే మనలోని దీనత్వాన్ని బయటికి త్రోసివేస్తుంది. మనల్ని మనం గొప్పగా ఎంచుకోడం యేసు స్పర్శను మనకు దూరం చేస్తుంది. "నాయందు విశ్వాసముంచువాడెవడో ... జీవజలనదులు పారునని" (యోహాను 7:38) యేసు చెప్పాడు.

నామీద గాఢమైన ప్రభావం చూపినవాళ్లెవరు? గాఢమైన ప్రభావం చూపారని నేననుకుంటున్నవాళ్లు కాదుగానీ, నేను ఏ మాత్రం విలువ ఇవ్వనివాళ్లే. వాళ్లు నామీద ప్రభావం చూపుతున్నారని కనీసం నేను ఊహించనైనా ఊహించను. అలాగే మనం ఇతరులమీద ప్రభావదం చూపుతున్నామని మనం ఊహించినట్లయితే మనం నిజంగా వాళ్లమీద ప్రభావం చూపనట్లే! లోకప్రమాణాల ప్రకారం మనం ఏ మాత్రం గొప్పగా లేనప్పుడే మనలో యేసు కార్యాలు జరుగుతాయి. ఈ దీనత్వాన్నే యేసు మనలో కోరుకుంటున్నాడు. దీనులే ధన్యజీవులు. యేసు రాజ్యం వీరిదే!

ఆగస్ట్ 22

## "నేను ... అయితే ... ఆయన"

"నేను నీళ్లలో మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను ... ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును" (మత్తయి 3:11)

"నేను ... అయితే ... ఆయన" అని నీవు చెప్పిన సందర్భం నీ జీవితంలో ఉందా? ఆ సందర్భం వచ్చేవరకు పరిశుద్ధాత్మ బాప్తిస్మమంటే ఏమిటో నీకు తెలిసి ఉండకపోవచ్చు. మన జీవితంలో "నేను"కు ప్రాధాన్యత తగ్గినప్పుడు మాత్రమే "ఆయన"కు ప్రాధాన్యత ఉంటుంది. ఎవరూ చేయలేని కార్యాల్ని యేసు మాత్రమే చేయగలడు. నీలో ఉన్న ఆటంకాలన్నీ తొలగేవరకు ఆయన నీ హృదయంలోకి రాడు. నీ హృదయంలో ఉన్న ప్రతి తప్పును ఆయన వెలుగులోనికి తెచ్చి పశ్చాత్తాపపడడానికి సిద్ధంగా ఉన్నావా? "నేను పాపిని" అని నీవు ఒప్పుకున్నప్పుడు ఆయన నీ దగ్గరికి వస్తాడు. "నేను మంచివాడిని" అని నీవనుకున్నప్పుడు ఆయన నీ దగ్గరికి రాడు. యేసు నీ హృదయంలోకి రాకుండా నీ స్వనీతి ఆయణ్ణి అడ్డుకుంటోంది.

"నేను అయోగ్యుడను" అని నీవు ఒప్పుకోడమే పశ్చాత్తాపం. నీలో పశ్చాత్తాపం కలిగినప్పుడు నీవు ఉన్న అనర్హత నీకు తెలుస్తుంది. "ఆయన చెప్పులు మోసే అర్హత కూడా నాకు లేదు" అని నీవు గుర్తిస్తావు. ఇదే నిజమైన పశ్చాత్తాపం. ఇటువంటి పశ్చాత్తాపం నీలో ఉందా? లేక, నీవు చేసిన పనుల్ని నీవే సమర్థించుకుంటున్నావా? నీలో నిజమైన పశ్చత్తాపం లేనట్లయితే యేసుకు నీ హృదయంలో ప్రవేశం లేనట్లే!

"ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును" - పరిశుద్ధాత్మ బాప్తిస్మం ఒక అనుభవమని యోహాను ఇక్కడ చెప్పడంలేదు గానీ పరిశుద్ధాత్మ బాప్తిస్మం యేసు కార్యమని మాత్రమే చెబుతున్నాడు. ఆయన యెదుట అయోగ్యులమనే విషయాన్ని జ్ఞాపకం చేసుకోడమే పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందినవారి అనుభవం.

ఆయన నీ హృదయంలోకి వచ్చినప్పుడు అద్భుతం జరుగుతుంది. "నేను అశక్తుడను అనర్హుడను" అని నీవు గుర్తించడమే ఆ అద్భుతం!

ఆగస్ట్ 23

## ప్రార్థన - రహస్యంలో పోరాటం

"నీవు ప్రార్థన చేయునప్పుడు, నీ గదిలోనికి వెళ్లి తలుపువేసి, రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థనచేయుము; అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫల మిచ్చును" (మత్తయి 6:6)

"రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థనచేయుము" - ప్రార్థన హృదయానికి, చిత్తానికి సంబంధించినది. మనం చేయవలసిన పని ప్రార్థించడం; కలలు కనడం కాదు. మనకు అతి కష్టమైన పని ప్రార్థించడం. మనకు ప్రార్థనమీద ఏకాగ్రత కుదరడం చాలా కష్టం. ఎందుకంటే మన ఆలోచనలకు హద్దులుండవు; మన మనసులో గుమికూడే ఆలోచనల్ని నియంత్రించుకోడం చాలా కష్టం. ఇది నిజంగా పోరాటంతో సమానమే. అయితే మనం చేయవలసిన పని మన మనసును మన హృదయాన్ని తండ్రిమీద నిమగ్నంచేసి ప్రార్థించడమే. ఇచ్ఛాపూర్వకమైన ఏకాగ్రతతో కూడిన ప్రార్థన నలవర్చుకోడం నిజంగా గొప్ప సుగుణం.

"నీ గదిలోనికి వెళ్లి తలుపువేసి" - ప్రార్థించే స్థలంలోకి వెళ్లగానే మన మనసు అన్యమనస్కతలమీదనుంచి మళ్లి ప్రార్థనమీద ఏకాగ్రత కుదిరితే అంతకంటె ఇంకేమైనా కావాలా? అన్యమనస్కతలకు తలుపు మూయాలి; భావోద్రేకాలకు తలుపు మూయాలి; ఆవేశకావేషాలకు తలుపు మూయాలి. కక్షకార్పణ్యాలకు తలుపు మూయాలి. మనం ప్రార్థించినప్పుడు "రహస్యంలో" (అదృశ్య స్థలంలో) ఉన్న దేవుడు మనలో ఉన్న "రహస్య స్థలాన్ని" (మన అంతరంగాన్ని) చూస్తాడు.

"రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థనచేయుము" - అంతరంగశుద్ధిగా మనం ప్రార్థించినప్పుడు ఇక మనలో దేవునిమీద ఎటువంటి సందేశాలు సంశయాలు ఉండవు. తండ్రితో మనకు అన్యోన్యత అనన్యత సాధ్యమవుతాయి. నీ జీవితంలో అన్ని రంగాల్లోను దేవునికి ప్రమేయం కల్పించు; అన్నీ ఆయన అధీనతకు అప్పగించు. నీ హృదయంలో క్రీస్తు స్వభావానికి, మరియు పరిశుద్ధాత్మకు నివాసం కల్పించు. నీ దేహాత్మలు ఆయనకు అప్పగించు. అప్పుడు నీవు చేసే ప్రార్థనలకు ప్రతిఫలం లభిస్తుంది.

ఆగస్ట్ 24

## ఆధ్యాత్మిక అన్వేషణ

"మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల వానికి రాతి నిచ్చునా?" (మత్తయి 7:9)

చిన్న బిడ్డ తన తండ్రిని రొట్టె కావాలని అడుగుతున్నాడు. తండ్రి తన బిడ్డకు రొట్టెనే ఇస్తాడు గానీ రాయిని ఇవ్వడు గదా! దేవుని బిడ్డ ఎలా ప్రార్థించాలో యేసు ప్రభువు మనకు ఈ వచనంలో బోధిస్తున్నాడు. ప్రార్థనగురించి మనం సరిగ్గా అర్థంచేసుకొనడం లేదు. మనం ఏది అడిగినా ఆయన ఇస్తాడనే అభిప్రాయం మనలో ఉంది. తండ్రితో మన సంబంధం ఎలా ఉన్నప్పటికీ మనం ఏది అడిగితే దాన్ని ఆయన ఇస్తాడని మనం నమ్ముతున్నాం. మనం ఏది అడిగితే అది ఇవ్వడం దేవుని చిత్తమని చెప్పవద్దు! ఒకవేళ నీవు అడిగినవి ఆయన నీకు ఇవ్వనట్లయితే దిగులు పడకు; నిరుత్సాహపడి ప్రార్థించడం మానకు. పొందకపోడానికి గల కారణాన్ని అన్వేషించు. నీ జీవిత భాగస్వామితో, నీ కుటుంబ సభ్యులతో నీకు సరైన సంబంధ బాంధవ్యాలు లేవా? నీ సహోద్యోగులతో నీకు సరైన సంబంధ బాంధవ్యాలు లేవా? నీ సంబంధ బాంధవ్యాల్లో నీవొక "మంచి పిల్లవాడిలాగా" ఉన్నావా? "నాలో చికాకు విసుగు ఉన్నాయి; నాకు ఎవరూ అక్కర్లేదు; అయినా నాకు దీవెనలన్నీ కావాలి" అని చెప్పేవాడిగా ఉన్నావా? నీవు "మంచిపిల్లవాడి లాగా" ఉంటే తప్ప నీవడిగినవి పొందలేవు.

మనం దేవునికి లోబడడానికి బదులు ఆయనతో వాదిస్తూ ఉంటాం; మనలో ఉన్న తీవ్రావేశాన్నే మనం భక్తి అనుకుంటున్నాం. మనలో ఉన్న తప్పులు మనకు స్పష్టంగా తెలిసినప్పటికీ వాటిపట్ల తిరస్కారధోరణి చూపిస్తుంటాం! నేను ఇతరులకు ఇవ్వవలసిన బాకీలు చెల్లించడానికి నిరాకరిస్తూ, నాకు కావలసినవి కొనుక్కోడానికి డబ్బులివ్వమని దేవుణ్ణి ప్రార్థిస్తే ఆయన నాకు డబ్బులిస్తాడా? నేను ఇతరులకు స్వేచ్ఛ నివ్వకుండా నాకు స్వేచ్ఛ కావాలని దేవుణ్ణి అడుగుతున్నావా? ఇతరుల్ని క్షమించడాన్ని తిరస్కరిస్తున్నావా? నేను ఎవరిపట్లనైనా నిర్దయగా ఉన్నానా? నా కుటుంబసభ్యుల మధ్య నా బంధుమిత్రుల మధ్య నేను దేవుని బిడ్డగా జీవిస్తున్నానా? (మత్తయి 7:12 చూడండి).

నేను తిరిగిపుట్టడంద్వారా మాత్రమే దేవుని బిడ్డడా మారగలను. దేవుని బిడ్డగా మారిన నేను "వెలుగులో నడిచినయెడల" (1 యోహాను 1:7) ఆయనతో అన్యోన్యత కలిగి ఉండగలను. మనలో చాలా మందికి ప్రార్థన అంటే కేవలం మతపరమైన ఆచారం; కొంతమందికి భావోద్వేగ పూరితమైన చర్య. మనం ప్రార్థించినప్పుడు ఎందుకు ప్రతిఫలం పొందలేకపోతున్నామో మనల్ని మనం పరిశోధించుకొని కారణాల్ని అన్వేషించినప్పుడు మనలో ఏ తప్పు ఉందో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అది స్నేహాన్ని అపార్థం చేసుకోడం కావచ్చు, మనం చెల్లించని బాకీ కావచ్చు, ఇతరులపట్ల అనాలోచితమైన మరియు అవాంఛనీయమైన ప్రవర్తన కావచ్చు. మనల్ని మనం సరిచేసుకోకుండా ప్రార్థించి, ప్రతిఫలాన్ని ఎదురుచూడడం సరి కాదు. మనం దేవుని బిడ్డలమైనప్పుడు ఆయన మనతో ఏం చెబుతున్నాడో చూడండి: "అడుగు ప్రతివాడును పొందును ... " (మత్తయి 7:8).

ఆగస్ట్ 25

## త్యాగం, మరియు స్నేహం

“మిమ్మును ... స్నేహితులని పిలుచుచున్నాను” (యోహాను 14:27)

మన జీవితంలో ప్రతి విషయాన్ని యేసుకు సంపూర్ణంగా లోబరచినప్పుడు మాత్రమే త్యాగంలోని ఆనందాన్ని పొందగలం. అయితే త్యాగం కష్టతరమైనది. “నేను దీన్ని త్యాగం చేసినట్లయితే ... ” అని గానీ, “నా జీవితాన్ని నేను దేవునికి సమర్పించు కున్నట్లయితే ... ” అని గానీ మనం షరతులు పెడుతుంటాం. ఇటువంటి షరతులు మనకు త్యాగంలోని నిజమైన మరియు సంపూర్ణమైన ఆనందాన్ని ఇవ్వవు.

అయితే మనల్ని మనం యేసుకు సంపూర్ణంగా సమర్పించుకున్నట్లయితే, మన త్యాగంలో యథార్థత ఉన్నట్లయితే పరిశుద్ధాత్మ ద్వారా మనకు ఆనందం కలుగుతుంది. అంతిమ త్యాగం మన స్నేహితుడికొరకు మన ప్రాణాన్ని అర్పించడమే (యోహాను 15:13,14 చూడండి). మన దేహాత్మలు పరిశుద్ధాత్మకు నివాసస్థలమైనప్పుడు, ప్రభువైన యేసు కొరకు మన ప్రాణాల్ని సైతం అర్పించడానికి సిద్ధమవుతాం. అయితే ఈ తలంపు మామాలుగా మనలో కలగదు. ఎందుకంటే ఇది పరిశుద్ధాత్మద్వారా వెల్లడయ్యే ప్రేమకు మాత్రమే నిరూపణ గనక.

మన ప్రభువు మనకొరకు తన ప్రాణాన్ని సైతం లెక్కచేయలేదు. ఆయన మరణం ఆయనలో ఉన్న పవిత్రప్రేమకు నిరూపణ. “నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము” (కీర్తన 40:8) అని కీర్తన రచయిత దృష్టాంతపూర్వకంగా ఉదాహరిస్తున్నాడు. కీర్తన రచయిత సంపూర్ణ సమర్పణ గురించి, ఎనలేని త్యాగం గురించి అనంతమైన ఆనందంతో వివరిస్తున్నాడు. నేను కూడా ఈ విధంగా యేసు క్రీస్తుకు సంపూర్ణంగా లోబడ్డానా? నా కాపుదల, నా నడిపింపు దేవునినుండి కానట్లయితే నా సమర్పణకు నా త్యాగానికి అర్థం లేదు. అయితే నా సమర్పణకు నా త్యాగానికి లక్ష్యం దేవుడే అయినప్పుడు ఆయన ప్రాబల్యం నామీద బలంగా ఉంటుంది (హెబ్రీ 12:1,2 వచనాలు చూడండి).

నీలో ఉన్న సహజవాంఛలు నీ ఆధ్యాత్మిక జీవితాన్ని అడ్డుకోకుండా చూడు. మనలో ఉన్న ప్రకృతిసంబంధమైన ప్రేమ మనల్ని ఆటంకపరుస్తుంది. అయితే పరిశుద్ధుడి నిజమైన వాంఛ ప్రభువైన యేసే. దేవునిపట్ల మనకున్న ప్రేమ ప్రకృతిసంబంధమైన ప్రేమ కాదు; మనోప్రవృత్తికి సంబంధించిన ప్రేమ కాదు; భావోద్వేగ పూరితమైన ప్రేమ కాదు. దేవునిపట్ల మనకున్న ప్రేమ అంతఃశుద్ధి మరియు ఆచరణశుద్ధి ఉన్న ప్రేమ.

“మిమ్మును ... స్నేహితులని పిలుచుచున్నాను” - ప్రభువుతో మనకున్న స్నేహానికి మూలం ఆయన మనగనుగ్రహించిన నూతన జీవం. మనలో ఉన్న నూతన జీవానికి, గతంలో మనలో ఉన్న పాత స్వభావానికి ఎటువంటి పొంతన లేదు. మనలో నూతన జీవం రూపొందిన తర్వాత మన జీవితం దేవునియెదుట దీనమైన పవిత్రమైన మరియు భక్తిపారవశ్యంతో కూడిన జీవితంగా మారింది!

ఆగస్ట్ 26

## నీవెప్పుడైనా కలవరపడ్డావా?

"శాంతి మీ కనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే మీ కనుగ్రహించు చున్నాను" (యోహాను 14:27)

జీవితంలో మనం శాంతి ననుభవిస్తున్నామని చాలా సందర్భాల్లో ఆలోచిస్తూ ఉంటాం. అయితే అది మన అజ్ఞానం, మన అలక్ష్యం కావచ్చు. మనం కళ్లు తెరచి జీవితవాస్తవాల్ని చూచినప్పుడు నిజమైన అంతరంగ సమాధానాన్ని యేసు మాత్రమే ఇవ్వగలడని తెలుసుకుంటాం. "నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి ... " (యోహాను 6:63) అని యేసు చెబుతున్నాడు. యేసు మాటల్లో ఉన్నవాటిని నేను పొందానా? "నా శాంతినే మీకనుగ్రహించుచున్నాను" - మనం ప్రభువు ముఖం లోకి చూచినప్పుడు మాత్రమే ఈ శాంతిని పొందగలం; ఆయన గురించి తెలుసుకున్నప్పుడు మాత్రమే ఈ శాంతిని పొందగలం; ఆయనలో నిక్షిప్తమైన నెమ్మదిలోంచి మాత్రమే ఈ శాంతిని పొందగలం.

నీవిప్పుడు తీవ్రంగా కలత చెంది ఉన్నావా? నీ జీవితనావను అలలు ఛిన్నాభిన్నం చేస్తున్నాయా? నీ విశ్వాసం అలజడికి గురయ్యిందా? నీవు సమాధానాన్ని సంతోషాన్ని ఓదార్పును పొందలేక పోతున్నావా? నీ జీవితం నిష్ప్రయోజనకరంగా నిష్ఫలంగా ఉందా? అయితే, మన ప్రభువులో నిక్షిప్తమైన నెమ్మదిని పొందు. ఆయన శాంతిని నీవు ప్రతిఫలించి నప్పుడు నీవు దేవునియెదుట సరిగ్గా ఉన్నావని అర్థం. ఎందుకంటే నీ మనస్సు, నీ హృదయం దేవునిమీద నిమగ్నమై ఉన్నప్పుడు మాత్రమే ఆయన శాంతిని నీవు ప్రతిఫలించగలవు. నీ మనస్సు నీ హృదయం నీమీద నిమగ్నమై ఉన్నప్పుడు నీలో అశాంతి మాత్రమే ఉంటుంది. నీవు యేసు క్రీస్తు ముఖకాంతికి దూరమైనప్పుడు నీలో అలజడి అభద్రతాభావం ఉంటాయి.

ఈ క్షణంలో నీవు "యేసు వైపు చూచుచు" (హెబ్రీ 12:2) సమస్యలనుంచి విడుదల పొంది ఆయననుంచి సమాధానాన్ని పొందుతున్నావా? అయితే ఆయన ఇచ్చిన సమాధానం నీలో ప్రస్ఫుటంగా వెల్లడి కావాలి. నీ సమస్యలకు నీవే పరిష్కారాల్ని వెతుకుతూ తూలిపడు తున్నావా? నీ జీవితభారాన్ని యేసుకు అప్పగించినప్పుడు ఆయననుంచి ఓదార్పు పొంద గలవు. కష్టాల్లో నష్టాల్లో దుఃఖాల్లో ఆయన మాట విను. "మీ హృదయమును కలవరపడ నియ్యకుడి" (యోహాను 14:27) అని యేసు చెబుతున్నాడు.



ఆగస్ట్ 27

## నీ మతధర్మం ప్రకారం జీవించు

"మీకు వెలుగు ఉండగనే నడువుడి; చీకటిలో నడుచువాడు తాను ఎక్కడికి పోవుచున్నాడో యెరుగడు" (యోహాను 12:15)

నీవు వెలుగులో నడవక పోయినట్లయితే నీకు వెలుగు వెలుగుగా ఉండదు. "నీలో నున్న వెలుగు చీకటియైయుండినయెడల ఆ చీకటి యెంతో గొప్పది" (మత్తయి 6:23). నీవు పరిశుద్ధపర్చబడిన వ్యక్తివని ఒక్క క్షణం మర్చిపోయినట్లయితే, దేవుడు నీకు వెలుగు అనుగ్రహించాడని ఒక్క క్షణం విస్మరించినట్లయితే నీ ఆధ్యాత్మిక జీవితం మసకబారుతుంది. నీ జీవితంలోని ప్రతి రంగంలోను సత్యాన్ననుసరించి నడువు; లేనట్లయితే నీలో ఉన్న వెలుగు నీకు వెలుగుగా ఉండదు.

నీలో పరిశుద్ధత ఉన్నట్లయితే దాన్ని ఆచరణలో పెట్టు. నీ ఆచరణ మనఃపూర్వకమైనదై, స్వచ్ఛమైనదై, నికార్సైనదై ఉండాలి. ఇందులో ఏ నటన ఉండకూడదు. నీ స్వంత ఆశయాల్ని నెరవేర్చుకొనేలా, లేదా నిన్ను నీవు తృప్తిపర్చుకొనేలా నిన్ను ప్రోత్సహిస్తున్న సిద్ధాంతాల విషయంలో జాగ్రత్తగా ఉండు. ఈ సిద్ధాంతాలు ఆకర్షణీయంగా ఉండవచ్చేమోగానీ నిన్ను వెలుగులో నడిపించేవి కాకపోవచ్చు.

నీ అనుదిన జీవితంలోని ప్రతి చర్యలోనూ నీ మతధర్మం ప్రతిఫలించాలి. "శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోక రాజ్యములో ప్రవేశింప నేరరని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 5:20). అంటే, నీ చుట్టూ ఉన్నవారందరి ధర్మనిష్ఠకంటె నీలో ధర్మనిష్ఠ ఎక్కువగా ఉండాలని అర్థం. పరిశుద్ధత గురించి నీకు అనేక సిద్ధాంతాలు తెలిసి ఉండవచ్చు. అయితే నీ జీవితంలోని ప్రతి రంగంలోను పరిశుద్ధత చూపిస్తున్నావా? భౌతిక, నైతిక, సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో నీలో ఉన్న పరిశుద్ధతను ఆచరణలో పెడుతున్నావా? క్రీస్తు సిలువ బలియాగమే నీ జీవితచర్యలన్నిటికీ ప్రామాణికం.

ఆగస్ట్ 28

## ప్రార్థన ప్రయోజనాత్మక లక్ష్యం

"ఆయన శిష్యులలో ఒకడు -ప్రభువా ... మాకును ప్రార్థనచేయ నేర్పుమని" (లూకా 11:1)

ప్రార్థన మనిషి స్వాభావికనైజంలో అంతర్భాగం కాదు. మనం తిరిగి పుట్టినప్పుడు మనలో దేవుని కుమారుని జీవం ఉంటుంది. మనలో ఉన్న నూతన జీవానికి పరిపుష్టి నిచ్చేది ప్రార్థనే. మనలో ప్రార్థన లేనట్లయితే మనలో ఉన్న నూతనజీవం అలమటిస్తుంది. ప్రార్థన గురించి మనలో ఉన్న అభిప్రాయాల్లో చాలా భాగం సరైనవి కావు. ప్రార్థన గురించి ఈ అభిప్రాయాలు క్రొత్త నిబంధనలో మనకు కనబడవు. మనకు కావలసినవాటిని పొందడంకొరకు ప్రార్థనచేయాలని మనం నమ్ముతాం. అయితే, దేవుని గురించి తెలుసుకోడమే వాక్యానుసార మైన ప్రార్థన లక్ష్యం.

"అడుగుడి, మీకు దొరకును" (యోహాను 16:24). దేవునికి మనం కొన్నిసార్లు ఫిర్యాదులు చేస్తుంటాం; కొన్నిసార్లు మనల్ని మనమే సమర్థించుకుంటాం; కొన్నిసార్లు ఉదాసీనత చూపిస్తుంటాం. అయినా మనం ధైర్యంతో మనకు కావలసినవి అడుగుతూనే ఉంటాం. "మీరు ...బిడ్డలవంటివారైతేనే గాని ... " (మత్తయి 18:3) అని మన ప్రభువు చెప్పాడు. దేవుణ్ణి ప్రార్థించు; ఆయన నీకు ఏం కావాలో దాన్ని ఇస్తాడు. అయితే మనం దురవస్థలో ఉంటే తప్ప దేవుణ్ణి ప్రార్థించడం. దైన్యం మాత్రమే మనల్ని ప్రార్థనకు నడిపిస్తుంది. నీ సమస్యలన్నీ దేవునికి వివరించు. ఈ సమస్యలే నిన్ను దురవస్థలో పడ వేశాయి కదా! నీలో స్వావలంబన ఉన్నంత కాలం నీవు దేవుణ్ణి ఏదీ అడగలేవు.

"ప్రార్థన అన్నిటినీ మారుస్తుంది" అనడం కంటె "ప్రార్థన నన్ను మారుస్తుంది, నేను అన్నిటినీ మారుస్తాను" అనడం సబబేమో! విమోచనమీద ఆధారపడిన ప్రార్థన మన దృక్పథాన్ని మారుస్తుంది. ఇది దేవుని ఏర్పాటు. ప్రార్థన కేవలం బాహ్యాపరిస్థితుల్ని మార్చడంకొరకు మాత్రమే కాదు; ప్రార్థన మనిషి అంతరంగ స్వభావాన్ని మార్చే అద్భుతం!

ఆగస్ట్ 29

## పరిశోధించబడిన విశ్వాసంవలన ఒనగూడిన అన్యోన్యత

అందుకు యేసు -నీవు నమ్మినయెడల దేవుని మహిమ చూతువని నేను నీతో చెప్పలేదా అని ఆమెతో అనెను (యోహాను 11:40)

నీవు విశ్వాసంతో అడుగు ముందుకు వేసే ప్రతి సారీ ఏదో ఒకటి నీ విశ్వాసానికి అడ్డుగా వచ్చి నిన్ను వెనక్కు లాగుతుంది. కారణం, నీలో ఉన్న ఇంగితజ్ఞానం. విశ్వాసం వేరు, ఇంగితజ్ఞానం వేరు. ఈ రెండిండి మధ్య ప్రకృతి జీవితానికి ఆధ్యాత్మిక జీవితానికి మధ్య ఉన్న వ్యత్యాసమంత వ్యత్యాసం వుంది. నీలో ఉన్న ఇంగిత జ్ఞానం యేసును నమ్మవద్దని చెబ్తుంటే నీవు యేసును విశ్వసించగలవా? నీలో ఉన్న ఇంగిత జ్ఞానం "ఇదంతా అబద్ధం" అని చెబ్తుంటే, నీవు యేసు మాటలమీద నమ్మకంతో ముందడుగు వేయగలవా? నీవు కొండమీద ఉన్నప్పుడు "దేవుడు దీన్ని చేయగలడని నేను నమ్ముతాను" అని చెప్పడం సులువే. అయితే నీవు కొండ మీదనుంచి క్రిందికి వచ్చి నప్పుడు క్రింద ఉన్న వాస్తవాలు నీవు కొండపైన పలికిన మాటల్ని వెక్కిరిస్తున్నాయా? (లూకా 9:28-42 వచనాలు చూడండి). నేను నమ్మిన సిద్ధాంతం నాకు స్పష్టమవుతున్న ప్రతి సారీ దాన్ని విభేదించేదేదో నాకు ఎదురవుతోంది. "దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు ... ప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ 4:19) అని నేను విశ్వసిస్తున్న ప్రతి సారీ నా విశ్వాసం పరీక్షకు గురవుతోంది. నాలో బలం క్షీణించి నప్పుడు, నా దృష్టి మసకబారినప్పుడు, నా విశ్వాసానికి ఎదురయ్యే పరీక్షల్లో నేను నెగ్గ గలనా? లేక, ఓటమితో వెనుకడుగు వేస్తానా?

విశ్వాసానికి పరీక్ష తథ్యం! ఎందుకంటే సంఘర్షణ ఉన్నప్పుడే, పరీక్ష ఉన్నప్పుడే విశ్వాసం నీ స్వంతం కాగలదు. ఈ ఓణంలో నీ విశ్వాసానికి సవాలుగా నిలిచినదేది? సవాలు నీ విశ్వాసాన్ని విజేతగా నిలుపుతుందా? లేక, నీలో ఉన్న విశ్వాసాన్ని తుద ముట్టిస్తుందా? "నా విషయమై అభ్యంతరపడనివాడు ధన్యుడని" (మత్తయి 11:6) యేసు చెప్పాడు. మనకు అన్నిటికంటె ప్రధానం యేసును విశ్వసించడమే. "మొదటనుండి మనకున్న దృఢవిశ్వాసము అంతము మట్టుకు గట్టిగా చేపట్టినయెడలనే క్రీస్తులో పాలివారమై యుందుము" (హెబ్రీ 3:13-15). క్రీస్తులో అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉండు. అప్పుడు నీ విశ్వాసానికి పెను సవాలుగా నిలిచినవే నీ విశ్వాసాన్ని దృఢంగా చేస్తాయి. మన జీవితకాల పర్యంతం మన విశ్వాసం పరీక్షకు గురి అవుతూనే ఉంటుంది. విశ్వాస మంటే దేవునిలో అప్రతిహతమైన నమ్మకం. ఆయన మనల్నెన్నడూ విడిచిపెట్టడని కనీసం ఊహించనైనా ఊహించకపోవడమే నిజమైన విశ్వాసం (హెబ్రీ 13:5,6).

ఆగస్ట్ 30

## ప్రయోజకత్వమా? లేక పవిత్ర సంబంధమా?

దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని ...'' (లూకా 10:20)

''మీ విజయాల్నిబట్టి కాక నాతో మీకున్న సంబంధాన్నిబట్టి సంతోషించండి'' అని యేసు చెబుతున్నట్టుగా ఉంది కదా! క్రైస్తవ పరిచర్యలో మన విజయాల్నిబట్టి మనం సంతోషించి అతిశయపడుతుంటాం. ఇదొక ఉచ్చులాంటిది! యేసు క్రీస్తుతో మనకు సరైన సంబంధం లేదనేందుకు ఇదే రుజువు. మనకు ఎదురయ్యే పరిణామాలేమిటో మనకు తెలియనప్పటికీ, మన విజయాల్నిబట్టి మనం సంతోషిస్తూనే ఉంటాం. యేసుతో నీకు సరైన సంబంధం ఉన్నప్పుడు, ఎటువంటి పరిస్థితులు వచ్చినప్పటికీ ఆయన నీద్వారా ''జీవజలనదులు'' (యోహాను 7:38) ప్రవహింపజేస్తాడు. నీవున్న పరిస్థితుల్లో నీకెదురైన సందర్భాల్లో నీవు ''వెలుగులో నడిచినయెడల'' (1 యోహాను 1:7) దేవుడు తన ఉద్దేశాల్ని నీద్వారా నెరవేరుస్తాడు.

నేడు మనం యేసుకంటె పరిచర్యే ముఖ్యమని భావిస్తున్నాం. మనద్వారా దేవుడు జరిగించే పని ఎన్నికలోకి వస్తుందిగాని, దేవునికొరకు మనం చేసే పని ఎన్నికలోకి రాదు. ఎందుకంటే పరిశుద్ధునికి నడిపింపు దేవునినుండి వస్తుంది; అతని ప్రయోజకత్వం అతణ్ణి నడిపించదు. ఇతరుల ప్రయోజకత్వాన్ని ఆసరగా తీసుకొని సహాయంచేయమని అర్థించేవారి విషయంలో జాగ్రత్తగా ఉండు. దేవునితో మనకున్న అన్యోన్యత మాత్రమే ఆయన దృష్టిలో ప్రశస్తమైనది. క్రీస్తు ''అనేకులైన కుమారులను మహిమకు'' (హెబ్రీ 2:10) తెస్తున్నాడు. దేవుడు మనలో కోరుకుంటున్నది ఇదే!

ఆగస్ట్ 31

## "నా సంతోషము ... మీ సంతోషము"

"మీయందు నా సంతోషము ఉండవలెననియు, మీ సంతోషము పరిపూర్ణము కావలెననియు, ఈ సంగతులు మీతో చెప్పుచున్నాను" (యోహాను 15:11)

యేసుకు సంతోషం కలిగించినదేమిటి? యేసు తన తండ్రి చిత్తానికి చూపిన అప్రతిహతమైన సమర్పణ మరియు ఆయనలో ఉన్న త్యాగనిరతి ఆయన సంతోషానికి కారణం. తన తండ్రి తనను ఏ ఉద్దేశంతో ఈ లోకానికి పంపించాడో ఆ ఉద్దేశాన్ని నెరవేర్చడమే యేసు సంతోషానికి కారణం. "ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందముకొరకై ... సిలువను సహించి" (హెబ్రీ 12:2) అని హెబ్రీ పత్రిక రచయిత యేసు గురించి వ్రాశాడు. "నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము" (కీర్తన 40:8) - ఇది కీర్తన రచయిత అనుభవం. మన సంతోషం పరిపూర్ణం కావాలని యేసు కోరుకుంటున్నాడు. యేసుకు సంతోషం కలిగించిన కారణాలు మనకు కూడా సంతోషం కలిగించినప్పుడు మన సంతోషం పరిపూర్ణమవుతుంది. ఇందుకు మనం అనుమతిస్తున్నామా?

సంతోషం మరియు సమృద్ధజీవం కలిగిన జీవితమంటే భౌతిక సుఖాలు కాదు; మనం దేవునికొరకు పనిచేయడం కూడా కాదు. యేసుతో పరిపూర్ణమైన అన్యోన్యత మరియు అఖండమైన అనన్యత కలిగి ఉండడమే. ఇదే యేసుకు సంతోషాన్నిస్తుంది. అయితే మనలో ఉన్న సంతోషాన్ని ఆటంకపర్చే కారణాలున్నాయి. ముఖ్యంగా మనం యేసువైపు చూడకుండా, మన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని చూచి విసుగుచెందినప్పుడు మనం సంతోషంగా ఉండలేం. "ఐహిక విచారములును, ధనమోసమును ... వాక్యమును అణచివేయుటవలన అది నిష్ఫలమగును (మార్కు 4:18-19). ఏం జరిగిందో మనం తెలుసుకొనేలోపే మనం అనవసరమైన చింతల్లో మునిగిపోయి ఉంటాం.

దేవునితో సరైన సంబంధం కలిగి ఉండు. అప్పుడు నీలో సంతోషం ఉంటుంది. అప్పుడు నీలోనుంచి "జీవజల నదులు" ప్రవహిస్తాయి (యోహాను 7:38). నీలో నయవంచన మిథ్యాచారాలు నటన అతిశయభావం లేకుండా నిన్ను నీవు సరిచూసుకో. "మీ జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది" (కొలొస్స 3:2-3) అని పరిశుద్ధ లేఖనం సెలవిచ్చినట్టుగా అప్రమత్తతతో జీవించు. దేవునితో అన్యోన్య సహవాసం కలిగి ఉన్న క్రైస్తవుడు ఎక్కడికెళ్లినా, ఏ పరిస్థితుల్లో ఉన్నా సునాయాసంగా జీవించగలడు. ఇతరులకు ఆశీర్వాదకరంగా ఉంటూ దీవెనకరమైన జీవితాన్ని జీవించడం గొప్ప ధన్యత!

సెప్టెంబర్ 1

## పరిశుద్ధతే భవితవ్యం

"నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడి యున్నది" (1 పేతురు 1:14-16)

మన జీవితలక్ష్యంగురించి  మనల్ని మనమే హెచ్చరించుకోవాలి. మన భవితవ్యం పరిశుద్ధత మాత్రమే; సుఖసంతోషాలు భోగభాగ్యాలు కాదు. మనకు ఆశయాలు కోరికలు మెండుగా ఉంటాయి. మన జీవితాలు మన ఆశయాల్ని కోరికల్ని  నెరవేర్చుకోడానికే సరిపోతున్నాయి. మన ఆశయాల్లో కోరికల్లో కొన్ని ఉత్తమమైనవి ఉండవచ్చేమో! ఇవి ముందుకాలంలో నెరవేరవచ్చేమోగానీ, ప్రస్తుతానికి మాత్రం ఇవి దేవునిమీదనుంచి మన దృష్టిని ప్రక్కకు మళ్లిస్తున్నాయి. దేవుడు మనలో పరిశుద్ధతను కోరుకుంటున్నాడు. పరిశుద్ధతను కోరుకొనే దేవుణ్ణి అంగీకరించడానికి, ఆయణ్ణి అనుసరించడానికి మనలో ఎంతమంది సిద్ధంగా ఉన్నారు?  మనలో పరిశుద్ధత ఉండాలంటే మనకు దేవునితో సరైన అన్యోన్యత ఉండాలి.

నాలో పరిశుద్ధత ఉండడం అవశ్యమని నేను నమ్ముతున్నానా? దేవుడు నన్ను పరిశుద్ధపరుస్తాడని నేను నమ్ముతున్నానా? నేను పరిశుద్ధపరచబడవలసి ఉన్నానని ఎవరైనా నన్ను హెచ్చరించినప్పుడు నేను వారిపట్ల తిరస్కారధోరణి చూపుతాను. సువార్త ప్రబోధం ఎవరిలోనైనా ముందుగా తీవ్రమైన తిరస్కారాన్నే కలిగిస్తుంది. కారణం, ఎవరూ తమలో తప్పులున్నాయని ఒప్పుకోకపోవడమే. అయితే దేవుడు మనుషు లందరిలోనూ పరిశుద్ధతనే కోరుకుంటున్నాడు. మనుషులందరినీ పరిశుద్ధుల్ని చేయడమే ఆయన ఏకైక లక్ష్యం. దేవుడు మనం అడిగిన వెంటనే ఆశీర్వాదాలిచ్చే యంత్రం కాదు; ఆయన మనమీద సానుభూతితో మనల్ని రక్షించడానికి రాలేదు. మనల్ని పరిశుద్ధుల్ని చేయాలనుకోడం ఆయన లక్ష్యం కాబట్టి, మనల్ని పరిశుద్ధపర్చడం దేవుని మహోన్నత లక్ష్యం కాబట్టి ఆయన మనల్ని రక్షించి పరిశుద్ధపర్చాడు. దేవునితో పరిపూర్ణమైన అన్యోన్యతలోనికి మనల్ని నడిపించడానికే క్రీస్తు సిలువమీద తనను తాను అర్పించుకున్నాడు.

పరిశుద్ధుడైన దేవునికి వ్యతిరేకమైనవి నీలో ఏమైనా ఉన్నట్లయితే వాటిగురించి నీ మీద నీవే సానుభూతి చూపించుకోకు; ఇతరులమీద కూడా చూపకు. పరిశుద్ధత అంటే దేవునియెదుట నీ జీవితంలోని అన్ని రంగాల్లోనూ అప్రతిహతమైన పరిశుద్దత. నీ నోటి మాటలే కాదు; నీ మనసులోని ఆలోచనలు కూడా పరిశుద్ధమైనవై ఉండాలి. నీ జీవితంలోని ప్రతి అంశాన్ని దేవుని సూక్ష్మపరిశీలనకు అప్పగించు. పరిశుద్ధత నీవు నీ స్వంతానికి దాచుకొనేది కాదు; నీలో ఉన్న పరిశుద్ధతను ఇతరులు చూసేలా నీ పరిశుద్ధతను నీ అనుదిన జీవితంలో ఆచరణలోపెట్టు. నీ పరిశుద్ధతను నిరూపించు!



సెప్టెంబర్ 2

## పరిశుద్ధత మరియు త్యాగనిరతి ఉన్న జీవితం

"నాయందు విశ్వాసముంచువాడెవడో ... వాని కడుపులోనుండి జీవజలనదులు పారునని" (యోహాను 7:38)

మనం ఆశీర్వాదాల్ని పొందినప్పుడు అవి మన స్వంతానికి మాత్రమే కాదు; మనం పొందిన ఆశీర్వాదాల్ని మనం ఇతరులకు అందించేవారిగా కూడా ఉండాలి. యేసు చెప్పిన పై వచనం సారాంశం ఇంచుమించుగా ఇదే! తనను నమ్మినవారిలో నుంచి జీవజల నదీప్రవాహాలు బయటికి వస్తాయని యేసు చెబుతున్నాడు. మన స్వంత ఉద్దేశాలు మన స్వంత ప్రయోజనాలు నెరవేర్చుకోడం మన ప్రభువుకు ఇష్టం వుండదు. మనం మన స్వంతానికి మాత్రమే లాభపడడం మన ప్రభువుకు ఇష్టం వుండదు. మనల్ని తన స్వరూపంలోకి మార్చడానికి యేసు తనను తాను వ్యయపర్చుకున్నాడు. మనలో యేసుపట్ల నిజమైన విశ్వాసం ఉన్నట్లయితే మనం ఎంత లాభపడ్డామనేది ముఖ్యంకాదు గానీ మనల్ని మనం ఇతరులకొరకు ఎంతగా వ్యయపర్చుకున్నామనేదే ముఖ్యం! దేవుడు మనల్ని అందమైన ద్రాక్షపళ్ళుగా చూడాలను కోడంలేదు గానీ ద్రాక్షపళ్లలాంటి మనలోని మాధుర్యాన్ని ఇతరులు రుచి చూడాలని కోరు కుంటున్నాడు. ద్రాక్షపళ్లను నలిపి రసాన్ని వెలికితీసినప్పుడే ద్రాక్షల్లోని మాధుర్యం బయటికి వస్తుంది. లోకందృష్టిలో ఏది విజయమో దాని ప్రకారం మన ఆధ్యాత్మిక జీవితాన్ని అంచనా వేసుకోకూడదు. దేవుడు మనలోనుంచి దేన్ని బయటికి తీస్తున్నాడో అదే మనలో ఉన్న ఆధ్యాత్మిక మాధుర్యం! ఇదే మన ఆధ్యాత్మిక జీవితానికి కొలబద్ద. మనలోని మాధుర్యాన్ని మనం కొలుచుకోలేం. మనలో ఎంత మాధుర్యం వుందో ఇతరులు మనకు చెప్పాలి.

బేతనియ పట్టణస్థురాలైన మరియ అత్తరుబుడ్డిని పగులగొట్టి యేసును అభిషేకించే వరకు ఆమెలో ఎంత ఆధ్యాత్మిక మాధుర్యం వుందో ఎవరికీ తెలియలేదు. ఆమె దృష్టిలో యేసును అభిషేకించడంకంటె "మంచి కార్యము" మరొకటి లేదు. అక్కడ ఉన్న కొందరు మరియను తీవ్రంగా విమర్శించినప్పటికీ యేసు ఆమెను ప్రశంసించాడు. "సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగా ప్రశంసింపబడునని" (మార్కు 14:9) చెప్పాడు. మనం మరియలాగా మనల్ని మనం వ్యయపర్చుకున్నప్పుడు యేసు అమితంగా సంతోషిస్తాడు. మరియ తనను తాను యేసుకు సమర్పించుకున్నప్పుడు ఆమె మనుషుల ఆచారాల్ని కట్టుబాట్లను లెక్కచేయలేదు. దేవుడు కూడా తన కుమారుడ్ని మనకొరకు ఎటువంటి షరతుల్లేకుండా అప్పగించాడు. "లోకము తన కుమారునిద్వారా రక్షణ" (యోహాను 3:17) పొందడం దేవుని మహోన్నత లక్ష్యం. మరియలాగా మనల్ని మనం వ్యయపర్చుకోడానికి, మనల్ని మనం యేసుకు సంపూర్ణంగా సమర్పించు కోడానికి మనం సిద్ధంగా ఉన్నామా?

"నాయందు విశ్వాసముంచువాడెవడో ... వాని కడుపులోనుండి జీవజలనదులు పారునని" - మనలోనుంచి బయటికి వచ్చే జీవజల నదీప్రవాహాలు అనేకుల ఆధ్యాత్మిక దాహాన్ని తీరుస్తాయి; అనేకులకు విశ్రాంతిని స్వస్థతను స్వాంతనను క్షేమాన్ని ఇస్తాయి. మరియ "అత్తరుబుడ్డిని" పగలగొట్టినట్టు మనల్ని మనం వ్యయపర్చుకొనే సమయమిదే! స్వంత ప్రయోజనాల్ని స్వంత లాభాల్ని విడిచిపెట్టి మనల్ని మనం యేసుకు సంపూర్ణంగా సమర్పించుకొనే సమయమిదే! మనల్ని మనం వ్యయపర్చుకొని తనను అనుసరించాలని యేసు మనకొరకు ఎదురుచూస్తున్నాడు. మనం సిద్ధంగా ఉన్నామా?

సెప్టెంబర్ 3

## నీ సంతృప్తిని ఇతరులకు పంచుతున్నావా?

"అతడు ఆ నీళ్లు త్రాగుటకు మనస్సులేక యెహోవా సన్నిధిని పారబోసి ... " (2 సమూ 23:16)

ఏది నీ జీవితంలో బేత్లెహేము బావిలోని నీళ్లలాగా ఉంది - ప్రేమా? సంతోషమా? స్నేహమా? ఆధ్యాత్మిక ఆశీర్వాదమా? వీటిని నీవు స్వంతం చేసుకొని నీ మట్టుకు నీవే అనుభవిస్తున్నావా? లేక, వాటిని ఇతరులకు కూడా పంచుతున్నావా? నీ స్వంతానికి, నీ సంతృప్తికొరకు కావాలనుకున్నవాటిని నీవు దేవునికొరకు ప్రత్యేకించగలవా? దేవుని నుంచి నీవు పొందిన ఆశీర్వాదాల్ని నీ సంతృప్తికొరకే నీవు ఉపయోగించుకోడం ఆయన చిత్తం కాదు. వాటిని నీవు మళ్లీ దేవునికొరకు ధారపోయాలి. ఇది లోకందృష్టిలో ఆశీర్వాదాల్ని వ్యర్థం చేస్తున్నట్టుగా ఉంటుంది. కానీ ఇది దేవునికి సంతోషాన్ని సంతృప్తిని కలిగిస్తుంది.

నేను పొందిన ఆధ్యాత్మిక ఆశీర్వాదాల్ని మళ్లీ నేను దేవునికి ఎలా ఇవ్వగలను? ఒకే ఒక మార్గం - నా మనసును నేను దిటవు చేసుకోడంద్వారా. మనం చేసే కొన్ని పనులు దేవుణ్ణి తెలుసుకోనివారికి ఎప్పటికీ అర్థం కాదు. ఎందుకంటే మనుషులు తిరిగి చెల్లించలేరని వారి అభిప్రాయం. మనుషులు పొందలేని మహద్భాగ్యాన్ని నేను పొందానని నేను గుర్తించినప్పుడు నేను మళ్లీ ఆ భాగ్యాన్ని దేవునికే అప్పగించాలి. నా చుట్టూ ఉన్నవారు నాలో ఉన్న జీవజల నదీప్రవాహాల్ని రుచిచూసినప్పుడు (యోహాను 7:38) దేవుడు నాకనుగ్రహించిన మహద్భాగ్యాన్ని నేను మళ్లీ ఆయనకు అప్పగించానని అర్థం! దేవుడు నాకనుగ్రహించినవి నేనితరులకు ఇవ్వకపోయినట్లయితే అవి నాలో అత్యాశకు దురాశకు కారణమవుతాయి. దేవునికి ఇవ్వనివి నాలో ఉంటే నాకు ఏం ప్రయోజనం?

దేవుడు నీకనుగ్రహించినవి నీ స్వంతానికే ఉన్నట్లయితే అవి నిరుపయోగమవుతాయి. వాటిని నీవు ఇతరులకు ఇచ్చినప్పుడు నీ మాధుర్యం అందరికీ తెలుస్తుంది. నీవు ఇవ్వకపోయినట్లయితే నీ చుట్టూ ఉన్నవారు దేవుని దర్శనాన్ని ఆయన ఘనతను ఆయన ప్రేమను ఎప్పటికీ తెలుసుకోలేరు!

సెప్టెంబర్ 4

**అతని సొత్తు!**

“వారు నీవారైయుండిరి, నీవు వారిని నాకనుగ్రహించితివి ... ” (యోహాను 17:6)

“మీరు మీ సొత్తు కారు” (1 కొరింథీ 17:6) - పరిశుద్ధాత్మద్వారా ఎవరు ఈ అద్భుతసత్యాన్ని గ్రహిస్తారో వారే నిజమైన సేవకులు. వీరు ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరం మీద ఉన్నట్టని అర్థం! వీరిలో యేసు క్రీస్తు స్వరూపం వుంటుంది. వీరు తమ గురించి ఆలోచించరు; తమను తాము సంపూర్ణంగా యేసు అధీనతకు, ఆయన సర్వోన్నత నిర్ణయాలకు అప్పగించుకుంటారు. వీరు పరిశుద్ధాత్మ నడిపింపులో యేసు కొరకు జీవిస్తూ ఆయనకు విజయచిహ్నాలుగా ఉంటారు. యేసు శిష్యులు పరిశుద్ధాత్మను పొందిన తర్వాతనే ఆయన బోధల్ని అర్థం చేసుకోగలిగారు. “మీరు వెళ్లి” (మత్తయి 28:19; లూకా 24:49; అ.కా. 1:8) అని యేసు ఇచ్చిన ఆజ్ఞను శిష్యులు పరిశుద్ధాత్మ పొందిన తర్వాతనే అర్థం చేసుకోగలిగారు.

“ఎవడైనను నాయొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు” (లూకా 14:25-26). యేసుకు సొత్తుగా ఉన్నవారు మరెవరికీ సొత్తుగా ఉండలేరని ఈ వచనభావం. మనం యేసుకు చెందవలసి ఉండగా లోకంలో మనల్ని ఎవరూ స్వంతం చేసుకోలేరని ఈ వచన భావం. స్వంతం చేసుకున్నట్లయితే, మనం ఇంకొకరి సొత్తుగా ఉన్నట్లయితే, మనం యేసు అధీనతకు మనల్ని మనం సంపూర్ణంగా లోబరచుకోలేం కదా!

శిష్యుడు యేసుకు స్వంతం; ఆయన సొత్తు. మనం యేసు స్వంతమైతేనే ఆయనకు “సాక్షులుగా” ఉంటాం (అ.కా 1:8 చూడండి). యేసు కొరకు ఏవో కొన్ని కార్యాలు చేయడం శిష్యుని అభిలాష కాదు గానీ, ఆయనకు పరిపూర్ణమైన సంతోషాన్ని కలిగించడమే శిష్యుని ఆశయం. కాబట్టి ప్రతి శిష్యుడు “నేను యేసుకు చెందినవాడిని, ఆయన సొత్తును” అని యథార్థహృదయంతో చెప్పగలగాలి.

ఆయన సొత్తుగా జీవించు!

సెప్టెంబర్ 5

## యేసుతోబాటు మెలకువగా ఉండడం

"మీరు ఇక్కడ నిలిచి, నాతో కూడ మెలకువగా నుండుడని వారితో చెప్పి" (మత్తయి 26:38)

"నాతో కూడ మెలకువగా నుండుడని" యేసు చెబుతున్నాడు. ఇది మన తత్‌క్షణ కర్తవ్యం. మన క్రైస్తవ జీవితం ప్రారంభమైన తొలి రోజుల్లో మనం ఆయనతోబాటు మెలకువగా ఉండడం అసాధ్యంగా కనిపించి ఉండవచ్చు. అయితే, యేసు తనతోబాటు తన శిష్యులకు కూడా "గెత్సేమనే" అనుభవం వుండాలని కోరుకున్నాడు. నాటి శిష్యులకు ఇది ఎంత ముఖ్యమో నేటి శిష్యులకు కూడా అంతే ముఖ్యం. అయితే మనమే "లేదు, ప్రభువా. ఇది నాకు అర్థం కాదు. పైగా ఇది నాకు కష్టంగా ఉంటుందేమో" అని తప్పించుకోవాలని చూస్తున్నాం. మనకు ఏ మాత్రం అర్థంకాని వ్యక్తితోబాటు మనం ఎలా మెలకువగా ఉండగలం? యేసు గెత్సేమనేలో ఎందుకు వేదన ననుభవించాడో అర్థం చేసుకోకుండా ఆయనతోబాటు గెత్సేమనే అనుభవంలో మనమెలా మెలకువగా ఉండగలం? యేసు మనతోబాటు ఉండాలని మనం కోరుకుంటున్నాం గానీ మనం యేసుతోబాటు ఉండాలని మనం కోరుకోడం లేదు.

శిష్యులు యేసును ప్రేమించారు. ఇది నిజం. ఇది వారిలో ఆయనపట్ల ఉన్న సహజమైన ప్రేమ. అయితే శిష్యులు ఆయన ఉద్దేశాల్ని అర్థం చేసుకోలేకపోయారు. అందుకే శిష్యులు గెత్సేమనేలో తమలో తాము దిగులుపడుతూ నిద్రలోకి జారుకున్నారు. యేసుతో మూడు సంవత్సరాల సహచర్యం తర్వాత శిష్యులు "ఆయనను విడిచి" (26:56) పారిపోయారు.

"అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ... " (అ.కా 2:4). "అందరు" అంటే శిష్యులే. అయితే గెత్సేమనే అనుభవానికి మేడగది అనుభవానికి మధ్య జరిగిన సంఘటనలు శిష్యుల్ని పూర్తిగా మార్చివేశాయి. గెత్సేమనే అనుభవం తర్వాత జరిగిన సంఘటనలైన ప్రభువు మరణం, ఆయన పునరుత్థానం, ఆయన ఆరోహణం శిష్యులు యేసును పూర్తిగా అర్థంచేసుకొనేలా చేశాయి. అందుకే శిష్యులు మేడగదిలో "పరిశుద్ధాత్మతో" నింపబడ్డారు. "పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు" (అ.కా 1:8) అని యేసు ప్రభువు తన ఆరోహణానికి ముందే చెప్పాడు. పరిశుద్ధాత్మతో నింపబడిన శిష్యులు తమ జీవితకాలమంతా యేసుతోబాటు మెలకువగా ఉన్నారు.

సెప్టెంబర్ 6

## జీవజల నదులు

"నాయందు విశ్వాసముంచువాడెవడో ... వాని కడుపులోనుండి జీవజలనదులు పారునని ... " (యోహాను 7:38)

మనం యేసును విశ్వసించినట్లయితే మనలోనుంచి జీవజలనదులు ప్రవహిస్తాయని ఆయన చెబ్తున్నాడు. మనలోనుంచి బయలుదేరే జీవజలాలు "భూదిగంతములవరకు" (అ.కా 1:8) చేరుకుంటాయి. నదీజలాలు ప్రవహించి ఎక్కడికి చేరతాయో నది జన్మస్థలానికి తెలియదు; అలాగే మనలోనుంచి బయలుదేరే జీవజల నదులు ఎక్కడికి చేరుకుంటున్నాయో మనకు తెలియదు. నదీజలాలు ప్రవహించినచోట ఎంత మనోహరంగా ఉంటుందో, మనలోనుంచి బయలుదేరే జీవజల నదులు ప్రవహించేచోట కూడా అంతే మనోహరంగా ఉంటుంది. అయితే ఇది మనకు అతిశయకారణం కాదు; ఎందుకంటే ఇది మన గొప్పతనం కాదు. ఇది దేవుని క్రియ మాత్రమే. "... మీరు విశ్వాసముంచుటయే దేవుని క్రియ ... " (యోహాను 6:29). ఇతరులకు మనమెంత గొప్పగా ఆశీర్వాదాన్నిస్తున్నామో మనకు తెలియకపోవచ్చు.

నది అన్ని అడ్డుల్ని అధిగమించి సుదూర ప్రాంతాలకు ప్రవహిస్తుంది. కొంత దూరం నది ఎటువంటి ఒడుదుడుకులు లేకుండా నిలకడగా ప్రవహిస్తుంది. ప్రవాహంలో ఏదైనా అడ్డు తగిలినప్పుడు నది అక్కడ ఆగిపోదు; అడ్డుగా ఉన్నవాటిచుట్టూ ప్రవహించి సాగిపోతుంది. ముందుగా నది చిన్నగా మొదలై, రాను రాను విశాలమవుతుంది. నీ జీవితం నదిలాగానే సజావుగా సాగిపోతుండవచ్చు. ఏదైనా ఆటంకం వచ్చినప్పుడు "నేను దేవునికి ఉపయోగపడను" అని అనుకుంటున్నావేమో! అప్పుడు నీ ఆధ్యాత్మిక జీవితం ఎలా ప్రారంభమయ్యిందో ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో. దేవుడు నీకెదురైన ఆటంకాన్ని కొన్ని సార్లు తొలగించకపోవచ్చు. అయితే ఆయన నిన్ను ఆటంకం చుట్టూ త్రిప్పి నీవు కొనసాగేలా చేస్తాడు; ఆటంకాన్ని తొలగించడం దేవుని చిత్తం. దేవుని ఆత్మ అనే నదీజలాల్లో అన్ని అడ్డులు కొట్టుకుపోతాయి. ఆటంకంమీద అదే పనిగా నీ దృష్టిని నిలపవద్దు. నీకు కష్టం వచ్చినప్పుడు దాన్ని పదే పదే జ్ఞాపకం చేసుకోకు. నదీజలాలు అడ్డుల్ని పట్టించుకోవు; ఎలా ప్రవహించాలనే చూస్తాయి. నీకూ యేసు క్రీస్తుకూ మధ్య ఏ అటంకాలైనా వచ్చినప్పుడు అవి దేవుని ఆత్మ అనే నదీజలాల్లో కొట్టుకుపోతాయి. నీ భావోద్వేగాలు, నీ రాగద్వేషాలు అన్నీ ప్రవాహంలో కొట్టుకుపోవలసిందే!

జీవనదీ ప్రవాహాలు మన ఆత్మ కనుగ్రహించే స్వస్థతను పరిపుష్టిని చూడు! నీవు యేసును విశ్వసించినట్లయితే దేవుడు నిన్ను ఆశీర్వదించి, ఇతరులకు ఆశీర్వాదాన్నిచ్చే జీవజలాల్ని నీలోనుంచి ప్రవహింపజేస్తాడనే అద్భుతసత్యాన్ని తెలుసుకుంటావు!

సెప్టెంబర్ 7

## ఆశీర్వాదాల ఊటలు

"నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటిబుగ్గగా ఉండునని ... " (యోహాను 4:14)

ప్రభువు పై వచనంలో వర్ణించిన నీటిబుగ్గ చిన్న సెలయేరు కాదు; అది నిత్యం ఉబుకుతూ వెల్లువలా పారే నీటి ఊట! దేవునితో మనకు అన్యోన్యత ఉన్నప్పుడు మనలోనుంచి పరలోక జీవమాధుర్యం ప్రవాహంలా వెలువడుతుంది. మనకు దేవునితో అన్యోన్యత ఉండాలంటే మనం "ఆత్మపూర్ణులై" (ఎఫెసీ 5:18) ఉండాలి. నీలోనుంచి ప్రభువుజీవం వెల్లువగా లేనట్లయితే నీలోని ప్రవాహాన్ని ఏదో అడ్డుకుందని అర్థం! నీలో నుంచి జీవజలాలు సమృద్ధంగా ప్రవహించాలంటే యేసు ప్రభువు నీకిచ్చే జీవజలాలు నీలో సతతం ఊరే నీటి ఊటగా ఉండాలి. "నాయందు విశ్వాసముంచువాడెవడో ... వాని కడుపులోనుండి జీవజలనదులు పారునని ... " (యోహాను 7:38) మన ప్రభువు చెప్పాడు.

మనలో కొంతమంది ఇతరులకు ఆశీర్వాదాన్నిచ్చే జీవజల నదీప్రవాహాలుగా ఉండడానికి బదులు మృతసముద్రంలాగా ఉన్నారు. కారణం, వీరికి ప్రభువైన యేసుతో సరైన సంబంధం లేకపోవడమే. వీరు ప్రభువునుంచి ఆశీర్వాదాల్ని అందుకుంటారుగానీ వాటిని ఇతరులకు పంచి ఇవ్వరు. మనం ప్రభువునుంచి పొందిన ఆశీర్వాదాల్ని ధారాళంగా ఇతరులకు ఇవ్వాలి. ఆశీర్వాదాల్ని ఇతరులకు పంచి ఇవ్వకపోడం మన విశ్వాసానికి ఆటంకంగా మారుతుంది. నీకు యేసు క్రీస్తుకు మధ్య ఇది ఆటంకంగా ఉందా? నీకు మూలాధారమైన దేవునితో అన్యోన్యత కలిగి ఉండి, యేసు క్రీస్తులో నీ విశ్వాసాన్ని, ఆయనతో నీ అన్యోన్యతను కాపాడుకో. అప్పుడు నీలోనుంచి ప్రవహించే వెల్లువ ఎన్నటికీ ఇంకిపోదు.

నిన్ను నీవు పరీక్షించుకొని "నాలో ఏ నది లేదు" అని చెబ్తావేమో! ఒక వ్యక్తిలోంచి నదులు ప్రవహిస్తాయా అని నీవు ఆశ్చర్యపడుతున్నావేమో! నీకు తెలియకుండానే నీ హృదయంలో మొదలైన దేవుని కార్యం యేసు క్రీస్తుతో నీకున్న అన్యోన్యతనుబట్టి దినదినాభివృద్ధి చెందుతూ నదీజలప్రవాహంలాగా నీలోనుంచి పెల్లుబుకుతుంది!

సెప్టెంబర్ 8

**ఇది నీ పనే**

"దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి ... " (2 కొరింథీ 10:5)

పట్టుదలతో కొన్నిటిని నేలమట్టం చేయాలి. పాపంనుంచి విడుదల పొందడం వేరు; మానవస్వభావంనుంచి విడుదల పొందడం వేరు. మనుషుల్లో పూర్వభావనలుంటాయి. పూర్వ భావనలంటే పక్షపాతంతో ఏర్పరుచుకొనే అభిప్రాయాలు. పరిశుద్ధునిలో పక్షపాత ధోరణులు ప్రతికూలభావనలు ఉండకూడదు. మనం వీటిపట్ల విముఖంగా ఉండడంద్వారా వీటికి దూరంగా ఉండగలం. అయితే మరి కొన్నిటిని మనం చూస్తూ ఉండడం తప్ప ఏం చేయలేం. దేవుని ఆత్మ ద్వారా మాత్రమే ఇవి మారగలవు. ఎందుకంటే దేవుని ఆత్మకు మాత్రమే వీటిని మార్చగల శక్తి ఉంది. "భయపడకుడి, యెహోవా మీకు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి" (నిర్గమ 14:13). "దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకము" నేల మట్టం కావాలి. ఇది మానవయత్నంవలన జరిగే కార్యం కాదు; సంధిద్వారా, సమన్వయం ద్వారా జరిగే కార్యం కాదు; ఇది దేవుని శక్తిద్వారా మాత్రమే సాధ్యం (2 కొరింథీ 10:4 వచనం చూడండి).

దేవుడు మన స్వభావాన్ని మార్చిన తర్వాత మాత్రమే మనం పరిశుద్ధత అంటే ఏమిటో మనకు అనుభవపూర్వకంగాతెలుస్తుంది. ఇది నిజంగా పోరాటంతో సమానమే. ఇది పాపంతో పోరాటం కాదు; ఎందుకంటే పాపంతో పోరాడే శక్తి మనకు లేదు. పాపంతో పోరాడే శక్తి యేసు క్రీస్తుకు మాత్రమే ఉంది. విమోచనకార్యంద్వారా ఆయన పాపాన్ని, పాపానికి సంబంధించిన ప్రతి దాన్నీ ఓడించి అన్నిటిపైనా విజయం పొందాడు. పోరాటం మన స్వాభావిక జీవితాన్ని ఆధ్యాత్మిక జీవితంగా మార్చుకొనే విషయంలోనే. ఇది అంత సులువైన కార్యం కాదు. ఇది సులువుగా ఉండాలని దేవుడు కూడా ఉద్దేశించలేదు. ఇది మన నైతికపరమైన ఎంపికలమీద ఆధారపడిన కార్యం. దేవుడు మనల్ని పాపంనుంచి విడుదలచేసి నిర్దోషులుగా చేశాడు. కాబట్టి మనం మన స్వాభావిక నైజాన్ని మార్చుకోవాలి; మన నడతల్ని సరిదిద్దుకోవాలి. మన నైతిక ఎంపికలద్వారా పరిశుద్ధత లోకి నడవాలి. అయితే ఈ ఎంపికలు మనం అనుకున్నంత సులువైనవి కావు. మనలో ఇంకా పాత స్వభావపు ఛాయలున్నట్లయితే, ఇవి మనం తీసుకొనే నైతిక ఎంపికలకు అడ్డుగా నిలుస్తాయి. మనలో ఇంకా పాత స్వభావం లేశమాత్రంగానైనా ఉన్నట్లయితే ఇది మనలో ఉన్న "దేవునిగూర్చిన జ్ఞానమును" అడ్డుకుంటుంది. ఇది మనల్ని వెనక్కు మళ్లేలా చేసి, మనల్ని దేవుని రాజ్యానికి అనర్హులుగా, నిష్ప్రయోజకులుగా చేస్తుంది. అయితే, "అనేకులైన కుమారులను మహిమకు" (హెబ్రీ 2:10) తెచ్చే క్రీస్తుకున్న అద్భుతశక్తి ద్వారా మనం "దేవునిగూర్చిన జ్ఞానమును" అడ్డుకొనే వాటన్నటినీ నేలమట్టంచేసి ధ్వంసం చేయాలి.

సెప్టెంబర్ 9

## ఇది నీ పనే

"ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి" (2 కొరింథీ 10:5)

పట్టుదలతో ఇతర విషయాల్లో క్రమశిక్షణ పాటించు. పరిశుద్ధత విషయంలో ఇది మరో కష్టతరమైన పని. "ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి" అని పౌలు చెబుతున్నాడు. అంటే పౌలు ఆధ్యాత్మిక క్రమశిక్షణగురించి మాట్లాడుతున్నాడు. అయితే నేడు క్రైస్తవ పరిచర్యలో ఈ క్రమశిక్షణ అరుదుగా కనిపిస్తుంది; క్రమశిక్షణకు బదులు పరిచర్యలో సహజప్రేరకాలు అధికంగా ఉంటున్నాయి. మన ప్రభువు జీవితంలో ప్రతి అంశం తండ్రి చిత్తానికి అనుగుణంగా ఉంది. మన ప్రభువు తన తండ్రి చిత్తానికి వ్యతిరేకంగా ఏ సహజప్రేరకాన్ని ఎన్నడూ అనుమతించలేదు. "కుమారుడు ... తనంతట తాను ఏదియు చేయనేరడు" (యోహాను 5:19). ఇది మన ప్రభువులో ఉన్న క్రమశిక్షణ. ప్రభువు అలవాట్లను మన అలవాట్లతో పోల్చి చూడు. మనం మన ఆలోచనల్ని క్రీస్తు వశంచేయడంలేదు; ఆయన అధీనతకు అప్పగించడం లేదు. ఆలోచన వచ్చిన వెంటనే తటాలున కార్యరంగంలోకి దూకుతున్నాం. ఇది మనలో ఉన్న క్రమశిక్షణారాహిత్యానికి మచ్చుతునక.

అయితే నేడు మనం ప్రయోగాత్మకమైన సేవకు, వ్యావహారికమైన సేవకు అధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతోంది. "ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి" అనే భావనకు ప్రాముఖ్యత తగ్గిపోతోంది. ఆధ్యాత్మిక క్రమశిక్షణలోకంటె ఆత్మలరక్షణలో పట్టుదల ఎక్కువవుతోంది. కొంతమంది తమ స్వంత ఆలోచనలతో, క్రమశిక్షణా రాహిత్యంతోకూడిన మానవసహజమైన ప్రేరణలతో పరిచర్య చేస్తున్నారు. వీరి ఆసక్తి మరియు పట్టుదల దేవుని ఆజ్ఞల్లో కాదు గానీ తమలో ఉన్న సహజప్రేరకాల్లోనే. వీరు "ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి" ఉంచడం లేదేమో!

మనం మన స్వంతరక్షణ విషయంలో యేసు క్రీస్తుకు ఏ విధంగా జవాబు చెప్పవలసి ఉన్నామో, అదే విధంగా చాలా విషయాల్లో కూడా ఆయనకు జవాబు చెప్పవలసి ఉన్నాం. కాబట్టి లోకం విషయంలో, పాపం విషయంలో, అపవాది విషయంలో యేసు క్రీస్తుకు ఏ ఆలోచనలున్నాయో మనకు కూడా అవే ఆలోచనలుండాలి. "మీ మనస్సు మారి నూతన మగుటవలన రూపాంతరము పొందుడి" (రోమా 12:2). మనం తత్‌క్షణమే రూపాంతరం చెంది నూతన వ్యక్తులుగా మారాలి.

సెప్టెంబర్ 10

## సేవకుని ఆయుధాలు

"నీవు ఆ అంజూరపు చెట్టు క్రింద ఉన్నప్పుడే నిన్ను చూచితినని ... " (యోహాను 1:48)

దైనందిన జీవితంలో ఆరాధన. పెద్ద సమస్య ఏదైనా వచ్చినప్పుడు, లేదా తీవ్రమైన సంఘర్షణ ఎదురైనప్పుడు దాన్ని మనం అప్పటికప్పుడే ఎదుర్కోగలమని సాధారణంగా మనం భావిస్తుంటాం. "దేవుడు నన్ను పోరాటానికి పిలుస్తున్నట్లయితే, నేను ఆ సమయంలోనే సిద్ధపడగలను" అని చెబుతున్నావా? సమస్య లేదా సంఘర్షణ ఎప్పుడో ఒకప్పుడు రావడం కాదు; నిత్యం ఉంటుంది. యుద్ధరంగంలో నీవు సన్నద్ధంగా లేనట్లయితే నీవు సమస్య నెదుర్కోలేవు. ఇప్పుడు నీ ముందున్న చిన్న చిన్న విషయాల్ని గుర్తించి నీవు ఎదుర్కోలేకపోతే, పెద్ద సమస్యల్ని ఎదిరించలేవు. సమస్యముందు సంఘర్షణముందు నీవు మరుగుజ్జుగా మిగులుతావు. మనిషి వ్యక్తిత్వానికి నిజమైన పరీక్ష సంఘర్షణే.

ఆధ్యాత్మిక వ్యాయామం క్రైస్తవునికి తప్పనిసరి. దేవునితో అన్యోన్యత పెంపొందే విధంగా ఆరాధనలో గడపడమే ఆధ్యాత్మిక వ్యాయామం. మనం ఏకాంతంగా దేవునితో గడిపే సమయం ఆయనకు మాత్రమే తెలుసు. మనం ఆధ్యాత్మికంగా ఎంత సుశిక్షితులమో దేవునికి మాత్రమే తెలుసు. సమస్య వచ్చినప్పుడు, సంఘర్షణ ఎదురై నప్పుడు మనం దేవునిపైన ఆధారపడడం మన ఆధ్యాత్మిక క్రమశిక్షణకు నిదర్శనం. మన దైనందిన జీవితంలో మన స్వంతగృహంలో మనం దేవునితో ఏకాంత సమయం గడపకపోతే మనం నిరుపయోగంగా మిగిలిపోతాం. మన ప్రభువు నతనయేలుగురించి ఈ విషయాన్నే ప్రస్తావిస్తున్నాడు. అతని ఆధ్యాత్మిక వ్యాయామాన్ని ప్రభువు ప్రశంసించాడు (1:47). నతనయేలు ఆంతరంగిక జీవితం, అతని బాహ్యజీవితం ప్రభువుకు తెలుసు.

"నేను ప్రస్తుతం పరిశుద్ధుడిగా జీవించడం కుదరదు. బైబిలు చదివే సమయంగానీ ప్రార్థనకు సమయంగానీ నీకు లేదు. పైగా నాకు ఇప్పుడు ఏ సమస్యా లేదు, ఏ సంఘర్షణా లేదు. అవి వచ్చినప్పుడు సిద్ధపడాలనుకుంటున్నాను" అని చెప్పాలను కుంటున్నావేమో! అప్పుడు నీవు సిద్ధపడడం చాలా కష్టం. నీ దైనందిన జీవితంలో ప్రభువుతో నీకు అన్యోన్యత లేనప్పుడు, పరిచర్యలో నీవు ముందడుగు వేయలేవు. నీకు నీవు నిరుపయోగంగా ఉండడమే కాక, నీ చుట్టూ ఉన్నవారికి ఆటంకంగా కూడా ఉంటావు.

ఒంటరిగా నీవు దేవుణ్ణి ఆరాధించే సమయమే నీ ఆధ్యాత్మిక వ్యాయామశాల. ఇక్కడే నీ ఆధ్యాత్మిక ఆయుధాల్ని సానబెట్టు.

సెప్టెంబర్ 11

## సేవకుని ఆయుధాలు

"ప్రభువును బోధకుడనైన నేను మీ పాదములు కడిగినయెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే" (యోహాను 13:14)

ప్రతి రోజూ పరిచర్య చేయడం. ప్రతి రోజూ మనకెదురయ్యే అతి సాధారణమైన పరిస్థితుల్లో పరిచర్య చేయడం గొప్ప సవాలు. ఎందుకంటే ఇది మనం అభిరుచితో ఎంచుకున్న సేవారంగం కాదు. అనుదిన జీవితంలో అనేక యాదృచ్ఛిక సంఘటనలు ఎదురవుతాయి. ఇవే మన పరిచర్య రంగాలు. ఏ మాత్రం విలువలేని పరిస్థితుల్లో నీవు పరిచర్య చేయడంకొరకే దేవుడు ఆ సందర్భాల్ని నీకొరకు రప్పిస్తున్నాడు.

తువ్వాళ్లు పాత్రలు చెప్పులు మన ఇంట్లో కనిపించే అతి సాధారణమైన వస్తువులు. మనం వీటికి ఏ మాత్రం విలువ ఇవ్వం. ఇంట్లో పనిచేసే దాసదాసీజనం వీటి నుపయోగిస్తారు. వీరిని మనం చాలా నీచంగా చూస్తుంటాం. అయితే మన ప్రభువు దాసదాసీజనం చేసే పనిని చేశాడు. ఆయన నీటితో శిష్యుల పాదాల్ని కడిగి తువ్వాలుతో తుడిచాడు. ఇది మానవమాత్రులు చేయలేని పని. దేవుని బలం ఉన్నవారు మాత్రమే ఈ పని చేయగలరు.

"నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని" (యోహాను 13:15) అని యేసు ప్రభువు చెప్పాడు. దేవుడు నీ దగ్గరికి ఎటువంటి మనుషుల్ని రప్పిస్తాడో చూడు. మన ప్రభువు మనకొరకు ఏం చేశాడో మనం వాళ్లకొరకు అదే చేయాలని ప్రభువు ఎదురుచూస్తున్నాడు. ప్రభువుపట్ల నీవెలా ఉన్నావో ఆయన నీకు గుర్తుచేసినందుకు చిన్నబుచ్చుకుంటున్నావా? ఆయన మనల్ని చిన్న బుచ్చడంకొరకు కాదుగానీ, మనకు అణకువ నేర్పించడానికి వినమ్రత బోధించడానికి ఇలా చేస్తున్నాడు.

"ఇప్పుడు కాదు, పరిచర్యకొరకు నేను బయటికి వెళ్లినప్పుడు అక్కడ చేస్తాను" అని నీకు నీవే చెప్పుకుంటున్నావా? ఇది యుద్ధరంగానికి వెళ్లిన తర్వాత ఆయుధాల్ని తయారుచేసుకున్నట్టుగా ఉంటుంది. ఆయుధం తయారయ్యేలోపు జరగవలసినదంతా జరిగిపోతుంది.

మనం దేవునిబాటు "రెండు మైళ్లు" నడవాలి (మత్తయి 5:41 చూడండి). అయితే మనలో చాలామంది పది అడుగులకే అలసటతో కృశించిపోతున్నారు. "పరవాలేదు. ముందు కాలంలో ఏదైనా పెద్ద సమస్య వచ్చేవరకు ఇక్కడే ఆగుతాను" అని చెప్పేవారిలో నీవు కూడా ఉన్నావా? ప్రతి రోజూ మనకెదురయ్యే సందర్భాల్లో మనం పరిచర్య చేయకపోతే సమస్య వచ్చినప్పుడు ఏదీ చేయలేం.

సెప్టెంబర్ 12

## ఆధ్యాత్మిక కలవరం

"యేసు -మీరేమి అడుగుచున్నారో అది మీకు తెలియదు" (మత్తయి 20:22)

నీ ఆధ్యాత్మిక జీవితంలో నీవు కలవరపడిన సందర్భాలు చాలా ఉంటాయి. కలవరంలోంచి బయటపడాలని చెప్పినంత మాత్రాన సరిపోదు. కలవరపడడం తప్పని చెప్పలేం, ఒప్పని చెప్పలేం. దేవుడు నిన్ను ఈ పరిస్థితుల్లో ఎందుకు నడిపిస్తున్నాడో నీకు తెలియకపోవచ్చు. అయితే ఏమీ తోచని పరిస్థితిలోనే దేవుడు నీనుంచి ఏం కోరుకుంటున్నాడో నీవు తెలుసుకోగలవు.

సహాయంచేయని స్నేహితుడిలాగా ఆయన నీకు కనిపిస్తున్నాడా (లూకా 11:5-8 వచనాలు చూడండి). యేసు ఈ వచనాల్లో తన స్నేహితునిపట్ల శ్రద్ధచూపించని మనిషిగురించి చెబుతున్నాడు. మన పరలోకపు తండ్రి కూడా ఇలాగే చేస్తున్నాడని మనం ఆలోచించిన సందర్భాలున్నాయా? దేవుడు దయచూపని స్నేహితుడిలాగా ఉన్నాడని ఆలోచిస్తున్నావా? అయితే ఆయన అటువంటివాడు కాదని గుర్తు తెచ్చుకో. నీకు అన్ని విషయాలు వివరంగా తెలిసే సమయం ఒకటుంది. దేవునికి నీకు మధ్య ఉన్న స్నేహాన్ని ఏదైనా మబ్బు కప్పి వేసిందా? అయితే కొన్ని సార్లు మనం వేచిచూడక తప్పదు. బాధతో కన్నీళ్లతో మనం వేచిచూసినప్పుడు ఆయనతో సంపూర్ణమైన అన్యోన్యతలోనికి నడుస్తాం. దేవునినుంచి నీకు ఏ సహాయం అందని పరిస్థితిలో ఆయనపట్ల నమ్మకంగా ఉండగలవా?

జాలిచూపని తండ్రిలాగా ఆయన నీకు కనిపిస్తున్నాడా (లూకా 11:11-13 వచనాలు చూడండి). దేవుడు అసహజంగా ప్రవర్తించే తండ్రిలాగా నీకు కనిపిస్తున్నాడా? దేవుడు కఠినుడని, నిన్ను అశ్రద్ధ చేస్తున్నాడని ఆలోచిస్తున్నావా? ఆయన కఠినుడు కాడు. ఆయన నిన్ను అశ్రద్ధచేయడని గుర్తు తెచ్చుకో. "అడుగు ప్రతివానికియ్యబడును ... " (లూకా 11:10). దేవుడు జాలిచూపడంలేదని నీవు ఆలోచిస్తున్నట్లయితే ఆయనగురించి నీవు పూర్తిగా తెలుసుకొనే రోజుకొరకు ఓపికతో ఎదురుచూడు.

వింతైన విశ్వాసం (లూకా 18:1-8 వచనాలు చూడండి). "మనుష్యకుమారుడు వచ్చు నప్పుడు ఆయన భూమిమీద విశ్వాసము కనుగొనునా?" (లూకా 18:8). ఆయన ఎదురుచూసే విశ్వాసాన్ని ఆయన చూడగలడా? విశ్వాసంలో స్థిరంగా ఉండు. దేవుడు ఏం చేస్తున్నాడో నీకు స్పష్టంగా తెలియకపోయినప్పటికీ యేసును నమ్ము! ఆయన చెప్పినది సత్యం! దేవుడు చేయబోయే పనులగురించి ఆలోచించినప్పుడు ఇప్పుడు నీవు దేవుణ్ణి అడుగుతున్నవి చాలా అల్పమైన విషయాలని, ఏ ప్రాముఖ్యత లేని విషయాలని నీ మట్టుకు నీవే తెలుసుకుంటావు.

సెప్టెంబర్ 13

## సమర్పణ అనంతరం - తదుపరి కార్యక్రమమేమిటి?

"చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి ... "(యోహాను 17:4)

నిజమైన సమర్పణ అంటే మన బాహ్యజీవితంలో ఇతరులకు కనిపించే సమర్పణ కాదు. మన చిత్తాన్ని మన ఇచ్ఛను మన మనశ్శక్తిని సమర్పించుకున్నప్పుడే అది నిజమైన సమర్పణ అవుతుంది. మన చిత్తాన్ని మన ఇచ్ఛను దేవునికి లోబర్చడంలోనే అసలు సంఘర్షణ ఎదురవుతుంది! అయినా మనం తనకు లోబడాలని దేవుడు మనల్ని బలవంతపెట్టడంలేదు. ఆయన మనల్ని తనకు సమర్పించుకోమని బ్రతిమలాడడం లేదు. ఆయనకు మనం ఇచ్ఛాపూర్వకంగా సమర్పించుకొనేంతవరకు ఓపికతో ఎదురుచూస్తాడు. సమర్పణ యుద్ధ రంగం వంటిది. ఒకసారి యుద్ధరంగంలో అడుగు పెట్టిన తర్వాత, యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియదు. ఎందుకంటే సమర్పణ ఒకనాటితో ముగిసే కార్యం కాదు! అది నిత్యం కొనసాగే ప్రక్రియ!

**విడుదలకొరకు సమర్పణ.** "నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (మత్తయి 11:28). రక్షణ అంటే ఏమిటో మనకు అనుభవపూర్వకంగా తెలిసిన తర్వాత మాత్రమే మనం మన చిత్తాన్ని ప్రభువుకు లోపర్చడం జరుగుతుంది. వాస్తవానికి మనలో అనిశ్చయతాభావం కలిగినప్పుడు దాన్ని మనం ప్రభువు మనల్ని "నాయొద్దకు రండి" అని పిలిచే ఆహ్వానంగా భావించాలి. అయితే ప్రభువు దగ్గరకు నడవడం నీ ఇచ్ఛకు నీ ఇష్టానికి వదిలిపెట్టబడిన విషయం.

**నిజమైన భక్తికొరకు సమర్పణ.** "ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల, తన్ను తాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తికొని నన్ను వెంబడింపవలెను" (యోహాను 17:4). నా అహాన్ని నేను తగ్గించుకొని నన్ను నేను పూర్తిగా అప్పగించుకొనే సమర్పణ ఇది. నా హృదయం నా చిత్తం నా మనశ్శక్తి యేసు అనుగ్రహించే విశ్రాంతిని పొందే సమర్పణ ఇది. "తన్ను తాను ఉపేక్షించుకొని" అని ప్రభువు చెబుతున్నాడు. అంటే మనల్ని మనం లక్ష్యపరచుకోకూడదని అర్థం. నిన్ను నీవు ఉపేక్షించుకున్నప్పుడు నీ జీవితంలో ఇక నీకు ప్రాధాన్యత ఉండదు; నీ భవిష్యత్తుగురించి ఇక నీలో ఆలోచనలుండవు. నీవున్న పరిస్థితులెటువంటివైనప్పటికీ నీకు సర్వస్వం యేసే (2 కొరింథీ 12:9; ఫిలిప్పీ 4:19 వచనాలు చూడండి).

**మరణించడంకొరకు సమర్పణ.** "వేరొకడు నీ నడుము కట్టి ... " (యోహాను 21:18; వ.19 కూడా చూడండి). నడుముకట్టుకొనడమంటే మరణానికి ఉద్యుక్తుడు కావడమని నీకు తెలుసా? సమర్పించుకోవాలనే నిర్ణయం ఉద్వేగభరితమైన నిర్ణయం కాకూడదు. ఎందుకంటే అది ఆవేశపూరితమైన నిర్ణయమైనప్పుడు నీవు మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొనే ప్రమాదం వుంది. మనల్ని మనం యేసుకు సమర్పించుకోడమంటే "ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము ... " (రోమా 6:5) కలిగి ఉండడం. ఇదే నిజమైన సమర్పణ.

సమర్పణ తర్వాత, తదుపరి కార్యక్రమమేమిటి? దేవునితో ఎడతెగని అన్యోన్యతను అనన్యతను కాపాడుకోవాలనే ఉత్కంఠ నీలో ఎప్పుడూ ఉండాలి. పైగా, ఇది నీ జీవితంలో మొదటి ప్రాధాన్యతగా ఉండాలి.

సెప్టెంబర్ 14

**వాదనలా, లేక విధేయతా?**

"క్రీస్తు ఎడలనున్న సరళతనుండియు ... " (2 కొరింథీ 11:3)

నీవు ఆధ్యాత్మికంగా అయోమయ పరిస్థితుల్లో ఉన్నప్పుడు దేన్నీ స్పష్టంగా చూడలేవు. నీవు దేన్నైనా స్పష్టంగా చూడాలనుకుంటున్నట్లయితే నీలో ముందుగా విధేయత ఉండాలి. మేధస్సుకు సంబంధించిన విషయాల్లో స్పష్టతకొరకు నీవు ఎవరినైనా అడగవచ్చు. అయితే ఆధ్యాత్మిక విషయాల్ని నీ మట్టుకు నీవే స్పష్టంగా చూడడం నేర్చుకోవాలి. కొన్ని సార్లు ఇది నిన్ను మరింతగా అయోమయంలోకి కలవరంలోని నెట్టివేయవచ్చు. ఆధ్యాత్మిక విషయాల్ని అనుకున్నంత త్వరగా స్పష్టంగా చూడకపోయినప్పటికీ, సరళత కలిగి ఉండడం అంత కష్టమైనది మాత్రం కాదు. దేవుడు ఏ విషయంగురించైనా నీలో భారాన్నుంచినట్లయితే వెంటనే ఆ విషయంలో దేవునికి విధేయత చూపు! ఆ విషయంగురించి "ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి" (2 కొరింథీ 10:5) విధేయత చూపు. అప్పుడు ప్రతిదీ నీకు పగటి వెలుగంత స్పష్టంగా కనిపిస్తుంది. విధేయత నీ మొదటి ప్రాధాన్యత కావాలి. తర్వాతనే వాదనలు, ప్రతివాదనలు. మనం జ్ఞానవంతులమని అనుకుంటున్నట్లయితే దేవుడు కొన్ని విషయాల్ని మనకు తెలియకుండా దాచిపెడతాడు (మత్తయి 11:25 వచనం చూడండి).

మనల్ని ఆధ్యాత్మికంగా అయోమయ పరిస్థితుల్లో పడవేయడానికి గొప్ప విషయాలు అక్కర్లేదు; పరిశుద్ధాత్మ  అనుమతించని, మరియు పరిశుద్ధాత్మ స్వాధీనంలో లేని ఏ చిన్న విషయమైనా చాలు. మనం దానిగురించి ఆలోచిస్తున్నకొద్దీ ఇంకా ఎక్కువ కలవరానికి గురవుతాం. ఈ కలవరాన్ని అధిగమించడమెలా? ఈ అయోమయస్థితినుంచి బయట పడడ మెలా? ఇది విధేయత ద్వారా మాత్రమే సాధ్యం. మనం విధేయత చూపిన తత్క్షణమే, మనలో వివేకం మేలుకొంటుంది. ఇది మనల్ని ఒకందుకు చిన్నబుచ్చుతుంది కూడా; ఎందుకంటే మన అవివేకానికి అయోమయానికి కారణం మనకు తెలిసింది కాబట్టి. అయితే మన మనశ్శక్తి, మన మనోదృష్టి పరిశుద్ధాత్మకు విధేయత చూపినప్పుడు దేవుని చిత్తాన్ని స్పష్టంగా చూడగల శక్తి మనకు దానంతట అదే వస్తుంది. ఇక అప్పుడు మన జీవితంలో సరళత తప్ప ఏదీ ఉండదు!

సెప్టెంబర్ 15

**విడిచిపెట్టవలసినవి**

"అవమానకరమైన రహస్యకార్యములను విసర్జించియున్నాము" (2 కొరింథీ 4:2)

నీ జీవితంలో ఉన్న "అవమానకరమైన రహస్యకార్యములను" విడిచిపెట్టావా? నీలో ఉన్న అతిశయాన్ని నీలో ఉన్న స్వాభిమానాన్ని విడిచిపెట్టావా? ఎందుకంటే నీలో ఉన్న అతిశయం నీలో ఉన్న దురభిమానం నీవు కొన్ని విషయాల్ని దాచిపెట్టేలా చేస్తాయి. వాటిని రహస్యంగా దాచిపెట్టడం సులువుగా ఉండవచ్చు! బయటపెట్టడానికి నీవు ఇష్టపడని ఆలోచన ఏదైనా నీలో ఉందా? అయితే ఆ ఆలోచన నీ మనస్సులోకి వచ్చినవెంటనే దాన్ని పరిత్యజించు. నీలో నిజాయితి లోపించి ఉందేమో, నిన్ను నీవు సరిచేసుకో. నీలో కుయుక్తి ఉందేమో, నిన్ను నీవు సరిచేసుకో. నీ హృదయం దేవునియెదుట సరళత కలిగి ఉండేలా అన్నిటినీ ఆయనముందు బయటపెట్టు. పగకు, ఈర్ష్యకు, కలహానికి కారణం నీ దేహమే కావచ్చు. ఎందుకంటే నీ దేహంలో ఇంత క్రితం పాతస్వభావం వుంది కాబట్టి (రోమా 6:19; 1 పేతురు 4:1-3 వచనాలు చూడండి). నిన్ను సిగ్గుపరచేవేవీ నీ జీవితంలోకి తొంగిచూడకుండా నిన్ను నీవు అప్రమత్తంగా కాపాడుకో.

"కుయుక్తిగా నడుచుకొనకయు ... " (2 కొరింథీ 4: 2). అంటే నీ వాదన బలపర్చుకోడానికి కపటోపాయాలు పన్నకూడదని అర్థం. ఇదొక ఉచ్చులాంటిది. దేవుడు నిన్ను సత్యంలో మాత్రమే నడిపిస్తాడు. ఆయన మార్గం సత్యమార్గం. సత్యానికి భిన్నమైనదేదీ దేవునికి చెందినది కాదు. కాబట్టి కపటోపాయంతో కుయుక్తితో మనుషుల్ని ఆకట్టుకోవాలని ప్రయత్నించకు. నీలో కపటవర్తన ఉన్నట్లయితే నీవు శిక్షకు పాత్రుడవు. దేవుడు నీకు ఉన్నతమైన ప్రమాణాల్ని నిర్దేశించాడు. ఆయన ఘనతకొరకు నీ సర్వస్వాన్నివ్వడానికి, ఆయన మహిమకొరకు నీకున్న శ్రేష్ఠమైనవాటిని వదులుకోడానికి సిద్ధంగా ఉండు. ఈ విషయంలో మందకొడిగా ఉండకు. అయితే కొన్ని పనుల్ని చేసేటప్పుడు నీలో కపటంగానీ కుయుక్తి గానీ చోటుచేసుకోవచ్చు. అయితే ఇది దేవుడు నీలో ఉంచిన సత్ప్రేరణల్ని అణచివేస్తుంది. దేవునివైపు నుంచి చూడడానికి భయపడిన కొందరు విశ్వాసం విషయంలో వెనక్కు మళ్లారు. విశ్వాసంలో ముందుకు అడుగులు వేస్తూ వెళ్లున్నప్పుడు ఆధ్యాత్మిక సంఘర్షణ లెదురవడం తథ్యం!

సెప్టెంబర్ 16

## ఆంతరంగిక ప్రార్థన

"నీవు ప్రార్థన చేయునప్పుడు, నీ గదిలోనికి వెళ్లి తలుపువేసి, రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థనచేయుము; అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును" (మత్తయి 6:6)

నీ దృష్టిని మనుషులమీద కాక, దేవునిమీద నిమగ్నం చేయడం మొదటి యత్నం. నీవొక గొప్ప ప్రార్థనాపరుడిగా పేరు తెచ్చుకోవాలనే కోరిక నీలో ఉండకూడదు. నీ ప్రార్థన ఆంతరంగిక విషయం. నీవు ప్రార్థించే సంగతి అందరికీ తెలియనక్కర్లేదు! దేవునితో ఏకాంతంగా మాట్లాడు! ప్రార్థనకు ప్రేరణ నీ పరలోకపు తండ్రితో మాట్లాడడం తప్ప మరొకటి కాదు. ఆంతరంగిక ప్రార్థనలేకుండా శిష్యుడిగా జీవించడం అసాధ్యం.

"మీరు ప్రార్థన చేయునప్పుడు ... అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు" (6:7). మనం పట్టుదలతో ప్రార్థిస్తున్నామని, దేవుడు మన ప్రార్థన వింటున్నాడని అనుకోడం సరికాదు; ఆయన మనల్ని విమోచించి రక్షించాడు కాబట్టి మన ప్రార్థన వింటున్నాడు. దేవునికి కావలసినది మన పట్టుదల కాదు; మనం పాపవిమోచన పొందడం ముఖ్యం. ప్రార్థన అంటే మనకు కావలసినవాటిగురించి దేవుణ్ణి అడిగి వాటిని పొందడం కాదు; ప్రార్థన అంటే దేవునితో ఎడతెగని అన్యోన్యత, మరియు అఖండమైన అనన్యత. మనం తిరిగిపుట్టడంద్వారా "క్రీస్తు స్వరూపము" (గలతీ 4:19) మనలో ఏర్పడుతున్నట్లయితే ఆయన మన ఆలోచనల్ని మన మనోవైఖరిని మారుస్తాడు. అప్పుడు మనం ప్రార్థించే విషయాలు గతంలో మనం ప్రార్థించిన విషయాలు కాదు!

"అడుగు ప్రతివాడును పొందును" (మత్తయి 7:8). మనం చాలా సార్లు అనాలోచితంగా ప్రార్థనచేసి, దేవుడు మన ప్రార్థనలు వినడంలేదని చెబుతుంటాం. వాస్తవానికి ఇటువంటి ప్రార్థనల్లో మనం దేవుణ్ణి ఏమీ అడగలేదని అర్థం. "మీకేది యిష్టమో అడుగుడి ... " (యోహాను 15:7). అంటే మనం చిత్తశుద్ధితో యథార్థహృదయంతో అడగాలని అర్థం. యేసు ప్రభువు ప్రార్థన గురించి మాట్లాడిన ప్రతి సారీ ఎంతో సరళతతో ఎంతో సూటిగా మాట్లాడాడు. అయితే మనమే కువిమర్శతో "యేసు ప్రభువు మనల్ని అడగమన్నాడు కాబట్టి మనం అడుగుతున్నాం" అని మాట్లాడుతున్నాం. ఒక విషయం గుర్తుంచుకో. దేవుడు యేసు క్రీస్తుద్వారా వెల్లడిచేసిన వాటి కనుగుణంగా అడగడం నేర్చుకో.

సెప్టెంబర్ 17

**శోధన మన మంచికొరకేనా?**

"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధనతప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు ... " (1 కొరింథీ 10:13)

"శోధన" అనగానే జరగరానిదేదో జరిగిపోతుందనే భావన నేడు మనలో ఉంది. అయితే ఇది సరి కాదు. శోధన పాపం కాదు; మనుషులకు శోధనలు తప్పవు. అయితే మనలో చాలామంది అవాంఛనీయ శోధనల్లో పడుతున్నారు. వీటిని నివారించడం మన చేతుల్లోనే ఉంది. ఈ శోధనలకు కారణం, దేవుడు మనల్ని పై మెట్టుకు ఎక్కిస్తుంటే మనం వద్దనడమే. పై మెట్టు మీద కూడా శోధనలుంటాయి. అది వేరే విషయం.

బాహ్యప్రేరణలు మనల్ని శోధనకు గురిచేస్తాయి. అయితే ఇది మన ఆంతరంగిక స్వభావం మీద ఆధారపడి ఉంటుంది. శోధనలు మనిషి వ్యక్తిత్వాన్ని వెల్లడిచేస్తాయి. శోధనల్లోనే మనిషి నిజస్వభావం తెలుస్తుంది. కొంతమేరకు శోధనల్ని మనమే కొనితెచ్చుకుంటాం. అయితే ఆ శోధనల్ని ఎదిరించడమనేది, లేదా శోధనలకు లొంగిపోవడమనేది ఆ మనిషి ఆధ్యాత్మికస్థాయిమీద, నైతికస్థాయిమీద ఆధారపడి ఉంటుంది.

ఉన్నత లక్ష్యాన్ని సాధించాలనే శోధన, కష్టపడకుండా విజయం సాధించాలనే శోధన మనం చెడు చేస్తున్నామనే ఆలోచన మనలో కలిగించడానికి బదులు మంచి చేస్తున్నామనే ఆలోచనకే మనల్ని నడిపిస్తాయి. శోధన కొంతమేరకు మనల్ని కలవరానికి గురిచేస్తుంది. అయితే నేను మంచి చెడులు నిర్ణయించకపోయినప్పటికీ నేను శోధనకు లొంగినప్పుడు నా కోరికలే నన్ను జయించాయని అర్థం. నేను శోధనలకు లొంగిపోయిన తర్వాత తెలుసుకొన్న వాస్తవం ఇంత క్రితం మనం శోధనలో పడకపోడానికి కారణం మనలో ఉన్న భయమేననే విషయం.

శోధనల్ని తప్పించుకోలేం. అవి వస్తూనే ఉంటాయి. వాస్తవానికి శోధనలు మన వ్యక్తిత్వానికి పదును పెట్టి మనల్ని పరిపక్వతకు నడిపిస్తాయి. నీవొక్కడివే శోధనల్లో ఉన్నావని ఆలోచించకు. మానవజాతియావత్తూ శోధనల్ని తప్పించుకోలేదు. ఆయన మనకు శోధనలు రాకుండా నివారించడుగానీ శోధనల నడుమ మనల్ని తప్పించి కాపాడతాడు (హెబ్రీ 2:18; 4:15,16 వచనాలు చూడండి).



సెప్టెంబర్ 18

## ప్రభువు శోధనలు, మన శోధనలు

"మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను" (హెబ్రీ 4:15)

మనం తిరిగిపుట్టేవరకు మనకు తెలిసిన శోధన ఒక్కటే. అది యాకోబు 1:14 వచనంలో ఉంది: "ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును." అయితే మనం తిరిగి పుట్టిన తర్వాత కూడా మన జీవితంలో శోధనలుంటాయి. అయితే ఇవి గతంలో వచ్చినట్టుగా స్వకీయమైన దురాశలవలన వచ్చిన శోధనలు కావు. తిరిగిపుట్టినవారికి వచ్చే శోధనలు వేరు. మన ప్రభువుకు కూడా ఈ లోకంలో శోధన లెదురయ్యాయి. అయితే అవి పాపపు స్వభావంతో ఉన్న మనుషులకు వచ్చే శోధనలవంటివి కావు. మన ప్రభువు మనుష్యకుమారుడు మరియు దేవుని కుమారుడు. ఆయనలో పాపంలేదు కాబట్టి ఆయనకు వచ్చిన శోధనలు మనకు వచ్చే శోధనల వంటివి కావు. దేవుని ఆత్మద్వారా తిరిగిపుట్టినవారిలో "క్రీస్తు స్వరూపము" (గలతీ 4:19) పెంపొందుతూ ఉంటుంది. అయితే మనలో ఉన్న క్రీస్తు స్వరూపాన్ని స్థానభ్రంశం చేయడానికి సాతాను మనల్ని శోధిస్తాడు. తిరిగిపుట్టిన మనకు దేవుడనుగ్రహించినవాటిని పోగొట్టడానికి సాతాను మనల్ని శోధిస్తాడు. మనం దేవునియెదుట నిష్ప్రయోజకులుగా నిష్ఫలులుగా చేయడానికి సాతాను మనల్ని శోధిస్తాడు. మన ఆలోచనలు దేవునిమీదనుంచి తొలగిపోయేలా సాతాను మనల్ని అన్య మనస్కతలతో శోధిస్తాడు. అయితే సాతానువలన వచ్చే శోధనల్ని మనం దేవుని ఆత్మద్వారా తెలుసుకోగలం.

మన అంతరంగంపైన మన ఆధ్యాత్మికశక్తిపైన బాహ్యప్రేరణలు, బాహ్య ప్రభావాలు చేసే దాడినే శోధన అని పిలుస్తున్నాం. ఈ నేపథ్యంలో యేసుకెదురైన శోధనల్ని అర్థం చేసుకోగలం. యేసు బాప్తిస్మం పొందినవెంటనే సాతాను ఆయణ్ణి శోధించాడు. "అప్పుడు యేసు అపవాదిచేత శోధింపబడుటకు ఆత్మవలన అరణ్యమునకు కొనిపోబడెను" (మత్తయి 4:1). యేసు నెరవేర్చవలసిన కార్యాన్ని ఆయన నెరవేర్చకుండా చేయడానికి సాతాను ఆయణ్ణి శోధించాడు. యేసు నెరవేర్చవలసిన కార్యం లోకాన్ని రక్షించడం. "ఇదిగో లోకపాపమును మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1:29) అని బాప్తిస్మమిచ్చే యోహాను యేసుగురించి సాక్ష్యమిచ్చాడు. అయితే యేసులో ఏ పాపం లేదు. ఆయన శోధనలకు లొంగిపోలేదు. ఆయన తనలో ఉన్న దేవుని జీవాన్ని, తన ఆధ్యాత్మిక శక్తిని, తన అంతరంగాన్ని శోధనలబారిన పడకుండా కాపాడుకొని శోధనల్ని జయించాడు. "క్రీస్తు స్వరూపము"ను కలిగి ఉన్న శిష్యులు కూడా యేసు మాదిరిలోనే నడవాలి.

సెప్టెంబర్ 19

## నీవు యేసుతోబాటు వెళ్తున్నావా?

"నా శోధనలలో నాతో కూడ నిలిచి యున్నవారు మీరే" (లూకా 22:28)

మన శోధనల్లో యేసు మనతోబాటు ఉండి మనకు శోధనలనుంచి విడుదలనిచ్చే మాట వాస్తవం. అయితే యేసు శోధనల్లో మనం ఆయనతోబాటుగా ఉన్నామా? మనలో చాలామంది కొంత దూరం యేసుతోబాటు వెళ్లి వెనుతిరిగినవారున్నారు. కారణం, మనం శోధనల్ని జయించలేమనే ఆలోచనే. శోధనలల్లో నీవేం చేస్తున్నావో దేవుడు చూస్తున్నాడు. శోధనల్లో నీవు యేసుతోబాటుగా ఉన్నావా? లేక, లోకంవైపు శరీరంవైపు సాతానువైపు చూశావా? ఆయన నామాన్ని మనం ధరించినప్పటికీ, ఆయనతోబాటు నడుస్తున్నామా? శోధనల్లో ఆయనతోబాటు ఉన్నామా? లేక, ఆయణ్ణి విడిచి వెనుతిరిగామా? "అప్పటినుండి ఆయన శిష్యులలో అనేకులు వెనుకతీసి, మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు" (యోహాను 6:66).

యేసు భూమీ్మద పరిచర్య చేసిన కాలమంతా ఎవరో ఒకరు ఆయణ్ణి శోధిస్తూనే ఉన్నారు. ఇది మన విషయంలో కూడా వాస్తవమే. "క్రీస్తు స్వరూపము" మనలో ఉంది కాబట్టి మనల్ని కూడా ఎవరో ఒకరు శోధిస్తూనే ఉంటారు. అయితే మనం శోధనల్లో యేసుతోబాటుగా ఉన్నామా?

మన చుట్టూ ఉన్న పరిస్థితులనుంచి మనల్ని మనం కాపాడుకోవాలనే ఆలోచన మనలో ఉంటుంది. ఇది సాధ్యం కాదేమో! ఎందుకంటే మన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని దేవుడే రప్పిస్తాడు. మన చుట్టూ ఎటువంటి పరిస్థితులున్నప్పటికీ, మనకు ఎటువంటి శోధనలెదురైనప్పటికీ మనం నిరంతరాయంగా యేసులో నిలిచి ఉండాలి, యేసుతోబాటు నడవాలి. మనలో "క్రీస్తు స్వరూపము" వృద్ధిచెందకుండా సాతాను శోధిస్తున్నాడు. అయితే మన దేహాల ద్వారా క్రీస్తు ఘనపర్చబడాలి. మనలో ఉన్న క్రీస్తు స్వరూపంపైన సాతాను దాడి చేస్తుంటే మనం దేవుని కుమారుడిపట్ల విశ్వాస్యత చూపిస్తున్నామా?

నీవు యేసుతోబాటే ఉన్నావా? ఆయన నగరద్వారందాటి గెత్సేమనేలోకి వెళ్తున్నాడు. ఆయన "శిబిరము వెలుపలికి" (హెబ్రీ 13:13) వెళ్తున్నాడు. నీవు కూడా ఆయన వెనకే వెళ్తున్నావా? ఆయన మార్గం ఒంటరి మార్గం. కొంత దూరం నడిచిన తర్వాత ఆయన అడుగు జాడలు నీకు కనిపించవు గానీ "నా వెంబడి రండి" (మత్తయి 4:19) అని ఆయన నిన్ను పిలిచే మృదువైన స్వరం మాత్రమే నీకు వినబడుతుంది.

సెప్టెంబర్ 20

## దైవాజ్ఞానుసారమైన జీవితం

"మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు" (మత్తయి 5:48)

38-48 వచనాల్లో ప్రభువు మనల్ని ప్రతి ఒక్కరిపట్ల ఔదార్యం చూపమని హెచ్చరిస్తున్నాడు. నీ ఆధ్యాత్మిక జీవితంపైన నీ రాగద్వేషాలు ఎటువంటి ప్రభావం చూపకుండా జాగ్రత్తపడు. మనందరిలో రాగద్వేషాలుంటాయి. కొంతమందిని మనం ప్రేమిస్తాం; కొంతమందిని ద్వేషిస్తాం. అయితే మన క్రైస్తవ జీవితాన్ని రాగద్వేషాలు ప్రభావితం చేయ కూడదు. "ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము" (1 యోహాను 1:7). మనం వెలుగు పిల్లలమైన తర్వాత గతంలో మనం ద్వేషించినవారిని ప్రేమించాలి.

ఇక్కడ మాదిరిగా ఉన్నది ఒక మంచి వ్యక్తి కాదు, ఒక మంచి క్రైస్తవుడు కాదు, సాక్షాత్తూ దేవుడే. "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు". దేవుడు నీపట్ల చేసిన మంచి పనిని నీవితరులపట్ల చేయాలి. నీవు పరిపూర్ణతకు నడుస్తున్నావని నిరూపించుకొనే అవకాశాలు దేవుడు నీకు ప్రతి రోజూ రప్పిస్తాడు. "మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను" (యోహాను 13:34,35).

నిజమైన క్రైస్తవ ధర్మం మంచిపనులు చేయడం కాదుగానీ దేవుని స్వరూపంలో పెంపొందడం. దేవుని ఆత్మ నీ అంతరంగాన్ని రూపాంతరీకరించినట్లయితే నీ జీవితంలో "దేవుని స్వరూపం" కనిపిస్తుంది. నీలో దేవుని జీవం ప్రతిఫలిస్తుంది. పరలోక ప్రేమను మన దైనందిన జీవితంలో వెల్లడిచేయడమే నిజమైన క్రైస్తవ జీవితం. ఇదే క్రైస్తవ జీవితరహస్యం. ఇదే దేవుని కృపాకార్యం. ఇది దేవునితో గడిపే ఆంతరంగిక సమయాల్లో వెల్లడయ్యే స్వభావం కాదుగానీ మన అనుదిన జీవితంలో మనకెదురయ్యే అతి సామాన్యమైన పరిస్థితుల్లో ఎదురయ్యే ఆచరణాత్మక అనుభవం. ఇది మన జీవితానుభవమైనప్పుడు ఎన్ని కలతలెదురైనా మనం ఒడిదుడుకుల్లేని జీవితాన్ని కొనసాగించగలం.

సెప్టెంబర్ 21

## సేవకునికొరకు ముందుగా నిర్ణయించబడిన ఉద్దేశం

“నేను గర్భమున పుట్టగానే యెహోవా నన్ను పిలిచెను ... నన్ను గర్భమున పుట్టించిన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు” (యెషయా 49:1,5)

దేవుడు తన పరిచర్యకొరకు మనల్ని ముందుగానే ఎన్నుకున్నాడనే విషయాన్ని మనం తెలుసుకున్న తర్వాత మనం మొదటగా మన మనసులో ఉన్న పూర్వభావనల్ని సంకుచితమైన ఆలోచనల్ని అన్యమనస్కతల్ని పూర్తిగా తుడిచివేయాలి. అప్పుడు మాత్రమే మనం పూర్ణహృదయంతో దేవుని ఉద్దేశాలమీద మాత్రమే దృష్టిపెట్టే నిజమైన సేవకులుగా ఉండగలం. మానవులు తనను మహిమపర్చానే ఉద్దేశంతోను, వారు తనలో ఆనందించాలనే ఉద్దేశంతోను దేవుడు మానవజాతిని సృష్టించాడు. అయితే పాపం మానవజాతిని అపమార్గంలోకి త్రోసివేసింది. ఇందువల్ల మానవజాతి దేవుని ఉద్దేశాలకు దూరమైంది. అయితే మనం తిరిగిపుట్టినప్పుడు దేవునికి మానవజాతిపట్ల ఉన్న మహోన్నత ఉద్దేశాల్ని తెలుసుకోగలం; ఆయన మనల్ని తనకొరకు సృష్టించాడనే మహోన్నత సత్యాన్ని తెలుసుకోగలం. దేవుడు మనల్ని తనకొరకు ఎన్నుకున్నాడనే సత్యం మనల్ని ఆనందపరవశుల్ని చేస్తుంది. అద్భుత సృజనాత్మకశక్తితో మనగురించి గొప్ప తలంపులు కలిగి ఉన్న దేవునిమీద మనం ఆధారపడడం నేర్చుకోవాలి. మనం తిరిగిపుట్టినప్పుడు దేవుడు తన ప్రేమను తన స్వరూపాన్ని మన హృదయంలో ప్రవేశపెడ్తాడు. దేవుడు తన ఉద్దేశాల్ని మనద్వారా క్రియారూపంలో పెడ్తాడు. సర్వశక్త దేవుని స్వభావం యోహాను 3:16 వచనంలో మనకు సుస్పష్టంగా కనిపిస్తుంది: “దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.”

మనం దేవుని ఉద్దేశాలమీదే సదా మన దృష్టిని నిమగ్నం చేయాలి తప్ప, మన స్వంత ఆలోచనలవైపు మళ్లకూడదు. మనం స్వంత ఆలోచనలవైపు మళ్లినట్లయితే దేవుడు వాటిని పట్టించుకోడు. ఇది మనకు బాధ కలిగించే విషయమే. అయితే మనల్ని మనం సరిదిద్దుకొని దేవుని ఉద్దేశాల్ని దృష్టించవలసి ఉన్నాం. దేవుడు మనద్వారా మహిమపొందాలనే ఉద్దేశంతోనే మనల్ని తన సేవకులుగా ఎన్నుకున్నాడు. యేసు క్రీస్తు మన కనుగ్రహించిన రక్షణద్వారా మనం దేవుని ఉద్దేశాల్ని నెరవేర్చడానికి ఎన్నుకోబడ్డా మని మనం గుర్తించినప్పుడు యేసు క్రీస్తు ఎక్కడా రాజీపడకుండా తాను చేయవలసిన పనుల్ని ఎలా చేశాడో తెలుసుకోగలం. దేవుడు తన సేవకుల్లో అప్రతిహతమైన నీతిని కోరుకుంటున్నాడు. ఎందుకంటే దేవుడు తన సేవకుల్లో తన స్వరూపాన్ని తన స్వభావాన్ని ఉంచాడు కాబట్టి.

నీ జీవితంలో దేవుని ఉద్దేశాలపట్ల అప్రమత్తంగా ఉండు!

సెప్టెంబర్ 22

## సేవకుని యజమాని, మరియు బోధకుడు

“బోధకుడనియు ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు; నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే ... దాసుడు తన యజమానునికంటె గొప్పవాడు కాడు ... ” (యోహాను 13:13,16)

బోధకుడు యజమాని ఒక్కరే అయినట్లయితే ఆ పరిస్థితి వేరుగా ఉంటుంది. మన గురించి మనకు తెలిసినదానికంటె మన యజమానికి ఎక్కువగా తెలుసు. యజమాని మనకు స్నేహితుడికంటె దగ్గరివాడు. మన హృదయంలో ఏముందో మన యజమానికి తెలుసు. యజమాని మన అన్ని అవసరాల్ని తీరుస్తాడు. ఆ యజమాని బోధకుడు కూడా అయినట్లయితే తన సేవకుని జీవితంలో ఎదురయ్యే ప్రతి సంశయాన్ని ప్రతి అనిశ్చయతను తొలగించి అతనికి భద్రతనిస్తాడు. యజమాని సంరక్షణలో సేవకుడు ఏ భయంలేకుండా పూర్తిభద్రత ననుభవిస్తాడు. “క్రీస్తు ఒక్కడే మీ గురువు” (మత్తయి 23:10).

మన ప్రభువు తన పని విషయంలో ఎవరినీ వత్తిడి చేయడు. కొన్నిసార్లు నేను ఏం చేస్తున్నానో ప్రభువు నన్ను అజమాయిషీ చేయాలని అనుకుంటాను గానీ ఆయన అజమాయిషీ చేయడు. కొన్ని సార్లు ఆయన నన్ను ఒంటరిగా వదిలేస్తే బాగుంటుందని అనుకుంటాను గానీ ఆయన నన్ను ఒంటరిగా వదలడు.

“బోధకుడనియు ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు” - ఆయన నీకు బోధకుడుగా ప్రభువుగా ఉన్నాడా? బోధకుడు యజమాని ప్రభువు అనే పదాలకు నీ జీవితంలో ప్రమేయం వుందా? మనం రక్షకుడు, పరిశుద్ధపర్చేవాడు, స్వస్థపర్చేవాడు అనే పదాల్ని ఇష్టపడతాం. ప్రభువు సంరక్షణలో మనకు అనుభవపూర్వకమైన పదం ప్రేమ. ఆయన ప్రేమ ఎటువంటిదో మనకు తెలుసు. అయితే దేవుని వాక్యంలో వెల్లడైన ప్రేమ మనలో ఇతరులు చూస్తున్నారా? ఉదాహరణకు, విధేయత పదాన్ని చూద్దాం. బైబిల్లో విధేయత, లేక లోబడడం అనే పదం ఒకే స్థాయిలో ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న సంబంధాన్ని సూచిస్తోంది. ఉదాహరణకు, తండ్రికి కుమారుడికి మధ్య ఉన్న సంబంధం. మన ప్రభువు దేవుని సేవకుడు మాత్రమే కాదు, ఆయన కుమారుడు కూడా. “ఆయన, కుమారుడైయుండియు తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను” (హెబ్రీ 5:8). మన ప్రభువు లోకంలో ఉన్న యజమానులవంటి యజమాని కాదు. లోకంలో ఉన్న యజమానులు తమ సేవకులపైన తమ యాజమాన్యాన్ని బలవంతంగా రుద్దుతారు. అయితే మన ప్రభువు తన యాజమాన్యాన్ని మనమీద బలవంతంగా రుద్దడు. ఆయన యాజమాన్యానికి మనమే ఇచ్ఛాపూర్వకంగా విధేయత చూపాలి. దేవుడు తనకు తన సేవకులకు మధ్య ఇటువంటి విధేయతనే కోరుకుంటున్నాడు. ఎందుకంటే ఆయన సేవకులు ఆయనకు పిల్లలు కూడా. ఆయనకు విధేయత చూపాలనే స్పృహ మనలో లేకుండానే ఆయనకు మనం విధేయత చూపడం నిజమైన మరియు వాక్యానుసారమైన విధేయత. మన ప్రభువు మనలో ఇటువంటి విధేయతనే కోరుకుంటున్నాడు.



సెప్టెంబర్ 23

## సేవకుని అంతిమలక్ష్యం

"ఆయన శిష్యులను పిలిచి -ఇదిగో యెరూషలేమునకు వెళ్లుచున్నాము ... " (లూకా 18:31)

మన అనుదిన జీవితంలో అభిలాషలు ఆశలు మాటిమాటికీ మారుతూ ఉంటాయి. జీవితంలో మనం అభివృద్ధిని అభ్యుదయాన్ని కోరుకుంటూ మన గమ్యాల్ని మన లక్ష్యాల్ని మార్చుకుంటూ ఉంటాం. అయితే క్రైస్తవ జీవితం వేరు. క్రైస్తవుడిగా నీ జీవితం మొదలైన వెంటనే నీ లక్ష్యం నిర్దేశించబడుతుంది. చివరివరకు ఇదే నీ జీవితలక్ష్యంగా ఉంటుంది. నీ జీవితలక్ష్యం ప్రభువే. మన జీవితం క్రీస్తుతో మొదలై, క్రీస్తుతో ముగుస్తుంది. "క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారమగువరకు ... " (ఎఫెసీ 4:11-12) - ఇదే క్రైస్తవ జీవితలక్ష్యం. క్రైస్తవ జీవితం మన అంచనాలప్రకారం మన ఆలోచనలప్రకారం ఉండదు. దేవునిచిత్తాన్ని నెరవేర్చడం సేవకుని లక్ష్యం. సేవకుడు దేవునికి ప్రయోజనకరంగా ఉండాలి; నశించిపోతున్న ఆత్మల్ని రక్షించాలి; అయితే ఇది సేవకుడు తనకు తానుగా ఏర్పరుచుకున్న లక్ష్యంగా ఉండకూడదు. సేవకుని ఏకైక లక్ష్యం ప్రభువు చిత్తాన్ని నెరవేర్చడమే.

మన ప్రభువు జీవితంలో యెరూషలేముకు ప్రత్యేక స్థానం వుంది. మన ప్రభువు యెరూషలేములో సిలువమీద తన ప్రాణాన్నర్పించి తన తండ్రి చిత్తాన్ని పరిపూర్ణంగా నెరవేర్చాడు. మన జీవితంలో కూడా యెరూషలేమువంటి అనుభవం ఉంటే తప్ప మనం మన ప్రభువుతో అన్యోన్యసహవాసంలో ఉండలేం. మన ప్రభువు యెరూషలేముకు వెళ్లకుండా ఏదీ ఆయణ్ణి అడ్డుకోలేకపోయింది. మన ప్రభువునిందకు గురైనప్పుడు ఆయన ఆ ప్రదేశాలనుంచి హడావుడిగా తప్పించుకొని వెళ్లలేదు. మన ప్రభువుకు ఆదరణ లభించిన ప్రదేశాల్లో ఆయన ఎక్కువ కాలం గడపలేదు. "యెరూషలేమునకు వెళ్లుచున్నాము" - ఇదే మన ప్రభువు జీవిత లక్ష్యం. కృతజ్ఞతగానీ కృతఘ్నతగానీ మన ప్రభువును తన లక్ష్యానికి దూరంచేయలేదు.

"శిష్యుడు బోధకునికంటె అధికుడు కాడు; దాసుడు యజమానునికంటె అధికుడు కాడు" (మత్తయి 10:24). మన ప్రభువు "యెరూషలేమునకు" వెళ్లేటప్పుడు ఆయనకు ఏ అనుభవాలు ఎదురయ్యాయో, మనం "యెరూషలేమునకు" వెళ్లేటప్పుడు మనకు కూడా అవే అనుభవాలెదురవుతాయి. దేవునికార్యాలు మనద్వారా వెల్లడవుతాయి; ప్రజలకు ఆశీర్వాదం అందుతుంది. కొద్దిమంది మాత్రమే మనపట్ల కృతజ్ఞత చూపిస్తారు. అనేకులు మనం చేసిన మేలుల్ని మర్చిపోవడమే కాక, మన పట్ల కృతఘ్నత చూపిస్తారు. అయితే ఇవేమీ మన జీవితలక్ష్యానికి, అంటే మన "యెరూషలేము" ప్రయాణానికి మనల్ని దూరంచేయకూడదు.

"కపాలమనబడిన స్థలమునకు వచ్చినప్పుడు ... సిలువవేసిరి" (లూకా 23:33). మన ప్రభువుకు యెరూషలేములో ఎదురైన అనుభవం సిలువమరణం. సిలువమరణమే మన రక్షణకు ద్వారం. అయితే పరిశుద్ధులకు సిలువమరణం ఉండదుగానీ పలు శ్రమలుంటాయి. శ్రమలతర్వాత పరిశుద్ధులు పొందే అనుభవం "మహిమ". అయితే మన జీవితగమనంలో మనకు "యెరూషలేము" ప్రయాణం తప్పదు.

సెప్టెంబర్ 24

## "మొదట వెళ్లి .... "

నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీమీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము; అటుతరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము" (మత్తయి 5:23,24)

మనం సిద్ధపడి ఉన్నామనే ఆలోచన మనలో హఠాత్తుగా కలుగుతూ ఉంటుంది. అయితే సిద్ధబాటు హఠాత్తుగా జరిగేది కాదు. ఇది నిరంతరం సాగే సుదీర్ఘ ప్రక్రియ. మన ప్రస్తుత అనుభావాల్ని చూసి ప్రసన్నులమై సంతృప్తి చెంది ఇక ముందుకు కదలకపోతే మన ఆధ్యాత్మిక జీవితం ప్రమాదంలో పడుతుంది. క్రైస్తవ జీవితానికి కావలసినది సిద్ధబాటు, మరియు నిరంతరమైన సిద్ధబాటు.

క్రైస్తవ జీవితంలో త్యాగం ముఖ్యం. క్రైస్తవుడిగా క్రొత్త జీవితం ప్రారంభించిన వ్యక్తి త్యాగం విషయంలో పునర్విమర్శ చేసుకుంటాడు. యేసు క్రీస్తులోని వీరోచిత కార్యాన్ని (ఆయన సిలువమరణం) చూసి ఆయనవైపు ఆకర్షించబడిన వ్యక్తి ప్రభువు మాటల్ని పరిశీలనగా చూసినప్పుడు అతని ఉత్సాహం ఆవిరైపోతుంది. "మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము" అనే మాటలు అతనిలో నిరుత్సాహాన్ని కలిగించ వచ్చు. "మొదట వెళ్లి" అనే మాటలు నీ హృదయాన్ని పరిశోధించినప్పుడు త్యాగం నీవనుకుంటున్నట్టుగా వీరోచితంగా ఉండదు. దేవుని సేవకు అనర్హమైనదేదైనా నీలో ఉన్నట్లయితే దాన్ని పరిశుద్ధాత్మ వెంటనే గుర్తిస్తాడు. నీ అంతరంగ స్వభావం దేవునికి, పరిశుద్ధాత్మకు తప్ప మరెవరికీ తెలియదు. దేవునికి కనపడకుండా ఏమైనా నీవు దాచి పెట్టగలవా? ఆయన తన వెలుగులో నీ అంతరాత్మను పరిశోధించి చూస్తాడు. దేవుని వెలుగులో నీలో ఉన్న పాపం కనిపించినట్లయితే వెంటనే నీ పాపాన్ని ఒప్పుకో. నీ ప్రభువుకు నీ బోధకుడికి విధేయత చూపాలనుకుంటున్నావా? విధేయత చూపి విన్రముడిగా ఉండాలను కుంటున్నావా.

పరిశుద్ధాత్మ నిన్ను ఒప్పిస్తున్నప్పుడు అలక్ష్యంచేయకు. ఆయన నిన్ను పరిశోధిస్తున్నాడు. నీవు ఏవో పెద్ద విషయాలగురించి ఆలోచిస్తూ ఉండవచ్చు. అయితే దేవుడు నీ జీవితంలోని అతి చిన్న విషయాల్ని నీకు జ్ఞాపకం చేస్తున్నాడు. ఈ చిన్న విషయాల్లోనే నీలో ఉన్న అహం నిన్ను పరిశుద్ధాత్మకు విధేయత చూపకుండా అడ్డగిస్తూ ఉంటుంది. నీవు యేసు క్రీస్తుకు నిజమైన శిష్యుడిగా ఉండాలంటే నీవు నీ అనుదిన జీవితంలోని చిన్న విషయాల్లో కూడా పరిశుద్ధాత్మకు లోబడాలి. ఇదే నిన్ను సిద్ధబాటుకు నడిపిస్తుంది.

సెప్టెంబర్ 25

## "రెండు మైళ్లు వెళ్లుము"

"ఒకడు ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసినయెడల వానితో కూడ రెండు మైళ్లు వెళ్లుము" (మత్తయి 5:41)

మనలో మన ప్రభువు హృదయం ఉంటేనే తప్ప ఆయన కోరుకున్నది మనం చేయలేం. ఇతరులకు మనం మేలుచేయాలని మన ప్రభువు కోరుకుంటున్నాడు. తన శిష్యుల హృదయంలో ఇతరులపట్ల ఏ మాత్రం తిరస్కారభావం ఉండకూడదని ప్రభువు అభిమతం. ఇది ఆయన అభ్యర్థన కాదు; ఆజ్ఞవంటిదే. ఇతరులు మనపట్ల అన్యాయంగాను కఠినంగాను కర్కశంగాను ప్రవర్తించినప్పటికీ మనం మాత్రం వారిపట్ల సౌమ్యంగానే ఉండాలని మన ప్రభువు కోరుకుంటున్నాడు. యేసు క్రీస్తు మనమీద ఉంచిన భారం మనలో ఏ మాత్రం ఉత్సాహం కలిగించదు. ఈ భారాన్ని మనం యేసు క్రీస్తుతో వ్యక్తిగతమైన అన్యోన్యత కలిగి ఉన్నప్పుడు మాత్రమే మోయగలం. ఈ అన్యోన్యత మనలో ఒకే ఒక లక్ష్యాన్నుంచుతుంది. "దేవుడు నన్ను ఎక్కడికి పంపిస్తే అక్కడికి వెళ్లడమే నా లక్ష్యం" అని నేను చెప్పినప్పుడు నాకు ప్రభువుతో అభిలషణీయమైన అన్యోన్యత ఉందని అర్థం. నా అన్యోన్యత పరీక్షలో నెగ్గిందని అప్పుడు నేను చెప్పగలను. అప్పుడు ప్రభువు నాలో ఉంచిన లక్ష్యం తప్ప నా కళ్లకు ఇంకేమీ కనబడవు.

కొండమీద ప్రసంగం సాధించలేని లక్ష్యం కాదు. యేసు క్రీస్తు నా స్వభావాన్ని మార్చి, తన స్వభావాన్ని నాలో ఏర్పరచినప్పుడు ఏం జరుగుతుందో కొండమీద ప్రసంగం తేటతెల్లంగా చెబ్తోంది. కొండమీద ప్రసంగాన్ని యేసు క్రీస్తు, మరియు ఆయన స్వభావం కలిగి ఉన్నవారు మాత్రమే కార్యరూపంలో పెట్టగలరు.

మనం యేసుకు నిజమైన శిష్యులుగా ఉండాలనుకుంటున్నట్లయితే మనలో మార్పు అవశ్యం. ఈ మార్పు పరలోకసంబంధమైన మార్పు మాత్రమే. ఎందుకంటే మనంతట మనం ఆయనకు శిష్యులుగా మారలేం. "మీరు నన్ను ఏర్పరచుకొనలేదు ... నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని" (యోహాను 15:16) అని యేసు ప్రభువు చెబ్తున్నాడు. ఇది దేవుని కృపవలన కలిగే కార్యం. మనలో ఉన్న సహజజ్ఞానం దేవునికి అక్కర్లేదు; మన శక్తిసామర్థ్యాల్ని దేవుడు కోరుకోడు. ఆయన మనల్ని ఎందుకు పిలిచాడో ఆ పనుల్నే మనం చేయాలని దేవుడు కోరుకుంటున్నాడు. ఒక రకంగా ఇది మన సిలువను మనం మోయడం వంటిది. ప్రభువుకొరకు మన సిలువను మనం మోయడం కష్టమే అయినప్పటికీ మన ప్రభువు కృప మూలంగా అది అసాధ్యం మాత్రం కాదు.

సెప్టెంబర్ 26

## "వెళ్లి ... సమాధానపడుము"

"నీమీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల ... " (మత్తయి 5:23)

"నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీమీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల ... ", దేవుని ఆత్మ నీ హృదయానికి ఏదైనా గుర్తుచేసినట్లయితే "అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము ... " (మత్తయి 5:24). ఇది మన ప్రభువు ఆదేశం. దేవుని ఆత్మ నీ హృదయంలో తీవ్ర ప్రకంపనల్ని పుట్టించినప్పుడు ఆయన ఆత్మకు ఆటంకపర్చకు. దేవుడు తన ఆత్మద్వారా ప్రతి చిన్న విషయాన్ని నీకు బోధపరుస్తాడు.

"మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము ... " - మన ప్రభువు చాలా సూటిగా చెబ్తున్నాడు. మనం సమాధానపడాలని దేవుడు కోరుకుంటున్నాడు. బలిపీఠాన్ని చేరుకోడానికి మనం ఎంత దూరం వచ్చామో అంత దూరం వెనక్కు వెళ్లి మనల్ని బాధించిన సహోదరుడితో సమాధానపడి మళ్లీ వెనక్కు రావాలి. ఎందుకంటే నీ సహోదరుడు నీతో సమాధానపడలేడు కాబట్టి నీవే అతనితో సమాధానపడాలి. సమాధాన పడడం నీ జీవితంలో శ్వాసతీసుకున్నంత సహజంగాను సులువుగాను ఉండాలి. యేసు ప్రభువు నీ సహోదరుడ్ని నీ దగ్గరకు పంపడు; నిన్నే నీ సహోదరుడి దగ్గరకు పంపిస్తున్నాడు. నిజమైన శిష్యుడు తన హక్కులగురించి ప్రభువు దగ్గర మాట్లాడకూడదు గానీ, ఆయన దగ్గర తన హక్కుల్ని కోల్పోడానికి సిద్ధపడాలి. ఇదే నిజమైన శిష్యత్వం. ఇదే నిజమైన విధేయత.

"అటు తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము ... " - నీవు నీ సహోదరుడితో సమాధానపడడాన్ని యేసు ప్రభువు నీకొక స్పష్టమైన ప్రక్రియగా చూపిస్తున్నాడు. మన హక్కుల్ని మనం త్యాగంచేయడం మొదటి మెట్టు; దేవుని ఆత్మ మన హృదయాన్ని నిర్బంధించడం తరువాయి మెట్టు; పరిశుద్ధాత్మ మన హృదయాన్ని ఒప్పించినప్పుడు దేవునికి విధేయత చూపడం తదుపరి మెట్టు. నీపట్ల నిర్దయ చూపిన నీ సహోదరుడి తప్పును క్షమించి అతనితో సమాధానపపడం ఆఖరి మెట్టు. అనంతరం నీ అర్పణ దేవునికి అమితమైన ఆనందాన్నిస్తుంది.

సెప్టెంబర్ 27

## “నీ వెంట వచ్చెదనని ”

“ఒకడు -నీవెక్కడికి వెళ్లినను నీ వెంట వచ్చెదనని” (లూకా 9:57)

ఈ మాటలు పలికిన వ్యక్తి మన ప్రభువు జవాబు విని నిరుత్సాహపడ్డాడు. అతని అంతరంగం మన ప్రభువుకు తెలుసు గనక ఆయన అతనిలో అలా మాట్లాడాడు. “ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు ... ” (యోహాను 2:24). “ప్రభువు అతణ్ణి సంపాదించుకొనే అవకాశాన్ని వదిలిపెట్టాడు. అతను నిరుత్సాహంతో వెనక్కు వెళ్లిపోయాడు. ప్రభువు ఎందుకిలా చేశాడో నా ఊహకందడం లేదు” అని మనం చెబ్తామేమో! మన ప్రభువు ఎవరినీ నిరుత్సాహపర్చడు. అయితే మన ప్రభువు మాటలు అతణ్ణి నొప్పించి ఉండవచ్చు. అతను బాధపడడం సహజమే. అయితే అతనిలో మన ప్రభువు ఏం కోరుకున్నాడో దానిపట్ల విధేయత చూపడానికి అతను సిద్ధంగా లేడు. అతను మన ప్రభువు వెంట వస్తానని అన్నాడు గానీ అతను మన ప్రభువు వెంట రావడానికి ముందు వదిలిపెట్టవలసినవి చాలా ఉన్నాయి. అందుకే మన ప్రభువు మాటలు అతణ్ణి నిరుత్సాహపర్చి ఉండవచ్చు. మన ప్రభువు అతణ్ణి ఆక్షేపించలేదు గానీ అతనితో సూటిగా మాట్లాడాడు. మన ప్రభువు జవాబులో ఆవేశం లేదు. పరిశుద్ధాత్మ మన ప్రభువు మాటల్ని నీకు గుర్తు చేసినప్పుడు అవి నిన్ను నొప్పించినట్లయితే ఆయన నిన్ను సరిదిద్దాలనుకుంటున్నాడని ఆలోచించు; నీలో గతించవలసినవి చాలా ఉన్నాయని తెలుసుకో.

**లూకా 9:58** - యేసు క్రీస్తును సేవించాలనే వాదనను ఈ మాటలు నిరుత్సాహ పరుస్తాయి. ఎందుకంటే తప్పించుకోవాలనుకొనేవారికి ఈ మాటలు అనుకూలంగా ఉంటాయి. అయితే మన ప్రభువు ఈ మాటలు చెప్పడంలో ఆంతర్యం మన జీవితంలో ఆయనకు తప్ప అన్యమనస్కతలకు చోటు ఉండకూడదనే ఉద్దేశమే. “మనుష్య కుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలము లేదని” మన ప్రభువు అతనితో అన్నాడు. మన ప్రభువు నీ హృదయంలో తలవాల్చుకోడానికి ఆయనకు నీవు చోటిస్తున్నావా? చోటివ్వకుండా ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడికి వస్తానని చెబ్తున్నట్లయితే ఆయణ్ణి నీవెలా సేవించగలవు?

**లూకా 9:59** - ఈ వచనంలోని వ్యక్తికి ప్రభువును నిరుత్సాహపర్చడం ఇష్టం లేదు. ఈ **వ్యక్తి తన తండ్రిపట్ల కూడా గౌరవం చూపించాలనుకుంటున్నాడు. ప్రభువు మనల్ని** పిలిచినప్పుడు మనం ప్రభువుకు విధేయత చూపే ముందు ఈ వ్యక్తిలాగా ఇతరమైనవాటిపట్ల విధేయత చూపుతున్నామా? మన ప్రభువుకు చివరి స్థానాన్నిస్తున్నామా? నీ విధేయతలు ఒకదానితో ఒకటి పోటీపడినప్పుడు ఎంత వ్యయమైనా సరే ముందు ప్రభువుకు విధేయత చూపు.

**లూకా 9:61** - “ప్రభువా, నీ వెంట వచ్చెదను గాని .... ”. ఇతను ప్రభువు వెంట వెళ్లాలనుకుంటున్నాడు గానీ వెళ్లలేడు. ఎందుకంటే ప్రభువు వెంట వెళ్లే విషయంలో ఇతని ఆలోచనలు ఇతనికున్నాయి. ప్రభువు నిన్ను పిలిచినప్పుడు నీవు కుటుంబ సభ్యులకు వీడ్కోలు చెప్పవలసిన పని లేదు. ఎందుకంటే వీడ్కోలు పలకడం నిన్ను ప్రభువు పిలిచిన పిలుపుకు దూరం చేస్తుంది. విచారణలతో వీడ్కోలులతో క్రైస్తవునికి పని లేదు. దేవుడు నిన్ను పిలిచిన వెంటనే తత్క్షణమే బయలుదేరి వెళ్లు. ఇంట్లో ఆగిపోకు.

సెప్టెంబర్ 28

## "నీవు వెళ్లి .... బీదలకిమ్ము"

"యేసు అతని చూచి అతని ప్రేమించి -నీకు ఒకటి కొదువగా నున్నది; నీవు వెళ్లి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము ... నీవు వచ్చి నన్ను వెంబడించుమని చెప్పెను" (మార్కు 10:21)

ధనవంతుడైన యువ అధికారికి పరిపూర్ణతపట్ల మక్కువ ఉంది. అతను యేసు క్రీస్తును చూసినప్పుడు ఆయనలో ఉన్న పరిపూర్ణత అతణ్ణి ఆకర్షించింది. తాను కూడా యేసులాగా పరిపూర్ణుడిగా ఉండాలని ధనవంతుడైన యువ అధికారి కోరిక. మన ప్రభువు తన దగ్గరకు వచ్చేవారిలో వ్యక్తిగత పరిశుద్ధత ఉండాలని కోరుకోడంలేదుగానీ, వారిలో రిక్తతను మరియు పరిత్యాగాన్ని మాత్రమే ఆయన కోరుకుంటున్నాడు. మన హక్కుల్ని మనం విసర్జించి, మనల్ని మనం పూర్తిగా రిక్తుల్ని చేసుకోవాలని మన ప్రభువు కోరిక. మన ప్రభువుతో మనకున్న అన్యోన్యత ముందు ఏ సంబంధబాంధ్యవాలు గొప్పవి కావు. లూకా 14:26 వచనం రక్షణగురించి పరిశుద్ధతగురించి మాట్లాడడంలేదు గానీ యేసు క్రీస్తుపట్ల మనం షరతుల్లేని అన్యోన్యత చూపాలని చెబ్తోంది. మనలో కొద్దిమందికి మాత్రమే నిర్నిబంధమైన అన్యోన్యత తెలుసు; కొద్దిమందికి మాత్రమే తమను తాము రిక్తుల్ని చేసుకొని యేసుకు లోబడడం తెలుసు.

"యేసు అతని చూచి అతని ప్రేమించి ... " (మార్కు 10:1). యేసు ప్రభువు నీవైపు ప్రసరించిన ప్రేమదృక్కులు నీ దృష్టిని అన్యధా మరల్చగలవా? యేసు దృక్కులు నీ అంతరంగంలోకి చొచ్చుకుపోయి ఆయనకు నిన్ను బందీని చేస్తాయి. యేసు దృక్కులు నిన్ను రూపాంతరీకరిస్తాయి. యేసు నీవైపు ప్రసరించిన చూపులు నీలోని కఠినత్వాన్ని కర్కశాన్ని రూపుమాపి నీలో మార్దవాన్ని నింపుతాయి. యేసు నీవైపు ప్రేమతో చూచినతర్వాత నీవు దుర్భేద్యంగా ఉండగలవా? నీలో ఇంకా కక్ష కార్పణ్యం ఉండగలవా? ఆయన చూపులు తాకని స్థలం నీలో ఉంటుందా?

"నీకు ఒకటి కొదువగా నున్నది ... " - యేసు క్రీస్తుకు నీలో ఏది కొదువగా కనిపిస్తోంది? ఆయనతో నీకు ఉండవలసిన అన్యోన్యత కాదు గదా!

"నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము ... " - నీకు అతిశయం కలిగించేవాటన్నిటినీ వదిలించుకో. నిన్ను నీవు సజీవయాగంగా అర్పించుకో. నీకు ఉన్నవన్నీ వదిలిపెట్టి రిక్తుడిగా మారు. "నీవు వచ్చి నన్ను వెంబడించు ... " - ఆయన నడిచిన బాటలో, ఆయన అడుగుజాడల్లో నడువు.

సెప్టెంబర్ 29

## పిలుపుపట్ల జాగృతి

"సువార్తను ప్రకటింపవలసిన భారము నా మీద మోపబడియున్నది. అయ్యో, నేను సువార్తను ప్రకటింపకపోయినయెడల నాకు శ్రమ" (1 కొరింథీ 9:16)

రక్షణ మరియు పరిశుద్ధత వేరు, దేవుని పిలుపు వేరు. నీవు పరిశుద్ధత పొంది ఉన్నావు కాబట్టి దేవుడు నిన్ను సువార్త ప్రకటించడానికి పిలుస్తున్నాడని ఆలోచించకు. సువార్త ప్రకటించే విషయంలో దేవుని పిలుపు మనం గణించలేనంత భిన్నంగా ఉంటుంది. సువార్త ప్రకటించడంకొరకు తానందుకున్న పిలుపును పౌలు తన కప్పగించబడిన భారంగా పరిగణిస్తున్నాడు. పిలుపు మన ఇచ్ఛకు సంబంధించినది కాదు. పిలుపు దేవుని ఇష్టానికి ఆయన సంకల్పానికి చెందినది. "నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని" (యోహాను 15:16) అని యేసు ప్రభువు చెబుతున్నాడు. నీవు ఊహించని పరిస్థితుల్లో, నీవు ఎదురుచూడని సందర్భాల్లో,నీ అంచనాలకు అందని విధంగా హఠాత్తుగా దేవుడు నిన్ను పిలుస్తాడు. దేవుడు నిన్ను పిలుస్తున్నాడని నీవు గుర్తించినప్పుడు, పిలుపుపట్ల నీలో స్పృహ ఉన్నప్పుడు నీలో ఒక అద్భుతమైన ప్రకాశం ప్రసరిస్తుంది. ఇది పరలోకసంబంధమైన ప్రకాశం. నీలో కలిగిన ఈ ప్రకాశాన్ని నీవు మాటల్లో వర్ణించలేవు. ఎందుకంటే ఇది మాటలకందని అలౌకికమైన అనుభవం. దేవుడు తమను పిలుస్తున్నాడని కొంతమంది హఠాత్తుగా ఉరుము ఉరిమినట్టుగా తెలుసుకుంటారు. మరి కొంతమంది కాలక్రమేణా అంచెలంచెలుగా దేవుని పిలుపును గుర్తిస్తారు. దేవుడు నిన్ను ఎక్కడ ఏ సందర్భంలో పిలిచాడో నీవు సూటిగా చెప్పగలవా? మన జీవితానికి దేవుని పిలుపుకు అవినాభావసంబంధం ఉన్నప్పుడు ఆయన మనల్ని ఎప్పుడు పిలిచాడో కూడా మనకు గుర్తుండదు.

ఒక వేళ నీవు దేవుని పిలుపును నిర్లక్ష్యం చేసినట్లయితే ఒక సారి నిన్ను నీవు పరీక్షించుకో. ఆయన పిలుపును విడిచిపెట్టి, సేవలో నీ స్వంత ఆలోచనల్ని ప్రవేశపెట్టావా? ఆయన పిలుపుపట్లకంటె నీ స్వంత సామర్థ్యాలమీద ఎక్కువగా మనసు పెడుతున్నావా? "అయ్యో, నేను సువార్తను ప్రకటింపకపోయినయెడల నాకు శ్రమ" - ఇది పౌలు అనుభవం. పౌలులో దేవుని పిలుపుపట్ల జాగృతి ఉంది. "సువార్తను ప్రకటింప వలసిన భారము నా మీద మోపబడియున్నది" - సువార్త ప్రకటించడాన్ని తన మీద మోపబడిన భారంగా పౌలు భావిస్తున్నాడు. పౌలు జీవితంలో దేవుని పిలుపుతో పోటీకి వచ్చేది ఏదీ లేదు!

దేవుడు మనల్ని పిలిచినప్పుడు మనమెటువంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఆయన తన ఉద్దేశాలు నెరవేరేలా ప్రతి పరిస్థితినీ చక్కదిద్దుతాడు. నీవు దేవుని పిలుపుతో ఏకీభవించి నప్పుడు నీ బాహ్యజీవతంలోను నీ అంతరంగంలోను దేవుని స్వరం నీ స్వరం మిళితమై ఏకస్వరంగా ఉంటాయి. ఈ సమరసభావనను నీ అంతట నీవు సాధించలేవు.

సెప్టెంబర్ 30

## దేవుని పిలుపు నీకప్పగించినవి

"ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరముకొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నావంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (కొలొస్స 1:24)

దేవునికొరకు పనిచేయాలనే మన స్వంత ఆలోచనల్ని మన స్వంత నిర్ణయాల్ని మనం దేవుని పిలుపుగా చెబ్తుంటాం. అయితే మనం దేవునితో సరైన అన్యోన్యతలోకి వచ్చినప్పుడు ఆయన మన స్వంత ఆలోచనల్ని మన స్వంత నిర్ణయాల్ని ప్రక్కన పెడ్తాడు. ఇంతవరకు మనం ఊహించని విధంగా ఆయన మన దృష్టిని తన పిలుపుమీదకు మళ్లిస్తాడు. ఆయన పిలుపు ఆయన ఉద్దేశాలు మన కళ్లముందు సాక్షాత్కరిస్తాయి. అప్పుడు మనం యెషయాలాగా "చిత్తగించుము నేనున్నాను నన్ను పంపు"మని చెప్పగలం (యెషయా 6:8).

వ్యక్తిగత పరిశుద్ధత వేరు, దేవుని పిలుపు వేరు. దేవునికొరకు మనం రొట్టెలాగా విరవబడాలని, ద్రాక్షారసంలాగా పోయబడాలని ఆయన కోరుకుంటున్నాడు. అయితే మనం నలగగొట్టబడకుండా ద్రాక్షారసంగా మారలేం. మనలోంచి ఆధ్యాత్మిక మాధుర్యాన్ని వెలుపలికి తీసేందుకు దేవుడు మనకు కొన్ని కష్టసమయాల్ని క్లిష్టమైన సందర్భాల్ని రప్పిస్తాడు. అయితే ఏ సమయాల్లోనైనా ఏ సందర్భాల్లోనైనా ఆయనకొరకు నలిగిపోడానికి సిద్ధమవ్వాలి. మనం నలిగినప్పుడే రొట్టెలాగా ద్రాక్షారసంలాగా మారగలం. అయితే మనం ఎక్కడ నలిగిపోవాలో అది మన ఇష్టం కాదు. అది దేవుని ఇష్టానికి వదిలిపెట్టబడిన కార్యం.

దేవుడు మనల్ని ద్రాక్షారసంగా మార్చాలనుకుంటున్నప్పుడు నీవు ద్రాక్షపండ్లలాగా ఆయన చేతిలోకి ఒదిగిపోతావా? లేక, గులకరాళ్లలాగా ఆయన చేతికి గట్టిగా తగిలి వేళ్ల సందుల్లోంచి క్రిందకు జారిపోతావా? దేవునికొరకు మనం ద్రాక్షారసంగా మారడానికి ముందు ఆయనతో సరైన సంబంధాన్ని కలిగి ఉండడానికి సిద్ధపడాలి. ఎందుకంటే ద్రాక్షలు పరిపక్వం కానట్లయితే రసంలో మాధుర్యం ఉండదు. దేవునిలో నిలిచి ఉండు. ఆయన సన్నిధిలో నిలిచి ఉండు. నీ జీవితంలో ఆయన ఇష్టాల్ని ఆయన ఇచ్ఛల్ని నెరవేరనివ్వు. ఆయన నిన్ను అనేకులకు ఆశీర్వాదకరంగా మలచాలనుకుంటున్నాడు. ఆయనతో సమ్మతించు.

అక్టోబర్ 1

## మహిమ ప్రదేశం

"యేసు ... వెంటబెట్టుకొని, యెత్తయిన యొక కొండమీదికి ఏకాంతముగా వారిని తోడుకొనిపోయి ... " (మార్కు 9:2)

కొండమీద ప్రశంసలు పొందిన అనుభవాలు మనందరి జీవితాల్లో ఉంటాయి. మనం దేవునివైపునుంచి చూసి, కొండమీదనే ఉండిపోవాలనుకున్న సందర్భాలు కూడా ఉంటాయి. అయతే దేవుడు మనల్ని కొండమీద శాశ్వతంగా ఉండనివ్వడు. మన ఆధ్యాత్మిక జీవితం కొండమీద కాదు; కొండ క్రిందనే. కొండపైన అనుభవంతో కొండ క్రింద అనుదిన జీవితాన్ని గడపడమే నిజమైన ఆధ్యాత్మికత. మన ఆధ్యాత్మికతకు పరీక్ష కొండపైన కాదు; కొండ క్రిందనే. కొండపైన దేవుని సమక్షంలో గడపడం మన జీవితంలో ఒక అత్యద్భుతమైన అనుభవం; ఇది మర్చిపోలేని అనుభూతి! అయితే మనం కొండ దిగి దావాలి. కొండ క్రింద మనకు దయ్యంపట్టిన వ్యక్తి ఎదురు కావచ్చు (9:14-18 వచనాలు చూడండి). మనకు కొండమీద అనుభవాలు సూర్పినిచ్చే సంఘటనలు మాత్రమే; ఇవి మధురమైన అనుభవాలు మాత్రమే. దేవుడు మనం కొండక్రింద జీవించడానికి పిలిచాడు. మన వాస్తవజీవితం కొండ క్రిందనే. ఇక్కడే మనం మన సహనాన్ని మన దార్ఢ్యాన్ని చూపించాలి. అయితే ఆధ్యాత్మిక విషయాల్లో మనలో ఉన్న స్వార్థం కొండమీద అనుభవాల్నే మాటిమాటికీ కోరుకుంటుంది. మనం కొండమీదనే ఉన్నట్లయితే మనం కూడా పరిపూర్ణుల్లాగా ఉంటామని ఆలోచిస్తుంటాం. అయితే కొండమీద అనుభవాలు అరుదైన అనుభవాలు; మన జీవితంలో వీటికొక ప్రత్యేక స్థానముంది. ఈ అనుభవాలే సర్వస్వం, ఇవే ముఖ్యం అని మనం ఆలోచిస్తే మనలో ఆధ్యాత్మిక విషయాల్లో స్వార్థం పెరుగుతుంది.

కొండమీద అనుభవాల్ని మన ప్రసంగాల్లో పొందుపరిస్తే ఉపయోగకరమైన బోధగా ఉంటుందని మనం ఆలోచిస్తుంటాం. వాస్తవానికి ఇవి బోధకంటె మిక్కిలి అధికమైనవి. అంటే ఇవి మనలో సద్వర్తనను పెంపొందించాలి. కొండమీద అనుభవాలు బోధకొరకు కాదు. ఇవి మన ఆధ్యాత్మిక ప్రకాశం కొరకే. "అయితే కొండ మీద అనుభవం వల్ల నాకు లాభమేంటి?" అని అడిగే ఉచ్చులో పడకు. ఆధ్యాత్మిక విషయాల్లో లాభనష్టాల్ని బేరీజు వేయడం సరికాదు. కొండమీద అనుభవాలు మన జీవితంలో ప్రకాశవంతమైన మధురానుభవాలు మాత్రమే; దేవుని ఉద్దేశాల్ని వెల్లడించే అరుదైన అద్భుతాలు మాత్రమే!

అక్టోబర్ 2

## చిన్నబుచ్చుకున్న స్థలం

"ఏమైనను నీవలననైతే మామీద కనికరపడి మాకు సహాయము చేయుమనెను" (మార్కు 9:22)

అద్భుతమైన మరియు అలౌకికమైన అనుభవం యెదురైన ప్రతి సారీ మనం వెనువెంటనే హఠాత్తుగా వాస్తవ పరిస్థితుల్లోకి నెట్టివేయబడతాం. వాస్తవ పరిస్థితులు నిరాశాజనకంగా ఉండి మనకు ఏ మాత్రం ఆహ్లాదాన్నివ్వవు. లోయ ఎంత లోతుగా ఉందో, కొండ శిఖరం అంత ఎత్తుగా ఉంటుంది. అయితే మనం దేవుని మహిమను ప్రతిఫలించవలసిన ప్రదేశం కొండ శిఖరం కాదు; కొండ దిగువన ఉన్న లోయలోనే. కొండ శిఖరంమీద దేవుని మహిమను చూస్తాం. అయితే అక్కడ మనం నివసించడానికి వీల్లేదు. కొండక్రింద మన అనుదిన జీవిత సందర్భాల్లో, అనునిత్యం మనల్ని చిన్నబుచ్చే పరిస్థితుల్లో మనం దేవుని మహిమను ప్రతిఫలించాలి. ఇదే మన నివాసస్థలం. ఇక్కడే మనలో ఉన్న విశ్వాసం వెల్లడి కావాలి. ఆధ్యాత్మిక ఉద్విగ్నతల మధ్య గొప్ప పనులు చేయగలమని చాలా మంది ఆలోచిస్తుంటారు. ఇది ఒక రకంగా స్వార్థం వంటిదే. అయితే దేవుడు మనకు సిద్ధపర్చిన స్థలం మనం చిన్నబుచ్చుకొనే సంఘటనలు సందర్భాలు ఉన్న అనుదిన జీవితం. ఇక్కడే మనం దేవునితో అన్యోన్యత కలిగి జీవించాలి. కొండమీద ఎప్పటికీ ఉంటే చాలా బాగుంటుందని పేతురు ఆలోచన. అయితే యేసు ప్రభువు శిష్యుల్ని కొండ దిగువకు తీసుకొని వెళ్లాడు. కొండ దిగువనే ఆయన శిష్యులకు దర్శనభావాన్ని వివరించాడు (9:5,6,14 - 23 వచనాలు చూడండి).

"ఏమైనను నీవలననైతే ... " - యేసు ఎవరో నీవు తెలుసుకొనేవరకు ఆయనకున్న శక్తిప్రభావాల్ని నీవు సందేహిస్తావు. కొండమీద ఆయన శక్తిని ఆయన ప్రభావాన్ని కళ్లారా చూశావు. అక్కడ ఆయన శక్తిని ఆయన ప్రభావాన్ని పూర్తిగా నమ్మావు. అయితే కొండ క్రిందకు దిగి వచ్చిన తర్వాత వాస్తవపరిస్థితుల్లో ఆయన శక్తిప్రభావాలనెందుకు నమ్మడం లేదు! నీ స్వంత అనుభవాన్ని గుర్తు తెచ్చుకో. నీవు చిన్నబుచ్చుకొనే సందర్భా లెదురయ్యాయా? నీ అనుదిన జీవితంలో యేసును సందేహించావా? నీ పరిశుద్ధత గురించి నీవు గొప్పగా సాక్ష్యం చెప్పవచ్చు! అయితే నీవు చిన్నబుచ్చుకున్న సందర్భాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నావా? కొండ మీద యేసు మహిమను చూసిన తర్వాత కూడా నీవు చిన్నబుచ్చుకొనే పరిస్థితులెదురయ్యా యని యేసును సందేహిస్తున్నావా?

అక్టోబర్ 3

## పరిచర్య స్థలం

"అందుకాయన -ప్రార్థనవలననే గాని మరి దేనివలననైనను ఈ విధమైనది వదలిపోవుట అసాధ్యమని వారితో చెప్పెను" (మార్కు 9:29)

శిష్యులు "మేమెందుకు ఆ దయ్యమును వెళ్లగొట్టలేకపోతిమని ఏకాంతమున ... " (9:28) యేసు ప్రభువు నడిగారు. జవాబు శిష్యులకు ప్రభువుకు మధ్య ఉన్న వ్యక్తిగత అన్యోన్యతకు సంబంధించినది. "ప్రార్థనవలలనే గాని మరి దేనివలననైనను ఈ విధమైనది వదలిపోవుట అసాధ్యమని" ప్రభువు చెప్పాడు. ప్రభువుమీద దృష్టి నిలిపి ఆయననుంచి మనం పొందే రెట్టింపు శక్తి ద్వారా మాత్రమే ఇది సాధ్యం. ఈ సంఘటన లోని శిష్యుల్లాగా మనం కూడా దేవుని శక్తిని ఆధారం చేసుకోకుండా దేవుని కార్యాల్ని చేయాలనుకున్న సందర్భాలుంటాయి. అయితే శిష్యుల్లాగానే మనం కూడా విఫలమై ఉంటాం. దేవుని ఉద్దేశాల ప్రకారం కాక మన స్వంతఆలోచనలప్రకారం నడిచి మనం ఏమీ సాధించలేని సందర్భాలు అనేకం వుంటాయి. దేవుణ్ణి సేవించాలనే ఆతృతతో ఆయన గురించి, ఆయన ఉద్దేశాలగురించి తెలుసుకోకపోవడం వాస్తవానికి దేవునికి అగౌరవాన్ని కలిగించడంతోబాటు మనల్ని చిన్నబుచ్చుతుంది.

మనం పరిష్కరించలేని కష్టం మనకు ముఖాముఖిగా ఎదురైనప్పుడు, మనం చేయవలసినది ఒక్కటే. విడుదల క్రీస్తుకు మాత్రమే సాధ్యమని నమ్మడం! సేవలోను పరిచర్యలోను నీకు క్రీస్తుకు మధ్య ఉన్న అన్యోన్యతకు భంగం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండు! నీకు క్రీస్తుకు మధ్య ఇప్పుడేదైనా ఆటంకంగా ఉందా? ఏదైనా ఆటంకంగా ఉన్నట్లయితే వెంటనే దాన్ని తొలగించు. ఆటంకంగురించి పదే పదే ఆలోచిస్తూ విసుగు చెందకు. ప్రతి అడ్డునూ తొలగించుకొని యేసు క్రీస్తు సన్నిధిలో ప్రవేశించు. ఆయణ్ణి నీవు ముఖాముఖిగా చూసినప్పుడు ఇప్పటివరకు నీకూ ఆయనకు మధ్య ఉన్న అడ్డులు ఆటంకాలు పటాపంచలౌతాయి.

"వారు పక్షిరాజులవలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు" (యెషయా 40:31) - మనం కొండపైకి ఎక్కి వెళ్లినట్లే కొండదిగి రావడం కూడా నేర్చుకోవాలి. కొండ క్రింద ఎదురయ్యే సమస్యల్లోనే సంఘర్షణల్లోనే పరిశుద్ధుడవైన నీవు యేసుతో అన్యోన్యత కలిగి జీవించాలి. "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీ 4:13) అని పౌలు తన అనుభవంగురించి మాట్లాడుతున్నాడు. పౌలు మాటల్లో అతనికెదురైన అనుభవాలు అతణ్ణెంతగా చిన్నబుచ్చాయో అంతర్లీనంగా అర్థమౌతోంది. మనం కావాలనుకోకపోయినా చిన్నబుచ్చుకొనే పరిస్థితులు మనకెదురవుతాయి. వీటిని మనం తప్పించుకోలేం. "నేను కొండమీదనే ఎప్పటికీ ఉంటాను" అని మనం చెప్పకూడదు! యేసు క్రీస్తు వెలుగులో ఉన్న నీవు నీకెదురయ్యే వాస్తవాల్ని ధైర్యంతో ఎదుర్కొంటున్నావా? లేక, సడలిన విశ్వాసంతో సంశయాలతో భయాందోళనల్లో మునిగి ఉన్నావా?

అక్టోబర్ 4

## దర్శనం, మరియు వాస్తవం

"పరిశుద్ధపరచబడినవారై పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారికిని ... "
(1 కొరింథీ 1:2)

మనం దేవుని ఉద్దేశాల్ని తెలుసుకోలేని సమయాలు మన జీవితంలో అనేకం వుంటాయి. దర్శనం మరియు కొండమీద మనకు కలిగిన దివ్యానుభూతి మన స్వభావంలో మన నడవడికలో అంతర్భాగం కావాలి. ఈ పని దేవునిది కాదు. ఇది మనం చేయవలసిన పని. కొండమీద మనం పొందిన అద్భుతమైన అనుభవాన్ని పదే పదే జ్ఞాపకం చేసుకుంటూ కొండశిఖరం మీదే విశ్రమిస్తే అనుదిన జీవితంలో మనం నిష్ప్రయోజకులుగా మిగులుతాం; పారవశ్యంలో తలమునకలుగా ఉంటే వాస్తవ పరిస్థితుల్లో నిష్ఫలులమౌతాం. కొండమీద మనం చూసిన దర్శనాన్ని మనకెదురయ్యే వాస్తవ పరిస్థితుల్లో కార్యరూపంలో పెట్టాలి. దర్శనం మన జీవితంలో సంపూర్ణంగా ఆవిష్కృతమయ్యేవరకు దర్శనపు కాంతిలో మనం నడుస్తూ వాస్తవ జీవితంలో ఎదురయ్యే ఎగుడుదిగుళ్ల నెదుర్కోవాలి. దేవుడు మనకు ఇందుకే తర్ఫీదు నిస్తున్నాడు. దేవుడు మనలో ఏం కోరుకుంటున్నాడో ఆయన వాటిని మనకు వెల్లడిచేస్తున్నందుకు ఆయనకు వందనాలు!

మన జీవితంలో మనం దృష్టించలేని మనం స్పృశించలేని కోణాల్ని దేవుడు దృష్టిస్తున్నందుకు ఆయన స్పృశిస్తున్నందుకు దేవునికి వందనాలు. నీకు దర్శనం వుంది. అయితే ఆ దర్శనం నీ జీవితంలో ఎలా వాస్తవమవుతుందో నీకు తెలియదు. కొండమీద దర్శనాన్ని కొండమీదే కార్యరూపంలో పెట్టలేం. దర్శనం వాస్తవం కావాలంటే మనం కొండదిగి రావాలి. దర్శనం నెరవేరాలంటే ఎగుడుదిగుళ్లు ఆటుపోట్లు ఎదుర్కోక తప్పదు. మనమేమై ఉన్నామో మనం గ్రహించిన తర్వాత, దేవుడు మననుంచి ఏం కోరుకుంటున్నాడో మనం తెలుసుకున్న తర్వాత దేవుని దర్శనాన్ని మన జీవితంలో వాస్తవం చేయడానికి ఇంకా మనలో ఏమైనా అడ్డులు ఆటంకాలు సందేహాలు సంశయాలు ఉన్నాయా? ప్రతి రోజూ మనకెదురయ్యే సంఘటనల్లో మనకెదురయ్యే మనుషులద్వారా మనం నలిగిపోక తప్పదు.

దేవుడు మనకు ఇష్టంలేని పని నేదైనా మనల్ని చెయ్యమన్నప్పుడు మనం రుసరుసలాడడం పళ్లు బిగించడం మామూలే. అయితే "నేను ఉన్నవాడను అనువాడనైయున్నానని ... " (నిర్గమ 3:14) తనగురించి వెల్లడి చేసిన దేవుడు మనల్ని పంపిస్తున్నాడని జ్ఞాపకం చేసుకోవాలి. అధికారం ఆధిపత్యం ప్రభుత్వం దేవునివి. ఆయన సర్వశక్త దేవుడు. మన జీవితంలో పై మాట దేవునిదే; మనది కాదు! మనం ఎక్కవలసిన ఉన్నతమైన మెట్లున్నాయి; మనం ఈదవలసిన మురుగు కాలువలు కూడా ఉన్నాయి. నీ జీవితంలో దేవుని నిర్ణయాల్ని నీవు స్వాగతిస్తున్నావా? ఆయన కనుదృష్టికి మెరుపును మించిన తీక్షణత ఉంది. ఆయన దృక్కులనుంచి మనం తప్పించుకోలేం. మనగురించి దేవునికి తెలిసినట్టుగా ఏ మనిషికీ తెలియదు, చివరికి మనకు కూడా తెలియదు!

అక్టోబర్ 5

## అధఃపతనం

“ఒక మనుష్యునిద్వారా పాపమును పాపముద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో ... పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను” (రోమా 5:12)

ఒక మనిషిలో మొదలైన పాపం మానవజాతి అంతటికీ విస్తరించిందని ఈ వచన భావం! అలాగే మరొక మనిషి మానవజాతి భారాన్నంతా భరించి, మానవజాతి అంతటికీ విమోచనను ప్రసాదించాడు. ఇదెంత గంభీరమైన సందేశం (హెబ్రీ 9:26 వచనం చూడండి)! మనిషిలో ఉన్న పాపపు స్వభావం అతను తానే దైవమని ఆలోచించేలా, తానొక గొప్పవాడినని నీతిపరుడినని భావించేలా చేస్తుంది. లేదా, మనిషిలో ఉన్న పాపం అతనిచేత చెడు పనులు చేయిస్తుంది. మనిషిలో ఉన్న ఈ స్వభావమే అతనిలో ఉన్న అహానికి అపమార్గానికి కారణం. మన ప్రభువుకెదురైన మనుషుల్ని చూడండి. వాళ్లలో స్వనీతి ఉంది; మరికొంతమందిలో దుష్టత్వం ఉంది. స్వనీతికి దుర్నీతికి కూడా పాపపు స్వభావమే కారణం. మనిషి అంతరంగం దేవునికి తెలుసు. ఆయన మనిషి అంతరంగాన్నే చూస్తాడు. ఎందుకంటే మనిషి క్రియలకు మూలం అతని అంతరంగమే (యోహాను 2:25 చూడండి).

నేను పాపంలోనే జన్మించాను. నా పాపాన్ని నేను నిర్మూలించుకోలేను. పాపానికి వచ్చే ఫలితం మరణం. దేవుడు మాత్రమే నా పాపాన్ని నిర్మూలించగలడు. దేవుడు తన కుమారుడైన యేసు క్రీస్తు సిలువమరణంద్వారా సమస్త మానవజాతిని పాపంనుంచి పాపపు ఫలితాలనుంచి విమోచించాడు. దేవుడు నీ పాపాన్నిబట్టి నిన్ను దోషిని చేసి నిన్ను నిలదీయడు. అయితే ఆయన తన పరిశుద్ధాత్మద్వారా నీ హృదయాన్ని పాపం విషయంలో తీర్పు విషయంలో ఒప్పిస్తాడు. దేవుడు మనిషిని ఒప్పించినప్పుడు అతను యేసు క్రీస్తు తన పాపాలకొరకు మరణించాడని తెలుసుకుంటాడు. దేవుడు మనుషుల హృదయాన్ని ఒప్పించకపోయినట్లయితే ఆయణ్ణి వారింకా తిరస్కరిస్తూనే ఉంటారు. అంటే వారు తీర్పులో నిలిచి ఉన్నారని అర్థం! ఆ తీర్పు ఇదే: “వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి” (యోహాను 3:19).

అక్టోబర్ 6

## నూతన జీవితపు స్వభావం

"నేను ... తన కుమారుని ప్రకటింపవలెనని ఆయనను నాయందు బయలుపరప ననుగ్రహించినప్పుడు" (గలతీ 1:15,16)

ఒక మనిషిద్వారా యావత్‌మానవజాతికి పాపం సంప్రాప్తించినట్టుగా ఒకే మనిషిద్వారా పాపవిమోచన కూడా యావత్‌మానవజాతికి సంప్రాప్తించింది (రోమా 5:12-19 వచనాలు చూడండి). విమోచన అంటే మనలో ఉన్న పాపపు స్వభావం తొలగిపోయి, యేసు క్రీస్తు అనుగ్రహించు నూతన జీవాన్ని పొందడమని, నూతన జీవాన్ని మనలో కొనసాగించే పరిశుద్ధాత్మను పొందడమని అర్థం.

ఒక మనిషి తాను పాపినని ఒప్పుకొని తన పాపాలవిషయమై క్షమాపణ కోరి నప్పుడు అతని హృదయంలో పరిశుద్ధాత్మ కార్యం మొదలవుతుందని, అతని హృదయంలో పరిశుద్ధాత్మ నివసిస్తాడని క్రొత్త నిబంధన బోధిస్తోంది. ఒక వ్యక్తి దేవుని కుమారుని ఆత్మద్వారా నూతనజీవాన్ని పొందినప్పుడు దేవుని కుమారుని స్వరూపం అతనిలో ఏర్పడడం ప్రారంభ మవుతుంది. "క్రీస్తు స్వరూపము మీయందేర్పడువరకు ... " (గలతీ 4:19) అని పౌలు వ్రాస్తున్నాడు. క్రీస్తు అనుగ్రహించిన నూతన జీవాన్నిబట్టి మనలో నూతన జీవితం ప్రారంభమవు తుంది. నూతన జీవాన్ననుసరించి, నూతన జీవిత ధర్మాన్ననుసరించి మనం జీవించినప్పుడు క్రీస్తు మనల్ని "ధన్యులు" అని పిలుస్తాడు (మత్తయి 5:11). అయితే నూతనజీవం నూతన జీవితం నూతన జీవితధర్మం నాకు కావాలని నేను కోరుకొనేంతవరకు నేను వాటిని పొందలేను.

నేను యేసు క్రీస్తునుంచి నూతనజీవం పొందబోయేటప్పుడు నా ద్వారా యేసుకు ఏమైనా సమస్యలెదురవుతాయా? ఇంతవరకు నా జీవితం పాపపుస్వభావపు అధీనంలో ఉంది. కాబట్టి నాలో పరిశుద్ధత లేదు. నా మట్టుకు నేను పరిశుద్ధత పొందలేను కూడా. నేను పరిశుద్ధుణ్ణి కావాలంటే నేనేం చేయాలో గ్రహించాలి. నేను పాపినని గ్రహించి నప్పుడు పరిశుద్ధాత్మ నన్ను పరిశుద్ధపర్చే కార్యాన్ని ప్రారంభిస్తాడు. అప్పుడు పరిశుద్ధుడు మరియు నూతనజీవ ప్రదాత అయిన క్రీస్తు "స్వరూపం" నాలో ఏర్పడుతుంది. వీటన్నిటికీ మూలం క్రీస్తు సిలువ బలియాగం మాత్రమే.



అక్టోబర్ 7

## పాపనివృత్తి

“మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను” ( 2 కొరింథీ 5:21)

పాపం మన మూలాల్లో ఉంది. పాపమంటే ఉద్దేశపూర్వకంగా దేవునికి దూరమయ్యే స్వభావం. ఈ స్వభావం మనుషుల్లో ఉంది కాబట్టి మనుషులు చెడు పనులు చేస్తుంటారు. క్రైస్తవ మతధర్మం పాపాన్ని తీవ్రంగా పరిగణిస్తుంది. ఎందుకంటే పాపం మనుషుల్ని దేవునికి దూరం చేస్తుంది కాబట్టి. పాపంనుంచి విడుదల పొందడం క్రైస్తవధర్మంలో ప్రధాన విధి. యేసు క్రీస్తు మనల్ని పాపంనుంచి విడిపించడానికి వచ్చాడు. పాపంనుంచి మనల్ని విడిపించే యేసును ఆశ్రయించినప్పుడు ఆయన మనలో ఉన్న పాపాన్ని తొలగిస్తాడు. మన పాపకృత్యాలన్నిటినీ యేసు క్షమిస్తాడు. పాపపుస్వభావం స్థానంలో ఆయన మనలో నూతన స్వభావాన్నుంచుతాడు. యేసు మన పాపాలన్నిటికొరకు ప్రాయశ్చిత్తం చేశాడని మనం విశ్వసించి మన పాపాల విషయంలో పశ్చాత్తాపం చెందినప్పుడు మనం పాపంనుంచి విడుదల పొందుతాం.

దేవుడు మనకొరకు తన కుమారుణ్ణి “పాపముగా” చేశాడని పౌలు వ్రాస్తున్నాడు. అంటే యేసు మనుష్యకుమారుడిగా జన్మించి మన పాపాలన్నిటిని తనమీద వేసుకొని మన పాపాల కొరకు సిలువ మరణంపొంది మన పాపాలకు ప్రాయశ్చిత్తం చేశాడు. యేసు ఈ కార్యాన్ని మన మీద సానుభూతితో చేయలేదు. పాపంమూలంగా దేవునికి దూరమైన మానవజాతిని దేవునితో పునరైక్యం చేసే దేవుని సంకల్పంలో భాగమిది. యేసు ఈ లోకానికి వచ్చి దేవుని మహోన్నత సంకల్పాన్ని నెరవేర్చాడు. యేసు తన సిలువ మరణంద్వారా నెరవేర్చిన మహోన్నత కార్యం ద్వారా మానవజాతిని పాపంనుంచి విడిపించి, మానవజాతికి నీతిని ప్రసాదించాడు. ఈ నీతి దైవసంబంధమైన పవిత్ర ధర్మం. రక్షణ అంటే ఇదే! యేసు మరణపునరుత్థానాల్ని విశ్వసించే మనుషులందరూ దేవుని నీతికి వారసులవుతారు. అంటే వారు నీతిమంతులుగా తీర్చబడతారని అర్థం. రక్షణ మనుషులందరికీ లభిస్తుంది; అయితే వారు రక్షణప్రదాత అయిన యేసు సిలువ బలియాగాన్ని విశ్వసించాలి. అప్పుడే వారు దేవునితో అన్యోన్య సహవాసంలో ఉండగలరు.

రక్షణ దేవుని కార్యం. మనుషులు తమకు తాముగా రక్షణ పొందలేరు. యేసు క్రీస్తు యావత్మానవజాతికి రక్షణ కార్యాన్ని నెరవేర్చి సంపూర్తిచేశాడు. అయితే యేసు నెరవేర్చిన రక్షణ కార్యంపట్ల స్పందించే తీరు మనిషి ఇచ్ఛకు వదిలిపెట్టబడింది. మానవజాతికి రక్షణ వెల్లడయ్యింది; అయితే తన జీవితంలో రక్షణను వాస్తవం చేసుకోడం మనిషి వ్యక్తిగత అనుభవం!

అక్టోబర్ 8

## యేసు వద్దకు రావడం

"నా యొద్దకు రండి" (మత్తయి 11:28)

"నా యొద్దకు రండి" - ఈ మాటలు మనం వినిన ప్రతి సారీ మనలో స్పందన కలుగుతుంది. మనం ఏం చేయాలో పరిశుద్ధాత్మ మనకు బోధిస్తాడు. పరిశుద్ధాత్మ నీ అంతరంగాన్ని పరిశోధించి యేసు వద్దకు రావడానికి నీలో ఉన్న అడ్డుల్ని ఆటంకాల్ని పటాపంచలు చేస్తాడు. అయితే ఆయన నిన్ను ముందుకు త్రోసి బలవంతపెట్టడు. యేసు వద్దకు రావడం నీ ఇచ్ఛకు నీ ఇష్టానికి వదిలిపెట్టబడిన నిర్ణయం.

"నా యొద్దకు రండి" - ఈ మాటలు వినిన ప్రతి సారీ నిన్ను నీవు పరీక్షించుకో. నీలో యథార్థత లేనట్లయితే నీవు యేసువద్దకు రావడానికి బదులు తప్పించుకొని పారి పోడానికి ప్రయత్నిస్తావు. నీలో యథార్థత లేనట్లయితే నీవు కష్టాలనుభవించడానికే ఇష్ట పడతావు గానీ యేసు వద్దకు రావడానికి ప్రయత్నించవు. నీ ఆత్మను నీవు నిర్లక్ష్యం చేస్తున్నంత కాలం నీవు యేసు వద్దకు రావడానికి ప్రయత్నించవు. ఆయన మనతో గొప్ప గొప్ప సంగతులు మాట్లాడాలని కోరుకుంటున్నాం గానీ ఆయన మనతో "నా యొద్దకు రండి" అని పిలుస్తున్నాడు.

నీ స్వంత మనవులతో ఎన్ని సార్లు నీవు యేసు వద్దకు వచ్చి "నేను అడిగినవాటిని ఈ సారి పొందాను" అనుకుంటూ వెళ్లావు? నీవు పొందానని అనుకుంటున్నావు గానీ ఏమీ పొందలేదు. ఎందుకంటే ఆయన "నా యొద్దకు రండి" అని నిన్ను పిలిచినప్పుడు నీవు మళ్లీ వెనక్కు వెళ్లాలని ఆయన కోరుకోడం లేదు. నీవు తనతోనే ఉండాలని యేసు కోరుకుంటున్నాడు. ఆయన నిన్ను కోరుకున్నట్టే నీవు కూడా ఆయణ్ణి కోరుకోవాలి. యేసు అవిశ్రాంత సహనంతో, అజేయమైన పట్టుదలతో, నిత్యమైన ప్రేమతో "నా యొద్దకు రండి" అని మనల్ని పిలుస్తున్నాడు.

అక్టోబర్ 9

## సిలువ బలియాగం

"మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించుడి" (రోమా 6:13)

నన్ను నేను రక్షించుకొని పరిశుద్ధపర్చుకోలేను. నా పాపాలకు నేను ప్రాయశ్చిత్తం చేసుకోలేను. లోకాన్ని నేను రక్షించలేను. అపమార్గంలో ఉన్నవాటిని నేను ఋజుమార్గంలో పెట్టలేను. అపవిత్రమైనవాటిని నేను పవిత్రపర్చలేను. ఇవన్నీ దేవుడు మాత్రమే చేయగలడు. యేసు క్రీస్తు సిలువ బలియాగంలో నీకు విశ్వాసం వుందా? ఆయన యావత్‌మానవజాతి పాపాల్ని నివృత్తి చేయడంకొరకు తనను తాను సిలువమీద బలిగా అర్పించుకున్నాడు. యేసు బలియాగం నీ జీవితంలో వాస్తవమయ్యిందా? నీ విశ్వాసానికి మూలం క్రీస్తు సిలువ బలియాగమే. క్రీస్తు సిలువను కాక నీ స్వంత అనుభవాల్ని నీవు విశ్వసిస్తున్నట్లయితే నీ జీవితం వాక్యానుసారంగా ఉండదు. క్రీస్తు సిలువ బలియాగాన్ని విశ్వసించకుండా మనం దేవుణ్ణి సంతోషపెట్టలేం. మన జీవితంలో క్రీస్తు లేనట్లయితే మనం పరిశుద్ధతకు చాలా దూరంలో ఉన్నామని అర్థం.

క్రీస్తు సిలువ బలియాగం నీ జీవితంలో ఒక ఊహగా మిగలకూడదు! సిలువ నీ జీవితంలో ఒక వాస్తవం కావాలి; అనుసరణగా ఉండాలి. క్రీస్తు బలియాగానికి విధేయత చూపిన ప్రతి సారీ నీవు దేవుని కృపకు పాత్రుడవవుతాను. విధేయత అంటే క్రీస్తు సిలువ బలియాగంలో అచంచలమైన విశ్వాసం.

క్రీస్తుకు వేరుగా పరిశుద్ధతను ఊహించుకోకు. క్రీస్తుకు వేరుగా నీవు పరిశుద్ధుడిగా ఉండలేవు. నీలో ఉన్న మంచితనాన్ని పరిశుద్ధతగా ఊహించుకోకు. అది నకిలీ పరిశుద్ధత. నీ జీవితంలోని ప్రతి విషయానికి క్రీస్తు సిలువ బలియాగంతో ప్రమేయం కల్పించు. క్రీస్తు సిలువను సదా జ్ఞాపకం చేసుకో. నిన్ను నీవు సర్వదా పరీక్షించుకో!

అక్టోబర్ 10

## నేనెలా తెలుసుకోగలను?

“యేసు చెప్పినదేమనగా -తండ్రీ ... నీవు జ్ఞానులకును వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినావని నిన్ను స్తుతించుచున్నాను” (మత్తయి 11:25)

ఆధ్యాత్మికపరమైన అన్యోన్య సహవాసం మెట్టు మెట్టుగా ఉండదు. సహవాసాన్ని కలిగి ఉంటాం; లేదా కలిగి ఉండం. దేవుడు మనల్ని కొద్ది కొద్దిగా కడిగి శుద్ధిచేయడు. “ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము” (1 యోహాను 1:7). ఆయనతో అన్యోన్యత నిరంత రాయంగా ఉండాలి. ఇది విధేయతకు సంబంధించిన విషయం. మనం క్రీస్తుకు విధేయత చూపి నప్పుడు ఆయనతో మనకు సహవాసం వుంటుంది. మనలో లేశమాత్రమైనా అవిధేయత ఉన్నట్లయితే వెలుగు స్థానంలో చీకటి ప్రవేశిస్తుంది.

మనలో విధేయత ఉన్నప్పుడు దేవుడు తన సత్యాల్ని మనకు వెల్లడిచేస్తాడు. నీ స్వంత తెలివితేటలతో దేవుని సత్యాలగురించి నీవెంతగా ఆలోచించినా తెలుసుకోలేవు. వేదాంత చర్చల్లో దేవుని సత్యాల్ని అవగతం చేసుకోలేవు. నీవు దేవునికి విధేయత చూపినప్పుడు మెరుపు మెరిసినట్టుగా దేవుని సత్యాలు నీకు బోధపడతాయి. నీవు తిరిగిపుట్టడంద్వారా మాత్రమే దేవునికి విధేయత చూపగలవు. నీలో విధేయత అధికమవుతున్న కొలదీ సత్యం వెంబడి సత్యాన్ని తెలుసుకుంటావు. పరిశుద్ధాత్మ కార్యాలగురించి నీవు పుంఖానుపుంఖాలుగా గ్రంథాలు చదివినా బోధపడని పరలోక సత్యాలు నీవు దేవునికి సంపూర్ణమైన విధేయత చూపిన కొద్ది సేపట్లో నీకు బోధపడతాయి. విధేయత చూపకుండా “ఏదో ఒక రోజు ఇవన్నీ నాకు అర్థమవుతాయి” అని చెప్పకు. పుస్తకపఠనం నీకు పరలోక జ్ఞానాన్నివ్వదు. పరలోక జ్ఞానాన్ని విధేయత ద్వారా మాత్రమే పొందగలవు. నీవు తెలుసుకున్నవాటన్నిటికీ సంపూర్ణమైన విధేయత చూపేవరకు దేవుడు నీకు లోతైన సత్యాల్ని వెల్లడిచేయడు. జ్ఞానవంతుడవు కావాలని తహతహలాడకు. నీ స్వంత జ్ఞానం నిజమైన జ్ఞానం కాదు. నిజమైన జ్ఞానం దేవునిలో మాత్రమే ఉంది. “ఎవడైనను ఆయన చిత్తముచొప్పున చేయ నిశ్చయించుకొనినయెడల, ఆ బోధ దేవునివలన కలిగినదో, లేక నా యంతట నేనే బోధించుచున్నానో, వాడు తెలిసికొనును” (యోహాను 7:17).

అక్టోబర్ 11

**దేవుని మౌనం - ఆ తర్వాత?**

“అతడు రోగియైయున్నాడని యేసు వినినప్పుడు తానున్నచోటునే యింక రెండు దినములు నిలిచెను” (యోహాను 11:6)

దేవుడు మౌనంగా ఉండడం నీపట్ల విశ్వసనీయత చూపడమేమో! ఆయన మౌనానికి అర్థముంది. వాస్తవానికి ఆయన మౌనంలో గంభీరమైన జవాబు ఉంది. బేతనియలో మన ప్రభువు మౌనంగా ఉన్న సందర్భాన్ని ఒక్కసారి జ్ఞాపకం చేసుకో. అటువంటి సందర్భాలు నీ జీవితంలో కూడా ఉన్నాయా? దేవుడు మౌనంగా ఉన్న సమయంలో ఆయణ్ణి నమ్ము తున్నావా? లేక, కళ్లకు కనబడేటట్టుగా జవాబు కావాలని అడుగుతున్నావా? పట్టువదలకుండా నీవు దేవుణ్ణి అడుగుతున్నట్లయితే ఆయన నీకు దీవెనల్ని ఇస్తాడు. అయితే ఆయన మౌనం అంతకంటె ఎంతో ముఖ్యమైనది! ఆయన మౌనంగా ఉండి నీవు తనను మరింత ఎక్కువగా తెలుసుకొనేలా చేస్తున్నాడు. దేవుడు నీతో మాట్లాడలేదని నీవు రోదిస్తున్నావా? దేవుడు మౌనంగా ఉన్నప్పుడు ఆయనకు నీమీద నమ్మకం వుందని అర్థం. దేవుని మౌనం నిన్ను నిరాశానిస్పృహలకు గురి చేయకూడదు. నీకొక అద్భుతం ఎదురుకాబోతుందని ఆయన మౌనం సూచిస్తోంది. దేవుడు మౌనంగా ఉన్నప్పుడు ఆయణ్ణి స్తుతించు. ఆయన నిన్ను తన ఉద్దేశాల్లోకి తీసుకొని వెళ్తున్నాడు. సరైన సమయంలో సరైన జవాబు రావడం కూడా దేవుని సర్వశక్తతను వెల్లడి చేస్తోంది. దేవుని సమయాలు వేరు; మన సమయాలు వేరు. “నేను రొట్టె నడిగితే దేవుడు నాకు రాయి నిచ్చాడు” అని చెబుతున్నావేమో! ఆయన నీకు రాయి నివ్వలేదు. ఆయన నీకు “జీవాహారము” నిస్తున్నాడు (యోహాను 6:34-35).

దేవుని మౌనం నీమీద ప్రభావం చూపుతుంది. ఆయన మౌనం నీలో విశ్వాసాన్ని నింపు తుంది. అప్పుడు నీవు “దేవుడు నా ప్రార్థన విన్నాడు” అని యథార్థతతో చెప్పగలవు. ఆయన మౌనమే ఇందుకు నిదర్శనం. నీవు ప్రార్థించిన ప్రతిసారీ దీవెన పొందగలననే నమ్మకం నీలో ఉంటే ఆయన నీకు తప్పకుండా దీవెననిస్తాడు. అయితే నీవు ఆయన మౌనాన్ని నమ్మినప్పుడు దీవెనతోబాటు కృపను కూడా పొందగలవు. నీ ప్రార్థన దేవుని మహిమకొరకే అని నీవు తెలుసు కున్నప్పుడు ఆయన నీతో అన్యోన్యతను కోరుకుంటాడు. ఆయన మౌనం అన్యోన్యతకు రుజువు.

అక్టోబర్ 12

## దేవుని అడుగులు చాలా పెద్దవి

"హనోకు దేవునితో నడచిన ... " (ఆది 5:24)

ఒక వ్యక్తి ఆధ్యాత్మిక జీవితానికి అతని నడవడికకు అసలు పరీక్ష అసాధారణమైన సందర్భాలు విలక్షణమైన పరిస్థితులు కావు. దైనందిన జీవితంలోని అతిసాధారణమైన సందర్భాలు, ఎటువంటి ప్రేరేపకాలు లేని సాదాసీదా పరిస్థితులు ఆధ్యాత్మిక జీవితానికి అతని నడవడికకు అసలు పరీక్ష. మనం అమితమైన కాంతిపడే ప్రదేశంలో లేనప్పుడు, అంటే మన దైనందిన జీవితంలోని నిత్యకృత్యాల్లో మన అసలు వ్యక్తిత్వం బయట పడుతుంది (యోహాను 1:35-37, మరియు 3:30 వచనాలు చూడండి). దేవునితో నడవడం మనం ఆలోచించినంత సులువు కాదు; ఆయనతోబాటు అడుగులు వేయడం మనకు కష్టమే. దేవునితోబాటు నడవడం మనం నేర్చుకుంటున్నప్పుడు ఆయన వేసే పెద్ద అంగల్లో మనం అంగలు వేయడం మొదట్లో కష్టంగానే ఉంటుంది. అయితే ఆయనతోబాటు అంగలు వేయడం మనకు అలవాటు అయ్యేకొద్దీ మనం ఆయన జీవాన్ని కలిగి ఉంటాం; మనకు దేవునితో తాదాత్మ్యత ఏర్పడుతుంది; అప్పుడు మనద్వారా దేవుని జీవం ఆయన శక్తి బహిర్గతమవుతాయి.

దేవునితో నడవడం కష్టమని ఎందుకు చెబ్తున్నానంటే, ఆయన అడుగులు పెద్దవి మన అడుగులు చిన్నవి. మనం మూడడుగులు వేసేలోపు ఆయన మనకంటె ఎంతో ముందుగా నడుస్తాడు. మనం ఆయన మార్గాల్ని తెలుసుకొని వాటిని అభ్యసించవలసిన అవసరం వుంది. "అతడు మందగిలడు నలుగుడుపడడు ... " (యెషయా 42:4) అని యెషయా ప్రవక్త ప్రవచించినది యేసు గురించే. ఎందుకంటే యేసు ఎప్పుడూ తన వైపు నుంచి ఆలోచించక, తన తండ్రి చిత్తాన్ననుసరించే ఆలోచించాడు. మనం కూడా యేసు మాదిరిలోనే నడవాలి. మన చుట్టూ ఆధ్యాత్మిక వాతావరణం వున్నప్పుడు మనం ఆధ్యాత్మిక సత్యాల్ని నేర్చుకుంటాం. మన మేధస్సు నుపయోగించి ఆధ్యాత్మిక సత్యాల్ని తెలుసుకోలేం. మనం ఆధ్యాత్మిక సత్యాల్ని గ్రహించేలాగా మన చిత్తవృత్తిని మార్చడం దేవుని ఆత్మకు సాధ్యమైన కార్యమే. దేవుని ఆత్మ మన చిత్తవృత్తిని మార్చిన తర్వాత మనకు అంతవరకు అసాధ్యంగా ఉన్నవన్నీ సాధ్యమవు తాయి. మనం దేవునితోబాటు నడిచినప్పుడు ఆయనతో అన్యోన్యత కలిగి ఉంటాం. అయితే దేవునితో అన్యోన్యత కలిగి ఉండడం ఒక రోజులో సాధ్యమయ్యే కార్యం కాదు; ఇది సుదీర్ఘ ప్రక్రియ. దేవునితో నడవడం నీకు కష్టంగా ఉన్నప్పటికీ ఆయనతో నడవడం కొనసాగించు. ఆయనతోబాటు నడుస్తున్నప్పుడు నీవు నూతన దర్శనాన్ని నూతన లక్ష్యాన్ని చూడగలవు.

అక్టోబర్ 13

## వ్యక్తిగత నిరుత్సాహం, మరియు వ్యక్తిగత అభివృద్ధి

"మోషే పెద్దవాడై తన జనులయొద్దకు పోయి వారి భారములను చూచెను"
(నిర్గమ 2:11)

తన ప్రజలు నలిగిపోవడం మోషే చూశాడు. వారిని విడిపించడం తన బాధ్యత అని మోషే భావించాడు. వారిని బాగుచేయాలనుకోడం మోషేకు కలిగిన మంచి ఆలోచనే. అయితే మోషేకు తొలి ప్రయత్నంలోనే నిరుత్సాహం ఎదురయ్యింది. దేవుడతణ్ణి నలబై సంవత్సరాలు అరణ్యంలోకి పంపించాడు. అక్కడ మోషే గొర్రెలకు కాపరిగా ఉన్నాడు. నలబై సంవత్సరాల అనంతరం దేవుడతణ్ణి మళ్లీ తన ప్రజల దగ్గరకు నడిపించాడు. "రమ్ము, నిన్ను ... పంపెదను; ఇశ్రాయేలీయులైన నా ప్రజలను నీవు ఐగుప్తులోనుండి తోడుకొని ... " (నిర్గమ 3:10) అని దేవుడు మోషేతో అన్నాడు. అందుకు మోషే "నేను ... ఎంతటివాడనని" (నిర్గమ 3:11) జవాబిచ్చాడు. మొదట్లో తన ప్రజల్ని విడిపించే బాధ్యత తనదేనని మోషే తలంచాడు. అయితే అతను నలబై సంవత్సరాలబాటు అరణ్యంలో తర్ఫీదు పొందాడు. తన కోణంనుంచి మోషే సరిగ్గానే ఆలోచించి ఉండవచ్చు; అయితే దేవునితో అన్యోన్య సహవాసం మరియు దేవునితో తాదాత్మ్యత కలిగి ఉండేవరకు అతనికి తన ప్రజల్ని నడిపించే బాధ్యత అప్పగించబడలేదు.

మనకు కూడా దేవుని దర్శనం వుంది. దేవుడు మననుంచి ఏం కోరుకుంటున్నాడో మనకు స్పష్టంగా తెలుసు. అయితే మనం పని ప్రారంభించినప్పుడు మోషేకు నలబై సంవత్సరాల కాలంలో అరణ్యంలో ఎదురైన అనుభవాలే మనకు కూడా ఎదురవుతాయి. దేవుడు మనల్ని విడిచిపెట్టాడని మనం ఆలోచిస్తాం. మనకు తీవ్రమైన నిరుత్సాహం కలుగుతుంది. అప్పుడు దేవుడు మనతో మళ్లీ మాట్లాడి తన పిలుపును స్థిరపరుస్తాడు. అప్పుడు మనం తడబాటుతో "నేనెంతటి వాడిని?" అని చెబ్తాం. దేవుడు తన గురించి క్లుప్తంగా "నేను ఉన్నవాడను" (నిర్గమ 3:14) అని చెబ్తున్నాడు. "నేను ఉన్నవాడను" అని పలికిన దేవుడు మనల్ని పంపిస్తున్నాడు. దేవునికొరకు మనం స్వంత ప్రయత్నాలు చేసినప్పుడు వాటిని మనం కొనసాగించలేం. అయితే దేవునితో మనకున్న అన్యోన్య సహవాసం మన వ్యక్తిత్వానికి వన్నె తెస్తుంది. అప్పుడు దేవుడు మనతో "నేనానందించుచున్నానని" (మత్తయి 3:17) చెబ్తాడు. దేవునితో మనకు అన్యోన్య సహవాసం వున్నప్పుడు మనం చేయవలసిన పనిగురించి స్పష్టమైన దర్శనం వుంటుంది. "దేవుడు నానుంచి ఈ పనిని కోరుకుంటున్నాడు" అని మనం నిశ్చయతతో చెప్పగలం. అయితే మనం దేవుని అడుగుల్లో అడగులు వేయడం ఇంకా పూర్తిగా నేర్చు కోలేదు. నీవిప్పుడు నిరుత్సాహంగా ఉన్నవా? ఉన్నట్లయితే ఒక విషయం జ్ఞప్తికి తెచ్చుకో. నీ వ్యక్తిత్వం ప్రకాశవంతమయ్యే తరుణం ముందుంది!

అక్టోబర్ 14

## సేవకుని పరిచర్యకు మూలం

"యేసు వారియొద్దకు వచ్చి -పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి ... " (మత్తయి 28:18,19)

సేవకుని పరిచర్యకు మూలం యేసు క్రీస్తుకున్న సర్వాధికారం. నాశనమార్గంలో ఉన్నవారి అవసరాలు కాదు. మన ప్రయత్నాల్లో మనకు సహాయంచేసే వ్యక్తిగా మాత్రమే యేసు క్రీస్తును చూసేవారు ఉన్నారు. అయితే మన ప్రభువుకు సర్వాధికారం వుంది. మనం వెళ్లకపోతే నశించిపోతున్నవారు రక్షణ పొందలేరని ప్రభువు చెప్పలేదు గానీ, ఆయన సూటిగా "మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి ... " అని చెబుతున్నాడు. యేసు ఆజ్ఞను శిష్యులమైన మనం శిరసావహించాలి. ఎందుకంటే ఆయన సర్వాధికారి.

"పదునొకండుమంది శిష్యులు యేసు తమకు నిర్ణయించిన గలిలయలోని కొండకు వెళ్లిరి" (28:16). క్రీస్తుకున్న సర్వాధికారంగురించి నాకు పూర్తిగా తెలియాలంటే ముందుగా ఆయనతో నాకు వ్యక్తిగత పరిచయం వుండాలి. క్రైస్తవుడిగా పిలవబడే నేను నాకు ఆ పేరు రావడానికి మూలమైన క్రీస్తును యథార్థంగా ఆరాధించడం తెలుసు కోవాలి. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (11:28) అని యేసు మనల్ని పిలుస్తున్నాడు. ప్రయాసపడుతున్న నేను యేసును కలుసుకొనే తరుణమిదే! నావంటి వారనేకులు యేసును కలుసుకొనే సమయమిదే! సర్వలోకానికి ప్రభువైన యేసు పలికిన అద్భుతమైన మాటల్ని మనం త్రోసివేస్తున్నామా? అయితే యేసు పలికిన దివ్యవాక్కులు నాటి శిష్యులకు మాత్రమే కాదు; నేటి శిష్యులకు కూడా!

"కాబట్టి మీరు వెళ్లి ... " - ఆయన మనల్ని తన పనికొరకు పంపిస్తున్నాడు. ఆయన మనల్ని తనకు సాక్షులుగా ఉండడానికి పంపిస్తున్నాడు. "మీరు యెరూషలేము లోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను" (అ.కా. 1:8).

"నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచియుండినయెడల ... " (యోహాను 15:7) - సేవకుని జీవితమెలా ఉండాలో ఈ వచనం సెలవిస్తోంది. దేవుడు మనల్ని ఏ పరిస్థితుల్లో ఉంచాడనేది ముఖ్యం కాదుగానీ, ఆయనలో నిలిచి ఉండడం ముఖ్యం. ఎందుకంటే మనమెక్కడ పనిచేయాలో దేవుని సర్వాధిపత్యానికి వదిలిపెట్టబడిన విషయం.

"దేవుని కృపాసువార్తనుగూర్చి సాక్ష్యమిచ్చుటయందు నా పరుగును, నేను ప్రభువైన యేసువలన పొందిన పరిచర్యను, తుదముట్టింపవలెనని నా ప్రాణమును నాకెంత మాత్రమును ప్రియమైనదిగా ఎంచుకొనుటలేదు" (అ.కా. 20:24). భూమ్మీద మన జీవితం ముగిసేవరకు మనం జీవించవలసిన విధానమిదే!



అక్టోబర్ 15

## సేవకుని సందేశానికి మూలం

"ఆయనే మన పాపములకు శాంతికరమైయున్నాడు; మన పాపములకు మాత్రమే కాదు. సర్వలోకమునకును శాంతికరమైయున్నాడు" (1 యోహాను 2:2)

సేవకుని సందేశానికి మూలం యేసు క్రీస్తు మనకనుగ్రహించిన విమోచన. క్రీస్తు బలియాగం మన పాపాలకు శిక్షగా వచ్చే దేవుని ఉగ్రతను శాంతింపజేసింది. క్రీస్తు సిలువ బలియాగంద్వారా మానవజాతి పొందిన మేళ్లు అనంతం. ఎందుకంటే "లోకపాపమును మోసి కొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" యేసే (యోహాను 1:29). మన పాపాలనుంచి మనల్ని విమోచించి మనకు శాంతిననుగ్రహించిన యేసు క్రీస్తు సిలువ బలియాగం సేవకుని సందేశానికి మూలం కావాలి. క్రీస్తు సిలువ బలియాగమనే సత్యంలో సేవకుడు పూర్తిగా నిమగ్నం కావాలి.

క్రీస్తు మానవాళికి అనుగ్రహించిన రక్షణ సేవకుని సందేశానికి మూలం కావాలి. క్రీస్తులో దయ మంచితనం ఉన్నాయి. మన పాపాలనుంచి మనల్ని విడిపించడానికి యేసు తనను తాను ప్రాయశ్చిత్తంగా అర్పించుకున్న చారిత్రక సత్యమే మనం ప్రకటించే రక్షణసందేశం. "సమస్త జనములలో ఆయనపేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది" (లూకా 24:47) - ఇదే రక్షణ సందేశం! "ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు" - ఈ సందేశానికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది. "సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు" - సేవకుని సందేశం ఏదో ఒక జాతికో ఏదో ఒక దేశానికో పరిమితమైనది కాదు. యేసు సర్వలోకానికి రక్షణ ననుగ్రహించాడు. పరిశుద్ధాత్మ నాలో నివాసమున్నప్పుడు ఆయన నా స్వంత ఇష్టాయిష్టాల్ని పట్టించుకోడు. ఆయన నన్ను ప్రభువైన యేసుతో అన్యోన్యతలోకి నడిపిస్తాడు.

మన ప్రభువు మరియు యజమాని అయిన యేసుకు సేవకుడు జీవితకాల పర్యంతం లోబడి ఉండాలి. ఇది వివాహబంధమంత పవిత్రమైన సంబంధం. సేవకుడు తన స్వంత సిద్ధాంతాల్ని కాదు గానీ "దేవుని గొఱ్ఱెపిల్ల"ను ప్రకటించాలి. "యేసు క్రీస్తు నా కొరకు ఈ కార్యం చేశాడు" అనీ, "యేసు నన్ను స్వస్థపరిచాడు" అనీ, "క్రీస్తు నన్ను పరిశుద్ధపర్చాడు" అనీ, "నేను పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందాను" అనీ చెప్పడం సులువే. అయితే సేవకుని కర్తవ్యం అనంతమైన క్రీస్తు రక్షణకార్యాన్ని ప్రకటించడమే. పౌలు ప్రకటన చూడండి: "అయ్యో, నేను సువార్తను ప్రకటింపకపోయినయెడల నాకు శ్రమ" (1 కొరింథీ 9:16). సువార్త ప్రకటించడం పౌలు తన జీవితలక్ష్యంగా ఎంచుకున్నాడు; యేసు తనకొరకు చేసిన మేళ్లను ప్రకటించి పౌలు తృప్తిచెందాలను కోలేదు. సువార్త సందేశమంటే ఇదే: "లోకపాపమును మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" యేసేనని ప్రకటించడం.

అక్టోబర్ 16

## యజమాని ఆజ్ఞలకు మూలం

"తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడని ... " (మత్తయి 9:38)

ఇక్కడ ముఖ్యమైనది పని కాదు; ప్రార్థనే! సేవకుని పనిభారం దేవుని చేతుల్లో ఉంది. పని అంటే నేడు మన ఆలోచనల్లో ఉన్న పని కాదు; ఇది మన దృష్టిని దేవుని మీదనుంచి ప్రక్కకు మళ్లిస్తుంది. సేవకుని పనికి యజమాని ఆజ్ఞలు మూలం. మనకున్న లోకజ్ఞానంతో మన చదువుతో మన తెలివితేటలతో దేవునిపని చేయలేం. యజమాని మనల్ని ప్రార్థించమని ఆజ్ఞాపిస్తున్నాడు: "తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడని ... ". మన దైనందిన జీవితంలో ప్రతి చిన్న విషయానికి ప్రార్థించడం కుదరకపోవచ్చు; కొన్ని సార్లు ఇలా ప్రార్థించడం ఇతరులకు అర్థంలేనిదిగా కూడా కనిపించవచ్చు. లోకజ్ఞానం ప్రకారం చూసినట్లయితే ప్రార్థన చాలామందికి అవివేకపు చర్యగా కనిపిస్తుంది.

అయితే మనం యేసు క్రీస్తువైపు నుంచి చూడాలి. ఆయన దృష్టిలో ప్రపంచమంతా ఒక్కటే. అయితే మనలో ఎంతమంది యేసు క్రీస్తును దృష్టిలో పెట్టుకొని ప్రార్థిస్తున్నాం? కోత ప్రభువుది. ఎన్నో కష్టాలు పడితే పంట కోతకు వచ్చింది. ఈ పంటను కోయడానికి సేవకుల్ని పంపమని మనం ప్రార్థించాలి. మన చుట్టూ పండిన పంట కోతకు సిద్ధంగా ఉంది. అయితే మనం కోత కోయడానికి బదులుగా మన పనుల్లో నిమగ్నమై ఉన్నాం. కోత కోయడానికి బదులు మనం ఇతరత్రా కార్యక్రమాల్లో మునిగి ఉన్నాం; ప్రభువు మనకనుగ్రహించిన సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నాం. ఉదాహరణకు నీ కుటుంబసభ్యుల్లో ఎవరో ఒకరికి కష్టం వచ్చిందనుకో. నీవు చూస్తూ ఉంటావా? లేక, సరైన సహాయం చేసి ఆదుకుంటావా? నీ యజమాని పొలంలో కోత కోయడానికి నీవు సిద్ధంగా ఉన్నావా? లేక, "నాకు చాలా పని ఉంది. ఇప్పుడు నేను రాలేను" అని చెబ్తావా? క్రీస్తుకు సేవకునిగా ఉండడమే క్రైస్తవుని విధి. ఇది మినహా ఇతరత్రా పనులతో క్రైస్తవునికి సంబంధం లేదు. "దాసుడు తన యజమానునికంటె గొప్పవాడు కాడు" (యోహాను 13:16) అని మన ప్రభువు చెబ్తున్నాడు. ఆయన మనల్ని తన పనికొరకు పిలుస్తున్నాడు. "కోత యజమానుని వేడుకొనుడని ... " ప్రభువు ఆదేశిస్తున్నాడు. ఆయన నిన్ను తన పొలంలో కోత కోయడానికి పనివాడిగా పంపాలని ప్రార్థిస్తున్నావా?

అక్టోబర్ 17

## గొప్ప పనికి మూలం

"నేను తండ్రియొద్దకు వెళ్లుచున్నాను గనుక నేను చేయు క్రియలు నాయందు విశ్వాసముంచువాడును చేయును, వాటికంటె మరి గొప్పవియు అతడు చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 14:12)

ప్రార్థనద్వారా మనం గొప్ప పనులకు సిద్ధపడడం ఒక ఎత్తైతే, ప్రార్థనే ఒక ఎత్తు. ప్రార్థనే ఒక గొప్ప పని. అయితే మన దైనందిన జీవితంలో ప్రార్థనకు ఇవ్వవలసిన ప్రాముఖ్యతను మనం ఇవ్వడం లేదు. నీ జీవితంలో ప్రార్థనద్వారానే నీవు యేసు క్రీస్తు అనుగ్రహించిన రక్షణ పొందగలవు. నీవు పాపివని ఒప్పుకుంటూ ప్రార్థించినప్పుడు నీ పాపాలు క్షమించబడతాయి; అప్పుడు దేవుని శక్తిని నీవు చూడగలవు. విమోచన నీ జీవితంలో ఒక గొప్ప అద్భుతం! ప్రార్థన ద్వారానే మనం ఫలించడం సాధ్యమౌతుంది. క్రీస్తు లోకరక్షణకొరకు వేదనతో ప్రార్థించాడనే విషయాన్ని జ్ఞాపకం పెట్టుకో. తండ్రి తన పిల్లల మనవి వింటాడు. మనం కూడా ఈ ఉద్దేశంతోనే మన తండ్రిని ప్రార్థించాలి. దేవుడు జ్ఞానవంతులకు వివేకులకు ఈ సంగతిని రహస్యంగా ఉంచాడు (మత్తయి 11:25 వచనం చూడండి).

నీవు ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ప్రార్థన ఒక పోరాటంలాంటిది. దేవుడు నిన్ను ఏ పరిస్థితుల్లో ఉంచినప్పటికీ ప్రార్థించడం నీ విధి. "ఇక్కడ నేను చేయగలిగినదేదీ లేదు" అని నిరుత్సాహపడకు. దేవుడు ఎక్కడ నిన్ను ఉంచితే అక్కడే ఆయనకు స్తుతులర్పించి ప్రార్థించు. "మీరు నా నామమున దేని అడుగుదురో ... దానిని చేతును" (14:13) అని మన ప్రభువు చెబుతున్నాడు. అయితే, మనల్ని ఉద్రేకపర్చే సందర్భాలెదురయ్యేవరకు మనం ప్రార్థించం. దీన్నే మనం ఆధ్యాత్మిక స్వార్థచింతనగా పేర్కొనవచ్చు. మనం దేవుని నడిపింపు ప్రకారం నడవడానికి మనం సిద్ధంగా ఉండాలి. "తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడని ... " (మత్తయి 9:38) యేసు మనతో చెబుతున్నాడు.

కూలివాడి పని ఎవరికీ ఆసక్తిని ఉత్సాహాన్ని కలిగించదు. అయితే జ్ఞానవంతుల ఆలోచనల్ని నిర్ణయాల్ని ఆచరణలో పెట్టేది కూలివారే. ఆధ్యాత్మిక విషయాల్లో కూడా ఇది నిజమే. మన యజమాని ఆజ్ఞల్ని నిర్ణయాల్ని ఆచరణలో పెట్టేది ఆయనకొరకు పంట కోసే పనివారే. నీవు ప్రార్థన అనే పనిలో ఉన్నప్పుడు దేవునివైపునుంచి ఫలితాల్ని చూస్తావు. ఆధ్యాత్మిక పంటను కోసిన తర్వాత (నీద్వారా సువార్త వినిన ఆత్మల్ని చూసిన తర్వాత) నీకెంత ఆనందం కలుగుతుందో కదా! ఇదంతా నీవు మన యజమాని అయిన యేసు క్రీస్తు ఆదేశాల ప్రకారం నడవడంవలనే సాధ్యమయ్యింది!

అక్టోబర్ 18

## సేవకుని భక్తివిశ్వాసాలకు మూలం

"ఆయన నామము నిమిత్తము బయలుదేరిరి ... " (3 యోహాను వ.6-7)

"నన్ను ప్రేమించుచున్నావా?" (యోహాను 21:17) అని యేసు పేతురును ప్రశ్నించి నప్పుడు ఆయన ఏ జవాబు కోరుకుంటున్నాడో పేతురుకు తెలుసు. తర్వాత ప్రభువు "నా గొర్రె లను మేపుము" అని పేతురుతో అన్నాడు. పేతురు తనకోసం కాక ప్రభువుకోసం పని చేయాలనే అర్థం కనబడుతోంది కదా! 1 కొరింథీ 13:4-8 వచనాల్లో ప్రేమ గుణగణాల్ని చూస్తాం. ఇది దేవుడు వ్యక్తం చేసిన ప్రేమ. ఈ ప్రేమ మనలో కూడా వ్యక్తమవ్వాలి. మనకు యేసుపట్ల నిజమైన ప్రేమ ఉన్నట్లయితే మనం వెంటనే ప్రేమను కార్యరూపంలో పెట్టాలి. అదే నిజమైన ప్రేమ. మిగిలినవన్నీ వట్టి మాటలే!

యేసు క్రీస్తుపట్ల విశ్వాసానికి మూలం పరిశుద్ధాత్మ నాలో జరిగించిన విమోచనా కార్యం. ఈ కార్యంద్వారానే మన హృదయాల్లో ప్రేమకూడా క్రుమ్మరించబడింది. "మనకు అను గ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో క్రుమ్మరించబడి యున్నది" (రోమా 5:5). క్రీస్తు నామంపట్ల యథార్థమైన విశ్వాసాన్ని చూపిస్తూ ఈ ప్రేమనే మనం కార్యరూపంలో పెట్టాలి. లోకజ్ఞానం ప్రకారం ఇదంతా అవివేకంగా కనిపించినప్పటికీ ఈ ప్రేమనే మనం ఆచరణలో పెట్టాలి.

సేవకుని భక్తివిశ్వాసాలకు మూలం అతను ప్రభువుతో తప్ప మరెవరితోనూ అన్యోన్యత కలిగి ఉండకపోవడం. మన చుట్టూ ఉన్న పరిస్థితులనుంచి అతను తప్పించుకొని పారిపోవాలని కాదు గానీ ఎటువంటి పరిస్థితుల్లోనైనా ప్రభువుతో అన్యోన్యత కలిగి ఉండాలని అర్థం. మన దైనందిన జీవితంలోని ప్రతి సందర్భం మన ప్రభువుకు తెలుసు. అయితే ఆయన వాటిమీద దృష్టి పెట్టక తన తండ్రిమీద తన తండ్రి చిత్తంమీద దృష్టి నిలిపాడు.

ప్రభువైన యేసు క్రీస్తు స్వభావాన్ని కలిగి ఉండడానికి మనసా వాచా కర్మేణా ప్రయత్నించడం సేవకుని ప్రథమ కర్తవ్యం. దేవుడు తన పనుల్ని జరిగించడానికి అతి సాధారణమైన వ్యక్తుల్నే ఎన్నుకుంటాడు. అయితే వారిలో దేవునిపట్ల అచంచలమైన భక్తివిశ్వాసాలుంటాయి. ఇది పరిశుద్ధాత్మ కార్యం మాత్రమే!

అక్టోబర్ 19

## ఎవరికీ తెలియని రహస్యం

"యేసు -నా రాజ్యము ఈ లోకసంబంధమైనది ... కాదనెను" (యోహాను 18:36)

క్రొత్త నిబంధనను ఆధారం చేసుకొనని కొన్ని సేవాకార్యక్రమాల్ని నేడు మనం చూస్తున్నాం. ఇవి యేసు క్రీస్తుకు దూరంగా ఉన్నాయనే చెప్పవచ్చు. వాస్తవానికి ఇవి యేసుతో విభేదిస్తున్నాయి కూడ. ఇవి ప్రాపంచిక జ్ఞానంమీద ఆధారపడిన సేవా కార్యక్రమాలు. ఇవి మనుషుల శక్తిసామర్థ్యాలమీద ఆధారపడే కార్యక్రమాలే తప్ప, దేవునిమీద ఆధారపడినవి మరియు ఆంతరంగికమైన ప్రార్థనాజీవితంమీద ఆధారపడినవి కావు. "దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది ... ఉత్తరమిచ్చెను" (లూకా 17:20, 21). దేవుని రాజ్యం ప్రత్యక్షంగా కనబడదు. క్రైస్తవుని పనిభారం లోకానికి కనబడుతుంది. అయితే అతని హృదయాంత రంగం ఎవరికీ కనబడదు. క్రైస్తవుని నిజమైన నడవడికను వెల్లడిచేసేది అతని అంతరంగం మాత్రమే.

మనం మతాచారాల ముసుగులో ఉన్నాం. సేవా కార్యక్రమాల్లో మనిగిపోతున్నాం. అయితే మన ప్రభువు జీవితంలో మతాచారాల ముసుగు లేదు; ఆయన సేవాకార్యక్రమాల వత్తిడిలో నలిగిపోలేదు. నిజమైన శిష్యుడు తన బోధకుడు తన యజమాని అయిన యేసులాగానే ఉండాలి. యేసు క్రీస్తు రాజ్యంలో అత్యంత ముఖ్యమైన విషయం యేసుతో అన్యోన్యత మాత్రమే. అంతే గానీ యేసుకు దూరంగా ఉంటూ మనం చేస్తున్న సేవా కార్యక్రమాలు కాదు.

భవిష్యత్తులో నీకు దేవుడు ఎటువంటి పరిస్థితుల్ని రప్పిస్తాడో నీకు తెలియదు. సేవాపరంగా నీకెటువంటి వత్తిళ్లు ఎదురవుతాయో నీకు తెలియదు. నీవు దేవుని సత్యాల్ని తెలుసుకోకుండా సేవాకార్యక్రమాల్లో తలమునకలుగా ఉన్నావా? నీవు యేసుతో అన్యోన్యతకు దూరమైనప్పుడు సేవలో వత్తిళ్లు వచ్చినప్పుడు నీవు నిరాశానిస్పృహలకు గురవుతావు. సేవకునికి యేసుతో పటిష్టమైన అన్యోన్యత ముఖ్యం. ఆయనతో అన్యోన్యత మరియు అనన్యత ఉన్నప్పుడు ఎటువంటి పరిస్థితులెదురైనా సేవకుడు నిబ్బరంగా ఉండగలదు. ఆయనతో తాదాత్మ్యతే సేవకుని బలం; సేవాకార్యక్రమాలు కాదు!

అక్టోబర్ 20

## దేవుని చిత్తం నా చిత్తం ఒకటేనా?

"మీరు పరిశుద్ధులగుటయే ... దేవుని చిత్తము" (1 థెస్స 4:3)

"నేను పరిశుద్ధపర్చబడాలని కోరుకుంటున్నాను" అని చెప్పకు. కోరుకోడం ఆపి పరిశుద్ధపర్చబడాలనే అవసరతను గుర్తించు. ఈ అవసరతను కార్యరూపంలో పెట్టు. సంశయాలు శంకలు వీడి అప్రతిహతమైన విశ్వాసంతో యేసు నంగీకరించినప్పుడు మాత్రమే నీవు పరిశుద్ధుడవు కాగలవు. అప్పుడు మాత్రమే క్రీస్తు బలియాగం నీ జీవితంలో వాస్తవమవుతుంది. "ఆయన మనకు నీతియు పరిశుద్ధతయు విమోచనము నాయెను" అని 1 కొరింథీ 1:31 వచనం సెలవిస్తోంది. యేసు పరిశుద్ధత నీ దేహంలో వ్యక్తమవుతున్నదా? ఇందుకు నీవు సిద్ధంగా ఉన్నావా? క్రీస్తు బలియాగంద్వారా సాధ్యమైనవన్నీ నీ జీవితంలో వాస్తవం చేస్తున్నావా? ఇందుకు ఆయనకు అనుమతి నిస్తున్నావా? నీ మనస్సు నీ హృదయం పరిశుద్ధతను కోరుకుంటున్నాయా? పరిశుద్ధత నీ చిత్తానికి సంబంధించినది కాదా?

పరిశుద్ధత విషయంలో నీవు అతిశయించేందుకు వీల్లేదు. "అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెను" (1 కొరింథీ 1:31). రక్షించబడి పరిశుద్ధపర్చబడిన నీలో దీనత్వం వుండాలి. ఎందుకంటే క్రీస్తు బలియాగం నీకనుగ్రహించిన ప్రేమకానుక విమోచన మరియు విమోచనద్వారా సిద్ధించిన పరిశుద్ధత. వేదనతోకూడిన పశ్చాత్తాపం నిన్ను పరిశుద్ధతకు నడిపిస్తుంది. నీలో పాపంగురించి కలిగిన అవమానభారం నిన్ను విమోచనకు నడిపిస్తుంది. నీలో ఉన్న అధఃకరణం నీవు క్రీస్తు బలియాగాన్ని గుర్తించేలా చేస్తుంది. క్రీస్తు మన రక్షణ కొరకు మన పరిశుద్ధతకొరకు తాను చేయవలసిన కార్యాన్ని పూర్తిగా చేసి తన తండ్రి చిత్తాన్ని నెరవేర్చాడు. "ఎట్లనగా మనమింకను పాపులమైయుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8). విమోచనను పరిశుద్ధతను పొందిన నీవు క్రీస్తును విడిచి ఉండలేవు. "మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాపనేరవని ... " (రోమా 8:38-39) పౌలు చెప్పడంలో ఆశ్చర్యం లేదు.

పరిశుద్ధతమూలంగా నీకు క్రీస్తుతో ఐక్యత సాధ్యమవుతుంది. క్రీస్తుద్వారా తండ్రితో నీవు అనన్యత కలిగి ఉంటావు. ఇదంతా క్రీస్తు బలియాగంద్వారానే సాధ్యమయ్యింది. కారణం (లేదా, ప్రేరణ) వేరు; ఫలితం (ఫలం, లేదా పరిణామం) వేరు. క్రీస్తు బలియాగంద్వారా సిద్ధించిన విమోచన మరియు పరిశుద్ధతద్వారా నీలో కలిగిన పరిణామం విధేయత, సేవ, ప్రార్థన, కృతజ్ఞత, స్తుతి.

అక్టోబర్ 21

## భావోద్వేగాలా? శిష్యత్వమా?

“ప్రియులారా, మీరు విశ్వసించు అతిపరిశుద్ధమైనదాని మీద మిమ్మును మీరు కట్టుకొనుచు ... ” (యూదా వ. 20-21)

మన ప్రభువుగురించి మనం తీసుకొనే నిర్ణయాల్లో సహజప్రేరణలకు భావోద్వేగాలకు తావు లేదు. నెమ్మదితో కూడిన శక్తి మనల్ని ఏ వత్తిళ్లకు గురిచేయదు; ఏ భయాందోళనలు మన దరి చేరవు. మనలో అనేకులు తమ సహజ స్వభావాన్ననుసరించి క్రైస్తవ జీవితాన్ని కట్టుకుంటున్నారు. భావోద్వేగాలు మన స్వాభావిక జీవితానికి సంబంధించిన లక్షణాలు. మన ప్రభువు వీటినసలు పట్టించుకోడు. ఎందుకంటే ఇవి శిష్యుని ఎదుగుదలకు ఆటంకంగా ఉంటాయి. మనలోని భావోద్వేగాల్ని సహజప్రేరణల్ని మనం నిగ్రహించుకోడానికి మనకు పరిశుద్ధాత్మ సహాయం చేసినప్పుడు మన ఆలోచనలు ఎంత బుద్ధిహీనంగా ఉన్నాయో మనం గ్రహించగలం. భావోద్వేగాల్ని అదుపుచేసుకోలేకపోవడం చిన్నపిల్లల నైజం. అయితే ఇది పెద్ద వారిలో విపత్కర పరిస్థితులకు దారితీస్తుంది. భావోద్వేగాల్ని అదుపుచేసుకోలేని వ్యక్తి తనకు తానే ఆపదలు కొనితెచ్చుకుంటాడు. అంతర్దృష్టి కలిగేలా భావోద్వేగాల్ని అదుపుచేసుకోడం వ్యక్తిత్వానికి పరిణతి తెస్తుంది.

శిష్యత్వానికి మూలం దేవుని కృప. దేవునికొరకు అసాధారణమైన కార్యాలు చేయాలని మనం త్వరపడుతుంటాం; గానీ చేయలేకపోతుంటాం. పేతురు భావోద్వేగంతో నీళ్లమీద నడిచి యేసును సమీపించాలనుకున్నాడు. అయితే యేసుకు ఆపదసమయం యెదురైనప్పుడు వెంట ఉండవలసిన పేతురు యేసును “దూరమునుండి” వెంబడించాడు (మార్కు 14:54). శిష్యత్వానికి పరీక్ష ఎదురైన విపత్కర పరిస్థితుల్లో మనం శిష్యులుగా కొనసాగడం దేవుని కృపద్వారా మాత్రమే సాధ్యం. దైనందిన జీవితంలో ఎదురయ్యే వత్తిళ్లను ఇంగితజ్ఞానంతో ఎదుర్కోగలం. అయితే ప్రతి రోజూ ఇరవైనాలుగు గంటలూ శిష్యుడిగా జీవించాలంటే దేవుని అద్భుతకృప అవశ్యంగా కావాలి. దేవునికొరకు అసాధారణమైన పనులు చేయాలనుకోడం మన హృదయంలో అంతర్నిహితంగా ఉంటుంది. అయితే చేయం; చేయలేం. సాదాసీదాగా అతిసాధారణంగా ఉన్న మన దైనందిన జీవితంలో మనం అసాధారణంగా ఉండాలి; నిత్యకృత్యాల్లోను సాటిమనుషులతో సంబంధబాంధవ్యాల్లోను పవిత్రంగా ఉండాలి. అయితే ఇది అయిదు నిమిషాల్లో నేర్చుకొనే విషయం కాదు. శిష్యత్వం జీవితకాలపు ప్రక్రియ.

అక్టోబర్ 22

## ఆత్మ ఇచ్చే సాక్ష్యం

"ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు" (రోమా 8:16)

మన ప్రభువు అనుగ్రహించిన విమోచనకు సాక్షి దేవుని ఆత్మ. మనలో ఉన్న ఇంగితజ్ఞానానికి దేవుని ఆత్మ సాక్షి కాదు. మనం కొన్నిసార్లు మన ఇంగితజ్ఞానంతో తీసుకొనే నిర్ణయాలు మనలో ఉన్న దేవుని ఆత్మకు తెలుసనుకుంటాం. దేవుని ఆత్మ మనలో ఉన్న దేవుని స్వభావానికి, మన విమోచనకు మాత్రమే సాక్షి గానీ, మన స్వాభావిక జ్ఞానానికి సాక్షి కాదు. మన స్వాభావిక జ్ఞానానికి దేవుని ఆత్మను మనం సాక్షిగా చేస్తున్నట్లయితే మనం అనిశ్చయత లోను అస్పష్టతలోను ఉన్నామని అర్థం. నీ స్వంత జ్ఞానాన్ని విడిచిపెట్టి దేవునిమీద మాత్రమే ఆధారపడు. అప్పుడు దేవుని ఆత్మ సాక్షిగా ఉంటాడు.

దేవునితో బేరాలాడే నైజం మనలో ఉంటుంది. దేవుడు మనల్ని చెయ్యమన్న పని మనమింకా చేయకమునుపే దేవుని ఆత్మ మనకు సాక్షిగా ఉండాలని కోరుకుంటాం.

దేవుడెందుకు తనగురించి నీకు వెల్లడి చేయడంలేదు? ఆయన చేయడు కూడా? కారణం, నిన్ను నీవు సంపూర్ణంగా ఆయన అధీనతకు అప్పగించుకొనేవరకు ఆయన తన గురించి నీకు వెల్లడిచేయడు. నీలో సంపూర్ణమైన సమర్పణ ఉన్నప్పుడు ఆయన నీలో ఉన్న తన స్వభావానికి సాక్షిగా ఉంటాడు. నీవు పొందిన విమోచనకు తగిన విధంగా నీలో కార్యాలున్నప్పుడు, దేవునితో నీవు వాదించడం ఆపివేసినప్పుడు ఆయన సాక్షిగా ఉంటాడు. దేవుడు నిన్ను పాపంనుంచి విడుదల చేస్తాడా చేయడా అని నీ మనస్సులో నీవు చర్చించుకుంటున్నప్పుడు ఆయన తనగురించి నీకు వెల్లడి చేయడు. నిన్ను నీవు ఎవరితోనో పోల్చుకొని దేవునితో వాదించకు. నీవు చేయవలసిన పని అన్నిటినీ ఉపేక్షించి యేసు దగ్గరకు రావడమే; ఆయన పిలుపును మన్నించడమే. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (మత్తయి 11:28) అని యేసు పిలుస్తున్నాడు. నీవు ప్రయాసల్లో ఉన్నట్లయితే యేసును సమీపించు; నీవు చెడ్డవాడివని గుర్తించినట్లయితే నిన్ను పరిశుద్ధపర్చమని ఆయణ్ణి అడుగు (లూకా 11:9-13 వచనాలు చూడండి).

అక్టోబర్ 23

**పాత జీవితం ఇక వద్దు!**

“ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను” (2 కొరింథీ 5:17)

దేవుడు మనలో ఉన్న పూర్వభావనల్ని పక్షపాతధోరణుల్ని సహించడు. ఆయన వాటిని వ్యతిరేకిస్తాడు. అవి మన పాతస్వభావంతోపాటు గతించవలసిందే. దేవుడు మనలో ఉన్న కొన్ని పూర్వభావనలపట్ల ఆసక్తి కలిగి ఉన్నాడని, ఆయన వాటి నంగీకరిస్తాడని మనం ఆలోచిస్తుంటాం. ఇతరుల విషయంలో అవి తప్పు కాబట్టి దేవుడు వాటిపట్ల కఠినంగా వ్యవహరించాలని, మనలో ఉన్న పూర్వభావనలు సరైనవి కాబట్టి దేవుడు వాటి నంగీకరించాలని మనం ఆలోచిస్తుంటాం. అయితే ఒక విషయాన్ని మనం జ్ఞాపకం పెట్టుకోవాలి. దేవుడు మనలో ఉన్న పాత స్వభావానికి, మన పాత జీవితానికి సంబంధించిన దాన్నేదీ సహించడు. ఆయన మనలో ఉన్న పక్షపాతధోరణుల్ని పూర్వ భావనల్ని కూలద్రోస్తున్నాడు. దేవుడు మననుంచి కోరుకునేది ఒక్కటే. అది: ఎటువంటి షరతుల్లేని సంపూర్ణమైన సమర్పణ.

మనం తిరిగి పుట్టినప్పుడు పరిశుద్ధాత్మ మనల్ని నూతన సృష్టిగా చేస్తాడు. మనలో పాత జీవితానికి సంబంధించినదేదీ ఉండని సమయం వస్తుంది. విషాద భరితమైన మరియు వ్యాకులతతో నిండిన పాత జీవితవైఖరి గతిస్తుంది. నూతనసృష్టిలో ప్రతిదీ “దేవునివలననైనవి” (5:18). పాపేచ్ఛలు స్వార్థతలంపులు లేని నూతన స్వభావమెలా సాధ్యమయ్యింది? ఇతరుల అపహాస్యపు పలుకుల్ని పట్టించుకోని స్వభావమెలా సాధ్యమయ్యింది? దీర్ఘకాలం సహించే ప్రేమ, దయ చూపే ప్రేమ, మత్సరపడని ప్రేమ, అపకారాన్ని మనస్సులో పెట్టుకొనని ప్రేమ (1 కొరింథీ 13:4,5) మనలో ఎలా సాధ్యమయ్యింది? పాత స్వభావం మరియు పాత జీవితం పూర్తిగా గతించినందుకే కదా! దేవునిలో పరిపూర్ణమైన నమ్మకాన్ని కలిగి ఉన్నందుకే కదా! దేవుణ్ణి తప్ప మరి దేన్నీ కోరుకోని అచంచలమైన విశ్వాసాన్నిబట్టి కదా! దేవుణ్ణి మాత్రమే కోరుకునే పరిణతి మనలో ఉన్నప్పుడు, మన పరలోకపు తండ్రిమీద మనకు అపార నమ్మకం వున్నప్పుడు మన చుట్టూ ఎటువంటి పరిస్థితులున్నా మనం దేనికీ భయపడం!

అక్టోబర్ 24

## సరైన దృక్పథం

“ప్రతి స్థలమందును క్రీస్తును గూర్చిన ... విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము” ( 2 కొరింథీ 2:14)

సరైన దృక్పథం ఒక్కటే. విజయాలు క్రీస్తువి. మనం క్రీస్తుకు చెందినవారం కాబట్టి ఆయన విజయాల్నిబట్టి ఉత్సహిస్తున్నాం. అయితే మనల్ని దేవుడు తన విజయచిహ్నాలుగా చూడడం లేదు. మనం నిర్వ ర్తించవలసిన విధి ఒక్కటే. “ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి ... సంపూర్ణ విధేయతను” (2 కొరింథీ 10:5) చూపించాలి. దీనిముందు తక్కినవన్నీ అప్రధానమైనవే! కొన్ని ఉదాహరణలు చూద్దాం: “ఒంటరిగా నేను యేసుకొరకు యుద్ధం చేస్తున్నాను”, “నేను క్రీస్తుకొరకు పోరాడాలి” అని చెప్పేవారున్నారు. అయితే పౌలు “ప్రతి స్థలమందును క్రీస్తును గూర్చిన ... విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము” అని చెబుతున్నాడు. అంటే క్రీస్తుకొరకు ఎన్ని శ్రమలెదురైనా ఎన్ని కష్టాలొచ్చినా క్రీస్తు పొందిన విజయాన్నిబట్టి తాను కూడా విజేతననే భావం పౌలు మాటల్లో కనిపిస్తోంది కదా! ఈ భావన నేడు మనలో ఉందా? క్రీస్తును వ్యతిరేకించే పౌలును దేవుడు క్రీస్తుకు బందీని చేశాడు. పౌలు తనకొరకు విజయాల్ని కోరుకోలేదు గానీ క్రీస్తుకు బందీగా ఉండడమే తన జీవితలక్ష్యంగా ఎంచుకున్నాడు. ప్రతి దాంట్లోను విజయాన్ని కోరుకొనే మనం పౌలు జీవితలక్ష్యాన్ని చూసి సిగ్గుపడవలసి ఉన్నాం. మనం విజేత అయిన క్రీస్తుకు చెందినవారం. ప్రతి విజయం క్రీస్తుదే కాబట్టి “మనలను ప్రేమించినవానిద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందు చున్నాము” (రోమా 8:37).

“మేము దేవునికి క్రీస్తు సువాసనయై యున్నాము” (2 కొరింథీ 2:15) అని పౌలు చెబుతున్నాడు. యేసు సువాసన మనల్ని ఆవరించి ఉంది. మనమెక్కడికి వెళ్లినా మనం యేసు సువాసనను వెదజల్లుతూ ఉన్నాం.

కాబట్టి దేవుని సేవకునికి ఉండవలసిన దృక్పథమేది? అతని దృక్పథం ఉన్నతమైనదై ఉండాలి. దేవుని దృక్పథాన్ని నీ దృక్పథం చేసుకో. ప్రతి రోజూ దేవుని దృక్పథాన్ని కొద్ది కొద్దిగా నీ అనుదిన జీవితంలో ఆచరణలో పెట్టు. దేవుని దృక్పథం ఇంతటితో ముగిసిందని ఆలోచించకు. బాహ్యశక్తులేవీ నీలో ఉన్న దేవుని దృక్పథాన్ని తాకలేవు.

అక్టోబర్ 25

## దేవుని ఉద్దేశంపట్ల సంపూర్ణ విధేయత

"ఏ విధముచేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధములవాడనై యున్నాను" (2 కొరింథీ 9:22)

"నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని" (యోహాను 15:16) అని యేసు చెబుతున్నాడు. నీవు దేవుణ్ణి ఎన్నుకోడం కాదు గానీ ఆయనే నిన్ను ఏర్పరచుకొని నియమించుకున్నాడు. దేవుడు నిన్ను తనకొరకు ఏర్పరచుకోడానికి ఆయన ఏం చేయాలో అది చేస్తాడు. దేవుడు నిన్ను ఏర్పరచుకోడంలో ఆయనకున్న ఉద్దేశం ఒక్కటే. ఆయనకు నీవు కావాలి. దేవుడు మనల్ని క్రీస్తు అనే బండమీద నిలబెట్టినట్టుగా అనేకుల్ని క్రీస్తు అనే బండమీద నిలబెట్టడానికి ఆయనకు మనం కావాలి.

దేవుడు నిన్ను పిలుస్తున్నాడు. ఆయన పిలుపునందుకున్న నీవు "కుడికిగాని యెడమకుగాని" (ద్వితీ 28:13) తిరగడానికి వీల్లేదు. పిలుపునందుకొనక పూర్వం నీవు ఊహించనైనా ఊహించని కార్యాల్ని దేవుడు నిన్ను పిలిచిన తర్వాత నీ ద్వారా చేస్తాడు. ఆయన ఇతరులద్వారా చేయని కార్యాల్ని నీద్వారా చేస్తాడు. ఆయన నిన్నెలా వాడు కుంటాడో అలాగే వాడుకోనివ్వు.

మన చుట్టూ అరకొర పరిస్థితులున్నప్పటికీ దేవుని బిడ్డలమైన మనం ఆయనకు తగినవారిగా జీవించడం నేర్చుకోవాలి. "పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉన్నట్లయితే బాగుండేది" అని చెప్పకు. దేవుడు అతిసాధారణమైనవారినే ఎన్నుకొని తన మహోన్నత ఉద్దేశంకొరకు వారిద్వారా అసాధారణమైన కార్యాల్ని జరిగిస్తాడు. మన మనసుల్లోని ఆలోచనలు మన హృదయాల్లోని అనుభూతులు సరైన దృక్పథంచుట్టూ తిరగకపోయి నట్లయితే మన దృష్టి దేవునిమీదనుంచి ప్రక్కకు మళ్లుతుంది. అనేకులు తమ స్వంత ఆలోచనల ప్రకారం సేవ చేయాలనుకుంటారు. అయితే సేవ దేవుని మహోన్నత ఉద్దేశంకొరకు ఆయన కృపనుబట్టి చేసే సేవగా ఉండాలి. పౌలు సేవను చూద్దాం. యేసు క్రీస్తు ఉద్దేశాలకు పౌలు తన దేహాత్మల్ని సంపూర్తిగా లోబర్చాడు. పౌలు ధ్యాస యేసే. మనలో కూడా నిరంతరం ఈ ధ్యాసే ఉండాలి. "నేను, యేసు క్రీస్తును అనగా, సిలువవేయబడిన యేసు క్రీస్తును తప్ప, మరి దేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" (1 కొరింథీ 2:2). ఇది పౌలు తీర్మానం. నీ తీర్మానమేమిటి?

అక్టోబర్ 26

## సేవకుడంటే ఎవరు?

"తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నానని వారితో చెప్పెను" (యోహాను 20:21)

దేవుడు తన కుమారుడైన యేసును క్రీస్తును పంపిన విధంగా యేసు క్రీస్తు తన శిష్యుల్ని పంపిస్తున్నాడు. ఇక్కడ ప్రధానమైనది యేసు ఆజ్ఞ మాత్రమే; ప్రజల అవసరాలు కాదు. ప్రేరణ భవిష్యత్‌కాలానికి సంబంధించినది కాదు; ప్రేరణ ఉంది కాబట్టే మనం సేవకు సిద్ధమయ్యాం. మనకు ప్రేరణ యేసే. ఆయన తప్ప మరేదీ మన సేవకు ప్రేరణ కాకూడదు. అయితే మన ముందున్న లక్ష్యాలన్నిటినీ సాధించే దిశలో ముందుకు నడుస్తూ మనం పొందబోయే విజయాల్నే మనం ప్రేరణలుగా భావిస్తున్నాం. ఇది వాక్యానుసారమైన ప్రేరణ కాదు; ఇటువంటి ప్రేరణ మనకు క్రొత్త నిబంధనలో ఎక్కడా కనబడదు. మన జీవితలక్ష్యం యేసుపట్ల యథార్థంగా ఉండడమే; ఆయన ప్రణాళికల్ని కార్యరూపంలో పెట్టడమే.

సేవకునికి ప్రభువైన యేసుతో వ్యక్తిగత అనుబంధం వుండాలి. యేసు దృక్పథమే సేవకుని దృక్పథం కావాలి. ఈ విషయాన్ని సేవకుడెన్నడూ మర్చిపోకూడదు. సేవలో మనకొక విపత్కర పరిస్థితి ఎదురవుతుంది. మనం కొన్ని సార్లు దేవుని పిలుపును ప్రక్కనబెట్టి మనుషుల అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తుంటాం. కొన్ని సార్లు మనుషుల అవసరాలపట్ల సానుభూతి ఎక్కువై యేసు మనల్నెందుకు పంపించాడో కూడా మర్చిపోతుంటాం. మనుషుల అవసరాలు లెక్కకు మించి ఉంటాయి; దుర్భరమైన పరిస్థితులుంటాయి; మనుషుల ఆలోచనలు విఫలమవుతాయి. "మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి ... " (మత్తయి 28:19) అని యేసు మనకిచ్చిన ప్రధాన ఆదేశమే మన సేవకు ప్రేరణగా ఉండాలి తప్ప మనుషుల అవసరాలు కాదు.

సేవలో ఉన్నవారిని చూస్తూ "వీరికెంత జ్ఞానం వుందో! దేవుని ఉద్దేశాల్ని వీరు పరిపూర్ణంగా అర్థం చేసుకున్నారు" అని మనం కొన్ని సార్లు ఆశ్చర్యపోతుంటాం. అయితే వీరికి ప్రేరణ వీరి స్వంత తెలివితేటలు స్వంత శక్తిసామర్థ్యాలు కాదు. దేవుని ఆలోచనలు ఆయన ఉద్దేశాలు వీరిని సేవకు ప్రేరేపిస్తున్నాయి. అయితే మనం మనుషులకిచ్చిన ఘనతను సామాన్యులద్వారా ఘనమైన కార్యాల్ని జరిగించే దేవుని కివ్వడంలేదు.

అక్టోబర్ 27

## సేవ విధానం

"మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి ... " (మత్తయి 28:19)

నీవు శిష్యుడివిగా ఉంటే తప్ప ఇతరుల్ని శిష్యుల్ని చేయలేవు. శిష్యులు తమ తొలి ప్రయాణం తర్వాత ఎంతో సంతోషంతో యేసు దగ్గరకు వచ్చి తమకు దయ్యాలు కూడా లోబడుతున్నాయని ఉత్సాహంగా చెప్పారు. అయితే యేసు ఏ జవాబు చెప్పాడో చూడండి: "దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడి యున్నవని సంతోషించుడని వారితో చెప్పెను" (లూకా 10:20). సేవలో ఉన్న విజయాల్నిబట్టి సంతోషించవద్దని, దేవునితో సరైన సంబంధం కలిగి ఉండడమే నిజమైన సంతోషమని ప్రభువు చెబుతున్నాడు. సేవకుడు దేవుని పిలుపుపట్ల యథార్థంగా ఉండాలి. ఇది సేవకునికి అనివార్యం! పిలుపు అనేకుల్ని యేసుకు శిష్యుల్ని చేయడం కొరకే. ఆత్మల రక్షణకొరకు కొందరిలో తీవ్రమైన ఉద్వేగం వుంటుంది. అయితే ఈ ఉద్వేగం దేవుని మూలంగా కలిగినది కాకపోవచ్చు. ఇది తన సిద్ధాంతాల కనుగుణంగా ఇతరుల్ని మార్చుకొనే ఉద్వేగం కావచ్చు.

ఇతరుల్ని రక్షణలోకి నడిపించడం సేవకుడికి సవాలుగా ఉండకపోవచ్చు గానీ విశ్వాసం నుంచి తప్పిపోయినవారిని తిరిగి విశ్వాసంలోకి మళ్లించడం సేవకుడికి సవాలు వంటిదే! సవాలు కష్టమైనదా కాదా అనే విషయం యేసుతో అతనికున్న వ్యక్తిగతమైన సంబంధంమీద ఆధారపడి ఉంటుంది. "నేను ఇది చేయగలనని మీరు నమ్ముచున్నారా" (మత్తయి 9:28) అని యేసు మనల్ని ప్రశ్నిస్తున్నాడు. యేసు మనల్ని ఏ సంకోచం లేకుండా ఈ ప్రశ్న అడుగు తున్నాడు. ఈ ప్రశ్న మన జీవితంలో ఎదురయ్యే ప్రతి సందర్భానికి తగినటువంటి సవాలే! సేవకుడవైన నీ ముందున్న గొప్ప సవాలు పునరుత్థానుడైన యేసు నీకు వ్యక్తిగతంగా తెలుసా? నీలో నివసించే పరిశుద్ధాత్మకున్న శక్తి మరియు ప్రభావం నీకు తెలుసా? లోకం దృష్టిలో నీవు అవివేకిగా కనిపిస్తున్నప్పటికీ దేవుని దృష్టిలో యోగ్యుడిగా ఉన్నావా? యేసుకు సర్వాధిపత్యం వుందనే నమ్మకం నీలో ఉందా? ఆయన సర్వాధిపతి కాబట్టే నిన్ను పిలుస్తున్నాడు. దేవుని పిలుపు తప్ప నీకు సేవచేయడానికి మరో మార్గం ఉన్నట్లయితే ఆయనకు నీవు చాలా దూరంలో ఉన్నావని అర్థం. "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది" (మత్తయి 28:18). సర్వాధిపతి అయిన యేసు క్రీస్తు నిన్ను పిలుస్తుండగా సేవ తప్ప నీకు మరో మార్గం వుందా?

అక్టోబర్ 28

## విశ్వాసంద్వారా నీతిమంతులుగా తీర్చబడడం

"ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణముద్వారా మనము దేవునితో సమాధానపరచబడినయెడల సమాధానపరచబడినవారమై, ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:10)

దేవుడు యేసు క్రీస్తుద్వారా నెరవేర్చిన కార్యాన్ని నీవు గుర్తించావని తెలిపే సూచనే పశ్చాత్తాపం. కారణాన్ని వదిలిపెట్టి ఫలితంమీద దృష్టి పెట్టడం నేడు విరివిగా జరుగుతోంది. కారణం క్రీస్తు; ఫలితం విమోచన. నీ విధేయత నీ సమర్పణ నీ భక్తి నిన్ను దేవునితో సమాధానపర్చాయా? కానే కాదు! క్రీస్తు సిలువ మరణం నిన్ను దేవునితో సమాధానపర్చింది. నీవు దేవునివైపు మళ్లినప్పుడు, దేవుడు వెల్లడిచేసినవాటిని నీవు నమ్మినప్పుడు క్రీస్తు సిలువ బలియాగం అద్భుతరీతిలో నిన్ను దేవునితో సమాధాన పరుస్తుంది. నీవు నీ పాపాల విషయంలో పశ్చాత్తాపం పొందినందుకు నీవు నీతిమంతుడవు కాలేదు గానీ దేవుని కృపద్వారా మాత్రమే నీవు నీతిమంతుడవుగా తీర్చబడ్డావు. దేవుని పరిశుద్ధాత్మ నీ పాతస్వభావాన్ని పటాపంచలు చేసి నిన్ను వెలుగుతో నింపి నీతిమంతుడిగా తీర్చాడు. నీవు రక్షించబడ్డావని నీకు తెలుసు.

రక్షణ మానవతర్కానికి అతీతమైనది. దేవుడనుగ్రహించే రక్షణకు మూలం మన ప్రభువు సిలువ బలియాగం మాత్రమే. క్రీస్తు సిలువ బలియాగం దేవుడు మానవజాతి విమోచనకొరకు ఉద్దేశించిన పవిత్రకార్యాన్ని నెరవేర్చి రక్షణ ప్రసాదించింది. మానవులు తమకు తాముగా రక్షణ పొందలేరు; తమకు తాముగా పరిశుద్ధులు కాలేరు. మన రక్షణకు పరిశుద్ధతకు క్రీస్తు సిలువే కారణం. స్వాభావికమైన మన జీవితాల్లో విమోచన ద్వారా ఒనగూడిన పరిశుద్ధత నిజంగా దేవుని అద్భుతకార్యమే! క్రీస్తు మన విమోచనను పరిసమాప్తి చేశాడు. యోహాను 19:30 వచనం చూడండి.

అక్టోబర్ 29

## ప్రత్యామ్నాయం

"మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" (2 కొరింథీ 5:21)

యేసు మనపట్ల సానుభూతితో సిలువ మరణం పొందలేదు. మన పాపాలకు మనం పొందవలసిన శిక్షను ఆయన తన మీద వేసుకొని మనకొరకు ప్రత్యామ్నాయంగా మరణించాడు. "ఆయనను మన కోసము పాపముగా చేసెను" - ఈ మాటలకు అర్థమిదే! యేసు మరణంమూలంగా మన పాపాలకు క్షమాపణ లభించింది. తన తండ్రికి మానవజాతిపట్ల ఉన్న మహోన్నత సంకల్పంపట్ల యేసు పరిపూర్ణమైన విధేయతతో తనను తాను మారణానికి అప్పగించుకున్నాడు. దీన్ని కేవలం సానుభూతి అని కొట్టి పడవేయకూడదు. క్రీస్తు మరణం మనల్ని దేవునితో సమాధానపరిచినందువల్ల మనం దేవునితో సరైన సంబంధం కలిగి ఉన్నాం తప్ప దేవునియెదుట మనకు ఎటువంటి యోగ్యతల్లేవు. "లోకపాపమును మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1:29) అని యేసుగురించి చెప్పబడింది. యేసు ఈ లోకానికి వచ్చిన కారణమిదే. యేసును తమ రక్షకుడిగా అంగీకరించినవారు ఆయణ్ణి ఈ లోకానికి పంపిన తండ్రిని తెలుసు కుంటారు. "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు ... " (యోహాను 14:9) అని యేసు తన శిష్యులతో చెప్పాడు. యేసు ఎవరో తెలియనివారికి, యేసు నెరవేర్చిన విమోచనకార్యంలో నమ్మకం లేనివారికి, యేసు మరణంతో సహానుభవం లేనివారికి దేవుడే పరలోకపు తండ్రి అని తెలిసే ఆస్కారం లేదు. పైగా వీరు తనను, తన తండ్రిని ద్వేషిస్తున్నారని యేసు చెబుతున్నాడు (యోహాను 15:24).

"ఆయన అందరికొరకు మృతిపొందెననియు ... " (2 కొరింథీ 5:15) క్రొత్త నిబంధన తెలియజేస్తోంది. అంటే మనుషుల్లో పాపంలేదని, మనుషులు శిక్షావిధి క్రిందకు రారని అర్థమా! కానే కాదు! యేసు మరణంతో సహానుభవం కలిగినవారు మాత్రమే, అంటే యేసు మరణ పునరుత్థానాలపట్ల పరిపూర్ణమైన విశ్వాసంతో ఆయణ్ణి స్వంత రక్షకుడిగా అంగీకరించేవారు మాత్రమే పాపక్షమాపణపొంది దేవుడనుగ్రహించే నీతికి వారసులౌతారు. ప్రత్యామ్నాయం రెండు విధాలు: ఒకటి "ఆయనను మన కోసము పాపముగా చేసెను"; రెండవది "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు " - అంటే మనం నీతిమంతులుగా తీర్చబడ్డాం. నీ కొరకు మరణించిన క్రీస్తు స్వరూపం నీలో ఏర్పడడమే నిజమైన విశ్వాసజీవితం (గలతీ 4:19 వచనం చూడండి).

అక్టోబర్ 30

## విశ్వాసం

"విశ్వాసములేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6)

స్వాభావిక జీవితం వేరు, ఆధ్యాత్మిక జీవితం వేరు. ఉద్వేగం వేరు, ప్రేరణ వేరు. ఇంగితజ్ఞానం వేరు, విశ్వాసం వేరు. విశ్వాసాన్ని సంకుచితదృష్టి అనేవారున్నారు. ఇంగితజ్ఞానంతో సత్యాన్వేషణ సాధ్యమనేవారున్నారు. విశ్వాసజీవితం విశ్వాసాన్ని ఇంగితజ్ఞానాన్ని సమన్వయపరుస్తుంది. యేసు మనుషుల్లో ఉన్న ఇంగితజ్ఞానంగురించి బోధించలేదు; ఆయన ఇంగితజ్ఞానానికి అందనివాటిని వెల్లడి చేశాడు. వీటిని పరిపూర్ణమైన విశ్వాసంద్వారా మాత్రమే మనుషులు గ్రహించగలరు. అయితే విశ్వాసం నీ జీవితంలో వాస్తవ మయ్యేలోపు పరీక్షకు గురవుతుంది. "సమస్తమును సమకూడి జరుగుచున్నవని ... " (రోమా 8:28) బైబిలు చెబ్తోంది. దేవుని శక్తిప్రభావాలు అనూహ్యం. ఆయన నీ జీవితంలో పరిపూర్ణమైన విశ్వాసాన్ని వాస్తవీకరిస్తాడు. దేవుడు తన పిల్లల్లో పరిపూర్ణమైన విశ్వాసం వెల్లడి కావాలని ఎదురుచూస్తున్నాడు.

విశ్వాసం నీ జీవితాన్ని నడిపించే చోదకశక్తి కావాలి. అప్పుడే నీవు విశ్వాసాన్ని కార్యరూపంలో పెట్టగలవు. మత్తయి 6:33 వచనం చూడండి: "ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును". యేసు మాటల్ని విశ్వసిస్తూ నీతిని వెతుకు, యేసు రాజ్యాన్ని వెతుకు. ఇది నీ జీవితంలో గొప్ప పోరాటమే. ఎందుకంటే పోరాటంలేని విశ్వాసంలేదు. మన విశ్వాసాన్ని పదునుపెట్టే సందర్భాల్ని దేవుడు రప్పిస్తాడు. పరీక్షకు గురై పదునుపెట్టబడిన విశ్వాసం మనల్ని మరింత విశ్వాసంలోకి నడిపిస్తుంది. యేసు ఎవరో మనకు తెలిసేవరకు దేవుడు మన జీవితంలో ఒక ఊహ మాత్రమే; మనకు దేవునిగురించి సరైన అవగాహనలేదు. యేసు క్రీస్తు ద్వారా మనం దేవుడెవరో తెలుసుకున్నాం. "నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడు ... " (యోహాను 14:9) అని యేసు బోధించాడు. మనం యేసును చూశాం కాబట్టి మన జీవితంలో దేవుడు ఒక వాస్తవం; మన విశ్వాసం అనంతం. యేసు క్రీస్తుద్వారా దేవునితో సరైన సంబంధం కలిగి ఉండడానికి మనకు విశ్వాసమే సర్వస్వం.

అక్టోబర్ 31

## విశ్వాసానికి పరీక్ష

"మీకు ఆవగింజంత విశ్వాసముండినయెడల ... మీకు అసాధ్యమైనది ఏదియు నుండదని ... " (మత్తయి 17:20-21)

దేవుడు మన విశ్వాసానికి ప్రతిఫలమిస్తాడనే భావన మనందరిలోనూ ఉంది. విశ్వాసజీవితపు తొలి రోజుల్లో ఈ భావన మరింత బలంగా ఉంటుంది. అయితే విశ్వాసం లాభంకొరకు కాదు. విశ్వాసం మనల్ని దేవునితో అన్యోన్య సహవాసంలోకి నడిపిస్తుంది. విశ్వాసమంటే ఆశీర్వాదాల్ని అనుభవించే ఉద్వేగభరితమైన స్థితి కాదని మనం తెలుసుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడు. విశ్వాసానికి ధ్యేయం దేవునితో అన్యోన్యత మరియు అనన్యత మాత్రమే. విశ్వాసజీవితపు తొలి రోజుల్లో నీ అనుభవాలు పరిమిత మైనవిగా ఉంటాయి. విశ్వాసంతోబాటు నీలో ఉద్వేగం కూడా ఉంటుంది. విశ్వాసంద్వారా నడవడమంటే ఏమిటో నీకు బోధించడానికి (2 కొరింథీ 5:6) దేవుడు కొన్ని సార్లు నీకు ఆశీర్వాదాల్ని దూరం చేస్తాడు. విశ్వాసమంటే ఆశీర్వాదాలు మాత్రమే కాదని నీవు గ్రహించిన తర్వాత నీవు దేవునికి అత్యంత ప్రియమైనవాడవు.

విశ్వాసానికి పరీక్ష అనివార్యం. పరీక్ష మనం దేవుణ్ణి విశ్వసిస్తున్నామా కాదా అనేందుకు కాదు! పరీక్ష మనలో దేవుని స్వభావం ఎంత మేరకు ఉందో రుజువు చేయడానికే! నీ జీవితంలో విశ్వాసం వాస్తవమయ్యేటప్పుడు నీకు కొన్ని ఆటుపోట్లు ఎగుడుదిగుళ్లు తప్పవు. దేవునితో విభేదించే ప్రతి విషయం నీ విశ్వాసానికి పరీక్షే. అసలు సిసలు విశ్వాసం ఒకే ఒక ప్రకటనలో రుజువవుతుంది: "ఇదిగో ఆయన నన్ను చంపినను, నేను ఆయనకొరకు కనిపెట్టుచున్నాను" (యోబు 13:15). విశ్వాసానికి ఇంతకంటె ఉన్నతమైన ఇంతకంటె ఘనమైన వ్యక్తీకరణ ఉందా!

నవంబర్ 1

## నీవు నీ సొత్తు కావు

" ... మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు" (1 కొరింథీ 6:19)

పరిశుద్ధత మన స్వంత ప్రయోజనాలకొరకు కాదు. దేవుడు మనల్ని తనతో సహవాసం కలిగి ఉండడడం కొరకు మనల్ని పరిశుద్ధపరచ్చాడు. పరిశుద్ధపర్చబడిన విశ్వాసికి యేసు సువార్తకు మధ్య ఒద్దిక కుదరాలి. మనకు యేసుతో తాదాత్మ్యత, ఆయన శ్రమల్లో సహానుభవం ఉండాలి. నీవు పరిశుద్ధపర్చబడ్డావు కాబట్టి నీ జీవితాన్ని యేసు చేతుల్లో పెట్టు. ఆయన నిన్ను తన కిష్టమైనట్టు వాడుకుంటాడు. లేనట్లయితే ఆయన విమోచనాకార్యంలో ఆయనకు నీవు ప్రయోజనకరంగా ఉండవు సరి కదా అడ్డుగాను ఆటంకంగాను ఉంటావేమో! యేసుతో అన్యోన్యసహవాసం లేనట్లయితే విశ్వాసికి మనుగడ లేదు. మన ఆంతరంగిక జీవితం యేసుకు బాహాటంగా తెలుసు. ఆయనకు కనబడకుండా లోకంలో ఎక్కడా మనం దాక్కొనే చోటు లేదు. ఆయన మన ఆంతరంగిక జీవితాన్ని రెండుగా విభజిస్తున్నాడు: ఒక భాగం లోకంలో ఆయన ఉద్దేశాలు నెరవేర్చడంకొరకు; రెండవ భాగం తనతో అన్యోన్య సహవాసం కొరకు.

దేవుడు మొదటగా మనం తన సత్యంలో లోతుగా నాటుకొని వేళ్లూనుకొని బలంగా ఉండేలా చేస్తాడు. మనం క్రీస్తులో బలంగా వేళ్లూనుకున్నప్పుడు మాత్రమే మన గురించి మనం ఆలోచించడం చింతించడం మానుకుంటాం; అంటే విమోచనపట్ల ఆయన కున్న ఉద్దేశంకొరకు మనల్ని మనం ఆయన అధీనతకు సంపూర్ణంగా అప్పగించుకొనే పరిపక్వదశకు చేరుకునేంత వరకని భావం. అయితే కొంతమంది మొట్టమొదటి శ్రమానుభవంలోనే డీలాపడిపోతారు. మన మీద మనమే జాలిపడుతూ ప్రభువుకొరకు నిరుపయోగంగా ఉంటాం. ఇది మనల్ని నిస్సార పరుస్తూ నిష్ఫలతకు నడిపిస్తుంది. అయితే దేవుడు దీన్ని సమ్మతించడు. ఆయన తన కుమారుడైన యేసు చేతిని మనకు ఆసరగా ఇస్తాడు. "లెమ్ము, తేజరిల్లుము" అని ఆయన మనల్ని పిలుస్తున్నాడు. బలహీనులమైన మనద్వారా, గుండెధైర్యంలేని మనద్వారా దేవుడు తన ఉద్దేశాల్ని లోకంలో నెరవేర్చుతున్నందుకు ఆయణ్ణి స్తుతించకుండా ఉండగలమా?

నవంబర్ 2

## విధేయతా? లేక స్వతంత్రతా?

"మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15)

మన ప్రభువు తనకు విధేయత చూపమని మనల్ని వత్తిడి చేయడు. విధేయత మన ఇచ్ఛకు వదిలివేయబడిన విషయం. అయితే మనం చేయవలసినదానిగురించి ఆయన నిశ్చయాత్మకంగా చెబ్తాడు. అయితే దాన్ని చేయమని ఆయన మనల్ని బలవంతపెట్టడు. అందుకే మన ప్రభువు విధేయతగురించి మాట్లాడిన ప్రతి సారీ "యెడల" అనే పదాన్ని ఉపయోగిస్తున్నాడు. అంటే ఆయన చెప్పిన ప్రకారం చేయడం, లేదా చేయకపోవడం మన ఇష్టానికి వదిలివేయబడిన విషయం. "ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతి దినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింప వలెను" (లూకా 9:23). "నా శిష్యుడు కావాలనుకున్న వ్యక్తి తనమీద తనకున్న హక్కును వదులుకోవాలి" అనే అర్థం కనిపిస్తోంది కదా! మన ప్రభువు నిత్యత్వంగురించి ఇక్కడ మాట్లాడడంలేదు. ఈ లోకంలో మనం ప్రభువుపట్ల చేయవలసినదానిగురించి మాట్లాడుతున్నాడు. లూకా 14:25-26 వచనాలు చూడండి. మన ప్రభువు మాటలు ఎంత కచ్చితంగా కనిపిస్తున్నాయో కదా! ఈ మాటలనుంచి యేసును వేరుచేసి చూసే ప్రయత్నం చేయవద్దు.

ప్రభువు నిన్ను కట్టడి చేయడంలేదు. అయితే, ఆయన తన నిర్దిష్టనియమాల్ని స్పష్టంగా చెప్పాడు. నీకు యేసుతో ఉన్న సంబంధం ప్రేమబంధమైతే ఆయన నీతో చెప్పినవి చెప్పినట్టుగా చేస్తావు. చేయడానికి నీవు సందేహించినట్లయితే ఆయనపట్ల నీకున్న ప్రేమతో నిన్ను నీవే పోటీకి నిలబెట్టుకుంటున్నావని అర్థం. యేసు నిన్ను తనకు విధేయత చూపమని వత్తిడి చేయడంలేదు. అయితే నీవు విధేయత చూపాలి. ఆయనకు విధేయతచూపిన తత్క్షణమే నీవు ఆధ్యాత్మిక గమ్యానికి దగ్గరగా ఉన్నావని అర్థం. జీవితంలో నీకెదురైన సందర్భాలు అతిసామాన్యమైనవే కావచ్చు; అవి ఏ మాత్రం ప్రాముఖ్యత ఉన్నవి కాకపోవచ్చు. అయితే నీవు యేసు క్రీస్తుకు విధేయత చూపినప్పుడు ఏ మాత్రం ఎన్నదగని సందర్భాలద్వారానే నీవు దేవుణ్ణి చూడగలుగుతావు. నీవు దేవుని యెదుట ముఖాముఖిగా నిలబడినప్పుడు నీ విధేయతద్వారా అనేకులు ఆశీర్వదించ బడ్డారని తెలుసుకుంటావు. నీవు యేసు క్రీస్తుకు విధేయత చూపినప్పుడు ఆయన తన విమోచనను అనేకులకు అందించడానికి నిన్ను వాడుకుంటాడు. దేవుడు మనల్ని విమోచించి విధేయతకు నడిపించినప్పుడు విధేయతకు తప్పక ఫలితాలుంటాయి.

నవంబర్ 3

## యేసుకు దాసుడు

"నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు ... " (గలతీ 2:20)

ఈ మాటలకు నా స్వహస్తాలతో నేను నా స్వేచ్ఛను కోల్పోతున్నానని, నా జీవితాన్ని ప్రభువైన యేసు అధీనతకు అప్పగించుకుంటున్నానని అర్థం. ఇది నా అంతట నేను చేయవలసినదే తప్ప ఇతరులు నాకొరకు చేసే కార్యం కాదు. తనకు లోబడడానికి దేవుడు నాకు పలు అవకాశాలు రప్పిస్తాడు. అయితే లోబడవలసినది నేనే. నా స్వంత ఆలోచనల్ని, నాలో ఉన్న స్వాభావికమైన కోరికల్ని ప్రక్కనపెట్టి యేసుపట్ల అప్రతిహతమైన విధేయత చూపవలసిన బాధ్యత నాదే. నా చుట్టూ నేను ఏర్పరుచుకున్న వలయాన్ని ఛేదించుకొని యేసు వద్దకు రావలసినది నేనే. "నా నిమిత్తము ... " (మత్తయి 5:11) అని యేసు పలికిన మాటలు మనలో ఎంతమందికి అర్థమవుతున్నాయి? అర్థం చేసుకున్నవారే నిజమైన శిష్యులు.

నా చుట్టూ నేనేర్పరుచుకున్న కవచాన్ని తుత్తునియలు చేయగలిగానా? నేను నా స్వేచ్ఛను కోల్పోయి ప్రభువు దగ్గరకు రాగలనా? లేక, మతాచారాల మిథ్యలో కూరుకుపోయి ఉన్నానా? నేను బేషరతుగా యేసు క్రీస్తుకు లోబడడానికి సిద్ధంగా ఉన్నానా? ముందుగా నేను నాగురించి ఆలోచించడం మానుకోవాలి. అప్పుడే నాకు యేసు క్రీస్తుతో తాదాత్మ్యత సాధ్యమవుతుంది. అప్పుడు మాత్రమే దేవుని ఆత్మ నాగురించి సాక్షిగా ఉంటాడు. "నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు ... " - పౌలు జీవితం ఈ తాదాత్మ్యతనే వివరిస్తోంది.

ఒక వ్యక్తి తనపట్ల తనకున్న హక్కుల్ని పోగొట్టుకోడానికి సిద్ధపడి యేసుకొరకు తనను తాను అర్పించుకోడమే నిజమైన క్రైస్తవ స్ఫూర్తి. అందుకే తనను తాను క్రీస్తు కొరకు అంకితం చేసుకున్న పౌలు తన గురించి "యేసు క్రీస్తు దాసుడనని" చెబుతున్నాడు. పరిశుద్ధతకు మరో కోణం క్రీస్తుకు దాసులుగా ఉండడం.

నవంబర్ 4

## సత్యానికున్న అధికారం

“దేవునియొద్దకు రండి, అప్పుడాయన మీయొద్దకు వచ్చును” (యాకోబు 4:8)

నీ అంతరాత్మ దేవుని సత్యాన్ని గ్రహించినప్పుడు ఆయన సత్యాన్ని నీవు నీ హృదయంమీద సిరాతోను రక్తంతోను రాసుకో. అప్పుడు సత్యం నీలో అంతర్భాగమవు తుంది. సత్యాన్ని కార్యాచరణలో పెట్టు. నీకు తారసపడే మనుషులు దేవుని సత్యాల్ని చూడగలిగే అవకాశాల్ని, సత్యాల్ని ఆచరించగలిగే అవకాశాల్ని వారికివ్వు. అయితే చూడడం, ఆచ రించడం వారి పని. వారికి బదులుగా నీవు చూడలేవు, ఆచరించలేవు. ఇది ఎవరికి వారు బాహాటంగా చేయవలసిన క్రియ. అయితే వారిని కార్యాచరణకు నడిపించే సువార్త సందేశాన్నందించడం నీ బాధ్యత. ఎవరైనా దేవుని సత్యాన్ని తిరస్కరించినట్లయితే వారు తమ పూర్వస్థితిలోనే ఉన్నారని అర్థం. అంటే వారు శక్తిహీనులని అచేతనులని అర్థం. అయితే వారు సత్యాన్ని గ్రహించిన మరుక్షణమే వారిలో ఆత్మచైతన్యం మొదలైందని, వారిలో మార్పుకు అంకురార్పణ జరిగిందని అర్థం. సత్యాన్ని గ్రహించిన తర్వాత చైతన్యం లేనట్లయితే వారి ఉనికే ప్రశ్నార్థకం! నేను మనఃపూర్వకంగా సత్యానన్నుసరించిన క్షణాలే నా జీవితంలో సజీవమైన కాలం.

ఎంతటి బలహీనుడైనా సరే యేసు క్రీస్తు దగ్గరకు వచ్చినప్పుడు దేవుని అద్భుత శక్తి అతణ్ణి బలంగా తాకుతుంది. విమోచకుడైన మన ప్రభువు సత్యవాక్కులు ఎంత బలమైనవంటే, ఎంత ప్రభావం కలిగినవంటే ఇక మనం ఆయణ్ణి విడిచి వెళ్లలేం. “ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును” (మత్తయి 11:28) అని మన ప్రభువు మనల్ని పిలుస్తున్నాడు. “రండి” అనే పదం మనం కదిలి, ఆయన చెంతకు నడవాలని తెలియ జేస్తోంది. యేసు పిలుపుపట్ల స్పందించి ఆయన దగ్గరకు చేరినవారు దేవుని బలమైన హస్తాల్లో సేదతీర్చుకుంటారు. ఇంతవరకు వారిని అతలాకుతలం చేసిన శరీరేచ్ఛలు, మరియు అపవాది స్తబ్ధత చెందడం ఖాయం. ఇది నీ అంతట నీవు సాధించిన కార్యం కాదుగానీ నీవు దేవుని విమోచనాకార్యంలో పాల్గొని ఆయన విమోచనాశక్తిని నీలో బాహాటపర్చినందువల్ల ఒనగూడిన కార్యం మాత్రమే!

నవంబర్ 5

## ఆయన శ్రమల్లో భాగస్వాములు

"క్రీస్తు శ్రమలలో మీరు పాలివారైయున్నంతగా సంతోషించుడి" (1 పేతురు 4:13)

నిన్ను దేవుడు తన ఉద్దేశాలకొరకు ఉపయోగించుకోవాలనుకుంటున్నట్లయితే ఆయన నిన్ను పలు అనుభవాలగుండా నడిపిస్తాడు. ఆ అనుభవాలద్వారా నీకు అనేక పాఠాలు నేర్పి నిన్ను తనకు ప్రయోజనకరంగా మలచుకుంటాడు. నీ అనుభవాలు నీకు ఇతరుల అవసరాల్ని బోధపరుస్తాయి. ఈ ప్రక్రియ తర్వాత నీకెటువంటి పరిస్థితు లెదురైనప్పటికీ నీవు గాభరాపడవు. ఒక వేళ నీవు "ఆ వ్యక్తితో నాకు సరిపడదు" "ఈ వ్యక్తితో నాకు పొసగదు" అని చెబ్తావేమో! ఎందుకు సరిపడదు? ఎందుకు పొసగదు? మనుషుల అవసరాలగురించి, వారికెదురయ్యే సమస్యలగురించి నీవు తెలుసుకొనే అవకాశాల్ని దేవుడు నీకు ముందుగానే ఇచ్చాడు. నీవు నేర్చుకున్న పాఠాల్ని నీవు గడించిన అనుభవాల్ని నీవే విస్మరించినట్లయితే నీ సమయం దుర్వినియోగమైనట్లే.

క్రీస్తు అనుభవించిన శ్రమలు సాధారణంగా మనుషులకు కలగవు. ఆయన "దేవుని చిత్తప్రకారము" బాధననుభవించాడు (1 పేతురు 4:19). ఆయన శ్రమానుభవం తక్కినవారను భవించే శ్రమలకు భిన్నమైన అనుభవం. మనకు యేసు క్రీస్తుతో అన్యోన్యత ఉన్నప్పుడు మాత్రమే దేవుడు యేసునెందుకు ఇటువంటి శ్రమానుభవంలో నడిపించాడో గ్రహించగలం. శ్రమల విషయానికొస్తే మనమెందుకు శ్రమననుభవిస్తున్నామో ముందుగానే తెలుసుకోవాలను కోడం క్రైస్తవులమైన మనకు అలవాటుగా మారింది. శ్రమల్ని తప్పించుకోడానికి కూడా మనం ప్రయత్నిస్తుంటాం. మనం దేవుని ఆజ్ఞల్ని ఆదేశాల్ని మన స్వంత పద్ధతుల్లో, మనకు అనుకూలంగా ఉన్న విధానాల్లో నెరవేర్చాలనుకోడం కూడా మనకు అలవాటుగా మారింది. అయితే దేవుని పద్ధతులు వేరు, ఆయన విధానాలు వేరు. ఆయన మనల్ని శ్రమానుభవం ద్వారానే నడిపించాలనుకుంటున్నాడు. ఇది మనకు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ మనకొరకు దేవుడు నిర్దేశించిన మార్గమిదే.

మనం క్రీస్తు శ్రమల్లో సహానుభవం కలిగి ఉన్నామా? మన స్వంత కోరికల్ని త్రుంచి వేసుకొని దేవునికొరకు సిద్ధంగా ఉన్నామా? దేవుడు మన స్వంత నిర్ణయాల్ని పటాపంచలు చేసి తన అద్భుతమైన ఆలోచనల్ని మనకు వెల్లడిచేయడానికి ఆయనకు మనం అనుమతి నిస్తున్నామా? అయితే దేవుడు మనల్ని ఏ అనుభవాల్లో నడిపిస్తున్నాడో మనకు ముందుగా తెలియదు. మనకు తెలిసినట్లయితే మనలో అతిశయం పెల్లుబుకుతుంది. ఆయన అధీనతకు లోబడి ఆయన వెంట నడిచినప్పుడు ఆకస్మికంగా మన ఆత్మలో ఒక వెలుగు ప్రకాశిస్తుంది. అప్పుడు మనం "దేవుడు నాకు తెలియకుండానే నన్ను బలపర్చాడు" అని గుర్తించ గలుగుతాం.

నవంబర్ 6

## సన్నిహితమైన వేదాంతజ్ఞానం

"ఈ మాట నమ్ముచున్నావా ... " (యోహాను 11:26)

యేసు శక్తిలో మార్తకు నమ్మకం వుంది. ఆ సమయంలో యేసు తమ దగ్గర ఉన్నట్లయితే ఆయన తమ సోదరుడ్ని స్వస్థపర్చి ఉండేవాడని కూడా మార్త నమ్మింది. యేసుకు దేవునితో అన్యోన్యత ఉందని కూడా మార్త నమ్మకం. యేసు ఏది అడిగినా దేవుడు చేస్తాడని కూడా మార్తకు తెలుసు. అయితే ఆమె యేసుగురించి ఇంకా తెలుసుకోవలసిన విషయాలు కూడా ఉన్నాయి. భవిష్యత్కాలంలోని సంభవాలపట్ల మార్తకు వేదాంతపరమైన అవగాహన మరియు నమ్మకం కూడా ఉన్నాయి. అయితే మార్త నమ్మకం ఆమె కళ్లకు కనబడే లాగా అత్యంత సన్నిహితమైనదిగా చేయడానికి యేసు ప్రయత్నించాడు. మార్త గ్రహించింది. నమ్మకం ఆమె వ్యక్తిగత స్వాస్థ్య మయ్యింది. "అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నానని ... " (యోహాను 11:27) మార్త మన ప్రభువుతో చెప్పింది.

యేసు ప్రభువు మార్తపట్ల వ్యవహరించినట్లే నీతో కూడా వ్యవహరిస్తున్నాడా? యేసు తనతో అన్యోన్యత కలిగి ఉండమని నీకు బోధిస్తున్నాడా? "ఈ మాట నమ్ముచున్నావా ... " అని ఆయన నిన్ను అడగనివ్వు. నీ మనసులో ఇంకా సందేహాలున్నాయా? మార్తకున్న వేదాంతపరమైన అవగాహన ఆమె జీవితంలో ఆమె కళ్లెదుటే వాస్తవమైన వ్యక్తిగత అనుభవంగా మారినట్టుగా నీ జీవితంలో కూడా అటువంటి ఉదాహరణలేమైనా ఉన్నాయా? మన వ్యక్తిగత అవసరంగురించి మన వ్యక్తిగతమైన సమస్య మనకు అవగాహన కలిగించి నప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది.

నమ్మిక కలిగి ఉండడం నిబద్ధత వంటిదే. మేధస్సుకు సంబంధించిన జ్ఞానంలో నాలో మానసికపరంగా నిబద్ధత ఉంటుంది. నా నమ్మకానికి సంబంధించని ప్రతి దాన్ని నేను తిరస్కరిస్తాను. అయితే వ్యక్తిగత నమ్మకం విషయంలో నేను దృఢంగా నమ్మే నైతిక విషయాల పట్ల మాత్రమే నాలో నిబద్ధత ఉంటుంది. వీటి విషయంలో నేను రాజీపడడం దుస్సాధ్యమే. అయితే ఆధ్యాత్మికపరమైన వ్యక్తిగత నమ్మకం నేను యేసు క్రీస్తుపట్ల నిబద్ధత కలిగి ఉండేలా చేస్తుంది. ఈ నిబద్ధత నా జీవితాన్ని ఆయన అధీనతకు అప్పగించుకొనేలా చేస్తుంది.

"ఈ మాట నమ్ముచున్నావా ... " అని క్రీస్తు నన్ను ప్రశ్నించినప్పుడు నాలో ఉన్న విశ్వాసం నేను శ్వాసతీసుకున్నంత సహజంగా ఉన్నట్టు తెలుసుకుంటాను. అయితే ఇప్పటి వరకు ఆయణ్ణి నేను నమ్మకుండా ఎందుకింత అవివేకంతో ఉన్నానా అనే ఆలోచన నన్ను ఉలిక్కిపడేలా చేస్తుంది.

నవంబర్ 7

## నా జీవిత సందర్భాల్లో అగోచరంగా ఉన్న పవిత్రత

"దేవుని ప్రేమించువారికి .... మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్న వని యెరుగుదుము" (రోమా 8:28)

పరిశుద్ధుని జీవితంలో ప్రతి సందర్భం దేవుడు నియమించిన సందర్భమే. పరిశుద్ధుని జీవితంలో యాదృచ్ఛిక సంఘటనలకు తావు లేదు. అయితే నీ జీవితంలో ఎదురయ్యే కొన్ని సందర్భాలు నీకు అర్థం కావు; అయితే ఇవి దేవుని ఆత్మకు తెలుసు. నీలో ఉన్న దేవుని ఆత్మ నీ పక్షాన విజ్ఞాపన చేస్తున్నాడు. నీద్వారా దేవుడు తన ఉద్దేశాల్ని నెరవేర్చుకోడానికి నిన్ను కొన్ని పరిస్థితులగుండా కొన్ని సందర్భాలగుండా నడిపిస్తాడు. అయితే దేవుడు నిన్ను నడిపించే సందర్భాల్ని ముందుగానే ఊహించకు. "నన్ను నేను కాపాడుకోగలను, దీన్ని నేను చేయగలను" అని చెప్పకు. నీ జీవిత సందర్భాలన్నీ దేవుని అధీనంలో ఉన్నాయి. కాబట్టి వాటిని ఆయనకే అప్పగించు; ప్రతి రోజూ నీకెదురయ్యే సందర్భాల్ని, ప్రతి రోజూ నీకు తారసపడే మనుషుల్ని విజ్ఞాపనద్వారా దేవుని సన్నిధిలో ప్రతిష్ఠించు. దేవుడు తన పరిశుద్ధులద్వారా ఇతరుల్ని తాకే విధానమిదే.

నాలో నేను అస్పష్టతతోను అనిశ్చయతతోను ఉంటే నాలో ఉన్న పరిశుద్ధాత్మ తన కార్యాన్నెలా జరిగిస్తాడు? నా చుట్టూ ఉన్నవారి గురించి, నాకెదురయ్యే ప్రతి సందర్భం గురించి నేను మానవతాదృక్పథంతో విజ్ఞాపన చేయవలసి ఉన్నాను. నా జీవితం పరిశుద్ధాత్మకు ఆలయమయ్యేలా నేను పవిత్రంగా ఉండాలి. అప్పుడే పరిశుద్ధాత్మ నా విజ్ఞాపనతోబాటు తాను కూడా విజ్ఞాపన చేస్తాడు.

ఎవరి విజ్ఞాపనలు వారివే. అయితే మనందరిలోనూ ఉన్న పరిశుద్ధాత్మ కూడా మనకొరకు విజ్ఞాపన చేస్తూనే ఉన్నాడు. "ఆ ఆత్మ తానే పక్షముగా విజ్ఞాపనము చేయు చున్నాడు" (రోమా 8:26). విజ్ఞాపన లేనట్లయితే మానవజీవితం దుర్భరదారిద్ర్యంతో అధోగతి పాలవుతుంది.

నవంబర్ 8

## ప్రార్థనకున్న తిరుగులేని శక్తి

"మనము యుక్తముగా ఏలాగు ప్రార్థనచేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింప శక్యముగాని మూలుగులతో ఆ ఆత్మ తానే పక్షముగా విజ్ఞాపనము చేయు చున్నాడు" (రోమా 8:26)

పరిశుద్ధాత్మ మనకు ప్రార్థించే శక్తి నిస్తాడని తెలుసు. ఆత్మననుసరించి ప్రార్థించడం కూడా మనకు తెలుసు. అయితే పరిశుద్ధాత్మ మనలో ఉండి ప్రార్థిస్తాడనే విషయం చాలా మందికి తెలియదు. పరిశుద్ధాత్మ చేసే ప్రార్థన మనకు ఉచ్చరింప శక్యంకాదు. మనం తిరిగి పుట్టి నప్పుడు, మనం పరిశుద్ధాత్మకు ఆలయంగా ఉన్నప్పుడు మాత్రమే ఆయన మన కొరకు మనం ఉచ్చరింపలేని విధంగా మనకొరకు ప్రార్థిస్తాడు.

"ఆయన దేవుని చిత్తప్రకారము పరిశుద్ధులకొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు" (రోమా 8:27). ఇది మనలో ఉన్న పరిశుద్ధాత్మ చేసే విజ్ఞాపన. దేవుడు తన చిత్తానన్నుసరించి పరిశుద్ధాత్మ చేసే ప్రార్థనల్ని శ్రద్ధతో ఆలకిస్తాడు.

"మీ దేహము ... మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా" (1 కొరింథీ 6:19). యేసు క్రీస్తు దేవాలయాన్ని శుద్ధి చేసినప్పుడు ఆయన బయటి వస్తువుల్ని దేవాలయం లోపలికి అనుమతించలేదు (మార్కు 11:16). నీ దేహం నీ సుఖసంతోషాలకు కాదు గానీ పరిశుద్ధాత్మకు ఆలయంగా ఉంది. పరిశుద్ధాత్మకు ఆలయమైన నీ దేహం పవిత్రంగా ఉండా లని యేసు కోరుకుంటున్నాడు. "నా మందిరము ... ప్రార్థన మందిరమనబడును. అయితే మీరు దానిని దొంగల గుహగా ... " చేశారని (మార్కు 11:27) ప్రభువు చెబుతున్నాడు.

నీ దేహం దేవుని పరిశుద్ధాత్మకు ఆలయమని నీకు తెలుసు కదా! నీ దేహం పవిత్రంగా ఉండేలా పరిరక్షించుకోవలసిన బాధ్యత నీదే!

నవంబర్ 9

## పవిత్రమైన సేవ

"ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు ... క్రీస్తు పడిన పాట్లలో కొదువైనవాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (కొలొస్స 1:24)

సేవకుడికి పవిత్రత ముఖ్యం. సేవకుడికి ప్రభువుతోను, ప్రభువు అనుగ్రహించిన విమోచనగురించిన వాస్తవంతోను తాదాత్మ్మత అవశ్యం. అప్పుడే అతనిద్వారా ప్రభువు జీవం వెల్లడవుతుంది. సేవకుడి ఆకర్షణీయమైన వ్యక్తిత్వం ఇతరులమీద ప్రభావం చూపాలని నేను చెప్పడం లేదు గానీ, సేవకుడి జీవితంలోని ప్రతి అంశంలోను క్రీస్తు ఉనికి ఉండాలని మాత్రమే చెబుతున్నాను. క్రొత్త నిబంధనలో వ్రాయబడిన మన ప్రభువు మరణ పునరుత్థానాలగురించి మాట్లాడేటప్పుడు ఆ మాటలన్నీ పునీతమైనవే. దేవుడు మనం మాట్లాడే మాటలు వినేవారి హృదయాల్లో నూతన కార్యాలు చేసేలా వాటి నుపయోగించుకుంటాడు. మనం యేసును వెల్లడిచేసే దివ్యసత్యాల్ని బోధించినప్పుడు పరిశుద్ధాత్మ కూడా సాక్షిగా ఉంటాడు.

ప్రాముఖ్యత సందేశానిదే గానీ బోధించే సేవకుడిది కాదు. "ఈయనెంత బాగా మాట్లాడుతున్నాడు" "ఈయన వ్యక్తిత్వం ఎంత బాగుందో" "ఆయన అందరినీ ఆకర్షిస్తున్నాడు" అనే మాటలు మనం మాట్లాడుతున్నట్లయితే దేవుని సువార్త సందేశానికి ఏ ప్రాముఖ్యత ఉంటుంది! సేవకుడికి కావలసినది ఇతరుల్ని తనవైపు ఆకర్షించడం కాదు గానీ ఇతరుల్ని యేసు వైపు ఆకర్షించడమే. "నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నా యొద్దకు ఆకర్షించుకొందునని" (యోహాను 12:32) యేసు చెప్పాడు. ఘనత మరియు మహిమ సేవకుడికి కాదు, యేసుకే. సేవకుడు ప్రభువుతో తాదాత్మ్యత కలిగి ఉన్నప్పుడు మాత్రమే మహిమ ఘనత యేసుకే చెందుతాయి.

నవంబర్ 10

## సువార్తలో సహపనివారు

“క్రీస్తు సువార్త విషయములో దేవుని పరిచారకుడునైన ... ” (1 థెస్స 3:2-4)

నీవు పరిశుద్ధపర్చబడిన తర్వాత నీ జీవితోద్దేశమేదో నీకు నిర్దిష్టంగా తెలియదు; కారణం, దేవుడు నిన్ను పరిశుద్ధాత్మద్వారా తన ఉద్దేశంలోకి నడిపించాడు. లోకాన్ని రక్షించడంకొరకు తన కుమారుడైన యేసుపట్ల దేవునికి ఉద్దేశం వున్నట్లే, యేసుద్వారా అనుగ్రహించబడిన విమోచనను ఇతరులకు అందించడంలో నీపట్ల కూడా దేవునికి కొన్ని ఉద్దేశాలున్నాయి. “దేవుడు నన్ను ఇందుకు పిలిచాడు, అందుకు పిలిచాడు” అని నీగురించి నీవు గొప్పగా చెప్పుకుంటున్నట్లయితే నీవు దేవునికి ఉపయోగపడకుండా నీకు నీవే అడ్డుగా ఉంటావు. నీ స్వంత కోరికలకొరకు నీ స్వంత ఆశయాలకొరకు నీవు ప్రాకు లాడుతున్నట్లయితే నీవు దేవుని ఉద్దేశాలతో ఏకీభవించలేవు. నీ స్వంత ఆలోచనలు నీ స్వంత ప్రణాళికలు నీ స్వంత ఉద్దేశాలు నీ స్వంత కోరికలు అన్నీ ప్రక్కనపెట్టి దేవుని ఉద్దేశంపట్ల సంపూర్ణమైన విధేయత చూపినప్పుడు మాత్రమే ఆయన నిన్ను వాడుకోగలడు. ఇకమీదట దేవుని ఆలోచనలనే నీ ఆలోచనలుగా ఉంటాయి తప్ప నీకు నీ స్వంత ఆలోచనలుండవు.

నీ జీవితం నీది కాదని, అది దేవునికొరకని నీవు గ్రహించాలి. దేవునికి సర్వలోకంపట్ల ఉన్న మహోన్నత సంకల్పంలో నీవిప్పుడు ఒక భాగమయ్యావు. “ఇది నాకు బాధ కలిగిస్తోంది” “అది నాకు నచ్చలేదు” అని నీవికమీదట చెప్పకూడదు. ఒక వేళ ఈ విధంగా నీవు మాట్లాడుతున్నట్లయితే దేవుని పనికి నీవు ఆటంకంగా మారగలవు. నీ స్వంతానికి ఏం కావాలో నీవు అడగడం మానివేసిన తర్వాతనే ఆయన పనిని నీవు నిరాటంకంగా చేయగలవు; ఎందుకంటే నీ మనస్సు నీమీద నిమగ్నం కాక, దేవునిమీదనే ఆయన మహోన్నత సంకల్పంమీదనే నిమగ్నమై ఉంటుంది కాబట్టి. ఆయన నిన్ను నలగగొట్టవచ్చు, లేదా హెచ్చించవచ్చు, లేదా నీపట్ల తనకిష్టమైనట్టు చేయవచ్చు. ఆయనకు నీలో కావలసినది అప్రతిహతమైన విశ్వాసం. నీమీద నీవే జాలి చూపించుకోడం దేవునికి ఇష్టం వుండదు. నీగురించి నీవే కొట్టుమిట్టాడుతుంటే ఇక దేవుని కొరకెలా ఉపయోగపడగలవు! నీగురించి నీవే ఆలోచించడం నీ చుట్టూ నీవు గిరిగీసుకున్నట్టుగా ఉంటుంది. అన్ని బంధాల్ని త్రెంచుకొని సంపూర్ణ సమర్పణతో పరిపూర్ణమైన నిబదత్ధతో ముందుకు వచ్చినప్పుడు మాత్రమే నీవు దేవునికి ఉపయోగపడగలవని గుర్తుంచుకో.

నవంబర్ 11

## ఉన్నతమైన మెట్టు

"అప్పుడాయన -నీకు ఒక్కడైయున్న నీ కుమారుని ... తీసికొని ... చెప్పెను" (ఆది 22:2)

అబ్రాహాము వెంటనే బయలుదేరి వెళ్లాలని దేవుని ఆదేశం; తర్వాత కాదు. దేవుని ఆజ్ఞల్ని ఎప్పుడు ఆచరించాలా అని మనం చర్చించడం విడ్డూరమే! ఏది మంచిదో మనకు తెలుసు, అయితే వెంటనే ఆచరించడానికి మనం ముందడుగు వెయ్యం. దేవుడు వెల్లడిచేసిన ఎత్తైన స్థలానికి వెంటనే వెళ్లాలి; లేదంటే ఎప్పటికీ వెళ్లలేం. అక్కడికి మనం చేరుకోడానికి ముందే మన మనసులో సమర్పణభావం కలగాలి.

"తెల్లవారినప్పుడు అబ్రాహాము లేచి ... దేవుడు తనతో చెప్పిన చోటికి వెళ్లెను" (ఆది 22:3). ముందు వెనుకలు చూడకుండా అబ్రాహాము బయలుదేరి వెళ్లడం అతను కపటంలేని వ్యక్తి అని నిరూపిస్తోంది కదా! పౌలు అనుభవం కూడా చూడండి: "మనుష్యమాత్రులతో నేను సంప్రతింపలేదు" (గలతీ 1:16). నీవు మనుషులతో సంప్రతించడం, లేదా నీలో నీవే ఆలోచించుకోవడం దేవునితో నీకున్న అన్యోన్య సంబంధంమీద ఆధారపడదని గుర్తుంచుకో. దేవునిపట్ల నీవు చూపే విధేయతతో పోటీ పడేవి ఇవేనని తెలుసుకో.

ఏది బలిగా అర్పించాలో అబ్రాహాము ఎంపిక కాదు. నీవు కోరుకున్నట్టుగా దేవుణ్ణి సేవించాలని ఆలోచించకు. బల్యర్పణ నీ ఇష్టానుసారంగా ఉన్నట్లయితే నీవు సేవనే బలహీనపర్చేవాడివిగా ఉంటావు. దేవుడు నీవు త్రాగే పాత్రలో మధురజలాన్ని ఉంచినట్లయితే ఆయన కృపనుబట్టి ఆ నీటినే త్రాగు. ఆయన నీ పాత్రలో చేదునీటిని ఉంచినట్లయితే ఆయనతో సమష్టిగా ఆ చేదునీటినే త్రాగు. దేవుడు నీకు కష్టాల్ని అనుమతించినట్లయితే కష్టాలగుండా నడువు. నీవు వాటిని తప్పించుకోవాలని ప్రయత్నించకు. "నేనింతవరకే వెళ్తాను, ఇక ముందుకు వెళ్లలేను" అని చెప్పకు. ఇది నీకు నీవే సంకెళ్లు వేసుకున్నట్టుగా ఉంటుంది. అబ్రాహామును పరీక్షించాలనుకోడం దేవుని నిర్ణయం. అబ్రాహాము దేవుని నిర్ణయాన్ని వాయిదా వేయలేదు; ఆయన నిర్ణయాన్ని ధిక్కరించలేదు. దేవుని నిర్ణయంపట్ల అబ్రాహాము నిశ్చలమైన విధేయతను చూపించాడు. నీవు దేవుని స్పర్శకు దూరంగా ఉన్నట్లయితే, ఆయణ్ణి తేలిగ్గా నిందిస్తావు, లేదా ఆయన నిర్ణయాన్నే తప్పుపట్టేవాడివిగా ఉంటావు. నీవు దేవుని ఆజ్ఞగురించి ఆలోచించకముందే ఆచరణలో పెట్టు. అప్పుడు మాత్రమే నీకు దేవుణ్ణి అర్థం చేసుకోగలవు. దేవుని ఉద్దేశాలతో మన ఉద్దేశాలు ఏకమయ్యేలాగా ఆయన మనల్ని ఎత్తైన స్థలాలకు నడిపిస్తూనే ఉంటాడు.

నవంబర్ 12

## మారిన జీవితం

"ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతియించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17)

నీ ఆత్మ రక్షణగురించి నీవేమనుకుంటున్నావు? రక్షణకార్యమంటే నీ జీవితం అనూహ్యంగా మారిపోవడమే. మారిన నీ జీవితానికి నీ పాతజీవితం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇక పాతజీవితంపట్ల నీలో ఎటువంటి అపేక్షలు ఆసక్తి ఉండవు. ఇక నీ ఆశలు ఆశయాలు నూతనంగా ఉంటాయి. నీలో జరిగిన రక్షణకార్యంపట్ల నీవు యథార్థంగా ఉన్నావా అనేందుకు పరీక్ష నీ పాతస్వభావం నీ పాతజీవితంలోని కోరికలు అన్నీ సమూలంగా గతించిపోవడమే. నీవింకా పాతవాటినే కోరుకుంటున్నట్లయితే "నేను నూతనసృష్టిని" అని నీవు చెప్పుకోడంలో అర్థంలేదు; "నేను తిరిగిపుట్టాను" అని నీవు చెప్పుకోడం ఆత్మవంచనే. నీవు తిరిగిపుట్టినట్లయితే దేవుని ఆత్మద్వారా నీ వాస్తవజీవితంలో సమూలమైన మార్పులొస్తాయి. నీలో నూతనజన్మ నూతనస్వభావం ఉన్నాయి కాబట్టి సమస్యలపట్ల సంఘర్షణలపట్ల నీవు స్పందించే వైనం ఇతరుల్ని ఆశ్చర్యపరుస్తుంది. ఇది నీ ప్రజ్ఞ కాదు గానీ రక్షణకార్యంవలన నీలో కలిగిన సంపూర్ణమైన మార్పుకు రుజువు మాత్రమే.

రక్షణ మరియు పరిశుద్ధత నీలో ఇంకా ఏ మార్పులకు కారణమయ్యాయి? ఉదాహరణకు, 1 కొరింథీ 13:1-13 వచనాలయెదుట నీవు నిర్భయంగా నిలబడగలవా? లేక నీలో నీవు గుంజుకుంటూ తలాయించే ప్రయత్నం చేస్తున్నావా? నిజమైన రక్షణ పరిశుద్ధాత్మ సహాయంతో నీకు పూర్తి విడుదలనిస్తుంది. "ఆయన వెలుగులోనున్న ప్రకారము" (1 యోహాను 1:7) నీవు కూడా "వెలుగులో నడిచినయెడల" (1 యోహాను 1:7) నీ బాహ్యజీవితం మరియు నీ ఆంతర్యం దేవునికి ప్రీతికరంగా ఉంటాయి.

నవంబర్ 13

## విశ్వాసమా? లేక, అనుభవమా?

" ... నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి ... " (గలతీ 2:20)

ప్రభువైన యేసుపట్ల యథార్థమైన భక్తివిశ్వాసాలు మనలో ఉండాలంటే మన చిత్త వృత్తితో, మన అనుభూతులతో, మనలో ఉన్న రాగద్వేషాలతో అనునిత్యం మనకు పోరాటం తప్పదు. మనం మనచుట్టూ ఏర్పరుచుకున్న వలయాన్ని ఛేదించి బయటికి వచ్చి క్రీస్తుపట్ల సంపూర్ణమైన భక్తివిశ్వాసాల్ని చూపాలి. క్రొత్త నిబంధన యేసు క్రీస్తు ఎవరని బోధిస్తున్నదో ఒకసారి ఆలోచించు. అప్పుడు నీలో ఉన్న విశ్వాసం ఎంత అల్పమైనదో నీవే తెలుసుకోగలవు. క్రీస్తులో నీకున్న విశ్వాసం నిన్ను దేవునియెదుట నిర్దోషిగా నిలబెడుతుంది; నిన్ను నిష్కళంకుణ్ణి చేస్తుంది; సంపూర్ణమైన నీతిని నీకనుగ్రహిస్తుంది. " ... దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను" (1 కొరింథీ 1:31) - జ్ఞానాన్ని నీతిని పరిశుద్ధతను విమోచనను మనకనుగ్రహించిన యేసులో అప్రతిహతమైన విశ్వాసాన్ని కలిగి ఉండు. నరకంనుంచి సర్వవినాశనంనుంచి తప్పించబడిన మానవమాత్రుల మైన మనం సమర్పణగురించి ఏపాటి మాట్లాడగలం!

మన విశ్వాసం మన రక్షణకు మూలాధారమైన యేసులోనే తప్ప మరి దేంట్లోను కాదు. ఎందుకంటే మనం యేసు క్రీస్తు పాదాలదగ్గర నిశ్చేష్టులమై పడి ఉండవలసిన వాళ్లం (ప్రకటన 1:17 చూడండి). యేసులో నీ విశ్వాసం నిలకడా ఉందా, దృఢంగా ఉందా? యేసు క్రీస్తు మనలో నిరాటంకమైన విశ్వాసాన్నే కోరుకుంటున్నాడు. యేసు క్రీస్తుగురించి పూర్ణావగాహన మరియు పూర్ణానుభవం మనకున్నాయా?

పరిశుద్ధాత్మ మనలో అవిశ్వాసాన్ని సహించడు. మనలో ఉన్న భయాందోళనలు ఒక విధంగా అపరాధమే. ఎందుకంటే మనం విశ్వాసంలో పరిపుష్టత పొందకుండా మనలో ఉన్న భయాందోళనలు మనల్ని అడ్డుకుంటాయి. యేసు క్రీస్తులో తాదాత్మ్యత కలిగిఉన్నవారెవరైనా శంకలు సదేహాలు భయాలు ఆందోళన వెలిబుచ్చగలరా? పరిపూర్ణమైన మరియు సఫలీకృత మైన విశ్వాసంతో నిండిన మన జీవితాలు ప్రభువుకు స్తుతిగీతంగా ఉండుగాక!

నవంబర్ 14

## దేవుని ఉద్దేశాల్ని కనుగొనడం

"నేను త్రోవలో నుండగానే యెహోవా ... నన్ను నడిపించెననెను" (ఆది 24:26-27)

దేవునితో మనమెంతగా ఐక్యత కలిగి ఉండాలంటే మనల్ని నడిపించమని మనం ప్రతి రోజూ దేవుణ్ణి అడగనక్కరలేనంత. పరిశుద్ధపర్చబడడమంటే మనం దేవుని పిల్లలుగా లెక్కించబడడమని అర్థం. పిల్లవాడు తనంత తానుగా అవిధేయత కోరుకునేవరకు అతనిలో విధేయత స్వతస్సిద్ధంగా ఉంటుంది. అయితే అతను అవిధేయత చూపాలనుకున్నప్పుడు అతని అంతరంగంలో సంఘర్షణ చోటుచేసుకోడం సహజం. ఆధ్యాత్మిక విషయాల్లో అంతరంగ సంఘర్షణ దేవుని ఆత్మ చేసే హెచ్చరిక. పరిశుద్ధాత్మ మనల్ని హెచ్చరించినప్పుడు మన మనసును మనం పరీక్షించుకొని దేవుని చిత్తాన్ని కనుగొనాలి (రోమా 12:2 చూడండి). మనం మాటి మాటికీ "నన్ను నడిపించు" అని అడుగుతున్నట్లయితే మన విశ్వాసానికి మనమే ఆటంకంగా మారగలం. ఎందుకంటే దేవుడు మనల్ని నడిపిస్తూనే ఉన్నాడు కాబట్టి. మనం దేవుని ఆత్మద్వారా తిరిగిపుట్టిన వారమైనట్లయితే మనల్ని నడిపిస్తున్న దేవుని హస్తస్పర్శను గుర్తించగలం.

దేవుడు చేసే అసాధారణ కార్యాల్ని మనం తేలిగ్గానే గుర్తిస్తాం. అయితే మన అనుదిన జీవితంలోని అతిసామాన్యమైన నిత్యకృత్యాల్లోనే మనం దేవుని కార్యాల్ని చూడవలసి ఉన్నాం. మన జీవితంలో యథాలాపంగా జరిగే కార్యాలు సైతం దేవుని అనుజ్ఞతోనే జరుగుతున్నాయనే విషయాన్ని గుర్తుంచుకో. అన్ని వేళల్లోనూ అన్ని సందర్భాల్లోనూ దేవుని ఉద్దేశాల్ని కనుగొనడానికి సిద్ధంగా ఉండు.

దేవునిపట్ల నిలకడగలిగిన భక్తివిశ్వాసాలకు బదులు నీ స్వంత నమ్మకాలతో ఏకీభవించడంలో ఆలోచనానిమగ్నుడవుగా ఉన్నావేమో గమనించుకో. నీవు పరిశుద్ధుడవైనట్లయితే "నా స్వంత నమ్మకాలతో నేను ఏకీభవించను" అని చెప్పగలవు. దేవుడు నీ నుంచి కోరుకునేది కూడా ఇదే. మన ప్రభువు తన తండ్రితో విభేదించిన సందర్భాలు లేనే లేవు. పరిశుద్ధుడు ఏకీభవించవలసినది దేవుని జీవంతోనే; సిద్ధాంతాలతో కాదు. నీవు దేవుని జీవంతో ఏకీభావం కలిగి ఉన్నప్పుడు దేవుని మనసును ఆయన ఆలోచనల్ని తెలుసుకోగలవు. విశ్వాసంలో నిలకడగా ఉండడం వేరు; మితిమీరిన మూఢభక్తి వేరు. విశ్వాసంలో నిలకడగా ఉండడం కష్టంగానీ మూఢభక్తి కష్టం కాదు. మన దేవునిపట్ల యథార్థమైన విశ్వాసంతో ఉన్నప్పుడు మనలో అహంభావానికి ఆత్మస్తుతికి చోటుండదు.

నవంబర్ 15

## "అది నీకేమి?"

"పేతురు ... -ప్రభువా, యితని సంగతి ఏమగునని యేసును అడిగెను. యేసు ... అది నీకేమి? నీవు నన్ను వెంబడించుమనెను" (యోహాను 21:21,22)

ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోకూడదని మనకు తెలిసినప్పటికీ ఎంత ప్రయత్నించినా మనం కలగజేసుకోకుండా ఉండలేం. ఈ విషయంలో ఎప్పుడు మనం పాఠం నేర్చుకుంటామో! అన్నిటిలోను తలదూర్చాలనే కుతూహలం వుండకూడదని తెలుసుకోడానికి చాలాకాలం పట్టవచ్చు. ఇతరులపట్ల దేవునికున్న ఉద్దేశాల్లో మనం జోక్యం చేసుకోకూడదు. శ్రమల్లో ఉన్నవారినెవరినైనా చూసినప్పుడు "అతను శ్రమపడడు, అతను శ్రమపడకుండా నేను చూస్తాను" అని చెబుతున్నావా? దేవుడతనికి శ్రమల్ని అనుమతించినప్పుడు నీవు దేవుని చిత్తానికి అడ్డుతగులుతున్నావా? అప్పుడు దేవుడు "అది నీకేమి? అని నిన్ను ప్రశ్నించవచ్చు. నీ ఆధ్యాత్మిక జీవితంలో స్తబ్ధత ఉందా? స్తబ్ధతను కొనసాగనివ్వకు. నీలో ఉన్న స్తబ్ధతకు కారణాన్ని తెలియజేయమని దేవుని సన్నిధిలో వేడుకో. నీలో ఉన్న స్తబ్ధతకు కారణం నీకే తెలుస్తుంది. కారణం నీవు ఇతరుల విషయాల్లో అతిగా జోక్యం చేసుకోడం కావచ్చు; ప్రతిపాదించడానికి అర్హతలేని నీవు ప్రతిపాదించడం కావచ్చు; ఇతరులకు సలహా ఇవ్వడానికి అర్హతలేని నీవు సలహా ఇవ్వడం కావచ్చు. ఇతరులకు నీవు సలహా ఇవ్వవలసిన సందర్భం ఎదురైనప్పుడు దేవుడు తన ఆత్మద్వారా నీకు తెలియజేస్తాడు. అయితే నీవు చేయవలసిన పని దేవునితో సరైన సంబంధం కలిగి ఉండడం మాత్రమే. అప్పుడు మాత్రమే దేవుడు నీకు తెలియజేసిన సంగతుల్ని నీవు తెలుసుకోగలవు; ఇతరులకు ఆశీర్వాదంగా ఉండగలవు.

సాధారణంగా మనం మనకు గ్రాహ్యమైన విషయాలకు మాత్రమే పరిమితమై ఉంటాం. ఒక రకంగా ఇది మనలో పరిణతి లేకపోవడమే. మన జీవితాన్ని దేవునికి సంపూర్ణంగా లోబర్చినప్పుడు మాత్రమే చేతనావస్థలోను అచేతనావస్థలోను మనలో పరిణతి ఉంటుంది. మనం దేవునికొరకు రొట్టెలాగా విరవబడుతున్నామని ద్రాక్షారసంగా పోయబడుతున్నామని మనకు తెలుసు; అయితే మనం చేరుకోవలసిన మరొక స్థాయి ఉంది. మనకు అగోచరంగా ఉన్నవాటిల్లో సైతం మనం దేవునిమీదే ఆధారపడి ఉన్నామనే ఆధ్మాత్మిక సత్యాన్ని మనం గ్రహించడమే పై స్థాయి.

నవంబర్ 16

## మానవమాత్రులం!

" ... మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమకొరకు చేయుడి" (1 కొరింథీ 10:31)

పరిశుద్ధ లేఖనాల్లో ఉన్న కొన్ని వాస్తవాలు మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. దేవుడు అద్భుతరీతిలో మానవశరీరం ధరించి సాధారణ బాలుడిగా జీవించాడు; కొండమీద రూపాంతరపు దివ్యానుభవం తర్వాత కొండక్రింద దయ్యంపట్టిన వ్యక్తి ఎదురయ్యాడు; మహిమోన్నత పునరుత్థానం తర్వాత యేసు ప్రభువు సముద్రతీరంలో ఆహారం స్వీకరించాడు. ఇవి మన కళ్లు తెరిపించే దైవిక ఘటనలు.

మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేసే అనుభవాలకొరకు మనం ఎదురుచూడడం మామూలే. వీరోచిత కార్యాలు మనల్ని ఆకట్టుకుంటాయి. సమస్యల్లో గంభీరంగా ఉండడం గొప్ప విషయమే. అయితే ఎవరి దృష్టిని ఆకట్టుకోని మన దైనందిన జీవితకృత్యాల్లో దేవునికి మహిమ కలిగేలా జీవించడం ఇంకా గొప్ప విషయం.

మన తలలచుట్టూ తేజోవలయాలు పరివేష్టితమై ఉండాలని మనం కోరుకోక పోయినప్పటికీ మనుషులు మనల్ని "ఈయనెంత మంచి ప్రార్థనాపరుడో!" లేక "ఈమె ఎంత భక్తిపరురాలో!" అని పొగడాలని కోరుకుంటాం. ప్రభువైన యేసుపట్ల నీలో నిజమైన భక్తి ఉన్నట్లయితే నీవు ఊహించనంత ఉన్నతమైన మెట్టు ఆయన నిన్ను ఎక్కిస్తాడు. అప్పుడు అందరూ నీలో ఉన్న దేవుని శక్తినే చూస్తారు తప్ప నిన్ను చూడరు.

"నన్ను దేవుడు అద్భుతంగా పిలిచాడు" అని చెప్పాలని మనం కోరుకుంటాం. సేవకుడికి కావలసినది విజయాలు కాదు గానీ దేవునిపట్ల అచంచలమైన విశ్వాసం మాత్రమే. మనం విజయాల్నే పరిచర్యలో లక్ష్యాలుగా పేర్కొంటున్నాం. అయితే, దేవునికి ఘనత మరియు మహిమ కలిగేలా మనల్ని మనం తగ్గించుకోడమే మన నిజమైన లక్ష్యం. మనం కాంక్షించవలసినది విజయాల్ని కాదు, మన జీవితాల్లో దేవుణ్ణి మహిమను ప్రతిఫలించడం మాత్రమే. మనం మానవమాత్రులమే అయినప్పటికీ దేవుడనుగ్రహించిన జీవం మనలో ఉంది కాబట్టి ఆయన జీవాన్ని మనం ప్రతిఫలించాలి. "మీ జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది" (కొలొస్స 3:3). దేవుని జీవాన్ని మనం వెల్లడి చేయవలసినది మానవ సంబంధాల్లోనే!

నవంబర్ 17

## శాశ్వత గమ్యం

"నీవు ... యీ కార్యము చేసినందున నేను నిన్ను ఆశీర్వదించి ... నా తోడని ప్రమాణము చేసియున్నానని యెహోవా సెలవిచ్చెననెను" (ఆది 22:16-18)

దేవుని స్వభావమెటువంటిదో అబ్రాహాముకు ఈ సంఘటననాటికి బాగా తెలిసింది. దేవుని యథార్థతను అబ్రాహాము అర్థంచేసుకున్నాడు.

మూల్యం ఎంతైనా, నా త్రోవ ముళ్లబాటైనా,
ప్రియ ప్రభువా! నా గమ్యం నీవే.

దేవుడు నాలో ఉన్న ఆయన స్వభావంతో మాట్లాడుతున్నప్పుడు ఆయణ్ని నేను ప్రశ్నించడం నాకు సాధ్యమా! నా స్పందన విధేయత మాత్రమే. "రండి" అని యేసు మనల్ని పిలిచినప్పుడు నేను సూటిగా వచ్చాను. "మీరు వెళ్లి" అని ప్రభువు మనతో చెప్పినప్పుడు నేను వెళ్లాను. "నమ్మండి" అని ప్రభువు మనతో చెప్పినప్పుడు నేను నమ్మాను. దేవుని స్వభావం నాలో ఉందనడానికి ఈ విధేయతే రుజువు.

దేవుడు తనగురించి నాకు వెల్లడిచేశాడు. అయితే ఆయన వెల్లడిచేసిన విషయాలకంటె నా స్వభావం నామీద ఎక్కువ ప్రభావం చూపింది. ఎందుకంటే నేనొక సాధారణ వ్యక్తిని. దేవుడు సాధారణమైన సంఘటనద్వారా తనగురించి వెల్లడి చేసినప్పుడు ఆయణ్ణి నేను గుర్తించలేకపోయాను. అబ్రాహాములో ఉన్న విధేయత నాలో లేదు కాబట్టి అబ్రాహాము దేవుణ్ణి గుర్తించినట్టుగా ఆయణ్ణి నేను గుర్తించలేక పోయాను. నేను యేసు క్రీస్తుద్వారా ముఖాముఖిగా దేవునిదగ్గరకు సమీపిస్తే తప్ప నేను దేవుణ్ణి గుర్తించలేను. యేసు క్రీస్తుద్వారా నేను దేవుణ్ణి గుర్తించినప్పుడు

నా దేవా, సర్వసృష్టిలో నీవే ఉన్నావు!
నీవే! నీవే! నీవు కాక వేరెవరున్నారు!

అని నేను చెప్పగలను.

మనం ప్రతి రోజూ బైబిల్లోని వాగ్దానాల్ని చదువుతుండవచ్చు. ఇలా సంవత్సరాల బాటు కొనసాగవచ్చు. కేవలం చదివినంత మాత్రంచేత వాగ్దానాలు మన స్వంతం కావు. అయితే విధేయతద్వారా మాత్రమే దేవుని వాగ్దానాలు మన స్వంతమవుతాయి. మనలో విధేయత ఉన్నప్పుడు దేవుడెవరో, ఆయన స్వభావమెటువంటిదో మనం గ్రహించ గలుగుతాం. "దేవుని వాగ్దానములు ఎన్నియైనను అన్నియు క్రీస్తునందు అవునన్నట్టు గానే యున్నవి గనుక ... అవి ఆయనవలన నిశ్చయములైయున్నవి" (2 కొరింథీ 1:20). మనం "అవును" అని చెప్పగలగడం విధేయతమూలంగానే సాధ్యం. విధేయతద్వారానే మనం దేవుని వాగ్దానాలు "నిశ్చయములై యున్నవి" అని చెప్పగలుగుతున్నాం. తథాస్తు! వాగ్దానాలు మన స్వంత మయ్యాయి!

నవంబర్ 18

## ఇక మనం స్వతంత్రులం

“కుమారుడు మిమ్మును స్వతంత్రులనుగా చేసినయెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు” (యోహాను 8:36)

నన్ను నేను సంతృప్తిపర్చుకోవాలనే కోరిక నాలో ఏ మూలనో ఉన్నట్లయితే “నన్ను నేను సమర్పించుకోలేను” అని గానీ “నేను విడుదల పొందలేను” అని గానీ చెబ్తానేమో! అయితే మనలో ఉన్న ఆధ్యాత్మికజీవం ఈ మాటల్ని చెప్పనివ్వదు. మన ఆధ్యాత్మికతృష్ణ దేవునిగురించి మనం ఇంకా ఎక్కువగా తెలుసుకొనేలా చేస్తుంది. ఇదే మన స్వాతంత్ర్యానికి పునాది. మనం దేవునికొరకు ఉపయోగపడేందుకు సృష్టించ బడ్డాం. అయితే పాపంవలన మన వ్యక్తిత్వంవలన మనలో ఉన్న చెడు ఆలోచనలవలన మనం దేవునికి దూరమవుతున్నాం. మనల్ని పాపంనుంచి దేవుడు విడిపిస్తాడు. అయితే మన వ్యక్తిత్వంనుంచి మనమే విడుదల పొందాలి. అంటే మనలో స్వాభావిక నైజాన్ని మనం విడిచిపెట్టాలి. అప్పుడు దేవుడు తన జీవాన్ని మనలో నింపుతాడు. ఇది విధేయత ద్వారానే సాధ్యం!

“ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి ... ” (2 కొరింథీ 10:5) - ఇది దేవుడు చేసే పని కాదు; దేవునిపట్ల విధేయత చూపుతూ మనం చేయవలసిన పని. “ప్రభునా, నా ఆలోచనల్ని నేను నీ మీద నిమగ్నం చేయలేకపోతున్నాను” అని చెప్పకు. నీ ఆలోచనల్ని నీవే అదుపు చేసుకోవాలి. నీ స్వాభావిక వ్యక్తిత్వం నిన్ను అణచి వేస్తున్నదేమో నిన్ను నీవు పరీక్షించుకో. నిన్ను నీవు దేవుని అధీనతకు అప్పగించుకొనే విధేయత నీలో ఉన్నప్పుడు నిన్ను కట్టిపడవేసే ఆలోచనలనుంచి నీవు విడుదలపొంది ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాన్ని పొందగలవు.

“కుమారుడు మిమ్మును స్వతంత్రులనుగా చేసినయెడల ... ” - దేవుని కుమారుడైన క్రీస్తు అనుగ్రహించిన స్వాతంత్ర్యమిది. నూతన స్వభావాన్ని నూతన జీవాన్ని అనుగ్రహించిన స్వాతంత్ర్యమిది. పాతస్వభావంనుంచి పాత జీవితంనుంచి విడుదలపొంది క్రీస్తులో నూతన సృష్టిగా మార్చిన స్వాతంత్ర్యమిది. ఇక నీవు నీ వ్యక్తిత్వానికి బందీవి కావు. ఇక నీ జీవితం క్రీస్తు కొరకే. “నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు ... ” (గలతీ 2:20) అని పౌలు చెప్పినది ఈ స్వాతంత్ర్యం గురించే. “ మీరు నిజముగా స్వతంత్రులై యుందురు” - నీ ఆంతర్యం మారి పోయింది; నీ బాహ్యజీవితం మారిపోయింది. నీవిక నీ స్వంతశక్తిమీద కాక, యేసుతో అనన్యత ఉన్నందువల్ల ఆయనద్వారా నీకు లభించే శక్తిమీద మాత్రమే ఆధారపడతావు.

నవంబర్ 19

## "ఆయన వచ్చి"

"ఆయన వచ్చి, పాపమునుగూర్చియు ... లోకమును ఒప్పుకొనజేయును" (యోహాను 16:8)

పాపాన్ని ఒప్పుకోడంగురించి మనలో కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఏదైనా చెడ్డపని చేసినప్పుడు మనలో కలిగే కలవరంగురించి మనకు తెలుసు. ఇది అందరికి అనుభవ పూర్వకమే. అయితే పాపంగురించి మనలో పరిశుద్ధాత్మ ఒప్పించే విధానం వేరు. పరిశుద్ధాత్మ మనల్ని ఒప్పించినప్పుడు మాత్రమే మనం "నీకు కేవలము నీకే విరోధముగా నేను పాపము చేసియున్నాను" (కీర్తన 51:4) అని చెప్పగలం. దేవుని క్షమాపణను కోరుకోడానికి సైతం అర్హులం కాదనే ఆవేదన మనలో ఉంటుంది. మన పాపాలు అంత ఘోరమైనవనే సంతాపం మనలో ఉంటుంది. అలా కాక, దేవుడు నా పాపాల్ని తేలిగ్గా క్షమిస్తాడు అనే ఆలోచన మనలో ఉన్నట్లయితే దేవుడు మనల్ని నీతిమంతులుగా తీర్చడానికి ముందే మనల్ని మనమే నీతిమంతులుగా తీర్చుకుంటున్నామని అర్థం. దేవుడు మనల్ని క్షమిస్తాడు; ఎంత ఘోరపాపి నైనా ఆయన క్షమిస్తాడు. దేవుడు తన కుమారుడైన యేసు క్రీస్తు మనకొరకు చెల్లించిన మూల్యాన్ని బట్టి, యేసు క్రీస్తు సిలువ బలియాగాన్నిబట్టి మనల్ని క్షమిస్తాడు. మన పాపాలు దేవుని కెంత దుఃఖం కలిగిస్తున్నాయో మనం ఆలోచిస్తున్నామా! మన పాపాలు క్షమించబడడం దేవుడు మనపట్ల చూపిన మహాద్భుత కృప. కల్వరిలో వెల్లడైన దేవుని ప్రేమ ఈ మహాద్భుత కృపకు మూలం. కల్వరి ప్రేమగురించి లోతుగా ఆలోచించకుండా, దేవుడు ప్రేమమూర్తి కాబట్టి మనల్ని క్షమించాడు అని తేలిగ్గా చెప్పకు. దేవుని ప్రేమంటే కల్వరే, క్రీస్తు సిలువే. దేవుడు మనల్ని క్షమించడానికి కారణం క్రీస్తు పొందిన సిలువమరణమే. దేవుని హృదయంలో మనపట్ల సుముఖత ఏర్పడడానికి కారణం క్రీస్తు సిలువే. క్రీస్తు సిలువే మనల్ని దేవునితో సమాధానపర్చింది.

క్షమాపణను మనం లోతుగా అర్థం చేసుకోవాలి. క్షమాపణ అంటే మనం నరకం నుంచి తప్పించబడ్డాం కాబట్టి తిన్నగా పరలోకం చేరుకుంటామనే భావన మాత్రమే కాదు; క్షమాపణ అంటే నీవు నూతనసృష్టిగా మార్పు చెందడం, క్రీస్తుతో ఐక్యత కలిగి ఉండడం, దేవునితో అన్యోన్య సహవాసంలో ఉండడం. విమోచన ఒక గొప్ప అద్భుతం. దేవుడు పాపినైన నన్ను క్షమించి పరిశుద్ధుడుగా మార్చి క్రీస్తు స్వభావాన్ని ప్రతిబింబించే వ్యక్తిగా మార్చడమే విమోచన.

నవంబర్ 20

## దేవుని క్షమాపణ

"దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ... క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7)

దేవుడు మన పరమతండ్రి కాబట్టి, ఆయన దయామయుడు కాబట్టి, ఆయన ప్రేమమూర్తి కాబట్టి మనల్ని క్షమిస్తాడని ఆలోచిస్తున్నావా? ఈ ఆలోచనలకు మూలం నీ భావోద్వేగాలే. దేవుడు మనల్ని క్షమించడానికి కారణం క్రీస్తు సిలువ. మనం పొందే క్షమాపణకు మూలం క్రీస్తు సిలువ. దేవుడు మనపట్ల కృపచూపడానికి మనల్ని ఆయనతో పునరైక్యత చేసుకోడానికి కారణం క్రీస్తు సిలువే. క్రీస్తు సిలువ తప్ప దేవుని కృపను పొందడానికి, ఆయన క్షమాపణను పొందడానికి మనకు ప్రత్యామ్నాయంలేదు. క్షమాపణ మనకు ఉచితమే; అయితే దేవుడు గొప్ప మూల్యాన్ని చెల్లించాడు. ఆ మూల్యం కల్వరి; కల్వరిమీద క్రీస్తు సిలువ. పాపక్షమాపణను, పరిశుద్ధాత్మ వరాన్ని, పరిశుద్ధపర్చబడిన జీవితాన్ని పొందిన మనం దేవుడు చెల్లించిన మూల్యాన్ని మర్చిపోకూడదు.

క్షమాపణ దేవునికృపద్వారా సాధ్యమైన గొప్ప అద్భుతం. పరిశుద్ధుడైన దేవుడు నిష్కళంకుడు నిర్దోషి అయిన తన కుమారుడిమీద మన పాపపుభారాన్నంతా మోపాడు. క్రీస్తు తన తండ్రికి విధేయుడై మన పాపాన్నంతా మోసి మనం పొందవలసిన శిక్షను తాను పొంది మనకు క్షమాపణను ఉచితంగా అనుగ్రహించాడు. దేవునికి దూరమైన మనల్ని మళ్లీ ఆయన దగ్గరికి చేర్చే మార్గం క్రీస్తే, ఆయన సిలువే.

దేవుడు మన పాపాల్ని క్షమించాడు, మనల్ని పరిశుద్ధపర్చాడు. మనం పరిశుద్ధత గురించి గొప్పగా చెబుతుంటాం. అయితే గొప్ప అద్భుతమైన క్షమాపణ ముందు మన పరిశుద్ధత చాలా చిన్న అనుభవం. మానవజీవితంలో పాపక్షమాపణకు అద్భుతమైన వ్యక్తీకరణ పరిశుద్ధతే. దేవుడు మన పాపాల్ని క్షమించడం మనల్ని ఆయనపట్ల కృతజ్ఞతకు నడిపిస్తుంది. దేవునిపట్ల కృతజ్ఞతాభావం పౌలులో మెండుగా ఉంది. నిన్ను క్షమించడానికి దేవుడు మూల్యాన్ని చెల్లించాడని నీవు గుర్తించడం నిన్ను దేవుని ప్రేమకు బందీని చేస్తుంది.

నవంబర్ 21

## “సంపూర్ణముగా నెరవేర్చి”

“చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి ... ” (యోహాను 17:4)

యేసు క్రీస్తు మరణం దేవుని చిత్తాన్ని మరియు ఆయన ఉద్దేశాల్ని సంపూర్ణంగా నెరవేర్చింది. యేసు క్రీస్తు మరణం ఆయనకు మాత్రమే పరిమితమైనది కాదు. ఆయన మరణం అవశ్యం, మరియు అనివార్యం. ఎందుకంటే ఆయన మరణించడానికే ఈ లోకానికి వచ్చాడు.

దేవుడు మన తండ్రి కాబట్టి, ఆయన మనల్ని ప్రేమిస్తున్నాడు కాబట్టి ఆయన మనల్ని క్షమిస్తాడని ఆలోచించకు. ఈ విధంగా ఆలోచించడం యేసు క్రీస్తులో వెల్లడైన దేవుని సత్యాలతో ఎన్నటికీ విభేదించడమే అవుతుంది. ఈ విధమైన ఆలోచన సిలువను మరియు సిలువద్వారా సమస్త మానవాళికి ఒనగూడిన విమోచనను అర్థరహితం చేస్తుంది. దేవుడు మన పాపాల్ని క్షమించడానికి కారణం యేసు క్రీస్తు సిలువ మరణమే. యేసు క్రీస్తు సిలువ మరణంద్వారా తప్ప దేవుడు మరే విధంగానూ మనుషుల పాపాల్ని క్షమించడు. యేసు క్రీస్తు తన మరణంద్వారా లోకరక్షకుడయ్యాడు. “యేసు మరణము పొందినందున, మహిమా ప్రభావములతో కిరీటము ధరించినవానిగా ఆయనను చూచు చున్నాము” (హెబ్రీ 2:9). భయాందోళనలతో ముప్పిరిగొన్న లోకంలో విజయధ్వని నార్భటించినది క్రీస్తు సిలువ మాత్రమే. “సంపూర్ణముగా నెరవేర్చి ... ” - దేవుడు తన కప్పగించిన పనిని క్రీస్తు సంపూర్ణంగా నెరవేర్చాడు. మానవజాతి విమోచనలో ఇదే తుదిపలుకు.

యేసు క్రీస్తుద్వారా వెల్లడైన దేవుని సత్యాల్ని విభేదించే ప్రతిదీ దేవుని ప్రేమను అపార్థం చేసుకొనేలా చేస్తుంది. ఈ విభేదాలు మనం దేవుని పవిత్రతను సైతం అపార్థం చేసుకొనేలా చేస్తున్నాయి. మనమీద జాలితో లేదా మనమీద సానుభూతితో కాదు గానీ దేవుడు యేసు క్రీస్తును సిలువకు అప్పగించి ఆయన మన పాపాల్నీ శాపాల్నీ భరించాలని ఉద్దేశించాడు కాబట్టి క్రీస్తు తన తండ్రికి విధేయుడై మనకొరకు మరణించాడు. ఇది వాక్యానుసారమైన సత్యం! యేసు క్రీస్తు మన పాపాల్ని మన శాపాల్ని భరించాడనే సత్యం మన జీవితంలో వాస్తవం కావాలంటే మనం చేయవలసిన పని మన పాపాల్ని ఒప్పుకోడం మాత్రమే. మనం పాపాల్ని ఒప్పుకున్నప్పుడు మనం మారుమనస్సుకు పశ్చాత్తాపానికి నడుస్తాం. మనం మారుమనస్సు పొందడం దేవుని కృపాకార్యం! యేసు క్రీస్తు మనుషుల్ని ప్రేమిస్తున్నాడు; అయితే ఆయన మనుషుల్లోని పాపాన్ని ద్వేషిస్తున్నాడు. ఆయన పాపాన్ని ఎంతగా ద్వేషిస్తున్నాడంటే ఇందుకు కల్వరి ఒక్కటే సరైన కొలమానం!

నవంబర్ 22

## అల్పమైనవి, మరియు ఘనమైనవి

"మీరు భోజనము చేసినను పానము చేసినను మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమకొరకు చేయుడి" (1 కొరింథీ 10:31)

జీవితంలో మనకెదురయ్యే అత్యల్పమైన విషయాలు సైతం దేవునిచేత ఉద్దేశించబడినవే. వీటిని తక్కువగా అంచనా వేయకు. దేవుడు ఘనమైనవాటినెలా ఉద్దేశించాడో అత్యల్పమైన విషయాల్ని సైతం అలాగే ఉద్దేశించాడు. మనలో ఒక నైజం వుంది; ఘనత కలిగించని పనులు చేయడానికి మనం ఇష్టపడం. ఇది దేవునిపట్ల భక్తిభావంతో కాదు గానీ మనం అప్రాముఖ్యులం కాదని ఇతరులు గుర్తించేలా చేసేందుకే. అయితే ఇది మనలో ఉన్న ఆధ్యాత్మిక అతిశయానికి నిదర్శనం. ఈ విషయంలో మనం చాలా అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే ఇది మనలో ఇతరులపట్ల చిన్నచూపును ఏహ్యాభావాన్ని కలిగిస్తుంది. ఘనుడిగా ఉండాలని, మరియు ఇతరులు నిన్నొక ఘనుడిగా చూడాలని తాపత్రయపడకు. ఘనుడిగా నటించకు! ఇతరులు నీకంటె ఎందులోనూ అల్పులు కారు. దేవుడు భూమ్మీద శిశువుగా జన్మించాడని గుర్తు తెచ్చుకో!

ఘనతలేని జీవితాన్ని మనం కోరుకోం. అయితే ఘనత లేకపోడం మన జీవితాన్ని ఏ మాత్రం తక్కువ చేయదు. సముద్రానికి సైతం తీరం వుంటుంది! తినడం తాగడం నడవడం మాట్లాడడంవంటి అత్యల్పమైన విషయాలు సైతం దేవుడు నియమించిన పనులే. ఈ పనుల్ని దేవుని కుమారుడైన మన ప్రభువు సైతం చేశాడు. "శిష్యుడు బోధకునికంటె అధికుడు కాడు" (మత్తయి 10:24) అని మన ప్రభువు చెప్పిన విషయం జ్ఞాపకం చేసుకో.

అల్పమైన విషయాలే కొన్ని సార్లు మనకు కాపుదలగా ఉంటాయి. మన దైనందిన జీవితం సాదాసీదాగానే ఉంటుంది; ఉండాలి కూడా! అయితే దేవుడు మనల్ని ఘనమైన విషయాల్లోకి నడిపించినప్పుడు ఏవి ఘనమైనవో ఏవి ఘనహీనమైనవో మనం ఏవి ప్రాముఖ్యమైనవో ఏవి అప్రాముఖ్యమైనవో మనం గుర్తించగలం. నీ జీవితపు లోతుల్ని ఎవరికీ విప్పి చూపకు, దేవునికి తప్ప. మన స్వంత మర్యాదగురించి స్వంత ఘనత గురించి అతిసాహసాలు సైతం చేస్తుంటాం. కొన్ని సార్లు మనం క్రైస్తవులమని సైతం మర్చిపోతుంటాం; అల్పమైన పనులకు దూరంగా ఉంటాం.

మనషులెవరికీ భయపడకు, దేవుణ్ణి తప్ప! నిన్ను ఆక్షేపించే మొట్టమొదటి వ్యక్తి నీవే! ఎందుకంటే నీలో ఉన్న ఆత్మవంచన నీకు మాత్రమే తెలుసు.

నవంబర్ 23

## తిరస్కారాన్నిబట్టి అన్యమనస్కత

"యెహోవా, మేము అధిక తిరస్కారము పొలైతిమి ... మమ్మును కరుణింపుము మమ్మును కరుణింపుము" (కీర్తన 123:3,4)

దేవునిలో మనకున్న విశ్వాసానికి అంత త్వరగా భంగం వాటిల్లదు. అయితే మన క్రైస్తవ నడత మాటిమాటికీ తిరస్కారానికి గురవుతూ ఉంటుంది. "మీ మనస్సులను కాచుకొనుడి, విశ్వాసఘాతకులు కాకుడి" (మలాకీ 2:16). మన మనసులపై బలమైన ప్రభావం పడవచ్చు. శత్రువు మన ఆలోచనల్లోకి చొచ్చుకు వచ్చి మనల్ని అన్యమనస్కతలకు గురి చేసి మనల్ని దేవునికి దూరం చెయ్యవచ్చు. కొన్ని ఆలోచనలకు సైతం మనం చాలా దూరంగా ఉండాలి. ఈ ఆలోచనలు మనల్ని విశ్వాసంనుంచి ప్రక్కదారి సైతం పట్టించగలవు. మనం మళ్లీ నిమ్మళమైన హృదయంలో దేవుని యెదుటకు వచ్చేవరకు అవి మనల్ని అన్యమనస్కతలకు గురి చేస్తూనే ఉంటాయి; మన విశ్వాసం నిరుపయోగంగా మారుతుంది; మనల్ని శరీరాశలు వశపర్చుకుంటాయి; మానవజ్ఞానం మనల్ని పరిపాలిస్తుంది.

"ఐహిక విచారములును ... " (మార్కు 4:18-19) - మన మనసుల్లో తప్పు అభిప్రాయాలు కలిగించేవి యివే. ఇవి చిన్న విషయాలుగా కనిపించినప్పటికీ మన దృష్టిని దేవునిమీదనుంచి ప్రక్కకు మళ్లించగలిగే అపారమైన శక్తి వీటికుంది. "ఐహిక విచారములు" నిన్ను ముంచివేయకుండా జాగ్రత్తపడు.

మనలో ఉండే మనో అన్యమనస్కత ప్రతీకారేచ్ఛ. "నాలోంచి ప్రతీకారేచ్ఛను తొలగించు" అని సెయింట్ అగస్టీన్ ప్రార్థించేవాడు. ప్రతీకారేచ్ఛ మన మనసుల్ని దేవునిమీద నుంచి ప్రక్కకు మళ్లిస్తుంది. "నన్ను చెప్పనివ్వండి" అని గానీ "నన్ను మనుషులు అర్థం చేసుకోవాలి" అని గానీ చెప్పకు. మన ప్రభువు ఎన్నడూ వివరణ యివ్వలేదు. ఇతరుల అపోహలు అపార్థాలు వాటంతటకు అవే సర్దుకునేవరకు మన ప్రభువు ఓపికపట్టాడు.

ఇతరుల ఆధ్యాత్మిక జీవితాలు మనం ఊహించినట్టుగా ఉండకపోతే మనం వెంటనే విమర్శకు దిగుతాం. ఇది దేవునితో మన సహవాసానికి ఆటంకంగా మారుతుంది. ఇతరుల్ని విమర్శించడానికి దేవుడు మనల్ని పిలవలేదు. ఇతరులకొరకు విజ్ఞాపన చేయడానికి మాత్రమే ఆయన మనల్ని పిలిచాడు.

నవంబర్ 24

## దృష్టి దిశ

“దాసుల కన్నులు తమ యజమానిని చేతితట్టును ... చూచునట్లు ... మన దేవుడైన యెహోవా మనలను కరుణించువరకు మన కన్నులు ఆయనతట్టు చూచుచున్నవి” (కీర్తనలు 123:2)

దేవునిమీద సంపూర్ణంగా ఆధారపడడంగురించి ఈ వచనం వివరిస్తోంది. పనివాడి దృష్టి తన యజమానిమీద ఉంటుంది; అలాగే మన దృష్టి దేవునిమీద ఉండాలి. దేవుని ముఖదర్శనం కలగాలంటే మన దృష్టి ఆయనవైపు ఉండాలి. అప్పుడు దేవుడు తనగురించి మనకెలా వెల్లడి చేస్తాడో తెలుస్తుంది (యెషయా 53:1 వచనం చూడండి). మన దృష్టి దేవునిమీదనుంచి ప్రక్కకు మళ్లినప్పుడు మనం ఆధ్యాత్మికంగా సారహీనులమవుతాం. మనల్ని సారహీనుల్ని చేసేవి బాహ్యాపరిస్థితులకంటె అధికంగా మన ఆలోచనలే. “ఇంకా కొంచెం ఘనమైన విషయాల్లో ఉంటే బాగుండేది; అప్పుడు అందరి దృష్టి నామీదనే ఉండేది” అని మనం ఆలోచిస్తుండవచ్చు. ఒక విషయం గుర్తుపెట్టుకో. మనం చేసే ఏ ప్రయత్నం మనల్ని గొప్పవాళ్లను చెయ్యదు.

ఉదాహరణకు, నీ జీవితంలో ఏదో ఒక సమస్య వచ్చి ఉండవచ్చు. అప్పుడు నీవు దేవునివైపు చూచి ఉండవచ్చు. ఇందుకు దేవుని ఆత్మే నీకు సాక్షి. కొన్ని సంవత్సరాల తర్వాత నీలో భిన్నమైన ఆలోచనలు కలిగాయేమో. “నా ఆలోచనల్లో అతిశయం ఉందేమో! నా స్థాయికి మించి నేను ఆలోచించానేమో!” అని ఇప్పుడు మధనపడుతున్నావా? “తెలివైన వారు” అని నీవనుకుంటున్న నీ స్నేహితులు “మొదట్లో నీవు ఆధ్యాత్మిక విషయాలగురించి మాట్లాడినప్పుడు నీవు తీవ్రమైన ఆవేశంలో ఉన్నావని తెలుసు. అది కొంతకాలమేనని కూడా మాకు తెలుసు. అయినా నీలో సహనం ఉండాలని దేవుడు కోరుకోడులే” అని చెబ్తారేమో! అప్పుడు నీవు “మంచిది! నేను కావలసినదానికంటె ఎక్కువగానే కోరుకుంటున్నానేమో” అని చెప్పినట్లయితే అది వినయపూర్వకంగా కనిపించినప్పటికీ నీవు దేవునిమీద ఆధారపడడం లేదని తెలియజేస్తుంది. నీవు దేవునిమీద కాక, ప్రాపంచిక జ్ఞానం ఉన్న మనుషుల ఆలోచనల మీదనే ఎక్కువగా ఆధారపడుతున్నావు. దేవుడు నిన్ను హఠాత్తుగా ఆపినప్పుడు మాత్రమే నీవు పోగొట్టుకున్నదేమిటో నీకు తెలుస్తుంది. నీలో ఆధ్యాత్మిక సారం క్షీణించిన ప్రతి సారీ, వెంటనే నిన్ను నీవు సరిచేసుకో. నీకూ దేవునికి మధ్య ఏదో ఆటంకం ఉందని గుర్తించు. వెంటనే ఆటంకాన్ని తొలగించుకొని నీ దృష్టిని దేవునిమీద కేంద్రీకరించు.

నవంబర్ 25

## ఆధ్యాత్మిక స్థిరత్వానికి రహస్యం

"మన ప్రభువైన యేసు క్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక" (గలతీ 6:14)

ఒక వ్యక్తి తిరిగి పుట్టినప్పుడు మొదట్లో అతనిలో నిలకడ ఉండదు; కారణం, ఒకదానితో ఒకటి సంబంధంలేని అతని భావోద్వేగాలు, మరియు అతని జీవితంలోని బాహ్యాపరిస్థితులు. అపొస్తలుడైన పౌలు జీవితాన్ని చూద్దాం. అతనిలో ఆధ్యాత్మిక స్థిరత్వం వుంది. అందుకే అతని కెటువంటి పరిస్థితులెదురైనప్పటికీ అతని అంతరంగంలో భయాందోళనల్లేవు. పౌలు దేవుని మీద బలంగా ఆధారపడడం కూడా అతను ఆధ్యాత్మిక విషయాల్లో స్థిరంగా ఉండడానికి కారణం. మనలో చాలా మంది ఆధ్యాత్మిక విషయాల్లో నిలకడగా ఉండలేరు. బాహ్యజీవితాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లయితే పౌలును విమర్శించినవారు చాలా విషయాల్లో అతిశయించారు; అయితే పౌలు తనను తాను తగ్గించుకొని అణకువగా ఉన్నాడు. ఈ రెండు అంశాలు ఒకదానితో ఒకటి పొసగవు. అయితే పౌలులో ఆధ్యాత్మిక స్థిరత్వానికి కారణం అతనికి ధర్మశాస్త్రంలో లోతుగా ఉన్న పాండిత్యం. క్రీస్తు సిలువద్వారా విమోచన నందించాలని దేవుడు పడిన ఆవేదన కూడా పౌలు ఆధ్యాత్మిక స్థిరత్వానికి కారణం కావచ్చు.

నీలో ఉన్న నమ్మకాల విషయంలో నిలకడగా ఉండు. క్రీస్తు సిలువ నీ నమ్మకాలకు మూలం కావాలి. క్రీస్తు సిలువకు సంబంధించని ఏ ఆలోచననైనా నీ దరి చేరనివ్వకు. ప్రపంచ చరిత్రలో క్రీస్తు సిలువ ఒక చారిత్రక సంఘటనగా ఉండవచ్చు. అయితే పరిశుద్ధ లేఖనాల ప్రకారం ప్రపంచ చరిత్రలోనే ప్రధానమైన మరియు అత్యంత అవశ్యకమైన సంఘటన క్రీస్తు సిలువ. మన బోధ క్రీస్తు సిలువమీద కాక అన్యవిషయాలమీద ఉన్నట్లయితే మన లక్ష్యం గురితప్పినట్లే; అప్పుడు మన బోధ దేవుని శక్తిని ఆయన ప్రేమను మనుషులకు చేర్చదు. మన బోధలో క్రీస్తు సిలువ ప్రస్తావన లేనట్లయితే అది ఒక వేళ వినేవారిలో ఏ మాత్రమైనా ఆసక్తి కలిగించవచ్చేమో గానీ ఆ బోధలో శక్తి ఉండదు. అయితే మనం సిలువగురించి బోధించి నప్పుడు దేవుని శక్తి విడుదలవుతుంది. "సువార్త ప్రకటనయను వెఱ్ఱితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను ... అయితే మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము" (1 కొరింథీ 1:21,23).

నవంబర్ 26

## ఆధ్యాత్మిక శక్తికి ప్రధాన కేంద్రం

"మన ప్రభువైన యేసు క్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట ... " (గలతీ 6:14)

నీవు దేవుని శక్తిగురించి తెలుసుకోవాలనుకుంటున్నట్లయితే (అంటే యేసు పునరుత్థానం గురించి, పునరుత్థానంతర్వాత ఆయన జీవంగురించి) నీకు దేవుడు అనుభవించిన ఆవేదన తెలియాలి. నీ ఆధ్యాత్మిక స్థితిగురించి నీలో ఉన్న ఆలోచనల్ని ప్రక్కనపెట్టి ఒక్కసారి దేవుని ఆవేదన చూడు. చూసిన తత్క్షణంలోనే నీలో దేవుని శక్తి ప్రతిఫలిస్తుంది. "నావైపు చూచి రక్షణ పొందుడి"(యెషయా 45:22) అని దేవుడు చెబుతున్నాడు. మనం చూడవలసిన దిక్కు వైపు చూడడంలేదు కాబట్టి శక్తిని పొందలేకపోతున్నాం. సిలువ ప్రతిఫలం రక్షణ, సమర్పణ, స్వస్థత. మనం "సిలువవేయబడిన యేసు క్రీస్తును" (1 కొరింథీ 2:2) ప్రకటించడానికి పిలబడ్డాం. మనం యేసును ప్రకటించినప్పుడు, జరగవలసిన కార్యాన్ని దేవుడే జరిగిస్తాడు. కాబట్టి నీ బోధను దేవుని ప్రధానోద్దేశమైన సిలువమీద కేంద్రీకరించు. నీ బోధ వినేవారు పెద్దగా ఆసక్తి చూపకపోయినప్పటికీ నిరాశపడకు; ఎందుకంటే వాళ్లు అదే స్థితిలో కొనసాగలేరు గనక. నేను నా స్వంత మాటల్ని బోధించినట్లయితే వాటికి విలువ లేదు. అయితే నేను దేవుని సత్యాన్ని గనక బోధించినట్లయితే సత్యం ఏదో ఒక రోజు వినేవారి హృదయాల్ని తాకుతుంది. ఆధ్యాత్మిక శక్తికి కేంద్రమైన సిలువమీద నీ దృష్టి కేంద్రీకరించు. మనం సిలువకు దగ్గరైనప్పుడు మన జీవితాల్లో సిలువ శక్తి విడుదలవుతుంది.

మనం అశక్తులుగా ఉండడానికి కారణం మనం ఆధ్యాత్మిక శక్తికి కేంద్రమైన సిలువకు దూరంగా ఉండడమే. మనం కల్వరిగురించి, మరియు విమోచనగురించి ధ్యానించవలసిన రీతిలో ధ్యానించడం లేదనేది మాత్రం తథ్యం.

నవంబర్ 27

## ఆత్మనివేదన

"నాకు లోకమును లోకమునకు నేనును సిలువ వేయబడియున్నాము" (గలతీ 6:14)

నేను క్రీస్తు సిలువను నా ధ్యానాంశంగా చేసుకున్నట్లయితే నా మట్టుకు నేను నా అంతరంగంలో భక్తిగలవాడిగా మారడంతోబాటు యేసు క్రీస్తు ఇష్టాయిష్టాలపట్ల కూడా నా దృష్టి నిలుపుతాను. మన ప్రభువు తపస్వి కాడు; ఆయనలో మూఢభక్తి లేదు; ఆయన మనుషుల నుంచి సమాజంనుంచి తప్పుకోలేదు. అయితే ఆయన అంతరంగం మాత్రం సదా తండ్రి అయిన దేవునిమీదనే నిమగ్నమై ఉంది. ఆయన ఒంటరిగా గడపలేదు; అయితే ఆయన దృష్టి పరలోకంమీద ఉంది. ఆయన దైనందిన జీవితంలో మనుషులందరితో కలివిడిగా ఉన్నాడు; యేసు అందరితోబాటుగా భోజనంచేయడం చూసి ఆయణ్ణి తిండిపోతని దూషించారు. అయితే మన ప్రభువు తనను తాను తండ్రి అప్పగించిన కార్యానికి నివేదించు కోవలసివచ్చినప్పుడు ఏదీ ఆయన దృష్టిని మరల్చలేదు.

మనం కొన్ని సార్లు తప్పులు చేస్తుంటాం. వాటిలో ఒకటి "ఇప్పటికిప్పుడు కాదు గానీ ముందుకాలంలో నా ఆధ్యాత్మిక శక్తిని దేవునికొరకు వాడతాను" అని చెప్పడం. దేవుని ఆత్మ అనేకుల్ని పాపాలనుంచి విడిపిస్తూనే ఉన్నాడు; అయితే అనేకుల్లో సంపూర్ణత లేదు; పూర్తిస్థాయి స్వాతంత్ర్యం లేదు. యేసు కాలంనాటి పరిశుద్ధుల జీవితానికి నేటికాలంలోని మన ఆధ్యాత్మిక జీవితానికి పొంతన లేదు. "నీవు లోకములోనుండి వారిని తీసికొనిపొమ్మని నేను ప్రార్థించుటలేదుగాని దుష్టునినుండి వారిని కాపాడుమని ప్రార్థించుచున్నాను" (యోహాను 17:15) - ఇది యేసు మనకొరకు చేసిన ప్రార్థన. మనం లోకంలోనే ఉండాలి గానీ, లోకానికి చెందినవారిగా ఉండకూడదు. మన బాహ్యజీవితం మనుషుల మధ్యే గానీ మన అంతరంగంలో దేవుడుండాలి (యోహాను 17:16 వచనం చూడండి).

మన ఆధ్యాత్మిక శక్తిని దేవునికి నివేదన చేయడంలో ఏదీ మనల్ని ఆటంకపర్చ కూడదు. మనల్ని మనం సమర్పించుకోడం మన వంతు; మనల్ని ప్రతిష్ఠించడం దేవుని వంతు. దేవుని ఇష్టాయిష్టాల్నే మనం ఉద్దేశపూర్వకంగా మనఃపూర్వకంగా మన ఇష్టాయిష్టాలుగా మలచు కోవాలి. ఏదైనా ప్రశ్న తలెత్తినప్పుడు, ఏదైనా నిర్ణయం తీసుకోవలసి వచ్చినప్పుడు మనం మన హృదయాన్ని అడగవలసిన ప్రశ్న "ఇది ప్రభువుకు ఇష్టమైన పనేనా? లేక యేసుకు పూర్తిగా ఇష్టంలేనిదా?"

నవంబర్ 28

## అభాగ్యుల ఐశ్వర్యం

"ఆయన కృపచేతనే ... ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24)

మన స్వంత ప్రయత్నాలద్వారా మనం దేవునినుంచి దేన్నీ పొందలేం. దేవుడు మనకు దేన్నైనా తన వరంగా మాత్రమే అనుగ్రహిస్తాడు; ఆయన అనుగ్రహించకపోతే మనం పొందలేం. మనం దేవునినుంచి అందుకొనే గొప్ప ఆధ్యాత్మిక దీవెన మనం అభాగ్యులమని గుర్తించడమే. మనం దీనులమని నిరాశ్రయులమని ఒప్పుకొనేవరకు ప్రభువు శక్తి మనలోకి విడుదల కాదు. మనం స్వావలంబనమీద ఆధారపడి ఉన్నంతకాలం ఆయన మనలో ఏ కార్యాన్నీ జరిగించడు. ఆయన రాజ్యంలో ప్రవేశానికి అర్హత దీనత్వమే; మన నిర్భాగ్యతే. మనం ఐశ్వర్యవంతులమని భావించినంత కాలం (మరీ ముఖ్యంగా అతిశయంలోను స్వాతంత్ర్యం లోను), దేవుడు మనకొరకేదీ చేయడు. మనలో ఆధ్యాత్మిక ఆకలిదప్పులున్నప్పుడే మనం పరిశుద్ధాత్మను పొందగలం. మనకేది అవసరమో దాన్ని దేవుడు పరిశుద్ధాత్మద్వారా మన కనుగ్రహిస్తాడు. మనకు జీవం అవశ్యం. పరలోకసంబంధమైన జీవాన్ని పొందడం మనకు అందని కార్యం. పరిశుద్ధాత్మ పరలోకసంబంధమైన జీవాన్ని మనకనుగ్రహిస్తాడు. తత్క్షణమే పరలోక సంబంధమైన జీవం మనల్ని పరలోకసంబంధమైన లక్ష్యాలవైపు నడిపిస్తుంది. మనం యేసుతో చిరకాలం జీవిస్తూ ఆయన పాలనలో ఉంటాం (యోహాను 3:5 చూడండి).

సువార్త కొందరి హృదయాల్లో యేసుపట్ల అవసరతను పుట్టిస్తుంది. ఇది దేవుని కృపాకార్యం! అదే సువార్తపట్ల మరి కొందరు తిరస్కారభావాన్ని చూపిస్తారు. కారణం, సువార్తద్వారా వెల్లడైన సత్యం వారికి మ్రింగుడుపడదు కాబట్టి. కొందరిలో ఒక రకమైన అతిశయం వుంటుంది. వీరిలో ఔదార్యం ఎక్కువగా ఉంటుంది. ఇవ్వడం వీరికి సంతృప్తిని సంతోషాన్ని కలిగిస్తుంది. అయితే యేసు వద్దకు వచ్చి ఆయన అనుగ్రహించే భాగ్యాన్ని పొందడం మరొక విషయం. నా జీవితాన్ని నేను సేవకు అంకితం చెయ్యవచ్చు; నేను హతసాక్షిని కావాలని కోరుకోవచ్చు; నేను ఇంకేదైనా చెయ్యవచ్చు. అయితే నేను మాత్రం పాపినని మరియు అపరాధినని ఒప్పుకోనంటే నాలో దీనత్వం వున్నట్లేనా? అసలు నేను దేవునినుంచి దేన్నైనా పొందగలనా? దీనహృదయులకే ధన్యత; నిరాశ్రయులకే పరలోక ఐశ్వర్యం!

నవంబర్ 29

## యేసు క్రీస్తు సర్వాధిపత్యం

"ఆయన ... నన్ను మహిమనరచును" (యోహాను 16:14)

క్రొత్త నిబంధన కాలంనాటి క్రైస్తవ అనుభవం యేసు క్రీస్తుపట్ల వ్యక్తిగతమైన మరియు తీవ్రమైన ఆవేశంతో కూడిన అనుభవం. నాడు క్రైస్తవుల్లోని భక్తివిశ్వాసాలకు దృశ్యమానమైన సూచనలున్నాయి. నాటి క్రైస్తవులకు మాదిరి సాక్షాత్తూ క్రీస్తే; ముందుగా ఆయన వారికి రక్షకుడు కూడా! అయితే నేడు మనం యేసు క్రీస్తును ఒక మతానికి నాయకుడుగా మాత్రమే చూస్తున్నాం. యేసు క్రీస్తును ఒక మతానికి చెందిన వ్యక్తిగా పరిమితం చేస్తున్నాం. అయితే యేసు సర్వాధిపతి; ఆయన లోకరక్షకుడు; ఆయనే నీతి; ఆయనే విమోచన!

"సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ... ఆయన ... నన్ను మహిమపరచును" (యోహాను 16:13,14) అని యేసు ముందుగానే చెప్పాడు. క్రొత్త నిబంధనలో వెల్లడైన సత్యాన్ని నేను అంగీకరించినప్పుడు దేవునినుంచి పరిశుద్ధాత్మను వరంగా పొందుతాను. అప్పుడు పరిశుద్ధాత్మ యేసు బోధించినవాటిని నా హృదయానికి బోధిస్తాడు. యేసు పరిచర్య బాహ్యపరిచర్య; పరిశుద్ధాత్మ పరిచర్య అంతరంగ పరిచర్య.

అయితే నేడు క్రొత్త నిబంధననాటి కఠిన పరిస్థితుల్లేవు. యేసు క్రీస్తు మరణం మన కళ్లముందు జరిగిన సంఘటన కాదు. ఇప్పుడున్న వాతావారణం పరిశుద్ధత ప్రార్థన మరియు విశ్వాసం. నేడు మనం ఉలిక్కిపడే దివ్యానుభూతుల్లేవు; "ఇది దేవునివలన జరిగిన కార్యం" అని మనం సంభ్రమాశ్చర్యాలతో చెప్పడానికి సూచకక్రియల్లేవు. పరిశుద్ధాత్మ దిగిరావడం నేడు ప్రత్యక్షంగా మనం చూడడంలేదు. అయినా క్రొత్త నిబంధన కాలంలోలాగానే నేడు కూడా క్రీస్తు సర్వాధిపత్యం ఆయన సర్వశక్త పరిపాలన కొనసాగుతూనే ఉన్నాయి. నాడూ నేడూ అధిపతి క్రీస్తు ఒక్కడే. నాటినుంచి నేటివరకు క్రీస్తు పాలన కొనసాగుతూనే ఉంది; కొనసాగుతూనే ఉంటుంది!

నవంబర్ 30

## "నేనేమైయున్నానో ... కృపవలనే అయియున్నాను"

"నేనేమైయున్నానో అది దేవుని కృపవననే అయియున్నాను. మరియు నాకు అనుగ్రహింపబడిన ఆయన కృప నిష్ఫలము కాలేదు గాని ... " (1 కొరింథీ 15:10)

మన బలహీనతలగురించి మనం సదా ఏకరువు పెట్టడం మన సృష్టికర్తను అవమానపర్చడమే అవుతుంది. మన అశక్తతలగురించి దేవునికి ఫిర్యాదుచేయడం ఆయన మనల్ని నిర్లక్ష్యంచేస్తున్నాడని నిందించడమే అవుతుంది. మనం మనుషుల దృక్పథంలోంచి కాక దేవుని దృక్పథంలోంచి చూడడం అలవర్చుకోవాలి! అప్పుడు మనం ఏకరువుపెట్టే విషయాలెంత అల్పమైనవో ఎంత అప్రధానమైనవో చూడగలం! ఇతరులకు నీ మాటలు దీనవచనాలుగా కనిపించవచ్చేమో గానీ, అవి దేవునియెదుట నీలో ఉన్న తిరస్కారాన్ని బాహాటపర్చే ధిక్కారస్వరాలే!

అయితే నీవు దేవునియెదుట నిజంగా దీనుడవై మాట్లాడే మాటలు మనుషులకు పూర్తిగా భిన్నంగా కనిపిస్తాయి. "దేవా, వందనాలు. నన్ను రక్షించావు" అని నీవు చెప్పినప్పుడు దేవునియెదుట నిశ్చయంగా నీవు దీనుడవే. నిన్ను నీవు దేవుని అధీనతకు సంపూర్ణంగా అప్పగించుకున్నావనే అర్థం నీ మాటల్లో గోచరిస్తుంది. ఇది నిజమని నీకు తెలుసు. అయితే ఇతరులు నీ మాటలగురించి ఏమనుకుంటారోనని వ్యధ చెందకు. ఇతరులు నీగురించి ఏమనుకున్నా దిగులుపడకు. అయితే నీవు మాత్రం దేవుని యెదుట సదా దీనుడిగా ఉండు. ఆయన నీకు సర్వస్వమని భావించు.

నీ విమోచకుడు నీ ప్రభువు అయిన క్రీస్తుతో నీకున్న అన్యోన్య సంబంధమే నీకు ముఖ్యం. ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎన్ని ఆటంకాలు కలిగినా క్రీస్తుతో అన్యోన్యతను విడిచిపెట్టకు. నీవాయనకొరకు నిలబడినప్పుడు, ఆయన నీద్వారా తన ఉద్దేశాల్ని జరిగిస్తాడు. దేవునికి తన ఉద్దేశాల్ని నెరవేర్చే జీవితాలు కావాలి. నీ జీవితం అటువంటి జీవితం కావాలని కోరుకో!

డిసెంబర్ 1

## ధర్మశాస్త్రం, మరియు సువార్త

"ఎవడైనను ధర్మశాస్త్రమంతయు గైకొనియు, ఒక ఆజ్ఞ విషయములో తప్పిపోయినయెడల, ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధియగును" (యాకోబు 2:10)

మానవమాత్రులమైన మన బలహీనతల్ని ధర్మశాస్త్రం పరిగణనలోకి తీసుకోదు. అయితే ధర్మశాస్త్రం మనకు అనువంశికంగా సంక్రమించిన దౌర్బల్యాన్ని మాత్రం పరిగణనలోకి తీసుకుంటుంది. మనలో తిరుగులేని నైతికత ఉండాలని ధర్మశాస్త్రం కోరుకుంటుంది. ధర్మశాస్త్రం మార్పులేనిది. ధర్మశాస్త్రం ఏ కాలానికైనా ఒక్కటే. బలవంతులకైనా బలహీనులకైనా ధర్మశాస్త్రం ఒకే విధంగా తీర్పు తీరుస్తుంది. దేవుడనుగ్రహించిన ధర్మశాస్త్రం అశక్తుల్ని క్షమించి అశక్తత పొందదు. ధర్మశాస్త్రం ఎవరి విషయంలోనైనా ఒక్కటే. ఈ విషయాన్ని మనం గుర్తించకపోయినట్లయితే మనం మరణచ్ఛాయలో ఉన్నట్లే. ఈ విషయాన్ని మనం గుర్తించిన మరుక్షణం మన జీవితం విషాదభరితంగా మారుతుంది. ఎందుకంటే ఈ విషయాన్ని మనం గుర్తించిన వెనువెంటనే దేవుని ఆత్మ మనల్ని పాపం విషయంలో ఒప్పిస్తాడు. లోకంలో ఇక నిరీక్షణ లేదని మనం గుర్తించేవరకు ఎవరికైనా క్రీస్తు సిలువ అర్థరహితంగానే కనిపిస్తుంది. "ఒకప్పుడు నేను ధర్మశాస్త్రము లేకుండ జీవించుచుంటినిగాని, ఆజ్ఞ వచ్చినప్పుడు పాపమునకు మరల జీవము వచ్చెను; నేనైతే చనిపోతిని" (రోమా 7:9) అని పౌలు చెబుతున్నాడు. మన పాపాల్ని మనం తెలుసుకున్నప్పుడు మనలో ధర్మశాస్త్రంపట్ల భయం యేర్పడుతుంది; మరియు ధర్మశాస్త్రంగురించి మన అవగాహన కూడా పరిమితంగానే ఉంటుంది. ధర్మశాస్త్రంద్వారా మనుషులకు నిరీక్షణ కలగదు. పైగా ధర్మశాస్త్రం మనల్ని నిర్బంధిస్తుంది. అందుకనే పౌలు "నేను పాపమునకు అమ్మబడి ... యున్నాను" (రోమా 7:14) అని చెబుతున్నాడు. పాపంవిషయంలో అపరాధియైన నేను దేవునితో సరైన సంబంధం కలిగి ఉండడం దుస్సాధ్యం; ఇది అసంభవం. అయితే నేను దేవునితో సరైన సంబంధం కలిగి ఉండడానికి కేవలం ఒకే ఒక మార్గం వుంది; అది యేసు క్రీస్తు సిలువ మరణం. నా విధేయతద్వారా నా భక్తిద్వారా నేను దేవునితో సరైన సంబంధం కలిగి ఉండగలననే అభిప్రాయం ముందుగా నాలోనుంచి సమసిపోవాలి. అప్రతిహతమైన పరిపూర్ణతతో మనలో ఎవరు దేవునిపట్ల విధేయత చూపగలరా?

ధర్మశాస్త్రంగురించి ఒక విషయాన్ని మనం జ్ఞాపకం పెట్టుకోవాలి. ధర్మశాస్త్రంలో షరతులున్నాయి; వాగ్దానాలున్నాయి. అయితే దేవుడు మనల్ని బలవంతపెట్టడు. కొన్ని సార్లు దేవుడు మనల్ని బలవంతపెట్టాలని, మరి కొన్ని సార్లు దేవుడు మనల్ని స్వేచ్ఛగా వదిలిపెట్టాలని మనం ఆలోచించడం జరుగుతూ ఉంటుంది. అయితే దేవుని చిత్తానికి ఆయన అధీనతకు మనల్ని మనం అప్పగించుకున్నప్పుడు ఆయన ప్రతి భారాన్ని తొలగిస్తాడు. మనఃపూర్వకంగా ఆయనకు విధేయత చూపాలని మనం నిశ్చయించుకున్నప్పుడు సర్వశక్తుడైన దేవుడు యుగాంతంవరకు మనకు తోడుగా ఉంటాడు.

డిసెంబర్ 2

**క్రైస్తవ పరిణతి**

“ఇదివరకే నేను గెలిచితిననియైనను, ఇదివరకే నేను సంపూర్ణసిద్ధి పొందితిననియైనను నేను అనుకొనుటలేదు గాని ... ” (ఫిలిప్పీ 3:12)

మానవరీత్యా పరిణతి కలిగి ఉండడం వేరు; క్రైస్తవుల్లో ఉండవలసిన పరిపూర్ణత వేరు. దైనందిన జీవితంలో అత్యల్పమైన మరియు అప్రాముఖ్యమైన విషయాల్లో సైతం దేవునితో సంబంధం కలిగి ఉండడమే క్రైస్తవ పరిపూర్ణత. నీవు యేసు క్రీస్తు పిలుపును వినినప్పుడు మొదట్లో నీకు కొన్ని విషయాలు అగమ్యగోచరంగా ఉంటాయి; ఇతరుల జీవితాల్లో అవిభేద్యమైన పరిపూర్ణత ఉందని నీవనుకోవచ్చు. పరిపూర్ణత మానవసాధ్యమని నీవు ఆలోచిస్తూ ఉండవచ్చు; దేవునితో పనేమిటనే ఆలోచన నీలో పుట్టవచ్చు. మానవప్రయత్నంద్వారా ఆత్మసమర్పణద్వారా జీవితంలో దేవుడు నిర్దేశించిన ప్రమాణాల్ని చేరుకోవచ్చని నీవు ఆలోచించవచ్చు. పతనమైన ప్రపంచంలో ఎవరిలోనూ దేవుడు కోరుకున్న ఉత్తమ లక్షణాలుండవు. నా గొప్పతనాన్ని చాటుకోడానికి దేవుడు నన్ను పిలవలేదు గానీ నాకు దేవునితో ఉన్న సహవాసాన్ని ఇతరులు చూసి, వారు కూడా దేవునితో సహవాసం కలిగి ఉండాలని కోరుకోడానికే దేవుడు నన్ను పిలిచాడు. నా స్వంతయత్నాలగురించి నాలో ఉన్న ఆలోచనలు వాస్తవానికి నన్ను దేవునికి నిష్ప్రయోజకుడిగా చేస్తాయి. దేవుడు నన్ను తనకొరకు పనిచేయడానికి కోరుకుంటున్నాడు గానీ ఆయనకు నేనొక విజయసంకేతంలాగా ఒక జ్ఞాపికలాగా ఉండాలని కోరుకోడం లేదు. నేను దేవునికి ఏ విధంగా ఉపయోగపడగలనో ఆ విధంగా ఉపయోగపడడానికి దేవుడు నన్ను పిలుస్తున్నాడు.

దేవుడు మనల్ని తనకు నమూనాగా ఉంచాడనుకోడం కూడా సరైన ఆలోచన కాదు. అయితే, మనం దేవునితో తాదాత్మ్యత కలిగి ఉండాలని ఆయన కోరుకుంటున్నాడు. దేవుడు మనలో పరిశుద్ధత ఉండాలని కోరుకుంటున్నాడు. అయితే మనం ఆలోచించే పరిశుద్ధత వేరు. పరిశుద్ధతగురించి మనలో ఉన్న ఆలోచనలు మనల్ని దేవుని సంకల్పంకొరకు నియుక్తుల్ని చేయవుగానీ మనలో దేవుని పరిశుద్ధత ఉందని మనకు మనమే నిరూపించుకొనే ప్రయత్నాలకు దారితీస్తాయి. “అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను ... ” (యెషయా 53:10) అని పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తుండగా “నేను జబ్బుపడడం దేవునికి ఇష్టంలేదు” అని నీవెలా చెప్పగలవు? దేవుడు నిన్నెందుకు నలగగొట్టకూడదు? దేవునికి నీలో కావలసినది పరిశుద్ధతగురించి నీ స్వంత అంచనాలు ఆలోచనలు కాదు గానీ యేసు క్రీస్తుతో నీకున్న అన్యోన్య సహవాసం; మరియు నీవు ఆరోగ్యంగా ఉన్నా లేక అనారోగ్యంగా ఉన్నా నీలో ఉండే ఎదురులేని భక్తిభావం మాత్రమే.

డిసెంబర్ 3

## నా స్వంత శక్తియుక్తులు కాదు

"నేను మాటలాడినను సువార్త ప్రకటించినను, జ్ఞానయుక్తమైన తియ్యని మాటలను వినియోగింపక, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు ... " (1 కొరింథీ 2:4-5)

నీవు సువార్త ప్రకటించేటప్పుడు సువార్తశక్తిని కాక నీ వాక్చాతుర్యాన్ని వినియోగించినట్లయితే మనుషులు సువార్త సత్యాల్ని తెలుసుకోకుండా వారిని నీవు అడ్డగించినవాడవవుతావు. రక్షణసువార్తను ప్రకటించడానికి ముందుగా నీవు సువార్తసత్యంలోను విశ్వాసంలోను లోతుగా వేళ్లూనుకున్నావో లేదో జాగ్రత్తగా గమనించుకో. సువార్త సత్యాల్ని విడమర్చి చెప్పేటప్పుడు నీ వాగ్ధాటిమీద ఆధారపడకు. పరిశుద్ధాత్మమీద ఆధారపడడం నేర్చుకో. దేవుని విమోచనశక్తిమీద ఆధారపడు; అప్పుడు దేవుడు ఇతరుల్లో తన జీవాన్నుంచుతాడు.

ఒక సారి నీవు సత్యంలో లోతుగా వేళ్లూనుకున్న తర్వాత నిన్నేదీ కదిలించలేదు. నీ విశ్వాసం అనుభవాల్లోను అనుభూతుల్లోను మాత్రమే అయినట్లయితే ఏ చిన్న సంఘటన జరిగినా అది నీ విశ్వాసాన్ని తలకిందులు చేయగలదు. అయితే దేవుణ్నీ, ఆయన విమోచనకున్న శక్తినీ ఏదీ కదిలించలేదు. నీ విశ్వాసం దేవునిమీద ఉన్నప్పుడు దేవుడెంత నిశ్చలుడో నీవు కూడా అంతే నిశ్చలంగా ఉండగలవు. అంతే తప్ప ప్రతిష్ఠచేయబడడం లేదా సమర్పించుకోడంగురించి నీ స్వంత అంచనాలు ఆలోచనలు ప్రతిష్ఠగురించి లేదా సమర్పణగురించినీవు అపార్థం చేసుకొనేలా చేస్తాయి. యోహాను 17:19 వచనం చూడండి. మనం తండ్రిచేత ప్రతిష్ఠ చేయబడవలసి ఉన్నామనే సత్యాన్ని గుర్తుంచుకో. ప్రతిష్ఠచేయబడిన నా జీవితం ఇక ఆయన సేవ కొరకే; ఆయన నన్ను తన కాళ్లగాను చేతులుగాను ఉపయోగించుకోడం కొరకే.



డిసెంబర్ 4

## వ్యతిరేక నియమం

“జయించువానికి ... ” (ప్రకటన 2:7)

దైనందిన జీవితమేగానీ ఆధ్యాత్మిక జీవితమేగానీ పోరాటంలేని జీవితం అసాధ్యం. భౌతిక మానసిక నైతిక ఆధ్యాత్మిక రంగాల్లో అనునిత్యం ఏదో ఒక సంఘర్షణ ఉంటుంది.

బాహ్యావాతావరణంతో మన దేహం సమతౌల్యత కలిగి ఉండే స్థితినే మనం “ఆరోగ్యం” అని చెబుతుంటాం. ఆరోగ్యంగా ఉండాలంటే బాహ్యపరిస్థితులతో తలపడే అంతర్గత దార్ఢ్యత ఉండాలి. బాహ్యావాతావరణంలోని ఏ మూలకాలు మన మనుగడకు ప్రాణాధారంగా ఉంటాయో మనుషులు మరణించిన తర్వాత అవే మూలకాలు మనుషుల దేహాల్ని శిథిల మయ్యేలా చేస్తాయి. మన దేహాలు ఆరోగ్యంగా ఉండడానికి అవసరమయ్యే సమతౌల్యత అంతర్గత దార్ఢ్యతద్వారా మాత్రమే సాధ్యం. మన మానసిక ఆరోగ్యం విషయంలో కూడా ఇదే నియమం వర్తిస్తుంది. మన మనసు దిటవు కలిగి నిలకడగా ఉండాలంటే సంఘర్షణ అనివార్యం. సంఘర్షణద్వారా మానసిక సమతౌల్యత చేకూరుతుంది. ఈ సంఘర్షణలనే మనం “ఆలోచనలు” అని పిలుస్తున్నాం.

నైతికతకు కూడా ఇదే నియమం వర్తిస్తుంది. మనకు నైతికబలాన్నివ్వనిది ఏదైనా సరే అది మనలో ఉన్న సుగుణాలతో విభేదించేవే. మనల్ని బలహీనపర్చేవాటినన్నిటిని మనం నైతికదార్ఢ్యతతో ఎదుర్కొన్నప్పుడు మనలో ఉన్న సుగుణాలు చెక్కుచెదరకుండా ఉంటాయి. ఇది మన నైతికస్థైర్యంమీద ఆధారపడి ఉంటుంది. అయితే నైతికతను కాపాడుకోడానికి యుద్ధం అవశ్యం. ఎందుకంటే నైతికత యాదృచ్ఛికమైనది కాదు. నైతికతను అలవర్చుకొని పెంపొందించుకోవాలి.

ఆధ్యాత్మికతకు కూడా ఇదే నియమం వర్తిస్తుంది. “లోకములో మీకు శ్రమ కలుగును” (లూకా 16:33) అని యేసు ప్రభువు సెలవిచ్చాడు. ఆధ్యాత్మికతకు ఆటంకం కలిగించే ప్రతిదీ మనల్ని భ్రష్టత్వానికి నడిపిస్తుంది. అయితే మన ప్రభువు “అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి ... ” (16:33) ఉన్నానని చెప్పాడు. మనల్ని వ్యతిరేకించేవాటన్నిటితో పోరాడడానికి, వాటిని అధిగమించడానికి మనం సర్వదా సిద్ధంగా ఉండాలి. అప్పుడే మనలో పరిశుద్ధత సమతూకంలో ఉంటుంది.

మన స్వభావానికి, యేసు క్రీస్తులో వెల్లడైన దేవుని నియమానికి మధ్య ఉన్న సమతూకమే పరిశుద్ధత.

డిసెంబర్ 5

## దేవుని ఆత్మకు నిలయం

"సింహాసన విషయములో మాత్రమే నేను నీ కంటె పైవాడనై యుందునని ... "

(ఆది 41:40)

నా శరీరాన్ని వశపర్చుకొనే విషయములో నేను దేవునికి జవాబు చెప్పవలసి ఉన్నాను. "నేను దేవుని కృపను నిరర్థకము చేయను" (గలతీ 2:21) అని పౌలు చెబుతున్నాడు. దేవుని కృప అప్రతిహతమైనది, అనంతమైనది. యేసు క్రీస్తు రక్షణకార్యాన్ని నెరవేర్చి విమోచనను సంపూర్ణం చేశాడు. నేను రక్షించబడుతూ లేను గానీ రక్షించబడ్డాను. దేవుని సింహాసనమెంత శాశ్వతమో రక్షణకూడా అంతే శాశ్వతం! అయితే దేవుడు మనకనుగ్రహించిన రక్షణను మనం కార్యరూపంలో పెట్టాలి. " ... మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి" (ఫిలిప్పీ 2:12) అని పౌలు ప్రస్తావించిన మాటలు మన వ్యక్తిగత బాధ్యతను మనకు గుర్తుచేస్తున్నాయి. ప్రభువైన యేసు జీవం మనలో వెల్లడి కావాలి; నిగూఢంగా కాదు, బాహాటంగా. "నా శరీరమును నలగగొట్టి, దానిని లోపరచు కొనుచున్నాను" (1 కొరింథీ 9:27) అని పౌలు తన స్వంత అనుభవంగురించి చెబుతున్నాడు. పౌలులాగా ప్రతి క్రైస్తవుడు తన శరీరాన్ని దేవుని సర్వాధీనతకు అప్పగించుకోవాలి. "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా?" (1 కొరింథీ 6:19). మన శరీరాశల్ని శరీరేచ్ఛల్ని దూరంచేసి మన దేహాల్ని మనం దేవుని ఆధీనతకు వశపర్చాలి. ఇందుకు బాధ్యత మనదే. అయితే మనం ఈ విషయంలో మనల్ని మనం పరిశీలించుకోడంకంటె ఇతరుల్ని విమర్శించడంలో ముందడుగులో ఉంటాం. ఎందుకంటే మనలో ఇంకా శరీరాశలు శరీరేచ్ఛలున్నాయి కాబట్టి.

"పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని ... మిమ్మును బతిమాలుకొనుచున్నాను" (రోమా 12:1) అని పౌలు ప్రస్తావిస్తున్నాడు. నేను దేవునికి ఇష్టమైన సజీవయాగంగా ఉన్నానా లేనా అని నేను ఆలోచించుకోవలసిన సమయమిది. నన్ను నేను సజీవయాగంగా సమర్పించుకోడానికి నాలో ఉండవలసిన ఏకైక అర్హత నా శరీరం "పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని" నేను గ్రహించడమే.



డిసెంబర్ 6

## "మేఘములో నా ధనుస్సు"

"మేఘములో నా ధనుస్సును ఉంచితిని; అది నాకును భూమికిని మధ్య నిబంధనకు గురుతుగా ఉండును" (ఆది 9:13)

మనుషులు తనతో సరైన సంబంధం కలిగి ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడు; ఇది ఆయన చిత్తం. ఇందుకొరకు ఆయన పలు నిబంధనలు చేశాడు. "దేవుడు మనుషులందరికొరకు రక్షణకార్యాన్ని సిద్ధం చేశాడు కదా! మరి ఆయన నన్నెందుకు రక్షించలేదు. ఆయనతో సరైన సంబంధంలోకి నేనెందుకు ప్రవేశించలేదు. నేనడిగినవాటినన్నిటినీ ఎందుకు పొందడంలేదు" అని ఆలోచిస్తున్నావా? ఆయన మనకు ఏం కావాలో వాటినన్నటినీ సంపూర్తిగా నెరవేర్చాడు. అసలు విషయం - ఆయనతో నేను నిబంధనలో ఉన్నానా? దేవుడిచ్చిన ఆశీర్వాదాలు సంపూర్ణంగా ఉన్నాయి. అయితే నేను దేవునితో నిబంధనలోనికి ప్రవేశించినప్పుడు మాత్రమే వాటిని పొందగలను. దేవుని వాగ్దానాలకు, ఆయన ఆశీర్వాదాలకు మూలం ఆయన మనతో చేసిన నిబంధన.

దేవుడు మనకొరకేదో చేయాలని మనం ఆలోచించడం ఒక విధంగా శరీరసంబంధమైన అపనమ్మకమే. ఆయణ్ణి నేను విశ్వసించడానికి ఆయన ఏదో ఒకటి నాకొరకు చేయాలని ఆలోచించడం నాలో ఉన్న అవిశ్వాసాన్ని సూచిస్తోంది. అయితే దేవుడు నేను కోరుకున్నది చేయడు; ఎందుకంటే, దేవునికి మనిషికి మధ్య ఉండవలసిన సంబంధానికి ఇది మూలం కాదు గనక.  దేవుడు కోరుకునే విశ్వాసం మనలో ఉండడం చాలా అరుదు. మన అనుభవాల్లో అనుభూతుల్లో మనకు విశ్వాసం యెక్కువ. మనం తాకి చూడగలిగేదాన్నేదైనా దేవుడు మన చేతిలో పెట్టినప్పుడు మాత్రమే మనం దేవుణ్ణి నమ్ముతాం. అప్పుడు మాత్రమే మనం "ఇప్పుడు నమ్ముతున్నాను" అని చెబ్తాం. అయితే ఇది విశ్వాసమే కాదు. అయితే దేవుడు "నా వైపు చూచి రక్షణ పొందుడి" (యెషయా 45:22) అని చెబ్తున్నాడు. దేవునివైపు చూడడం నిజమైన విశ్వాసం!

అయితే మనకు దేవునికి మధ్య ఉన్న నిబంధన ప్రకారం మనం జీవిస్తున్నట్లయితే అది మన వ్యక్తిగత విజయం కాదు గానీ దేవునితో తాదాత్మ్యత కలిగి ఉన్నందువల్ల కలిగే అపూర్వ విజయం మాత్రమే! సమాధానాన్ని సంతోషాన్ని ప్రతిఫలించే మన జీవితం మనకు దేవుని నిబంధనతో ఉన్న సంబంధానికి ప్రతీక!

డిసెంబర్ 7

## పశ్చాత్తాపం

"దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును"
(2 కొరింథీ 7:10)

నా పాపాలు, నా శాపాలు
నీమీద పడడం యెంత ఘోరం, నా రక్షకా!

పాపాల విషయంలో పశ్చాత్తాపపడడం ఒక వ్యక్తి జీవితంలో జరిగే అసాధారణమైన సంఘటన. వాస్తవానికి, దేవునిగురించి తెలుసుకోడానికి ఇదే ఆరంభం. పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు ఆయన మన హృదయాల్ని పాపం విషయంలో ఒప్పిస్తాడని యేసు ముందుగానే చెప్పాడు (యోహాను 16:8 వచనం చూడండి). పరిశుద్ధాత్మ ఒక వ్యక్తి మనస్సాక్షిని కదిలించి, ఆ వ్యక్తిని దేవుని సన్నిధికి తీసుకొని వచ్చినప్పుడు ఆ వ్యక్తి ఇక ఇతరులతో తనకున్న సంబంధాల్ని పట్టించుకోడు. అతను దేవునిమీదనే దృష్టి పెడతాడు. ఈ కారణంచేతనే "నీకు కేవలము నీకే విరోధముగా నేను పాపము చేసియున్నాను" (కీర్తనలు 51:4) అని దావీదు చెప్పినట్టుగా పాపం విషయంలో పశ్చాత్తాపపడే ప్రతి వ్యక్తీ చెప్పగలడు. పాపాల్ని విడిచిపెట్టి దేవునివైపు మళ్లి పరిశుద్ధత కోరుకొనే వ్యక్తిలో పశ్చాత్తాపం పాపక్షమాపణ పరిశుద్ధత అనేవి అద్భుతంగా మిళితమై ఉంటాయి. ఆ వ్యక్తి తాను దేవుని కృపద్వారా మాత్రమే రక్షించబడ్డానని గ్రహిస్తాడు; ఇంత క్రితం తన జీవితానికి ఇప్పటి తన జీవితానికి మధ్య ఎంత వ్యత్యాసం వుందో అతనికి అవగతమవుతుంది. "నేను పాపం చేశాను" అని చెప్పగలగడమే నిజమైన పశ్చాత్తాపం. ఒక వ్యక్తి ఈ మాటలు చెప్పగలిగినప్పుడు అతనిలో దేవుని కార్యం మొదలైందని మనం నిశ్చయంగా చెప్పవచ్చు. మిగిలిన మాటలన్నీ తప్పు చేసినందుకు విచారం వెలిబుచ్చే సంతాపపు మాటలు మాత్రమే; విసుగుచెందినందువల్ల వెలిబుచ్చే అసంకల్పిత ప్రతీకార చర్య మాత్రమే.

పాపాల విషయంలో పశ్చాత్తాపపడినవారికే దేవుని రాజ్యంలోకి ప్రవేశం. పాపాల విషయంలో పశ్చాత్తాపపడిన వ్యక్తి సహజంగానే ఇక మంచివాడిగా మారతాడు. అప్పుడు పరిశుద్ధాత్మ ఆ వ్యక్తిలో క్రీస్తు స్వరూపాన్ని పెంపొందిస్తాడు (గలతీ 4:19 వచనం చూడండి). పాపాల విషయంలో స్పృహ, పరిశుద్ధత విషయంలో అవ్యక్తచేతనం నూతన జీవపు ధర్మాలు. క్రైస్తవత్వానికి పునాది పశ్చాత్తాపం. పశ్చాత్తాపం దేవుని వరమే. ఎందుకంటే ఒక వ్యక్తి పశ్చాత్తాపపడాలని కోరుకున్నప్పటికీ కొన్ని సార్లు పశ్చాత్తాపపడలేడు. గతంలో ప్యూరిటన్లు "కన్నీళ్ల వరం"కొరకు ప్రార్థించేవారట! పశ్చాత్తాపం అర్థాన్ని, పశ్చాత్తాపం విలువను నీవు గుర్తించకపోయినట్లయితే నీవింకా పాపంలోనే ఉన్నావని అర్థం! నీవు నిజంగా పశ్చాత్తాపపడ్డావో లేదో ఒకసారి నిన్ను నీవు పరీక్షించుకో!



డిసెంబర్ 8

## దేవుని నిష్పాక్షిక శక్తి

"ఒక్క అర్పణచేత ఆయన పరిశుద్ధపరచబడువారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు" (హెబ్రీ 10:14)

మనం మన పాపాల విషయంలో పశ్చాత్తాపపడ్డాం కాబట్టి మన పాపాలు క్షమించబడ్డాయని ఆలోచిస్తున్నట్లయితే, మనం దేవుని కుమారుడైన యేసు రక్తాన్ని లెక్కచేయకుండా కాళ్లక్రింద త్రొక్కుతున్నామని అర్థం. దేవుడు మన పాపాల్ని క్షమించడానికి ఏకైక కారణం, మరియు ఆయన మన పాపాల్ని మర్చిపోతానని చేసిన అనంతమైన వాగ్దానానికి కారణం మన ప్రభువైన యేసు మరణం మాత్రమే. మన పశ్చాత్తాపం కేవలం క్రీస్తు సిలువను మన జీవితంలో వాస్తవం చేసుకున్నందువల్ల కలిగిన ఫలితం. ఇది దేవుని ఏర్పాటు. "దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను" (1 కొరింథీ 1:31). క్రీస్తు మనకొరకు ఇవన్నీ భరించాడని మనం గుర్తించినపప్పుడు మనలో దేవుని అనంతమైన సంతోషం మొదలవుతుంది. దేవుని సంతోషం మనలో లేని సమయం గనక ఉన్నట్లయితే, ఆ సమయం మనం మరణశాసనం క్రింద ఉన్న సమయమని అర్థం.

మనం యెవరమైనా సరే, మనం యేమై ఉన్నా సరే, దేవుడు తన కుమారుడైన యేసు క్రీస్తు సిలువ మరణంద్వారా మాత్రమే మనల్ని తనతో పునరైక్యం చేసుకుంటాడు. క్రీస్తు మనకొరకు మరణించాడు కాబట్టి దేవుడు మనల్ని పునరుద్ధరిస్తాడు. ఇది మనకు మనంగా సంపాదించుకొనేది కాదు; దీన్ని మనం విశ్వాసంద్వారానే పొందగలం. క్రీస్తు సిలువ ప్రమేయంలేకుండా రక్షణకొరకు చేసే విన్నపాలు వ్యర్థం. "నేను పాపినా? నేను పాపినని పిలవబడడం నాకు చిన్నతనంగా ఉంది" అని చెబ్తూ క్రీస్తుకు ఎదురుతిరుగుతున్నావా? ఇందుకు దేవుడు పేతురుద్వారా సెలవిచ్చిన జవాబు చూద్దామా! "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ... మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అ.కా 4:12). మనం దేవునికి దయలేదని ఏ కారణాన్నిబట్టి చెబ్తున్నామో వాస్తవానికి దేవుని దయకు అదే నిదర్శనం. ఆయన మార్గం అవధుల్లేని అనంతమైన మార్గం. "దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ... ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7). యేసు క్రీస్తు మరణంతో సమానానుభవం కలిగి ఉండడమంటే ఆయనకు చెందనివాటి విషయంలో మరణించడమే.

దేవుడు పాపాత్ముల్ని క్షమించినప్పుడు వారు మంచివారవుతారు. మనలో మంచితనం లేనప్పుడు, మనం మంచివాళ్లమని మన ప్రభువు చెప్పడు. అపవిత్రులైనవారిని పవిత్రుల్ని చేయడానికి దేవుడుపయోగించే ఏకైక కొలమానం క్రీస్తు సిలువ మాత్రమే.

డిసెంబర్ 9

## శరీరసంబంధికి వ్యతిరేకమైనవి

"క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువవేసియున్నారు" (గలతీ 4:23-24)

మనిషి పాపాన్ని విడిచిపెట్టాలి. పాపంతో మనిషికి ఎటువంటి సంబంధం వుండకూడదు. పాపం నరకానికి మరియు అపవాదికి సంబంధించినది. దేవుని బిడ్డనైన నేను పరలోకానికి మరియు దేవునికి చెందినవాడిని. పాపాన్ని విడిచిపెట్టడం ఒక ఎత్తైతే నామీద నాకున్నటువంటి సహజహక్కుల్ని నా సహజ స్వాతంత్ర్యాన్ని నా స్వంతచిత్తాన్ని విడిచిపెట్టడం మరో యెత్తు. మనం పోరాడవలసిన యుద్ధం యిదే. ప్రకృతిసంబంధంగా మనం ఏవి సరైనవి ఏవి ఉత్తమమైనవి ఏవి మంచివి అని భావిస్తుంటామో వాస్తవానికి అవే మనల్ని దేవునికి దూరం చేస్తుంటాయి. అయితే మానవప్రకృతిసంబంధమైన నీతి మనల్ని దేవునికి లోబడకుండా చేస్తుందని, మన నీతి దేవునినీతికి వ్యతిరేకంగా ఉందని తెలుసుకున్నప్పుడు మన అంతరాత్మలో సంఘర్షణ మొదలవుతుంది. ఇదొక గొప్ప పోరాటం! చెడ్డవాటిగురించి అపవిత్రమైనవాటిగురించి దుర్మార్గంగురించి వాదించడానికి మనలో చాలా మంది ముందుకు రారు గానీ మంచి విషయాలగురించి వాదించడానికి మాత్రం త్వరగా ముందుకు వస్తారు. మనం మంచివి అనుకున్నవి ఉత్తమమైనవాటిని వ్యతిరేకిస్తాయి. ఒక వ్యక్తి తన స్వనీతి విషయంలో ఎంత గొప్పగా వాదిస్తుంటే అతను అంత ఎక్కువగా యేసు క్రీస్తుకు దూరంగా ఉన్నాడని అర్థం. "క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువవేసి యున్నారు" - మన శరీరసంబంధ జీవితానికి మనం మూల్యం చెల్లించవలసినది ఏదో ఒకటో రెండో విషయాల్లో కాదు; అన్నిటిలోనూ. "ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల, తన్ను తాను ఉపేక్షించుకొని ... నన్ను వెంబడింపవలెను" (మత్తయి 16:24). అంటే క్రీస్తును అనుసరించాలనుకొనేవారు తమమీద తమకున్న హక్కుల్ని కోల్పోవాలని అర్థం. యేసు క్రీస్తు ఎవరో మనం నిజంగా గుర్తించినప్పుడు మన మీద మనకున్న హక్కుల్ని కోల్పోవడం అంత గొప్ప విషయమేమీ కాదు! నీ సాతంత్ర్యాన్ని విడిచిపెట్టు; నీ మీద నీకున్న హక్కుల్ని భూస్థాపితం చెయ్యి.

శరీరసంబంధమైన ప్రకృతిజీవితం వేరు; ఆధ్యాత్మిక జీవితం వేరు. ఒక వ్యక్తి ఆత్మ సమర్పణద్వారానే అతని ఆధ్యత్మిక జీవితం ప్రారంభమవుతుంది. మనఃపూర్వకంగా మరియు ఉద్దేశపూర్వకంగా మనం మన ప్రకృతిజీవితాన్ని విడిచిపెట్టకపోతే పరలోక సంబంధమైనవాటి నెన్నటికీ వాస్తవం చేసుకోలేం. దేవుణ్ణి, మరియు పరలోక సంబంధమైనవాటిని తెలుసుకోడానికి దగ్గరిదారి గానీ సులువైన పద్ధతిగానీ లేదు. ప్రతి వ్యక్తీ తనకు తానుగా దేవుణ్ణి తెలుసుకోవాలి. ప్రార్థనద్వారా కాదు గానీ, మనకున్నవి త్యాగం చేయడంద్వారా కాదు గానీ, దేవుని చిత్తాన్ననుసరించడం ద్వారా మాత్రమే మనం దేవుణ్ణి తెలుసుకోగలం!

డిసెంబర్ 10

## ప్రకృతిసంబంధమైన అర్పణ

“దాసివలన ఒకడును స్వతంత్రురాలివలన ఒకడును ఇద్దరు కుమారులు అబ్రాహామునకు కలిగిరని వ్రాయబడియున్నది గదా” (గలతీ 4:22)

పౌలు గలతీయులకు వ్రాసిన ఈ అధ్యాయంలో పాపంగురించి ప్రస్తావించడం లేదుగానీ ప్రకృతిసంబంధమైనవాటికి ఆత్మసంబంధమైనవాటికి మధ్య ఉన్న సంబంధం గురించి మాట్లాడుతున్నాడు. ప్రకృతిసంబంధమైనవాటిని విడిచిపెట్టడంద్వారా మాత్రమే మనం ఆత్మసంబంధమైనవాటిని పొందగలం. ఇది లేనిచోట ద్విమనస్కత ఉంటుంది. దేవుడెందుకు మనం ప్రకృతిసంబంధమైనవాటిని విడిచిపెట్టాలని కోరుకుంటున్నాడు? ఎందుకంటే ప్రకృతిసంబంధమైనవి దేవుని పరిపూర్ణ చిత్తంలో లేవు గనక. అయితే మనమే మన స్వాతంత్ర్యాన్ననుసరించి శరీరసంబంధమైనవి చేస్తున్నాం. దేవుడు మనలో వీటిని కోరుకోడు. మనలో ఉన్న ప్రకృతిసంబంధమైన కార్యాలు విధేయతద్వారా ఆత్మసంబంధమైన కార్యాలుగా మారాలని దేవుడు కోరుకుంటున్నాడు; ఇది ఆయన పరిపూర్ణ చిత్తంలో భాగం. ప్రకృతిసంబంధమైనవాటిని లేదా శరీరసంబంధమైనవాటినని మనం విడిచిపెట్టాలనే ఏర్పాటుకు కారణం పాపమే.

అబ్రాహాము ఇస్సాకును బలిగా అర్పించడానికి ముందు ఇష్మాయేలును విడిచిపెట్టాడు (ఆది 21:8-14 వచనాలు చూడండి). అయితే మనలో కొంతమంది శరీర సంబంధమైనవాటిని లేదా ప్రకృతిసంబంధమైనవాటిని విడిచిపెట్టకుండా ఆత్మసంబంధ మైన అర్పణల్ని అర్పించడానికి ముందుకు వస్తున్నారు. మనల్ని మనం దేవునికి అర్పించుకోవలసిన విధానం: “పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని ... బతిమాలు కొనుచున్నాము” (రోమా 12:1). సమర్పించుకోడమంటే లేదా ప్రతిష్ఠించుకోడమంటే కేవలం పాపంనుంచి విడుదలపొందడం మాత్రమే కాదు; నన్ను రక్షించిన నా దేవునికి నన్ను నేను మనఃపూర్వకంగా లోబర్చుకోడం మరియు ఇందుకొరకు ఎంతటి మూల్యాన్నైనా చెల్లించడానికి సిద్ధపడడం.

ఆత్మసంబంధమైనవాటికొరకు శరీరసంబంధమైనవాటిని విడిచిపెట్టడానికి మనం సిద్ధపడకపోయినట్లయితే మనలో ఉన్న ప్రకృతిసంబంధమైన జీవం మనలో ఉన్న దేవుని కుమారుని జీవాన్ని ధిక్కరిస్తుంది; ఫలితం, మనలో ఎడతెగని కలవరం. క్రమశిక్షణలేని ఆధ్యాత్మిక జీవితం ఇలాగే ఉంటుంది. భౌతిక విషయాల్లో నైతిక విషయాల్లో మానసిక విషయాల్లో మనం క్రమశిక్షణ అలవర్చుకోకపోవడంవలన వచ్చిన ఫలితమిది. “నాకు బాల్యంలో ఎవరూ క్రమశిక్షణ నేర్పలేదు” అని మనకు మనమే సాకులు చెప్పుకుంటూ ఉంటాం. తత్క్షణమే క్రమశిక్షణ నలవర్చుకో. అలవర్చుకోకపోయినట్లయితే దేవునితో నీకున్నటువంటి వ్యక్తిగత సహవాసానికి భంగం వాటిల్లుతుంది.

మనం మన శరీరాశల్నిబట్టి అతిశయిస్తున్నంత కాలం దేవుడు మన ప్రకృతిసంబంధమైన జీవితంలో ప్రమేయం చూపడు. అయితే మనం మన శరీరాశల్ని విడిచిపెట్టి క్రమశిక్షణ నలవర్చుకోడానికి సంసిద్ధమైనప్పుడు దేవుడు మనకు తోడుగా ఉంటాడు. అప్పుడు దేవుడు మనల్ని ఎడారుల్లో నీటివూటలదగ్గరకు నడిపించి మనల్ని సేదతీర్చుతాడు (ఆది 21:15-19 వచనాలు చూడండి).

డిసెంబర్ 11

## విలక్షణత, లేదా వ్యక్తిత్వం

"ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల, తన్ను తాను ఉపేక్షించుకొని ... నన్ను వెంబడింపవలెను" (మత్తయి 16:24)

స్వాతంత్ర్యం, మరియు స్వంత చిత్తం అనేవి వ్యక్తిత్వానికున్న విలక్షణతలు. మన వ్యక్తిత్వం వేరు, మన ఆధ్యాత్మిక జీవితం వేరు. మన ఆధ్యాత్మిక జీవితాన్ని ఆటంకపర్చేవాటిల్లో మొట్టమొదటిది మన వ్యక్తిత్వానికి అధిక ప్రాధాన్యతనివ్వడమని చెప్పవచ్చు. "నేనిది నమ్మను" అని నీవు చెబుతున్నావంటే నీ వ్యక్తిత్వం నిన్ను అడ్డుకుంటోందని అర్థం. ఎందుకంటే వ్యక్తిత్వానికి అటువంటి విలక్షణత ఉంది. అయితే మనలో ఉన్న ఆత్మ విశ్వసించకుండా ఉండలేదు. దేవుని ఆత్మ నీలో కార్యం జరిగిస్తున్నప్పుడు నిన్ను నీవు జాగ్రత్తగా పరిశీలించుకో. నీవు నిర్ణయం తీసుకోవలసిన సమయం వచ్చినప్పుడు దేవుని ఆత్మ నిన్ను నీ వ్యక్తిత్వపు చివరి అంచువరకు నడిపిస్తాడు. "నేను లోబడను" అని నీవు ఎంచుకుంటావా? లేక, నిన్ను నీవు దేవుని ఆత్మకు లోబర్చుకుంటావా? లోబడడమే నీ నిర్ణయమైనట్లయితే నీవు నీ వ్యక్తిత్వపు గట్టి కవచాన్ని పగలగొట్టుకొని బయటకు వచ్చావని అర్థం. నీ వ్యక్తిత్వం పటాపంచలైతేనే నీ ఆధ్యాత్మిక జీవితం ఆరంభమవుతుంది. పరిశుద్ధాత్మ నీ దృష్టిని ఒకే ఒక విషయంమీదకు మళ్లిస్తాడు (మత్తయి 5:23,24 వచనాలు చూడండి). నీవు నీ సహోదరుడితో సమాధానపడకుండా నీ వ్యక్తిత్వం నిన్ను అడ్డుకుంటుంది. దేవుడు నీవు తనతో ఏకమై ఉండాలని కోరుకుంటున్నాడు. అయితే నీమీద నీకున్న హక్కును నీవు పోగొట్టు కొనేంతవరకు నీవు దేవునితో ఏకత కలిగి ఉండలేవు. "తన్ను తాను ఉపేక్షించుకొని ..." - నీమీద నీకున్న హక్కును నీవు వదులుకోవాలి. అప్పుడు మాత్రమే అసలైన జీవితం అంటే ఆధ్యాత్మిక జీవితం వికసిస్తుంది.

అయితే మన అంతరంగ ఆధ్యాత్మిక జీవితం చుట్టూ గట్టి కవచంలాగా ఉన్న మన వ్యక్తిత్వం ఇతరుల్ని మన దగ్గరకు చేర్చుకోనివ్వదు; మన వ్యక్తిత్వం మనకే ప్రాధాన్యత నిస్తూ ఇతరుల్ని ప్రక్కకు త్రోసివేస్తుంది. ఇది మనలో ఉన్న అపరిపక్వతను సూచిస్తోంది. ఎప్పుడైతే మనం మన వ్యక్తిత్వాన్ని దేవునికి లోబరుస్తామో అప్పుడు మనం దేవునితో సహవాసం కలిగి ఉండడం సుగమమౌతుంది. శరీరాశ ప్రేమకు ఎంత వ్యతిరేకమో మన వ్యక్తిత్వం మన ఆధ్యాత్మికతకు అంతే వ్యతిరేకం. దేవుడు మనలో ఉంచిన మానవ స్వభావాన్ని మన వ్యక్తిత్వం వికృతపరుస్తోంది; కారణం స్వార్థమే.

డిసెంబర్ 12

## మూర్తిమత్వం

“మనము ఏకమైయున్నలాగున, వారును ఏకమైయుండవలెనని ... ” (యోహాను 17:22)

మన బాహ్యప్రవృత్తి మన వ్యక్తిత్వానికెలా స్వాభావిక సూచనగా ఉందో, మన ఆధ్యాత్మిక జీవితానికి మన మూర్తిమత్వం కూడా అలాగే స్వాభావిక సూచనగా ఉంది. “నేనును తండ్రియు ఏకమైయున్నామని ... ” (యోహాను 10:30) యేసు ప్రభువు చెప్పాడు. వ్యక్తిత్వం కొన్ని సార్లు విలీనతను కోరుకోవచ్చు; నీవితరులతో విలీనమైనప్పుడు నీ అసలు వ్యక్తిత్వం బయటకు వస్తుంది. ఒక వ్యక్తిలో దేవుని ఆత్మ తన కార్యాన్ని జరిగించినప్పుడు అతనిలో పరివర్తన వస్తుంది. అప్పుడతను తన వ్యక్తిత్వంలోని విలక్షణత గురించి పెద్దగా పట్టించుకోడు. “మనము ఏకమైయున్నలాగున, వారును ఏకమైయుండవలెనని ... ” - మన ప్రభువు మన మూర్తిమత్వంగురించి మాట్లాడాడుగానీ మన వ్యక్తిత్వంగురించి మాట్లాడలేదు. ఒక సారి నీ మీద నీకున్న హక్కుల్ని నీవు ప్రభువుయెదుట లోబర్చిన తర్వాత నీ మూర్తిమత్వం దేవునిపట్ల స్పందించడం ప్రారంభిస్తుంది. అప్పుడు నీ వ్యక్తిత్వంలో అనూహ్యమైన మార్పు వస్తుంది. ఈ మార్పు ప్రేమవలన ఒనగూడిన మార్పు; యేసు పట్ల నీకున్న భక్తిప్రపత్తులవలన వచ్చిన మార్పు. దేవునితోను ఇతరులతోను నీకున్న నిజమైన సహవాసం నీవు చూపించే ప్రేమలో మాత్రమే ప్రతిఫలిస్తుంది.

ఎవరి వ్యక్తిత్వం వారిదే! మన వ్యక్తిత్వమే మనకు సరిగ్గా అర్థం కాదు; ఇతరుల వ్యక్తిత్వాన్నిక మనమెలా అర్థం చేసుకోగలం! మన వ్యక్తిత్వం సముద్రమధ్యంలో కనిపించే ద్వీపపు కొనలాంటిది. సముద్రంలో మునిగి ఉన్న ద్వీపపు వైశాల్యాన్ని మనం కనిపెట్టలేనట్లే మన వ్యక్తిత్వపు లోతుల్ని కూడా మనం కనిపెట్టలేం! అయితే మనల్ని సృష్టించిన సృష్టికర్త ఒక్కడే మనల్ని సరిగ్గా అర్థం చేసుకోగలడు!

డిసెంబర్ 13

## విజ్ఞాపన ప్రార్థన

"వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ... " (లూకా 18:1)

నీవు విమోచన వాస్తవాన్ని పూర్తిగా విశ్వసించకపోయినట్లయితే నీవు నిజంగా ఇతరులకొరకు విజ్ఞాపన చేయలేవు. నీ విజ్ఞాపన కేవలం ఇతరులపట్ల నీవు చూపే జాలిగా మిగిలిపోతుంది తప్ప ఇతరులు దేవునివద్దకు వచ్చేలా చేయదు. నీవు ఏ వ్యక్తిలో మార్పు కోరుకుంటున్నావో ఆ మార్పు అవతలి వ్యక్తిలో వచ్చేవరకు నీవు విజ్ఞాపన కొనసాగించడమే నిజమైన విజ్ఞాపన. విజ్ఞాపన అంటే పౌలు ఏ అర్థాన్ని చెబుతున్నాడో చూద్దామా: "క్రీస్తు పడిన పాట్లలో కొదువైనవాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (కొలొస్స 1:24). నిజమైన విజ్ఞాపన చేసేవారు ఈ రోజుల్లో కొదువగా ఉండడానికి కారణమిదే. "ఇతరుల పక్షాన ప్రార్థించడమే విజ్ఞాపన" అని చెప్పడం మనం వింటూ ఉంటాం. అయితే ఇది సరైన అభిప్రాయం కాదు! విజ్ఞాపన అంటే క్రీస్తు స్థానంలో నీవు నిలబడడం; క్రీస్తు మనస్సును క్రీస్తు ఉద్దేశాన్ని కలిగి ఉండడం.

ఎదుటి వ్యక్తిగురించి, అతని పరిస్థితులగురించి దేవునినుంచి తెలుసుకోవాలని ప్రయత్నించకు. ఎందుకంటే నీవు తెలుసుకోవాలనుకుంటున్నది నీ ప్రార్థనకు ఆటంకంగా మారుతుంది. ఎందుకంటే నీవు ఎదుటివ్యక్తిగురించి కంటె అతనిగురించి వివరాలకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నావేమో!

ఎదుటి వ్యక్తిగురించి దేవునికి అంతా తెలుసు. కాబట్టి నీవు విజ్ఞాపన ప్రార్థన చేసేటప్పుడు ఆ వ్యక్తికి బదులుగా నీవు నిలబడడంకాదు గానీ ఆ వ్యక్తిపట్ల దేవునికున్న ఉద్దేశాల్ని సఫలంచేయమని ప్రార్థించు. నీ దృష్టి ప్రధానంగా ఆ వ్యక్తిపట్ల దేవునికున్న సంకల్పంమీద ఉండాలి. అప్పుడు నీవు విజ్ఞాపన చేయడానికి దేవునితో నీకు సరైన సంబంధం ఏర్పడుతుంది.

"ఇదిలా జరగాలి" "అదిలా జరగాలి" అని ప్రార్థించడం విజ్ఞాపన కాదు. ఎదుటి వ్యక్తిలో దేవుని జీవం నెలకొనేలా ప్రార్థించడమే విజ్ఞాపన. దేవుడు నీ యెదుటకు ఎంతమంది మనుషులను రప్పించాడో చూడు. నీవు వారిని విస్మరించడానికేనా ఆయన వారిని నీ వద్దకు రప్పించిన ఉద్దేశం! విమోచనను ఆధారం చేసుకొని నీవు విజ్ఞాపన చేసినట్లయితే, విజ్ఞాపనద్వారా ఏ కార్యాన్ని జరిగించాలని దేవుడు కోరుకుంటున్నాడో ఆయన తప్పక ఆ కార్యాన్ని జరిగిస్తాడు!



డిసెంబర్ 14

## ఘనమైన జీవితం

"శాంతి మీకనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే మీకనుగ్రహించుచున్నాను; లోక మిచ్చునట్టుగా నేను మీకనుగ్రహించుటలేదు; మీ హృదయమును కలవరపడ నియ్యకుడి ... " (యోహాను 14:27)

మనకేమైనా కష్టాలెదురైనప్పుడు మనం దేవుణ్ణి నిందించడం పరిపాటి. అయితే తప్పు చేసినది దేవుడు కాదు; మనమే. మనలో ఉన్న అవిధేయతను విడిచిపెట్టడానికి మనం చూపించే తిరస్కారమే మనం దేవుణ్ణి నిందించేలా చేస్తుంది. మనలో ఉన్న అవిధేయతను మనం సరిచేసుకున్నప్పుడు, మనకు ప్రతిదీ తేటగా కనబడుతుంది. మనం ఇద్దరు యజమానుల్ని, అంటే మనల్ని మనం మరియు దేవుణ్ణి సేవించాలనుకున్నంత కాలం, మనలో సంశయాలు శంకలు కలవరం తప్పవు. మనం దేవునిమీద సంపూర్తిగా ఆధారపడినప్పుడు మాత్రమే మనం పరిశుద్ధమైన జీవితాన్ని జీవించగలం. పరిశుద్ధాత్మను మన స్వంత ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలనుకుంటే మాత్రం మనకంతా అగమ్యగోచరంగా ఉంటుంది.

నీవు దేవునికి విధేయత చూపావనడానికి ప్రథమ సంకేతం శాంతి. కొలతకందని శాంతిని ఆయన మనకనుగ్రహిస్తాడు; ఈ శాంతి మనకు లోకంలో ఎక్కడా దొరకదు. ఇది యేసు మాత్రమే అనుగ్రహించే శాంతి. లోకమిచ్చే శాంతి కాదు. యేసు ప్రభువు నీకు శాంతి ననుగ్రహించేవరకు ఆయన యెదుట కనిపెట్టు. నీవు శాంతినెందుకు పొందలేక పోతున్నావో నిన్ను నీవు పరీక్షించుకో. నీ స్వంత ఆలోచనల ప్రకారం నీవు నడుస్తున్నట్లయితే , లేదా నీవేదో సాధించగలనని నీవు ఆలోచిస్తున్నట్లయితే నీవు శాంతిని పొందలేవు. ఇది నీకు దేవునితో ఏకత లేదని, నీకు దేవునిపట్ల పూర్తి విశ్వాసం లేదని తెలియజేస్తుంది. పరిశుద్ధాత్మ మాత్రమే నీలో సరళతను స్పష్టతను ఏకతను కలిగిస్తాడు. అంతే గానీ నీ నిర్ణయాలద్వారా నీకు స్పష్టత కలగదు. మన స్వంత ఆలోచనలతో మనం తీసుకున్న నిర్ణయాల్ని దేవుడు సవాలు చేస్తున్నాడు.

నాలో విధేయత లోపించిన ప్రతి సారీ నాలో ప్రశ్నలు తలెత్తుతాయి. నేను విధేయత చూపినప్పుడు నాలో ప్రశ్నలున్నప్పటికీ ఆ ప్రశ్నలు నాకూ దేవునికి మధ్య ఉన్న సంబంధానికి చెందిన ప్రశ్నలు కావు గానీ దేవుడు వెల్లడిచేసిన సత్యాల్ని నా మనస్సు అంగీకరించేలా చేసే ప్రశ్నలు మాత్రమే. ఈ ప్రశ్నలు నా సంతోషాన్ని ద్విగుణీకృతం చేస్తాయి. ఎందుకంటే నా తండ్రికి నాగురించి అంతా తెలుసని నాకు తెలుసు కాబట్టి. అయితే దేవునికి నాకు మధ్య ఉన్న సంబంధంగురించి తలెత్తే ప్రశ్నలు మాత్రం నాలో ఉన్న అవిధేయతమూలంగా వచ్చిన ప్రశ్నలే.

డిసెంబర్ 15

## "దేవుని యెదుట యోగ్యునిగాను"

"దేవునియెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్య వాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2 తిమోతి 2:15)

నీ ఉపదేశం స్పష్టంగా లేనట్లయితే నిన్ను నీవు మెరుగుపర్చుకో. ఎందుకంటే నీ ఉపదేశం ఇతరులకు అర్థం కానట్లయితే నీవు వెల్లడిచేసిన సత్యాల్లోని ఆశీర్వాదాల్ని వారు తెలుసుకోలేరు. ముందుగా దేవుని సత్యంగురించి నీవు తెలుసుకొని ఆ తర్వాత ఇతరులకు ప్రకటించు. అయితే నీవు ముందుగా ద్రాక్షలతొట్టిలో నలగగొట్టబడడానికి సిద్ధపడు. నీవు దేవుని సత్యాన్ని స్పష్టంగా ఉపదేశించాలంటే నీవు నలగగొట్టబడడం అవశ్యం. అప్పుడు మాత్రమే నీవు వెల్లడిచేసే సత్యోపదేశం ద్రాక్షరసమంత మధురంగా ఉంటుంది. "ఇంత కష్టం నేను పడలేను; ఎవరో బోధించినదాన్నే నేను కూడా బోధిస్తాను" అని నీవు అనుకుంటున్నట్లయితే నీ ఉపదేశం ఇతరులకు అర్థరహితంగా ఉంటుంది. ఎందుకంటే నీ కష్టం నీ శ్రమ ఏమీ లేదు గనక.

ముందుగా నీ విశ్వాసంగురించి నీ హృదయాన్ని పరీక్షించుకో. ఇతరులనుంచి నీవు సంగ్రహించిన ఉపదేశాన్ని నీవు బోధిస్తున్నట్లయితే ఒక సారి ఆలోచించు. అది నీదెలా అవుతుంది? ముందుగా సత్యాన్ని నీవు అవగతం చేసుకో; లోతుగా అధ్యయనం చెయ్యి; సత్యాన్ని వ్యక్తీకరించు; స్పష్టంగా ధైర్యంగా సత్యంగురించి మాట్లాడు. అప్పుడు ఆ ఉపదేశం నీదవుతుంది.

డిసెంబర్ 16

## దేవునియెదుట పెనుగులాట

"దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి ... ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు ... " (ఎఫెసీ 6:13,18)

దేవునితో నీకున్న సంబంధాన్ని అడ్డుకొనేవాటితో నీవు పెనుగులాడాలి. ఇతరుల నిమిత్తం విజ్ఞాపన చేయడంలో పెనుగులాడు. అయితే ప్రార్థనలో దేవునితో పెనుగులాడకు. నీవు దేవునితో పెనుగులాడుతున్నట్లయితే నీ జీవితమంతా కుంటివాడిగా మిగిలిపోతావేమో! నీవు కోరుకున్నది దేవుడు చేయడంలేదని నీవు దేవునితో పెనుగులాడుతున్నట్లయితే ఆయన నిన్ను తుంటిమీద కొట్టే పరిస్థితిని నీవే తెచ్చుకుంటున్నావు (ఆదికాండము 32:24,25 వచనాలు చూడండి). దేవుని మార్గాలతో పెనుగులాడి కుంటివాడివి కాకు; దేవునియెదుట లోకానికి సంబంధించినవాటితో పెనుగులాడు! ఎందుకంటే "మనలను ప్రేమించినవానిద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము" (రోమా 8:37) కాబట్టి. దేవునియెదుట నీ పెనుగులాట దేవునిరాజ్యంపైన కూడా ప్రభావం చూపుతుంది. నీవు గనక నన్ను నీకొరకు ప్రార్థించమని అడిగినట్లయితే నేను క్రీస్తులో గనక సంపూర్ణుడిని కానట్లయితే నా ప్రార్థనకు ఫలితం వుండదు. అయితే నేను క్రీస్తులో సంపూర్ణుడిగా ఉన్నప్పుడు నా ప్రార్థన నీకు విజయాన్నిస్తుంది. సంపూర్ణత ఉన్నప్పుడే ప్రార్థనకు కార్యసాధకత్వం వుంటుంది. కాబట్టి "దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి."

దేవుని పరిపూర్ణచిత్తానికి, ఆయన అనుమతించిన చిత్తానికి మధ్య ఉన్న వ్యత్యాసం తెలుసుకో. దేవుని పరిపూర్ణ చిత్తం ఎన్నటికీ మార్పులేనిది. దేవుని పరిపూర్ణ చిత్తంతో నీవు పెనుగులాడలేవు. ఆయన మన జీవితంలోకి అనుమతించిన అనేక విషయాలు ఆయన అనుమతించిన చిత్తం క్రిందకు వస్తాయి. వీటితో నీవు అవశ్యంగా పెనుగులాడాలి. ఈ విషయాలపట్ల మన ప్రతిచర్యలు మనమాయన పరిపూర్ణచిత్తాన్ని తెలుసుకొనేలా చేస్తాయి. "దేవుని ప్రేమించువారికి ... మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" (రోమా 8:28) - దేవుని పరిపూర్ణచిత్తంపట్ల యథార్థంగా ఉన్నవారిలో ఈ వచనం వాస్తవం కావడం మనం చూస్తాం. దేవుని పరిపూర్ణచిత్తమంటే క్రీస్తు ద్వారా ఆయన మనల్ని పిలిచిన పిలుపు. ఎవరు దేవునికి నిజమైన కుమారులో నిజమైన కుమార్తెలో తెలిపే పరీక్ష ఆయన అనుమతించిన చిత్తం. ప్రతి విషయానికి "ఇది ప్రభువు చిత్తం" అని అనాలోచితంగా చెప్పకు. మనం దేవునితో పెనుగులాడకూడదు గానీ, దేవునియెదుట పలు విషయాలతో పెనుగులాడాలి. పెనుగులాట విషయంలో సోమరిగా ఉండకు. గొప్పగా పెనుగులాడు; పెనుగులాడడానికి ఆయన నీకెంత బలాన్నిచ్చాడో నీవే తెలుసుకుంటావు!

డిసెంబర్ 17

## విమోచన - విమోచనవలన కలిగే ఫలితం

"ప్రకృతిసంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీక రింపడు, అవి అతనికి వెఱ్ఱితనముగా ఉన్నవి ... " (1 కొరింథీ 2:14)

"నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించు కొందునని ... " (యోహాను 12:32) యేసు ప్రభువు చెప్పాడు. మన అనుభవాల్ని మనం బోధించినప్పుడు వినేవారిలో అవి ఆసక్తి కలిగించవచ్చేమోగానీ వారిలో అవసరతను కలిగించవు. అయితే నీవు యేసు క్రీస్తును నీ బోధలో పైకెత్తినట్లయితే దేవుని ఆత్మ నీ బోధను వినేవారి హృదయాల్లో యేసు పట్ల అవసరతను కలిగిస్తాడు. దేవుని విమోచనకున్న సృజనాత్మక శక్తి సువార్త సందేశాన్ని వినేవారి హృదయాల్లో కార్యాన్ని జరిగిస్తుంది. నీ వ్యక్తిగత అనుభవాలు ఇతరుల్ని రక్షించవుగానీ విమోచన సత్యం మాత్రమే మనుషుల్ని రక్షించగలదు. "నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునైయున్నవి ... " (యోహాను 6:63) అని యేసు ప్రభువు చెప్పాడు.

దేవుని సువార్త మాత్రమే వినేవారి హృదయాల్లో సువార్తపట్ల అవసరత పుట్టిస్తుంది. సేవకులకు సువార్త నిగూఢంగా ఉందా? లేదు. "మా సువార్త మరుగుచేయబడినయెడల నశించుచున్నవారి విషయములోనే మరుగుచేయబడియున్నది ... ఈ యుగసంబంధ మైన దేవత అవిశ్వాసులైనవారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను" (2 కొరింథీ 4:3,4) అని పౌలు చెబుతున్నాడు. మనుషుల్లో అనేకులు తాము నీతిమంతులమని ఆలోచిస్తుంటారు. వీరు తమకు సువార్త అవసరంలేదని కూడా ఆలోచిస్తుంటారు. అయితే ఒక వ్యక్తి హృదయంలో సువార్త అవసరత కలగడం నిజంగా దేవుని కార్యమే. దేవుడు ఈ విషయాన్ని వెల్లడి చేసేవరకు తనకేది అవసరమో ఆ వ్యక్తి గ్రహించలేడు. "అడుగుడి మీకియ్యబడును ... " (మత్తయి 7:7) అని ప్రభువు చెబుతున్నాడు. అయితే మనం అడిగేవరకు దేవుడివ్వడు. ఆయన మనకు ఇవ్వకుండా ఉండాలని కోరుకోడంలేదుగానీ అడగడం విమోచనకొరకు ఆయన ఏర్పాటుచేసిన ప్రణాళికలో భాగం! మనం అడిగినప్పుడు దేవుని ప్రక్రియ ప్రారంభమవుతుంది; అంతవరకు మనలో లేనిదాన్ని మనం అడగాలనే అవసరత మనలో మొదలవుతుంది. విమోచన అసలు ఉద్దేశమిదే. విమోచన మనలో దేవుని జీవాన్ని పెంపొందిస్తున్నకొలదీ దేవుని జీవానికి చెందినవన్నీ కూడా మనలో పెంపొందుతాయి. ఏది అవసరతకు కారణమో అదే ఆ అవసరతను సంతృప్తిపర్చగలదు. విమోచనకున్న అర్థమిదే. విమోచన మన అవసరతను తెలియజేస్తుంది; ఆ అవసరతను సంతృప్తిపరుస్తుంది.

డిసెంబర్ 18

## విశ్వసనీయతకు పరీక్ష

"దేవుని ప్రేమించువారికి ... మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" (రోమా 8:28)

దేవునికి అన్నీ తెలుసనీ, సమస్తం ఆయన చేతిలోనే ఉన్నాయని మనం చెబ్తుంటాం. ఇది ఆయనమీద నమ్మకంతో కాదుగానీ యథాలాపంగా మాత్రమే. చెప్పడం చెబ్తాంగానీ పనిచేయవలసి వచ్చినప్పుడు అన్నీ మన చేతుల్లోనే ఉన్నట్టుగా ప్రవర్తిస్తుంటాం. అయితే విశ్వాసి మాత్రమే తన జీవితంలోని ప్రతి స్థితీ దేవుని ఆధీనంలో ఉందని నిజంగా నమ్ముతాడు. ప్రతి సందర్భంలోను విశ్వాసాన్ని వెలిబుచ్చడమంటే మన విశ్వాసం కేవలం ఒకే ఒక్కరిలోనని నిశ్చయత కలిగి ఉండడం. ఆ ఒక్కరు మన ప్రభువైన యేసు క్రీస్తు. మన విశ్వాసం కేవలం ప్రభువులోనే, మన విధేయత కేవలం ఆయనపట్ల మాత్రమే. మన పరిస్థితులు చిందరవందరయ్యే సందర్భాల్ని దేవుడు కొన్ని సార్లు అనుమతించవచ్చు. దీన్ని మనం గుర్తించకపోవచ్చు. అసలిటువంటి సందర్భాల్ని ఆయన రప్పించినది ప్రతి సందర్భం ఆయన అధీనతలో ఉందని మనం గుర్తించడం ద్వారా మన అపనమ్మకాన్ని బాహాటపర్చడంకొరకే. దేవుడేం చేస్తున్నాడో మనం చూడం; ఇక్కడే మనలో ఉన్న విశ్వాసానికి అసలు పరీక్ష ఎదురవుతుంది. మనకెదురైన కష్టసమయాల్లో సైతం మనం దేవుణ్ణి ఆరాధించడం నేర్చుకున్నప్పుడు ఆయన వాటిని మన మేలుకొరకే సమకూర్చుతున్నాడని తెలుసుకోగలం!

యేసు క్రీస్తు పట్ల నిజమైన విశ్వసనీయతను చూపడం నేడు మనకు చాలా కష్టంగా ఉంటోంది. మన పరిచర్యలో, ఇతరుల అవసరాల్ని సేవించే విషయంలో మనమెంతో విశ్వాసపాత్రంగా ఉంటాం. అయితే ఒక్క విషయం అడగకండి! ప్రభువైన యేసు పట్ల మనలో యథార్థమైన విశ్వసనీయత ఎంతమందిలో ఉంది! మనం యేసుపట్ల చూపవలసిన విశ్వసనీయతగురించి అడిగినప్పుడు చాలా మందిలో అసహనం చోటుచేసుకుంటుంది. మన ప్రభువు అధీనతనుంచి తొలగిపోవాలనుకొనేవారిలో లోకంకంటె క్రైస్తవపనివారే అధికంగా ఉంటున్నారు. దేవుడు మనల్ని ఆశీర్వదించే యంత్రం మాత్రమేనని అనేకులు ఆలోచిస్తుంటారు. నీ హృదయంలో యేసు క్రీస్తుకు నీవిచ్చే స్థానమేది? ఆయన కేవలం నీవడిగినవన్నీ చేసే ఒక పరిచారకుడు మాత్రమేనా?

విశ్వసనీయతకు గమ్యం మనం దేవునికొరకు పనిచేయడం కాదు; ఆయన మనద్వారా తన పని కొనసాగించడం. దేవుడు మనల్ని తన పనికొరకు పిలుస్తున్నాడు. ఆయన మనకు అమోఘమైన బాధ్యతల్ని అప్పగిస్తున్నాడు. ఆయన మననుంచి ఎటువంటి ఫిర్యాదుల్ని కోరుకోడంలేదు. ఆయన మనకు ఏ సంజాయిషీ ఇవ్వడు. దేవుడు తన స్వంత కుమారుడైన యేసు క్రీస్తుపట్ల ఏం చేశాడో మనపట్ల కూడా అదే చేయాలనుకుంటున్నాడు.



డిసెంబర్ 19

## మన సందేశానికి కేంద్రం

“ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు” (మత్తయి 10:34)

దేవుడెవరిపట్లనైనా కఠినంగా వ్యవహరిస్తున్నాడని నీవు అనుకుంటున్నట్లయితే ఆ వ్యక్తిపట్ల సానుభూతి చూపడానికి ప్రయత్నించకు. దేవుడు నీకంటె దయామయుడు. ఆయన దయ ఆయన కరుణ మన ఊహకందవు. ఆయన దయామయుడని మనం గుర్తించే సందర్భాల్ని ఆయన రప్పిస్తూనే ఉంటాడు. ఎవరైనా ఒక వ్యక్తి దేవుణ్ణి సమీపించక పోతున్నట్లయితే ఆ వ్యక్తి తనలో ఉన్నదేదో విడిచిపెట్టడానికి ఇష్టపడడం లేదని అర్థం. ఆ వ్యక్తి తన పాపాన్ని ఒప్పుకోవచ్చు; అయితే అతను తన స్వంత చిత్తాన్ని వదులుకోడానికి ఇష్టపడడంలేదేమో! ఇటువంటివారిపట్ల నీవెలా సానుభూతి చూపగలవు? మనం సమస్య మూలానికి వెళ్లి, సమస్యకు కారణాల్ని చూడాలి. ఈ మూలాలే సువార్తపట్ల విరోధభావానికి, తిరోగమన స్వభావానికి కారణం కావచ్చు! మనుషులు దేవుని ఆశీర్వాదాల్ని కోరుకుంటారు. అయితే తమ హృదయాల్లోకి సూటిగా గుచ్చుకుపోయే విషయాల్ని మాత్రం తట్టుకోలేరు.

నీవు దేవుని ఆలోచనలపట్ల ఆయన విధానాలపట్ల సూక్ష్మగ్రాహ్యత చూపిస్తున్నట్లయితే నీ సందేశం సమస్యను సూటిగాను కఠినంగాను తాకాలి. నీ సందేశంలో ముఖస్తుతికి సానుభూతికి చోటుండ కూడదు. అలాగైతేనే సమస్య బాగవుతుంది. ఒక వ్యక్తి తన అంతరంగాన్ని దాచుకోలేనంత బలవంతంగా నీ సందేశం ఆ వ్యక్తిని తాకాలి. అప్పుడే ఆ వ్యక్తి సువార్త సత్యాన్ని తనకు అనువర్తించుకోగలుగుతాడు. మనుషుల అవసరాల్ని గుర్తించి వాటితో ప్రమేయం కలిగి ఉండు. మనుషులు తమ అవసరాల్ని సూటిగా గుర్తించేలా చెయ్యి. యేసు క్రీస్తును పైకెత్తి చూపు; వారి జీవితంలో యేసు అవసరతను నొక్కి చెప్పు. “ఇది మావలన కాదు” అని వాళ్లు చెబ్తారేమో! వాళ్లు యేసుపట్ల సరైన స్పందన చూపేలా “ఇది అవశ్యమని యేసు చెబ్తున్నాడు” అని చెప్పు. “మేము దీన్ని చేయగలమా?” అని వాళ్లడగవచ్చు. “మీలో నూతన ఆత్మ ఉంటే తప్ప మీరు చేయలేరు” అని జవాబివ్వు (లూకా 11:13 వచనం చూడండి).

నీ సందేశానికి ముందే ఎదుటివారిలో అవసరత ఉండడం ముఖ్యం. అప్పుడే నీ సందేశానికి కార్యసాధకత్వం వుంటుంది. లోకంలో చాలామంది దేవునికి దూరంగా ఉంటూ తాము సంతోషంగానే ఉన్నామనుకుంటున్నారు. మనం యేసు లేకుండా అంత సంతోషంగా, నీతిమంతులుగా ఉండగలిగినప్పుడు ఆయన మనకొరకు రావలసిన అవసరం లేదు కదా! యేసు లేకుండా మనుషులు పొందే సుఖసంతోషాలు శాంతిసమాధానాలు నిజమైనవి కావు గనక, మనుషులకు నిజమైన శాంతినివ్వడానికి యేసు వచ్చాడు. యేసుతో యథార్థమైన సంబంధంమీద ఆధారపడని ప్రతి సమాధానాన్ని బ్రద్దలు చేసే ఖడ్గాన్ని పంపిస్తాడు.

డిసెంబర్ 20

## సరైన సహాయం

"నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించు కొందునని ... " (యోహాను 12:32)

యేసు క్రీస్తు ఎందుకు మరణించాడో నిజమైన అవగాహన చాలా కొద్దిమందికి మాత్రమే ఉంటుంది. మనుషులకు కేవలం సానుభూతి మాత్రమే అవసరమైనట్లయితే యేసు క్రీస్తు సిలువ అర్థరహితమే. అసలు యేసు క్రీస్తు మరణించవలసిన అవసరమే లేదు! అప్పుడు లోకానికి కావలసినది ఏదో కొద్ది మోతాదులో "ప్రేమ"; అయితే పాపం కారణంగా మనుషులెదుర్కొంటున్న రుగ్మతకు శస్త్రచికిత్స మాత్రం తప్పదు.

ఆధ్యాత్మికంగా నశించిపోతున్న వ్యక్తిని నీవు ముఖాముఖిగా కలుసుకున్నప్పుడు ముందుగా నీవు సిలువమీద ఉన్న యేసు క్రీస్తును జ్ఞాపకం చేసుకో. ఆ వ్యక్తి మరే విధంగానైనా దేవుణ్ణి సమీపించగలిగినట్లయితే, యేసు క్రీస్తు సిలువ అనవసరం గదా! నశించిపోతున్నవారికి నీ సహాయం నీ సానుభూతి చాలని నీవనుకుంటున్నట్లయితే నీవు యేసు క్రీస్తుకు ద్రోహం చేస్తున్నావని అర్థం. ముందుగా నీవు యేసుతో వ్యక్తిగతమైన అన్యోన్యతలోనికి నడువు; తర్వాత ఆయన మార్గంలో ఇతరులకు సహాయం చెయ్యి. దేవుణ్ణి విస్మరించి నీ స్వంత ప్రయత్నాల ద్వారా నీ స్వంత తెలివితేటలద్వారా కాదు సుమా! మనుషుల్ని నొప్పించకుండా వారిని సేవించడం నేడు లోకంలో ప్రధానమైన ఆలోచనగా ఉంది.

అయితే మన ప్రధానదృష్టి సిలువవేయబడిన యేసును పైకెత్తి చూపడం (1 కొరింథీ 2:2 చూడండి). క్రీస్తు సిలువమీద ఆధారపడని ప్రతి నమ్మకం మనుషుల్ని చెదరగొడ్తుంది. క్రైస్తవ సేవకుడు యేసు క్రీస్తుమీదను, ఆయన మన కనుగ్రహించిన విమోచనమీదను ఆధారపడి ఇతరులతో మాట్లాడినట్లయితే అతని మాటలు వినేవారికి ఓదార్పును ఆదరణను ఇస్తాయి. క్రైస్తవ సేవకుడు దేవునికి ప్రయోజకుడిగా ఉన్నాడా లేదా అనేది ఆ సేవకుడికి యేసు క్రీస్తుతో ఉన్న అన్యోన్య సహవాసంమీద మాత్రమే ఆధారపడి ఉంటుంది.

క్రైస్తవ సేవకుడు యేసు క్రీస్తును రక్షకుడిగా ఎత్తి చూపాలి; ఏది పాపమో కూడా తెలియజేయాలి. ఇది క్రొత్త నిబంధన మనకప్పగించిన కర్తవ్యం. ఫలితం, క్రైస్తవ సేవకుడు ఇతరుల్ని ఆకట్టుకొనే వ్యక్తిగా, ఇతరులు స్నేహంచేయాలని కోరుకున్న వ్యక్తిగా ఉండలేడు! అయితే సేవకుడు తాను చేయవలసిన పనిని కచ్చితంగా చేయగలిగి ఉండాలి. మనం అందమైన ప్రసంగాలు చేయడానికి పిలవబడలేదు గానీ సిలువమీద ఉన్న యేసు క్రీస్తును పైకెత్తి చూపడానికి మాత్రమే పిలవబడ్డాం. దేవుడు నిన్ను లోతుగా పరిశీలించినట్లే ఇతరుల అవసరాల్ని నీవు కూడా లోతుగా పరిశీలించాలి. ఇతరుల అవసరాల్ని తీర్చే సందేశాన్ని భయపడకుండా అందించు.

డిసెంబర్ 21

## స్వంత అనుభవమా? దేవుడు వెల్లడిచేసిన సత్యమా?

“దేవునివలన మనకు దయచేయబడినవాటిని తెలిసికొనుటకై మనము ... దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము” (1 కొరింథీ 2:12)

నీలో ఉన్న పరిశుద్ధాత్మను నీవు నీ అంతరంగంలోని ఆధ్యాత్మిక అనుభవాలకు మాత్రమే నీవు పరిమితం చేయలేవు. పరిశుద్ధాత్మ నిన్ను మళ్లీ మళ్లీ క్రీస్తు సిలువవైపు నడిపిస్తాడు. దేవునిమీద ఆధారపడని అనుభవం, మరియు క్రీస్తు సిలువమీద ఆధారపడని అనుభవం నిజమైన ఆధ్యాత్మిక అనుభవంగా మిగలదు. ఒక వేళ నీకు అటువంటి అనుభవాలున్నట్లయితే వాటికి క్రీస్తుకు ఏ సంబంధం లేదు. నీ అనుభవాలు ప్రభువైన క్రీస్తు వశంలో ఉన్నాయా? లేక వాటిని నీవు క్రీస్తుకంటె హెచ్చుగా పరిగణిస్తున్నావా? నీకు ప్రభువుకంటె నీ స్వంత అనుభవాలే ఎక్కువ ప్రియంగా ఉన్నాయా? నీవు ప్రభువుకిచ్చే స్థానం కంటె నీ స్వంత అనుభవాలకే అధిక ప్రాధాన్యతనిస్తూ వాటికే ఉన్నత స్థానాన్నిస్తున్నావా? ఏదో ఒక రోజు నీవు నీ అనుభవాల విషయంలో విసుగు చెందుతావు. ఆ రోజు “నా అనుభవాలతో నాకు పని లేదు, నాకు కావలసినది నా ప్రభువే” అని చెప్పగలవు.

విమోచన ఒక వాస్తవం. విమోచన కార్యం నా జీవితంలో జరిగేవరకు నాకు విమోచన వాస్తవం సరిగ్గా అర్థం కాదు. నేను తిరిగి పుట్టినప్పుడు దేవుని ఆత్మద్వారా నాకు యేసు క్రీస్తుతో తాదాత్మ్యత కలుగుతుంది. ఆ స్థాయి నా స్వంత అనుభవాల్ని మించిన స్థాయి. నా స్వంత అనుభవాలకు మాత్రమే నన్ను నేను పరిమితం చేసుకున్నట్లయితే విమోచన నా జీవితంలో వాస్తవం కాలేదు. నా అనుభవాలు సత్యానికి ఆధారమైన యేసు క్రీస్తుకు సంబంధించిన అనుభవాలు కానట్లయితే అవి ఏ మాత్రం విలువలేనివి.

నీ స్వంత అనుభవాలగురించి అధికంగా మాట్లాడే అలవాటు నీలో ఉందా? నీమీద నీవే జాలిపడుతున్నావా? అనుభవంమీద ఆధారపడిన విశ్వాసం నిజమైన విశ్వాసం కాదు. దేవుడు వెల్లడిచేసిన సత్యంమీద ఆధారపడిన విశ్వాసమే నిజమైన విశ్వాసం.

డిసెంబర్ 22

## తండ్రిచేత ఆకర్షించబడడం

“నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నా యొద్దకు రాలేడు” (యోహాను 6:44)

నన్ను దేవుడు తన వద్దకు ఆకర్షించినప్పుడు నా చిత్తవృత్తిలో సంఘర్షణ మొదలవుతుంది. దేవుడు వెల్లడిచేసిన సత్యంపట్ల నేను అనుకూలంగా స్పందించగలనా? ఆయన వద్దకు నేను రాగలనా? దేవుడు మనల్ని పిలుస్తున్నప్పుడు చర్చ అసంబద్ధం; పైగా చర్చ దేవునిపట్ల అమర్యాద చూపడమవుతుంది. దేవుడు నీతో మాట్లాడు తున్నప్పుడు నీవెలా స్పందించాలనుకుంటున్నావో ఇతరులతో నీవు చర్చించనక్కర్లేదు (గలతీ 1:15,16 వచనాలు చూడండి). నమ్మకం మేధస్సుకు సంబంధించినది కాదు. నమ్మకం మనశ్శక్తికి సంబంధించిన విషయం. నేనెలా స్పందించాలో నా బుద్ధికి సంబంధించినది కాదుగానీ, నా సంకల్పానికి సంబంధించిన విషయం. నేను దేవుని పిలుపుపట్ల స్పందించి నన్ను నేను సమర్పించు కున్నట్లయితే నేను వాస్తవంమీద ఆధార పడ్డానని అర్థం. ఈ వాస్తవం దేవుని సింహాసనమంత నిశ్చయం!

సువార్త ప్రకటించేటప్పుడు చిత్తవృత్తిమీద కేంద్రీకరించి మాట్లాడాలి. ఎందుకంటే నమ్మకం చిత్తవృత్తికి సంబంధించినది కాబట్టి. చిత్తవృత్తి, లేదా మనశ్శక్తి సంపూర్ణంగా దేవునికి లోబడాలి తప్ప బుజ్జగింపు మాటలకు గానీ వశపర్చుకొనే మాటలకు గానీ కాదు. దేవునిమీద మరియు ఆయన వెల్లడిచేసిన సత్యంమీద విశ్వాసంతో ఆయనకు లోబడడానికి నేను మనఃపూర్వకంగా ముందుకు రావాలి. నేను నా స్వంత కార్యాల్ని కాక దేవుణ్ణి మాత్రమే నమ్మాలి. నేను దేవుణ్ణి కాక నా మేధస్సును నమ్ముతున్నట్లయితే అది నా విశ్వాసానికే ఆటంకంగా ఉంటుంది. నా అనుభవాల్ని నా అనుభూతుల్ని అలక్ష్యం చేయడానికి నేను సిద్ధపడాలి. నమ్మకం విషయంలో నా చిత్తం ముందుకు రావాలి. అయితే నేను నా పాత అలవాట్లను నా పాత ఆలోచనల్ని విడిచిపెట్టి నూతన ప్రయత్నంతో నా చిత్తాన్ని బలవంతంగా దేవునివైపు మళ్లించినప్పుడు మాత్రమే జరిగే కార్యం. నన్ను నేను దేవునికి సమర్పించు కోవలసిన బాధ్యత నాదే!

దేవునివైపు చూడగలిగిన శక్తి మనలో సహజంగానే ఉంటుంది. అయితే దేవుడు మనల్ని తన వైపు ఆకర్షించినప్పుడు మాత్రమే మనమాయన వద్దకు రాగలం. ఆయన వద్దకు రావడానికి మన తెలివితేటలు కారణం కాదుగానీ ఆయన ఆకర్షించినప్పుడు మన అంతరంగంలో మనం దేవునికి స్థానాన్నివ్వడమే కారణం. నా చిత్తంలో దేవునిమీద నాకు విశ్వాసం కలిగినప్పుడు దేవుని అద్భుతం నాలో సాక్షాత్కరిస్తుంది. అప్పుడు నా జీవితంలో కలిగిన పరివర్తనకు కారణమేమిటో నా మేధస్సు గ్రహించగలదు.

డిసెంబర్ 23

## పాపపరిహారంగా భాగస్థులు కావడం

"మన ప్రభువైన యేసు క్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక" (గలతీ 6:14)

యేసు క్రీస్తు సువార్త మన చిత్తాన్ని బలవంతపెడ్తుంది. సిలువమీద దేవుడు పాపానికి తీర్చిన తీర్పును నేనంగీకరిస్తున్నానా? యేసు మరణంలో నేను ఏమాత్రమైనా ఆసక్తి చూపిస్తున్నానా? ఆయన మరణంతో సమానానుభవం కావాలని నేను కోరు కుంటున్నానా? ఆయన మరణంతో తాదాత్మ్యతను కోరుకుంటున్నానా? పాపం విషయంలో లోకం విషయంలో అహం విషయంలో నేను మరణించానా? కేవలం క్రీస్తుకు ఆయన ఉద్దేశాలకు మాత్రమే చెందినవాడిగా ఉండడానికి క్రీస్తు మినహా అన్నిటినీ విలువలేనివిగా నేను లెక్కిస్తున్నానా? శిష్యత్వపు గొప్ప ఆధిక్యత క్రీస్తు సిలువధ్వజం క్రింద నన్ను నేను క్రీస్తుకు అప్పగించుకోడం. అంటే నేను పాపం విషయంలో మరణించానని అర్థం.

నీలో ఉన్న పాపం మరణించాలని కోరుకుంటున్నావా? క్రీస్తు సిలువపట్ల నీలో అప్రతిహతమైన విశ్వాసం వున్నట్లయితే ఆయన మరణంతో నీకు తాదాత్మ్యత ఉంటుంది. ఇది అలౌకికమైన అనుభూతి. నీలో ఉన్న పాత జీవితం సిలువవేయబడిందని నీవు గ్రహిస్తావు. "మన ప్రాచీన స్వభావము ఆయనతోకూడ సిలువవేయబడెనని యెరుగుదుము" (రోమా 6:6). "నేను క్రీస్తుతోకూడ సిలువవేయబడియున్నాను" (గలతీ 2:20) - నీ పాతజీవితం సిలువ వేయబడినదనడానికి గుర్తు నీలో ఉన్న దేవుని జీవమే. ఈ జీవమే నీవు యేసు స్వరాన్ని గుర్తుపట్టేలాగా చేస్తుంది.

అప్పుడప్పుడూ మనలో ఒక వింతైన అనుభూతి కలుగుతుంది! మనం క్రీస్తుకు చెందనివారమై ఉన్నట్లయితే మన పరిస్థితి ఏమిటి? "నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు" (యోహాను 15:5) - క్రైస్తవ శిష్యత్వానికి పునాది యిదే! ప్రభువైన యేసు క్రీస్తుపట్ల ఉన్న వ్యక్తిగతమైన భావావేశపూరితమైన భక్తివిశ్వాసాలే శిష్యత్వానికి నాంది.



డిసెంబర్ 24

**దాచబడిన జీవం**

“మీ జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది” (కొలొస్స 3:2-3)

పాపంనుంచి విడుదల పొందడంగురించి ఆలోచించినప్పుడు, “ఆత్మపూర్ణులై యుండుడి” (ఎఫెసీ 5:18) అని ఆలోచించినప్పుడు మన మనసులో ఒక పర్వత శిఖరంలాంటి ఊహాచిత్రం ఆవిష్కృతమవుతుంది. ఈ శిఖరం ఎత్తుగా అత్యద్భుతంగా కనిపిస్తుంది. ఇంత ఎత్తులో మనమెలా ఉండగలమనే ఆలోచన మనలో కలుగుతుంది! అయితే దేవుని కృపద్వారా మనం ఆ శిఖరాన్ని చేరుకున్నప్పుడు అది శిఖరం కాదని, మనం నివసించదగిన సమతలమైన ప్రదేశమని తెలుసుకుంటాం. “నా పాదములకు చోటు విశాలపరచితివి నా చీలమండలు బెణకలేదు” (కీర్తనలు 18:36).

నీవు క్రీస్తును నిజంగా చూచినప్పుడు ఆయణ్ణి సందేహించలేవు; “మీ హృదయమును కలవరపడనియ్యకుడి” (యోహాను 14:27) అని ఆయన నీతో చెబ్తున్నప్పుడు నీవు దిగులుపడలేవు. నీకు యేసు క్రీస్తుతో వ్యక్తిగత అన్యోన్యత ఉన్నప్పుడు ఆయన మాటలు నీవు వాస్తవం కాగలవు. “నా శాంతినే మీకను గ్రహించుచున్నాను” (యోహాను 14:27) అని యేసు ప్రభువు చెబ్తున్నాడు. యేసు అనుగ్రహించే శాంతి నీలో నిరాటంకమైన విశ్వాసాన్ని కలిగిస్తుంది. ఈ శాంతి ఆపాదమస్తకం నిన్ను ఆవరిస్తుంది. “మీ జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది” - క్రీస్తుతోబాటు దాచబడిన ఉన్న నీ జీవానికిక యెటువంటి ఆటంకం కలగదు.

ఇందుకు దేవుని ఆత్మే నీకు సాక్షి. పౌలు ఈ అంశాన్ని తన పత్రికల్లో పదే పదే ప్రస్తావించాడు. పరిశుద్ధమైన జీవితంగురించి సమర్పణతో కూడిన జీవితంగురించి మనలో కొన్ని అనిశ్చితమైన అభిప్రాయాలుంటాయి. అయితే పరిశుద్ధమైన జీవితం మరియు సమర్పణతో కూడిన జీవితం సాధ్యమే. ఎందుకంటే నీ జీవితం సర్వశక్తుడైన దేవుని చేతుల్లో ఉంది గనక. అన్నిటికంటె అపాయకరమైన స్థితి మరియు అనిశ్చితమైన స్థితి దేవుడు లేకుండా జీవించడమే. అయితే తిరిగి పుట్టిన వ్యక్తికి దేవునితో అన్యోన్యత మరియు దేవునితో తాదాత్మ్యత ఉంటాయి. ఎందుకంటే “ఆయన వెలుగులోనున్న ప్రకారము, మనమును వెలుగులో నడిచినయెడల మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము” (1 యోహాను 1:7).

డిసెంబర్ 25

## ఆయన జననం, మరియు మనం తిరిగి పుట్టడం

"ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని
కనును
ఆయనకు ఇమ్మానుయేలను పేరు
పెట్టుదురు ...
ఇమ్మానుయేలను పేరుకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము" (మత్తయి 1:22,23)

చరిత్రలో ఆయన జననం: " ... పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును" (లూకా 1:35). యేసు క్రీస్తు భూమ్మీద జన్మించాడు; అయితే ఆయన జన్మ లోకసంబంధమైనది కాదు. ఆయన చారిత్రక వ్యక్తి కాడు; అయితే ఆయనే చరిత్ర. యేసు క్రీస్తు మనుషులు చేసిన దేవుడు కాడు; ఆయన దేవుడై ఉండి మానవ శరీరాన్ని ధరించాడు. మన ప్రభువు జననం ఒక ఆగమనం; పరలోకంలో ఉన్న దేవుడు మానవరూపంలో అవతరించిన అపూర్వఘటన.

నాలో ఆయన జననం: "నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీయందేర్పడువరకు మీ విషయమై మరల నాకు ప్రసవవేదన కలుగుచున్నది" (గలతీ 4:19). పరలోకంనుంచి వచ్చిన దేవుడు భూమ్మీద జన్మించినట్లే ఆయన నాలో కూడా జన్మించాలి. ఆయనకు నా వ్యక్తిగత జీవితం ఒక "బేత్లెహేము" కావాలి. నేను తిరిగిపుట్టడం ఈ లోకసంబంధమైన కార్యం కాదు; ఇది శరీరసంబంధమైన జన్మకు పూర్తిగా భిన్నమైనది. "మీరు క్రొత్తగా జన్మింపవలెనని ... " (యోహాను 3:7) మన ప్రభువు చెబుతున్నాడు. ఇది ఆజ్ఞ కాదు గానీ, ఆయన సర్వాధిపత్యంమీద ఆధారపడిన సత్యం. ఒక వ్యక్తి తిరిగిపుట్టాడనడానికి నిదర్శనం ఆ వ్యక్తిలో "క్రీస్తు స్వరూపము" ఏర్పడడం. ఎవరిలోనైతే "క్రీస్తు స్వరూపము" ఏర్పడుతుందో ఆ వ్యక్తిలో క్రీస్తు స్వభావం ప్రతిబింబిస్తుంది.

మానవదేహంలో దేవుని అవతరణ: మానవ దేహంలో దేవుని అవతరణ యేసు క్రీస్తు అనుగ్రహించిన సిలువబలియాగంద్వారా సాధ్యమైంది. ఇదొక గంభీరమైన సత్యం!



డిసెంబర్ 26

## "వెలుగులో నడిచినయెడల"

"ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల ... ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7)

పరిశుద్ధాత్మ మనలో కార్యం జరిగించడానికి మూలం యేసు క్రీస్తు సిలువబలియాగంద్వారా ఒనగూడిన పాపపరిహారం. చేతనావస్థలోనైనా అచేతనావస్థలోనైనా పరిశుద్ధాత్మ కార్యం కొనసాగుతూనే ఉంటుంది. "యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" - మన స్మృతిపథంలోని పాపాలే కాదు; మన అచేతనావస్థలోని పాపాల్ని కూడా యేసు రక్తం శుద్ధి చేస్తుంది.

"ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల" - మన అంతరాత్మ వెలుగులో కాదు; దేవుని వెలుగులో మనం నడవాలి. అప్పుడు మాత్రమే మనయెదుట దేవుని అద్భుత సత్యం ఆవిష్కృతమవుతుంది. "యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" - ఇదే ఆ అద్భుత సత్యం. నా స్మృతి నేను చేసిన పాపాల్ని నాకు గుర్తుకు తెస్తుంది; అప్పుడు నాలో దైవచిత్తానుసారమైన దుఃఖం కలుగుతుంది. మనం పాపానికి విముఖత చూపడం పరిశుద్ధాత్మ కార్యం. దేవుని పరిశుద్ధతకు సంబంధించని ప్రతి దాన్నీ మనం ద్వేషించడం అవశ్యం. "వెలుగులో నడిచినయెడల" - మనం దేవుని వెలుగులో నడిచినట్లయితే మనలో ఉన్న దాగి ఉన్న ప్రతి అంధకారం దేవుని దివ్యకాంతిలో పటాపంచలవుతుంది.

మనం తిరిగిపుట్టినప్పుడు మాత్రమే పాపమెంత తీవ్రమైనదో తెలుసుకోగలం. మనుషులందరి పాపాల్ని నివృత్తిచేయడంకొరకే క్రీస్తు కల్వరిమీద ప్రాణత్యాగం చేశాడు. యేసు క్రీస్తు సిలువబలియాగంద్వారా మాత్రమే సర్వలోకానికి పాపక్షమాపణ లభించింది. క్రీస్తు సిలువ మనందరికొరకైన పరిపూర్ణ ప్రాయశ్చిత్తం.

డిసెంబర్ 27

## ఎక్కడ యుద్ధం గెలిచాం? ఎక్కడ ఓడిపోయాం?

“ఇదే యెహోవా వాక్కు -ఇశ్రాయేలూ, నీవు తిరిగి ... నాయొద్దకే రావలెను” (యిర్మీయా 4:1)

మనం యుద్ధాన్ని గెలిచినా లేక ఓడినా అది మొదట దేవుని సమక్షంలో నిగూఢమైన మన అంతరంగంలోనే; లోకంతో కాదు. యుద్ధం వ్యవధి ఒక నిమిషమైనా కావచ్చు, లేదా ఒక సంవత్సరమైనా కావచ్చు. అది మన మీదనే ఆధారపడి ఉంది; దేవుని మీద కాదు. కాల వ్యవధితో నిమిత్తం లేకుండా మనం ఒంటరిగా దేవునియెదుట మన అంతరంగంలో యుద్ధం చేయవలసి ఉన్నాం. దేవుని సమక్షంలో అంతరంగాన్ని గెలిచిన వ్యక్తిని ఇక ఏ శక్తీ ఆపలేదు.

“ఏదైనా సమస్య వచ్చినప్పుడు మాత్రమే యుద్ధం చేస్తాను; అదొక సవాలుగా ఉంటుంది” అని చెప్పకు. ఈ నియమం వృథా. దేవునియెదుట నీ అంతరంగంలో నీవు చేసే యుద్ధంలో బాహ్యశక్తుల ప్రమేయం ఉండదు; మనుషులు కల్పించుకోరు. యుద్ధం గెలిచిన పిమ్మట, యుద్ధం గెలిచానన్న నిశ్చయతతో ముందుకు నడువు. ఒక వేళ నీవు యుద్ధం ఓడి నట్లయితే నీ ఓటమిని నీ క్రుంగుబాటును దేవుని సమక్షంలోనే విడిచిపెట్టు.

ఇతరులతో ప్రమేయం కలిగి ఉండే విషయానికొస్తే, వారు దేవునికి లోబడేలాగా వారితో వ్యవహరించు. సరిగ్గా ఇటువంటి సందర్భాల్లోనే మనుషులు దేవునికి లోబడడం జరుగుతుంది. మనల్ని మనం దేవునికి సమర్పించుకోడం ఒక సారి మాత్రమే జరిగే కార్యం; ఇది మన జీవితాన్ని మలుపు త్రిప్పే కీలకమైన సమయం; ఆయన ఘనతకొరకు ఆయన మహిమకొరకు మన సర్వస్వాన్ని సమర్పించే అపురూప సమయమిది!

డిసెంబర్ 28

## నిరంతర మార్పు

"మీరు మార్పునొంది బిడ్డలవంటివారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని ..." (మత్తయి 18:3)

మనం మొట్టమొదట మారిన సందర్భాన్ని ప్రభువు ప్రస్తావిస్తున్నాడు. దేవుని బిడ్డలమైన మనలో అనునిత్యం ఏదో ఒక విషయంలో మార్పు అవశ్యం. మనం దేవుని శక్తిని కాక మన స్వంత శక్తిసామర్థ్యాల్ని నమ్ముతున్నట్లయితే తర్వాత జరిగే పరిణామాలకు మనమే బాధ్యులం. దేవుడు మనల్ని క్రొత్త పరిస్థితుల్లోకి నడిపిస్తున్నప్పుడు మనం దేవునికి లోబడుతూ దేవుని ఆత్మ మనకు వెల్లడిచేసే విషయాల్ని అంగీకరించాలి. గతంలో మనం లోబడిన మాట వాస్తవమే. అయితే ప్రతి సందర్భంలోనూ లోబడుతున్నామా లేదా అని మనల్ని మనమే నిరంతరం పరీక్షించుకోవాలి. మనలో అంతర్మథనం లేనట్లయితే విధేయత కూడా ఉండదు. మనకెదురైన పరిస్థితులు సందర్భాలు యెటువంటివైనప్పటికీ దేవుని ఆత్మ సదా ఏకరీతిగానే ఉన్నాడు; ఆయన రక్షణ కూడా శాశ్వతమైనది. అయితే మనమే "నవీన స్వభావమును" (ఎఫెసీ 4:24) కలిగి ఉండాలి.

నిరంతరమైన మార్పు అభిలషణీయం. మార్పు చెందడానికి నిరాకరిస్తే అది మన ఆధ్యాత్మిక జీవిత పురోగమనాన్ని దెబ్బతీస్తుంది. మార్పు చెందడానికి మనలో స్వంత చిత్తం అప్పుడప్పుడూ యెదురు తిరుగుతూ దేవునిపట్ల ధిక్కారం చూపుతుంది. మన స్వంత చిత్తాన్ని, మన స్వాతంత్ర్యాన్ని మనం ఆరాధిస్తుంటాం. దేవుని దృష్టిలో ఏది మన బలహీనతో దాన్నే మనం ప్రాపంచిక దృష్టితో బలంగా పేర్కొంటాం. ఇంకా మనలో లోబడని రంగాలు చాలా ఉన్నాయి. మనం నిరంతరం మార్పును అభిలషిస్తుంటేనే మనలో సంపూర్ణమైన మార్పుకు ఆస్కారం వుంటుంది. నిదానం కావచ్చేమోగానీ మనల్ని దేవుని ఆత్మకు అప్పగించుకోడం మాత్రం నిశ్చయం.

డిసెంబర్ 29

**విడిచిపెట్టేవాడివా? లేక శిష్యుడివా?**

"అప్పటినుండి ఆయన శిష్యులలో అనేకులు వెనుకతీసి, మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు" ( యోహాను 6:66)

దేవుడు తన ఆత్మచేత పరిశుద్ధవాక్యంద్వారా ఆయన చిత్తం గురించి మనకు దర్శనాన్ని వెల్లడిచేసినప్పుడు మనం దర్శనం "వెలుగులో" (1 యోహాను 1:7) నడవాలి. మొదట్లో దర్శనం నీకు ఉత్సాహాన్ని త్రుళ్లింతను కలిగించవచ్చుగానీ, నీవు "వెలుగులో" నడవక పోయినట్లయితే దర్శనాన్ని కొనసాగించలేవు. నీవు వెలుగులో నడవకపోయినట్లయితే నీ స్వంత ఆలోచనల్లో నీ స్వంత మార్గాల్లో నడిచేవాడివిగా ఉంటావు. నీవు నీ స్వంత ఆలోచనలకు నీ స్వంత ఉద్దేశాలకు బందీవవుతావు. "ఆకాశమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక ... " (అ.కా. 26:19) అని పౌలు తన అనుభవంగురించి మాట్లాడుతున్నాడు. "ఫలాని వ్యక్తి తన స్వంత ఆలోచనల ప్రకారం నడిచినప్పటికీ బాగానే ఉన్నాడు కదా" అని చెప్పకు. దర్శనం నీది కాబట్టి నీవు దర్శనకాంతిలో నడవాలి. నిన్ను నీవు ఇతరులతో పోల్చుకోకు; అంతే కాదు, ఇతరుల్ని విమర్శించకు. ఎవరి దర్శనం వారిదే; ఎవరి నడక మరియు నడత వారివే. నీవు ప్రేమించే నీ స్వంత ఆలోచనలు నీ స్వంత మార్గాలు నీ దర్శనంతో విభేదిస్తున్నట్లయితే నీలో నీవే చర్చించుకోకు. చర్చించినట్లయితే నీ స్వంత ఆలోచనల్ని నీవు సమర్థించుకొనేవాడివిగా ఉంటావు. నీ స్వంత ఆలోచనల్ని నీ స్వంత మార్గాల్ని యేసు చూడడు. వాస్తవానికి నిన్ను క్రీస్తునుంచి వేరు చేసేవి యివే! యేసు ప్రభువు ఏం చెప్పాడో చూద్దామా - "ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదనెను" (లూకా 12:15). ఈ విషయాన్ని మనం విస్మరించినట్లయితే మన ప్రభువు ఉపదేశంలోని ప్రాథమిక సత్యాల్ని మనం విస్మరిస్తున్నామని అర్థం.

దేవుడు తన చిత్తంగురించి వెల్లడిచేసిన అపురూప క్షణాల్ని జ్ఞాపకం చేసుకుంటూ మనం ఊహల్లో విహరించడం పరిపాటి. అయితే ఇది మనల్ని వెనుకడుగు వేసేలా చేస్తుంది. ఎందుకంటే మన మనస్సాక్షి దర్శనంలో వెల్లడిచేయబడిన సత్యంపట్ల స్పందించడంలేదని అర్థం. మనం చేయవలసిన పని దర్శనంగురించి ఆలోచించడం కాదు; దర్శనం అమలుకొరకు పనిచేయడం మాత్రమే. ఒక సారి నీవు సత్యానికి స్పందించిన తర్వాత మునుపటిలాగా ఉండలేవు. నీ ముందున్న మార్గాలు రెండే రెండు; యేసుపట్ల విధేయతతో ఆయన వెంట నడిచే శిష్యుడిగా ఉంటావా? లేక, ఆయణ్ణి విడిచిపెట్టి వెళ్లిపోతావా?

డిసెంబర్ 30

## మన నవీన స్వభావం

"మా ఊటలన్నియు నీయందే ఉన్నవని ... " (కీర్తన 87:7)

మన స్వాభావిక లక్షణాలు వేరు; యేసు అనుగ్రహించే "నవీన స్వభావము" (ఎఫెసీ 4:24) వేరు. మనలో స్వాభావికంగా ఉన్న లక్షణాల్ని గుణగణాల్ని శక్తి సామర్థ్యాల్ని మన ప్రభువు తన కనుకూలంగా మలచుకోడు. ఇవి ఆదాముద్వారా మనకు అనువంశికంగా వచ్చిన లక్షణాలు. అయితే ఆయన మనలో "నవీన స్వభావమును" (ఎఫెసీ 4:24) ఉంచుతున్నాడు. ఈ స్వభావం మనకు క్రీస్తు మూలంగా కలిగిన స్వభావం. దేవుడు మన జీవితాన్ని పరిశుద్ధపర్చి ప్రతిష్ఠించే ప్రక్రియను ప్రారంభించిన తర్వాత నీలో స్వాభావికంగా ఉన్న శక్తిసామర్థ్యాలపట్ల నీ ఆసక్తి సన్నగిల్లుతుంది. ఇప్పుడు నీలో ఉన్న "నవీనస్వభావము" క్రీస్తు పునరుత్థానంమీద ఆయన జీవంమీద ఆధారపడే నూతన స్వభావం.

దేవుని కార్యాలు మనలో ప్రారంభమయ్యాయనడానికి గుర్తు మనలో స్వాభావికంగా ఉన్నటువంటి శక్తిసామర్థ్యాల్లో మన స్వంత ఆలోచనల్లో మన స్వంత మార్గాల్లో మన నమ్మకం సన్నగిల్లడమే. ఎందుకంటే మన వాగ్దానాలు వీటిల్లో లేవు. ఇవి మన ప్రకృతిసంబంధమైన జీవితానికి జ్ఞాపికలు మాత్రమే. అయితే మనం వీటినే పట్టుకొని వ్రేలాడుతుంటాం; యేసు మాత్రం మనం తనలో ఉన్న జీవంమీద ఆధారపడాలని కోరుకుంటాడు. యేసులో ఉన్న జీవాన్ని వర్ణించడానికి మన సహజసామర్థ్యాలు సరిపోవు. దేవుని కృపను ఆధారంచేసుకోకుండా దేవుణ్ణి సేవించాలనుకోడం విచారకరం. మనకు అనువంశికంగా సంక్రమించినవి దేవుని సేవకు అనర్హమైనవి. దేవుడు మన సహజసామర్థ్యాల్ని తనకు కావలసిన రీతిలో మలచుకోడు. ఎందుకంటే ఇవి యెప్పటికీ యేసు క్రీస్తుకు దూరంగానే ఉంటాయి. మనలో సహజంగా ఉన్న ప్రేమ, సహనం, మరియు పవిత్రత యేసుకున్న ఉన్నతప్రమాణాల్ని చేరుకోలేవు. అయితే యేసు మనలో ఉంచిన "నవీన స్వభావము"తో మనకు సంపూర్ణ సామరస్యత ఉన్నప్పుడు ప్రభువైన యేసు స్వభావం మనలో ప్రతిఫలిస్తుంది.

డిసెంబర్ 31

## నిన్న

"మీరు త్వరపడి బయలుదేరరు ... యెహోవా మీ ముందర నడచును ఇశ్రాయేలు దేవుడు మీ సైన్యపు వెనుకటి భాగమును కావలి కాయును" (యెషయా 52:12)

నిన్న నుంచి భద్రత: "జరిగిపోయినదానిని దేవుడు మరల రప్పించును" (ప్రసంగి 3:15). సంవత్సరాంతంలో మనలో ఒక విధమైన ఆశ చిగుర్తిస్తుంది. దేవుడు భవిష్యత్తుకొరకు ఏం దాచిపెట్టాడో తెలుసుకోవాలనే ఉత్సాహం మనలో ఉంటుంది. అయితే గతించిన కాలాన్ని మనం జ్ఞాపకం చేసుకున్నప్పుడు మనలో ఒక విధమైన ఆందోళన చోటుచేసుకుంటుంది. గడిచిన రోజుల్లోని పాపాల్ని తప్పిదాల్ని జ్ఞాపకం చేసుకున్నప్పుడు మనలో ఉన్న ఆనందం ఆవిరైపోతుంది. అయితే దేవుడు నిన్న నేడు ఏకరీతిగా ఉన్నాడు. మన గత జ్ఞాపకాల్లోంచి రేపటి ఆశలు చిగురిస్తాయి. గతాన్ని జ్ఞాపకం చేయడంద్వారా దేవుడు నేటి కర్తవ్యాన్ని బోధిస్తున్నాడు.

రేపటికి భద్రత: "యెహోవా మీ ముందర నడచును" - ఇది కృపను ప్రత్యక్షపరుస్తోంది. మనమెక్కడ తప్పిపోయామో అక్కడ మనల్ని సరిదిద్దడానికి ఆయన మనకు తోడుగా ఉంటాడు. అవే వైఫల్యాలు మళ్లీ జరగకుండా ఆయన మనల్ని కాపాడతాడు. దేవుడు మన వెనక కావలిగా ఉండకపోతే మనం అవే తప్పిదాల్ని మళ్లీ చేస్తాం. గత జ్ఞాపకాల్లో ఇరుక్కుపోయిన మన మనస్సాక్షిని దేవుడు జాగృతపర్చి అన్ని వివాదాల్ని పరిష్కరించి మనల్ని రేపటికి సిద్ధం చేస్తున్నాడు.

నేటి భద్రత : "మీరు త్వరపడి బయలుదేరరు" - మరో సంవత్సరంలోకి మనం అడుగు పెట్టబోతున్నాం. అసహనంతో కూడిన తొందరపాటుతనం, మతిమరపు, అనాలోచితమైన నిర్ణయాలు అన్నీ ప్రక్కన పెడదాం. ఇశ్రాయేలు దేవుడు మన ముందు నడుస్తుండగా సహనంతో జ్ఞానయుక్తంగా ఆయన వెంట నడుద్దాం. నిన్నను ఇక మనమెన్నడూ సరిదిదిద్దలేం. చేజారిపోయిన కాలం మళ్లీ రాదు. అయితే దేవుడు మనలో ఉన్న వినాశనకరమైన ఆందోళనల్ని భవిష్యత్తుకొరకు నిర్మాణాత్మకమైన ఆలోచనలుగా మార్చగలడు. భగ్నమైన గతకాలాన్ని, తిరిగి తెచ్చుకోలేని గతించిన రోజుల్ని క్రీస్తు సుందరహస్తాలకు అప్పగించు. అక్కడ విశ్రాంతి లభిస్తుంది.

అజేయమైన భవిష్యత్తులోకి అడుగుపెట్టు.

# వచనాల పట్టిక


| ఆదికాండము | mm / dd |
|---|---|
| 5:24 | 10/12 |
| 9:13 | 12/6 |
| 12:8 | 1/6 |
| 13:9 | 5/25 |
| 15:12 | 1/19 |
| 16:1–15 | 1/19 |
| 17:1 | 1/19, 5/25, 7/20 |
| 18:17 | 3/20, 3/27 |
| 21:8–14 | 12/10 |
| 21:15–19 | 12/10 |
| 22:2 | 4/26, 11/11 |
| 22:3 | 11/11 |
| 22:9 | 1/8 |
| 22:16–17 | 11/17 |
| 24:27 | 11/14 |
| 32:24–25 | 12/16 |
| 41:40 | 12/5 |

నిర్గమకాండము

| | |
|---|---|
| 2:11 | 10/13 |
| 3:4 | 4/18 |
| 3:10–11 | 10/13 |
| 3:14 | 10/4, 10/14 |
| 14:13 | 9/8 |
| 16:20 | 1/6 |
| 20:19 | 2/12 |
| 34:29 | 4/22 |

ద్వితీయోపదేశకాండము

| | |
|---|---|
| 5:32 | 6/28 |
| 28:14 | 10/25 |
| 33:27 | 5/24 |

యెహోషువ

| | |
|---|---|
| 24:15,22 | 7/8 |
| 24:19,21 | 7/9 |

| 1 సమూయేలు | mm / dd |
|---|---|
| 3:9,15 | 1/30 |
| 3:10 | 2/13 |
| 15:22 | 6/8 |

2 సమూయేలు

| | |
|---|---|
| 23:16 | 9/3 |

1 రాజులు

| | |
|---|---|
| 2:28 | 4/19 |
| 19:5 | 2/17 |
| 19:12 | 8/13 |

2 రాజులు

| | |
|---|---|
| 2:11–13,15,23 | 8/11 |

2 దినవృత్తాంతములు

| | |
|---|---|
| 15:17 | 4/15 |

నెహెమ్యా

| | |
|---|---|
| 8:10 | 4/14 |

యోబు

| | |
|---|---|
| 13:15 | 5/8, 10/31 |
| 42:10 | 6/20 |

కీర్తనలు

| | |
|---|---|
| 18:25,26 | 4/26, 6/22 |
| 18:29 | 5/15 |
| 18:36 | 12/24 |
| 25:12 | 6/2, 6/3 |
| 25:13 | 6/2, 6/3 |
| 25:14 | 6/3 |
| 37:4 | 3/20 |
| 37:5 | 7/15 |
| 37:7 | 7/4, 8/1 |
| 37:8 | 7/4 |
| 37:34 | 8/1 |
| 40:8 | 1/29, 8/25, 8/31 |

| | mm / dd |
|---|---|
| 46:1 | 2/27 |
| 46:2 | 7/20 |
| 46:10 | 2/22 |
| 51:4 | 11/19, 12/7 |
| 55:22 | 4/13 |
| 87:7 | 2/9, 5/16, 12/30 |
| 91:1 | 7/4 |
| 91:1,10 | 8/2 |
| 91:15 | 5/19 |
| 97:2 | 1/3 |
| 106:6,7 | 2/11 |
| 116:12,13 | 5/2 |
| 118:27 | 2/6 |
| 123:2 | 11/24 |
| 123:3 | 11/23 |
| 139 | 1/9 |
| సామెతలు | |
| 3:5,6 | 6/27 |
| 29:18 | 5/9 |
| ప్రసంగి | |
| 3:15 | 12/31 |
| 9:10 | 4/23 |
| యెషయా | |
| 1:10,11 | 3/15 |
| 6:1 | 7/13 |
| 6:1,5 | 7/18 |
| 6:5 | 7/3 |
| 6:7 | 7/3 |
| 6:8 | 1/14, 1/16, 9/30 |
| 8:11 | 1/29, 1/30 |
| 9:6 | 4/13 |
| 26:3 | 2/11 |
| 35/7 | 7/6 |
| 40:26 | 2/10 |
| 40:28 | 2/9 |
| 40/29 | 4/14 |
| 40/31 | 3/19, 7/20, 10/3 |

| | mm / dd |
|---|---|
| 42:4 | 10/12 |
| 45:22 | 1/22, 2/2, 2/11, 11/26, 12/6 |
| 49:2 | 1/19, 2/14 |
| 49:5 | 9/21 |
| 50:7 | 3/15 |
| 50:10,11 | 1/19 |
| 52:12 | 12/31 |
| 53:1 | 11/24 |
| 53:3 | 6/23 |
| 53:10 | 12/2 |
| 55:1 | 6/10 |
| 59:16 | 3/30 |
| 60:1 | 2/19 |
| 61:1 | 3/14 |
| యిర్మీయా | |
| 1:8 | 6/27 |
| 2:2 | 1/2 |
| 4:1 | 12/27 |
| 39:18 | 6/27 |
| 45:5 | 4/27, 4/28 |
| యెహెజ్కేలు | |
| 37:3 | 6/1 |
| 37:12 | 6/1 |
| యోనా | |
| 4:2 | 5/9 |
| నహూము | |
| 1:3 | 7/29 |
| హబక్కూకు | |
| 2:3 | 3/11, 5/2 |
| మలాకీ | |
| 2:16 | 11/23 |
| మత్తయి | |
| 1:23 | 12/25 |

| | mm / dd |
|---|---|
| 3:11 | 1/28, 8/22 |
| 3:17 | 10/13 |
| 4:1 | 9/18 |
| 4:19 | 1/14, 9/19 |
| 5:3 | 6/9, 7/21, 8/21 |
| 5:3–11 | 7/25 |
| 5:8 | 3/26 |
| 5:8,11 | 7/21 |
| 5:11 | 10/6, 11/3 |
| 5:20 | 7/24, 8/27 |
| 5:23 | 9/26 |
| 5:23,24 | 7/27, 9/24, 12/11 |
| 5:24 | 9/26 |
| 5:25 | 6/30 |
| 5:25,26 | 7/1 |
| 5:26 | 6/30, 7/1 |
| 5:29,30 | 1/30 |
| 5:30 | 6/29 |
| 5:39 | 7/14 |
| 5:41 | 9/11, 9/25 |
| 5:45 | 6:9, 8/24 |
| 5:48 | 6/29, 9/20 |
| 6:6 | 8/23, 9/16 |
| 6:7 | 9/16 |
| 6:8 | 3/20, 4/27, 8/6 |
| 6:10 | 6/3 |
| 6:23 | 8/27 |
| 6:25 | 1/27, 5/21, 5/23 |
| 6:26 | 1/26 |
| 6:26,28 | 5/18 |
| 6:28 | 1/26 |
| 6:30 | 1/26, 1/27 |
| 6:33 | 4/20, 5/21, 10/30 |
| 6:34 | 1/27 |
| 7:1 | 6/17, 6/22 |
| 7:2 | 6/22 |
| 7:3–5 | 6/17 |
| 7:7 | 4/27, 7/16, 12/17 |

| | mm / dd |
|---|---|
| 7:8 | 5/26, 8/24, 9/16 |
| 7:9 | 8/24, 10/11 |
| 7:11 | 7/16 |
| 7:12 | 8/24 |
| 7:13,14 | 7/7 |
| 8:26 | 8/12 |
| 9:28 | 10/27 |
| 9:38 | 10/16, 10/17 |
| 10:24 | 9/23, 11/22 |
| 10/27 | 2/14 |
| 10:34 | 3/24, 7/22, 12/19 |
| 11:1 | 8/1 |
| 11:6 | 8/29 |
| 11:25 | 9/14, 10/10, 10/17 |
| 11:28 | 6/11, 8/19, 8/20, 9/13, 10/9, 10/14, 10/22, 11/4 |
| 11:29 | 1/28, 4/14 |
| 11:30 | 4/14 |
| 12/13 | 2/16 |
| 13:22 | 1/26, 1/27, 5/19, 5/23 |
| 13:58 | 7/9 |
| 14:29 | 3/28 |
| 14:29,30 | 6/18 |
| 14:31 | 6/18 |
| 15:18–20 | 7/26 |
| 16:21–23 | 8/10 |
| 16:24 | 9/13, 12/9, 12/11 |
| 17:20 | 10/31 |
| 18:3 | 4/29, 8/28, 12/28 |
| 18:5 | 5/31 |
| 19:29 | 6/20 |
| 20:22 | 9/12 |
| 20:28 | 2/23 |
| 22:14 | 1/14 |
| 23:8 | 9/22 |
| 23:11 | 2/25 |
| 23:27 | 4/3 |

| | mm / dd |
|---|---|
| 25:14–30 | 4/20 |
| 25:21 | 3/5 |
| 26:33–35 | 3/1 |
| 26:36,38 | 4/5 |
| 26:38 | 9/5 |
| 26:42 | 5/22 |
| 26:46 | 2/18 |
| 26:56 | 9/5 |
| 26:69–75 | 1/5, 8/16 |
| 28:10 | 7/10 |
| 28:16 | 10/14 |
| 28:18,19 | 10/14, 10/27 |
| 28:19 | 5/6, 9/4, 10/26, 10/27 |
| మార్కు | |
| 4:10 | 1/13 |
| 4:19 | 8/31, 11/23 |
| 4:34 | 1/12 |
| 6:31 | 2/20 |
| 6:45 | 7/28 |
| 6:49 | 7/28 |
| 9:1–9 | 3/22 |
| 9:1–29 | 6/16 |
| 9:2 | 10/1 |
| 9:2–8 | 7/29 |
| 9:5,6 | 10/2 |
| 9:9 | 4/7 |
| 9:14–18 | 10/1 |
| 9:14–23 | 10/2 |
| 9:22 | 10/2 |
| 9:28–29 | 10/3 |
| 10:21 | 9/28 |
| 10:28 | 3/12 |
| 10:29 | 3/12 |
| 10:32 | 3/15 |
| 11:16 | 11/8 |
| 11:17 | 11/8 |
| 14:3,4 | 9/2 |
| 14:6 | 2:21 |
| 14:9 | 9/2 |
| 14:54 | 10/21 |
| 16:12 | 4/9 |
| 16:13 | 4/9 |
| లూకా | |
| 1:35 | 8/8, 12/25 |
| 2:46, 49 | 8/7 |
| 2:49 | 8/8 |
| 4:13 | 4/5 |
| 4:18 | 3/14 |
| 8:1–3 | 1/11 |
| 8:2 | 8/16 |
| 9:23 | 11/2 |
| 9:28–42 | 8/29 |
| 9:33 | 8/1 |
| 9:34 | 7/29 |
| 9:51 | 8/3 |
| 9:55 | 1/29 |
| 9:57 | 9/27 |
| 9:57–62 | 3/12 |
| 9:58,59,61 | 9/27 |
| 9:61 | 5/30 |
| 9:62 | 8/13 |
| 10:17–20 | 10/27 |
| 10:18–20 | 1/7 |
| 10:20 | 4/24, 8/30 |
| 11:1 | 8/28 |
| 11:5–8 | 9/12 |
| 11:9 | 6/10 |
| 11:9–13 | 10/22 |
| 11:10 | 6/9, 6/10, 9/12 |
| 11:11–13 | 9/12 |
| 11:13 | 1/30, 6/9, 12/19 |
| 12:8 | 3/1 |
| 12:15 | 12/29 |
| 12:22 | 1/2 |
| 12:40 | 3/29 |
| 14:25–26 | 2/2, 3/19, 5/7, 5/11, |

| | mm / dd |
|---|---|
| | 6/19, 7/22, 9/8, 11:2 |
| 14:25–33 | 3/12 |
| 14:25–26,27,33 | 5/7, 7/2 |
| 14:28 | 5/7 |
| 14:30 | 5/7 |
| 15:10 | 8/10 |
| 17:20–21 | 10/19 |
| 18:1 | 12/13 |
| 18:1–8 | 9/12 |
| 18:9–14 | 6/12 |
| 18:22 | 6/13, 8/18 |
| 18:22–23 | 8/17 |
| 18:23 | 8/18 |
| 18:31 | 8/3, 8/4, 9/23 |
| 18:31,34 | 8/5 |
| 18:39,41 | 2/29 |
| 19:42 | 4/3 |
| 21:19 | 5/20 |
| 22:27 | 2/23 |
| 22:28 | 9/19 |
| 22:33 | 1/8, 4/26 |
| 22:53 | 6/24 |
| 23:26 | 1/11 |
| 23:33 | 9/23 |
| 24:21 | 2/7 |
| 24:26 | 4/8 |
| 24:32 | 3/22 |
| 24:47 | 10/15 |
| 24:49 | 5/27, 5/31, 8/1, 9/4 |
| 24:51 | 5/17 |

యోహాను

| | mm / dd |
|---|---|
| 1:12 | 8/15 |
| 1:29 | 9/18, 10/15, 10/29 |
| 1:35,36 | 7/20 |
| 1:35–37 | 10/12 |
| 1:38–39 | 6/12 |
| 1:42 | 6/12 |
| 1:48 | 9/10 |
| 2:5 | 3/28 |
| 2:24–25 | 5/31, 7/30 |
| 2:25 | 9/27, 10/5 |
| 3:3 | 1/20, 8/15 |
| 3:4 | 8/15 |
| 3:5 | 11/28 |
| 3:7 | 8/15, 12/25 |
| 3:16 | 3/13, 9/21 |
| 3:17 | 9/2 |
| 3:19 | 10/5 |
| 3:19–21 | 6/30, 7/18 |
| 3:29 | 3/24, 3/25 |
| 3:30 | 3/24, 10/12 |
| 4:7 | 1/18, 1/21 |
| 4:11 | 2/26, 2/27 |
| 4:14 | 9/7 |
| 5:19 | 9/9 |
| 5:30 | 8/3 |
| 5:39,40 | 5/6 |
| 6:29 | 9/6 |
| 6:35 | 10/11 |
| 6:44 | 12/22 |
| 6:63 | 1/3, 3/10, 8/26, 12/17 |
| 6:66 | 3/9, 9/19, 12/29 |
| 6:67,70 | 3/9 |
| 7:17 | 6/8, 7/27, 10/10 |
| 7:38 | 5/18, 8/21, 8/30, 9/2, 9/3, 9/6, 9/7 |
| 7:39 | 5/27 |
| 8:36 | 11/18 |
| 9:1–41 | 4/9 |
| 9:25 | 4/9 |
| 10:3 | 8/16 |
| 10:30 | 7/19, 12/12 |
| 11:6 | 10/11 |
| 10:7,8 | 3/28 |
| 11:26,27 | 11/6 |
| 11:40 | 8/29 |

| | mm / dd | | mm / dd |
|---|---|---|---|
| 11:41 | 2/13, 8/9 | 15:13,15 | 6/16 |
| 12:24 | 6/19 | 15:14 | 2/13 |
| 12:27,28 | 6/25 | 15:15 | 1/7, 8/25 |
| 12:32 | 2/1, 7/17, 11/9, 12/17, 12/20 | 15:16 | 1/24, 8/3, 9/25, 9/29, 10/25 |
| 12:35 | 8/27 | 15:22–24 | 10/29 |
| 12:36 | 4/16 | 16:7 | 1/7 |
| 13 | 2/19 | 16:8 | 11/19, 12/7 |
| 13:1–17 | 3/6 | 16:12 | 4/7 |
| 13:3–5 | 6/15, 7/11 | 16:13,14 | 11/29 |
| 13:13 | 7/19 | 16:23 | 5/28, 5/29 |
| 13:13,16 | 9/22 | 16:24 | 8/28 |
| 13:14 | 2/19, 9/11 | 16:26 | 8/6, 8/9 |
| 13:15 | 9/11 | 16:26,27 | 5/29, 8/6 |
| 13:16 | 10/16 | 16:30–32 | 2/28 |
| 13:17 | 6/8 | 16:32 | 4/4 |
| 13:34,35 | 9/20 | 16:33 | 4/4, 8/2, 12/4 |
| 13:36 | 1/5 | 17 | 5/22 |
| 13:37,38 | 1/4, 6/16, 2/27, 4/29, 5/28, 7/5 | 17:2 | 4/8 |
| | | 17:3 | 5/8, 5/27 |
| 14:1,27 | 4/21, 12/24 | 17:4 | 9/13, 11/21 |
| 14:8 | 4/21 | 17:6 | 9/4 |
| 14:9 | 1/7, 4/21, 10/29, 10/30 | 17:15,16 | 11/27 |
| 1412,13 | 10/17 | 17:19 | 2/8, 12/3 |
| 14:13 | 6/7 | 17:21 | 5/22 |
| 14:15 | 2/12, 11/2 | 17:21–23 | 2/8 |
| 14:23 | 6/12 | 17:22 | 1/20, 3/20, 4/18, 4/27, 5/22, 5/29, 12/12 |
| 14:26 | 1/13 | | |
| 14:27 | 8/26, 12/14 | 18:36 | 10/19 |
| 14:31 | 2/20 | 19:30 | 10/28, 11/21 |
| 15:1–4 | 1/7 | 20:11–18 | 8/16 |
| 15:4 | 6/14 | 20:14,16 | 8/16 |
| 15:5 | 12/23 | 20:21 | 3/3, 3/5, 10/26 |
| 15:7 | 6/7, 9/16, 10/14 | 20:22 | 1/5 |
| 15:8 | 3/11 | 20:24–29 | 8/16 |
| 15:11 | 8/31 | 20:25 | 8/16 |
| 15:12 | 5/11 | 20:28 | 1/18, 8/16 |
| 15:13 | 2/24 | 21:7 | 4/17 |
| 15:13,14 | 8/25 | 21:15–17 | 8/16 |

| | mm / dd |
|---|---|
| 21:16 | 6/19 |
| 21:17 | 2/9, 3/1, 3/2, 3/3, 3/5, 8/16, 10/18 |
| 21:18,19 | 1/5, 9/13 |
| 21:21,22 | 1/15 |

అపొస్తలుల కార్యములు

| | |
|---|---|
| 1:8 | 18,2/4,2/15,3/10,4/1, 9/4, 9/5, 9/6, 10/14 |
| 2:4 | 9/5 |
| 2:33 | 5/27 |
| 4:12 | 12/8 |
| 9:5 | 7/18 |
| 9:16 | 3/5 |
| 9:17 | 4/2 |
| 13:22 | 4/2 |
| 17:28 | 6/2 |
| 20:24 | 3/4, 3/5, 10/14 |
| 24:16 | 5/13 |
| 26:14 | 1/28 |
| 26:15 | 1/29 |
| 26:16 | 1/24 |
| 26:17,18 | 1/10 |
| 26:19 | 1/24, 3/11, 12/29 |

రోమా

| | mm / dd |
|---|---|
| 1:1 | 1/31, 2/2, 2/3 |
| 1:14 | 7/15 |
| 2:1 | 6/22 |
| 2:17–24 | 6/17 |
| 3:24 | 11/28 |
| 4:3 | 3/19 |
| 5:5 | 2/24, 4/30, 5/11, 7/2, 10/18 |
| 5:8 | 10/20 |
| 5:10 | 10/28 |
| 5:12 | 10/5 |
| 5:12–19 | 10/6 |
| 6:3 | 1/15 |
| 6:4 | 1/15, 4/8 |
| 6:5 | 4/11, 9/13 |
| 6:6 | 4/10, 12/23 |
| 6:9–11 | 4/12 |
| 6:11 | 4/10, 4/11 |
| 6:13 | 10/9 |
| 6:16 | 3/14 |
| 6:19 | 9/15 |
| 7:9,14 | 12/1 |
| 7:18 | 5/24, 6/1 |
| 8:16 | 10/22 |
| 8:26 | 11/7, 11/8 |
| 8:27,34 | 4/1 |
| 8:27 | 11/8 |
| 8:28 | 10/30, 11/7, 12/16, 12/18 |
| 8:35 | 5/19 |
| 8:37 | 3/7, 5/19, 10/24, 12/16 |
| 8:39 | 3/7, 10/20 |
| 9:3 | 1/31, 2/24 |
| 12:1 | 1/8, 6/13, 12/5, 12/10 |
| 12:1,2 | 6/8 |
| 12:2 | 5/13, 9/9, 11/14 |
| 14:7 | 2/15 |

**1 కొరింథీ**

| | |
|---|---|
| 1:2 | 10/4 |
| 1:17 | 2/1 |
| 1:21,23 | 11/25 |
| 1:26–31 | 8/4 |
| 1:30 | 7/22, 7/23, 10/20, 11/13,12/8 |
| 2:2 | 1/24, 3/13, 4/2, 10/25, 11/26, 12/20 |
| 2:4 | 7/17, 12/3 |
| 2:12 | 12/21 |
| 2:14 | 12/17 |
| 3:3 | 3/23 |
| 3:9 | 4/23 |

| | mm / dd |
|---|---|
| 3:10–15 | 5/7 |
| 4:9–13 | 2/3 |
| 6:19 | 2/19, 3/4, 3/18, 8/9, 9/4, 11/1, 11/8, 12/5 |
| 6:19,20 | 7/15 |
| 9:16 | 2/2, 9/29, 10/15 |
| 9:22 | 2/24, 10/25 |
| 9:27 | 2/15, 3/17, 12/5 |
| 10:11–13 | 4/19 |
| 10:13 | 9/17 |
| 10:31 | 11/16, 11/22 |
| 12:26 | 2/15 |
| 13 | 1/29, 11/12 |
| 13:4 | 4/30 |
| 13:4,5 | 7/5, 10/23 |
| 13:4,8 | 10/18 |
| 15:10 | 11/30 |

**2 కొరింథీ**

| | |
|---|---|
| 1:20 | 4/20, 11/17 |
| 2:14,15 | 10/24 |
| 3:5 | 2/15 |
| 3:18 | 1/23, 4/22 |
| 4:2 | 9/15 |
| 4:3,4 | 12/17 |
| 4:5 | 2/23 |
| 4:10 | 5/14, 5/15 |
| 5:7 | 5/1, 10/31 |
| 5:9 | 3/17 |
| 5:10 | 3/16 |
| 5:14 | 2/4 |
| 5:15 | 10/29 |
| 5:17 | 11/22 |
| 5:17,18 | 10/23 |
| 5:17–19 | 10/28 |
| 5:20 | 7/17 |
| 5:21 | 4/6, 10/7, 10/29 |
| 6:1 | 6/26 |
| 6:4 | 3/6 |
| 6:4,5,10 | 6/26 |
| 7:1 | 3/18 |
| 7:4 | 3/7 |
| 7:10 | 1/21, 12/7 |
| 8:9 | 2/25 |
| 9:8 | 5/16 |
| 10:4 | 9/8 |
| 10:5 | 2/11, 6/14, 9/8, 9/9, 9/14, 10/24, 11/18 |
| 11:3 | 9/14 |
| 12:9 | 9/13 |
| 12:15 | 2/24, 2/25 |
| 13 | 11/12 |

**గలతీ**

| | |
|---|---|
| 1:15 | 1/25, 1/31 |
| 1:15,16 | 1/17, 10/6, 12/22 |
| 1:16 | 1/30, 2/3, 3/18, 7/8, 11/11 |
| 2:20 | 3/8, 3/21, 4/10, 11/3, 11/18, 12/23 |
| 2:21 | 12/5 |
| 4:19 | 3/18, 5/13, 8/8, 8/9, 9/16, 9/18, 10/6, 10/29, 12/7, 12/25 |
| 4:22 | 12/10 |
| 5:1 | 5/6 |
| 5:16 | 3/23 |
| 5:24 | 12/9 |
| 6:14 | 11/25, 11/26, 11/27, 12/23 |

**ఎఫెసీ**

| | |
|---|---|
| 1:7 | 11/20, 12/8 |
| 1:18 | 5/15 |
| 2:6 | 2/15 |
| 2:8 | 3/21 |
| 3:19 | 4/12 |
| 4:13 | 7/12, 9/23 |

| | mm / dd |
|---|---|
| 4:23 | 5/13 |
| 4:24 | 12/28, 12/30 |
| 4:30 | 5/13, 5/14 |
| 5:14 | 2/16 |
| 5:18 | 9/7, 12/24 |
| 6:13,18 | 12/16 |
| 6:18 | 5/3 |
| ఫిలిప్పీ | |
| 1:20,21 | 1/1 |
| 2:5 | 3/18, 3/30, 3/31, 5/20 |
| 2:12 | 5/10, 5/15, 12/5 |
| 2:12,13 | 6/6, 7/7 |
| 2:17 | 2/5 |
| 3:10 | 4/8, 7/11, 7/12 |
| 3:12 | 5/2, 6/28, 12/2 |
| 3:13,14 | 6/28 |
| 4:12 | 2/5, 2/23 |
| 4:13 | 10/3 |
| 4:19 | 5/14, 8/29, 9/13 |
| కొలొస్స | |
| 1:24 | 2/3, 7/14, 8/8, 9/30, 11/9, 12/13 |
| 1:27 | 7/23 |
| 3:3 | 1/23, 4/24, 4/28, 6/2, 6/14, 8/31, 11/16, 12/24 |
| **1 థెస్స** | |
| 3:2 | 11/10 |
| 4:3 | 1/15, 7/22, 10/20 |
| 5:17 | 5/26 |
| 5:19 | 8/13, 8/14 |
| 5:23 | 1/9, 1/30, 2/8 |
| 5:23,24 | 7/22, 8/14 |
| **1 తిమోతి** | |
| 1:13 | 2/23 |
| 3:16 | 4/6 |

| | mm / dd |
|---|---|
| **2 తిమోతి** | |
| 2:15 | 3/17, 12/15 |
| 4:2 | 3/10, 4/25 |
| 4:6 | 2/6 |
| 4:16,17 | 4/22 |
| హెబ్రీ | 2:9 |
| | 11/21 |
| 2:10 | 4/8, 7/7, 8/30, 9/8 |
| 2:18 | 9/17 |
| 3:14 | 8/29 |
| 4:12 | 3/1 |
| 4:15 | 9/18 |
| 4:15,16 | 9/17 |
| 5:8 | 7/19, 9/22 |
| 7:25 | 4/1 |
| 9:11-15 | 4/5 |
| 9:26 | 10/5 |
| 10:9 | 5/31 |
| 10:14 | 12/8 |
| 10:19 | 5/4 |
| 10:24,25 | 7/10 |
| 11:6 | 10/30 |
| 11:8 | 1/2, 3/19 |
| 11:27 | 4/9, 5/2 |
| 12:1,2 | 8/25 |
| 12:2 | 3/17, 3/29, 8/26, 8/31 |
| 12:5 | 8/14 |
| 12:6 | 4/14 |
| 13:5 | 6/4 |
| 13:5,6 | 6/4, 6/5, 8/29 |
| 13:13 | 4/24, 9/19 |
| యాకోబు | |
| 1:4 | 7:31 |
| 1:5 | 6/9 |
| 1:14 | 9/18 |
| 2:10 | 12/1 |
| 4:3 | 6/10 |

| | mm / dd |
|---|---|
| 4:8 | 11/4 |
| 4:8–10 | 6/10 |

**1 పేతురు**

| | |
|---|---|
| 1:5 | 4:19, 7/23 |
| 1:16 | 9/1 |
| 2:9 | 6/21 |
| 2:24 | 4/6 |
| 4:1–3 | 9/15 |
| 4:12 | 2/3, 5/15 |
| 4:13 | 11/5 |
| 4:17 | 5/5 |
| 4:19 | 8/10, 11/5 |

**2 పేతురు**

| | |
|---|---|
| 1:4 | 5/16 |
| 1:4,5 | 6/15 |
| 1:5 | 5/10, 6/15 |
| 1:5,7 | 5/11 |
| 1:8 | 5/12 |
| 1:13 | 7/10 |
| 3:9 | 5/11 |

**1 యోహాను**

| | mm / dd |
|---|---|
| 1:6,7 | 8/13 |
| 1:7 | 1/9, 1/20, 2/28, 3/11, 3/16, 8/13, 8/24, 8/30, 9/20, 10/10, 11/12, 12/26, 12/29 |
| 2:2 | 10/15 |
| 4:18 | 2/21 |
| 3:2 | 4/29 |
| 3:9 | 8/15 |
| 3:16 | 6/16 |
| 5:16 | 3/31 |

**3 యోహాను**

| | |
|---|---|
| వ.7 | 10/18 |

**యూదా**

| | |
|---|---|
| వ.20 | 10/21 |

**ప్రకటన**

| | |
|---|---|
| 1:7 | 7/29 |
| 1:17 | 5/24 |
| 2:7 | 8/2, 12/4 |
| 3:10 | 2/22, 5/8 |
| 4:1 | 3/27 |
| 4:11 | 7/19 |
| 12:11 | 11/29 |
| 13:8 | 4/6 |